
బైరన్

బైరన్



వల్లభనేని అశ్వినీ కుమార్

బైరన్

Byron

by

Andrè Maurois (in French)

Hamish Miles (in English)

V. Aswinikumar (in Telugu)

Copies : 2,000

Price : ₹ 333/-

ISBN No : 978-81-927170-6-7

First Edition : August, 2015

Cover Design : Md. Km. Jee Shan

For Copies :

AK PublicationS

Ph : 93 93 43 69 69

Printed at :

Kala Jyothi Process Pvt. Ltd.,

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad,

Hyderabad - 500 020.

Ph: 040 - 27645536

Cell: 99 49 51 65 67

బైరన్

నైతిక జీవనానికి మత విశ్వాసంతో పనిలేదని, దైవచింతన అవసరం లేదని నమ్మిన పి.బి. షెల్లీని నాటి సమాజం నిరసించింది. దేశం వెలివేసింది. చివరికి కాందిశీకునిగా ఇటలీ పర్వత సానువుల్లో సముద్ర తీరాల వెంట పయనించి ఆ కవి, స్వాప్నికుడు, సాహసి మూడుపదులు నిండకనే మున్నీటపాలయ్యాడు.

అతనికి సమకాలీకుడు – బైరన్, మతవిశ్వాసాల మధ్య పెరిగినా, మనిషి దుఃఖానికి దేవుడే కారణమని –అతనంటూవుంటే – నమ్మి భౌతిక సుఖాల వేటలో నైతిక సూత్రాలను కూడా శృంఖలాలుగానే భావించి స్వేచ్ఛాజీవిగా బ్రతకటానికి సాహసించాడు. అతన్ని, తానున్న లండన్ సమాజం విమర్శలతో వెక్కిరించింది. అసూయతో అందలమెక్కించి తీరాలను దాటించింది.

స్వయంగా గ్రీకు చరిత్ర, లాటిన్, జర్మన్, ఇటాలియన్, గ్రీసు బాషలు నేర్చాడు. ఎన్నో గ్రంథాలు చదివాడు. బైబిల్ లోతుపాతులు చూశాడు. తనలోని సంఘర్షణకు కవితారూపం ఇవ్వటం మొదలుపెట్టాడు.

తన జీవితంలో సగభాగం పైగా కాందిశీకునిగా ఇటలీ, గ్రీకు ద్వీపాలలో గడిపాడు. ఎన్నో సాహసయాత్రలు చేశాడు – అద్భుతమైన కవితా ఖండికలు – దీర్ఘ కవితలు శ్రావ్యంగా గానంజేశాడు. మనిషి స్వేచ్ఛకోసం సమాజంతో పోరాడి–పోరాడి అలసిపోయాడు.

అతని జీవితాన్ని ఏ సూత్రాలతో కొలవాలి, నైతికతా, మతవిశ్వాసమా? లేక దేవుని పది ఆదేశాలతోనా? చివరికి ఎక్కడ తేలాడు? తన వనరులన్నీ అవసరంలో వున్నవారికే ఉపయోగించాడు. పరాయి దేశమైన గ్రీసుని – టర్కీల కోరల్నుంచి రక్షించాలని తన శక్తినీ, సమయాన్నీ, ధనాన్నీ వెచ్చించి చివరికి తన ముప్పయి ఆరవ ఏడు నిండకుండానే తనూ ఖర్చయిపోయాడు.

షెల్లీ మనలో ఆదర్శాలు, ఆశయాలకు ప్రతిరూపం.

బైరన్ మనలోని బలహీనతలకు, బలమైన వాంఛలకు విచిత్ర రూపం.

ఈ మహాప్రపంచంలో – మనం చిన్న ప్రపంచాన్ని నిర్మించుకుంటాం.

దురదృష్టం ఏమంటే అది మొదటిదానికి భిన్నంగా వుంటుంది.

బైరన్ సంఘర్షణ స్థూలంగా–

సాంఘిక ఆచారాలతో, దురాచారాలతో;

మతవిశ్వాసాలతో – మూఢనమ్మకాలతోనే!

లోతుగా పరిశీలిస్తే–

అది అంతఃస్సంఘర్షణే! బైరన్‌తో బైరన్ ఎడతెగని యాతనామయ అంతర్యుద్ధం!

మొదటిది హింసాత్మకంగా దర్శనమిస్తుంది–

రెండవది – విధ్వంసాత్మకంగా భయపెడుతుంది!

మరింత గాఢంగా పరిశోధిస్తే – ఈ సమరం, అతని నమ్మకాలు అపనమ్మకాల మధ్య సాగిన దైవం, సైతానుల నడుమ జరిగిన మహాసంగ్రామం – మధ్యలో నలిగి నశించిపోతున్న మర్త్యుడు – సృష్టికర్త మంచివాడయితే అతని సృష్టి ఇంత దుర్మార్గంగా వుందే? ప్రపంచంలో ఇంత హింస ఎందుకుంది? మనిషి కాపట్యానికి కారణం ఏమిటి? "I hate this civilization...." అంటాడు.

అయితే బైరన్ జీవిత కథను చదవటంలో ప్రపంచానికి ఒరిగేదేమిటి?

ఈ క్షీరసాగర మథనం నుంచి ఉద్భవించింది అద్భుతమైన కవితాధార – అమృత కవితాధుని! దానిని చవిచూడాలంటే ఆ వ్యక్తి జీవితాన్ని తరచి చూడాలి – అతని బాల్యం, చదువు, పేదరికం, తిరుగుబాటు – అంతస్తు, తొలిప్రేమలు – భగ్నహృదయం, విశృంఖల నైతికత – అన్నీ పొరలు పొరలుగా విడిపోయి – అసలు ఆత్మ, అంతరంగం, రమణీయంగా, రాజసంతో వ్యక్తీకరించబడుతుంది.

అతని జీవితమే అతని కవితావస్తువు!

దుఃఖం, బాధ, వేదన – ఇవే, కేవలం ఇవే అతని కవితాధారకు మూలాధారాలు. అతని దుఃఖమే అతని లయ విన్యాసం. అతని వేదనే అతని కవిత్వానికి భావావేశం.

ఇదొక సుదీర్ఘ ప్రయాణం!

బైరన్, చైల్డ్ హెరాల్డ్ ప్రయాణం.

అతని యాత్రల నుంచి, జీవితానుభవం నుంచి ఉద్భవించింది. అద్భుతమైన కవితాధార – దానిని చవి చూడాలంటే ఆ వ్యక్తి జీవితాన్ని తరచి చూడాలి –



"... మేధోవర్గపు శత్రువులు – నిరంకుశులు
కాకారాయుళ్ళు – వీరితోనే పోరాటం,
మానవజాతిని విడుదల చేయాలి
రాజుల నుంచి – జనసమూహాల్నుంచి
మీ నుంచి – నా నుంచి !
యుద్ధం పేరుతో మారణకాండ
సైనిక విజయాలని – రిబ్బన్లు, మెడల్సు!
ఒక బంగారు బిళ్లకోసం – బతుకును
బలిచేయటం
కేవలం బులెటిన్‌లో పేరు పడాలంటే
శరీరంలో బులెట్ దిగాలా?
ఒక్క కన్నీటి బిందువు ఆరిపోవటం కంటే
కీర్తి, గౌరవం పేరుతో ఉప్పొంగే
సముద్రాలు
ఎండిపోవటం మేలుకదా?..."

తన కవిత్వం 'ఆధునికం' అంటాడు బైరన్. సైనికుల గుండెల్లో మారుమ్రోగాలి – నాయకుల అహంకారానికి, బాధల పాలైన సామాన్యుల స్థితిగతులను విప్పి చెప్పాలి.

"... గులకరాళ్ళకు కూడా బోధిస్తాను –
నేల మీద నిరంకుశులకు వ్యతిరేకంగా నిలబడమని!
మళ్ళీ రాళ్ళలాగా మారి – సింహాసనాలకు పీఠంలా
మారవద్దని!
ప్రపంచానికి స్వాతంత్ర్యం రాకపూర్వం – ఎలా ఉండేదో –
ఎలా ఉందో మన తర్వాతి తరాలకు చూపాలి! –
కథానాయకులందరూ ఒంటరి గాళ్లే...
తప్పుడు గుంపులను వ్యతిరేకిస్తూ ..."

ఎన్నో పగళ్ళు మరెన్నో రాత్రుళ్ళు, ఎందరో బంధువులు మిత్రులు బలపడే బంధాలు, తెగిపోతున్న సంబంధాలు, చిన్ననాటి ప్రేమలు, యౌవనంలోని ఆవేశాలు, శ్మశానవాటిక – శవపేటికలు, మరుభూములు – మరుల భూతాలు, కపాలాలు – కంకాళాలు, కుక్కలు, అమాయకులు, విశ్వాసపాత్రులు, పడవలు, నౌకలు, తుఫాను, ఫిరంగులు, పిస్తోళ్ళు, అందగత్తెలు, సుందరాంగులు, సైనికులు, వీరులు ఎందరో ఎందరో... ఈ ప్రయాణంలో మీకు తారసపడే వ్యక్తులందరూ నిజాయితీగా జీవించినవారే. ఏదో అన్వేషణలో తిరిగేవారు. అడుగడుగునా మిమ్మల్ని పలకరించి వెళ్ళిపోతారు – కొందరు గతంలోకి, మరికొందరు సమాధుల వనంలోకి.

తాము ప్రేమించిన వారిని దేవతలు త్వరగా తీసుకెళ్ళిపోతారు!

στους οποίους οι θεοί αγαπούν πεθαίνουν νέοι…..
…whom the gods love die young

ఈ కీర్తి–సంపద చేరేదెక్కడికి? ఈ ప్రశ్నకు సమాధానం ఈ ప్రయాణంలో లభించవచ్చు.

ఇది బైరన్‌తో బైరన్ దీర్ఘసంభాషణ. విరుద్ధ వ్యక్తిత్వ పార్శ్వాల వింత ఘర్షణ. అంతఃస్సంఘర్షణ. బైర్రన్... అవును.. **Creed Byron!**

σε αυτόν τον κόσμο δεν υπάρχει τίποτα , αλλά ο πόνος…
In this world ,there is nothing but pain. …. అని వాపోయాడు.

స్వర్గాన్ని, నరకాన్ని కాదని మృత్యువును ఎదిరించి – భయపడక సర్వస్వతంత్రంగా జీవించి '... ఈ ప్రపంచానికి ప్రియమైనది వదిలి వెళ్ళిపోతున్నా...'నని "...Lo Lascio qualche cora de Caronel mundo..." జీవితం చాలించాడంటే ఆశ్చర్యం – ఆవేదన కలుగుతాయి.

బైరన్‌ను అపార్థం చేసుకోవటం తేలికే – అతన్ని అర్థం చేసుకోవటానికి Cor-cordium కావాలి!!

మీరు సహృదయులేకదా! చదవండి మరి!!

బంధాలు సంబంధాలు

జార్జ్ గోర్డాన్ నోయిల్ బైరన్	కథానాయకుడు! (6వ లార్డ్ బైరన్).
శ్రీమతి బైరన్	బైరన్ తల్లి (గోర్డాన్ల సంతతి).
అగస్టా – శ్రీమతి లీ	బైరన్‌కు మారుటి అక్క, తండ్రికి మొదటి భార్య, కార్మార్తెల్‌కు పుట్టిన ఆడపిల్ల.
కాప్టెన్ బైరన్	బైరన్ తండ్రి (అయిదో బైరన్ తమ్ముడు).
మేరీ గ్రే	బైరన్ – ఆయా.
డా॥ డ్రూరీ	బైరన్ చదివిన స్కూలు ప్రిన్సిపాల్.
మాథ్యూ, లాంగ్, డల్లాస్	బైరన్ స్నేహితులు (ట్రినిటీ కాలేజీ).
స్క్రోప్ డేవీస్	బైరన్ మిత్రుడు – జూదగాడు–బైరన్‌కు అవసరానికి సొమ్మిస్తాడు.
మేరీ చావర్తు ఆన్స్‌లే, వివాహం తర్వాత మేరీ మస్టర్స్	బైరన్ ప్రేమించిన ఆన్స్‌లే వంశస్తురాలు అతనికంటే పెద్దది.
ముర్రే	ముసలి సేవకుడు, న్యూస్టెడ్ ఎస్టేట్‌లో.
ఫ్లెచర్	బైరన్ వ్యక్తిగత సేవకుడు.
హాన్సన్	బైరన్‌లకు లాయరు.
మూర్, డల్లాస్	బైరన్ స్నేహితులు.
మిల్‌బాంక్ = అనాబెల్లా	బైరన్ భార్య, లేడీ బైరన్.
లేడీ కారోలైన్	బైరన్ ప్రియురాలు, లండన్‌లో.
లేడీ మెల్‌బోర్న్	లేడీ కారోలైన్ అత్తగారు.
బోట్స్‌వైన్	బైరన్‌కు ఇష్టమైన కుక్క – సమాధి కట్టించి స్మృతిఫలకం వేయిస్తాడు.
జాక్సన్	బాక్సర్.
ఏంజెలో	కత్తియుద్ధం నేర్పేవాడు.
హాడ్గసన్, ఎడిల్స్టన్	బైరన్ మిత్రులు.
డాక్టర్ పోలిదోరి	మొదటి గ్రీసు ప్రయాణంలో డాక్టరు, ఇటాలియన్.
డాక్టర్ బ్రూనో	రెండో ప్రయాణంలో డాక్టరు.

పి.బి. షెల్లి	సాటి కవి – స్నేహితుడు.
మేరీ షెల్లీ	పి.బి. షెల్లీ భార్య.
క్లేర్	బైరన్‌ను ప్రేమించిన మేరీ చెల్లెలు.
అలెగ్రా	బైరన్‌కు క్లేర్‌కు జన్మించిన కూతురు.
మేడోర	బైరన్‌కు అగస్టాకు పుట్టిన ఆడపిల్ల.
అడా	బైరన్ అనాబెల్లాల కూతురు.
ట్రిలానీ	షెల్లీ స్నేహితుడు, నావికుడు.
లీ హంటు	పత్రికా సంపాదకుడు, షెల్లీ స్నేహితుడు – బైరన్‌తో కలిసి 'లిబరల్' పత్రిక నడుపుతాడు.
టీటా	వెనీస్‌లో గండోలా నడిపేవాడు, బైరన్ బాడీగార్డు.
జాన్ పీగాట్	ఎలిజబెత్ సోదరుడు – బైరన్ స్నేహితుడు (సౌత్‌వెల్).
మేరియానా; మార్గిరెట్	బైరన్‌కు వెనీస్‌లో ప్రియురాళ్ళు.
గూసిలీ రాణి = తెరాజా	బైరన్ ప్రియురాలు – చివరి నాలుగు సంవత్సరాలు.
గంబా పీట్రో	గూసిలీ రాణి సోదరుడు.
బ్లెకరీ	లండన్ కమిటీ గ్రీసు పంపిన అధికారి.
కెప్టెన్ స్టాన్‌హోప్	లండన్ నుండి వచ్చిన మిలటరీ అధికారి.
పారీ	లండన్ నుంచి వచ్చిన మిలటరీ ఆఫీసర్ (మిస్సిలోంగిలో వుంటాడు).
మావ్రో కార్డోటీ	గ్రీకు రాజకుమారుడు – బైరన్‌తోపాటు గ్రీసు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటాడు.
డా॥ బ్రూనో మరి ముగ్గురు డాక్టర్లు	బైరన్ అంతిమ దినాలలో వైద్యం చేసినవారు!



బైరన్ ప్రస్థానం







I

కొత్త ప్రదేశం : దివ్యకన్య!

(1500-1784)

నాటింగ్‌హామ్ దగ్గర్లో షేర్‌వుడ్ అందమైన ఒడిలో సన్యాసుల నివాసం ఉంది. వీరు అగస్తీనియన్ చట్టాల దారిలో దేవదారు చెట్లనీడల్లో ఉంటున్నారు. రెండో హెన్రీ రాజు, థామస్ బెకెట్ హత్యానేరం నుండి శిక్ష తప్పించుకోవటానికి పోప్‌తో ఒక ఒప్పందం చేసుకున్నారు. తన పశ్చాత్తాపానికి సూచనగా కొన్ని మఠాలను ఏర్పాటు చేసి పోషిస్తానని దాని సారాంశం! షేర్‌వుడ్ అడవుల్లోనే ఒక చెరువు – సరస్సు – సెలయేటి దగ్గర్లో కొంత స్థలాన్ని సేకరించి చెట్లను కూల్చి – దేనికి? రాజుగారి ప్రాయశ్చిత్తానికి, దేవుని మహిమకోసం! గోతిక్ కిటికీలు రోజ్‌వుడ్ తలుపులు, ద్వారాలు వెలసిపోయిన రాళ్లతో కట్టిన మఠానికి అమర్చారు. చివరికి ఈ రెండంతస్తుల మఠ భవనం చిన్నదైనా ఠీవిగానే నిలబడింది. దానికితోడు చుట్టూ వున్న దేవదారు వృక్షాలు, సెలయేరు, సరస్సు ఎంతో సుందరంగా, ఈ భవనానికి, నేపథ్య సౌందర్యాన్ని సమకూర్చాయి.

ఈ మఠాన్ని 'దివ్యకన్య'కు అంకితం చేశారు. దానికి న్యూస్టెడ్ – కొత్తప్రదేశం అని నామకరణం జరిగింది.

Sancta Maria Novi Loci!

ఇక్కడ నియమనిబంధనలు చాలా సులువైనవే! ఈ ప్రాంతంలో నివసించే సన్యాసులకు సొంత వస్తువులేమీ వుండకూడదు. వీలయినంత ఎక్కువ కాలం ఉపవాసాలతో దైహికమైన వాంఛలను అధిగమించాలి – ఆడవారిని కన్నెత్తి

చూడరాదు. అక్కడి పేదవారికి, ఈ మఠాన్ని ఏర్పరిచినవారి సంస్మరణార్థం దానాలు చేయాలి! ఆ విధంగా మూడుశతాబ్దాలు న్యూస్టెడ్ మఠాధిపతుల పరిపాలన సాగింది. అక్కడి సరస్సు సెలయేర్ల సాక్షిగా!

తర్వాత తర్వాత కాలం మారింది. విశ్వాసాలు తగ్గుముఖం పట్టాయి. నమ్మకాల స్థానంలో శాస్త్ర విజ్ఞాన జిజ్ఞాస పెరిగింది. పరిపాలకుల దృష్టి మఠాలను వదిలి పాఠశాలలమీద – కళాశాలలపైన మరలింది. వారిచ్చే ఆర్థిక సాయాలన్నీ విద్యకు, వైద్యానికి ప్రాముఖ్యాన్నిచ్చి ప్రజల సేవకు ఉపయోగపడ్డాయి.

ఒకనాటి రాజు ప్రాయశ్చిత్తానికి ఉద్దేశింపబడిన మఠం, అప్పటి (1539) పరిపాలకుని చాపల్యానికి బలికాబోతోంది. కింగ్ హెన్రీ – ఆనీబోలీన్ (Anne Boleyn) మోజులో, ఆమె అంత అందగత్తె కాకపోయినా ఆమె నల్ల కళ్ళ చీకటిలో ఇరుక్కుపోయి, తమ వివాహానికి అడ్డుచెప్తున్న పోప్‌ను స్థానభ్రంశుని చేసి తానే, ఆ స్థానాన్ని అలంకరించాడు. ఆ విధంగా ఆనీ మీద తన ప్రేమను దేవుని మీద భక్తినీ చాటుకున్నాడు!

దీని పర్యవసానంగా సాలీనా రెండు వందల పౌండ్ల ఆదాయంలోపు మఠాలన్నీ రాజుపరం అయిపోయాయి. ఈ పవిత్ర కార్యాన్ని డాక్టర్ జాన్ లండన్ మహాశయుని చాతుర్యానికి అప్పగించారు. ఆ విధంగా రాజు రెక్కల కిందకు వచ్చిన మఠాలను తనకు విధేయులయిన రాజ బంధువులకు లేదా గొప్ప వంశీకులకు అమ్మగలిగారు.

ఆ మఠాలలోని, అప్పటివరకూ వున్న వ్రాతప్రతులన్నీ ఆ చుట్టుప్రక్కల చెరువుల్లోనూ లేక దగ్గర్లోని గ్రంథాలయాల్లోనో తేలాయి. "పాత పుస్తకాలు 6 పెన్నీలు మాత్రమే"నని చిన్న ప్రకటన కూడా పెట్టారు. ఈ పరంపరలో 'న్యూస్టెడ్'ను, డాక్టర్ లండన్ చతురతతో ఏమాత్రం ఇబ్బంది లేకుండా, మఠాధిపతి జాన్‌బ్లేక్ నుంచి ఏడుగురు శిష్యులతో పాటు 21 జూలై 1539న రాజుగారి పరంచేశారు. అందుకుగాను సంవత్సరానికి 26 పౌండ్ల భృతిని మఠాధిపతికి అందచేస్తారు, శిష్యులకు మూడు పౌండ్ల ఆరు షిల్లింగుల ఎనిమిది పెన్నీలు!

'న్యూస్టెడ్' భవనాన్ని వదిలి వెళ్ళిపోయినరోజు ఈ సన్యాసులు వారి దగ్గరున్న వ్రాతప్రతులన్నిటినీ అక్కడి సరస్సులో వేసి వాటితోపాటు ఒక పాత్రకు పైన

బిగించివున్న ఇత్తడి గ్రద్దనుకూడా ఆ భవనం ముందున్న నీటియంత్రంలో పడవేసి వెళ్ళిపోయారు.

అప్పటినుంచి అక్కడ ప్రార్థనలు ఆగిపోయాయి. అప్పటికే ఆనీబోలీన్‌ను, ఆమె నల్లటి కళ్ళతోపాటు, తలమీద అలంకరించుకున్న ఇంకా నల్లటి లేసుపూలతో సహా, ఆమె తలను తలారి తన కత్తి పదునుకు గురిచేశాడు రాజాజ్ఞతోనే.

న్యూస్టెడ్, ఆ చుట్టుప్రక్కల ప్రజలు ఇది చాలా దుశ్శకునంగా భావించి సన్యాసులు దిగులుగా వెళ్ళిపోవటం చూసి, “ఈ భవనంలోని ఖాళీ గదుల్లోకి ఎవరు వచ్చినా ఇక్కడి దయ్యాలు వదలిపెట్టవు” అంతేకాదు ఆ ఆనీబోలీన్ వారి వంశానికి కీడే జరుగుతుంది” అని శాపనార్థాలు పెట్టారు.

ఒక సంవత్సరం గడిచింది. 1540లో హెన్రీ రాజు, తనకు బాగా విశ్వాస పాత్రుడైన ‘సర్ జాన్ బైరన్’కు 800 పౌండ్లకు ఈ న్యూస్టెడ్ సన్యాసుల భవనాన్ని ధారాదత్తం చేశాడు. ఆయన ‘సర్ జాన్ బైరన్’, గొప్ప గడ్డపు వీరునిగా పేరుగాంచాడు.

ఈ వీరుడు చాలా పురాతన వంశానికి చెందినవాడు. నార్మండీ నుంచి అప్పటి విజేతతోపాటు సైన్యాన్ని నడిపి యుద్ధాలు చేశాడు. కాలైస్ (Calais) పట్టుకున్నారు. ఆ విధంగా ఈ ప్రాంతంలో, ఇక్కడి ఎస్టేట్లు నాటింగ్‌హామ్ పరిసరాలు, రోష్‌డేల్ (Roch dale), క్లేటన్ (Clayton) వీరి అధీనంలోకి వచ్చాయి. బైరన్ వంశం 'Creed Byron'గా వృద్ధి చెందాలని "Trust in Byron"గా పేరు పొందాలని వీరి ఆకాంక్ష! అందుకనే ఆ పేరును ఫ్రెంచ్ విధానంతో రాశారు. వీరు ‘మార్కిస్ డి బైరన్’కు దగ్గర బంధువులు మరి!

ఈ గడ్డం వీరుడు న్యూస్టెడ్‌ను ఒక రణభూమిగా మార్చాడు. ఆయన వారసులు దీనిని కొనసాగించారు. ఆ వారసుల్లో ఒకరు ఓ వంద సంవత్సరాల తర్వాత కింగ్ చార్లెస్‌కి దగ్గరి మిత్రుడు అప్పటి అంతర్యుద్ధం అణచివేతలో ప్రముఖపాత్ర పోషించాడు. అయితే తన తొందరపాటుతో అంత మంచిపేరు సంపాదించలేకపోయాడు. రాజుపట్ల ఆయనిప్పుడు విశ్వాసపాత్రుడుగానే వున్నారు. ఒకప్పుడు సన్యాసుల ప్రార్థనలతో మారుమ్రోగిన న్యూస్టెడ్ వరండాలు ఇప్పుడు

యుద్ధభేరీలతో, క్షతగాత్రుల ఆర్తనాదాలతో, దయనీయంగానూ, భయంకరం గానూ మారాయి. ఆలీవర్ క్రామ్‌వెల్ – ప్రజాస్వామ్య విజయంతో రెండో చార్లెస్, ఫ్రాన్స్ వెళ్ళిపోయాడు. అప్పుడు లార్డ్ బైరన్ అతని వెన్నంటే వున్నాడు. ఎంతటి విశ్వాసపాత్రుడంటే లేడీ బైరన్ ఆ రాజుకు పదిహేడవ మిస్ట్రెస్‌గా వుండిపోయింది!

ఇక ఇక్కడ ఈ భవనం చుట్టుపక్కల అడవులన్నీ పల్చబడిపోతున్నాయి. చిన్నచిన్న గ్రామాలు వెలిసాయి. జింకల గుంపులు లేళ్ల మందలు విపరీతంగా వుండేవి. ఇక్కడికి దగ్గర్లోనే ఆన్‌స్లే (Annesley) వంశపు 'చావర్తు'లు వచ్చి చక్కటి భవనం కట్టుకున్నారు. న్యూస్టెడ్‌కు చెట్ల దారి ఏర్పడింది. ఈ చెట్లు కుచ్చుపూలు రాలుస్తుండేవి. అందుకని ఆ దారిని 'పెళ్లిబాట' అని పిలిచేవారు. మూడో లార్డ్ బైరన్ వైకౌంట్ చావర్త్ కుమార్తె – ఎలిజిబెత్‌ని వివాహం చేసుకున్నాడు. ఆ విధంగా ఆ రెండు కుటుంబాలు వివాహ బంధంతో దగ్గరయ్యాయి.

ఈ మూడో బైరన్ 17వ శతాబ్దం చివరివరకూ జీవించాడు. కాని ఆర్థికంగా పూర్తిగా, దాదాపు చితికిపోయాడు. జనవాక్యం, సన్యాసుల శాపం ఊరికే పోతుందా? పైగా నల్లముసుగు దెయ్యం ఎప్పుడూ ఈ న్యూస్టెడ్ ప్రాంతాన్ని వదలిపోదయ్యె! బైరన్ వంశపు చీకటిరోజులు – నాల్గో బైరన్ ఇద్దరు కుమారుల రూపంలో మరింతగా నల్లబారాయి. పెద్ద కుమారుడు 'అయిదో బైరన్', తర్వాత ఒక హత్యానేరంతో విచారింపబడటం, రెండో కుమారుడు, ఈ నావికుడు, పాపం చాలా దురదృష్టపు 'అడ్మిరల్'గా పేరుగాంచాడు!

ఇక 'అయిదో బైరన్' హత్యానేరం ఏమిటో చూద్దాం. ఆయన చంపింది ఎవరినో కాదు – స్వయానా బావమరిది 'చావర్తు'నే. 'ఆన్‌స్లే' అధినేత! ఇది చాలా దురదృష్టపు సంఘటన. వీరిద్దరు లండన్‌లో 'నాట్స్'లో నెలకోసారి కలిసే అలవాటు, ఆనవాయితీ. అదీ పాల్ మాల్‌లోని స్టార్ గార్టర్‌లో! ఆ దురదృష్టపురోజు 26 జనవరి 1765! మామూలుగా జరిగే సమావేశం చాలా సరదాగానే గడిచిపోయింది. తర్వాతి సంభాషణ, "అడవుల్లో చిన్నాచితకా జంతువుల్ని ఎలా కాపాడుకుంటున్నార"ని చర్చ! చావర్తు – అనధికారంగా వేటాడేవారిని కఠినంగా శిక్షించాలని అంటాడు. లార్డ్ బైరన్, 'అది అంతగా పట్టించుకోవల్సిన విషయమే

కాదు' అని మామూలుగా తేలికగా సమాధానం! అప్పుడు చావర్తు కాస్త ఎగతాళిగా 'మా అయిదెకరాలలో ఎక్కువ లేళ్లున్నాయి. మీ వేల ఎకరాలలోకంటే' అని, "అవునా! సర్ చార్లెస్ సెడ్లీ?" అని ప్రక్కనే వున్న ఇద్దరికీ ఇరుగుపొరుగు పెద్దమనిషినీ అడుగుతాడు. 'ఇట్లాఅయితే మీ ఎస్టేటులో ఒక్క జింక కూడా మిగలదు' అని కూడా అంటారు. "అయినా మేము ఎక్కడ వుంటామో మీకు తెలుసుకదా! ఈ విషయంలో మరింత సమాచారం కోసం మమ్మల్ని సంప్రదించవచ్చు" అని కాస్త ఎక్కువగానే రెచ్చగొట్టారు.

తర్వాత చావర్తు మెట్లమీద కలిసినపుడు లార్డ్ బైరన్–చావర్త్ ఏమి మాట్లాడుకున్నారో, అక్కడవున్న సేవకుణ్ణి తమకు ఒక ఖాళీగది చూపమన్నారు. అతను ఆ ప్రక్కన వున్న గది తలుపు తెరిచి ఒక కొవ్వొత్తి వెలిగించి వారిద్దరినీ గదిలో వదిలి తలుపు మూసాడు. కొన్ని నిమిషాల తర్వాత ఒక గంట మోగింది. చావర్తు కడుపులో నుంచి రక్తం కారుతుంది. లార్డ్ బైరన్ కత్తిని వరలో పెట్టాడు. చావర్తుని మోసుకుపోతుండగానే ప్రాణాలు వదిలాడు.

'లార్డ్'ను విచారించాలంటే 'House of Lords'కే అర్హత వుంది. సరైన సాక్షులు లేక లార్డ్ బైరన్‌పై హత్యానేరం రుజువు కాలేదు. కానీ లార్డ్ బైరన్‌కు యీ సంఘటన చాలా అపకీర్తి సంపాదించిపెట్టింది. 'వికెడ్ లార్డ్' అని అనధికార బిరుదూ దక్కింది. దానితోపాటు చాలా కథలు, అభూత కల్పనలు పుట్టుకొచ్చాయి. తన బగ్గీతోలేవాణ్ణి చంపి పడేశాడని, Lady Byron ను ఇంట్లోంచి తరిమేశాడని ఎప్పుడూ పిస్తళ్ళు గుళ్ళతో నింపి జేబుల్లో పెట్టుకు తిరుగుతాడని... తన భార్య వదిలి పోగానే పనిపిల్లను పక్కలో జేర్చుకున్నాడని! ఆమెనే 'లేడీ బెట్టి'గా అక్కడి గ్రామ ప్రజలు పిలుస్తుంటారు! ఇవీ కథలు! ఈ లేడీబెట్టి న్యూస్టెడ్ భవనాన్ని పందుల దొడ్డిగా మార్చింది! గోతిక్ భవనాన్ని ఆవులశాలగానూ మార్చింది. ఆ విధంగా 'వికెడ్ లార్డ్' అప్పుల్లో కూరుకుపోయి, చెట్లు నరుక్కుంటూ బ్రతుకీడుస్తున్నాడు. చివరికి అతని కొడుకు ప్రేమించి పెళ్ళి చేసుకొంటాడు. ఇది ఇష్టంలేని లార్డ్ 3వ వంశాన్ని నాశనం చేయటానికి తన మిగిలిన శక్తులన్నీ వినియోగించారు. ముందు చెట్లన్నీ నరికి అమ్మేశారు. తరువాత రెండువేల జింకల్ని చంపి సొమ్ము చేసుకున్నారు.

ఎస్టేటు మొత్తాన్ని సంవత్సరానికి 60 పౌండ్ల లెక్కన 21 సంవత్సరాలు అద్దెకు ఇచ్చాడు. ఆ తరువాత అక్కడ బొగ్గు గనులున్నాయని తెలిసింది! అయినా ఏమీ చేయలేకపోయాడు!

ఇక ఆయన వింత ప్రవర్తన ఆ చుట్టుప్రక్కల అందరికీ తెలిసిందే. కాలవల గేట్లు ఎత్తివేశాడు. దిగువ వున్న పత్తి మిల్లులు తడిసిపోయాయి. తన చిన్న చెరువులో చిన్నచిన్న పడవలు ఎదురుగా మోహరింపచేసి బొమ్మల ఫిరంగులతో యుద్ధ క్రీడ జరిపేవాడు. వంటింట్లో నేలమీద పడుకుని వంటినిండా బొద్దింకలు పాకుతుంటే ఆనందించేవాడు!

ఈ లార్డ్ బైరన్ తమ్ముడు మన హీరో తాత! ఇతని జీవితంలో కూడా డ్రామా తక్కువేంలేదు. ఈయన నావికుడు అని చెప్పేంకదా. దురదృష్టం, ఆయన ముందో–వెనకో వుంటుంది. ఎప్పుడు సముద్రంలోకి వెళ్ళినా తుఫానులోనే జీవితం, ఎప్పుడూ సాఫీగా సాగదు! 'వేజర్' అనే సామానుల నౌకకు కెప్టెన్‌గా వెళ్ళినపుడు, అదే స్పానిష్ కాలనీల మీద దాడికి, ఆ నౌక చిలీ తీరంలో రాళ్లలో ఇరుక్కుపోయింది. అది చాలా భయంకరమైన దృశ్యం. ఎత్తైన అలలు నౌకను ఢీకొంటున్నాయి. ఒక నావికుడు పిచ్చిగా అరుస్తూ దూకేశాడు. మిగతా సిబ్బంది తిరుగుబాటు చేశారు. కెప్టెన్ వాళ్లను పిస్తోలుతో కాల్చవలసిన పరిస్థితి దాపురించింది. ఇలాంటి పరిస్థితులలో కూడా బైరన్ చాలా స్థిమితంగా వున్నాడు. తర్వాత పాటగోనియా తీరంలో సంభవించిన నౌకావిధ్వంసాన్ని పూసగుచ్చినట్లు రాసిపెట్టాడు. దానికి చాలా పేరు వచ్చింది కూడా!

1704లో కెప్టెన్ బైరన్‌కు ప్రపంచాన్ని చుట్టిరమ్మని, తన 'డాల్ఫిన్' నౌకలో కొత్త ప్రదేశాలను కనుగొనమని అధికారికంగా సందేశాలు వచ్చాయి. ఆ విధంగా బయలుదేరి ఎన్నో 'తెలియని' దీవులను కనుగొన్నాడు. ఆయన తిరిగి వచ్చిన తరువాత 'న్యూ ఫౌండ్‌లాండ్'కు గవర్నరుగా నియమించబడ్డాడు. తర్వాత వైస్ అడ్మిరల్ పదవిలో ఉన్నాడు. అడ్మిరల్ బైరన్ ఫ్రెంచ్ నౌకలను అడ్డుకోవటానికి పంపబడితే, మొదటిసారి తుఫాను వచ్చింది. రెండోసారి ముందుగా ఎదుర్కొన్నాడు. ఆ తర్వాత ఆయన సముద్రం మీదకు వెళ్ళలేదు. 1786లో తన జీవనయాత్ర చాలించాడు.

అడ్మిరల్ బైరన్‌కు ఇద్దరు కొడుకులు. పెద్దకుమారుడు జాన్ బైరన్ (మన హీరో తండ్రి) ఈయన సైనికుడు! రెండో బైరన్ జార్జి ఆన్‌సన్, నౌకాదళంలో వుండేవాడు. జాన్ బైరన్ ఫ్రెంచ్ నౌకాశిబిరంలో శిక్షణ తీసుకున్నాడు. 'గార్డ్స్'తో చేరాడు. అమెరికన్ యుద్ధంలో పాల్గొన్నాడు. అప్పటికి అతను యువకుడే. అతని హింసాత్మక ప్రవర్తన, అతనికి 'పిచ్చిజాక్'గా పేరు గడించింది.

ఇరవై సంవత్సరాలకే యుద్ధం నుంచి లండన్ తిరిగి వచ్చాడు, "Marchioness of Carmarthen" మనసు గెలిచి, ఈమె లార్డ్ కార్మలెన్ భార్య! (డ్యూక్ ఆఫ్ లీడ్స్)! ఆయన మంచివాడేకాని, భార్య యువకుడైన కెప్టెన్ బైరన్‌తో వుండటానికి మనసుపడింది. ఆమె తండ్రి చనిపోగానే ఆమె "బారోనెస్ కానియర్స్"గా మారిపోయింది. సంవత్సరానికి నాలుగు వేల పౌండ్ల ఆదాయంతో మొగుణ్ణి వదిలి, కెప్టెన్ బైరన్‌తో వెళ్ళిపోయింది. ఆమె భర్త, లార్డ్ కార్మార్తన్ విడాకులు తీసుకోవలసివచ్చింది!

వీరు కొంతకాలం ఆస్టన్ హాలులో ఆమె ఇంట్లోనే వున్నారు. కొంత కాలానికి అప్పుల వాళ్ళనుంచి, వదంతుల నుంచి, తప్పించుకోవటానికి ఫ్రాన్స్ వెళ్ళిపోయారు. అక్కడే వారికి అగస్టా బైరన్ జన్మించింది! ఆ తర్వాత 1784లో లేడీ కానియర్స్ తనువు చాలించింది. దానితో ఆమెకు వచ్చే నాలుగు వేల పౌండ్ల భరణం ఆగిపోయింది.



న్యూస్టెడ్ ఎస్టేట్

II

గోర్డాన్లు

(1784-1790)

ఇంతకు ముందు అధ్యాయంలో మన కథానాయకుని తాతల, తండ్రుల చరిత్ర తెలుసుకున్నాం. ఇప్పుడు అతని తల్లి వంశవృక్షపు వివరాలు కొన్ని తెలుసుకుందాం.

భార్య చనిపోయిన తర్వాత తన విషాదాన్ని మరిచిపోవటానికి అప్పటి స్నానఘట్టాల వెంట కొన్నాళ్ళు తిరిగాడు. అలాంటి సమయంలోనే జాన్ బైరన్ గారికి స్కాట్ యువతి, అనాధలాంటిది, కానీ వారసత్వ సంపదకు అర్హురాలు అయిన మిస్ కేథరిన్ గోర్డాన్ పరిచయమైంది. అందగత్తె కాకపోయినా, తండ్రి మరణంతో ఆస్తితోపాటు, మూడు వేల పౌండ్ల నగదు కూడా పొందగలిగింది. దీనితో యువకుడైన జాన్ బైరన్ నిత్యావసరాలు తీరతాయి. అప్పుల బాధ తప్పుతుంది! మిగతా సంపద గైట్ ఎస్టేటు ద్వారా, అబెర్డీన్ బ్యాంకు వాటాల ద్వారా, చేపల చెరువుల ద్వారా కూడా కొంత సంక్రమించింది.

కేథరిన్ గోర్డాన్ గొప్ప వంశానికి చెందిన యువతి. స్కాట్‌లాండ్‌లో గౌరవనీయమైన పేరుగల వంశం. ఈ గైట్ వారసత్వం, రెండవ జేమ్సు రాజుగారి స్వయానా చెల్లెలి కొడుకు విలియం గోర్డాన్! ఇంత గొప్ప వారసులైనా వీరి జాతకాలు గొప్పవి కావు. విలియం గోర్డాన్ జల గండంతో చనిపోయాడు. అలెగ్జాండెర్ గోర్డాన్ హత్యగావించబడ్డాడు. జాన్ గోర్డాన్ హత్యానేరంతో ఉరితీయబడ్డాడు, 1592లో లార్డ్ మోరేని హత్యచేసినందుకు. మరో జాన్ గోర్డాన్,

వాలెన్‌స్టీవ్‌ను చంపినందుకు 1634లో ఉరికంబం ఎక్కాల్సి వచ్చింది! ఈ విధంగా ఈ గోర్డాన్ గైట్ – వంశం తన కుటుంబ సభ్యులందరిపట్లా శాపంగానే మారింది!

స్కాట్‌లాండ్‌లో మర్యాదలు మన్ననలు చాలాకాలం పెత్తందారీ విధానంలోనే కొనసాగాయి. నిజం చెప్పాలంటే చాలా మొరటు పద్ధతిలోనే. ముఖ్యంగా గోర్డాన్‌లు ఎవ్వరినీ లెక్కచేసేవారుకాదు. వారు చిన్నతనంనుంచి కోపతాపాలు ఎక్కువ ప్రదర్శించేవారు కూడా! 1610లో అబర్దీన్ గ్రామర్ స్కూలులో ముగ్గురు గోర్డాన్ విద్యార్థులు కత్తులు, పిస్తోళ్లతో రాత్రంతా ఒక దారిని ఆపారు. దీనికి వేరే కారణాలు అవసరం లేదు. అది వీరి రక్తంలోనే వుంది. "నన్ను నేను నియంత్రించుకోలేను. నా చేతిలో కత్తి చెడు చేయకుండా వుండదు. చివరికి నేను ఉరికంబం ఎక్కాల్సిందే" ఇదీ ఆరో గోర్డాన్ పైకి అన్న మాటలు! ఇలా ఒక వంద సంవత్సరాలు ఈ గోర్డాన్ల భయంతో ఉత్తర దేశం వణికిపోయింది.

కొన్నాళ్ళకు రాజు, పాలకులు కఠినంగా ఉండడంతో ఇలాంటి మరణాలు తగ్గాయి. అలెగ్జాండర్ గోర్డాన్ నీళ్ళలో మునిగిపోయాడు. జార్జి గోర్డాన్ ముంచివేయ బడ్డాడు. అదీ స్నానాలు చేసే కాలవలో. ఈ చివరివాడే కాథరిన్ గోర్డాన్ తండ్రి. ఆ వంశపు రక్తమే కెప్టెన్ బైరన్ ప్రేమను రగిలించింది. ఈమె మే 13, 1784 తేదీన 'బాత్'లోనే బైరన్‌ను వివాహం చేసుకుంది. ఎక్కడైతే తన తండ్రి మునిగి చనిపోయాడో అక్కడే!

ఈ దంపతులు ఉత్తర దిశగా పయనించి గైట్‌లో కుదురుకోవాలని ప్రయత్నించారు. కాని వారికి ఎవరూ ఆత్మీయ ఆహ్వానం పలకలేదు. అదే గోర్డాన్ల చుట్టాలు – స్నేహితులు కెప్టెన్ బైరన్ విచ్చలవిడి ప్రవర్తన వారికి నచ్చలేదు. అతను ఈ స్కాట్ వనిత అదృష్టపుటంచులు పట్టుకుని వచ్చాడు. ఆమె ధరించిన సిల్కు ముసుగులు, రంగు ఈకల టోపీలు, మెడనిండా గొలుసుల, నిధులకోసమే వచ్చాడని ఆమె అందాన్ని ప్రేమించి కాదని తీర్పు ఇచ్చారు. దానిలో కొంత నిజం లేకపోలేదు.

వారు చెప్పింది సత్యమే. ముందుగా మూడువేల పౌండ్లు నగదు వెళ్ళిపోయింది. తర్వాత అబర్దీన్ బ్యాంకు వాటాలు అమ్మకాలు జరిగినాయి. చేపల చెరువులు, దేవదారు అడవుల ఎస్టేటులు అన్నీ ఆవిరయిపోయాయి. అప్పులవాళ్ళ బాధపడలేక

ఇంగ్లీషు ఛానెల్ దాటి ఫ్రాన్సు చేరారు. మార్షల్ డి బైరన్ వీళ్లను దగ్గరకు తీశాడు – కాని కెప్టెన్ బైరన్ మారలేదు.

కేథరిన్, ఎంతైనా స్కాట్ స్త్రీకదా! గుట్టుగానే కాపురం చేసింది. చిన్నారి అగస్టాని జాగ్రత్తగా పెంచింది. వీరున్న 'ఛాంటెల్లీ'లో అగస్టా జబ్బుతో బాధపడింది. సవతి తల్లి అయినా కాథరిన్, అగస్టాను ఎంతో జాగ్రత్తగా కాపాడింది "నీవు ఎన్నాళ్ళు మృత్యుముఖంలో వున్నావో ఇప్పుడు తలచుకుంటే భయంవేస్తోంది. నిన్ను ఆ దేవుడే కాపాడాడు" అని తరువాత అగస్టాతో చెప్పింది! కేథరిన్ తన ధర్మాన్ని ఎంతో నిష్ఠగా నిర్వర్తించింది. ఆమె 'బైరన్'ను అంతగా ప్రేమించింది. అతని అందాన్ని, ధైర్యాన్ని, నిర్లక్ష్యాన్ని అన్నింటినీ ఎంతగానో ఇష్టపడింది. కానీ భవిష్యత్తు తలుచుకొని భయపడేది. 1787లో ఆమె ప్రసవరోజులు దగ్గరపడేసరికి ఇంగ్లాండు వెళ్ళిపోవాలని ఆశించింది. అగస్టా అమ్మమ్మ, అగస్టాను తన పెంపకంలోకి తీసుకుంటానన్నది. ఆమె లేడీ హోల్డర్‌నెస్!

ఆ విధంగా అగస్టా తన అమ్మ తాలూకు కుటుంబానికి చేరింది.

కాథరిన్ తన ప్రసవానికి ముందు లండన్‌లో ప్రశాంతమైన చోటనే నివసించింది. నిజానికి ఇలాంటి సమయంలోనే కదా భర్త శ్రద్ధగా చూడాలి! కానీ కెప్టెన్ బైరన్ కేవలం డబ్బుకోసమే ఆమె దగ్గరకు వచ్చేవాడు. డోవర్‌లోనో, పారిస్‌లోనో గడిపేవాడు.

ఇటువంటి క్లిష్టమైన కాలంలో ఆమెను పట్టించుకుని కాపాడినవాడు ఆమె లాయరు జాన్ హాన్సన్! అతని భార్య, లేడీ బైరన్‌ను, ఒక నర్సు రక్షణలో వుంచింది. ఆమె పేరు 'మిల్స్'. సహాయంగా ఒక కాంపౌండర్‌ని ఏర్పాటు చేసింది. అతని పేరు 'కాంబీ'. అలాంటి పరిస్థితుల్లో జనవరి 22 వ తేదీన 1788 సం॥లో మగపిల్లవానికి జన్మనిచ్చింది. అతనికి 'జార్జి గోర్డాన్ బైరన్' అని నామకరణం చేశారు. తల్లి వారసత్వపు ఆస్తులు రావాలంటే వారి వంశపు నామాన్ని ధరించాలి. నిజానికి ఈ పసివానికి మిగిలింది ఆ పేరు మాత్రమే!

కాథరిన్ బైరన్ ఇంగ్లాండు వచ్చిన తర్వాత తన దయనీయ స్థితిని అర్థం చేసుకుంది. తన గైటు ఎస్టేటు అమ్మకం అంతా ఆవిరయిపోయినట్టు తెలుసుకుంది. కెప్టెన్‌గారు ఎంత వేగంగా ఖర్చుపెడుతూ నోట్లమీద నోట్లు

రాస్తున్నాడో తెలిసివచ్చింది. చివరికి, ఆమె లాయర్లు చెప్పింది, అన్నీ పోగా మిగిలింది 3000 పౌండ్లు మాత్రమే. ఈమె మేలుకోరి 5 శాతం వడ్డీకి పెట్టుబడిపెట్టి సం॥ 150 పౌండ్లు వచ్చే ఏర్పాట్లు చేశారు. ఇది ఏమూలకి? మొదటివారమే వంద పౌండ్ల కోసం కబురు పెట్టింది! ఆయన నిరాకరిస్తే కనీసం 25 పౌండ్లయినా ఇవ్వమని ఉత్తరం పంపింది!

నిజానికి సంవత్సరానికి 150 పౌండ్లతో కాథరిన్ బైరన్ హాయిగా జీవించగల సమర్థురాలే. కానీ జాక్ బైరన్? అప్పులమీద అప్పులు కుప్పలుగా, ఆమెమీద వచ్చిపడుతుంటే ఇక తట్టుకోలేకపోయింది. తన కోపం అంతా వస్తువులమీదా పనివాళ్లమీదా చూపించేది. జాన్ బైరన్ కళ్ళల్లోకి చూస్తే ఇవన్నీ మరచిపోయి కరిగిపోయేది! అప్పటికి ఆమె వయసు 23 సంవత్సరాలే. ఎంతటి సంపద, అదృష్టం ఆమెకు దక్కినా, ఆమె బలహీనత బైరన్ మీద ప్రేమ! అదీ ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా! "అతన్ని కాదనలేను" అనేది.

మరొకరైతే పిచ్చివాళ్లయిపోయేవారే. చివరికి కాథరిన్ కూడా విసిగిపోయింది. ఆవేశంలో స్కాట్‌లాండ్ అబర్డీన్ వెళ్లిపోవాలని, అక్కడ ఒక అడుగు స్థలం లేకపోయినా కనీసం తన జన్మస్థలంకదా, అనుకునేది. అప్పులవాళ్ళ బాధలు తట్టుకోలేక చివరికి జెండా ఎత్తివేసింది. లండన్ వదిలి అబర్డీన్ చేరింది.

ఆమె వెనకనే కెప్టెన్ బైరన్ వెళ్ళలేదు. జీవితం అంత అనుకూలంగా లేదు. తనకు సాలీనా నాలుగు వేల పౌండ్ల భరణం తెచ్చిపెట్టిన భార్య చనిపోయింది. భరణం ఆగిపోయింది. పెద్దగా అందగత్తె కాని ఈ కాథరిన్‌ను చేసుకున్నాడు! ఎందుకు? సంపదకు వారసురాలనేకదా! ఇప్పుడు పూర్తిగా బికారి అయిపోయింది. పైగా చాలా లావుగా తయారవుతోంది. ఇప్పుడు వెంట పడవలసిన అవసరం ఏముంది?

కాథరిన్ బైరన్, అబర్డీన్ చేరింది. సామానులతో వున్న ఇంటిలో అద్దెకు చేరింది. ఇద్దరు స్కాచ్ పని అమ్మాయిలు, అగ్నాస్, మేరీ గ్రే (వాళ్ళిద్దరూ అక్కచెల్లెళ్ళు) మన జార్జి (గోర్డీ అనికూడా ముద్దుపేరు)ని సాకటానికి! ఇతను తండ్రి అంత అందగాడు. కాని నడవటం మొదలుపెట్టిన తర్వాత తల్లి గమనించింది. అతని కుంటితనం. రెండు కాళ్ళు సరైన పొడవే. నిలబడినప్పుడు తేడా ఏమీ

లేదు. కానీ మడమ పట్టు ఇవ్వక కుంటుతున్నాడు. మునివేళ్ళమీద నిలబడితే నిటారుగానే వున్నాడు.

తల్లి వైద్యుల సలహా తీసుకుంది. వారు ప్రత్యేకంగా బూట్లు తయారు చేయించారు. ప్రసవ సమయంలో బిడ్డను సరిగ్గా పట్టుకోకపోవటంతో కాలి మడమ నరాలు దెబ్బతిన్నట్లు అభియోగం! లండన్‌లోని డాక్టరు జాన్ హంటర్ ఈ బాలుని కోసం ప్రత్యేకమైన బూట్లు తయారుచేయించి పంపారు. అయితే బాలుడు – బైరన్ అబర్డీన్ వీధులలో, మేరీ గ్రే ప్రక్కన కుంటుతూనే నడుస్తున్నాడు!

ఈ పిల్లవాడు చాలా తెలివిగలవానిగా, ప్రేమించేవానిగా పేరు తెచ్చుకున్నా, అతని హింసాత్మకమైన ప్రవర్తనకు భయపడేవారు! తల్లిలాగానే వస్తువుల్ని విరగ్గొట్టడం, గాజు సామాన్లు పగలకొట్టటం అలవాటయింది. ఒకరోజు కొత్త దుస్తులు మాపితే కోపగించారు. అంతే, అవే దుస్తుల్ని నిలువునా చింపి లెక్కలేకుండా చూశాడు. *చిన్ననాడే జీవితానికి పునాదులు పడతాయి. ముందుముందు వ్యక్తి ప్రవర్తనా సరళిని సూచిస్తాయి.* ఈ చిన్నవాడు తనచుట్టూ ఏమి చూశాడు? తన తల్లిదండ్రులు కలిసి బ్రతకలేకపోతున్నారు. దాని పర్యవసానం అమ్మకు కోపతాపాలు ఎక్కువైపోయాయి. "దూరం నుంచి ఆమె చాలా అనుకూలంగా వుంటుంది. కానీ మీలో ఎవరైనా ఆమెతో రెండు నెలలు కలిసివుండండి, నేను కాబట్టి ఉండగలిగాను" అని గొప్పగా చెప్పాడు కెప్టెన్.

కొన్నాళ్ళు అబర్డీన్‌లో వేర్వేరు ఇళ్ళల్లో వుంటూ, టీ తాగటానికి కలుస్తూండేవారు. జాన్ బైరన్ ఆకర్షణకు ఆమె కరిగిపోయింది! ఆయనకు అప్పులు ఇస్తూనే ఉండేది. ఆ విధంగా ఆమె మరింతగా ఆర్థికపరమైన చిక్కుల్లో ఇరుక్కుపోయింది. సాలీనా 135 పౌండ్లతోనే సర్దుకుపోయింది. కానీ ఆమె కోపం తారాస్థాయికి చేరినపుడు ఇంట్లో పింగాణీ సామాను గాలిలోకి లేస్తుండేవి.

ఇవన్నీ చిన్నవాడయిన మన 'గోర్డీ' చూస్తూనే వున్నాడు. తనతోటివాళ్ళకు అమ్మ–నాన్న తోడుండేవారు. తనకు? ఈ కొట్లాటల, కోపతాపాల మధ్య తల్లి లేక, తండ్రి ఆలనాపాలనా కరువై, దాదీల సంరక్షణలో పెరుగుతున్నాడు. తన తల్లిని, తండ్రిని, తనను పెంచే దాదీలు, ఎగతాళిగా చూడటం తన అనాథ పరిస్థితిని మరింతగా చూపింది. ఏమిటో తెలియని స్థితి స్థిరపడిపోయింది. దీనికి

తోడు తన అవిటితనం మరింతగా తోటివారి వెక్కిరింతకు గురిచేసింది. ఒకరోజు వీధిలో మేరీ గ్రే ను ఎదురైన స్త్రీ అడుగుతోంది, "బాబు ఎంత ముద్దుగా వున్నాడు! కానీ పాపం, ఆ కాలు కుంటిదా?" అంటూంటే అంతులేని కోపం వచ్చింది. చేతిలో వున్న సన్నని కర్రతో ఆమెను కొట్టి "మళ్ళీ ఆ విషయం ఎత్తావంటే.." అని అరిచాడు! ప్రతి రాత్రి కాలికి గట్టిగా కట్టుకట్టేవాళ్ళు. ఎంతో బాధాకరమైన విధానం. ఆ విధంగా చేస్తే కాలు బాగుపడవచ్చని నాటువైద్యుల సలహా!

జాన్ బైరన్, 1790 చివరి ప్రాంతంలో, భార్య దగ్గర్నుంచి, అతని సోదరి 'లీ' దగ్గర కొంత సొమ్ము పట్టేసి ఫ్రాన్స్ ఉడాయించాడు. లీకి ఫ్రాన్స్‌లో 'వాలెన్సీన్సు'లో ఒక ఇల్లు వుంది. వెళ్లి అక్కడ తిష్ఠవేశాడు. అంతేకాదు అప్పుడు, ఈ వీరుడు 'ఫ్రెంచి తిరుగుబాటు'లో తలమునకలుగా అదేమిటో అర్థం కాకుండానే పాల్గొన్నాడు. అక్కడి నాటకాల వాళ్ళతో తిరుగుతూ 'సాంస్కృతిక కార్యక్రమాల్లో' పాల్గొంటూ రోజులు, రాత్రులు గడుపుతూ తన సోదరికి అప్పుడప్పుడూ ఉత్తరాలు అస్పష్టంగా రాస్తుండేవాడు. 'వాలెన్సీన్సు'లో అమ్మాయిలందరూ నన్ను ప్రేమిస్తున్నారు. నిన్న రాత్రి బాగా వర్షం కురిసింది. ఈ నటి చాలా అందంగా ఆకర్షణీయంగా వుంది. ఇంకా నేను అలసిపోలేదు" ఇలా వుండేవి.

1791 ప్రాంతంలో ఈ వుత్తరాల్లో విషాదం చోటుచేసుకుంది.

తర్వాత "వేసుకునేందుకు కోటుకూడా లేదు. ఎక్కడైనా పని వెదుక్కోవాలి" తర్వాత తర్వాత "ఇప్పుడు చొక్కా కూడా లేదు. నేను పూర్తిగా ఖర్చయిపోయాను".


అతని మరణం వార్త తెలిసింది. కొందరు ఆత్మహత్య అన్నారు. ఇది నిజంగా కాథరిన్‌కి అశనిపాతమే! ఆమె అతన్ని చివరివరకూ ప్రేమించింది. చాలా దుఃఖంలో మునిగిపోయింది. "అతను ఎన్ని తప్పులు చేసినా నా భర్తకదా, చివరి రోజుల్లో అతనికి సేవ చేయలేకపోయానే అని బాధ ఎక్కువగా వుంది" అని వదినగారికి రాసింది.

"అతన్ని ఎక్కడ ఖననం చేశారు? ఏమాత్రం వీలయినా, అతని కేశాలు అవశేషాలు కొన్ని పంపుతావా?" అనికూడా అర్థించింది. చిన్నవాడైనా జార్జి బైరన్ తన తండ్రిని మర్చిపోలేదు. తండ్రి అంటే అతనికి ఆరాధనే. ఇప్పుడు

తనని ఒంటరివాణ్ణి చేసి వెళ్ళిపోయాడు. ఇప్పుడు కోపంతో కొట్టిన దెబ్బలమీదే ముద్దుల వర్షంతో తడిపే అమ్మతోనే ఉండాల్సి వచ్చింది. తల్లి అంటే భయం, జాలి రెండూ కలగలిపి అతన్ని పిండి వేసేవి. జాక్ స్టూవర్ట్ తోటలో ఆపిల్ పళ్ళు కోసేటప్పుడు 'పాపం – మా అమ్మకు రెండు పళ్ళు తీసుకువెళ్ళనా' అనేవాడు!!



లార్డ్ జార్జ్ గోర్డాన్



జార్జ్ హామిల్టన్ గోర్డాన్

Byron



బైరన్ నాయనమ్మ

III

పూర్వ నిర్ణీతాలు

(1792-1798)

మేరీ గ్రే బైబిల్ చదువుతోంది. బైరన్ ఎంతో శ్రద్ధగా వింటున్నాడు. “ఏబెల్ సమర్పించిన ప్రసాదాన్ని ‘లార్డ్’ గౌరవించాడు. కానీ ‘కెయిన్’ సమర్పణను గౌరవించలేదు. కెయిన్ విషాదంతో ముఖాన్ని దాచుకున్నాడు. లార్డ్ ‘ఏమిటి కెయిన్? ఎందుకు అలా వున్నావు’ అన్నాడు. అర్థం కాకపోయినా దానిలో వున్న కవితాశక్తి అతన్ని కట్టిపడవేసింది.

ఎందుకు కెయిన్ దుఃఖిస్తున్నాడు? లార్డ్ అతన్ని ఎందుకు గౌరవించలేదు?

‘అతను పాపం చేశాడు!’ ‘పాపం అంటే?’

‘అతను శాపగ్రస్తుడు’. ‘శాపం అంటే?’

ఇన్ని సందేహాలు, నరకం అక్కడి మంటలు సైతాను – ఎవరతను? అన్నీ సందేహాలే.

మేరీ గ్రే అతని కాలికి కట్టు కడుతూ భయపెడుతూ కథలు, దెయ్యాల కథలు చెప్పేది. ‘నీకు తెలుసా? ఈ ఇంట్లో దెయ్యాలు తిరుగుతున్నాయి’ అని అనేది. అతనితో కొన్ని గీతాలు పాడించేది.

సరైన మార్గంలో నడిచేవానికి
దేవుని ఆశీర్వాదం ఉంటుంది...
పాపుల దారిలో వెళ్ళని వారికి,
చెడు సావాసాలు చేయనివారికి...

23వది లార్డ్ నా కాపరి - నేను కోరేది లేదు
నన్ను పచ్చని పొలాలవెంట తీసుకువెళ్ళాడు-
సెలయేటికీ దారిచూపుతాడు-


అంతలో గ్రే దీపం ఆర్పేసింది. నిజానికి ఆమె పిల్లవాడికి దగ్గర్లోనే ఉండాలి. కానీ చీకట్లో చల్లగా జారుకుంటుంది, ప్రక్క గదిలోకి. అతనికి ఆమె వెళ్ళిపోయినట్లు తెలుసు. మెల్లిగా మంచం దిగి కిటికీ దగ్గరకు చేరతాడు. బైట చీకటిని చూసి భయపడతాడు. స్కాట్‌లాండ్ మొత్తం దయ్యాలు తిరుగుతున్నట్లు భీతిచెందుతాడు. ఆ యింటి దగ్గర్లో ఒక స్మశానవాటిక కూడా వుంది. అక్కడే సైతాను, దేవుడు వున్నాడని భావిస్తాడు. ఆ అంధకారంలో అరిష్టాలన్నీ తనకు చుట్టుముడుతున్నట్లు భయపడతాడు. చివరికి చలి భరించలేక పక్కమీద చేరి కప్పుకుని, ముసుగులో ముడుచుకుంటాడు.

గ్రే చాలా కఠినాత్మురాలు. అమ్మ ఒకరకం పిచ్చిది. ఒకరోజు జార్జిని పట్టుకుని, "ఒరే కుక్కా, నీకు నాన్న లక్షణాలన్నీ వచ్చాయి. చెడ్డవాడివి" అని తిట్టింది. మరొకసారి, "నీ కళ్ళు కెప్టెన్ కళ్ళలాగా మెరుస్తున్నాయి" అని, "నీకు గోర్డాన్‌ల రక్తం ఉంది. ఆ వంశంలోనుంచి వచ్చావు అది గుర్తుంచుకో" అని బోధించింది. "వాళ్ళందరూ ఎంతో శక్తిమంతులు నాయకత్వం (పెత్తనం) చలాయించినవారు" అనికూడా అంటుంది.

కానీ గ్రే దాది, గోర్డన్ల చరిత్ర విప్పుతుంది. ఎవరు హంతకుడు, ఎవరు నదిలో మునిగిపోయారో, ఎవర్ని రక్షించారో, ఎవరు ఉరికంబం పాలయ్యారో అన్నీ అతని బుర్రలో వేస్తుంది. "కెయిన్ లాగానే వాళ్ళందర్నీ సైతాను తీసుకుపోయాడు" అనికూడా బైబిల్‌ను ఉటంకిస్తుంది.

బైరన్‌ల వంశం గురించి అమ్మ ఎక్కువగా చెప్పదు. కాని అతనికి తెలుసు. ఇంగ్లాండు మధ్యలో, ఏదో పురాతన భవనంలో వికెడ్ లార్డ్ ఉండేవాడని, అతని కుటుంబం చాలా చరిత్రగలదని, అందులో వీరులు, నాయకులు వుండేవారని.

అసలు 'బైరన్' పేరుండటమే తన గొప్పతనమని, తనతోటివారి బలమైన కాళ్ళకంటే తన అవిటికాలుతోనైనా 'బైరన్' పేరు ఎక్కువ శక్తిగలదని నమ్మాడు.



ఒకరోజు రాయితో పక్షిని కొడితే అది చిన్నపిల్లకు తగులుతుంది. చుట్టూ వున్నవాళ్ళు క్షమాపణ అడగమంటారు.

"మీకు తెలుసా! నేను "బైరన్ వంశస్థుణ్ణి" అని కోపంతో ఊగిపోతాడు. ఒక గంట తర్వాత తనంతట తానే అమ్మాయికి మిఠాయిలు తెచ్చిస్తాడు!

అయిదు సంవత్సరాలలోపే బడికి పంపుతారు. ఆ ఇంటికి దగ్గర్లోనే. పంతులు పేరు బోవర్స్. అతన్నే 'బోడ్స్' అని కూడా అంటారు. అది ఒక గది బడి. నేలంతా గుంటలు పడి వుంటుంది. "దేవుడు మనిషిని 'చేశాడు', మనం ఆయన్ను ప్రేమించాలి" అని నేర్పుతారు.

బైరన్‌కు జ్ఞాపకశక్తి ఎక్కువ. మొదటిరోజునే మొదటి పుట గుర్తుంచుకుంటాడు.

ఆ రాత్రి అమ్మకు అప్పగిస్తాడు కూడా. తర్వాత పుటలో ఏముందో తెలియదు. "దేవుడు సైతాన్ను సృష్టించాడు. సైతానంటే పాపం," ఇవే బడిలో చెప్పే పాఠాలు.

శ్రీమతి బైరన్‌కు ఈ చదువు నచ్చక పిల్లవాణ్ణి ప్రైవేటుగా చదివిస్తుంది. అందుకు ఇద్దరు ప్రొఫెసర్లను నియమిస్తుంది. అందులో ఒకరి పేరు 'రాస్'. ఈయన కుర్రవాని చురుకుదనం గ్రహించి వెంటనే, చరిత్ర పాఠాలు చెపుతాడు. జార్జి బైరన్, రోమన్ చరిత్ర అంటే చెవి కోసుకునేవాడు. 'రేగిల్లసు సరస్సు' యుద్ధాల గురించి ఎన్నోసార్లు చదివాడు.

రెండో ప్రొఫెసర్ పాటర్‌సన్. ఈయన లాటిన్ పాఠాలు నేర్పుతాడు. మతపరమైన చదువు కూడా నేర్పాడు. "మనందరం పాపులం! పుట్టుకతోనే మొదటి పాపం చేసినవాని సంతానం మనం" అయినా జీసస్ క్రీస్టు సహాయంతో మళ్ళీ మళ్ళీ పునీతులు కావచ్చు. అట్లా కానివాడు శాశ్వతంగా నరక కూపంలో ఉండిపోవాలి."

ఈ బోధనలు ఏడేళ్ళ కుర్రవాణ్ణి, ఆలోచనల అగాథంలో పడవేశాయి. తానెటు ఉన్నాడు? ఎవరితో ఉంటాడు? జీసస్ క్రీస్టు పరివారంతోనా? సైతానుతోనా?

ఎలా తెలుస్తుంది? తన వంశ చరిత్ర గోర్డాన్లు, బైరన్లు అందరూ పాపులేనా?

ఈ ఆలోచనలతో అతని రక్తం ఉడికిపోయింది. గుండెల్లోంచి ముఖంలోకి నెత్తురు ఉరకలెత్తింది. ఏమిటి జరుగుతోంది – తనలో ప్రమాదకారి జన్యువు

లున్నాయా? తనను అనువంశిక హింసాత్మక ప్రభావం ఆవహించి వుందా? ఎలా తెలుస్తుంది? ఒక్కోసారి చాలా మంచిగా మార్దవంగా వుంటాడే – ఇదంతా భయం కొల్పుతోంది. ఏది నిజం?!

అతని చురుకైన ఆలోచనలు – 'ఫ్రెంచ్ తిరుగుబాటు' తాలూకు పర్యవసానాలన్నీ పరిగణనలోకి తీసుకుంటున్నాయి. దాని ప్రభావం స్కాట్ ప్రజలను రెండుగా చీల్చింది. ముఖ్యంగా అబర్డీన్ చితికిపోయిన సామంతులు – ఫ్రెంచ్ ప్రజలతోనే వున్నారు. ఇంగ్లాండు ప్రజాస్వామ్యపు డెమోక్రాట్లతోనే ఈ సానుభూతిపరులు, శ్రీమతి బైరన్ ఈ కోవకు చెందినదే.

తల్లిమాదిరే యువ బైరన్ కూడా ఇప్పుడు తనంత తానే చదువుకో గలుగుతున్నాడు. ఇతను ప్రజలపక్షానే! పుస్తకాల దుకాణదారు బ్రౌన్ – బైరన్‌కు కొత్తకొత్త పుస్తకాలు అద్దెకు ఇస్తున్నాడు! శ్రీమతి బైరన్ డబ్బుకు ఇబ్బంది పడుతూ కూడా ఈ సంచార గ్రంథాల కోసం చెల్లిస్తుండేది.

ఆ వయస్సులోనే రోమ్, గ్రీస్, టర్కీ చరిత్రలు తీసుకురమ్మని అమ్మను పోరేవాడు. తన తాత రాసిన 'నౌకా విధ్వంసం' కథనాన్ని చదివి వణికిపోయాడు. తన చుట్టూ ఇప్పుడు యుద్ధం జరుగుతున్నట్లుంది. అందరూ యుద్ధానికి సన్నద్ధమవుతున్నారు. ఈ సైనికపరమైన కీర్తి కండూతి అతని చిన్నారి బుద్ధికి ఒక స్వప్నంలా పట్టుకుంది!

"ఇవ్వాళో–రేపో లేదా ఏనాడైనా ఒక సైనిక పటాలన్ని తయారుచేస్తాను. నల్లని దుస్తుల్లో నల్లని గుర్రాలమీద వస్తుంటారు. వాళ్ళని 'బైరన్ బ్లాక్స్' అని అంటారు. వారి వీరగాథలు వింటారు – మీరు" అని చెప్తుండేవాడు సహాధ్యాయులకు!

1794 సంవత్సరంలో ఒకరోజు శ్రీమతి బైరన్ ఇరుగు పొరుగు వాళ్ళతో టీ తాగుతుండగా ఒక వార్త తెలుస్తుంది. తన బావగారి కొడుకు చనిపోయాడని. ఆమె ఆశ్చర్యపోతుంది. అంత చిన్న వయస్సులో ఎలా చనిపోయాడా అని; అంతకంటే ఆశ్చర్యం తన కుమారుడు ఇప్పుడు 'న్యూస్టెడ్' ఎస్టేటుకు వారసుడవుతాడుగా – ఈ విషయం ఇంత ఆలస్యంగా తనకు చెప్పటమేమిటని. అయినా ఇది నిజమే! లార్డ్ బైరన్ కుమారుడు కార్సికాలో చనిపోయాడు.

ఇప్పుడు తన కుమారుడు వారసుడుగా కాబోయే 'న్యూస్టెడ్' ఎస్టేటులో తన బావ అదే ఆట పడవలతో తన నౌకరుతో యుద్ధం చేస్తాడు. వంటిమీద కీటకాలు పాకించమంటాడు. అతనే ఇప్పుడు న్యూస్టెడ్‌లో వున్నాడు!

కాని అతనికి ఈ అబర్డీన్‌లో ఉండే బైరన్ వారసుడంటే చాలా చిన్న చూపు – తన చావుకోసం ఎదురుచూసే ఈ అమ్మా కొడుకులను ఎగతాళి చేస్తుంటాడు.

ఇలాంటి పరిస్థితిల్లో తన వదిన 'లీ'కి ఉత్తరం రాస్తుంది శ్రీమతి బైరన్.

"ఇలాగేనా, భవిష్యత్తు బైరన్ వారసుణ్ణి పరిగణించేది? కనీసం ఈ వార్తయినా తనకు అధికారికంగా తెలియజేయలేదు. లార్డ్ బైరన్‌కు కనీస మర్యాద లేదా? కాబోయే వారసునికి అర్హమైన చదువు చెప్పించాలికదా?"

కాని లార్డ్ బైరన్ క్రూరమైన ఆనందాన్ని పొందటానికి అలవాటు పడ్డాడు – "ఆ కుంటి కుర్రవాడా? నా చావుకోసం ఎదురు చూస్తున్నాడా?" ఫ్రాన్స్ నుంచి తన చెల్లెలు రాసే ఉత్తరాలు బుట్ట దాఖలు చేశాడు. తన వంటిమీద కీటకాలు, బొద్దింకలు పాకించమంటూ వంశ కీర్తిని ఆస్తిని ఆర్పే పనిలో ఉండిపోయాడు. 'బైరన్' వారసత్వం నాశనం చేయటమే పనిగా పెట్టుకుంటాడు!

ఎన్ని ఆశలు పెట్టుకున్నా ఉపయోగం లేకుండాపోయింది. చిన్న బైరన్‌ను చివరకు అబర్డీన్ గ్రామర్ స్కూల్లో చేర్పించింది.

ఈ గ్రామరు స్కూలు ఒక పాకలో ఉంది. దాని చరిత్ర చాలా పురాతనమైనది. 1256 నుంచి నడుస్తోంది. లాటిన్ రోజుకు, అయిదు గంటలు బోధిస్తారు. అక్కడి విద్యార్థులు చాలా పేదవారు. వారానికి ఒక పెన్నీ పాకెట్‌మనీ! అటువంటి వాతావరణంలో, మన బైరన్ కుర్రవాళ్ళకు ప్రేమపాత్రుడుగానే వున్నాడు. తన అవిటితనం అడ్డు రాకుండా తన ప్రేమ, కోపంతోనే వాళ్ళను జయించాడు. ఒక దెబ్బ కొట్టేవాడేగాని, తినేవాడుకాదు!

ఒకసారి ఒక కుర్రవానితో పేచీవస్తే ఎక్కువసేపు నిలబడే శక్తి లేక (తన అవిటితనంతో) "మనం మరొకసారి కలిసి తేల్చుకుందాం" అని, తర్వాత వారంలో అతన్ని దారిలో ఆపి తను మునివేళ్ళమీద నిలబడి చితుచేస్తాడు.

ఇంటికి వెళ్ళిన తర్వాత గ్రే అడుగుతోంది – 'ఎందుకు అంతగా అలసిపోయా'వని!

"నేను బైరన్ వారసత్వంలోనివాణ్ణి – ఇచ్చిన మాట నిలబెట్టికోవాలి కదా. ఇది 'క్రీడ్ బైరన్'!" అంటాడు. అతనికి తెలుసు ఏదో ఒకరోజు న్యూస్టెడ్‌కి 'లార్డ్' తనేనని!

ఒకరోజు తన తల్లి పార్లమెంటు రిపోర్ట్ చదువుతుంటుంది. అక్కడ వున్న స్నేహితులంటారు, "మేము బైరన్ ఉపన్యాసం పార్లమెంటులో వింటాంకదా" అని. కాని బైరన్ "నేను House of Lordsలో ప్రసంగిస్తాను" అంటాడు!

చాలా తెలివికల పిల్లవాడు, కాని కష్టపడేతత్వం లేదు. బడిలో చదివేదికాక అతనికి విడిగా ఫ్రెంచి, చేతిరాత చెప్పేవాళ్ళు. వీటిని అంతగా పట్టించుకునే వాడు కాదు. కానీ తనతోటి వాళ్ళకంటే చాలా ఎక్కువ చదివేవాడు. మామూలుగా అల్లరి చేసే బైరన్ తినేప్పుడు పడుకునేముందు ఎప్పుడు చదవాలనిపిస్తే అప్పుడు ఎక్కువగా చదివేవాడు. అయిదేళ్ళ వయసునుంచే అన్ని రకాల పుస్తకాలు నమిలేశాడు. ముఖ్యంగా బైబిల్, అందులోని తూర్పు దేశాల వివరాలు అతన్ని ఎంతో ఉత్సాహపరిచాయి. 'వెయ్యిన్నొక్క రాత్రి' డాక్టర్ మూర్ రాసిన 'జలూకో'! అది చాలా గొప్ప నవల. ఈ 'జలూకో' నాయకుడు. బైరన్‌ను చాలా ఇబ్బంది పెట్టాడు. తనకు లాగానే చిన్నపుడు తండ్రి చనిపోతాడు. తనలాగే హింసాత్మక వ్యక్తిత్వం కలవాడు. ఒక అనాథగా కోపంతో రగిలిపోయాడు. కాస్త రెచ్చకొడితే మండిపోతాడు. 'జలూకో' ఒక పిచ్చుకను పెంచుతాడు. దాన్ని చాలా ప్రేమిస్తాడు. కొన్నాళ్ళకు దాన్ని చంపివేస్తాడు.

'జలూకో' పెరిగి పెద్దవాడవుతాడు. తన కొడుకునే పీక పిసికి ప్రాణాలు తీస్తాడు. ఈ కథ బైరన్‌ను చాలా ఉత్సాహపరిచింది. కలిచివేసింది. తానుకూడా 'జలూకో' లాగా మారతానా అని భయపడుతూ ఆనందించేవాడు. నిజానికి గోర్డాన్ల వంశంలో ఇలాంటి వాళ్ళున్నారు కదా!

తనకు జర్మన్ నేర్పే గురువు, 'ఏబెల్ మరణం' పుస్తకం చదవమంటాడు. ఇది తాను చదివిన 'కెయిన్' కథకు కొనసాగింపే. ఒక చెడ్డవాణ్ణి చంపడం, ప్రపంచానికి మేలు చేయటానికి తప్పు కాదని వాదించుకుంటాడు.

కాని 'కెయిన్' సమస్య అతన్ని ఇబ్బంది పెట్టింది. చిన్న వయసు అమాయకత్వం, ఈ పాపులను 'పాపం' అనుకునేట్లు చేసింది. అసలు దేవుడు 'కెయిన్'తో సోదరుణ్ణి హత్య ఎందుకు చేయించాడు? అసలు తనకు ఈ ఆలోచనలను దేవుడు ఎందుకు కలిగిస్తున్నాడు? నరకంలోని ఎర్రని మంటలు కనపడేవి! ఎంతగానో ఊహాలోకంలో సంచరించేవాడు. తాను చదివిన కథలను మరికొంత కలిపి సహాధ్యాయులకు చెప్పేవాడు, ఎంతో నేర్పుతో.

ఒకసారి, చలికాలం – మంచులో ఇరుక్కుపోయి అందరూ కూర్చున్నపుడు వాళ్ళకు 'అరేబియన్ నైట్స్' కథలు చెప్పాడు. దెబ్బతో చలి ఎగిరిపోయింది!

1796లో స్కార్‌లెట్ జ్వరం వచ్చినపుడు పచ్చని పొలాల మధ్యకు తీసుకు వెళ్ళింది అమ్మ. అక్కడ స్కాట్‌లాండ్ – హైలాండర్లు అతన్ని ఎంతగానో ఆకర్షించారు. మంచు – పొగమంచుతో కప్పిన పర్వతాలు 'లోష్‌న్‌గర్' శిఖరం మంచు మబ్బుల్లోంచి అందంగా దర్శనమీయటం – ఇవన్నీ ఆనందించాడు – రాళ్ళమీద జలపాతం దగ్గర నడవటానికి ఇష్టపడేవాడు. ఒక రాతిమీద నుంచి మరో దానిమీదకు దూకేవాడు. తన అవిటితనం ఎంతవరకు వీలు కల్పిస్తుందో అంతమేరకు. ఇవన్నీ విచ్చలవిడిగా తిరిగిన గోర్డాన్ల గొప్పతనపు ఊహ అతన్ని ఉత్సాహపరిచేది.

తనంతట తాను హైలాండర్ గళ్ళ దుస్తులు వేసుకుని తనుకూడా 'స్కాట్' లాగానే ఫీలయ్యాడు. ఆ వయస్సులోనే ఒక రైతు కూతురు, ఇతన్ని ప్రేమ భావానికి లోను చేసి, ఈ లోయలో కట్టిపడవేసింది. ఆమె పేరు 'మేరీ'. పొడవాటి ఉంగరాల జుట్టు. అమ్మాయి ముందుంటే ఏదో తెలియని ఉత్సాహం అతనిలో నిండిపోయింది.

తొమ్మిదేళ్ళకే మరొకరి సన్నిధిలో తెలియని ఆనందాన్ని పొందవచ్చని గుర్తించాడు.

అబార్డీన్ తిరిగి వచ్చి తన మేనకోడలు 'మేరీ డఫ్' ప్రేమలో పడ్డాడు. లేడికళ్ళు, నల్లని బ్రౌన్ జుత్తు అతన్ని ఆకర్షించాయి. ఆమె వంపుసొంపుల్ని ఆరాధించాడు. ఆమెతో కలిసి నడవటం మాట్లాడటం మెత్తగా ముట్టుకోవటంలో తెలియని ఆనందాన్ని పొందాడు.

నిద్రపోలేక, ఆకలి లేక, 'మేరీ మేరీ' అంటూ కలవరించాడు.

ఆమె నుంచి దూరమయినప్పుడు మేరీకి ఉత్తరం రాయమని అమ్మను పోరాడు. అతని బాధ పడలేక ఆ ప్రేమలేఖ ఆమె రాసిపెట్టింది!

ఎంతగా ప్రేమించేవాడు - అంతగా సిగ్గుపడేవాడు. తన అవిటితనం గుర్తుకువస్తే మరింత కుంగిపోయేవాడు. ఎక్కడైనా దాక్కోవాలని ఆశించేవాడు. అసలు మాయమైపోతే! సెంటిమెంటల్ – మృదుస్వభావి – పగటి కలల్లో తేలిపోతూ ఒక్కసారిగా కారణరహితంగా హింసాత్మకుడిగా మారిపోయేవాడు! చాలా సమయం మౌనంగా వుండి ఒక్కసారిగా క్రూరకర్మకు, హింసించటానికి సిద్ధమయ్యాడు. ఒకరోజు భోజనాల బల్లదగ్గర కత్తి తీసుకుని ఛాతీ మీద గట్టిగా వత్తుకున్నాడు. అమ్మ భయపడిపోయింది!

ఈ వింత ప్రవర్తనకు మూలాలు ఎంత వెతికినా తెలిసేదికాదు. తన జ్ఞాపకాల నుంచి తన బాధల్లోంచి ఇవన్నీ తన్నుకు వస్తున్నాయా?

తనకు పదేళ్ళ వయసులో తన పెదనాన్న 'వికెడ్ లార్డ్' చనిపోయినట్లు వార్త వచ్చింది. 'న్యూస్టెడ్' నుంచి 1798లో ఒకరోజు. ఏ పాపకూపపు నరకంలో మంటల వలయంలో కాలిపోవటానికో వెళ్ళిపోయాడు!

పదేళ్ళ జార్జి గోర్డాన్ బైరన్ ఆరవ 'బారన్' గా అవతరించాడు. అప్పుడు అద్దం దగ్గరకు పరుగుపెట్టి "అమ్మా! నాలో ఏమైనా మార్పు చూస్తున్నావా?" అని అడుగుతాడు. "నాకేమీ కనపడటంలేదే' అనికూడా అంటాడు.

మర్నాడు పాఠశాల పాకలో పంతులు హాజరు పట్టీ పిలుస్తున్నాడు. ఇప్పటివరకూ 'బైరన్' అనేవాడు ఇప్పుడు 'డోమినస్ డి బైరన్' అని పిలిచాడు. 'ఎస్ సర్' అని నోట మాట రాక కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యాడు.

ఇప్పుడు అబర్డీన్ విడిచిపెట్టాలి. తన ఆస్తిపాస్తులను 'న్యూస్టెడ్' ఎస్టేటులో, తన వారసత్వాన్ని సొంతం చేసుకోవాలి! 1798 ఆకురాలు కాలంలో శ్రీమతి బైరన్ తన కూమారుణ్ణి తీసుకుని మేరీ గ్రే తో సహా న్యూస్టెడ్‌కు బయలుదేరింది. ఇంటిలో సామాను అమ్మివేయగా ఈ రాజకుమారుని రాజమాతకు 74 పౌండ్లు 17 షిల్లింగులు 7 పెన్నీలు మిగిలింది!

IV

చిన్నారి లార్డ్ బైరన్

(1798-1801)

ముగ్గురు యాత్రికుల్లో, ఈ ప్రయాణంలోని కొత్తదనాన్ని, ఆనందాన్ని ఆస్వాదించగలిగింది చిన్న బైరనే! అతని చురుకుదనం, తెలివి, ఈ ప్రయాణంలోని ప్రతి వివరాన్ని చూడగలిగేట్లు చేసినాయి. స్కాట్‌లాండ్ పరిసరాలన్నీ నదులు, సెలయేర్లు, అడవి పొదలు, తరువాత ఇంగ్లాండు అడవులు మైదానాలు అన్నీ వివరంగా చూశాడు. 'లెవెన్' నది ప్రక్క నుంచి వెళ్తుండగా శ్రీమతి బైరన్ కుమారునికి, రాణి మేరీ తప్పించుకుని వెళ్ళిపోయిన కథ చెప్పింది. ఆమెకూడా స్టూవర్ట్ రక్తవంశీకురాలేకదా. అంటే బైరన్ తను ఇప్పుడు లార్డ్ బైరన్! బైరన్ వంశపు ఎస్టేటు ఆస్తులకు వారసుడు. అవన్నీ తనకే సంక్రమించబోతున్నాయి. రాజప్రసాదాలు, తోటలు, వనాలు, అక్కడి సేవకులు అందరూ తనవారేనన్న మాట! అక్కడి గ్రామ ప్రజలు తనను గౌరవిస్తారు. ఇది అరేబియన్ కథలాగే వుంది!

నాటింగ్‌హామ్ ఇంకా కొంత దూరం వుందనగా, షేర్‌వుడ్ అడవిలో ప్రవేశించారు! అక్కడ 'న్యూస్టెడ్' ప్రవేశానికి రుసుము కట్టాలి! ఈ ముగ్గురు యాత్రికులను టోల్ దగ్గర ఆపారు!

వారిముందు చాలా విశాలమైన సింధూర, దేవదారు చెట్ల అడవి కనబడుతోంది. ఇవన్నీ 'వికెడ్ లార్డ్' గొడ్డలికి బలికాలేదు! శ్రీమతి బైరన్‌కి తామెక్కడ వున్నారో అవగాహన కాలేదు! అయినా టోల్ వసూలు చేసేవాణ్ణి

లోపలి భవనం ఎవరిదని అడిగింది. ఆ యజమాని 'లార్డ్ బైరన్' అని, ఇటీవలే చనిపోయాడని చెప్తాడు! అయితే వారసుడెవరు? అని అంటుంది. 'అబర్డీన్‌లో కుర్రవాడు వున్నాడని విన్నాం అంటాడు. 'ఇతనే ఆ కుర్రవాడు ఆశీర్వదించు' అంటుంది గ్రే. అలా అంటూనే మోకాళ్ళమీద వంగి అతన్ని ముద్దుపెట్టుకుంటుంది!

ఆ విధంగా ఆ అడవిలో ప్రవేశించి కొంత దూరం చెట్ల మధ్యలో నుంచి విశాల ప్రదేశంలోకి వస్తారు. వారి దృష్టిలోకి 'న్యూస్టెడ్' భవనం వస్తుంది. అదీ ఒక చెరువు అంచున. సగం పైగా గుర్రపు డెక్కతో నిండిపోయి వుంది. అక్కడ గోతిక్ ఆకారంలో 'అబ్బె' ఒకప్పటి మఠం. ఇప్పుడు బైరన్ వంశానికి భవనం, నిలబడి వుంది. ఉదారంగు ఆకాశం క్రింద – ఉదారంగు రాళ్ళతో కట్టబడి వుంది. ప్రశాంతంగా వున్నట్లు కనపడింది.

అందరి చిన్నవాళ్ళలాగానే బైరన్ తన ఊహాలోకంలో చాలా పెద్ద భవనాన్ని కట్టుకున్నాడు. అందులోనే నివసిస్తూ ఈ సామ్రాజ్యాన్ని ఏలాలని ఆశించాడు. ఈ న్యూస్టెడ్ అతని స్వప్నాన్ని మించి ఉన్నట్లుంది!

బండి ఆగిన తర్వాత ఇద్దరు ఆడవాళ్ళు దిగారు. అప్పుడక్కడ వున్న ముసలి సేవకుడు వాళ్ళకు దగ్గరగా వచ్చాడు. అతని పేరు జో ముర్రే! ఆ తర్వాత ఆ భవనాన్ని పరీక్షగా చూశారు! వీరికి ఆశ్చర్యం విచారం రెండూ కలిగాయి. అది పూర్తిగా శిథిలమైపోయింది. పైనుంచి క్రిందిదాకా చివరి ఫ్లోరింగ్ కూడా గుంటలు పడిపోయింది. సంవత్సరాల తరబడి బాగుకు నోచుకోలేదు. అక్కడ పేరుకున్న దుమ్ము, శుభ్రం చేయటానికి వీలు లేకుండా అతుక్కుపోయింది.

సేవకులు, చనిపోయిన బైరన్ నిర్లక్ష్యాన్ని ఏకరువుపెట్టారు. మన చిన్నారి బైరన్ శ్రద్ధగా విన్నాడు. ఈ కథ అతనిలో నరాలన్నిటిమీదా అంతర్గతంగా ఏవో శబ్దాలను మీటుతోంది. అప్పుడే 'చావర్తు'తో ఎలా కత్తి యుద్ధంచేసి, అతని పొట్టలో కత్తి దింపిందీ, అదే అప్పటి న్యాయంలాగా చెప్పారు. ఆ మేరకు ఇక్కడి నుంచి చావర్తుల భవనానికి దారి, పూల దారి, పెళ్ళి బాట చూపించారు! అప్పుడు కీటకాల గురించి చెప్పారు. ఆయన చనిపోయిన తర్వాత కీటకాలన్నీ తరలి వెళ్ళిపోయాయి, 'తమ యజమాని లేదని గుర్తించినట్లు'. ఒకప్పుడు ఈ హాలంతా కీటకాలతో నిండి వుండేది నల్లగా. ఎలాంటి వంశం ఇది! ఎంతటి దుర్మార్గం

వుంది! అయినా ఎంతటి మార్మికత వుంది! ఇదంతా ఇప్పుడు తనదే అనుకున్నాడు బైరన్. చాలా శ్రద్ధగా విన్నాడు.

అప్పుడే ఆ ముదుసలి సేవకుడు, ఇదిగో ఇక్కడ చూడండి, ఈ గదిలో దెయ్యం తిరుగుతుంటుంది. అదికూడా ఇక్కడనుంచి తరిమేయబడిన 'సన్యాసి ప్రేతం' అంటున్నాడు. అదీ మఠం. అదీ వంటశాల. ఈ గోడమీద కనపడుతోందే బొమ్మ, గతంలో అది రాబర్ట్ బైరన్. క్రూసేడ్‌లో చనిపోయిన యువకుడు.

చిన్నారి బైరన్‌కు ఇక్కడి ఆస్తిపాస్తులకంటే ఈ బైరన్ సాహసపు వారసత్వం ఎక్కువ సంక్రమించిందని అనుకుంటున్నాడు. దానితోపాటు రాగి జుత్తు ఊదారంగు కళ్ళు ఇవే నిజమైన వారసత్వ లక్షణాలుకదా!

ఈ మొదటి న్యూస్టెడ్ పరిచయాలు అతన్ని, న్యూస్టెడ్‌కు ఈ ఎస్టేట్‌కు కట్టిపడవేసింది. అదీ 'మేరీ డఫ్' ప్రేమలాగా.

సేవకుడు ముర్రేతో కలిసి అక్కడి సెలయేళ్ళ, చెట్ల వరుసలు, లతల్లోని గోడల వరసలు, సరస్సులు అన్నీ తిరిగాడు.

అక్కడే అతను ఒక సింధూరపు మొక్క నాటాడు. అదే తన అదృష్టం అన్నాడు. అదృష్టానికి ప్రతీక అనుకున్నాడు. దాని చిరు కొమ్మలే తన నుదుటి రాతను దిద్దుతాయి అనుకుంటాడు.

బైరన్ అక్కడే సంతోషంగా నివసించేవాడే కాని, అమ్మ ఇది నివాస యోగ్యంగా లేదు. దీనిని బాగుచేయించటానికి చాలా సొమ్ము అవసరం. ఈ శిథిలాలలో కాపురం కుదరదు అని ఆలోచించింది. బైరన్‌కు రావలసిన ఆస్తిపాస్తులు 'ఛాన్సరీ కోర్టు' అజమాయిషీలో ఉంటాయి. తల్లిగా తనకు ఎక్కువ మొత్తం కూడా ఇవ్వరు. కేవలం ఈ చిన్నారి లార్డ్‌కు తల్లిగా 150 పౌండ్లు మాత్రం వస్తుంది. దానితోనే అన్నీ చక్కదిద్దాలి.

ఈ విషయాలన్నీ చూడటానికి లండన్‌లోని న్యాయవాది హాన్సన్, తనకు పరిచయమున్న న్యాయవాదికి వ్యవహారాన్ని అప్పగించింది. కొద్దిరోజుల తర్వాత న్యూస్టెడ్ వదిలి నాటింగ్‌హామ్‌కు వెళ్ళిపోయింది.

అక్కడ కాజిల్ దగ్గర్లో ఒక మారుమూల వీధిలో చిన్న ఇంటిలో చేరింది. ఇది తను వదిలి వచ్చిన అబర్దీన్ ఇంటికంటే గొప్పదేమీ కాదు.

నిజానికి బైరన్‌కు ఇది చాలా నిరాశ కలిగించింది. తన ఊహాలోకపు సౌధం పుచ్చకాయలాగా మారిపోయింది. ఈ అపరిచితమైన పరిసరాలు, అతన్ని మరింత కృంగతీశాయి. శ్రీమతి బైరన్ రాయల్ ఫెన్సిఫ్ కోసం చాలాసార్లు లండన్ తిరగాల్సి వచ్చింది. ఆ సమయంలో అతన్ని మేరీ గ్రే సంరక్షణలోనే వదిలింది. మేరీ గ్రే అంత నీతిమంతురాలు కాదు. లండన్ నుంచి హాన్సన్ ఈ 'యువ లార్డ్'ను చూసేందుకు వచ్చాడు. ఇప్పుడు ఇతన్నేకదా తను సంరక్షించాల్సింది. అతనికి ఈ కుర్రవాడు ఎంతగానో నచ్చాడు. ఇరుగు పొరుగు వారిని వాకబు చేశాడు. అవన్నీ విన్న తరువాత ఎంతో కోపగించాడు.

అక్కడ నుంచి శ్రీమతి బైరన్‌కు ఉత్తరం పంపుతాడు. "ఇక్కడ నేను విన్నది చూసింది, చాలా దారుణంగా ఉంది. మీ మేరీ గ్రే ఏమాత్రం సంస్కారం లేనిది. కుర్రవాణ్ణి నానా హింసలు పెడుతుంది. మీరు ఆమెను తొలగించకపోతే ఇప్పుడు నా క్లయింటు మిమ్మల్ని చూడటానికి కూడా ఇష్టపడడం లేదు" అంటూ వ్రాశాడు.

"మీ సేవకురాలు తాగుబోతు, తిరుగుబోతు. అలాంటిదాని సంరక్షణలో ఈ పిల్లవాణ్ణి, బైరన్ వంశపు వారసుణ్ణి వుంచటం ఏమాత్రం శ్రేయస్సు కాదు.

నేను ఇప్పుడు అతణ్ణి సంరక్షించాల్సిన అవసరం నా బాధ్యత. అతను చాలా చురుకుతనం కలవాడు. నా స్నేహితులు లార్డ్ గ్రాంట్‌లే, ఆయన సోదరుని పరిచయం చేశాను. అతను వుండవలసింది అటువంటివారి స్నేహంలో. ఈ చిన్నారి వారసునికి అన్ని సంరక్షణలు, అదీ గౌరవపూర్వకమైన పరిసరాలు, స్నేహితులను కల్పించవలసిన బాధ్యత నాది. అతనికి గొప్ప లక్షణాలున్నాయి. గ్రాహకశక్తి, మంచీ చెడు తీసుకోగలిగిన ఇంగితం పుష్కలంగా వుంది" అంటూ హాన్సన్ వ్రాశాడు.

అవును హాన్సన్ చెప్పింది సరైనదే. ఆ వయసులో బైరన్‌కు చాలా గొప్ప మేధోపరమైన శక్తులున్నాయి. కష్టాలతో గడిపిన జీవితం బహుశా తెలివితేటల్ని త్వరగా మేల్కొలుపుతుంది.

అన్నీ వున్న పిల్లలు మామూలుగా పెరుగుతారు. వారికి సంఘర్షణ వుండదు. వారికి తల్లిదండ్రులే సంరక్షణ. కానీ ఎప్పుడూ కొట్లాడే తల్లిదండ్రులతో పెరిగిన పిల్లలకు మంచీ-చెడుల జ్ఞానం త్వరగా వస్తుంది.

'మేరీ గ్రే' చెప్పినట్లు చెడ్డవారు నిప్పుల్లో కాలిపోతారని కదా! అదే నిజమైతే ఆమె కూడా అందుకు అర్హురాలేకదా! కానీ అలా జరగలేదు. అంటే అది అబద్ధమన్నమాట. అయితే ఈ జూదగృహాలు, తాగుడు కొంపలు ఇవన్నీ ఎందుకు పెట్టాడు దేవుడు?

దానిలో న్యాయం లేదు. ఏది నమ్మాలి?

తనకి లార్డ్‌షిప్ సంక్రమించిన దగ్గర్నుంచి, తన అవిటితనం చూసి అమ్మ విసుక్కుంటుంది. నాటింగ్ హామ్ నాటు డాక్టరు లావెండర్ అనేవాడితో సంప్రదించింది. వీడొక క్రూరుడు-

బలవంతంగా కాలును త్రిప్పి చెక్క ముక్కలతో కట్టుకట్టాడు. ఆ సమయంలో అమెరికన్ గురువుతో లాటిన్ నేర్చుకుంటున్నాడు. ఆయన పేరు డ్రమ్మర్ రోజర్! అతను జ్ఞాని. ఈ కనికట్లు చూసి చాలా బాధపడ్డాడు.

అప్పుడు 'వర్జిల్' సిసిరో పాఠాలు చెప్తున్నాడు. 'బాబూ! మీరిలా బాధపడుతూ ఆ చెక్కముక్కల్తో కూర్చుంటే నాకు చాలా బాధగా వుంది' అన్నాడు. 'గురువుగారు మీరు చెప్పండి. అలాంటి బాధ నాలో చూడరిక' అంటాడు.

హాన్సన్ లాగానే రోజర్ కూడా బైరన్‌ను ఎంతో ప్రేమిస్తాడు. బైరన్ వీలయినన్ని ఎక్కువ పాఠాలు చెప్పమని అడుగుతాడు.

లావెండర్ అనే నాటు వైద్యుడు యీ కుర్రవానితో బీర్ తెప్పించాడు. పాపం! ఆ కర్ర ముక్కల కట్లతో కుంటుతూ బీరు ఒలికిపోకుండా తేవటానికి ఎంతో కష్టపడ్డాడు. అప్పుడు తనకి రోజర్‌తో రాత్రిపూటదాకా చదువుకోవటానికి అమ్మను సమ్మతి అడుగుతాడు. ఆ విధంగా మేరీ గ్రే, లావెండర్‌లను తప్పించుకోవచ్చుకదా.

అంతేకాదు అతనికి వచ్చిన భాషల్లోని అక్షరాలను తిరిగమరగ రాసి లావెండర్ ముందు పెట్టి ఇది ఏ భాష అని అడిగాడు. "ఇది ఇటాలియన్" కదా

అని బుకాయించేవారు. అప్పటినుంచి ఈ అబద్ధాల కోరులను ద్వేషించడం మొదలుపెట్టాడు.

అది వారిపట్ల కఠినంగా వ్యవహరించే విధంగా మారింది.

చివరికి శ్రీమతి బైరన్ 'సివిల్ లిస్ట్' పెన్షన్ క్రింద మూడువందల పౌండ్ల సాలీనా పొందటానికి అర్హత సంపాదించింది. దీనితో ఆమె లండన్‌లో జీవించవచ్చు. జాన్ హాన్సన్, బైరన్ కోసం మంచి బడి వెతికాడు. చివరగా డూల్‌విచ్‌లో డాక్టరు గ్లెన్‌నీ అకాడెమీలో చేర్పించాడు.

అంతేకాదు, లార్డ్ కార్లైల్‌ను, బైరన్‌కు సంరక్షకునిగా ఉండమని కోరతాడు. అయితే లార్డ్ కార్లైల్‌కు, శ్రీమతి బైరన్‌కు సత్సంబంధాలు లేకపోవటం దురదృష్టం.

డాక్టరు గ్లెన్నీ, మన బైరన్ అంటే చాలా ఇష్టం పెంచుకున్నాడు. అతని తెలివితేటలేకాదు, అవిటివాడైనా స్కూలు మొత్తంలో ఆటల పోటీలలో అందరికంటే ముందుండాలని అతని పట్టుదల కూడా అతన్ని ఆశ్చర్యపరచింది. బైరన్‌తో సంభాషణే కొత్తగా వుండేది. అప్పటికే అతను అంత ఎక్కువ చదివాడు. బైరన్ అసలు సిసలయిన వ్యక్తిత్వాన్ని గుర్తించాడు. పద్యాలు చక్కగా చదివేవాడు. అందరి కవుల గురించి పరిచయం ఉన్నవాడు. ఆదివారాలు బైబిల్ గురించి మాట్లాడేవాడు ఎంతో ఇష్టంగా. స్కూల్లో సహాధ్యాయులు బైరన్ అంటే ఇష్టపడేవాళ్ళు. తన వంశం, బిరుదు అతనికి గర్వకారణం. తరచూ వీటిగురించే మాట్లాడేవాడు.

తన తల్లి ప్రవర్తన డాక్టర్ గ్లెన్నీని, లార్డ్ కార్లైల్‌ను చాలా ఇబ్బంది పెట్టేది. బైరన్‌పై అనవసరపు పెత్తనం చెలాయించేది. ఇది చివరకు లార్డ్ కార్లైల్‌ను ఎంత బాధించిందంటే, ఆయన గ్లెన్నీకి చెప్పేస్తాడు, ఇంక శ్రీమతి బైరన్‌తో తెగతెంపులు చేసుకుంటేనే తనకు మంచిదని. "మీ తిప్పలు మీరు పడండి" అని.

ఇలాంటి సంఘటనలు బైరన్‌ను చాలా ఇబ్బంది పెట్టేవి. తన తల్లిపట్ల వున్న అంతంత మాత్రపు మంచి అభిప్రాయం ఆమె కోపతాపాలు, కర్కశత్వం ఇవన్నీ చివరికి, ఆమెను ఇంకా మూర్ఖురాలిగా అతనికి దర్శనమిచ్చింది. అయినా తనకొక బాధ్యత వుందని గుర్తించాడు. కాని తన ప్రేమను పొందలేకపోతున్నదని బాధపడ్డాడు. మరీచిన్నతనంలో ఆమెను చూసి భయపడేవాడు. కానీ ఇప్పుడు

ఎదురు తిరిగి నిలబడ్డాడు. ఆమెకు కోపం వచ్చినప్పుడు అతని వెంటపడి ఇల్లంతా తరిమేది. ఇది చూసేవాళ్ళకు 'అరే, లావుపాటి ఈ స్త్రీ ఆ అవిటి గంధర్వుణ్ణి' తరమటం కాస్త హాస్యంగా ఉండేది.

స్కూలు సెలవుల్లో బైరన్ తన చిన్నప్పటి మార్గరెట్ పార్కర్‌తో ప్రేమ వ్యవహారం నడుపుతాడు. ఆమె నల్లని కళ్ళు, పొడవాటి కనురెప్పలు, చక్కని సున్నితమైన వంటి తీరు బైరన్ను మాయచేసేవి. అంతకంటే స్వచ్ఛమైన అందాన్ని చూసిన జ్ఞాపకంలేదు అనుకున్నాడు. ఆమె మృదుస్వభావం, అతని పరిస్థితికి ఎంతో ఊరటగా వుండేది. "ఆమె ఇంద్రధనుస్సులో నుంచి ఊడిపడినట్లు అంతా సౌందర్యమే. అంతా ప్రశాంతమే! ఇంక నాకు నిద్ర – ఆహారం కరువైపోయినాయి. నా గాఢమైన ప్రేమను వ్యక్తపరచటానికి కవితలు రాయడం మొదలుపెట్టాను. ఇంత సున్నితమైన, మృదువైన, ప్రశాంతమైన సౌందర్యం నా జీవితంలో ఎక్కడుందీ? – నా సహజ గుణాలకు అనుగుణముగా గాఢంగా నన్ను హత్తుకుపోయిన ఈమె, నా మనసును, అదే అశాంతిలో మరిగిపోతున్న హృదయాన్ని, ఎంతో సేదదీర్చింది."

అప్పుడు సెలవుల్లో శ్రీమతి (1801) బైరన్, చెల్టెన్‌హాంలో నివసించేది. జాతకాలు చెప్పే అప్పట్లో బాగా పేరున్నావిడను పిలిపించింది. ఆమె పేరు శ్రీమతి విలియమ్స్. ఆమె, "నీ అవిటి పుత్రుడు రెండుసార్లు పెళ్లి చేసుకుంటాడు. ఒకరు విదేశస్థురాలు. అతనికి రెండు గండాలున్నాయి. 27 సంవత్సరాలకు, 37 సంవత్సరాలకు". ఈ భవిష్యత్తు ప్రవచనం అతని చెవిలో పడి చాలా గాఢమైన ముద్రవేసింది.



క్యాథరిన్ గోర్డాన్
బైరన్ తల్లి



జాన్ బైరన్
బైరన్ తండ్రి



న్యూస్టెడ్ ఎస్టేట్

V

కొండ మీద కోట

(1801-1802)

బైరన్ తాహతుకు తగినట్లుగా పబ్లిక్‌స్కూల్‌లో చేర్చాలని నిర్ణయించారు. ఆ విధంగా 'హారో'ను ఎంచుకున్నారు. హాన్సన్, బైరన్‌ను అక్కడకు తీసుకువెళ్ళి చేర్పించాలని వుంది. అది లండన్‌కు అంత దూరంగా లేదు. ఒక కొండమీద ఇటుకరాళ్ళ భవనాల సముదాయంతో చెట్లమధ్య ఠీవిగా ఉంటుంది ఆ పబ్లిక్‌స్కూల్. అక్కడ నుంచి చూస్తే, కొండచరియలు, సెలయేరులు దాటి కనబడీ కనబడనట్లు లండన్ పట్నం దృష్టిలోకి వస్తుంది.

అప్పటికి బైరన్ పదమూడేళ్ళవాడు. ఈ పరిణామాలన్నీ అతనికి ఎంతగానో ఆనందాన్నిచ్చాయి. పబ్లిక్‌స్కూల్‌లో కొత్తగా చేరినవారికి చాలా భయంకరమైన కథలు తెలుస్తుంటాయి. ఒకటి స్కూలు క్రమశిక్షణ. రెండోది పై తరగతులవారి అరాచకాలు. తన లార్డ్ హోదాను ఇక్కడ ఎవరూ లెక్కచేయరు. మరి ఎలాంటి స్వాగతం తనకు లభిస్తుందో?

ఇప్పటికి పదిహేను సంవత్సరాలుగా ఈ స్కూలు ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ జోసెఫ్ డ్రూరీ – అప్పటికి ఆయనకు యాభై సంవత్సరాలుంటాయి. మంచి హృదయంకలవాడు. కఠినంగా వున్నట్లున్నా న్యాయ సమ్మతంగానే ప్రవర్తిస్తాడు. ఆయనకు అక్కడ చాలా మంచి పేరు వుంది. ఆయన హయాంలో స్కూలు ఎంతో అభివృద్ధి చెందింది. ఎప్పుడూ విద్యార్థులతో మాట్లాడుతూ, వారిని ఉత్సాహపరుస్తూ వారి హృదయంలో స్థానం సంపాదించాడు. "ఆయన కోప్పడినా మాకు ఆనందమే"

అంటారు వారు! హాన్సన్, బైరన్‌ను తీసుకువచ్చి ఈ డ్రూరే గారికి పరిచయం చేశాడు. "ఇప్పటివరకూ సరి అయిన విద్య లభించలేదు, కానీ, బైరన్ తెలివికలవాడు" అని కూడా చెప్పాడు.

ప్రధానోపాధ్యాయుడు హాన్సన్‌కి కృతజ్ఞతలు చెప్పి బైటవరకూ సాగనంపుతాడు. బైరన్‌ను తన గదిలోకి తీసుకువెళ్ళి నీ అలవాట్లు, చదువు, ఆటల గురించి చెప్పమని ప్రోత్సహిస్తాడు.

అతనికి చాలా త్వరగానే అర్థమయింది. దూకటానికి సిద్ధంగా ఉన్న సింహం పిల్లలా కనిపించాడు. కానీ అతని చూపులో తెలివితేటలున్నాయి అంటాడు! డ్రూరీ అనుభవం, బైరన్ వ్యక్తిత్వాన్ని త్వరగానే పట్టిస్తుంది. అతని బలం అతని వంశ పారంపర్యమే. అది ఒకరకమైన గర్వంతో కూడుకున్నదే. పొరపాటున తక్కువ తరగతిలో కూర్చోబెట్టకూడదని కొంతకాలం అతన్ని ఒక మాస్టర్ పర్యవేక్షణలో వుంచుతాడు. అతని వయసుకు తగిన తరగతిలో చేర్పించటానికి అన్ని ఏర్పాట్లు చేయిస్తాడు. ఇది బైరన్‌కు ఎంతగానో నమ్మకం కలిగిస్తుంది.

తొలిరోజులు అంత ఆనందకరంగా గడవలేదు. మూడువందల యాభైమంది విద్యార్థులలో, ఈ అవిటి కాలి కొత్త కుర్రవాణ్ణి ఆటపట్టించని వాళ్ళుంటారా? అతని కాలి మడమ ఎంతమాత్రము బాగుపడలేదు. ఇప్పటికీ ప్రత్యేకమైన బూట్లు వేసుకోవలసి వస్తోంది. లండన్‌లోని, షెల్‌డ్రేక్ కంపెనీ తయారు చేసిన బూట్లు పంపింది అమ్మ! ఒక్కోసారి ఉదయం లేచేసరికి అతని కాళ్ళు నీళ్ళలో పెట్టి ఉండేవి, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా. ఇది మౌనంగా భరించగలిగితే పేచీ వుండదు. కానీ అతను బైరన్‌కదా! చిన్ననాడే తండ్రి చనిపోవటంతో, మరొకరి పెత్తనాన్ని అంగీకరించటం అలవాటు లేదు. అతని ఆలోచనలలో ఎవరికీ తలవంచే బలహీనత అసలే లేదు. అతని వ్యక్తిత్వంలోని గర్వపు పార్శ్వం సహజంగానే తన గౌరవాన్ని కాపాడుకోవటం నేర్పింది.

అమ్మ నేర్పిన ఫ్రెంచ్ విప్లవం పై గౌరవాన్ని బోనపార్టి పట్ల ఆరాధనాభావం, అతన్ని ప్రజాస్వామ్యానికి ఒక సైనికునిలా మార్చింది. స్కూలుకు వస్తూనే 'ఫస్ట్ కాన్సుల్' 'బస్ట్'ని తీసుకువచ్చాడు. అక్కడి దేశభక్తుల దాడినుంచి దానిని కాపాడుతూనే వున్నాడు. అందరూ తనని ఎంత అణగతొక్కాలని ప్రయత్నించినా

అంతా! తిరుగుబాటుచేసి ఎదురు తిరిగాడు. భౌతికంగా కాస్త లావుగానే వున్నాడు. కానీ అతని శరీరం, ముఖ కవళికలు అందంగా వుంటాయి. అతను కళ్ళు నల్లగా కనుబొమ్మలు వత్తుగా వుంటాయి. అతని జుట్టు ఉంగరాలు తిరిగి పొడవుగా వుంటుంది. ప్రతి విషయంలో అతని అభిరుచి, తీవ్రమైన భావావేశం - చాలా ఉత్సాహవంతంగా వుంటుంది.


విద్యార్థి బైరన్

ఎక్కువగా కష్టపడినట్లు కనపడకపోయినా, ఒక్కోసారి, నలభై యాభై లాటిన్ వాక్యాలు రాసేవాడు. అతను పాఠాలు నేర్చుకోలేదు, కానీ అతని విస్తృతమైన గ్రంథ పఠనం అతనికి ఎంతగానో ఉపయోగపడింది. అతన్ని బద్ధకస్తుడనే అనాలి!

ఆ స్కూలు ప్రధానోపాధ్యాయుణ్ణి (డ్రూరేని) గెలవటంలోనే అతని విజయం ఉంది. డ్రూరేగారికి చాలా త్వరగానే అర్థమైంది! ఈ పోట్లగిత్తను చిన్న సిల్కు దారంతో ప్రేమగా పట్టుకోవచ్చుగానీ, ఎటువంటి మొరటు తాళ్ళు పనికిరావని! డాక్టర్ డ్రూరీ అలాగే బైరన్‌ను తన అధీనంలో పెట్టుకుని ఎన్నో విజయాలను సాధించాడు. బైరన్ ఎంతో ఇష్టంగా తన మాస్టరుకు కట్టుబడిపోయాడు. డా॥ డ్రూరీ బైరన్‌పై అధికారం చలాయించగల మొదటి వ్యక్తి! దీనిలో ఎంతో న్యాయం వుందని ఇరువురూ అంగీకరించారు! నిజానికి దీని అవసరం బైరన్‌కే ఎక్కువ వుంది. ఇంతవరకూ అతను ఏ వ్యక్తినీ విశ్వాసంలోకి తీసుకోలేదు. డ్రూరీ, బైరన్‌ను ఎంతో మెచ్చుకునేవాడు. ఈ మెచ్చుకోలు, పెద్దవాళ్ళలాగే చిన్నవాళ్ళకూ ఎంతో అవసరం ఉందని మాస్టర్‌కు తెలుసు.

లార్డ్ కార్లైల్ ప్రధానోపాధ్యాయుణ్ణి, తరచూ వచ్చి, తన శిష్యుని గురించి వివరాలు చెప్పమని కోరేవాడు.

"బైరన్‌కు చాలా ప్రతిభ వుంది. మైలార్డ్! అతని హోదాకి అది మరింత వన్నె తెస్తుంది!" అని చెప్పేవాడు. "అలాగా..." అని లార్డ్ అంటాడు. ఆ విధంగా మాస్టరే అతన్ని అభిమానించినపుడు ఇక అతని సహాధ్యాయులు అందరూ అతనికి

Byron

లొంగిపోయారని చెప్పవచ్చు. అతని ప్రభావం వింత శక్తిగలది. అతని మాట ఎంత సూటిగా వుండేదో – అతని చేతులు కూడా అంత నిబద్ధతతోనే వుండేవి. ఎలాంటి లేకితనం లేదు. అతనికి అబద్ధం చెప్పటం కూడా తెలీదు! దేనితోనైనా పోరాటానికి సిద్ధపడేవాడు. అంతేకాదు అందులో చాలా ఆనందాన్ని పొందేవాడు! అతని ప్రవర్తనలో ఏదో ధైర్యం తొంగిచూసేది. తనలాగే కాస్త కుంటుతున్న చిన్నవాడు విలియం హార్నెస్ అనే కుర్రవాడంటే అతనికి చాలా ఇష్టం కలిగింది. హార్నెస్‌ని పెద్ద కుర్రవాళ్ళు ఇబ్బంది పెట్టటం గమనించి, “ఇదిగో, నిన్ను ఎవరైనా ఏడ్పిస్తే నాకు చెప్పు – వాడి పని నేను పడతాను” అని చెప్పేవాడు.

ఆ సమయంలోనే ‘రాబర్ట్ పీల్’ హారోలో చదువుతుండేవాడు. అతను అప్పటికే మంచి వక్త! అతన్ని చాలా ఇబ్బందిపెట్టేవాళ్ళు వెక్కిరిస్తూ. ఒకసారి అలాంటి సందర్భంలోనే అతనికి గుద్దులు పడుతున్నాయి. అక్కడికి బైరన్ వెళ్ళి అవతలి మొరటువాణ్ణి గెలవలేనని తెలుసుకుని, “ఎన్ని దెబ్బలు కొడతావు?” అని గట్టిగానే అరిచాడు. “నీకెందుకురా ఆ విషయం” అని సమాధానం. “అందులో సగం నేను తింటాను” అని స్థిరంగా అన్నాడు.

త్వరలోనే అందరికీ అర్థమైంది, ఈ బైరన్ అందరిలాంటివాడు కాదు అని. ఎన్నో ఆటలు ఆడేవాడు. అందులో ఎంతో బాగా ఆడేవాడు. తన అవిటి కాలు బాధ పెడుతున్నాకూడా. ఈత బాగా నేర్చుకున్నాడు. నీళ్ళలో అతని అవిటితనం కనబడేదికాదు. సహజంగానే చాలా ధైర్యవంతుడు, తిరుగుబాటుదారు. అందరి కుర్రాళ్ళనూ ముందుండి నడిపించాడు, అన్నిరకాల సాహసాలకు. ఆ విధంగా మాస్టరు చేతిలోని సిల్కు దారాన్ని తెంపే స్థితికి తీసుకువచ్చాడు. డా॥ డ్రూరీ చాలా విచారంగా చూసేవాడు. నిజానికి బైరన్‌కు చాలా బాధకలిగేది. కానీ ఏమిచేయగలడు – అతని దుడుకుతనం రక్తంలోనే వుంది. తన శక్తికి మించిన సాహసం అతడ్ని నిలబడనిచ్చేది కాదు. తన పూర్వీకుడు చెప్పినట్లు తన చేతిలో ఏదో ‘దుష్టశక్తి’ వుందేమో? ఒక్కోసారి తన చర్యలకు తనకే ఆశ్చర్యం వేసేది. ముఖంలోకి రక్తం వురకలు పెట్టేది. కొట్టేవాడు, పగలగొట్టేవాడు. ఏమి చేయగలడు – ఎలా ఆపగలడు – అతను బైరన్‌కదా!? మొదటి సంవత్సరం అంత బాగా నడవలేదు. మొదటిరోజుల్లో బాధపడ్డాడు. తర్వాత బాధపెట్టాడు. అతని స్థిరత్వం బైరన్‌ను మిగతా విద్యార్థులకంటే భిన్నంగా నిలబెట్టింది. త్వరగా అలసిపోయేవాడు.

అలాగే పగటికలలు కనేవాడు. ఈ లక్షణాలు అతన్ని ఏకాకిని చేశాయి. ఏదో పుస్తకం పట్టుకుని కొండలు గుట్టలు ఎక్కటం! అతన్ని తోటివాళ్ళు చూసేవాళ్ళు. లేదా చర్చిప్రక్కనున్న స్మశానవాటికలోకి వెళ్ళి, అదే 'హారో కొండ'మీద, అక్కడ ఒక సమాధి వుండేది చెట్టుక్రింద. అది ఎవరిదో తెలియదు. అయితే జాన్ పీచే అని పేరుంది.

ఆ సమాధి రాయిమీద బైరన్ ఎల్మ్ చెట్టు కొమ్మల నీడల్లో కూర్చొనేవాడు. తన ఇంట్లో నుంచి హెడ్మాస్టర్‌గారి భార్య చూస్తుండేది. అదిగో బైరన్ కష్టపడి కొండమీదికి వెళ్తున్నాడు. తుఫానులో చుక్కాని లేని నావలాగా!" అంటుండేది. బైరన్‌కు ఈ స్మశానం ఈ సమాధి అంటే ఏదో తెలియని 'మానసిక భావన, ఆవేశం!' అతనికి 'మరణం' అంటే బాగా ఇబ్బందికరమైన విషయంగా తోచేది. చిన్నప్పటినుంచీ గ్రే దెయ్యాల కథలు నరకయాతనలు వినీవినీ విసిగిపోయి వున్నాడు.

మరణమంటే పచ్చని చెట్టుకింద – కలలు రాని నిద్రలాంటిది! ఇలాంటి ప్రశాంతమైన మరణాలే కావాలి! ఈ రాలే ఆకుల శబ్దంలో మృదువుగా వీచే గాలికి ఇక్కడే నిద్రపోవాలని అనుకునేవాడు. ఈ మధ్యనే తనకంటే చిన్నది – మార్గరెట్ పార్కర్ చనిపోవటం విన్నాడు. ఈ ప్రపంచంలోనే అందగత్తె అనుకున్నాడు. ఆమె నల్లని కళ్ళు – పొడవాటి కనురెప్పలు – ఇవన్నీ ఎలా మరణిస్తాయి? అదీ పదిహేను సంవత్సరాలు నిండకమునుపే?

తను ఎంతో ఇష్టంగా చూసిన ఆమె సున్నితమైన శరీరాన్ని ఆ చెక్కపెట్టెలో పెట్టి ఈ మట్టిలో కప్పిపెట్టారా? ఎంత హృదయవిదారకం?! ఇలాంటి సమయంలో కవిత్వం తన్నుకుంటూ వచ్చేది.

ఈ ఇరుకు గుంటలోనే – ఆమె మట్టిలా పడివుంది
అదే మట్టి ఒకప్పుడు సజీవంగా కదిలేది
టెర్రోస్ ఆమెను తన ఆహారంగా మలిచాడు
ఆమె అందం, ఆమె అస్తిత్వం ఇప్పుడు తిరిగి రావు!

అటుగా వెళ్ళే కుర్రవాళ్ళు అతన్ని చూసేవాళ్ళు. దూరం నుంచి – సమాధి మీద కూర్చోవటం – అతనికి తెలుసు వాళ్ళు ఆశ్చర్యపోతున్నారని–

ఆశ్చర్యంలో నుంచే ప్రశంస పుడుతుందని!


అతని విషాదంలో కూడా ఏదో మృదుభాషణ వుంది!



హారో స్కూల్, ఫుట్‌బాల్ ఫీల్డ్



హారో స్కూల్, చర్చిహిల్ భవనం



VI

వేగుచుక్క

(1803-1804)

న్యూస్టెడ్ ! పతనం ! ఒకప్పుడు గొప్పగా వెలిగింది-
దేవుని గుడి ! హెన్రీ గర్వపు ఒడి !
వేయి శూరులు, సన్యాసులు - స్త్రీలు అందరి సమాధి!
అరెరె! వీళ్ళందరి నీడలు, నీ శిథిలాలు చుట్టూ ! విధి !

న్యూస్టెడ్ ఎస్టేట్‌ని ఏప్రిల్ 1803లో లార్డ్ గ్రే డి రూథెన్, ఈయన 23 ఏండ్ల యువకుడు, గౌరవనీయుడు, వీరికి అయిదు సంవత్సరాలకాలం అద్దెకు ఇచ్చారు. ఈ అద్దెకాలం పూర్తి సమయానికి బైరన్ న్యూస్టెడ్‌కు పూర్తి యాజమాన్యపు అర్హత, వయసు వస్తుంది. ఆ సమయంలోనే నాటింగ్‌హాంలో ఒక ఇంటిని తనకోసం ఉంచుకుంది, శ్రీమతి బైరన్!

బైరన్ ఉద్దేశ్యం తన మనుగడ, తను కాబోయే యాజమాన్యపు జాగీరుకు దగ్గర్లోనే ఉండాలని.

అంతలోనే వేసవి సెలవులు రావటం - లార్డ్ గ్రే - బైరన్‌కు ఈ వేసవి తనతోనే అంటే బైరన్ ఎస్టేటులోనే గడపడమని ఆహ్వానం పంపాడు. దీనికి బైరన్ ఎంతో ఆనందించాడుకూడా. దానికి కారణాలు అమ్మకు దగ్గర్లో వుండటం నాటింగ్‌హాంలో అంతగా ఇష్టంలేకనే. దానికి తోడు అతనికి న్యూస్టెడ్ ఎస్టేట్ పరిసరాల మీద ఎంతో అనురక్తి కూడా.

లార్డ్ గ్రే – తనువుండేది కొంతకాలమే కదా – అని ఆ భవనానికి ఎటువంటి మరమ్మత్తులు చేయకపోగా, ఇంకా శిథిలావస్థకు వస్తుంటే చూస్తూనే వున్నాడు.

ఈ శిథిల పరిసరాలలో బైరన్‌కు ఏదో విచారగ్రస్తమైన ఆనందం కలిగేది!

అక్కడి వరండాలలో గాలి ఈలలు వేసేది – భవనం చుట్టూ వున్న తోటలో గులాబీలు విషమూలికల లతలతో చుట్టుకుపోయి వాడిపోతుండేవి. చీకటి పడగానే గబ్బిలాలు అద్దాల కిటికీలకు కొట్టుకుంటూండేవి. ఈ రెక్కల చప్పుడు, పూర్వపు మూడువందల సంవత్సరాల కాలపు సన్యాసులు, మేరీమాత స్తుతులకు కొనసాగింపుగా ఉండేది.

ఆరు సంవత్సరాలక్రితం తాను నాటిన 'సింధూరపు' మొక్కకోసం వెదికేవాడు. అది కనిపించిందికూడా. ఆ చిన్న మొక్క ఆకులు తొడిగి కొమ్మలు వేసింది. అతనికి ఆ దృశ్యం ఎంతో ఆనందాన్ని కలిగించింది! అతనికి భవిష్యత్ మర్మాలను తెలిపే శకునాలంటే చాలా ఇష్టం! తన అదృష్టం ఈ 'మొక్క'తోనే ముడిపడివుందని – దాని వృద్ధి, తన సంపన్నతకు చిహ్నమని నమ్మాడు!

ఈ శిథిలాల మధ్యలో కూర్చుని తన పూర్వీకుల కథలను గుర్తుకు తెచ్చుకునేవాడు. జాన్ బైరన్ నడిపిన పదాతి దళాలు – పాల్ బైరన్, రాబర్ట్ బైరన్ క్రెసీ లోయలో బలికావటం, రూపర్ట్ మార్‌స్టన్ తీరంలో పోరాడడం – అందరూ చిన్నవయసులోనే ఈ సాహసాలకు ఒడికట్టటం – సంచలనాలకు దారితీయటం, ఇప్పుడు కేవలం అస్థిపంజరాలు మట్టిలో, తర్వాత దయ్యాల రూపంలో ఈ భవనం చుట్టు గాలిలో నీడల్లా తిరగటం అతనికి కనిపిస్తున్నాయి!

వీటన్నిటినీమించి ఈ పరిసరాలపై అతనికి మక్కువ పెరగటానికి కారణం దగ్గరలోని ఆన్‌స్లే భవనం. అదీ న్యూస్టెడ్ బైరన్ల సోదరికి చెందినది కావటం! అక్కడ అతని మరదలు (అతనికంటే వయసులో పెద్దదే) మేరీ ఆన్ చావర్త్ నివసించటం. ఆమె ఒకప్పుడు తన ముత్తాత బైరన్ చంపిన మిస్టర్ చావర్త్ మునిమనమరాలు కావటం, ఆమెను మన బైరన్ పిచ్చిపిచ్చిగా ప్రేమించటం, ఇవన్నీ కారణాలే!

అప్పటికే ఆమెకు పదిహేడేళ్ళ ప్రాయం. అందమైన కళ్ళు. సన్నటి కనుబొమ్మలు. మధ్యపాపిట తీసిన రెండు జడల వత్తైన జుత్తు! ఇవన్నీ బైరన్‌కు

మత్తెక్కించినా, ఆమె ఈ కుర్రవాణ్ణి, అదీ అవిటి కుర్రవాణ్ణి అంతగా పట్టించుకోలేదు. అతడు తనకు భర్త కాగల అర్హతలున్నట్లుగా ఆమె మనసులోకి రాలేదు. ఇప్పటికే ఆమెకోసం బలిష్ఠులైన, మంచి గుర్రపు స్వారీ చేయగల ఆ ప్రాంతాలలోని యువకులు ఉన్నారు!

కానీ మన స్కూలు విద్యార్థి, ఇతనిలో గొప్ప కళాదృష్టి, చెలరేగే మంటలు, ఉడుకు రక్తం వున్నాయి. అందులో బాగా చదివి వున్నాడు. ఆమెకు ఎన్నో కబుర్లు చెప్పేవాడు. ఇప్పటివరకూ ఆమెకు అంత దగ్గరగా వచ్చినవాళ్ళు లేరు. ఆమెను మచ్చిక చేసుకున్నవాళ్ళు లేరు. పల్లెటూరి జీవితం. కళావిహీనంగా వుంది ఆమెకు. అమాయికంగానే అనిపించింది.

కానీ తనకు తెలీకుండా ఈ కుర్రవాడు తనమీద ఎన్నో మరులుగొన్నాడని దానికి కారణం ఆమె అమాయకపు ప్రవర్తనే అని ఎలా తెలుస్తుంది? ఆమె కావాలనే అతనితో చనువుగా వుంటోందా? లేక అజ్ఞానపు అమాయకత్వంలోనా? అతనికెలా తెలుస్తుంది? అతనిలో చెలరేగే అగ్నికి ఇవన్నీ ఆజ్యం పోశాయి అనుకోవాలి. యువకులైనవారికి తమ గాఢమైన అభిరుచుల గురించి తెలిసి వుండకపోవటం ఎంత హానికరం?

మేరీ చావర్త్, ఈ కుర్రవాణ్ని అనురాగపూరితమైన ప్రశంసను కాదనలేకపోవటం, ఆమె మంచి ఉద్దేశ్యంతోనే చేసినా, అతనికి ఇవి చాలా అసంబద్ధపు కలలకు కారణమైంది.

ఎన్నో ప్రేమకథలు, పుస్తకాలు చదువుతున్న బైరన్ ఈ వ్యవహారం అవన్నీ తన జీవితంలో జరుగుతున్నట్లు ఊహించుకోవటంలో వింతేముంది?

ఈ రెండు కుటుంబాలకూ వివాహ సంబంధాలున్నాయికదా. ఇంకా సందేహమెందుకు – రోమియో–జూలియెట్ లాంటి కథే తమదికూడానా? నిజానికి అతనికంటే రెండేళ్ళ పెద్దదైన మేరీ, ఎంతమంది భర్తలకంటే పెద్దవయసు భార్యలు లేరు? నిజానికి ఈ జంట మూలంగా ఈ కుటుంబాలు మళ్ళీ కలవకూడదా? ఈ పూలదారిలో, పెళ్ళి బాటలో ఈ జంట నడవకూడదా? ఇలాంటి కలలన్నీ బైరన్ ఊహించుకున్నాడు. ఈ సెలవల్లో రోజూ ఆమె నివసిస్తున్న భవనం ముందుగా వెళ్ళే దారిలో గుర్రపు స్వారీ చేస్తూ వెళ్ళేవాడు. దారిలోని కుచ్చుపూల

చెట్లు, రాలే పసుపు రంగు ఆకులూ అతనికి స్వాగతం చెప్పేవి. చుట్టూవున్న అడవి, ఆ పైన కొండలు అక్కడ గడ్డి మేస్తున్న గొర్రెలు ఇవన్నీ ఎంతో రమణీయంగా వుండేవి. ఆ భవనానికి చుట్టూవున్న ప్రహరీగోడ ఎత్తైన ప్రవేశంద్వారా అది చేరటానికి రెండు ప్రక్కలా మెట్లు – ఆ దారి మూస్తూ ఒక గుమ్మం – దానికి చెక్క తలుపులు ప్రహరీగోడమీద బోగన్ విల్లా పూల చెట్లు, వేలాడుతున్న లతలు ఇవన్నీ అతని ప్రేమకు గొప్ప నేపథ్యం అందించేవి.

మన బైరన్ తన గుర్రం మీద స్వారీచేస్తూ తన పిస్తోలుతో ఆ చెక్క తలుపులు మీద గుళ్ళు కురిపించేవాడు. "ఈ బైరన్‌లు అందరూ ప్రమాదకరమే సుమా" అని నవ్వుతూ ఆ యింటి యజమానులు అంటుండేవారు ఆ గుళ్ళ గుర్తులు చూపిస్తూ.

ఒక్కోసాయంత్రం బైరన్‌ను "చీకటిపడింది. ఇక్కడే వుండిపోండి" అని అనేవారు. మొదట్లో బైరన్ అంగీకరించకపోయినా తరువాత మేరీ సన్నిధిలోని మాధుర్యాన్ని, ఆనందాన్ని కాదనలేకపోయాడు. 'రాత్రి ఒక దిష్టిబొమ్మను చూశాను దారిలో' అంటాడు.

ఈ సెలవులు ఎంత ఆనందంగా గడిచిపోయాయి మేరీ స్నేహంతో. ఆమెతో ఆ ఇంట్లోనే నిద్రపోతూ, మర్నాడు ఉదయం రెండు గుర్రాల మీద పొగమంచులో అడవిలోకి వెళ్ళటం ఎలా మరచిపోతాడు? ఆ కొండమీదకు వెళ్ళి కూర్చొని లోయలోకి చూస్తూ కబుర్లు చెప్పుకోవటం ఎంత ఆనందం? తమ పాదాలను తాకే లతలను అవే గాలికి ఊగుతుంటే ఎంత బాగుండేది – ఆ పైగా సరస్సు ఒడ్డున, అడవిలో అక్కడక్కడ ఇళ్ళు – సాయంత్రపు వెలుగులో సుడులుతిరిగే పొగచుట్టలు – చీకటిగా మారుతున్న దిగంతం – ఓహ్!

బైరన్‌కు మేరీ తప్ప ఇంకేమీ కనపబడేది కాదు. అతని ముఖం, వాలిపోతున్న పొద్దు వెలుగులో వింతగా వెలిగిపోయేది. అతని హృదయంలో మేరీ చావర్తు యౌవనపు సౌందర్యం గూడుకట్టుకుంది. తానెప్పుడూ మరిచిపోని విధంగా ఆమెవంక చూస్తూ గడిపాడు. చివరికి శ్వాస తీసుకోవటంకూడా మరిచిపోయాడు. ఆమె తను అనుకున్నాడు. తన అస్తిత్వానికి చరమగీతం పాడి ఆమెలోనే లీనమయ్యాడు.

తన ఆలోచన ప్రవాహాలన్నీ ఆమెలోనే, మేరీ అనే సముద్రంలోనే కలిసిపోతున్నాయి.

ఆమెను వేగుచుక్క, ధృవతార అనీ పిలిచాడు. ఆమె ఎదురుగా లేనపుడు కళ్ళు మూసుకుని హృదయం నిండా ఆమెను నింపుకున్నాడు. ఇప్పుడు అతని మనసులో మేరీ డఫ్ కాని, మార్గరెట్ పార్కర్గాని లేరు. ఉన్నది కేవలం మేరీ చావర్తు మాత్రమే!

అప్పుడప్పుడు నడుస్తున్నప్పుడు – తన చేయి, శరీరం ఆమెకు తగులుతుండేది. అంతే అతని రక్తం ఉరకలెత్తేది. ఒక్కోసారి చిన్న బోటులో (ఇద్దరే వాలుగా కూర్చుని వెళ్ళటానికి సరిపోయేంత చిన్నది) వెళ్తుండేవారు. ఆమె శరీరపు మృదుత్వం, పరిమళం అతనిని ఆవహించి రోజుల తరబడి ఉండిపోయేది.

ఆమెను ఎంతగా ప్రేమించాడో ఎప్పుడూ చెప్పలేకపోయినా, ఆమెకు తెలియకుండా వుండదు. కేవలం ఆ జ్ఞాపకాలతోనే జీవితం గడిపేయవచ్చు. ఒకసారి చిన్న 'డాన్స్‌పార్టీ'కి వెళ్ళాల్సి వచ్చింది. ఎంత బాధాకరం! తన అవిటికాలితో కూర్చొనే వుండిపోయాడు! ఆమె డాన్సుచేసి అలసిపోయి అపరిచితునితో తిరిగి వచ్చింది. తన ప్రక్కన కూర్చోవటానికి; ఎంత దారుణం!

ఒకరోజు ఆమెను తన ఎస్టేటు అడవిలోకి తీసుకువెళ్ళాడు గుర్రపుస్వారీ చేస్తూ. "అదిగో చూడు, ఈ చుట్టుపక్కలు ముప్పైరెండు వేల ఎకరాలు" తనవేనని చెప్పాడు కాస్త గర్వంగానే!

మేరీకి తెలియదా దీని పర్యవసానం! కానీ ఆమె అంతగా ఆలోచించలేదు. బైరన్‌ను సోదరునిగానే అనుకుంది!

ఆమె ప్రేమించిన వ్యక్తి వేరేవున్నాడు. అతను జాక్ మస్టర్స్. ఒకరోజు బైరన్ ప్రక్కన కొండమీద కూర్చొని మస్టర్స్ గుర్రంమీద రావటంకోసం ఎదురుచూస్తోంది.

కానీ, స్త్రీ ఎప్పుడు, తనను ప్రేమిస్తున్నవాడిని వదులుకోదు సుమా!

ఎంత చిన్నవాడైనా ఎంత అవిటిగా కనిపించినా, ఈ ప్రాణి తనను ప్రేమిస్తున్నది కదా అని వదలి పోనిచ్చేది కాదు.


బైరన్‌కు తన బొమ్మను ఒక ఉంగరాన్ని ఇచ్చింది. నిజానికి అతనికి ఇవన్నీ అవసరం లేకుండానే పీకల్లోతు ప్రేమలో మునిగివున్నాడు. అతన్ని దూరంగా ఉంచలేదు. అతని ప్రేమ రోగాన్ని మాన్పించలేదు. అతనికి ఆ అవసరమూ లేదు. ఒకనాటి సాయంత్రం మేరీ మెట్లమీద వుంది. బైరన్ ఇంకా హాల్లోనే వున్నాడు. పైనుంచి చూస్తూ, తన చెలికత్తెతో అంటుంది "ఆ అవిటి కుర్రవానితో నాకేమి పని?" అది కూడా విన్నాడు పాపం! గుండెల్లో చాకులా దిగింది! చీకట్లోకి బైటకు వెళ్ళిపోయాడు. తనకు తెలియకుండా పరుగుపెట్టుకుంటూ న్యూస్టెడ్ భవనానికి వెళ్ళిపోయాడు. కోపం – విచారం రగిలిపోయింది గుండెల్లో. చనిపోదామా అనుకున్నాడు. ఎవర్నయినా చంపుదామా అనుకున్నాడు.

అతని వికృతమైన విధ్వంసకరమైన ఆలోచన ఆవేశం ఆ రాత్రంతా వదల్లేదు.

మర్నాడు తిరిగి ఆమె దగ్గరకే వచ్చాడు. తాను విన్న సంగతి చెప్పలేదు.

పదిహేనేళ్ళ కుర్రవాడు ఈ కోరికలోని బాధను ఆమె సన్నిధికోసం, స్పర్శకోసం, పిలుపుకోసం ఎంతటి అవమానాన్నయినా భరించటం నేర్చుకున్నాడు. అనుభవించటం అలవాటు చేసుకున్నాడు.

ఎంత పిచ్చిలో పడిపోయాడంటే, సెప్టెంబరుకు సెలవులు అయిపోయినా స్కూలుకు వెళ్ళకుండా వుండిపోయాడు. అతని తల్లి శ్రీమతి బైరన్ స్కూలుకు వెళ్ళమని ఆదేశించింది. ఆమెకు, ఇతను, చావర్తుల ఇంటికి తిరగటం ఇష్టంలేదు. "నాకు తెలుసు – కాని హారోకు వెళ్ళటం నాకానందం కాదు. అయినా నీ మాట కాదనను. ఆ గౌరవంతోనే ఇవాళో రేపో బయలుదేరతాను. నా స్నేహాలు నీకు ఇష్టంలేకపోవటం విచారకరం. నాకు సరిజోడి ఈ ప్రాంతంలో దొరకటం – కష్టమే. అయినా నాకు ఎంచుకునే అవకాశం ఇవ్వాలికదా – నీ ఇష్టాన్ని నేను కాదనను. నీవు కూడా నా ఇష్టాన్ని అవమానించవని ఆశిస్తాను" అని రాస్తాడు. శ్రీమతి బైరన్ ఒక్కరోజు మాత్రమే ఉండటానికి అనుమతి ఇచ్చింది. కానీ బైరన్ వెళ్ళలేదు. అంతేకాదు మరో రెండు వారాలు ఇక్కడే వుండిపోయాడు. అక్టోబరు 4 న డా॥ డ్రూరీ హాన్సన్‌కు ఉత్తరం పంపాడు ఆశ్చర్యపోతూ. హాన్సన్, శ్రీమతి బైరన్‌ను వాకబు చేస్తాడు.



ఆమె సమాధానం, “అవును గత ఆరువారాలుగా నేను ప్రయత్నిస్తూనే వున్నాను. అతనికి ఎటువంటి జబ్బు లేదు. కేవలం ప్రేమరోగం. అన్నింటిలోకి దరిద్రపు రోగం అతన్ని పట్టి పీడిస్తుంది. నాతో కనీసం రెండు వారాలు గడపలేదు. కానీ ఇప్పటికీ ఆ పల్లెటూరు వదిలి రాకుండా ఉంటున్నాడు. దీనికి కారణం మిస్ చావర్తును ప్రేమించటమే.

అతనికి పెళ్ళీడు వచ్చినా, ఆ అమ్మాయికి నిశ్చితార్థం జరగకపోయినా పరిస్థితి మరొకరకంగా వుండేది. కానీ ఈ మొత్తం వ్యవహారం నాకు మనస్తాపం కలిగించింది” అని వర్తమానం పంపింది.

బైరన్‌కు స్కూలు ఒక టర్మ్ పోయింది. చివరికి జనవరిలో 1804 లోనే తిరిగి చేరాడు. ఈ మూడు నెలలు అంత సంతోషకరంగా గడవలేదు.

తన అద్దెదారు లార్డ్ గ్రేతో పోట్లాడాడు. అసలు ఎందుకు పేచీ వచ్చిందో అమ్మకు, హాన్సన్‌కు చెప్పలేదు. దీనిమూలంగా లార్డ్ గ్రే ఉన్నంతకాలం అతను తిరిగి న్యూస్టెడ్ వచ్చే వెసులుబాటు పోగొట్టుకున్నాడు.

ఇక మేరీ చావర్తుతో కూడా ఏమీ ఆనందంగా వుండలేకపోయాడు.

ఒకసారి నిరాకరింపబడిన తరువాత ఇక ఒకరి సన్నిధి మరొకరికి ఏమాత్రం ఆనందదాయకంగా వుండదుకదా. కలిసినా ఇద్దరి మధ్య మౌనమే. అదీ అవమానాలతో – ఇదా ప్రేమంటే? ఇదా అభిమానం అంటే – అంత అందమైన భావన ఇదేనా? చివరికి హారోకి తిరిగి వచ్చాడు జనవరి 1804లో. మేరీకంటే న్యూస్టెడ్‌ను వదిలి రావటమే బాధ కలిగించింది.



మేరీ చావర్తు


అందుకే ఒక మరణ శాసనంలాంటిది రాశాడు–

ఓ నీడలారా – వీరులారా శలవు.
మీ వారసుడు వెళ్ళిపోతున్నాడు
తన పూర్వీకుల స్థానం వదలి
మీ దగ్గర శలవు తీసుకుంటున్నాడు.

దూరంగా వున్నా దగ్గరగా వున్నా
మీ జ్ఞాపకాలు నాకు
కొత్త నైపుణ్యాన్నిస్తాయి
మీ కీర్తిని తలచుకుంటూనే ఉంటా!!



మేరీ చావర్తు



మేరీ చావర్తు ఇల్లు

VII

స్నేహితులు-ప్రేమికులు

(1804-1805)

స్నేహాలు ఏర్పడతాయి -
ఎక్కువకాలం ఎలా నిలబడతాయి?

న్యూస్టెడ్ పరిసరాలు - ఆన్సలే నాటి సొగసు పోగొట్టుకున్నాయి. ఇంతకంటే హారోలో వుంటే మేలు! పిర్రలు వాయకొట్టించుకునే వయసు దాటిపోయింది. డా॥ డ్రూరీ చాలా క్షమాగుణంతో తాను శ్రద్ధగా చూసే కుర్రవాళ్ళ గుంపులో బైరన్ను చేర్చుకుని, గ్రీకు, లాటిన్ నేర్పాడు. అతని సహాధ్యాయులు టామ్ వైల్డ్మన్, లాంగ్, బైరన్లాగానే 'అధికారం'లోకి వచ్చారు! ఇప్పుడు బైరన్! అతనికి శిక్షించే అధికారం సంక్రమించింది స్కూల్లో! కానీ అతనేనాడు అలాంటి పనులకు దిగజారలేదు. తనచుట్టూ చిన్న కుర్రవాళ్ళను చేర్చుకుని మంచి కథలు చెప్పేవాడు. ఆ దృశ్యం చూడటానికే ముచ్చటగా వుండేది. అది అతనికి గర్వకారణంగానూ వుండేది. అంతేకాదు అతనిలోని కారుణ్య గుణానికి అనువుగా వుండేది!

అతనికిష్టమైన లార్డ్ క్లేర్, డ్యూక్ ఆఫ్ డోర్సెట్, లార్డ్ దిలావర్ ఇంకా యువకుడైన వింగ్ఫీల్డు అందర్ని అభిమానించేవాడు! వాళ్ళందర్నీ తన రక్షణలోకి తీసుకునేవాడు. స్కూల్లో అతని గౌరవం పెరిగిపోతోంది.

హారో ప్రసంగాలరోజు బైరన్ను మాట్లాడటానికి ఎంచుకున్నారు - "లార్డ్ బైరన్: 'లాటినస్, ఎక్స్ వర్జిలియో' అని 'స్పీచ్ బిల్'లో రాశారు!

అతను పుస్తకం పట్టుకుని కొండమీద సమాధి దగ్గరకు వెళ్ళటం చూసేవారు సహాధ్యాయులు – ఉపాధ్యాయులు. డా॥ డ్రూరీ ఈ మేధావిని గుర్తించాడు. కఠినాత్ములైన 'పెద్దలు' కరుణించారు. అతన్ని ప్రేమించేవారు. అతనంటే గౌరవంతో ప్రవర్తించేవారు.

'ఇక్కడే నాకు గుర్తున్న మొదటి స్నేహితుడు
వారే నన్ను నాయకునిగా పిలిచి నా మాట విన్నారు
నాతో అన్ని ఆటల్లో పాల్గొన్నారు
వారికి మొదటి సలహాదారుణ్ని, సహాయకుణ్ణి'

అని బైరన్ రాసుకున్నాడు.

అతన్ని ఎందుకు వాళ్ళందరూ ఇష్టపడేవారు?

ఎందుకంటే అతని స్నేహం కష్టమైనది. అతని నిజాయితీ, అతని హాస్యప్రియత్వం ఎదుటివారిని నిరాయుధుల్ని చేసేవి! ప్రేమలో మోసపోయాడు – మరో భావనలో తలదాచుకోవటానికి స్నేహాన్ని ఎంచుకున్నాడు. ఇందులో కూడా అదేరకమైన హింసాతత్వాన్ని తెచ్చుకున్నాడు – "ప్రపంచంలో స్నేహం ఒక భావన మాత్రమే – అరుదైన ఒక భావన మాత్రమే" అని రాసుకున్నాడు. అతనికి ఎంతో దగ్గరైన లార్డ్ క్లేర్‌కు కూడా బైరన్ స్నేహం అందని పండే. బైరన్‌లో అసూయకూడా వుంది. తన 'చేతిలో' వుండాల్సిన చిన్నవాడైన క్లేర్ మరెవ్వరితో చనువుగా వున్నా భరించేవాడు కాదు.

ఈ అసూయ తన 'ధృవతార'పై ప్రేమ వైఫల్యంలో నుంచి వచ్చింది. ఆ విశాల నేత్రాలు – ఆ కుచ్చుపూల దారి – లతల దండలతో నిండిన ప్రహరీగోడ – అన్ని జ్ఞాపకాలు అతన్ని హింసపెట్టేవి. ఈ తీరని కోర్కెల చేదు అనుభూతులను ఎలా మర్చిపోవాలి? తన గుండెల్లో నుంచి ఎలా తొలగించాలి?

ప్రేమ గురించి గొప్పగా రాసిన రచయితలందర్ని నిరసనతో చూశాడు. ఎగతాళి చేశాడు. అందుకు వ్యతిరేకంగా రాసిన థామస్ మూర్, థామస్ లిటిల్ పద్యాలు చదివి వినిపించేవాడు.

కానీ మేరీతో బోటులో పడుకున్న అనుభూతులు, యిద్దరు వళ్ళూ దగ్గరగా రాసుకున్నప్పటి వెచ్చని జ్ఞాపకాలు అతన్ని వదిలి పోలేదు.

ఈస్టర్ సెలవలు దగ్గరపడుతున్నాయి. కానీ అతనికేమాత్రం ఆనందంగా లేదు. లార్డ్ గ్రేతో పేచీ న్యూస్టెడ్‌కి పోకుండా చేసింది. ఇప్పుడతని తల్లి న్యూస్టెడ్ దగ్గర్లో చిన్న వూళ్ళో 'సౌత్‌వెల్' అనేచోట వుంటోంది.

ఆ చిన్న వూళ్ళో వున్న పెద్ద ఇంట్లో బర్గేజ్ మేనర్‌లో నివాసం – ఆ వూరివాళ్ళకూ ఆమెకూ ఎప్పుడూ పడేదికాదు.

సెలవలకు అక్కడికి వచ్చిన బైరన్ పరిస్థితి ఈ కొత్త ప్రదేశంలో తెలిసినవాళ్ళు లేకపోవటం, కొత్తవాళ్ళ దగ్గర అతని సిగ్గు, బెదురు, తన అవిటితనం చూసి వాళ్ళ మొఖాలలో కనిపించే జాలి అతనికి చాలా భయంకరంగా కనిపించేవి. చిన్నప్పటినుంచి ఈ భావన అతన్ని వదిలి పోవటంలేదు. పదిమందిలోకి వెళ్ళి తిరగలేడు! తన తల్లి తెచ్చే అవమానాలు కూడా తక్కువేమీ కాదు. ఇక మూడవది మేరీ చావర్త్ ప్రేమ. దీనితో ఆడవాళ్ళంటే ఒక ద్వేషం, ఏహ్యాభావం పెంచుకున్నాడు. ఒక తెలియని భయంకూడా ఆవహించేది. ఎవరైనా తన ఈడు అమ్మాయి పలకరిస్తే చాలు, తనలో తను, ఒకటి రెండు మూడు లెక్కించుకునేవాడు.

వారి అందాన్ని ఎంత ప్రేమించేవాడో, వారిని అంత ద్వేషించేవాడు. వారిని ద్వేషించేవాడు కాబట్టి ఆరాధించేవాడు. ఎలా వీరిని జయించాలి? కక్ష ఎలా తీర్చుకోవాలి? తన అవిటితనం, ఒకరకంగా పేదరికం ఇవన్నీ అతన్ని కట్టిపడేసేవి. సౌత్‌వెల్‌లోనే ఒకమ్మాయితో పరిచయమైంది. అమ్మాయి పేరు ఎలిజబెత్ పిగోట్! ఆ అమ్మాయి అతని సిగ్గునూ, బెదురునూ కొంతవరకు పోగొట్టింది. ఆ సమయంలోనే తనకు మారుటి అక్క అయిన 'అగస్టా'తో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. ఈమె తన తండ్రి మొదటి భార్యకు పుట్టిన సంతానం. తన తల్లే పెంచింది కొంతకాలం. తరువాత అమ్మమ్మ అయిన లేడీ హోల్డర్‌నెస్ పెంపకంలోకి వెళ్ళింది. ఆమె మరణం తర్వాత (1801) అగస్టాను ఓ గొప్ప కుటుంబం దత్తత తీసుకుంది. అందులో అగస్టా మారుటి తమ్ముళ్ళు, చెల్లెలు వున్నారు. చాలా కలిగిన, గౌరవనీయమైన కుటుంబంలో ఎంతో సంతోషంగా పెరిగింది. అగస్టా అమ్మమ్మ చనిపోయిన తర్వాత, ఈ గొప్ప కుటుంబంలో వున్న అగస్టాతో సత్సంబంధాలు పునరుద్ధరించాలని శ్రీమతి బైరన్ ప్రయత్నించింది. దానికి రెండు కారణాలు – మొదట తను చిన్నప్పుడు పెంచిన పిల్లకావటం – రెండవది ఇప్పుడు ఆమెకున్న ఉన్నత స్థానం!

ఈ సందర్భంలోనే వుత్తరం రాస్తుంది.

"జరిగింది మరిచిపోదాం - మన సంబంధానికి మూలమయిన వ్యక్తి జ్ఞాపకాలు కూడా పూడ్చిపెడదాం. మన సంబంధాల్ని పునరుద్ధరించటానికి నీకు ఎటువంటి సహాయం కావాలన్నా, నన్ను సంప్రదించటానికి వెనుకాడవద్దు. నాకీ అవకాశం తప్పక ఇవ్వగలవని ఆశిస్తాను" అంటూ రాసింది.

అగస్టా - ఇప్పుడు దాదాపు ఇరవై సంవత్సరాలుంటాయి. ఆమెకు బైరన్ - తనలాంటి తమ్ముడు ఈ ప్రపంచంలో తనకు ఒకే ఒక్క సంబంధం అయిన బైరన్‌తో పరిచయంకోసం తపన పడింది.

బైరన్ కూడా ఈ సంబంధాన్ని మనఃపూర్వకంగా ఆహ్వానించాడు. ఇంత విశాల ప్రపంచంలో తనకంటూ ఒక వ్యక్తి వుంది. ఈ భావనే అతనికి ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. ఆమెకు ఎంతో ప్రేమపూర్వకమైన ఉత్తరాలు రాశాడు. 'నా ప్రియమైన సోదరీ' నీ సోదరుడు, నీ శ్రేయోభిలాషి, నీకు చాలా దగ్గరి సంబంధి - ఇలా నడిచాయి.

నీకు ఎప్పుడు ఎలాంటి సేవకయినా సిద్ధంగా వున్నాను. ఈ ప్రపంచంలో నీవే నాకు అతి చేరువైన రక్తసంబంధంకల వ్యక్తివి. నన్ను మర్చిపోకు. నీ ప్రియమైన సోదరుడు - నీ నమ్మకమైన తమ్ముడు - ఇలా సాగాయి వుత్తరాలు.

అగస్టా ఈ వుత్తరాలతో ఎంతో ఉత్సాహం పొందింది. అప్పుడు ఆమెకు పెళ్ళికుదిరింది. కాబోయే భర్త కలొనెల్ జార్జి లీ. అడ్మిరల్‌కు మనుమడు. జర్మన్ అడ్మిరల్! నీకు కాబోయే భర్తకు, నీ సోదరుని శుభాకాంక్షలు తెలుపు అనికూడా బైరన్ రాశాడు. తన స్కూలు గురించి, డా॥ డ్రూరీ గురించి "నేనేమైన నేర్చుకున్నానంటే అది డ్రూరీ పుణ్యమే. గొప్ప స్కాలర్. దైవభక్తి కలవాడు" అని, అలాగే తన స్నేహితుల గురించీ రాశాడు.

కొంతకాలం తర్వాత, పరిచయం పెరిగిన తర్వాత, ప్రేమపట్ల తన అభిప్రాయాల్ని మేరీ చావర్తు సంగతులు రాయగలిగాడు. "ఇక్కడ సౌత్‌వెల్‌లో కూడా పార్టీలకు వెళ్తున్నాను. బహుశా ఏ అమ్మాయితోనైనా ప్రేమలో పడవచ్చు. తర్వాత నిరాశా చెందవచ్చు. దానితో నన్ను నేను కాల్చుకుని చచ్చిపోవచ్చు. అప్పుడు ప్రపంచంలో

నా చరిత్ర మిగిలిపోతుంది. ప్రేమ వైఫల్యం, మరణం – లార్డ్ బైరన్ అంటూ పిచ్చిరాతలు రావచ్చు!"

అగస్టా సమాధానం రాసింది – ఆమెకు తన కలోనెల్‌తో సంతోషంగా లేదా?

బైరన్, "నీవు సంతోషంగా లేవా? ఇది నాకు చాలా బాధగా వుంది.

"నిన్ను సంతోషంగా వుంచటానికి నేను ఏమైనా చేస్తాను. నన్ను నమ్ము – "కానీ నిన్ను చూసి నవ్వు వస్తోంది. నన్ను క్షమించు. నా దృష్టిలో ప్రేమ గతం – ఇవన్నీ వట్టి బూటకం. పొగడ్తలు అంతా మోసమే! నావరకు నాకు, యాభైమంది ఉంపుడుగత్తెలున్నా, ఒక పదిహేను రోజుల్లో మరచిపోగలను. తరువాత ఎవరైనా కనపడినా గుర్తుపట్టలేను! ఒక కలలాగా తుడిచివేస్తాను – హృదయం – ప్రేమ ఇవన్నీ వట్టిమాటలు..."

ఇంత దారుణంగానూ రాశాడు.

ఇదంతా తన ప్రేమ వైఫల్యంలోనుంచి పుట్టిందే.

నిరాశలోనుంచి పుట్టిన ద్వేషం!

ద్వేషంలోనుంచి పుట్టిన దుఃఖం.

బైరన్ కూడా దానికి అతీతుడు కాడు.

బైరన్ తన దుఃఖాన్ని చెప్పుకోవటానికి అగస్టానే దొరికింది ప్రపంచంలో.

తన తల్లిని గురించి తన అయిష్టం, ద్వేషం, వయస్సుతో ఆమె చేస్తున్న 'అరాచకాలు' ఇవన్నీ చెప్పుకోవటానికి 'అగస్టా'నే పోస్టుబాక్స్!

అతని రక్తంలో వున్న లక్షణం – ఏదీ దాయలేని స్థితిని, తన అక్కకు ఏకరవు పెట్టటానికి వెనకాడలేదు. తనకు, అమ్మకు పోట్లాటలు ఎలాంటివి – ఇంట్లో పింగాణీ పళ్ళాలు ఎలా పగిలిపోతాయి – అన్నీ రాశాడు. శ్రీమతి బైరన్ గురించి వున్నవి లేనివి కల్పించి రాశాడు. తనను తన వంశాన్ని ఏ విధంగా తిట్టేది – "నువ్వు అసలు బైరన్" అని "నా నాన్నలాగానే" అంటూ వివరించాడు.

"ఇవన్నీ నేను భరించాను – నన్ను ఇంతగా ద్వేషించాలా – ఇన్ని అవమానాలు పడాలా? నా నేరం ఏమిటి? నేను ఆమెను కొడుకుగా గౌరవించాలి. కానీ ఒక

స్నేహితుడిగా క్షమించలేను" – "ఇంకా నేను అన్ని విషయాలు రాయలేదు – నిన్ను ఒక స్త్రీగా గౌరవిస్తాను అందుకని".

ఈ విధంగా నడిచాయి వుత్తరాలు. అసలు విషయం ఏమిటంటే – శ్రీమతి బైరన్ చాలా విచారంలో వుంది. 27 ఏళ్ళకే భర్త పోయాడు. తన జీవితం నాశనమైపోయింది. కాందిశీకురాలిగా బ్రతకవలసి వచ్చింది. అదీ ఒక కుగ్రామంలో. ఎందుకు? కేవలం ఒకేఒక్క కొడుకు మంచీచెడు కనిపెట్టుకుని వుండటానికి! అతనికి తనపట్ల సానుభూతేలేదు. అతనికోసమె సౌత్‌వెల్‌కి వచ్చింది. కానీ అతడు ఎంత కఠినంగా వ్యవహరిస్తున్నాడు – నాన్నలాగే! తన పెదనాన్నలాగే. బైరన్‌లందరిలాగానే హింసాత్మకంగా ప్రవర్తిస్తున్నాడు. నిజంగా ఇతను తన కొడుకేనా? తన సంతానమే తనమీద ఇంత దారుణంగా ఇంత దూరంగా వుంటూ పైగా తనమీద తీర్పులు చెప్తున్నాడే – రానురాను తన కొడుకును చాలా దూరం చేసుకొంటోంది తన భర్తలాగానే. అతన్ని ఎంతో దయగా దగ్గరకు తీసుకోవాలని వుంది. కానీ అయ్యో! తన పరిస్థితి ఎంత ఘోరంగా వుంది – అని గట్టిగా అరుస్తోంది!

ఇలాంటి సంఘటనల తర్వాత ఇద్దరూ విచారపడేవారు. ఏదోరకంగా సర్దుకుపోవాలని బైరన్ సమాధానపడేవాడు. "అమ్మతో సమాధానపడకూడదని కాదు – అప్పుడే ఆమెను వదలి వెళ్ళిపోవాలని అనుకోవటంలేదు – కాని ఆమెను భరించటం చాలా కష్టంగా వుంది. ఆమెలో మంచికంటే చెడు ఎక్కువైపోతోంది."

ఇలాంటి విరుద్ధ భావాలు, అంత చిన్న వయసులో వ్యక్తిత్వానికి ఏమాత్రం మంచి చేయవు. పైగా చాలా ప్రమాదకరమయినవి. తన తల్లిని తప్పుపట్టడమేకాదు, ఆమెను చాలా విసిగించటం అలవాటు చేసుకున్నాడు. వీరిద్దరి కొట్లాటలు చాలా దారుణంగానే వుండేవి. మొదట్లో అతన్ని బాధించేవి. తరువాత అలవాటయి పోయింది!

ఇది త్వరలోనే గుర్తించాడు చాలా స్పష్టంగ! అతను, ఆమెను వదిలిపోవచ్చు. "అగస్టా – ఈమె నా తల్లి. ఇకనుంచి ఈమెతో ఎటువంటి సంబంధం పెట్టుకోను" అని రాస్తాడు.

అగస్టా ఈ విషయాలన్నీ హాన్సన్‌కు తెలియజేసింది. బహుశా శ్రీమతి బైరన్ తాగుడుకు అలవాటుపడిందేమో? బైరన్‌ను దూరంగా పంపమని సలహా ఇచ్చింది కూడా! ఇప్పుడు రాబోయే సెలవుల్లో బైరన్‌ను ఎక్కడకు పంపుతారు? హాన్సన్ దగ్గర కా – లార్డ్ కార్లైల్‌తో కూడా అగస్టా సంప్రదించింది. ఆయన, హాన్సన్ ఎలా చెపితే అలాగే అని, సమ్మతి తెలియజేశాడు. కానీ శ్రీమతి బైరన్‌తో మాత్రం మాట్లాడనని ఖచ్చితంగా చెప్పేశాడు.

అప్పుడే మేరీ డఫ్‌కు వివాహం జరగబోతోందని శ్రీమతి బైరన్‌కు వార్తవస్తుంది. ఈమెనేగా తొమ్మిదేళ్ళ ప్రాయంలో తన కొడుకు ప్రేమించాడు.

ఒకరకమైన కక్షతో అతనికి ఈ వార్త చెప్తుంది. అతను బాధపడటం చూసి ఆనందించాలని!

బైరన్ ఇది విని పిచ్చివాడైపోయినట్లు ప్రవర్తించాడు. తట్టుకోలేక మెలికలు తిరిగిపోయాడు. ఈ పరిస్థితి మారటానికి కొంత సమయం పట్టింది. అదే సంవత్సరం మేరీ చావర్తుకు కూడా వీడ్కోలు చెప్పాడు. అతనికి మేరీ కేవలం తనతో ఆడుకుంటోందని తెలిసి విరక్తి చెందాడు. ఆమెకు జాక్ మస్టర్స్‌తో నిశ్చితార్థం జరిగిందని అందరికీ తెలుసు.

ఆమెతో కొండమీదకు నడచివెళ్ళి, చాలా ప్రశాంతంగా, మళ్ళీ మనం కలసినప్పుడు నీకు పెళ్ళయిపోతుందికదా? అని అంటాడు. ఇప్పుడు పరిస్థితులను ఉన్నదున్నట్లు అర్థం చేసుకోగలుగుతున్నాడు.

"అవును –అయిపోవచ్చు" అంటుంది. ఎంత దారుణం?

తనను ఎందుకు ఆశపెట్టింది? ఇది తన తప్పిదమా?

చివరిగా మరొక్కసారి ఆమెను వివాహానికి ముందు కలుస్తాడు. అతను ఆమెకోసం వేచివున్న హాలులోకి వస్తుంది. నిరాశగా కాగితంమీద ఏదో రాస్తాడు. ఆమె చేయి తీసుకుని పాలిపోయిన తన చల్లని చేతిలో పెట్టుకుంటాడు. ఆమెకు తెలుసు అతను బాధపడుతున్నాడని – అంతే హాలు దాటి తన గుర్రం ఎక్కి వెళ్ళిపోయాడు.

ఆ మరుసటి సంవత్సరమే ఆమె పెళ్ళి జరిగిపోయింది.

అతనే 'ద్వేషి' 'సినిక్' అయితే, ఆమెతో ఆమె భర్తతో స్నేహంగా వుండి అవకాశంకోసం చూసేవాడు.

కానీ బైరన్ ఆమెను గాఢంగా ప్రేమించాడు. ఎటువంటి చదరంగం ఆడటానికి పాలుపడలేదు! ఈ పెళ్ళిమూలంగా బైరన్‌లో వచ్చిన మార్పులు ఎవరు గమనించారు? 1804లో అగస్టాకు, బైరన్ ఎంతో సున్నితమైన ఆర్ద్రమైన యువకుడు. కానీ 1805 సంవత్సరం తర్వాత అతను పూర్తిగా మారిపోయాడు. ఆమె గుర్తు పట్టలేనంతగా మారిపోయాడు.



పెళ్ళి బాట

VIII

ఇడా పర్వతం మీద దేవతలు

(1805)

బైరన్ హారోకి తిరిగి వచ్చేసరికి, అదే స్కూలులో చివరి సంవత్సరం; అతను చాలా గందరగోళంలో పడిపోయిన యువకుడు. తనలో తనే, తనకు తనే శత్రువైపోయాడు. స్కూలుకు రావటం ఎంతో సంతోషంగా వుంది. అందరు బిడియపు మనుషుల్లాగానే బైరన్ కూడా ఈ స్కూలు రోజువారీ దినచర్య తెలిసి వాళ్ళమధ్య సంచరించటానికే ఇష్టపడ్డాడు.

అతనికి ఇష్టమయింది – ఫోర్తుఫారం క్లాసు. గోడలన్నీ చెక్కతో చేసివున్నాయి. నల్లబడిపోయి వున్నాయి. అప్పటికే మూడువందల సంవత్సరాలయింది, ఆ గోడల వయసు! బైరన్ క్లాసు మానిటర్ – అక్కడే ఆ చెక్కలమీద మూడుచోట్ల 'BYRON' అని చెక్కాడు లోతుగా. ఇంగ్లీషు పబ్లిక్‌స్కూలులో ఎప్పుడూ పెద్దరికం చలాయించే 'ప్రభువులు' వుంటారు. బైరన్ అందులో ఒకడయ్యాడు.

హారో కొండచరియలు అలా చదును పొలాలలోకి కనపడుతుంటాయి. అక్కడ కష్టించి దున్నే రైతులు, క్రికెట్ ఆడుకునే కుర్రాళ్ళు ఎప్పుడూ వుంటారు. అతనికి 'హోమర్' లోని 'మౌంట్ ఇడా' ఈ హారో కొండే అని అనుకునేవాడు! బహుశా ఇక్కడనుంచే దేవతలు మానవమాత్రుల కష్టాలు – కొట్లాటలు పర్యవేక్షిస్తుంటారేమో!

కానీ ఆ దేవుళ్ళకు వారి ఇష్టాయిష్టాలుంటాయి కదా!

బైరన్, అతని స్నేహితులు అసూయభావాలతో అతలాకుతలమైపోయేవారు. ఇప్పుడతనికి ఇష్టమైన స్నేహితుడు డెలావర్. 'అతను ఆడదానంత అందగాడు'

అనుకునే రాసేవాడు. కానీ క్లేర్‌కు అసూయ! ఇంక ఇతరులకు కూడా ఇడాపర్వతంపై దేవతలు కూడా అసూయతో రగిలిపోయేవారు. అది, సౌత్‌వెల్ కానీ, హారోలో కాని ఎవ్వడి బ్రతుకు వాడు బ్రతకటానికి వీలుకాదు! నిజానికి డెలావర్‌కే బైరన్ స్నేహం అంత సంతోషాన్నిచ్చేది కాదు.

బైరన్ అతనికోసం ఏమైనా చేయటానికి సిద్ధమే. కానీ ఎదుటివారి భావాలు, స్నేహాలు చాలా బలహీనమైనవని తెలుసుకుని ఆశ్చర్యపోయేవాడు.

దాదాపు ప్రతిరోజు ఒక కవిత తన స్నేహితుల గురించి పిడుగులాగా వచ్చిపడేది!

అరె! నిన్ను ఎంతో గాఢంగా
స్నేహితునిగా భావించానే,
కేవలం మృత్యువే విడదీయగలదనుకొన్నానే,
కానీ కేవలం అసూయ మనల్ని
వేరు చేస్తుందా?

మరొకరోజు–

నీకు తెలుసు – నా మనసు, నా అస్తిత్వమే–
ఎంత ప్రమాదంలో కూడా నీదేకదా–
ఎన్నాళ్ళయినా ఎంత దూరమైనా
నేను స్నేహమే, అనురాగమే కోరుకుంటా!

ఈ ఉత్తరాలు అందుకున్న అదృష్టవంతులు ఆశ్చర్యపోయేవారు. నవ్వుకునేవారు కూడా. అంతలో మరచిపోయేవారు. కానీ త్వరలోనే ప్రమాదం పొంచివుంది. బైరన్‌కు ప్రేమపాత్రుడు డా॥ డ్రూరీ విశ్రాంతికి వెళ్ళబోతున్నాడు ఈస్టర్‌లో. ఈ చివరి నెలల్లో ఆయన బైరన్‌తో అంత సంతృప్తిగా వుండలేకపోయాడు. నిజానికి బైరన్ ఇప్పుడు కష్టపడి చదువుతున్నాడు. పై ముగ్గురిలో ఒకడుగా వున్నాడు! కానీ అతని ఆలోచనలు అతన్ని ప్రశాంతంగా వుండనీయటంలేదు. అతనిలోని 'జంతుప్రవృత్తి' బలపడుతోంది. ఇది డ్రూరీ గమనించాడు. బైరన్ మంచి చెడుల ఇంగితం అతన్ని బాధపెట్టేది. ఈ కుర్రవాడు తన సర్వీసులోనే తెలివైనవాడు –

కాని ఒక్కోసారి పిచ్చివాడిలాగా వ్యవహరించేవాడు. ఈ పాఠశాలలోని నైతిక బాధ్యత తన భుజాలపైన వుండటంతో, బైరన్ తన తెలివితేటలు, మాటకారితనంతో మిగతా విద్యార్థులపై తన ప్రభావాన్ని చూపించటం ఇష్టపడేవాడు కాదు.

ఈ పరిస్థితులన్నీ పరికించి చివరికి 1804 డిసెంబరులో డా॥ డ్రూరీ బైరన్‌ను హారో వదిలి వెళ్ళిపొమ్మన్నాడు. హాన్సన్, లార్డ్ కార్లైల్ అడ్డుపడటంతో ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోవలసి వచ్చింది.

బైరన్ తన మాస్టర్ మీద ఎటువంటి ద్వేషం పెట్టుకోలేదు. నిజానికి ఆయనంటే చాలా ఇష్టంకూడా. అప్పుడే యౌవనంలో అడుగుపెడుతున్న యువకునిపై తన ప్రభావాన్ని చూపగల వ్యక్తి. అతన్నుంచి మంచి నడవడిని ఆశిస్తాడు. అతనిపై కొంత అధికారాన్ని కూడా కలిగివుండటానికి వెనుకాడడు.

బైరన్‌కు ఆ స్కూలులో చివరిరోజు చివరి పాఠం చాలా విధాల బాధపెట్టింది. ఎవరూ ఏమీ చెప్పకపోయినా మాస్టర్లు, విద్యార్థులు తమ జీవితంలో సంతోషకరమైన అధ్యాయం ముగిసిందని విచారించారు! డ్రూరీ తర్వాత ఎవరు వస్తారు? ఆయన సోదరుడే మార్క్ డ్రూరీ వున్నాడు. ఈయనకు ప్రమాదకరంగా వ్యతిరేకి – రెవరెండ్ బట్లర్. విద్యార్థులకు వీరిద్దరి మంచి చెడులు ఏమీ తెలియవు. కానీ డ్రూరీ పేరు వారికి చాలా ఇష్టమయినదికదా! ఇప్పుడు విద్యార్థులలో రెండు గ్రూపులు తయారయ్యాయి. 'టామ్ వైల్డ్‌మాన్' అనేవాడు డ్రూరే కోసం గ్రూపుకట్టాడు. అతని స్నేహితులు, 'నువ్వు బైరన్ మద్దతు కూడ కట్టుకోవాలంటే పెత్తనం అతనికే ఇవ్వాలి' అని సలహా ఇచ్చారు. దీనితో డ్రూరీ కోసం బైరన్ సైన్యం సిద్ధమైంది.

ఇద్దరు మాస్టర్లకు సమానంగా ఓట్లువచ్చాయి. అలాంటి స్థితిలో – ఆర్చ్ బిషప్ ఆఫ్ కాంటర్ బరీకి చివరి అవకాశం ఇస్తారు. కొన్నాళ్ళ ఉత్సుకత తర్వాత, ఆర్చ్ బిషప్ డా॥ బట్లర్‌కు మద్దతు ఇచ్చారని తెలుస్తుంది. దానితో విద్యార్థుల్లో తిరుగుబాటు పొడసూపింది. దానికి బైరన్, వైల్డ్ మాన్ సారథ్యం వహించారు!

ఎప్పుడూ, పిస్తోళ్ళు – గుళ్ళతో నింపినవే పెట్టుకు తిరిగేవాళ్ళు. డా॥ బట్లర్‌ను చంపుతారని పుకార్లు కూడా లేచాయి. కొంతమంది దుండగులు బట్లర్ నడిచేదారిలో

తుపాకి మందు చల్లి పేల్చివేయాలని ఆలోచించారు. డా॥ బట్లర్ అంటే ఎవ్వరికీ ఇష్టం లేకుండాపోయింది. బైరన్ నిరసన కవితలు రాశాడు. స్వేచ్ఛా తిరుగుబాటు అని పేరుకూడా పెట్టాడు. ఇవన్నీ డా॥ డ్రూరే చెవినపడ్డాయి. ఒకసారి స్వయంగా వచ్చి ఈ విషయాలను చక్కదిద్దాలని ఆలోచించాడు. ఆయన రాకకోసం అందరూ ముఖ్యంగా కుర్రవాళ్ళు ఎదురుచూశారు. ఆయన వస్తూన్న గుర్రపు బగ్గీని హారో కొండ దగ్గర్లో ఆపారు. గుర్రాలను ఊడదీసి కొండమీదవరకు విద్యార్థులే లాక్కెళ్ళారు.

అంతే, డ్రూరీ అక్కడే వుండిపోయాడు!

బైరన్ ఈ చిల్లర వ్యవహారంతో సరిగ్గా చదవటం తగ్గించాడు. తెలివిగలవాడే కానీ, బద్ధకస్తుడు! ఏమయినా చాలా బాగా లాటిన్ నేర్చుకున్నాడు. గ్రీకు కొద్దిగా, 1805 'స్పీచ్ డే' రెండుసార్లు వేదికమీదకు వచ్చాడు. ఈసారి ఇంగ్లీషులో కవిత్వం చదివాడు. ముఖ్యంగా "కింగ్ లియర్" నుంచి! దీనికోసం తన అక్కను– అగస్టాను రమ్మన్నాడు. "మీరు తప్పనిసరిగా ఖరీదయిన బగ్గీలో రావాలి. ఇక్కడకు మామూలు బళ్ళు రానివ్వరు" అని రాశాడు.

అగస్టా రాకతో బైరన్ తన స్నేహితులను అదరగొట్టాలనుకుంటాడు. తన రక్తసంబంధి రావటం అతనికి ఆనందమే. ఆరోజు చాలా సంతోషించాడు. ఆమె రాక తన ప్రసంగం తనొక గొప్ప ఉపన్యాసకుడునని అతని నమ్మకం. ఈ మూడు సంవత్సరాలలో తాను రాసిన పద్యాలు ఎన్నో వున్నాయి! డా॥ డ్రూరీ కూడా బైరన్ గొప్ప ఉపన్యాసకుడు అవుతాడని ఆశించాడు.

చాలా నాటకీయంగా చదివాడు. అతను గొప్ప ఈతగాడుకూడా. క్రికెట్ కూడా బాగా ఆడేవాడు! అయితే స్కూలు జీవితం అయిపోవచ్చింది.

హారో నుంచి ఏమి తీసుకువచ్చాడు?

స్నేహాన్ని – తర్వాత కవుల గురించి జ్ఞానం!

జీవితంలోని పార్శ్వాలన్నీ తెలుస్తాయా? లేదు.

తనలాగా మిగతావారు భావావేశానికి అనురాగానికి ప్రాముఖ్యతనివ్వరని గుర్తించాడు. ఆడవాళ్ళు, మగవాళ్ళు, యువకులు, ఈ యువతులు, బాగా తెలివిగా

ప్రేమకోసం సర్దుకుపోవటం నేర్చారు. అది సత్యమన్నా, దేవుడన్నా అంతే, సర్దుకుపోవటమే!! తాను ఆ విధంగా వుండగలడా? లేదా అతనికి ఆ విధంగా సర్దుకుపోవటం ఏమాత్రం ఇష్టంలేదు. కానీ ఈ ప్రపంచంలో జార్జి గోర్డాన్ లార్డ్ బైరన్ స్థానం ఏమిటి? చివరిరోజుల్లో తన పుస్తకాల్లో ఇలా రాసుకున్నాడు–

జార్జి గోర్డాన్ బైరన్ – బుధవారం – జూన్ 26 A.D.1805 3.45 ని॥లకు మధ్యాహ్నం టామ్ విలియమ్స్ నా ఎడమప్రక్కన, లాంగ్ నా కుడిప్రక్కన హారో కొండమీద.

ఇది నిజంగా అతని తపన – అతని అస్తిత్వాన్ని సమయం, తేదీ, రోజు సంవత్సరాలతోపాటు తన ప్రక్కనున్నవారితో పరిసరాలతో 'రికార్డు' చేయటంలోనే ఏదో మార్మికత వుంది! ఏమిటి అతని ఆలోచన? అతని కోరిక? ఇక్కడనుంచి కేంబ్రిడ్జికు వెళ్ళటం, ఇదంతా? స్కూలు రోజులు చివరికి రావడం ఎంత విచారకరం? ఇక్కడ ఎంత ఆనందంగా గడిచిపోతుంది? చిన్నచిన్న గొడవలున్న ఈ చిన్ని సామ్రాజ్యంలో తనని రాజకుమారునిగా అంగీకరించారే–

వైల్డ్‌మాన్ – ఎడమప్రక్కన లాంగ్ కుడిప్రక్కన! తన స్నేహితులు నిజమైన స్నేహితులు. ఈ పవిత్రమైన పర్వతం ఎంత విభిన్నమైనది, బైట – విరోధ ప్రపంచంతో – అశాంతి ప్రపంచంతో పోలిస్తే! మేరీ చావర్తు – త్వరలో పెళ్ళి అయిపోతుంది. ఆడవాళ్ళు – అందరూ అలాంటి వారుకాదా? తనతల్లి? ఆమె కోపిష్టిది – తన ఇల్లు? అది నరకం. తన సంరక్షకుడు – కార్లైల్? తననెంతగా ఇష్టపడతాడు? ఏమో–

ఈ సందిగ్ధపు కదంతొక్కే గుర్రానికి సరైన కళ్ళెం అమరాలి–

ఆనందపు పొరల్లోని బాల్యం – యౌవనపు

బాధాకరమైన కాలంలోకి అడుగుపెడుతోంది–

అతన్ని మరణమనే భావన ఎప్పుడూ వెన్నంటే వుంటోంది

తనకు దగ్గరవాళ్ళు ఒక్కొక్కరు వెళ్ళిపోతున్నారు. మృత్యుఘాతాలతో

అతను తన మేనకోడలి మరణానికి కవిత పాడాడు. ఇంకా చిన్నతనంలోనే తనువు చాలించిన కొందరు స్నేహితుల కోసం కూడా!



జాన్ పీచే! ఆ సమాధిమీదే తనూ కూర్చునేది.

ఈ జాన్ పీచే అనేవాడు ఇప్పుడు ఎముకల గూడు! ఈ సమాధి రాయి క్రింద తెల్లబారిపోతున్న చిదుగులు కావా! ఇదంతా అయిపోతుంది.

అక్కడ నుంచి లోయలోకి చూశాడు. దూరంగా లండన్ నగరాన్ని కూడా.

ఈ ఇడా పర్వతంమీద యువకుడు హీరో – ఈ దేవతల స్థానం వదిలి నేలమీదకు పచ్చగడ్డిలోకి, ప్రపంచంలోకి ప్రవేశించబోతున్నాడు. బహుశ తన సమాధికూడా ఇక్కడే వుంటుందా?

ఈ 'జాన్ పీచే' లాగా? తన సమాధిమీద ఏమి రాయాలో ముందే నిర్ణయించుకున్నాడు.నిండా పదహారేళ్ళు నిండని బైరన్! అది నా పేరు ఒక్కటే 'బైరన్!' అది నాకు గౌరవాన్ని నా అవశేషాలకు, గౌరవం ఇవ్వలేకపోతే

అంతకంటే మరొక గౌరవం నాకెందుకు?

అదే ఆ పేరే నన్ను నేను ఏమిటో చెప్పాలి. లేదా నన్ను మరచిపోవాలి!

అరే – అసలు జీవితం మొదలే కాలేదు – అప్పుడే ఈ జీవితానికి చివర చూస్తున్నాడే!!



ఇడా పర్వతం పై దేవత

IX

కేంబ్రిడ్జి – ట్రినిటీ కాలేజీ !

(1805-1806)

యౌవనంలోనే సంప్రదాయాన్ని
గుడ్డిగా అనుసరిస్తాం – లేదా గుడ్డిగా వ్యతిరేకిస్తాం!
–పాల్ వాలెరీ!

ట్రినిటీ కాలేజీ హాస్టలులో జేరాడు, అక్టోబరు 1805లో. మొదటిసారిగా అతను పేదరికంనుంచి బైటపడి ధనవంతునిగా భావన కలిగింది. కోర్టు ఛాన్సర్ సాలీనా 500 పౌండ్ల భృతిని అందిస్తోంది. ఆ రోజుల్లో కాలేజీ విద్యార్థికి అది చాలా మంచి ఆదాయమే. అతనికి గుర్రం, ఒక సేవకుడు, పెట్టుకోగల స్థోమతు వచ్చింది. ఒక్కసారిగా జర్మన్ యువరాజుగా స్వేచ్ఛ అనుభవించాడు. అంతేకాదు ఇప్పటివరకూ తనని అదుపుచేస్తూ తనమీద అజమాయిషీ చేసిన తన తల్లి నుంచి పూర్తిగా విడుదల అవుతున్నాడు. "ఇక ముందు ఆమెను చూడను – పూర్తిగా తెగతెంపులు చేసుకుంటాను" అనుకుంటాడు! ఇది తల్లిపట్ల కఠినంగా వ్యవహరించినట్లేగానీ, అతని బాల్యంలో ఆమె పిచ్చి కేకలు, కోపతాపాలకు లోనయిన బైరన్‌కు న్యాయమే అనిపించింది. అవమానాలనుంచి అతను నేర్చుకున్నదేమిటి?

ట్రినిటీ కాలేజీ గొప్ప ముఖద్వారం. రెండు టవర్లు! లోపలికెళ్ళగానే విశాలమైన మైదానం. చుట్టూ గోతిక్ భవనాలు. పూలతో నీటియంత్రాలు. అక్కడ వాతావరణాన్ని

సజీవంగా వుంచుతుంటాయి. కుడి ప్రక్కగా ఒక ప్రార్థనామందిరం. ఆ ప్రక్కనే మాస్టర్ వుండే భవనం. చుట్టూ లతలతో! అక్కడనుంచి వరండాలోనుంచి రెండో మైదానంలోకి దారి. దీనినే Nevile కోర్టు అంటారు. ఇది మరింత పద్ధతిగా వుంటుంది.

దీనిచుట్టూ హాస్టలు భవనాలు – ఇక్కడే బైరన్ గదులున్నాయి. చాలా చక్కని వసతి. అతనికి నచ్చినవిధంగా సామానుతో అలంకరించాడు.

స్కూల్లోమాదిరిగానే కాలేజీలో కూడా తనే కేంద్రంగా వుండాలని ఆశించాడు. వీరందరికీ నాయకుడుగా వుండాలని అతని రహస్యపు కోరిక! ఇది నిజానికి బలహీనుల ఆశ. బద్ధకస్తుల లక్షణం కూడా!

ట్రినిటీ కాలేజీలో తనకంటే తక్కువ తరగతిలో వున్నవాళ్ళు తన ఈడువారే. వాళ్ళకు ఒక రక్షకుడిగా వుండటానికి వాళ్ళు చిన్నవాళ్ళు కాదు. మొదటిరోజుల్లో కొన్నాళ్ళు కొవ్వొత్తుల వెలుగులో గ్రీకు పాఠాలు చదవటానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులను కొందరిని తప్పితే ఇక్కడ చేయవలసిన పని ఏమీ లేనట్లు గుర్తించాడు.

ఈ కాలేజీ జీవితం ఒక ఫాషన్. వైను తాగి ఇష్టం వచ్చినట్లు గడపటానికి, ఇక్కడ తన వ్యక్తిగత చరిత్రను, వైను తాగటంతో నింపకుండా, అప్పటి సామాజిక చరిత్రను ఎవరూ చదవలేరు! రాత్రి భోజనం ముందు కనీసం రెండు సీసాల పోర్టు వైను తాగకపోతే అతను పేదవానికిందే లెక్క!

'అరె! అతను నాలుగు సీసాల వాడు – అయిదు సీసాలవాడు' అని చెప్పుకునేవారు!

చాలామంది లార్డ్లు తమ పిల్లలకు భోజనానికి డబ్బు ఇచ్చేవాళ్ళు. "ముందుముందు లండన్ 'సోషల్ లైఫ్'కు ఇది చాలా అవసరం అని కూడా అనేవాళ్ళు! లార్డ్ హాలండ్ తన పుత్రుడు చార్లెస్ జేమ్స్‌కు అప్పటికి అతనికి 15 సం॥రాలే – ఈ విధంగా జూదం ఆడటానికి తర్ఫీదు ఇచ్చాడు.

కేంబ్రిడ్జి అంటే లండన్‌కు అనుకరణ అన్నమాట! సంస్కృతి గురించి చదవటం, లేదా చదివే సంస్కృతి ఇది బైరన్‌కి చాలా ఇష్టమైన విషయం. ఇక్కడ విద్యార్థులు దీనిని చాలా విసుగుగా తలచేవారు.

అందరికంటే ముందుగా డైనింగ్ హాలుకు వెళ్ళి భోజనం చేసేవాడు, అన్నింటికంటే ఎత్తైన బల్లదగ్గర కూర్చొని, ఇది 'పెల్లోస్'కు లేదా మాస్టర్లకు ప్రత్యేకం! 'కింగ్ హెన్రీ VIII పై నుంచి చూస్తుంటాడు తన రంగుల చిత్రంలోనుంచి. బైరన్‌కు ఈ జూనియర్లపైన త్వరలోనే ఒక విధమైన నిరసన పుట్టింది. "ఏమిటి, వీరు సాధించేది. పిచ్చి జోకులు. బద్ధకపు దినచర్య. కాలేజీ క్లాసులు – చర్చిలో పడి తినడం ఇదా జీవితం? వారికి కవిత్వంగాని మానసిక ఔన్నత్యంగానీ వుందా? గదుల్లో కూర్చొని తాగటం ఫ్యాషనా? బైరన్‌కు ఈ తాగుడంటే అసహ్యం! కానీ అందరిలో గొప్పగా కనిపించాలికదా – హాన్సన్ ద్వారా నాలుగు డజన్ల పోర్టు వైన్ సీసాలు తెప్పించాడు. బర్గుందీ – మదిరా అన్నీ, అలాగే పేకాట అంటే అసహ్యం. "నాకు ఓర్పు – నేర్పు రెండూ లేవు. లెక్కడొక్క అసలు తెలీదు. కానీ అందరికోసం. అంతేకాదు తన క్రూరమైన తాతల తండ్రుల వారసత్వాన్ని కాపాడాలికదా!

సన్యాసి జీవితం ఎలా గడపగలడు?

ఉదయపు గాలులు, చర్చి గంటల శబ్దాన్ని మోసుకొస్తుంటే నిద్రలేచాడు. 'సెయింట్స్ రోజున' తెల్లని 'రోబ్'లో చర్చికి వెళ్ళాలి. క్లారినెట్ మాధుర్యం పిలుపు, నిద్రమత్తులో ఉన్న విద్యార్థులను మేల్కొలిపేది. దినచర్య అలా మొదలవుతుంది. బైరన్ గురువుకు చాలా తొందరగా అర్థమవుతుంది, ఇతన్ని చూడటమే కష్టమని ఏ పనీ చేయటానికి ఇష్టపడడని! త్వరలోనే బైరన్ ఒక గ్రేహార్స్ కొన్నాడు. దానికి 'ఓట్ ఈటర్' అని పేరుపెట్టాడు. ప్రతిరోజు ఉదయం మెరిసే కోటు వేసుకుని, ఇది చాలా డాబుసరి వేషం. కానీ అప్పటికది సరిపోయేది. కానీ ఈ కేంబ్రిడ్జిలో తనేకదా 'బ్రమ్మెల్' ! వాతావరణం సరిగా వుంటే ఈతకు వెళ్ళేవాడు.

నది వంపు తిరిగేచోటు – చెట్ల కొమ్మల కిందగా ఒకచోట ఎంచుకున్నాడు. తన స్కూలు స్నేహితుడు నోయిల్ లాంగ్. ఇతనే బైరన్‌కు చిన్ననాటి నుంచి స్నేహితుడు – వెంట వుండేవాడు.

"టామ్ వైల్డ్ మాన్ నాకు ఎడమ వైపు – లాంగ్ కుడివైపు" అని రాసుకున్నాడు కదా! "ఈ లాంగ్ చాలా నిజాయితీగల వ్యక్తి! బైరన్‌లాగానే బాగా ఈదగలడు.

మంచి చదువరి కూడా". లాంగ్‌తో వెళ్ళటం నీళ్ళ అడుగునుంచి ఏదో వస్తువును పైకి తేవటం అతనికి ఆనందం కలిగించే విషయం. 14 అడుగుల లోతునుంచి నీటి అడుగున ఓ చెట్టు మొదలు వుండేది. దాన్ని పట్టుకుని కళ్ళు తెరిచి ఆశ్చర్యపోయేవాడు. ఇక్కడకు, ఈ నీటి ప్రపంచంలోకి ఎలా వచ్చాను అని! సాయంత్రాలు బైరన్ గదుల్లోకి లాంగ్ వచ్చేవాడు. వేణువుగానీ, సెల్లోగానీ వాయించేవాడు. బైరన్ తనకిష్టమైన సోడా తాగుతూ వింటూండేవాడు.

ఈ సంగీతం అతనిలో కవిత్వపు ధోరణిని మేల్కొల్పేది. అలాంటి భావన అతన్ని ఎంతో విచారంలోకి విషాద స్మృతులలోకి తీసుకుపోయేది. అతని మనసులో 'న్యూస్టెడ్' వాతావరణం, అక్కడి గబ్బిలాల రెక్కల చప్పుడు. పూల పెళ్ళి బాట. ఆన్సలీ మేరీ చావర్తు, ఆమె పాటలు, ఎల్మ్ ఆకుల గలగలలు. జాన్ పీచే సమాధి రాయి, మార్గరెట్ కళ్ళు (ఇప్పుడు శాశ్వతంగా మూసుకుపోయాయి) అన్నీ మదిలో మెదిలేవి!

అప్పుడే లాంగ్‌తో కలిసి గట్టిగా పద్యాలు చదివేవాడు. "అతని స్నేహం – చాలా హింసతో కూడి వుండేది. కానీ నా జీవితంలో అంతకంటే రమణీయమైన సమయం మరొకటి లేదేమో" అనుకునేవాడు.

ఎవరు ఈ గాఢమైన అనురాగానికి స్వచ్ఛమైన ప్రేమకు మూలకారణం? కేంబ్రిడ్జి కాలేజీలు చర్చిలో పాడేవాళ్ళ పేర్లు నమోదు చేసేవారు.

ఒకసారి మునిగిపోతుంటే తాను రక్షించిన ఎడిల్స్టన్ అనే కుర్రవాడిని – పరిచయం చేశాడు. తర్వాత చర్చిలో పాడే సమయంలో ఆ కుర్రవాడి గాత్రంలోని మాధుర్యాన్ని గమనించాడు. అతనితో స్నేహం చేశాడు. అలాంటి స్నేహం అరుదు. అతను తనకంటే చిన్నవాడు. తక్కువ తరగతిలో వున్నాడు. పైగా తక్కువ 'రాంక్'లో వున్నాడు! ఈ 'ఎడిల్స్టన్' మీద బైరన్ ప్రభావం చాలా ఎక్కువ. అంతేకాదు అతని సర్వ రక్షకుడుగా నిలిచాడు. ఈ యువ గాయకుడు మొదట్లో సిగ్గుపడినా తర్వాత బైరన్ అనురాగానికి లొంగిపోయాడు. బైరన్ కవిత్వానికి వస్తువుగా కూడా మారాడు.

'అతని నేల చూపులు - అతని ప్రేమను
దాయలేవు - నా నిరాకరణ భయం కూడా
నేను ఏదైనా బహుమతి అందుకోబోతున్నప్పుడు
అది పోతుందేమోనని భయంకూడా"

కవిత్వం, పద్యాలు రాయటం బైరన్‌కు అలవాటయిపోయింది. ఇదివరకటిలా చదవటం లేదు. ఈ కేంబ్రిడ్జి రోజుల్లో పగటి కలలు కనడం, ఊహాలోకాలలో విహరించటం, కవిత్వం రాయటం, నీటిలో ఈదులాడటం. కవితలల్లటం. వళ్ళు తిమ్మిరి పుట్టేవరకూ నీటిలో మునగటం, కవితలు రాయటం. ఇదోపనిగా సాగిపోయింది.

ఇక్కడి జీవితం బాగానేవుంది. బైరన్ త్వరగా అలవాటుపడే ప్రాణం. ఇది మరీ ఖరీదయిన జీవితంగా మారిపోయింది. అతను మొదట్లో జర్మన్ యువరాజులా బ్రతకవచ్చునుకున్న 500 పౌండ్ల సాలీనా ఆదాయం చాలదని, ఈ ఖరీదయిన జీవన శైలికి, త్వరగానే తేలిపోయింది. ప్రతీ నెల కాలేజీ మెస్‌నుంచి బరువైన బిల్లులే వస్తున్నాయి. పైగా బైరన్ తన స్నేహితులకి తన గదుల్లోనే విందులిస్తున్నాడు.

హారోలోనే అప్పులు తీర్చకుండా వచ్చాడు. కేంబ్రిడ్జిలో తన గదులకు పూర్తి హంగులు సమకూర్చాలి. తన లాయరు హాన్సన్‌కు రాస్తాడు, చాన్సెలర్ కోర్టుకు మరింత భృతికోసం అర్జీపెట్టమని. ఇప్పుడు తన లాయరుతో అతని హోదా ఉంది. అతను తనకి, లార్డ్‌కి ఏజెంటుకదా! అయినా హాన్సన్ కాస్త జాగ్రత్తగా డబ్బు వాడుకోమని సలహా ఇస్తాడు.

తన లాయర్‌కు మీరు మీ విధిని నిర్వర్తించకపోతే నేను అప్పు చేయాల్సి వస్తుందని బైరన్ గట్టిగానే రాస్తాడు. బైరన్‌కు అప్పు పుట్టటం పెద్ద కష్టమేం కాదు. త్వరలో లార్డ్ షిప్ వస్తుంది. న్యూస్టెడ్ ఎస్టేటు, రోష్‌డేల్ సంస్థానం కూడా ఇతనిదే. కాని అప్పు ఇచ్చేవాళ్ళు మరొకరి సంతకం తీసుకుంటారు. పూర్తిగా మేజర్ అయిన బంధువు అయివుండాలి. బైరన్‌కు అగస్టా మనసులోకి వస్తూంది.

ఆమెతో నమ్మకంగా చెప్తాడు. నీకు ఎటువంటి ఇబ్బంది లేదు. "ఒకవేళ నేను చనిపోతే నా వారసురాలివి నీవేకదా" అంటాడు! 'నేను బ్రతికుంటా. నేనే

అప్పులు తీరుస్తాను'. 'నీకు అనుమానం వద్దు'. 'ఒకవేళ నీకు ఎటువంటి అనుమానం ఉన్నా, నాకు చెప్పటానికి వెనకాడవద్దు' అనికూడా భరోసా ఇస్తాడు.

అగస్టా, అతనికి గ్యారంటీగా సంతకం చేస్తుంది. ఆ విధంగా వందల పౌండ్లు అప్పులు చేస్తాడు. ఇది త్వరగానే అతని తల్లికి తెలుస్తుంది. ఆమెకు చిర్రెత్తుకువస్తుంది. "చివరికి వాడే నన్ను చంపుతాడు. ఎలా అప్పులు చేస్తున్నాడు. ఎలా తగలేస్తున్నాడు. అప్పులవాళ్ళ గుప్పెట్లో పడిపోయాడే" అని బాధపడింది.

"పిట్స్ విగ్రహానికి 31 పౌండ్ల 10 షిల్లింగులు ఇచ్చాడా? ఇప్పుడు గుర్రపు బగ్గీ కూడా కొన్నాడా? అది నాకోసం అని చెప్తున్నాడా? ఆ బండి నాకెందుకు? వీడు పూర్తిగా చెడిపోయినట్లున్నాడు – వీడిని ఎవత్తో మోసం చేస్తోంది" అని వాపోయింది.

ఇప్పుడు జేబులో దండిగా డబ్బు వుండటంతో అసలు ఏ పనీ చేయటంలేదు. అసలు యూనివర్శిటీ వదిలి తిరగటం మొదలుపెట్టాడు. పికడిల్లీ సెంటర్లో 16 నెంబరు ఇల్లు తీసుకున్నాడు. అది శ్రీమతి బైరన్ లండన్ వస్తే వుండటానికి కేటాయించినది.

అక్కడే ఒక ఉంపుడుగత్తెను కూడా పెట్టుకున్నాడు. ఆమె చిన్నదే. మర్యాద కలదే. ఆ అమ్మాయికి మగవాడి వేషం వేసి తన తమ్ముడుగా బ్రైటన్‌కు తీసుకువెళ్ళాడు. అక్కడ పెవిలియన్‌కు ఎదురుగా ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. అక్కడ వ్యాహాళికి వచ్చేవారు ఈ యువకుడు బోటులోకి దూకడం చూసేవారు.

పట్నంలో అతని సమయం అంతా జాక్సన్, ఏంజెలోతో గడిపేవాడు – ఇతను కత్తి యుద్ధంలో ఆరితేరినవాడు. ఇవన్నీ చాలా ఖరీదయిన అలవాట్లు. అక్కడే బాండ్ వీధిలో ఈ రాచరికపు విద్యలన్నీ నేర్పుతారు, స్వీయరక్షణ కోసం.

ఒకడు బాక్సింగ్ – ఒకడు కత్తియద్ధంలో తర్ఫీదు ఇచ్చేవాళ్ళు!

వీరి తర్ఫీదు – బైరన్ తన అదనపు బరువును తగ్గించుకున్నాడు. సన్నగా వుండటం అతనికి ఒక తీరని కోరిక. ఈ విధంగా సాధించగలిగాడు. వీరితో కాకపోతే ఇంకెక్కడికి పోగలడు? ఎవరితో పరిచయం లేదుకదా. ప్రిన్స్ ఆఫ్ వేల్స్, చార్లెస్ జేమ్స్ ఫాక్స్, వాళ్ళ గురించి చాలా విన్నాడు.

అక్కడి ఆడవారిని గమనించాడు.

కానీ లార్డ్ బైరన్ ఒంటరివాడు. ఇతనికి కుటుంబ సభ్యులు లేరు. స్నేహితులు లేరు.

ఈ విధంగా ఒక టర్మ్ అంతా లండన్‌లో గడిపాడు. తిరిగి కేంబ్రిడ్జ్ వచ్చినపుడు తనతోపాటు తన లండన్ స్నేహితుల్ని తీసుకువచ్చాడు. అతనికి జాక్సన్ మీద, ఏంజెలో మీద బాగా నమ్మకం. వీరిని కేంబ్రిడ్జిలో అందరికీ పరిచయం చేయటం అతని ఉద్దేశ్యం.

తనతోపాటు రాత్రి భోజనానికి పిలిచాడు. మంచి బీరు తెప్పించాడు. తిరిగి వెళ్ళేప్పుడు మంచి 'ఏల్' స్పిరిట్ ఇచ్చిపంపాడు.

అతనికి 'పాఠాలు' చెప్పిన మాస్టరు 'ఏమిటిదంతా' అని మందలించాడు.

'ఇక్కడివారికంటే వాళ్ళు మెరుగు' అని గట్టిగా దబాయించాడు బైరన్.

ఈ యూనివర్శిటీ అంటే అతనికి చిరాకు పుడుతుంది.

"ఎవరూ నాలోవున్న రచయితను పట్టించుకోరే? అంటే ఏ రచయితనయినా చదివారా? వాళ్ళు వట్టి దయ్యాలు. పనికిరానివారు. నేర్చుకోవాలని, తెలుసుకోవాలని తపన లేదే వీరికి.

నా ఉత్సాహం కూడా రోజూ రెండుపూటలా తినటంతోనే మారిపోయిందే" – అనుకున్నాడు. తన జీవితం అస్తవ్యస్తంగా సాగుతోంది.

అతని మానసిక వేదన విసిగిస్తోంది. అతని డబ్బును హరిస్తోంది.

కానీ 'గౌరవంగా' బ్రతకాలంటే ఇదే దారి కదా, అనుకున్నాడు.



ట్రినిటీ కాలేజీలో విద్యార్థిగా బైరన్



ట్రినిటీ కాలేజీ

X

బద్ధకపు రోజులు

(1806 -1807)

కవి కావాలంటే ప్రేమించాలి / దుఃఖించాలి
(పెట్రార్క్ – డాంటేలాగా)
నేను రెండూ చేస్తాను. అందుకే
Hours of Idleness రాశాను!

–బైరన్

వేసవి చివర్లో సౌత్‌వెల్‌కు తిరిగివచ్చాడు. కానీ అతని తల్లి చాలా దారుణంగా ప్రవర్తించింది. అతనిమీద పారలు – పలుగులు విసిరి పిచ్చిగా ప్రవర్తించింది. ఇల్లు వదిలి స్నేహితుల దగ్గర తలదాచుకున్నాడు. ఆ తరువాత లండన్ వెళ్ళిపోయాడు, ఆమెను చూడకుండానే.

లండన్ నుంచి పీగాట్‌కు రాస్తాడు, “జరిగిందానికి, నీవు వివరించటానికి ధన్యవాదాలు. చక్కగా వర్ణించావు. ఆమె ఆడిటర్లకు క్షమాపణలు కూడా పంపినట్లుంది. ఆమె అరుపులు సంగీతభరితంగా ముఖ్యంగా హైపిచ్‌లో వున్నప్పుడు వెన్నెల రాత్రిలో చాలా దూరం వినవచ్చు. నిజానికి మీ అమ్మగారు, మీ కుటుంబం నన్ను బాగా ఆదుకున్నారు. నేను తప్పించుకుని రావటానికి ఎంతో సహాయం చేశారు. ‘బైరన్ కోపం నుంచి’.

అబ్బో ఆమె తిట్లు, Aristo గ్రంధం నుంచి లేదా ‘ఇన్‌ఫెర్నో’ రాసిన ‘డాంటే’, అతనికంటే గొప్పగా ఎవరు చెప్పగలరు? ఇవన్ని తలపిస్తున్నాయి.

ఎంత చేదు హాస్యం!

లండన్ చేరాడు. తల్లి తిట్లు తన ఆయుధాల ప్రయోగం, వెంటపడటం చివరికి ఒక ఖైదీని తరిమినట్లు తరిమికొట్టిందికదా! ఈ యుద్ధం తర్వాత బైరన్ సస్సెక్స్ తీరానికి వెళ్ళాడు. తర్వాత జాన్ పీగాట్‌తో హారోగేట్‌కు వెళ్ళాడు. ఈ యువకుడు ఎలిజిబెత్ సోదరుడు, సంస్కారం కలవాడు. నవ్వుతూ వుంటాడు. అతనికి బైరన్ పరివారాన్ని చూస్తే ఆశ్చర్యం. తలుపులుమీద 'Crede Byron' అని వుంటుంది. రెండు గుర్రాలు జీన్లుతో ఉంటాయి. వాటికి సంరక్షకుడుకూడా వుంటాడు. బండిలో బైరన్, పీగాట్‌తోపాటు రెండు కుక్కలు – బోట్స్‌వెయిన్, మరొకటి బుల్‌డాగ్ నెల్సన్!

నిజానికి బైరన్ ధనవంతుడు కాదు. కానీ ఇవన్నీ ఎందుకు మరి? ఈ గుర్రాలు – కుక్కలు – పనివాళ్ళు? అతనికి తన జీవితంలో ఒకసారి ప్రవేశించిన వారిని వదులుకోలేని బలహీనత, నిస్పహాయిత వుంది.

తన వ్యక్తిత్వంలో తన బండివాడు, బండి గుర్రాలు ఈ విశ్వసపాత్రమైన కుక్కలు అన్నీ భాగమనుకుంటాడు. అతని హృదయంలో వీళ్ళందరికీ చోటు వుంటుంది. అందర్నీ తనతోనే వుంచుకుంటాడు.

అతని భావోద్రేకం అందరితో కట్టిపడేసేది, తనకు దగ్గరగా వచ్చిన వాళ్ళతో.

జాన్ పిగాట్ – బైరన్‌లోని బిడియాన్ని ఎన్నోసార్లు పసిగట్టాడు. హారోగేట్‌లో అందరితో కలిసి డైనింగ్ హాల్‌లో భోజనం చేయటానికి అంత ఇచ్ఛ చూపేవాడు కాదు. ఎంత త్వరగా వీలయితే అంతగా తన గదుల్లోకి వెళ్ళిపోవాలని తొందరపడేవాడు. అంతేకాదు తాగుడు అంటే ఏమాత్రం ఇష్టపడేవాడు కాదు. భయపడేవాడు కాదు. ఆరోగ్య సూత్రాలు చాలా కఠిన నియమాలు పాటించేవాడు.

అతనికి కవితలు రాయటంలో ఎంతో ఆనందం ఉండేది. మేరీ చావర్తు ప్రేమ వ్యవహారం తర్వాత కూడా, ఆడవారి అందానికి చాలా తొందరగా ఆకర్షితుడయ్యాడు. కానీ పీగాట్ సమక్షంలో ప్రేమలోని వ్యవహారాన్ని గుర్తించేవాడిగా కనిపించేవాడు. స్త్రీలను ఎలా గెలవాలి అని తూకం వేసేవాడు. ఒకరకమైన ద్వేషంతో లోబరుచుకోవాలని ఆలోచించేవాడు. 'పీగాట్, వాళ్ళను ప్రేమించకు, తృణీకరించు!' అని బోధించేవాడు.

ఎందుకు ఈ అమ్మాయికోసం ఆరాటపడతావు?

ఎన్నాళ్ళు ప్రయత్నించినా ఒక నిట్టూర్పు

ఒక్క వయ్యారిని పట్టలేవు

ప్రేమించటం నేర్పుతారా?

తెలియదు, నటిస్తుంది!

నిర్లక్ష్యం చేసినట్టున్నావా – అంతలోనే నవ్వుతుంది

అదిగో అప్పుడే, అందాల భామను అందుకో...

ఇలా బోధించాడు – పీగాట్‌కి!

ఇవన్నీ అతను కూడా పాటించాడా? ఈ కేంబ్రిడ్జి రోజుల్లో?!

తర్వాత ఇద్దరు స్నేహితులు సౌత్‌వెల్ తిరిగి వచ్చారు. అప్పటికి అతని తల్లి కాస్త చల్లబడింది! నిజానికి బైరన్ తన పటాలంతో రావటం ఆమెకు మింగుడు పడలేదు! ఇద్దరు సేవకులు రెండు గుర్రాలు రెండు కుక్కలు! అరె, వీరందర్నీ ఎలా పోషించాలి? కానీ ఏమయినా అంటే మళ్ళీ వెళ్ళిపోతాడని భయపడింది? బైరన్ తన పరిస్థితి ఆమెకు స్పష్టంగానే తెలియజేశాడు. అతను అప్పుచేసిన సొమ్మంతా ఖర్చయిపోయింది. కనీసం ప్రయాణించటానికి, కేంబ్రిడ్జిలో తర్వాత టర్మ్ వుండటానికి డబ్బు లేదు.

ఇక్కడ అయితే వుండటానికి ఖర్చవదు! పైగా అతనికి ఒకరకమైన స్తబ్ధత ఏర్పడింది. ట్రినిటీలోకంటే ఇక్కడ సుఖంగా ఏమీ లేదు. కానీ తన జీవితానికి ఒక లక్ష్యం పెట్టుకున్నాడు. తను కవిగా ఎదగాలి!

ఈ ఆలోచన కలిగించింది ఎలిజబెత్ పీగాట్! ఒకరోజున ఎలిజబెత్ అతనికి కొన్ని కవితలు వినిపించింది. అప్పుడు “నేనూ కొన్ని రాశాను” అని చదువుతాడు. అతని కవితాశక్తికి ఎలిజబెత్ ఆశ్చర్యపోతుంది. మరొకరోజు Burns రాసిన కవిత చదువుతూ అరె – ఈ ఛందస్సు బాగుంది. నేను రాయగలను. అని ఆసువుగా చెప్పగలుగుతాడు.

ఆన్సలే కొండలు బండగా మొండిగా

అక్కడే నా బాల్యం గడిచిపోయింది

ఉత్తర గాలులు ఊళలు వేస్తున్నాయి

ఇప్పుడేమీ లేవు. కాలం కరిగిపోతుంది

పాత జ్ఞాపకాలు వెన్నాడుతుంటాయి

నా మేరీ నవ్వులేదు

అప్పుడదే నాకు స్వర్గం...

ఎలిజబెత్ ఎంతో మెచ్చుకుంది. ఈ విషాద ప్రేమలోని మాధుర్యం ఆమెను కదిపివేసింది.

ఆమె బైరన్‌కు మంచి స్నేహితురాలు. ఎలాంటి ఆడంబరాలు లేని యువతి. ఇలాంటివారు అబ్బాయిల దృష్టిలోపడరు! ఆమె అతని బిడియాన్ని ఎత్తిచూపేది.

ఆమె దగ్గరకు వస్తుంటే, అతను 'ఒకటి రెండు మూడు' అని లెక్కించేవాడు ఒక రకమైన బెరుకుతో.

కానీ ఎలిజిబెత్ తన కవితలు మెచ్చుకోవటం అతనికి విశ్వాసం కలిగించింది!

అతని కవితలు గుదిగుచ్చి ప్రచురణకు సిద్ధం చేస్తానని చెప్పింది.

అతను ఒక సాధారణ జీవితానికి అలవాటుపడ్డాడు.

రాత్రంతా కవిత్వంతో కుస్తీపట్టేవాడు. చాలా ఆలస్యంగా నిద్రపోయేవాడు. అంతకంటే ఆలస్యంగా నిద్ర లేచేవాడు. దాదాపు మధ్యాహ్నం.

ఎలిజబెత్ ఇంటికి వెళ్ళి రాత్రి తను రాసింది చూపించేవాడు. ఆ సమయంలో ఎవరైనావస్తే కిటికీలోనుంచి పారిపోయేవాడు.

అక్కడనుంచి మరొక స్నేహితుడు రెవరెండ్ జాన్ బెచర్ (Rev. John Becher) ఇంటికి వెళ్ళేవాడు.

అతనితో ఈ విశ్వం గురించి, విధి గురించి చర్చించేవాడు.

"అరే! నువ్వు నమ్మని దేవుడు నీకు ఎన్ని వరాలు ఇచ్చాడు! నీకు అంతస్తు, తెలివి, అదృష్టం అన్నింటికీ మించి నిన్ను సామాన్యులకంటే మిగతా మానవ జాతికంటే ఉన్నతంగా నిలబెట్టే, 'మేధ'నిచ్చాడు" అని వాదించేవాడు.

"అయ్యో! ఇదిగో ఈ తల నన్ను ఎంతో ఎత్తున నిలబెడితే, ఇదిగో ఈ అవిటి కాలు, నన్ను పాతాళంలో నిలబెడుతోంది" అని బెచర్‌తో వాపోయేవాడు!

"నన్ను జనసామాన్యంలో కలిసి పొమ్మంటున్నావు. కానీ, నేను చిన్నచూపు చూసి పట్టించుకోని అంతస్తుకు, నేను దిగజారలేనుకదా" అనేవాడు.

"ఇప్పటికే ప్రేమతో తీపిచేదులు రుచిచూశాను. స్నేహాన్ని విశ్వసించటం నేర్చుకున్నాను. ప్రపంచంలోని లౌక్యం నాకు వంటపట్టకపోవచ్చు. స్నేహితుణ్ణి ఎంతగా నమ్మినా ఇంకా మోసం చేయవచ్చు!"

ఈ సౌత్‌వెల్ మఠంలో తనను సన్యాసిగా ఊహించుకున్నాడు. అదే వయసుమీరిన సన్యాసిగా! తన దురదృష్టానికి, తెలివితేటలకు బలయిన సన్యాసిగా! తల్లికి ఎదురుగా కూర్చుని ఉపాహారం తీసుకుంటుంటే గట్టిగా చదివేవాడు. ఆమెను మాట్లాడకుండా చూడటానికే!

మధ్యాహ్నాలు బయట తిరగటానికి ఉపయోగించేవాడు. నదిలో స్నానం చేసేవాడు, ఎంతోసేపు ఈదేవాడు. నీళ్ళలో వస్తువులు వేసి మునిగి తీసేవాడు.

సౌత్‌వెల్ మొత్తం ఉలిక్కిపడేది, అతని పిస్టల్ షూటింగ్‌తో. గుర్రాల స్వారీ చేసేవాడు కానీ, గుర్రాల గురించి అంతగా తెలీదు. ఒకసారి వీధులలో వెళ్తున్న గుర్రాలను చూసి వీటిని కావాలని అనుకుంటాడు. నిజానికి అవి అతనివే!

వీటన్నికీ వెనుక అతని ముఖ్య ఉద్దేశ్యం సన్నగా నాజూకుగా వుండాలనే!

విపరీతమైన శరీర శ్రమ, తక్కువ ఆహారం ఇదే అతని సూత్రం.

ఇరవయి నాలుగ్గంటల్లో ఒక్క మాంసం ముక్క కూడా తినేవాడు కాదు. బీరుగానీ ముట్టేవాడుకాదు. రోజుకు ఒక్కసారే, ఏమితిన్నా. ఈ విధంగా అతని ప్రక్కటెముకలు బైటపడ్డాయి. పాలిపోయిన మూతి మరింతగా వెలిగిపోతోంది! రమణీయంగా!

సాయంత్రాలు స్నేహితులతో, పీగాట్‌తో గడిపేవాడు. సౌత్‌వెల్‌లో యువకులకేమీ కొదవలేదు. ఇప్పుడిప్పుడే అతనికి బిడియం తగ్గిపోతుంది. వీళ్ళ పరిచయంతో పీగాట్‌తో చెప్పినట్లు వాళ్ళతో స్నేహం చేస్తున్నాడు. ప్రేమించటం కాదు. వాళ్ళతో మాట్లాడటం, దగ్గరగా తీసుకోవటం, కవితలు రాయటం.

ఈ విధంగా అతనికి, ఒక యువతి దగ్గరగా వచ్చింది. అంటే 'కొత్త మేరీ' అన్నమాట! బంగారు రంగు జుత్తుకలది.

ఒకసారి తనదగ్గర చక్కగా మలచబడిన 'రక్ష' వుందని ఒక యువతి చెబుతుంది.

"ఇది దగ్గరవుంటే ఎప్పటికీ ప్రేమలోపడరు" అని అనగానే-

"అది నాకివ్వు. అదే కావలసింది" అని కరకుగానే అడుగుతాడు.

ఇలా రోజులు దొర్లిపోతున్నాయి. ఈ మార్పులేని స్తబ్దత, అతనికి బాగా పనికి వచ్చింది.

యువతులతో స్నేహం, అతని కవితలకు చక్కని స్ఫూర్తినిచ్చింది.

చిత్రకారునికి ఒకరకమైన భౌతిక స్తబ్దత ఎంత అవసరమో, మానసికోల్లాసం అంత అవసరం. ఈ వాతావరణంలో బైరన్ పని బాగా సాగుతున్నది ఈ వరసలోనే.

దిలావర్‌కి, క్లేర్‌కి, డోర్‌సెట్‌కు వీరికోసం రాసిన కవితలు కాటులస్ అనువాదాలు, వర్జిల్ పద్యాలు, 'ఎడిల్‌స్టన్' పద్యాలు 'న్యూస్టెడ్' మరణగేయాలు ఇవన్నీ చిన్న పుస్తకమే అవుతోంది. అవి మళ్ళీమళ్ళీ చదివాడు ఈ చిన్న పుస్తకం తనకు పేరు తెచ్చిపెడుతుందా? అవుననే అంటుంది ఎలిజబెత్.

నేవార్క్‌లోని ముద్రణాలయం యజమాని - రిడ్జి, బైరన్ చిన్న పుస్తకాన్ని ప్రచురించాడు. దాని శీర్షిక Fugitive pieces: మొదటి రెండు ప్రతులు రాగానే వాటిని పీగాట్‌కి, బెచెర్‌కీ చూపించాడు. వాటిపై స్పందన బైరన్ అనుకున్నదానికి చాలా భిన్నంగా వుంది. ముఖ్యంగా బెచెర్ (మతాచారి) ఈ కవితలు చదివాడు. కొన్ని అతనికి చాలా ఇబ్బంది కలిగించాయి. ముఖ్యంగా 'మేరీ'కి రాసినవి! వీటిని 'జనంలోకి ఎలా తీసుకువెళ్తావు' అని అంటాడు. పాపం బైరన్! ఈ మతాచారి అభ్యంతరాలను కాదనలేకపోయాడు! పుస్తకాన్ని విడుదల చేయనని అన్నాడు.

ఎక్కువ ఆలోచించకుండానే, మొత్తం ప్రతులన్నీ తగలబెడతానని, అంతపనీ చేశాడు. కానీ అప్పటికే పీగాట్ (John pigot)కి చేరిన ప్రతి ఒక్కటి మిగిలిపోయింది. అప్పుడు అతను ఎడిన్ బర్గ్ విశ్వవిద్యాలయంలో వున్నాడు. దానితోపాటు బెచెర్‌కి ఇచ్చినదికూడా!

నిజానికి అతని వయసుకు అది చాలా పెద్ద త్యాగమే. కానీ బైరన్ అంతటి ధైర్యంకలవాడు!

అక్కడ నుంచి ఒక్కరోజు కూడా వృధాపోనివ్వకుండా ఆ గ్రంథాన్ని మేరీకి రాసిన కవితకాకుండా మొత్తం తిరగరాశాడు. దానికి "Poems on Various Occassions" అనే పేరుతో 1807 జనవరిలో విడుదల చేశాడు. 'అది చాలా బాగుంది – నిజంగా పవిత్రంగా!'

గ్రంథకర్త, తన కేంబ్రిడ్జి స్నేహితులకు ప్రతులను పంచిపెట్టాడు! అలాగే సౌత్‌వెల్‌లోని కొత్త స్నేహితులకూ ఇచ్చాడు! కేంబ్రిడ్జి నుంచి eulogies వచ్చినాయి.

సౌత్‌వెల్‌లో ఈ పుస్తకం పెద్ద దుమారంరేపింది. ముఖ్యంగా లీక్రాఫ్ట్ (Lea croft) కుటుంబం కత్తులు నూరారు.

ఆ కవితల్లో Juqiet గురించి వుంది. ఈమె 'జూలియా' కాదా? మరొకటి Lesbia. ఇది బైరన్ 'ప్రేమ గురించి రాసిన ఎగతాళి కవిత! ఇదికూడా ఆమె గురించి రాసిందనే అన్నారు. మొత్తం సౌత్‌వెల్ అంతా ఇదే పుకారు! ఇది నిజంగా భరించ శక్యంగా లేదు. జూలియా సోదరుడు లీక్రాఫ్ట్ దీనికి సమాధానం చెప్పమని బైరన్‌ను నిలదీశాడు. బైరన్ మతాచారి బెచెర్‌ను సంప్రదించాడు. ఏదోరకంగా తప్పించుకోవటానికి డొంకతిరుగుడు సమాధానం రాయాలని. ఆ విధంగానే బాగా సిగ్గుపడుతూ రాయటం, తర్వాత జరిగిన ఘర్షణ వాతావరణం బైరన్‌ను చాలా బాధపెట్టింది. ఈ చిన్న వూళ్ళో, ఇక్కడ జరగవలసిన, అతన్ని ఇబ్బందిపాలు చేయటానికి తంతు అంతా జరిగింది. అప్పటికి అతని పట్నపు తాలూకు బాధలు తెలియవు. ఇలాంటి ప్రాంతీయ విభేదాలు మహానగరంలోని జీవన సరళిలో వుండవనుకుంటాడు. ఇప్పటికే సౌత్‌వెల్‌లోని ఎలాంటి సంఘటనా జరగని స్తబ్దత అతనికి విసుగుపుట్టించింది. దీనిలోకూడా అతనికి ఆనందం వుంది. మధ్యమధ్యలో

ఈ పుస్తక ముద్రణకోసం నగర పరిసరాలు వెళ్ళి రావటం, అతనికి స్తబ్దతలోని ఆనందానికి అంతరాయం కలిగించేవి. ఇప్పుడు ఇదే విసుగుగా వుంది. ఏదో జరగాలి. ఏదో సంక్షోభం కావాలి! కానీ, తీరా అందులో పడితే మళ్ళీ దానినే వ్యతిరేకించేవాడు.

మిస్ పిగాట్ అతనికి పెద్ద దిక్కు. ఎలిజబెత్‌ను 'డియర్ క్వీన్ బెస్' అని పిలిచేవాడు.

"నీవు, బెచెర్ దక్క ఈ శాపగ్రస్తమైన అసహ్యకరమైన వాతావరణంలోని జనం అంతా Pit of Acheron లోకి పోయినా నేను లెక్కచేయను. అంతేకాదు, ఈ సౌత్‌వెల్ మట్టి, కలుషితమైన ఈ మట్టిని, నా చెప్పులకు కూడా అంటుకోనివ్వను."

ఇక్కడనుంచి ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా వెళ్ళిపోవాలని ఆరాటపడ్డాడు. అతని తల్లి కూడా అతన్ని ఆపాలని అనుకోలేదు.

"ఏడు నెలల నుంచి ఇక్కడేవున్నాడు. ఇద్దరు పనివాళ్ళు, అతనికి వచ్చే అయిదువందల పౌండ్లు అతనికే చాలవు. ఇంకా వాళ్ళను పోషించటం అదీ, తనకు వచ్చే తక్కువ భరణంతో చాలా కష్టం. అసంభవం."

దీని తర్వాత మరికొన్ని నెలలు అక్కడే వుండిపోయాడు. తన కవితలను సంస్కరిస్తూ. ఈసారి మరింతగా జనంలోకి పంపటానికి నిర్ణయించుకున్నాడు.

ఈసారి పుస్తకానికి 'స్తబ్ధ సమయం' (Hours of Idleness) అని పేరుపెట్టాడు. 'జార్జ్ గోర్డాన్' అని రచయిత పేరు రాశాడు. ప్రక్క Lord Byron (a minor) అని కొంటెతనంగా పెట్టాడు! దానికి ముందుమాట రాశాడు. "ఇవన్నీ తన 19వ ఏట. ఒక యువకుడు తన ఆలోచనల ప్రతిఫలం, అదీ తేలికగా గడిచిపోతున్న కాలంలో. దీనిలో కాస్త కుర్రకారు ఆలోచనలు వుండటం, అదీ నా వయస్సు చదువులకు బావుండవచ్చు. వీటివలన ఎటువంటి హానీ ఎవరికీ జరగదని ఆశిస్తాను. నా రాతలలో ఎవరినీ ఇబ్బందిపెట్టకూడదనీ అనుకుంటున్నాను. ఇవి చదివిన డా॥ జాన్సన్ నా బంధువు. ఒక అంతస్తుగల వ్యక్తి, గ్రంథకర్త లక్షణాలతో జనంలోకి వస్తే అతనికి స్వాగతం చెప్పాలి'. దీనిలో కొంత నాకు గౌరవం

వుందనుకుంటాను. నా అంతస్తు మూలంగా వచ్చే గౌరవంకంటే నా రచనలమీద ఎంత కఠినమైనా, విమర్శనే ఆహ్వానిస్తాను".

ఈ పుస్తకం బైటకు రాగానే అతను లండన్ బయలుదేరి వెళ్ళిపోయాడు. ప్రతులను పుస్తకాల దుకాణాల్లో విస్తృతంగా చేర్చటానికి!

చేతిలో చిల్లిగవ్వ లేకుండా జూన్ మొదటివారం లండన్‌లో అడుగుపెట్టటం ఎంతవరకు సబబు? గొప్ప పేరు అప్పుడే ముద్రించబడిన పుస్తకంతో! అప్పటినుంచి తల్లిని సౌత్‌వెల్‌లో వదిలి దూరంగా వచ్చేశాడు. కానీ Queen Bessకు వుత్తరాలు పంపేవాడు. "ఒక్క నీవు తప్ప, ఆ సౌత్‌వెల్ ఆవరణల వాతావరణంతో విసిగిపోయాను. నా చేతివ్రాతతో నీవు చాలా ఇబ్బందులు పడివుంటావు. ఈ పాపపు వర్తులంలో నీ శ్రమను మర్చిపోలేదు. నన్ను నమ్ము. ఏదోరకంగా నీ బాకీ తీర్చుకోగలనని ఆశిస్తున్నాను.

దీనిలో అతని నిజాయితీ వుంది. అతను కౌగిలించుకున్న జూలీలు, మేరీలు వీళ్ళంటే అతనికి ఏమాత్రం గౌరవం లేదు. అతనిలో యౌవనపు మృగలక్షణం మాత్రమే వాళ్ళవెంట తరిమేది.

కానీ అతని అంతరంగపు అంతరాల్లో ఎదో మూల అతని ప్రేమకు గౌరవం సంతరిస్తూ ఒకచిన్నారి ఎప్పుడూ ఉంది.

ఇప్పుడు అతని ఆరాటం అంతా ఈ Hours of Idleness ఏ విధంగా జనంలోకి వెళ్ళిందని? దీనితో తనకు 'కవిగా' గుర్తింపు వస్తుందా? పుస్తకాలు త్వరగానే అమ్ముడు పోతున్నాయి. మళ్ళీ కావాలని దుకాణదారులడుగుతూనే వున్నారు.

రిడ్జి – అతని ప్రచురణకర్త ఒక వారంలో 56 ప్రతులు అమ్మేశాడు. ఇది చాలా గొప్ప విషయంకదా! ముఖ్యంగా సౌత్‌వెల్ జనం కొంటున్నారు. అసలు వీళ్ళేమనుకుంటున్నారని, అతనికి తెలుసుకోవాలని వుంది. 'ఎలిజబెత్‌ను అడిగేవాడు, "ఎవరు, ఆడవాళ్ళు కొంటున్నారా? వీళ్ళ అభిప్రాయం ఏమిటో?" అదే లండన్ పాఠకుల అభిప్రాయాలు ఎలా తెలుస్తుంది–

ఒక ప్రతి లార్డ్ కార్లైల్‌కు పంపాడు. అతను చాలా మర్యాదగా పుస్తకం తెరవకుండా రాశాడు. అతని మరో కజిన్, లార్డ్ అలెగ్జాండర్ గోర్డాన్. బైరన్

వుత్తరం ద్వారా "అమ్మ చదివింది. ఈ పుస్తకం గ్రంథకర్తను పరిచయం చేసుకోవాలని వుంది.. చాలా గొప్పగా వుంది" అని. కానీ ఆమె అతన్ని రమ్మని ఆహ్వానించలేదు.

"ప్రతి అద్దాల దుకాణంలో నా పేరు కనపడుతోంది. చూసి రహస్యంగా ఆనందిస్తున్నాను."

అందుకు, పుస్తకాల అమ్మకందారులు చాలా బాగా అమ్ముతున్నారు. మళ్ళీమళ్ళీ పుస్తకాలు కావాలని అడుగుతున్నారు. ఇది వేసవి. లండన్ సగం ఖాళీ అయిపోయింది. చలికాలం, ఇంకా బాగా అమ్మకాలుంటాయి. ఇదీ అతనికి ఆనందాన్నిచ్చింది. కొన్నవాళ్ళలో గొప్పవాళ్ళున్నారు. కొందరు విమర్శకుల దృష్టిలో ఈ పుస్తకం పడింది.

క్రిటికల్ రివ్యూ నన్ను ఆకాశానికెత్తివేసింది. మరొకరు తిట్టిపోశారు.

"అమ్మకాలు బాగున్నాయి. ఈ విరుద్ధ విమర్శలు మంచివే. పుస్తకాన్ని బ్రతికిస్తాయి! అంతేకాదు రచయితగా మొదలయినప్పటికీ, ఇది అందరికీ ఎదురయ్యే ఇబ్బందే. అదే తాత్వికతతో భరిస్తున్నా" అని రాసుకున్నాడు.

ఇప్పటికీ తను ఒంటరిగాడే.

అల్బర్‌మేక్ వీధిలో డోరాంట్ హోటల్‌లో వుంటున్నాడు. అతన్ని కలవటానికి ఎవరూ రావటంలేదు. హెన్రీ డ్రూరే ఇతనికోసం వెతికి చిరునామా తెలియక వెళ్ళిపోయాడు. అతని దూరపు బంధువు రాబర్ట్ చార్లెస్ డల్లాస్, బైరన్ పుస్తకం కొని చదివి ఉత్తరం రాస్తాడు. (అతను రచయిత). "ఈ మధ్యనే మీ కవితలు చదివాను. నేను మాటల్లో చెప్పలేని ఆనందం కలిగింది. మీ గొప్ప మేధ మీ కవితలో ప్రతిఫలిస్తోంది. అవి ఎంతో అందంగా కూర్చబడినాయి. వాటిలో వెలుగు విరజిమ్మే హృదయం కనబడుతోంది. మీకు వంశం ద్వారా వచ్చే గౌరవంకంటే మీవల్ల మీ వంశం ఎక్కువగా పేరు ప్రఖ్యాతులు పొందుతుందని ఆశిస్తాను". కాస్త అనుమానంగా ఈ ఉత్తరాన్ని చూసినా డల్లాస్ అతని కవిత్వాన్ని గుర్తించినవాడు. "ఇప్పటివరకూ విమర్శకుల రాతలు అనుకూలంగానే వున్నాయి, కానీ మీలాంటివారి ప్రశంస నన్ను ఎంతగానో ఆనందపరిచింది.

"కానీ మీరు చెప్పినట్లు పవిత్రతకీ, వీటికీ, నాకు అర్హత లేదు. అది నేనంగీకరించలేను. నా ఈ కాస్త జీవితంలోని సంఘటనలు ఒక పార్శ్వమే.

"మనం అహంకారాన్ని గౌరవం అంటున్నాము. ఇంతవరకూ పిరికితనం, అసహ్యకరమైన ప్రవర్తనతో నా పేరుకు అగౌరవం తెచ్చుకోలేదు. అయితే స్వేచ్ఛావాదిగా తిరుగుబోతుగా నాకు ముద్రపడింది.

"ఇక నైతికంగా టెన్ కమాండ్‌మెంట్స్‌కంటే కన్ఫ్యూసియస్‌ను ఎక్కువగా అంగీకరిస్తాను.

"సెయింట్ పాల్‌కంటే సోక్రటీస్‌నే గౌరవిస్తాను. (వివాహ విషయంలో వాళ్ళ అభిప్రాయం ఒకటే) యిక మతవిషయంలో కాథలిక్ మతాచారాన్ని గౌరవిస్తాను. కానీ 'పోప్'ను అంగీకరించను.

"ఇక పవిత్రత అంటారా, అది ఒక భావనే! అది సిద్ధాంతం కాజాలదు!

"సత్యానికే దైవం దగ్గర. ఇక మరణం, అది దీర్ఘ నిద్ర. అది శారీరకమైనా!

ఇదీ 'వికెడ్ జార్జి' క్లుప్తీకరించిన వ్యక్తిత్వం! ఇక ఈ లార్డ్ బైరన్ – కొత్త సూటు వచ్చేవరకు ప్రస్తుతం మంచి బట్టలు కూడా లేవు".

ఈ వుత్తరం చదివి డల్లాస్ ఆనందించినా గందరగోళంలో వుండిపోయాడు.

ఒక రచయితగా మారడం చాలా క్లిష్టమైనదే. జీవితాన్ని మలుపుత్రిప్పే సంఘటనగా తీసుకోవాలి. అప్పుడే భవిష్య కార్యక్రమాన్ని రూపొందించుకున్నాడు.

గౌలిక్ (Gaelic) సంప్రదాయాలను సేకరించి (స్కాటిష్ హైలాండ్) అనువాదం చేయాలని భావించాడు. వాటికి The Highland Harp లేదా అలాంటి అందమైన శీర్షిక పెట్టాలి అనుకున్నాడు. 'బోస్‌వర్త్ ఫీల్డ్'లాంటి ఇతిహాసపు మహాకావ్యాన్ని రాయాలని ఆలోచించాడు. కానీ దీనికి నాలుగయిదు సంవత్సరాల సమయం పట్టవచ్చు. కవిగా పేరు పొందటంతో పాటు, ఈతకూడా బాగా ఈదటం మొదలుపెట్టాడు.

థేమ్సు నదిలో ఎంతో దూరం, 'జాక్సన్' అతని గురువు కనుసన్నల్లో Lambeth నుంచి మూడు మైళ్ళు ఈదాడు.

ఆ రోజు Leigh Hunt స్నానం చేస్తున్నాడు. అతను ఈ ఈతగాళ్ళను ఆశ్చర్యంగా చూశాడు. ఒడ్డునుంచి ఈ ఈతగాణ్ణి జాగ్రత్తగా చూస్తున్నాడు, అతను ఈత నేర్పే జాక్సన్!

ఈదుతున్నవాడు జార్జ్ గోర్డాన్ Lord Byron మైనర్!



జార్జ్ గోర్డాన్ మైనర్!



బద్ధకంగా న్యూస్టెడ్

XI

ట్రినిటీ స్నేహితులు

(1807-1808)

తాను జీవితంలో ఏమిచేయాలి?

ఈ జీవితాన్ని ఎటుమళ్ళించాలి? ఇది కేవలం ఈతకొట్టటంతో లేదా కవితాపంక్తులు రాయటంలో గడపకూడదుకదా?

జూన్ చివరిలో కేంబ్రిడ్జి వెళ్ళాడు, ఇక ఈ చదువుకు స్వస్తిచెప్పాలని! మరొక్కసారి అక్కడి ట్రినిటీ క్రికెట్ కోర్టు చూశాడు. పచ్చని ప్రదేశాలు గమనించాడు. సంవత్సరం క్రిందట వెళ్ళిపోయిన లావుపాటి కుర్రాడు. ఇప్పుడు సన్నగా, పీలగా నాజూకుగా మారటంతో అతని సహాధ్యాయిలు, ఉపాధ్యాయులు కూడా గుర్తుపట్టలేకపోయారు. చాలా కఠినమైన ఆహార నియమాలు, శరీర శ్రమ అతని రూపాన్ని ముఖాన్ని ఒక వర్ఛస్సుతో నింపింది; యువ సన్యాసిలా కనపడుతున్నాడు. వెలుగుతో నింపిన గాజుబుడ్డిలా ప్రకాశిస్తున్నాడు. ఈ పారదర్శకమైన శరీర ఛాయకు ధీటుగా అతని ఉంగరాల జుట్టు, చెంగావి రంగులో కొట్టవచ్చినట్టు కనపడుతోంది. అలాగే అతని ఊదా నీలిరంగు కనులు ఎంతో ఆతృతగా పొడవాటి కనురెప్పలు వాలిపోతుంటే చూస్తూంటాయి.

అతనికి పరిచయం లేని కొత్త విద్యార్థులు ఎంతో ఆశ్చర్యంగా, ఈ అందగాణ్ణి చూసేవారు. అలాంటి సమయంలోనే ఎడిల్‌సన్ అనే విద్యార్థిని గుర్తించాడు. అతనుకూడా ఇతనిపట్ల ఆకర్షితుడైనాడు. అతను కేంబ్రిడ్జి వదిలి వెళ్ళిపోవాలని అప్పటికే నిర్ణయించుకున్నాడు. లండన్‌లో ఏదో ఉద్యోగం చూసుకున్నాడు. ఈ

కథంతా విని బైరన్ అతనికి సహాయం చేస్తాను, వ్యాపారానికి పెట్టుబడి పెడతానని చెప్పాడు. అంతేకాదు తను మేజర్ అవగానే తనతోపాటు న్యూస్టెడ్‌లో వుండవచ్చని హామీ ఇస్తాడు.

ఈ కథంతా తన స్నేహితురాలు 'క్వీన్‌బెస్'కు తెలియజేస్తాడు కూడా. "మేము చాలా సన్నిహితంగా వుంటున్నాం. ప్రతిరోజు కలుస్తాం. అతనంటే నాకు చాలాచాలా ఇష్టం. కాలంగాని, దూరంగాని ఈ భావాన్ని మార్చలేదు. నిజానికి, అతనికీ నేనంటే ఎక్కువ బాంధవ్యం వున్నంతగా అతనిపట్ల ప్రేమను నేను చూపలేకపోతున్నానేమో" అంటూ రాస్తాడు.

తాను కేంబ్రిడ్జిలో లేని ఈ సంవత్సరం అంతా తను గొప్పగా అలంకరించిన గదులు చార్లెస్ స్కిన్నర్ మాథ్యూస్‌కు ఇస్తారు. బైరన్ అతనితో పరిచయం చేసుకుని అతన్ని సామాన్యుడుగా గుర్తించాడు. మాథ్యూస్ చాలా తెలివి, హాస్యచతురతగల రచయితకూడా. లాటిన్ ఆంగ్ల భాషల్లో బాగా రాయగలడు. అతనికి కాస్త గర్వమని పేరున్నా, బైరన్ను ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించాడు. ఈ గదులు మాథ్యూస్‌కు ఇచ్చేముందే అక్కడి వార్డెన్ చెప్పాడు; బైరన్ చాలా జాగ్రత్తగా అపురూపంగా చూసుకునే ఇక్కడి వస్తువులు జాగ్రత్త, "Byron is a man of tumultuous passions" అని మరీ హెచ్చరించాడు.

మాథ్యూస్ కూడా ఈ సంవత్సరం ఈ గదుల్లోని వస్తువులన్నిటినీ అంత జాగ్రత్తగా కాపాడాడు. బైరన్‌ను చాలా ఆప్యాయంగా ఆహ్వానించి ఈ విషయం 'tumultuous passions' లౌక్యంగా చెప్తాడు కూడా.

బైరన్ – ఇక్కడే మరికొందరు స్నేహితుల్ని కలుస్తాడు. వారు మేధోపరంగా తమకు సమఉజ్జీలే! ఇప్పుడు వీరిమధ్యలో మరింత అర్థవంతంగా గడపవచ్చని అనుకుంటాడు.

అతని అభిరుచులు మేధోపరమైన సహచర్యాన్ని కోరితే, అతని అహం దుర్నీతివైపు చూసింది. ఈ కొత్త పరిచయాలు వాతావరణంలో ధనిక జీవనమార్గం ఉన్నత భావాలకు ఆలవాలమైంది. ఇక్కడ తప్పనిసరిగా మేధావులుగా ఎదుగుతారు. కానీ లోకజ్ఞానం రాదు. అరె! ఇప్పటివరకూ ఇలాంటివారిని కలవక

పోవటమేమిటి? అనుకున్నాడు. దానికి కారణాలు కనిపించాయి. సంవత్సరం క్రిందట తానెవరు? తానేమిటి? లావుగా వుండే బద్ధకస్తుడు. సిగ్గరి. పొగరుబోతు. తనని ఒంటరిగా ఏకాకిగా వదిలివేశారు అందరూ! మరి ఇప్పుడు?

తన నాజూకుతనం, తను ప్రచురించిన పుస్తకం తెచ్చిన కీర్తి (పేరు). ఇక్కడ అందరూ చదివారు. అందుకని వారి చూపు మారింది. తన అంతస్తు మారింది!

ఇవన్నీ అతనికి ఎంతో అనుకూల వాతావరణం కల్పించాయి. అందుకని మరొక సంవత్సరం కేంబ్రిడ్జిలో వుండాలని నిశ్చయించుకున్నాడు.

తన గదులు మళ్ళీ స్వంతం చేసుకున్నాడు. అప్పటినుంచీ అతనికి, ఎంతో విశ్వాసపాత్రులయిన స్నేహితులు అతని సమయాన్ని పంచుకున్నారు. అందరిలో మాథ్యూస్‌ని ఎక్కువగా ఆదరించాడు. మాథ్యూస్ గొప్ప మేధావి. బైరన్‌కు కేంబ్రిడ్జిలో, రాత్రి జీవితాన్ని చూపాడు. అతను కత్తి యుద్ధంలో నిష్ణాతుడు. మంచి ఈతగాడుకూడా.

బైరన్, గజ ఈతగాడుకదా. మాథ్యూస్‌ని కోపగించేవాడు. "అలాగా ఈదేదీ? నీ శరీరం అంతా బైటనే వుంటోంది. ఇలా అయితే మునిగిపోతావు" అని హెచ్చరించాడు.

మాథ్యూస్ తనవంతుగా బైరన్ అభిప్రాయాలను ఖండించేవాడు. అప్పటివరకూ బైరన్ నమ్ముతూవచ్చిన అబర్డీన్ మతవిశ్వాసాలను, గాలిలో కలిపాడు.

మాథ్యూస్‌కు దేనిమీదా నమ్మకంలేదు. దేవుడన్నా దయ్యమన్నా ఒకటే భావన! చులకన! అప్పటికే వోల్టేర్ చదివిన బైరన్, మాథ్యూస్ ప్రభావంతో తనలో వున్న చిన్ననాటి నమ్మకాలను పాలద్రోలాడు. అప్పటి అసమ్మతి అతనిలో పాదుకుపోయింది.

అతనికి పరిచయమైన మరోవ్యక్తి ఆ చివరి సంవత్సరంలో అతనికి అత్యంత ఆత్మీయుడిగా మారిన జాన్‌కామ్ హాబ్ హౌస్‌హౌస్. బ్రిస్టల్‌లోని ఒక వ్యాపారస్తుని కుమారుడు. ఇతను కూడా మతనమ్మకాలు లేనివాడే. మాథ్యూస్ లాగే అతను ఒక వ్యాసం రాస్తున్నాడు. అది "త్యాగాలు, మూలం లక్ష్యం".

హాబ్ హౌస్‌హౌస్ కూడా, బైరన్‌లాగా, నెపోలియన్ అంటే ఆరాధన! మాథ్యూస్‌కు హాబ్ హౌస్‌హౌస్‌కూ చాలా వ్యత్యాసం వుంది వ్యక్తిత్వంలో. ఇతనికి జీవితంపట్ల ప్రేమ వుంది. తన విశ్వవిద్యాలయ రాజకీయ కీర్తిపట్ల అవగాహనా వుంది.

మాథ్యూస్ – ఇతను నిస్వార్థ స్నేహితుడు. నీలోని బలహీనతలను గుర్తించినా, ఇతరులకు, వాటి గురించి చెప్పడు!

హాబ్ హౌస్‌హౌస్ బైరన్‌లోని కవిని త్వరలోనే గుర్తించాడు. బైరన్ స్నేహితుల బృందంలో హాబ్ హౌస్‌హౌస్ ఎంతో లౌకిక జ్ఞానం కలిగినవాడయితే, మాథ్యూస్ ఊహాలోకంలో విహరించేవాడు.

ఈ నలుగురులో చివరివాడు ఎస్.బి. డేవీస్! ఇతను మితభాషి. చక్కని దుస్తులు ధరించేవాడు. మాట్లాడితే చాలా హాస్యం చిలికించేవాడు. కాస్త నత్తి కూడా వుంది.

ఈత పోటీల్లో బైరన్‌కు ప్రత్యర్థిగా వుండేవాడు. పేకాటలో విపరీతంగా గెలిచేవాడు. బైరన్‌కు ఈ ఆట అసలు తెలియదు. అంత సహనం కూడా లేదు.

కేవలం డేవీస్ కోసమే ఆడేవాడు.

మాథ్యూస్ ఈ వ్యసనాన్ని నిరసించేవాడు. అయినా బైరన్ అతని మాట పెడచెవినిపెట్టి, చాలా విలాసవంతంగా రోజులు గడుపుతున్నాడు. లండన్ నుంచి ఒక చిన్న ఎలుగుబంటుని తెప్పించాడు. అక్కడి అధికారులు ఇది ఎందుకు అని అడిగారు. 'నాకు తోడు' అన్నాడు. తర్వాత పేకాట రాయుళ్ళను, గుర్రపు స్వారీగాళ్ళను, ఆడవాళ్ళను అందర్నీ రావించాడు. అతని స్నేహితులు బైరన్‌పట్ల ఎంతో గౌరవం చూపేవాళ్ళు. నిజానికి యుక్తవయసులో ఏదీ తప్పిదం కాదని, నమ్మేవాళ్ళు. ముఖ్యంగా బైరన్ ధైర్యం చాలా గొప్పది. ఇతరులకోసం ఎటువంటి తెగింపుకైనా సిద్ధపడేవాడు. తనకంటే లేనివారికి సహాయం చేయటానికి వెనుకాడేవాడు కాదు.

బైరన్‌కు మూడునెలలకు 125 పౌండ్లు వచ్చేవి. అందులో 5 పౌండ్లు తన ముసలి సేవకునికోసం పంపేవాడు, న్యూస్టెడ్‌కి. ఉన్నదంతా ఇచ్చుకుంటూ

పోయేవాడు. తనకంటూ ఏమీ మిగలకపోయినా! అప్పులు చేయటం అలవాటే. అవి పెరిగిపోతున్నాయి. తన లాయర్‌కు రాస్తాడు, "బహుశా నా 'టైటిల్'ను సొమ్ముచేసుకోగలిగితే బాగుండును!" అని.

1808 జనవరికి అతని అప్పులు మూడువేల పౌండ్లు దాటాయి. 'ఇలా అయితే నాకు 21 ఏళ్ళు వచ్చేసరికి పదివేలు పౌండ్లు దాటిపోవచ్చు!' అనుకుంటాడు.

ఈ సమయంలోనే తన రచనావ్యాసంగాన్ని మరింత కష్టపడి ముందుకు తీసుకుపోతాడు. 'Hours of Idleness'ను సరిచూసేసరికి పూర్తిగా అలసిపోయాడు. అయినా మరొక రచనకు ఉపక్రమిస్తాడు. తన అస్తవ్యస్త జీవన సరళికి లోబడి అతని రచనలు సాగుతుంటాయి. అతనిలోని కవిని తన దినచర్యకు బానిసను చేస్తాడు. తన భావావేశానికి, బలహీనతలకు బానిసను చేస్తాడు.

ఆ సమయంలోను అతనికి తెలియవస్తుంది. తనకు వ్యతిరేకంగా–

ఎడిన్ బర్గ్ రివ్యూ చాలా విమర్శతో వ్యాసం తయారుచేస్తున్నట్లు. ఇది అతనికి చాలా బాధ కలిగించినా ఈ విమర్శలను సహృదయంతోనే ఆహ్వానించాడు. ఇవి ఫిబ్రవరి 1808 వరకు అచ్చుకాలేదు. అవి అతని చేతికి రాగానే, ఆత్రంగా చదివాడు.

"ఈ యువ లార్డ్ మనస్తత్వం ఇటు మనుషులకుగానీ అటు దేవతలకుగానీ సమ్మతంకాదు. అతని కవితాపంక్తులలో రక్తిని పిండవలసిందే. అతని వ్యక్తీకరణ ఒట్టి చచ్చుబండ. అసలు ఏమాత్రం లోతు లేని కుళ్ళిపోయిన నీటిగుంట! దీనికితోడు అతని ముందు మాటలో ఇవి బలహీనవర్గాల కోసమన్నట్లు రాయటం మరింత దుర్మార్గం. పైగా ఈ మాటలు అట్టమీద రాయటం! చూడండి ఒక బలహీనుడు ఎలా రాస్తాడో" అన్నట్లుంది.

"ఈ కవిత 18 ఏళ్ళ యువకుడు రాశాడు. ఇది పదహారేళ్ళవాడు రాసినట్లుంది. కానీ కోలే పది సంవత్సరాలకే కవితలు రాయలేదా – పోప్ పన్నెండేళ్ళకే రాయలేదా?

చెత్త కవితలు, స్కూలు పిల్లలు కాలేజీ కుర్రవాళ్ళు రాయటంలో ఆశ్చర్యం లేదు. పదికి తొమ్మిదిమంది అలాగే చేస్తారు కూడా. దురదృష్టం, ఆ పదోవాడు లార్డ్ బైరన్!"

ఆ విమర్శకుడు అంతటితో వదల్లేదు.

"ఏవో కాస్త యతి ప్రాసలతో కొన్ని పంక్తులు రాస్తే, కవిత్వం అవుతుందా? బహుశా ఈ యువ లార్డ్, ఇంతటితో రాయటం ఆపివేస్తే మనం ఆనందించవచ్చు. ఇతనికి జీవితం ఏమితెలుసు? కవుల కష్టసుఖాలు ఎలాతెలుస్తాయి?"

ఇది నిజంగా దారుణమైన విమర్శ. అతని పేరును టైటిల్‌ను పదేపదే చిన్నబుచ్చి చీల్చి చెండాడిన విమర్శకుడు నిజంగా నిర్దయుడు. విమర్శలో సహేతుకత లేదు, గౌరవం అసలే లేదు.

అది బైరన్‌ను అతలాకుతలం చేసింది. ఆ స్థితిలో అతన్ని గమనించిన, అతని గదికి వచ్చిన వ్యక్తి, ఏమిటీ? ఎవరైనా ద్వంద్వ యుద్ధానికి రమ్మనారా, అలావున్నావు" అని అడిగాడు.

తన కోపాన్ని తగ్గించుకోవటానికి ఆ రాత్రి మూడుసీసాలు వైన్ తాగాడు. డేవీస్‌తో కలిసి భోజనం చేశాడు. ఇవేమీ అతన్ని మామూలు మనిషిని చేయలేకపోయాయి.

తన కోపాన్ని పద్యాలలో పెడితేనేగానీ అతనికి విముక్తి దక్కలేదు. ఇరవయి పంక్తులు రాసి కాస్త స్థిమితపడ్డాడు!

ఎవరు ఈ విమర్శకుడు? చాలాకాలం బైరన్, జెఫ్రీ అని నమ్మాడు. కానీ అది హెన్రీ భాగమ్ అని తెలిసింది.

అతనికి దురాలోచన తప్ప మరేమీ లేదు. 'థామస్ యంగ్' తరంగ సిద్ధాంతాన్ని ఇలాగే తలాతోకా లేకుండా విమర్శించాడు. అతనికి విమర్శ రాసే అర్హతగానీ సమర్థతగానీ లేదు. బైరన్, ముందుగా ఆవేశంగా దీనికి సమాధానంగా కవితను రాయాలనుకున్నాడు. కానీ బాగా ఆలోచించి దీనికి సమాధానం మంచి కవిత్వం రాయటమేనని నిర్ణయానికి వచ్చాడు.

"ఈ కాగితపు గుళ్ళు, నాకు ఈ కాల్పుల్ని ఎలా ఎదుర్కొవాలో అలవాటు చేశాయి" అనుకున్నాడు.

ఆ సమయంలోనే "కింగ్స్ కాలేజీ" విద్యార్థి హాడ్గ్సన్ పరిచయమయ్యాడు.

జూలై 4వ తేదీ 1808 సం॥ బైరన్ మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ పుచ్చుకున్నాడు. కేంబ్రిడ్జి నుంచి బైటకువచ్చాడు.

ఈ చివరి సంవత్సరం అతనికి ఎంతో మేలుజరిగింది. అతనిలో గొప్ప మార్పు తెచ్చింది.


హారోలో కేవలం భావోద్వేగాలతో అనుబంధాలతో గడిచింది. కేంబ్రిడ్జి అతనికి మరో ప్రపంచాన్ని, మేధోపరమైన స్నేహితులను అందించింది.

అక్కడి స్వేచ్ఛా, విశృంఖలమైన వాతావరణం, అతనికి ఎంతో స్వాతంత్ర్యాన్నిచ్చింది.

హాబ్ హౌస్, డేవీస్, మాథ్యూస్ వీళ్ళందరూ అతని హృదయానికి దగ్గరగా వచ్చి అతనికి స్వేచ్ఛను ప్రసాదించారు.


కానీ అతని ఛిద్రమైన బాల్యం, అతని అతుకుల గతం అతనికి

స్వాతంత్ర్యాన్నిస్తుందా? అతనిని స్వేచ్ఛగా బ్రతకనిస్తుందా?




కేంబ్రిడ్జి యూనివర్శిటీ

Byron



ట్రినిటీ కాలేజ్ ముఖద్వారం



న్యూస్టెడ్ అంతర్భాగం

XII

'కపాలం'

(1808-1809)

కొత్తది ఏదైనా ఆహ్వానించదగినదే
అది ఇబ్బందికరంగా వున్నాసరే

CHATEAU BRIAND

గత కొన్ని నెలలుగా శ్రీమతి బైరన్ తన కుమారుని వారసత్వపు హక్కును పొందే వయసు గురించి, అతను కేంబ్రిడ్జి నుంచి తిరిగి రావటం గురించి ఆందోళన చెందుతోంది.

ఆమె తన భర్త గురించి ఏ విధంగా ఆందోళన చెందిందో అదే ధోరణిలో ఇప్పుడు కుమారుని గురించి కూడా ఆలోచిస్తోంది. అతనంటే భయపడేది ప్రేమించేది, శపించేది కూడా! ఇప్పుడు బైరన్ గురించి అలాంటి మానసిక స్థితిలోనే నలిగిపోతోంది.

ఇతను ఏమి చేస్తాడో! ఈ బైరన్, అదీ గోర్డాన్ల రక్తంతో కలిసివున్న ఈ 'పోట్లగిత్త బైరన్' ఒక్కసారిగా తన సంపదకు యజమానిగా హక్కును పొందిన తర్వాత, ఏ విధంగా వ్యవహరిస్తాడోనని భయాందోళనతో నలిగిపోతోంది.

'మాడ్ జాక్'తో కలగలిసిన 'వికెడ్ లార్డ్' న్యూస్టెడ్‌ను ఎలా పరిపాలిస్తాడోననీ ఆలోచిస్తోంది.

తాను ఈ పరంపరలో ముప్పయి అయిదవ స్కాట్ విధవ! కేవలం సంవత్సరానికి 135 పౌండ్ల భరణంతో పెన్నీ అప్పు కూడా లేకుండా జీవితం

గడుపుతోంది. ఈ మగవారసుల దురాచారాలకు తాను ఇబ్బందుల పాలవటం ఏమిటి?

బైరన్ మైనారిటీ తీరబోయే కడపటి మాసాలలో హాన్సన్ (లాయరు)ను ఉత్తరాలతో ఊపిరాడనీయలేదు. ఆమె ముందుగా రోష్‌డేల్ వ్యవహారాన్ని సర్దుబాటుచేసి, ఆ విధంగా వచ్చిన సొమ్మును బైరన్ మరో తప్పు చేయకుండా వినియోగించాలని తొందరచేసి–

"ఎంత తెలివిగలవాడయినా తప్పులు చేయకుండా వుండడని భరోసా లేదుకదా?" అంటుంది.

ఆమె ధోరణి ఇటు హాన్సన్‌కు అటు రోష్‌డేల్ లాయర్లకు ఏమాత్రం నచ్చలేదు సరికదా వారు చాలా నొచ్చుకున్నారు. ఆమె తొందరపాటు రాతలకు తెలివితక్కువ తనానికి తలబిరుసు ప్రవర్తనకు కూడా.

పాపం, ఆమె ఏమి చేయగలదు! ఆమె పొగరు గోర్డాన్లదికదా. అంతా హింసాత్మకమే. దానికితోడు ఆమె కష్టాలు ఆమె తలకు మించినవి!

ఆమె అద్దెకిచ్చిన న్యూస్టెడ్ ఎస్టేటులో లార్డ్‌గ్రే, బైరన్ యుక్తవయస్కుడై వచ్చేసమయానికి న్యూస్టెడ్ వదిలి వెళ్ళిపోవాలి.

"వారిద్దరూ కలవటం నాకిష్టంలేదు. కలిస్తే ఏమైనా జరగవచ్చు" అని భయపడింది.

అక్కడి పుకారులు; "ఇప్పటికే న్యూస్టెడ్‌ను నాశనం చేశాడు. గాలికి వదిలివేశాడు" అని.

ఆమె ఇప్పుడు ఆలోచించేది. బైరన్ కేంబ్రిడ్జి వదిలి బైటకు వస్తే, ఆమెను న్యూస్టెడ్‌కు ఆహ్వానిస్తాడని. అలాగే అతను న్యూస్టెడ్ వచ్చి ఆమెకు కబురుపెట్టాడు.

"ఇక్కడ పరిస్థితి అంత అనుకూలంగా లేదు. నేను, హాన్సన్ వుండటానికే అంతంతమాత్రంగా వసతి సరిపోవచ్చు. మీరు వస్తే ఇద్దరికీ, మీకూ మాకు ఇబ్బంది. నేను త్వరలో పర్ష్యా మార్చిలోగానీ, మేలోగాని వెళ్తాను. ఆ సమయంలో మీరు ఇక్కడకు వచ్చి, నేను తిరిగి వచ్చేవరకు వుండవచ్చు" అని.

నిజానికి, బైరన్ వచ్చే సమయానికి న్యూస్టెడ్ దారుణమైన స్థితిలో వుంది.

అతను, తన అదృష్టానికి ముడిపెట్టి నాటింపించిన సింధూరపు మొక్క కలుపుతో మూసుకుపోయి చివరిదశలో ఉంది. ఎలాగైతేనేం దీనిని రక్షించగలిగాడు.

ఈ భవనాన్ని పూర్తిగా మరమ్మత్తులు చేయాలంటే అది అతనికి తలకు మించిన భారం.

తనకోసం ఒక పడకగదిని ముస్తాబు చేయించాడు. ఆ విశాలమైన గదిలో గోడలమీద కొన్ని చిత్రాలు పెట్టించాడు. అవి తన ముసలి సేవకుడు ముర్రే, బాక్సర్ జాక్సన్, నీలపు కోటులో, తనకిష్టమైన కుక్కల బొమ్మలు, హారో దృశ్యాలు.

కేంబ్రిడ్జి కాలేజీ, కింగ్ కాలేజీ, ట్రినిటీ, ఇవా క్రీస్తు! ఇది అతని బాల్యంనుంచి ఆ యింటిలో వెన్నాడుతున్న నమ్మకమే! తన బాల్యంలోని ఒంటరితనంలో అందర్నీ అసహ్యించుకున్నాడు. అదీ కొత్తవాళ్ళను. కానీ ఒకసారి పరిచయమైన తర్వాత ఇక వాళ్ళు తన వాళ్ళే తన అహంలోని అంతర్భాగమే. ఆ విధంగా వారు పవిత్రమైనవారే.

తన కిటికీలోనుంచి చూస్తే, దూరంగా సరస్సు అస్పష్టమైన అంచులు కనపడతాయి. అందులో హంసలు తిరుగుతుంటాయి. చుట్టూ తన పూర్వీకులు యుద్ధాలు చేసిన కోటలున్నాయి. ఆ పైన కొండచరియలు, చెట్లన్నీ కూలగొట్టి!

తన గదిలోనుంచి ఒక తలుపుతీస్తే దెయ్యాలు తిరిగే హాలులోకి దారితీస్తుంది. అక్కడే ప్రతి రాత్రి ఒక ముసుగు దెయ్యం డాకిని పసిపిల్లలను భయపెడుతుంది.

తన గదిలోనుంచి మెట్లమీదుగా తిరిగితే తన పుస్తకాల గదిలోకి చేరవచ్చు. దానికి ప్రక్కగా కొన్ని గదుల్ని పరుపులు, మంచాలతో అలంకరించాడు, తన స్నేహితులకోసం.

అంతకుమించి, ఆ విశాల భవన పరిసరాలు అంతా పాడుబడి, నగ్నంగా, చీకటిగా ఒకరకం భయంకర వాతావరణంలో వుండిపోయాయి.

ఈ న్యూస్టెడ్ అంటే తనకెంతో ఇష్టం. ఇక్కడ బద్ధకంగా పగటికలలు ఎంతగానో ఇష్టపడతాడు! అందులోనుంచి అతని కవితలు రూపుచెందాలి. బైటకి వస్తే తన తాత నరికిన చెట్లు అతనికి బల్లల్లాగా ఉపయోగపడేవి రాయటానికి.

తనకు దగ్గరలో వున్న జమీందార్ల వారసుల గురించి అతనికి అంతగా తెలియలేదు.

కొందరు వచ్చి పలకరించి వెళ్ళేవాళ్ళు. అయినా అతనికి ఏమాత్రం ఉత్సాహం లేదు.

కానీ ఆన్స్‌లే నుంచి వచ్చిన ఆహ్వానాన్ని కాదనలేకపోయాడు.

మళ్ళీ మేరీ కనపడవచ్చునని ఆందోళన. ఇప్పుడు ఆమె వివాహిత. శ్రీమతి చావర్తు మస్టర్!

ఆ రాత్రి భోజనాల దగ్గర ఆమె ప్రక్కనే కూర్చున్నాడు. ఎంతో ధైర్యంగా నిర్లక్ష్యంగా వుండాలని ప్రయత్నించినా అతని మనసుని చిక్కబట్టుకో లేకపోయాడు. గతంలోని ప్రేమలేఖలు, తమ గుర్రపు స్వారీలు, పిస్టల్ షూటింగ్, కొండమీది సంగమాలు అన్నీ అతన్ని ముప్పిరిగొన్నాయి. మాటలు కాదుకదా, కనీసం నవ్వుకూడా రాలేదు.

“అరె! ఎంత పిచ్చివాళ్ళం! నా ధైర్యం అంతా ఏమయిపోయింది. ఇద్దరం మామూలుగా వుండటం చాలా తేలిక విషయమే. కానీ ఎంత మూర్ఖులం. చిన్నపిల్లల్లా ఒక ఆటబొమ్మకోసం ఏడుస్తున్నాం. అది అందిన తర్వాత ఆడి విరగ్గొడతాం. మళ్ళీ దానికోసం ఏడుస్తాం. నిప్పుల్లో పడవేసి కాల్చుతాం!”

అప్పుడే రెండేళ్ళ పాపను ఒక దాది తీసుకువచ్చింది. ఆ పాపను చూసి బైరన్ ఆశ్చర్యపోయాడు. ఆ చిన్నారిలో ఆమె తండ్రి అందమైన ముఖకవళికలన్ని ప్రస్ఫుటంగా వున్నాయి. కానీ ఆ కనులు, ఆ కన్నులలోకి అక్కడ డైడమ్ (Diodem) గుట్టమీద ఎన్నాళ్ళు లోతుగా చూశాడు! ఎంతటి ఆశ్చర్యం! ఆమె తండ్రిని పరీక్షగా చూశాడు. చాలా బలిష్టుడు. కానీ అతని జీవితంలో ఒకే ఒక్క పుస్తకం తెరిచినట్లు రాబిన్సన్ క్రూసో చెప్పాడు.

అప్పటికి దగ్గర్లో కుక్కలు అరుస్తున్నాయి. ఇంతవరకు మేరీ ఒక్క మాటకూడా మాట్లాడలేదు. పెదవి విప్పలేదు. కానీ బైరన్ నాజూకుగా తయారవటం అతని అందాన్ని దొంగతనంగా చూస్తూనేవుంది. ఎలాగైతే న్యూస్టెడ్‌కి తిరిగివచ్చి సోఫాలో పడి తన కవిత్వం ఒకటి రాశాడు.

సరే నీవు ఆనందంగా వున్నావనుకుంటా
నేను సంతోషంగా వుంటూ
ఇప్పటికీ నా హృదయం నీ సుఖాన్నే కోరుతోంది
ఈ రాత్రి నీ పాపను చూసినపుడు
అసూయతో నా గుండె పగిలిపోతోంది

పాపను ముద్దాడాను ఆమె తల్లికోసం!
ఆ ముద్దులో నా ఉద్వేగాన్ని దాచుకున్నా
ఆ ముఖంలో ఆమె తండ్రి వున్నాడు
కానీ ఆలోచనలన్నీ ఆమె తల్లివే
నాకు ప్రేమపాత్రమైనవి

మేరీ ఇంక శెలవు, నేను వెళ్ళిపోవాలి
నీ దగ్గర్లో వుండలేను
మళ్ళీ ఈ హృదయాన్ని నీకివ్వకుండా వుండలేను!
దూరంగా వెళ్ళిపో – నా తొలిప్రేమ స్వప్నమా
జ్ఞాపకాలు నిద్ర లేవకూడదు
అరె! ఆ కాల్పనిక సెలఏరు ఏది?
ఈ పిచ్చిగుండె బండబారిపోవాలి
లేదా పగిలిపోవాలి, అంతే!

అతను చూడాలని ఆశించింది, తన కాలేజీ మిత్రున్ని వారికి తన ఎస్టేటు చూపాలని ఆశించాడు. అందులో అతనికి ఎంతో గర్వం వుంది కూడా.

ముందుగా వచ్చింది హాబ్ హౌస్. వీరి మైత్రి చాలా ఆత్మీయమైంది. దగ్గరగా వున్నపుడు చాలాకాలంగా కాపురం చేస్తున్న వాళ్ళమాదిరి కలిసిపోతారు. బైరన్ ఎప్పుడు తన పరిహాసాన్ని కాస్త ఘాటుగానే గుప్పించేవాడు. హాబ్ హౌస్ కూడా తక్కువకాదు. తాత్వికంగా పద్యాలు చెప్పేవాడు.

అలసిపోయిపుడు నదిలోకి స్నానానికి ఈతకు వెళ్ళేవారు. మరీ చల్లగా వుంటే తన భవనంలోని ఒక చిన్న ఈత కొలనులోకి దూకేవారు.

ముర్రే వీరికోసం డిన్నర్ టేబుల్ దగ్గర వేచివుండేవాడు.

భోజనాల సమయంలో బైరన్ ఒక గ్లాసులో వైను పోసి, వెనుకగా వున్న ముర్రేకి అందించేవాడు. "తీసుకో పెద్దాయనా" అంటూ!

ఇది ఆనందంగా గడిచే సమయం. కానీ ప్రక్కనేవున్న ఆన్‌స్లే. అతని గుండెల్లో ముల్లు గుచ్చుతూనేవుంది! ఒకప్పుడు తను గాఢంగా ప్రేమించిన స్త్రీకి అంత సమీపంలో జీవించటం ఎంత బాధాకరం!

అతను చూపిన నిర్లక్ష్యంతో, ఆమెలో ఆశ్చర్యాన్ని, తర్వాత సానుభూతిని కలిగించాడు.

ఆశ, విశ్వాసం, నిజానికి అన్నింటిలోకి ఇది కఠినమైనది. కానీ చాలా బలహీనంగా తనలోని వేడిని వెలిగిస్తుంది.

బాధితునికి ఇది అసంభవం అని తెలుసు. దీనికి పరిష్కారం అక్కడినుంచి పారిపోవటమే! బైరన్ అదే, ప్రణాళిక, వసంతకాలంలో చేయబోతున్నాడు.

తన ప్రయాణాల గురించి ఆన్‌స్లే వెళ్ళినప్పుడు చెప్తూనేవున్నాడు. మేరీ అమాయికంగానే అడిగింది. ఎందుకు వెళ్ళిపోతున్నావు?


ఈడెన్ వనంలోను మనిషిని బహిష్కరించినప్పుడు
కాసేపు గుమ్మంలో ఆగాడు
అతనికి అన్ని గుర్తువచ్చాయి
అప్పుడే అతనికి భవిష్యత్తు కూడా కనిపించింది.

అదిగో నేను అలాగే నీ నుంచి
నా అందం నుంచి దూరంగా వెళ్ళిపోవాలని
నీ దగ్గర్లో వుంటే
జ్ఞాపకాలు నన్ను తినేస్తాయి

ప్రయాణంలో నాకు స్థిమితం
వస్తుంది
ఆకర్షణలలో నుంచి పారిపోవటమే
ఇప్పుడు నాకే స్వర్గము కనపడదు
అక్కడ నా నివాసం లేదుగా!

ఈ సమాధానం పంపాడు–

ఈ సమాధానంగా రాసిన కవితను తన స్నేహితునికి చూపకుండా జాగ్రత్తపడ్డాడు. హబ్‌హౌస్‌కి ఇలాంటి ప్రేమవ్యవహారాలు అసలు నచ్చవు.



'బోట్సువైన్' స్మారకం

బైరన్ ప్రియమైన 'బోట్సువైను'కు జబ్బుచేసింది. దానికి ఎంతో సేవచేశాడు. దాని నోటిలో నుంచి నురుగు వస్తుంటే, తన చేతుల్తో శుభ్రపరిచాడు. అది చనిపోతే "నా వాళ్ళంతా పోయారు ఒక్క ముర్రే తప్ప" అన్నాడు. చాలా కాలం, తనని కూడా ఈ కుక్క ప్రక్కనే సమాధి చేయండి, అన్నాడు. తన ప్రియమైన కుక్కకి అక్కడ పాడుపడిన చర్చిలో ఒక సమాధి కట్టించాడు. ఆ సమాధి రాయి మీద ఇలా రాయించాడు:

ఇక్కడకు దగ్గర్లో
గర్వంలేని అందం – పెంకితనం లేని శక్తి
హింసలేని ధైర్యం
మనిషికి ఉండాల్సిన మంచితనం – ఏమాత్రం చెడు లేకుండా,
ఇదంతా ఒక మనిషి సమాధిమీద రాస్తే
అర్థం లేని పొగడ్త అవుతుంది
కానీ 'బోట్సువైన్'కి ఇది, కుక్క

ఇక్కడే పుట్టింది మే 1803

ఈ న్యూస్టెడ్ భవన ప్రాంగణంలో మరణించింది

నవంబరు 18-1808!

బైరన్, ముర్రేతో చెప్తుంటాడు, అతనిని కూడా ఈ కుక్కపక్కనే సమాధి చేయిస్తానని.

ముర్రే 'అలాగే మైలార్డ్, మీరు తప్పకుండా ఇక్కడకు వచ్చివుంటే, లేకపోతే నేనొక్కడినే ఈ కుక్కతో వుండలేను' అంటాడు.

జనవరి 22, 1809 తేదీన లార్డ్ బైరన్ తన న్యూస్టెడ్ వారసత్వపు హక్కును తన 21వ ఏట ఉత్సవం జరుపుకుంటాడు!

ఆ రాత్రి అతిథులకోసం పెద్ద విందే జరిగింది. ఒక ఎద్దును చక్కగా మంటలో కాలుస్తూ, వచ్చిన అతిథులతో వైన్ తాగుతూ నృత్యం చేశారు.

బైరన్ లాయరు హాన్సన్ లండన్ నుంచి ప్రత్యేకంగా వచ్చి ఈ విందులో మత్తులో తూగాడు.

శ్రీమతి బైరన్ నుంచి ఘాటయిన వుత్తరమే వచ్చింది. 'ఈ దుబారా అంతా అవసరమా' అని.

బైరన్ తర్వాత లండన్ వెళ్ళినప్పుడు, గుడ్లు రొట్టె లాంటి తక్కువ ఆహారంతో గడిపాడు. ఆ రాత్రి అతనికి తన స్నేహితుడు ఎడ్వర్డు లాంగ్ చనిపోయినట్లు ఒక దుర్వార్త చేరింది. అతను లిస్బన్ నుంచి నౌకలో వస్తుంటే ఈ దుర్ఘటన జరిగింది.

బైరన్ తన స్కూల్ జర్నల్ తీసాడు. దానిలోనేకదా రాశాడు "వైల్డ్‌మన్ నా ఎడమ ప్రక్కన, లాంగ్ నా కుడి ప్రక్కన" అప్పటి హారో రోజుల్ని గుర్తుచేసుకున్నాడు.

ఇందులో రాసిన వాళ్ళంతా తలోదిక్కు అయిపోయారా ఇప్పుడు ఒకరు చనిపోయారు, మరొకరు చాలా దూరంలో వుండిపోయారు.

ఎవరికీ 21 ఏళ్ళు నిండలేదే...!

అని బాధపడిపోయాడు!

సంవత్సరాలు గడిచిపోతున్నాయి, మరణానంతరం జారిపోతున్నాయి జీవితాలు!

ఈ యువకుని మీద మరణపు ఛాయ చిత్రంగా పరచుకుంటోంది. అతను పీచేలో కూర్చున్న సమాధి, తనకు పరిచయం లేని వ్యక్తి సమాధి! అక్కడే అతను పగటికలలు కన్నాడు! తర్వాత బోట్సువైను సమాధి. అది తనదే అనుకున్నాడు. తర్వాత అదృశ్యమైపోతున్న తన స్నేహితులు, వారు విశ్రాంతి తీసుకునే స్మశానాలు అవి! తన చిన్ననాటి ప్రియమైన జ్ఞాపకాలన్నీ ఇలా భూమిలో కలిసిపోవాలా! ఇదేనా జీవితమంటే. బైరన్‌లకు దుఃఖమేనా మిగిలేది? అలాగే కానీ! విధిని ఎదిరించాలి!

ఆ రాత్రి తన స్నేహితుడు డల్లాస్ తన హోటల్ గదికి వచ్చాడు. వచ్చి లార్డ్ బైరన్ ఇప్పుడు మేజర్! అతని ఉత్సాహాన్ని, మతం, దేవునిపట్ల అతని నిర్లక్ష్యాన్ని ప్రత్యక్షంగా గమనించాడు!

ఇంకా ఏమి మిగిలింది – ఇప్పుడు ఇంగ్లాండు వదిలిపోవాలి. తనతోపాటు హాబ్ హౌస్ వస్తానని మాట ఇచ్చాడు. కానీ ఎక్కడికి – ఎటుపోవాలి? బైరన్ మనసులో ఏ భావనాలేదు. తూర్పువైపు అదీ పర్షియా? లేదా ఇండియా? ఉష్ణదేశాలవైపు? ఎటైనా పెద్దగా పట్టింపులేదు.

ముందు ఆన్స్‌లేకు దూరంగా తన జ్ఞాపకాలకు, అప్పులవాళ్ళకు దూరంగా – అంతే!

ఇప్పుడు అతన్ని ఆపగలిగిన శక్తి ఏమీలేదు. తన తల్లి ఒక దూరం మాత్రమే! తను లేనప్పుడు ఆమె న్యూస్టెడ్‌లోనే వుంటుంది!

ఇప్పుడు తను నెరవేర్చవలసిన తక్షణ కర్తవ్యాలున్నాయి. మొదటిది తను రాసిన 'Satire' ప్రచురణ! గొప్పగా వచ్చింది. తన అక్కసు అంతా కక్కాడు. దానిని డల్లాస్‌కు అప్పగించాడు, ఒక ప్రచురణకర్తను చూడమని.

చివరకు ఒకరు దానిని ముద్రించటానికి ముందుకు వచ్చాడు. అందులో అందర్నీ ఏకిపారేశాడు. తన గార్డియన్; నిన్నటివరకూ తనని తన కర్తవ్యాన్ని అసలు లెక్కచేయలేదు. అలాంటి లార్డ్ కార్లైల్ (Lord Carlile)నూ వదలలేదు!

ఇప్పుడు బైరన్ House of Lords లో తన స్థానాన్ని లాంఛనంగా తీసుకోవాలి. అలాంటి సమయంలో తనతోపాటు దగ్గర బంధువో స్నేహితుడో వుండాలి. మర్యాదకు కార్లైల్‌కు రాశాడు. అతనికి సలహామాత్రమే వచ్చింది!

బైరన్ ఒంటరిగానే వెళ్ళాడు. మార్చి 13 తేదీన House of Lords (Upper House)కి!

డల్లాస్ తనకోసం వచ్చాడు. నిజానికి అతను ఆశ్చర్యానికి గురయ్యాడు. ఇలాంటి వంశంలో నుంచి వచ్చిన, బైరన్‌లాంటి మేధావిని అతని కుటుంబం మొత్తం ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో అర్థంకాలేదు.

బైరన్‌కు కూడా ఈ కఠోర సత్యం, ఈ ప్రపంచంలో తానెంత ఒంటరివాణ్ణోననే కఠోర సత్యాన్ని గ్రహించాడు. నిజానికి తనకు దక్కిన ఈ అంతస్తు బిరుదు సామాన్యమైనవి కాదు.

ఆ కాలంలో ఇంగ్లాండును పరిపాలించే కుటుంబాలన్నీ గొప్ప రాజవంశీకులవే. దేశ రాజకీయాలలోని పార్టీలు రెండూ తమ నాయకులుగా ఈ రాజవంశీకులనే ఎంచుకునేవారు. ఇదంతా పద్దెనిమిదవ శతాబ్దపు ఆచారమే! వీరికి ఏ న్యాయశాస్త్రమూ ఏ శిక్షా విధించేదికాదు. ఎలాంటి అనైతికమైన కార్యాన్నైనా క్షమించి వదిలివేసేవారు! అలాంటి ఉన్నత స్థానం ఈ గొప్ప వంశపు వారసులకు ఉండేది.

ఇలాంటి పరిస్థితిల్లో యువకుడైన బైరన్ ఈ లార్డ్ షిప్ చాలా గొప్పగా భావించి వుండాలి.

కానీ తన కుటుంబ పరిస్థితులు అతన్ని ఈ 'గొప్ప'కు చివరి అంచుల్లోనే వదిలివేసింది.

బిరుదు అయితే వుంది. కానీ దాని తాలూకు ఫలితాలు అతనికి అందనంత దూరంలో మిగిలిపోయాయి.

పెద్దల సభకు వెళ్ళినప్పుడు బైరన్‌ను ఒక గదిలోకి ఆహ్వానించారు, అక్కడి అధికారి. ఆయనే బైరన్ వచ్చిన సంగతి Lord Chanceller కి తెలియజేశాడు.

అక్కడ కొద్దిమంది లార్డ్స్ మాత్రమే కూర్చొని వున్నారు, బైరన్ ఆ House of Lords ఛాంబర్‌లోకి అడుగుపెట్టనప్పుడు.

సభ్యాధ్యక్షులు లార్డ్ ఎల్డన్ ఆసీనులైన Wool Sack కు ముందుగా నడిచి తాను ప్రమాణస్వీకారం చేయవలసి బల్లదగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. ఆ కార్యక్రమం పూర్తయిన తర్వాత లార్డ్ చాన్స్‌లర్ లేచి బైరన్ దగ్గరకు వచ్చారు. కరచాలనంకోసం చేయిచాచారు! కానీ బైరన్ ఆయనకు సాల్యూట్‌చేసి ఆయన వేళ్ళనుమాత్రం ముట్టుకున్నాడు.

ఇది సభాధ్యక్షులను నొప్పించింది. ఆయన వెళ్ళి మళ్ళీ తన ఆసనంలో కూర్చున్నారు. అంతే. బైరన్, చాలా నిర్లక్ష్యంగా ప్రతిపక్షం కూర్చునే ఆసనాల్లో ఒకటి ఆక్రమించి, కొద్ది నిమిషాలు మాత్రం కూర్చున్నాడు. తర్వాత బైటకు వచ్చాడు.

“నేను కరచాలనం చేస్తే తమ పార్టీలో చేరమంటారు. నాకు అధికార పార్టీలు వద్దు. ఇప్పుడు మనం ప్రయాణం మొదలుపెట్టవచ్చు” అని డల్లాస్‌తో అంటాడు.

ఒక పక్షంరోజుల తర్వాత ఇంగ్లీషు (English Bards)లోనూ స్కాచ్ రివ్యూస్‌లోనూ (Scotch Review) అతను రాసిన అధిక్షేప కవిత్వం గురించి రాశారు. అది చాలా గొప్పగా వుందని ప్రశంసించారు! అందులో గొప్ప ప్రతిభ వుందని రచనలో ప్రావీణ్యత వుందని పొగిడారు. అతన్ని ఒక రచయితగా గుర్తించారు. తన ప్రయత్నం ఫలించింది. ఇప్పుడు ఇక్కడ తనకేమీ పనిలేదు. కేవలం కొంత సొమ్ము వుంటే తన ప్రయాణం మొదలుపెట్టవచ్చు. ఇప్పటికే పన్నెండు వేల పౌండ్ల అప్పు తన పేరుమీద వుంది. ఇప్పుడు 4,000 పౌండ్లు ఎవరిస్తారు?

హాన్సన్‌కు ఈ విషయం చెప్పి సొమ్ము ఏర్పాటు చేయమంటాడు. అవసరమయితే రోష్‌డేల్ (తన అమ్మ వంశీకుల ఆస్థి) అమ్మమంటాడు. కానీ ‘న్యూస్టెడ్’ మాత్రం తనకు వుండాలంటాడు!

“ఏది ఏమయినాసరే న్యూస్టెడ్ నాతోనే వుండాలి. లేదా నాతోనే పోవాలి” అంటాడు.

“అక్కడే రోజులు గడిపాను. దానిమీదే నా మనసు నిలిపాను. ఎలాంటి అవాంతరం ఎదురైనా ఇప్పుడు, ఎప్పుడు ఈ వారసత్వపు ఆస్తిని వదులుకోను” అని దృఢంగా చెప్పాడు.

“నాలో విశ్వాసం గౌరవం వున్నాయి. ఎలాంటి కష్టాలనయినా ఎదుర్కోగలను. భరించగలను. తట్టుకోగలను. అంతేగానీ న్యూస్టెడ్‌ను వదులుకోలేను” అని దృఢంగా చెప్తాడు.

మరి దీనికి పరిష్కారం?

శ్రీమతి బైరన్ తన కుమారుణ్ణి, “ఇలాఅయితే నువ్వు నాశనం అయిపోతావు. ధనవంతురాలయిన, వంశపారంపర్య సంపద తే గల భార్యను పెళ్ళిచేసుకో. అదొక్కతే నిన్ను రక్షిస్తుంది” అని సలహా ఇస్తుంది.

“అంతకంటే గోల్డెన్ డాలీని చేసుకోవచ్చా, లేదా నా పిస్తోలుతో పేల్చుకోవచ్చా” అంటాడు.

ఇది ఇలా నడుస్తుండగా బైరన్ స్నేహితుడు కేంబ్రిడ్జి జూదగాడు, స్రోప్ డేవీస్ (Scrope Davies) ఇతని అవసరానికి ఆదుకుంటాడు.

డేవీస్ కేంబ్రిడ్జి తర్వాత లండన్‌లోకూడా తన జూదాన్ని కొనసాగించాడు. అతను చాలా పెద్దమొత్తంలో గెలవటం, ఓడిపోవటం మామూలు అయిపోయింది. గెలిచినప్పుడు వేలపౌండ్లు అతని గదిలో పడివుండేవి. అదిగో అలాంటి సందర్భంలో బైరన్‌కు 4 వేల పౌండ్లు అప్పుగా ఇచ్చి ఆదుకున్నాడు.

ప్రయాణానికి సన్నాహాలు మొదలయినాయి. బయలుదేరకమునుపు తన స్నేహితులతో న్యూస్టెడ్ ఎస్టేటులో కలిసి విందు చేసుకోవాలని అనుకుంటాడు. వీరితోపాటు కదా తన ఆలోచనలకు పదును పెట్టగలిగాడు.

అది మే 1809 – అల్లరి మాథ్యూస్, పద్ధతిగల హాబ్ హౌస్, ఇద్దరు బైరన్‌తో వుండటానికి వచ్చారు.

కొద్దిరోజులు తేలికగా గడిచి పోయాయి. ఆ ఎస్టేటు వెలుగు నీడలు ఈ యువకుల ఉత్సాహానికి గొప్ప నేపథ్యాన్ని అమర్చాయి.



నిప్పుల నీడలు

హాలులోకి వచ్చినప్పుడు మెట్లపక్కన ఒక ఎలుగుబంటు కట్టివేసి వుంది. ఎడమప్రక్కన ఒక నక్క – అడవినక్క!

మీరు ముందుగా చెప్పకుండా ఆ భవనంలో అడుగుపెడితే పిస్తోలు గుళ్ళను ఎదుర్కోవాలి. అయిదుగురు, అందులో బైరన్ వుంటారు. వీరుకూడా ఉదయాన్నే ఈ పిస్తోలు గురి సాధన చేస్తుంటారు.

ఆలస్యంగా నిద్రలేస్తారు. అందరూ కిందకు వచ్చేవరకు అల్పాహారం బల్లమీద వుంటుంది. వారు కిందకు వచ్చి కత్తిసాము, పిస్టల్ షూటింగ్, తర్వాత గుర్రపు స్వారీ, కాసేపు పుస్తకాల చదువు అయిన తర్వాత, సరసులో ఈదులాడి అప్పుడు అల్పాహారంకోసం వస్తారు. రాత్రి భోజనం 7–8 మధ్యలో రాత్రి భోజనం తర్వాత బల్లచుట్టూ కూర్చొని ఒక కపాలంతో చేసిన మగ్గులో వైను పోసి చుట్టు అందించుకునేవారు.



నవ్వుల పుర్రెలు

ఈ కపాలం ఒకప్పుడు అక్కడ నివసించి చనిపోయిన సన్యాసిది. తోటలో తవ్వితే దొరికింది. లండన్ పంపించి దానిచుట్టూ ఒక నగల పనివాడితో (నాటింగ్ హామ్) అంచులా కట్టించారు. అతను దానిని బాగా పాలిష్ చేసి చక్కని అంచుకట్టి పట్టుకోవటానికి హాండిల్ పెట్టి పంపాడు! ఈ కపాల పాత్ర మీద కవిత్వం కూడా రాశాడు:

Byron



కపాల మగ్గు

నేను మీలాగే బ్రతికాను, ప్రేమించాను, గట్టిగా దగ్గాను.
చనిపోయాను, ఇప్పుడు భూమిలో నా బొమికలు!
అరె, తాగండి – మీరు నన్ను గాయపరచలేరు
నన్ను తిన్న పురుగులు మీకంటే వెచ్చనివి!

'అవును. ఆ పురుగుల నెత్తురుకంటే
ఈ ఎర్రని వైను మంచిదికదా,
ఈ మగ్గు రూపంలో ఈ అమృతం,
మంచిది కదా వానపాము ఆహారంకంటే'

భయంకరమైన దృశ్యానికి ముక్తాయివు అన్నట్లు అందరూ సన్యాసుల్లా గౌనులు వేసుకొని– బైరన్ సన్యాసులకు పెద్దలా 'అబ్బాట్ – కపాలం' ఆ పీఠానికి అధ్యక్షుడుగా వుండేవాడు, ఒక శిలువ పట్టుకుని.

ఆ దగ్గర గ్రామాల్లోని అందమైన ఆడపిల్లలు – వీరికి అన్నిరకాల సేవలు చేయటానికి నియమించబడ్డారు –

బైరన్‌కు ఈ పెత్తందారీ భూస్వామ్యపు అనైతిక పద్ధతులు చాలా అనుకూలంగా వున్నాయనిపించింది. ఒకరకంగా ఈ న్యూస్టెడ్ కొత్త 'వికెడ్ లార్డ్'కూ పీఠమైంది. ఆ విధంగా న్యూస్టెడ్ గుర్రాలు ఆన్స్‌లేకి వెళ్ళే 'పెళ్ళిబాట'ను మరిచిపోతున్నాయి.

ఆ విధంగా మే నెల అంతా గడిచిపోయింది. అప్పుడు జూన్‌లో బైరన్ హాబ్ హౌస్ యాత్రలకు ముహూర్తం పెట్టారు. ముందుగా జిబ్రాల్టర్ వెళ్ళాలని అక్కడ నుంచి మాల్టా, ఆ తర్వాత ఇంకా తూర్పుకు...

ఇప్పటివరకు అగస్టాను కలవలేదు. వెళ్ళేముందు. 1807లో ఆమెకు వివాహం జరిగింది. కలోనెల్ లీ (Colonal Leigh)తో!

ఆయన త్వరలోనే Prince Regent అవుతాడు. వారు నివసించేది సిక్స్ మైల్ బాటమ్ అది న్యూ మార్కెట్ దగ్గర్లో వుంది.

పోయిన సంవత్సరం ఆడపిల్లను కన్నది.

అప్పుడు బైరన్ ఆమెకు రాస్తాడు.

"నన్ను మామను చేసినందుకు చాలా ఆనందంగావుంది. తర్వాత నాకు మేనల్లుడు కావాలి... అమ్మ నీడలోనుంచి బైటపడ్డాను. మళ్ళీ అందులోకి వెళ్ళను. ఆమెను క్షమించలేను. ఆమెతో ఒకే ఇంటిలో వుండనూలేను. ఇదంతా నా దురదృష్టం. నా హృదయం అంత చెడ్డదనుకోను. కానీ దానిని పచ్చడికింద కొట్టి వదిలింది ఈ సమాజం. ఇప్పుడు రాయిలా మారింది..."

ఆ తర్వాత ఉత్తరాలు తగ్గిపోయాయి. అతని 'Satire' బైటకు వచ్చిన తర్వాత అగస్టా లార్డ్ కార్లైల్‌ను సమర్థించింది.

దీనిమూలంగా బైరన్ అగస్టాపట్ల కోపంగా వున్నాడు. ఈ బంధం కూడా తెగిపోతుందా?

ఏమయినా, రాయిలా మారిన బైరన్ హృదయంలో తడి చాలా వుంది. తన స్నేహితుల బొమ్మలన్నీ తనతో తీసుకువెళ్ళటానికి ఏర్పాటు చేసుకున్నాడు. తనచుట్టూ తనవారుండాలనే తపన, అతన్ని వాళ్ళ బొమ్మలన్నీ తైలవర్ణ చిత్రాలుగా వేయించాడు. కానీ వాళ్ళు అతన్ని అతని విచారాన్ని అంతగా పట్టించుకోలేదు. అతనిచ్చిన విందులు, వినోదాలు ఆనందించారు.

అతను నియమించిన అమ్మాయిల్ని ముద్దులు పెట్టుకున్నారు. అంతేగాని దుఃఖాన్ని నటించలేమన్నారు. రాని కన్నీళ్ళను రాల్చలేమన్నారు.

ఆడవాళ్ళేకాదు ఈ మగవాళ్ళూ అంతేనా? ఎవరికీ హృదయం లేదా – బాధలేదా? ఒకరకంగా అతనికి జీవితమంటేనే విసుగుపుడుతోంది. ముందుగా ఆడజాతిని, ఇప్పుడు తోటివాళ్ళను. చివరికి పూర్తిగా మానవజాతి మొత్తం అసలు స్నేహానికి పనికిరాదా?

టైమర్ ఆఫ్ ఏథెన్సు తన గుమ్మం ముందు తిట్టిపోసినట్లు.

బైరన్ మానవజాతిని ఘాటుగా విమర్శించటం డల్లాస్ జీర్ణించుకోలేక పోయాడు.

అతని ప్రయాణం మొదలుపెట్టబోయేముందు, చివరిగా లార్డ్ డెలావర్ అతన్ని చాలా నిరాశపరిచాడు.

"అరె! వచ్చి ఒక గంట నాతో గడపమన్నాను. ఏమన్నాడో తెలుసా – నేను ఆడవాళ్ళతో షాపింగ్‌కి వెళ్ళాలి – ఏమీ అనుకోకు" అన్నాడు. "నేను రేపు వెళ్ళిపోతున్నాను. సంవత్సరాల తరబడి కనపడను. ఇదా స్నేహం?

ఇంక నాకెవరున్నారు – నువ్వూ–అమ్మ తప్ప? నాకేమయినా, ఎవరూ తలచుకోవటానికి లేరా?" అని బాధపడిపోయాడు.

దీని ప్రభావం అతనిమీద చాలాకాలం వుంది. దానిని గురించి చాలామందికి చెప్పాడు కదా–

నీవు విందులు, వినోదాలు ఇస్తే తినటానికి తాగటానికి చూడటానికి అందరూ వస్తారు.

కానీ మరణమో, ప్రయాణమో లేదా ప్రమాదమో, వారి ఆనందానికి అడ్డువస్తుందంటే అంతే ఆ క్షణమే నిన్ను ఒంటరిగా వదిలి వెళ్ళిపోతారు. గాలికి, వానకి ఎండకూ వదిలి వెళ్ళిపోతారు. అదీ లార్డ్ డెలావర్ చేసింది.

మాథ్యూస్ కాస్త నయం. వీరి ప్రయాణానికి ముందు రాత్రి బైరన్ హాబ్ హౌస్‌కు ఎంతో గొప్ప విందు ఏర్పాటు చేశాడు.

అప్పటికే వీరు ప్రయాణపు ఆహార్యంతోపాటు మానసికంగా సిద్ధమైపోయారు.

అది ఒకరకమైన 'నిర్లిప్తత'. అంతేకాదు ఒకరకమైన కృత్రిమత్వం కూడా.

నౌక ఎక్కేముందు మేరీ మస్టర్స్‌కి బైరన్ రాస్తాడు!

అయిపోయింది – గాలిలో వణుకుతూ

తెరలు పైకి లేచాయి–

గాలి ఈలవేస్తోంది – వంగిన దుంగమీద

అలల తాకిడి మొదలయ్యింది

ఈ నేల విడిచి పోతున్నాను

వేరెవరినీ ప్రేమించలేను.

ఈ భావావేశం ఎంతవరకు నిజాయితీకలది?

ఆమెను ప్రేమించాడు కాబట్టి వెళ్ళిపోతున్నాడా?

ఆమె దగ్గర్లో నివసించలేక పారిపోతున్నాడా?

మనిషి అంత సాధారణజీవా?

విందులు, వినోదాలు, స్నేహితులు వీరితో ఉన్నప్పుడు ఒక్కసారిగా ఆమెను తలుచుకున్నాడు. కానీ తొలిప్రేమ, తొలి యౌవనంలోని కుర్రవాడిపై గాఢంగా ప్రభావం చూపుతుంది.

అప్పటి జ్ఞాపకాలు తియ్యని బాధ ఇలా అతని ఆలోచనలు ముఖ్యంగా దూరంగా వెళ్ళేసమయంలో వెన్నాడతాయి.

అతని జ్ఞాపకాలలో ఆన్స్లీ రోజులు మరపురాని మధురమైనవి.



న్యూస్టెడ్ రాత్రులు



కపాల కప్పు

XIII

మొదటి ప్రయాణం

(1809-1811)

లార్డ్ బైరన్ - ఒక ప్రత్యేకమైన వ్యక్తి - అతని దృష్టిలోనే!

-స్టెన్‌డాల్

లిస్బన్ వెళ్ళటానికి, 26 జూన్ 1809 తేదీన, మిత్రులు బైరన్, హాబ్ హౌస్, ఫాల్‌మౌత్ (Falmouth) హార్బర్ నుంచి కెప్టెన్ కిడ్, నౌకలో బయలుదేరారు! హాబ్ హౌస్ ఈ సుదీర్ఘ ప్రయాణానికి మానసికంగా సిద్ధపడి వంద కలాలు, 2 గాలన్ల సిరా, కట్టలకట్టల తెల్లకాగితాలు తమవెంట తీసుకున్నారు.

బైరన్ పటాలం అంతా అతని వెంటనే వుంది. వయసుమళ్లిన ముర్రే జిబ్రాల్టర్ వరకూ వస్తాడు. ఈ సముద్రపుగాలి అతనికి ఆరోగ్యం మెరుగుపరచవచ్చు. బైరన్ అవసరాలన్నీ తీర్చటానికి అప్పుడే వివాహం జరిగిన విలియమ్ ఫ్లెచర్‌కు బాధ్యత అయింది. ఇతను న్యూస్టెడ్‌లో బండితోలేవాడు. కొత్త పెళ్ళాన్ని వదిలి రావటానికి చాలా గునుస్తాడు. మరొక యువసేవకుడు రాబర్ట్ రష్‌టన్ కూడా వున్నాడు. ఇతన్ని బాబ్ అని పిలుస్తారు. “ఇతనుకూడా నాలాగే దిక్కులేనివాడు” అని బైరన్ జాలిపడతాడు. మరొక జర్మన్ సేవకుడు కూడా వెంటవుంటాడు.

“ఇప్పుడే హాబ్ హౌస్ వాంతి చేసుకున్నాడు. ఇప్పుడే కొంత సిరా ఒలికింది. నేను ఇంగ్లాండు వదిలిపోతున్నాను. ఎలాంటి దిగులు లేదు. ఒకవేళ తిరిగి వస్తే ఎలాంటి సంతోషమూ వుండదు. నేను ఏడమ్‌లాగా మొదటి ముద్దాయిని. కానీ నాకు ఈవ్ లేదు. ఎలాంటి పండూ తినలేదు. కానీ శిక్షమాత్రం అనుభవిస్తున్నాను.”

ఇదీ హాడ్జసన్‌కు వచ్చిన మొదటి ఉత్తరం!

అలాగే అమ్మకు కూడా వీడ్కోలు ఉత్తరం పంపాడు.

"ఈ విశాల ప్రపంచం నా ముందు పరచుకుంది. ఇంగ్లండు వదిలి పోవటానికి దిగులు పడటంలేదు. మళ్ళీ తిరిగి ఇవన్నీ చూడాలని ఆశించటం లేదు, కేవలం నిన్ను తప్ప. అలాగే మన ఎస్టేటు – నన్ను నమ్ము. ప్రేమతో..."

అని జాబు పంపాడు. ఆమెకు తోడుగా, ఎలుగుబంటిని, అడవినక్కను కొంతమంది పసిపిల్లలను వదిలివచ్చాడు.


ఈ సముద్రయానం అంత సునాయాసంగా లేదు. లిస్బన్ చేరే సమయానికి ఐరోపా ఖండంలో యుద్ధం మొదలయింది. జునోట్, ఆదేశంలో వున్న ఫ్రెంచ్ సేనలు జనరల్ క్రాఫోర్డ్ అధీనంలో – ఇంగ్లీషు సైన్యానికి దారినిచ్చాయి, మిత్రులిద్దరూ ఇక్కడి దారుణాలు చూసి చలించిపోయారు. చనిపోయినవారు చర్చిల్లో పడివున్నారు. వీరి అంత్యక్రియలకు సొమ్ముకోసం వారి రొమ్ములమీద పళ్ళాలు పెట్టివున్నాయి. న్యాయ విచారణకు ఆస్కారం లేదు. నడివీధిలో సైన్యంలో జనాన్ని చేర్చుకుంటున్నారు.

ఇవన్నీ చూసి బైరన్ చలించిపోయాడు. అక్కడి పౌరులకు తిరుగుబాటు చేయమని బోధిస్తానన్నాడు.

కానీ పోర్చుగీస్ ప్రకృతి అందాలు అతన్ని ఎంతగానో ఆకర్షించాయి. ఆ మత్తులో మానవజాతి దుర్నీతిని ప్రక్కనపెట్టాడు.

అక్కడి పచ్చని లోయలు నారింజ తోటలు, మఠాలు, కొండలు, కోనలు చూసి మురిసిపోయాడు. "ఇక్కడ చాలా ఆనందంగా వుంది. ఈ నారింజ తోటలంటే ఎంతో ఇష్టం. వచ్చీరాని లాటిన్‌లో ఇక్కడి సన్యాసులతో మాట్లాడుతున్నా వారికి అర్థమవుతోంది. జేబులో పిస్తోలుతో ఇక్కడి వీధుల్లో తిరుగుతూ TAGUS నదిని ఏకబిగిన ఈదాడు! గాడిద మీద గుర్రం మీదా స్వారీ చేస్తున్నా, దోమలు కుడుతున్నాయి. విరోచనాలు పట్టుకున్నాయి. అయితే ఏమిటి?

ప్రయాణాల్లో అన్ని సుఖాలు వుండవుకదా. లిస్బన్ నుంచి సెవిల్లి (Seville) వరకూ గుర్రాల మీద వెళ్ళారు. దారిపొడవునా సిలువలు వేసివున్నాయి. అంటే



అన్నీ హత్యలే! కొంతమంది ఖైదీలు తారసడ్డారు. వారిని సెవిల్లి (Seville) ఉరితీయటానికి తీసుకు పోతున్నారు.

ఇదా ప్రపంచం! ప్రేమ – ద్వేషం ప్రక్కప్రక్కనే వుంటాయా? ఇంత జంతుప్రవృత్తా? ఇది బైరన్‌ను ఎంతగానో కదిలించింది.

సెవిల్లి నుంచి అమ్మకు ఉత్తరం రాస్తాడు. ఇద్దరు అందగత్తెల ఇంట్లో వున్నానని. ఇక్కడి స్త్రీలు అందకత్తెలే. సాధారణంగా పెద్ద చీకటి కళ్ళు, విశాల నేత్రాలు, చక్కని రూపురేఖలు, నల్లని జుత్తు! అందులో పెద్దామె నన్ను ఎంతగానో ఆదరించింది. చివరికి మేము వెళ్ళేముందు నన్ను గాఢంగా ఆలింగనం చేసుకుంది. ఇక్కడ మూడురోజులే ఉన్నాను. విడిపోయేముందు నా వెంట్రుకలు కొన్ని కత్తిరించి తీసుకుంది. మూడడుగుల పొడవున్న ఆమె నల్లని జుత్తును కొంత నాకిచ్చింది. ఈ వుత్తరాలతో పంపుతున్నాను. నేను తిరిగి వచ్చేవరకు దయచేసి జాగ్రత్తగా వుంచు. “వీడ్కోలు, మగాడా, నీవు నన్ను బాగా ఆకర్షించావు” అని వీడ్కోలు చెప్పింది. ఆమె ఇంటిలో కొంత భాగం తీసుకోమంది. కానీ నా గౌరవం కాపాడుకోవాలికదా. అందుకని వద్దన్నాను. ఆమె నవ్వి “నీకు మీ దేశంలో ప్రియురాలు వుందా? నేను త్వరలో స్పానిష్ మిలిటరీ అధికారిని పెళ్ళి చేసుకోబోతున్నాను” అని చెప్పింది.

అక్కడ నుంచి కాడిజ్ (Cadiz) వెళ్ళారు. ‘అంతా అందమైనవారే’ అని ఆశ్చర్యపోయారు.

అక్కడనుంచి జిబ్రాల్టరు ప్రయాణం. అక్కడనుంచి ముర్రే, రష్టన్ ఇద్దరూ తిరిగి వెళ్ళిపోతున్నారు.

బైరన్ వారిని తిరిగి న్యూస్టెడ్‌కు పంపాడు. కేవలం ఫ్లెచర్ ఒక్కడే అతనితో వుండిపోయాడు. "అమ్మా, రాబర్ట్‌ను జాగ్రత్తగా చూసుకో అమాయకుడు" అని రాస్తాడు. జిబ్రాల్టర్ నుంచి మాల్టా నౌక ప్రయాణంలో హాబ్ హౌస్ అందరికీ సన్నిహితునిగా వుంటాడు. అందరితో కలిసిపోయి రాత్రిపూట వారికి పిట్టకథలు వినిపిస్తాడు. నిజానికి ఇవన్నీ స్క్రోప్‌డేవిస్ చెప్పినవే.

బైరన్ ఎక్కువగా అందరితో కలవడు. అందుకని అతన్ని అందరూ దూరంగా పెడతారు.

చాలా తక్కువ తింటాడు. అందరికంటే ముందు డైనింగ్ టేబుల్ వదిలి వెళ్ళిపోతాడు. సముద్రపుటలలు, దూరంగా కొండలు, వీటిలో ఎంతో కవిత్వం దాగున్నదని భావిస్తాడు. చీకటిపడగానే దీపాలు వెలగగానే అందరికీ దూరంగా వెళ్ళి తెరచాప గుడ్డలమీద పడుకుంటాడు. అక్కడ గంటలతరబడి వెన్నెల కిరణాలు సముద్రపుటలల మీద కదలటం చూస్తుంటాడు. అతని తోటి ప్రయాణికులు అతను ఏకాంతంకోసం ప్రాకులాడుతున్నట్లు అర్థం చేసుకుంటారు. అదీ అందరిలో కలవటం ఇష్టంలేక. నేల చూపులు చూస్తుంటాడని అనుకుంటారు. అతని నిర్లక్ష్యాన్ని అపార్థం చేసుకుంటారు. ఇతను ఎప్పుడూ 'సహజం'గా వారికి కనపడలేదు.

ఫ్లెచర్ పట్ల కఠినంగా ఉండేవాడు. ఎప్పుడూ అశాంతితో అల్లాడిపోయేవాడు. అతని అంతరంగ సంఘర్షణ ఏమాత్రం తెలిసినా సానుభూతి చూపేవారు.

కానీ బైరన్ అలల కదలికలతోనూ, తారల తళుకులతోనే ఎక్కువ సమయం గడిపేవాడు. అతనికి మనుషులంటే భయం! అతని ప్రవర్తన, అతనికి గౌరవ ప్రదంగానే తోచింది.

నావ వయ్యారంగా ఊగుతుంటే ఒక్కో అల అతన్ని తన చిన్ననాటి బాధాకరమైన స్మృతులనుంచి దూరంగా తీసుకుపోతున్నట్లు భావించేవాడు.

తన యౌవనపు రోజుల ఓటములను గురించి లోతుగా ఆలోచించేవాడు. ఈ స్మృతుల్లో అతనికి తీయని బాధ అనుభవించేవాడు. అవి వింతగా తోచేవి.

అరె – ఈ ప్రయాణపు అనుభవాలు ఎందుకు కవితల్లో వ్రాయకూడదు?

చిన్ననాటి నుంచి తన ఉద్వేగం గూడుకట్టుకుని లోలోతుల్లో కుతకుత ఉడుకుతోంది. ఇప్పుడు అది ఒక రూపుచెంది ఒక రకమైన ద్రవరూపంలో మారి చివరికి లావాలాగా మండుతున్న మట్టిలో ప్రవహించబోతోంది.

తన చిన్ననాటి బైరన్‌ను హీరోగా చేశాడు. Childe Burun అన్నాడు. అతనే Byron! విచారగ్రస్తమైన లావుపాటి బైరన్ – ఇతన్ని గురించి హాబ్ హౌస్‌కు పరిచయంలేదు. ఒకవేళ తెలిసినా అర్థం చేసుకోలేడు.

నౌక వెన్నెల వెలుగులో ఊగిసలాడుతోంది. “మూడురోజుల ప్రయాణం సాగింది. కొంతమంది ప్రయాణీకులు ఆ రోజు ఉదయం పిస్టల్ షూటింగ్ అభ్యాసం చేస్తున్నారు, సీసాలు పెట్టి. బైరన్ కూడా వాళ్ళతోపాటు షూటింగ్‌చేసి తానే అందరింకటే మంచి గురికాడుగా నిలబడ్డాడు. ఇది అతనికి చాలా ఉత్సాహంగ అనిపించింది. హాబ్ హౌస్ తన సహజ ధోరణిలో అక్కడి ప్రయాణీకులకు “బైరన్ చిన్నపిల్లవాని వంటివాడు. మీరు జాగ్రత్తగా చూసుకోండి” అంటాడు. కాస్త హాస్యంగానే!

మాల్టా (Malta)లో ఒక సన్యాసితో అరబిక్ పాఠాలు చెప్పించుకుంటాడు! అక్కడే స్పెన్సర్ స్మిత్ అనే ఆమెను దూరంనుంచే ప్రేమించేస్తాడు. ఈమె చాలా



సాహసాలు చేసిన, అవీ ఎంతో రమణీయమైనవే, ప్రౌఢ. నెపోలియన్ సైనికులు బందీని చేస్తారు. ఆమెను ఒక ఇటాలియన్ నేత రక్షిస్తాడు. ఆమెను ఎంతో గౌరవిస్తాడు కూడా!



నడిచే అందమా

"ఆమె సున్నితమైన అవయవాల పొందిక, పారదర్శకమైన తెల్లటి శరీర వర్చస్సు, గాలికి ఊగిసలాడే ఉంగరాల జుత్తు. అరే – ఆమె అందాన్ని ఏమని వర్ణించను? ఈ ప్రపంచంలో అలాంటి ప్రౌఢ – అంతటి రూప లావణ్యాలుగల స్త్రీ ఎక్కడా ఎప్పుడూ ఉండదు" అని వర్ణిస్తాడు!

ఆమె పొందికలో ఒక గంధర్వ కన్య వుంది. ఆమె హ్రస్వ దృష్టి చూపులు మగవాళ్ళను గందరగోళంలో పడవేస్తాయి.

ఇవన్నీ బైరన్‌ను ఎంతో ఆకర్షించాయి. కానీ అతనికి 'ప్రేమ'పట్ల ఏర్పడిన కొత్త తాత్త్వికత వీటన్నిటికీ లొంగనీయలేదు! ఆ భావమే అతన్ని దూరంగా వుంచింది.

నాది – 'పాలరాతి హృదయం' ఇదీ అతని ఆలోచన. ఒకవేళ ఈ కళలో నిష్ణాతునిగా మారాలంటే అది ఆడదంటే ద్వేషంతోను నా మీద నాకు నమ్మకంతోనే, ప్రేమా? హుఁ! తన విజయం ఈ విశ్వాసంలోనే వుండాలి అనుకుంటాడు. ఇదంతా నిజమేనా?

అదిగో! ఆ సుందరాంగి. బైరన్ నుంచి ఒక ఖరీదయిన 'పసుప్పచ్చ రత్నం' అందుకుంది. ఆమె వాలుచూపులు అతన్ని చాలా కాలం వెన్నాడాయి. కలల్లోనే ప్రత్యక్షమైనాయి.

కానీ అతను తేలికగానే వీటిని వదిలించుకోగలిగాడు!

అక్కడ నుంచి అల్బేనియా (Albenia) అంతగా తెలిసిన, వెలుగు చూసిన దేశం కాదు. అక్కడి కొండలు, అడవులు, అతనికి తన చిన్ననాటి స్కాట్‌లాండ్ గుర్తుచేస్తాయి. మగవాళ్ళు మోకాళ్ళవరకు 'స్కర్టు'లు వేసుకుంటారు. పైన గొర్రె తోలులో కప్పుకుంటారు.

అక్కడి సాహసికుడు – క్రూరుడు అయిన 'ఆలిపచా'కు ఇంగ్లీషు మంత్రి – బైరన్ (గొప్ప వంశీకుడు – కవి) వస్తున్నట్లు సమాచారం అందిస్తాడు.

ఆలీ – బైరన్‌ను తన దగ్గరకు విందుకు రమ్మంటాడు. ఈ మొత్తం వాతావరణం బైరన్‌కు ఎంతగానో నచ్చింది. అల్బేనియన్లు వారి 'టూనిక్స్'లో, టార్టారులు ఎత్తైన టోపీలతో, నీగ్రో బానిసలు – గుర్రాలు – పెద్దపెద్ద డోలుడప్పులు దగ్గరలోని మసీదుల నుంచి వినవచ్చే ప్రార్థనలు – 'అల్లాను మించి వేరే దేవుడు లేడు' అని అరుపులు – ఇవన్నీ బైరన్‌ను బాగా ఆనందపరిచాయి.

ఆలీ – చాలా భయంకరమైన వ్యక్తి. డెబ్బయి ఏళ్ళ వయసు, అయిదడుగుల ఆరంగుళాల ఎత్తు. తెల్లని గడ్డం మర్యాదగల ప్రవర్తన – వెరసి బైరన్‌కు ఇతనొక అసాధ్యపు వ్యక్తిగా కనిపిస్తాడు.

అతనికి దయాదాక్షిణ్యాలు లేవని శత్రువును గొర్రెలు కాల్చినట్లు కర్రకు కట్టి మంటపైన త్రిప్పుతాడని ప్రతీతి. తన కోడలికి చిరాకు కలిగించారని ఒకసారి, పదిహేనుమంది ఆడపిల్లల్ని ప్రక్కనేవున్న చెరువులోకి విసిరివేశాడు!

ఆలీ, బైరన్‌ను అడుగుతాడు; "ఇంత చిన్న వయసులో మీ మాతృభూమిని వదిలివచ్చారేమిటి?" అని! "మీ చిన్న చెవులు – మీ తెల్లని చేతులు, ఇవే మీరు రాజవంశీకులని తెలియజేస్తున్నాయి" అంటాడు!

ఇది నిజంగా బైరన్‌ను ఎంతో ఆనందపరచింది. తర్వాత అతను రాసిన ఉత్తరాల్లో ఇదేవిషయం చాలాకాలం ఉదహరిస్తాడు!

ఆ విధంగా ఆలీపచా, బైరన్ జీవితంలో చాలాకాలం ఒక హీరోగా నిలిచిపోయాడు. ఆధిపత్యం అంటే ప్రేమ – సామాజిక, నైతిక సూత్రాలపట్ల నిరసన. మార్మికతపట్ల అభిమానం, ఈ విధంగా ఆలీ వ్యక్తిత్వం బైరన్‌ను కదిలించివేసింది.

బందిపోట్లు గుండాలు, దొంగల నాయకులు ఇలాంటి అసాంఘిక శక్తులంటే బైరన్‌కు చాలా ఇష్టం!

ఇవన్నీ మనిషి దొంగాటకానికి విరుగుడు అనుకుంటాడు. అంతేకాదు ధైర్యసాహసాలకు వీరే గొప్పవారంటాడు.

ఆలీ పచా కూడా బైరన్‌ను, ఎంతో మర్యాదగా ఆయుధాలతోవున్న తన మనుషుల్ని తోడుగా ఇచ్చిపంపుతాడు.

ఇలాంటి ఆటవికులతోడుగా, ఒక దేశంలో తిరగటం చాలా మత్తు కలిగించే విషయమే, సాహసమే!

ఇలాంటి సమయంలోనే అతనికి జ్ఞానోదయం అవుతుంది – తన అంతరాంతరాల్లో తానుకూడా సాహసికుడననే అని నమ్ముతాడు. కార్యశూరుడనని విశ్వసిస్తాడు. తనకు భయం అంటే తెలియదు. ఈ అల్బేనియన్ వీరులు ఎంత గొప్పవారు! ఇంత సాధారణంగా, ఇంత నమ్మకంగా ఇంత భయంకరంగా వున్నారు! ఇంత ఆదిమంగా జీవిస్తూ తమ మనసులను ఎంత నిర్మలంగా వుంచుకోగలుగుతున్నారు!

ఇక్కడే వీరి సన్నిధిలోనే (Yanina) బైరన్ తన 'చైల్డ్ బైరన్' రాయటం మొదలుపెట్టాడు. మొదటి అధ్యాయం (కాంటో) రాసిన తర్వాత దానిని చైల్డ్ హెరాల్డ్ అని మార్చాడు.

దానిని 'Spensesian Stanza' లలో రాశాడు. ఒక్క పద్యానికి తొమ్మిది వరసలు! దానిమూలంగా చాలా వైవిధ్యం వుంటుంది అని ఆశించాడు.

హాబ్ హౌస్ వెనువెంటనే దీనిమీద 'నోట్సు' రాసుకుంటున్నాడు.

అల్బేనియా నుంచి గ్రీసు వెళ్ళాలి (సముద్రయానం ద్వారా) అనుకున్నారు. చిన్నపాటి తుఫాను వీరి ప్రయాణానికి అడ్డుపడింది. "ఈ టర్కీ నౌక తుఫానులో ఛిద్రమైపోవచ్చుననుకుంటున్నాం. కేప్టెన్ అనుభవం లేనివాడు. నావికులు అమాయికులు. నిజానికి ఈ తుఫాను అంత భయంకరమైనదేమీ కాదు. ఫ్లెచర్



టర్కీ నౌక చిరిగిన తెరచాపలు

తన భార్యను పదేపదే పిలుస్తున్నాడు. గ్రీకులు తమ పెద్దలను తలుచుకుంటున్నారు. ముసల్మానులు అల్లాను తలుచుకుంటున్నారు. నౌక కెప్టెన్ లోపలికి వెళ్ళి కుళ్ళికుళ్ళి ఏడుస్తున్నాడు.

"తెరచాపలన్నీ చిరిగిపోయాయి. నావికులు నావను అదుపు చేయలేక పోతున్నారు. ఫ్లెచర్ ఒకటే ఏడుపు. "ఈ నీటిలో సమాధి కావల్సిందేనా" అంటూ. బైరన్, ఫ్లెచర్ సముదాయించటమే సరిపోయింది. 'అల్బేనియన్' కోటు వేసుకుని చాలా ప్రశాంతంగా డెక్‌మీద పడుకుని నిద్రపోయాడు.

ఉదయం లేచేసరికి తుఫాన్ ఎటోపోయింది. నౌక ఒక దీవి చేరింది. అక్కడవున్న సులోటీ జాతి! వీరు యుద్ధవీరులు! వీరిని ఆహ్వానించారు. వీరు 'పచా' (Pacha)కు సహాయంగా యుద్ధానికి వెళ్తారు. బయలురేముందే తమ 'కూలీ' డబ్బు తీసుకుంటారు.

నౌకలోనివారందరినీ మర్యాదగా ఒడ్డుకు చేర్చారు. తడిసిన బట్టలు ఆరబెట్టారు. తినటానికి ఆహారం ఇచ్చారు. రాత్రి మంటచుట్టూ చేరి నృత్యాలు చేసి అలరించారు. వారు పాడిన పాట చాలా గొప్పగా వుంది. 'మేమే పార్గా దొంగలం' అని పాడారు.

బైరన్ చివరిగా కొన్ని నాణాలు ఇవ్వచూపాడు. వాళ్ళ నాయకుడు 'వద్దు. మీరుకూడా, మాలాగా ప్రేమిస్తే చాలు' అంటాడు.

ఇది బైరన్‌ను ఎంతో కదిలించింది. వీరి కాఠిన్యం, కరుణ, ఎంతగొప్పది! బైరన్‌లోవున్న 'మత వ్యతిరేకత' మరింతగా ధృవపడింది.

కొద్ది వారాల వ్యవధిలో కాథలిక్కులను, ప్రొటెస్టంట్లను, ముసల్మానులను, ఛాందసులను అందర్నీ చూశాడు. వాళ్ళ అందరిలో మానవ మృగాలే కనిపించారు.

అందరికంటే అల్బేనియన్లు నాకు నచ్చారు. వీరిలో అందరూ తుర్కులు కారు. కొందరు క్రిస్టియన్లు వున్నారు. కానీ ప్రాథమికంగా వీరి ప్రవర్తనకు మతం ప్రాతిపదిక కాదు!

అతను రాసిన ఉత్తరాలలో ప్రముఖంగా ఒక చిత్రం కనిపిస్తుంది. అల్బేనియా అడవుల్లో గొడుగు వేసుకొని వర్షంలో తడవకుండా జాగ్రత్తగా నడిచే ఫ్లెచర్! మరోప్రక్క లెక్కలేకుండా నిర్లక్ష్యంగా ఎండావానలో నడిచే అల్బేనియా స్థానికులు!

"అందరి ఇంగ్లీషు పౌరులలాగానే ఫ్లెచర్ గూడా చాలా ఇబ్బందిపడ్డాడు. అతని బాధ అంతా వేడి, చల్లదనం, జ్వరం, దొంగలు, తుఫానులు, చాలా పిరికితనంతో ఎప్పుడూ భయంతో వణికేవాడు!"

సముద్ర యానం వీలుపడక గ్రీసు చేరటానికి భూమార్గాన ప్రయాణమయ్యారు. ఈ మహారణ్యాలు పర్వతాలమీదుగా ప్రయాణం అద్భుతంగా సాగింది.

సాయంత్రాలు వీరితోపాటు 'సులోటీ' సిబ్బంది బైరన్ చెప్పిన పద్యాలు (తర్జుమాదారు ద్వారా) పాడేవారు. చివరికి గ్రీసు పరిసరాలు చూశారు.



ఏథెన్సు

'మిస్సోలోంగి' (Missolonghi) పట్నంలో ఆగారు. అది సముద్రపు ఒడ్డున గ్రీసు పరిసరాల్లో వుంది.

గ్రీసు గడ్డమీద అడుగుపెట్టగానే బైరన్ చలించిపోయాడు. తన చిన్నతనం నుంచీ ఈ నేలను ప్రేమించాడు. కవుల కావ్యాలతో చరిత్రకారుల కథనాలతో ఈ నేలను ఎంతగానో ప్రేమించాడు.

ఇప్పుడు కూడా నిరాశ చెందలేదు. ఇప్పటివరకూ ఉత్తర ప్రాంతపు కొండకోనలు అలవాటుపడిన తన చూపులకు అదీ మబ్బుల్లో దాగిన మైదానాలు చూసిన తన కళ్ళకు ఈ నీలి ఆకాశం, తేలికపాటి గాలి, జేగురు మన్ను, కనపడుతున్న కొండ చరియలు ఇవన్నీ ఎంతో సంతోషం కలిగించాయి. లీపాంటో జలసంధి దాటారు. పట్రాస్ (Patras) నగరం వరకూ (తెల్లగా కనపడుతున్న ఇళ్ళతో) తరువాత పరనాసస్ (Parnassus) నగరం వరకూ మరో దిక్కులో ప్రయాణంచేసి గుర్రాలమీద వెళ్ళారు. తన గైడ్ చెప్పే ప్రతిమాట అతనికి ఏదో స్మృతిని కలిగిస్తోంది.

ఇదేకదా మిలీగర్ (Meleagar) అట్లాంటా తిరిగిన దేశం! Eryman Thus బోటు చేరిన తీరం. ఆ దూరంగా కనపడుతున్న తెల్లని కొండ కోన హెలికాన్ (Helicon) కదూ! పైతియా (Pythia) గుహప్రక్కన కాసేపు సేదతీరటంతో ఎంతో ఉద్వేగంగా వుంది! డెల్ఫి (Delphi) దగ్గర మిత్రులు ఇద్దరూ తమ పేర్లు స్తంభాలమీద చెక్కారు. పెద్దపెద్ద పక్షులు ఆకాశంలో గిరికీలు కొడుతున్నాయి.

అవి గ్రద్దలు కదూ అన్నాడు. బైరన్ కాదు జబర్దలు అన్నాడు హాబ్ హౌస్!

ఏథెన్సు (Athens) చేరేసమయానికి హాబ్ హౌస్ కూడా ఈ మట్టి వేడిని అనుభవించాడు.

ఇక్కడి సహజ ప్రకృతి సంపద ప్రదేశాలన్నీ, అక్కడ నివసించినవారి ధైర్యసాహసాలు స్వేచ్ఛా ప్రేమికుల సాహస కృత్యాలతోపాటు వారి సౌందర్యారాధన, కళారాధనలతో, మహోన్నత మానవ విలువలతో విలసిల్లాయి!

ఇది అంతటి పవిత్రమైన నేల. అంతటి స్వచ్ఛమైన మట్టి. అంతటి ఆరాధనీయమైన ప్రదేశం!

Byron



ఒకప్పటి గ్రీస్

చివరగా 24 డిసెంబరు 1809 నాటికి పగలంతా గుర్రపు స్వారీ మీదనే అడవులు ఆలివ్‌చెట్లు దాటుకుంటూ వెళ్తుండగా వారి గైడ్ "మైలార్డ్ అదిగో అదిగో ఏథెన్సు" అని కేకలువేశాడు.

ఆ లోయలో ఒకప్రక్కగా, ఎత్తైన గుట్టల మీద ఇళ్ళతో నిండిన పట్నం కనిపించింది. ఆ పట్నానికి తూర్పుగా సముద్రం పరచుకుని వుంది!

అవును. గైడ్ చెప్పింది సబబే. అప్పుడు ఏథెన్సు ఒక గ్రామమే- పెద్ద గ్రామం.

అప్పటికే తుర్కులు ఏథెన్సును ఆక్రమించారు. తుర్కులు ఆక్రమణదారులే. పరిపాలకులు కాదు. అందుకని ఏథెన్సు మరింతగా శిథిలమవుతోంది.

ఆగాస్ బజారుల్లో తుర్కులు తమ హుక్కాలు నిర్లక్ష్యంగా తాగడం చూడవచ్చు.

ఆక్రోపోలిస్ ప్రక్కనే తుర్కులు మిలిటరీ కాంపు వుంది.

బైరన్, హాబ్ హౌస్ అక్కడికే తమ బహుమానం తీసుకుని వెళ్లారు. (పంచదార – టీపొడి).

వారికి మంచి స్వాగతమే లభించింది.

అక్కడి సేనానాయకుడు వీరిని ఆ శిథిలాలయాల చుట్టూ త్రిప్పి చూపించాడు. హాబ్ హౌస్ ఆ పాలరాతి స్తంభాలను చూసి 'ఇవి మంచి పొగ గొట్టాలుగా పనికివస్తాయి' అంటాడు.

బైరన్ ఆ శిథిలాలలో దాగిన వైభవాన్ని పూర్వ వైభవాన్ని చూసి చలించిపోతాడు.

విరిగి ఒరిగిపోయిన ఆలయస్తంభాల పూర్వ వైభవం ఇప్పటి అనాకృతికి ఎంత భిన్నంగా వుంది!

ఇక్కడేనా తన అదృష్టం విధి రాత నీడలు పరుచుకున్నాయి? ఇది అంతకంటే క్లిష్టమైన పరిస్థితి.

అతని ధైర్యసాహసాలు అతని తప్పనిసరి పలాయనం అవసరం, ఇవన్నీ అతన్ని ఒక వీరునిగా అందరినుంచి వేరుగా చూపిస్తున్నాయి. ఈ విషయం అతనికి తెలుసుకూడా.

ఏదో మహత్కార్యం తను చేయబోతున్నాడని అతని నమ్మకం.

ఒకరకంగా అసూయతో నెపోలియన్ కీర్తిని చక్రవర్తిగా ఎదిగిన తీరును గమనించాడు.

ఇతరుల గొప్పతనాన్ని, డొల్లతనాన్ని ఎంతో నిశితంగా గమనించాడు. ఎలా? హారోహిల్ మీద సమాధిరాయిపై కూర్చుని. అక్కడి స్మశానపు శిథిలాలను గమనించినట్లే!

గ్రీస్ శిథిలాలు





శిధిలాలంటే తనకెందుకో ఆరాధన?

ఈ విరిగి ఒరిగిపోయిన స్తంభాల పూర్వ

వైభవం ఇప్పటి అనాకృతికి ఎంత భిన్నం?

బహుశా న్యూస్టెడ్ తన శిధిలావస్థలోని ఎస్టేటు నుంచి

ఇలాంటి కూలిపోయిన భవనాలపట్ల నేలమట్టమైన రాజ్యాలపట్ల

ఆరాధన పెంచుకున్నాడా?

అక్కడి స్మశానంలోని సమాధి రాయిపైన కూర్చున్న రోజులే తనకి ఇష్టమైనవా?

జిబ్రాల్టర్ నుంచి హెల్స్ పాయింట్ వరకూ పరచుకున్న

ఈ శిథిల సామ్రాజ్యాల స్మశాన వాటిక, అందులోని సమాధులంటే

తనకెందుకింత ఆరాధన?

విరిగి ఒరిగిపోయిన ఈ ఆలయ స్తంభాలను చూస్తుంటే మహావీరులు యుద్ధాలలో నేలకొరిగినట్లులేవూ?

పుడమితల్లి కడుపులో విశ్రాంతి తీసుకుంటున్నారా ఈ వీరులంతా?

పోర్చుగల్లులో జనసామాన్యం పరాధీనులయి వుంటే చూసి ఆశ్చర్యపోయాడు.

ఇక్కడ Miltiodes, Themistocles ఏలిన ఈ నేలమీద ప్రజలు బానిసల్లా బ్రతుకుతుంటే అతను కోపాగ్నితో రగిలిపోయాడు.

ఓ గ్రీస్ – నీవు గతానికి శకలానివా?

మానవాతీతమైనా ఇప్పుడు కూలిపోయావా?

ఇప్పుడు నీ దిక్కులేని పౌరులకు, ఎవరు నాయకుడు?

ఇప్పటికే వ్యసనమైన బానిసత్వాన్ని బాపేదెవరు?

ఎంతకాలం నీ వారసులు వేచిచూస్తారు?

ఇప్పుడు పోరాడే వీరులు – నేలకొరిగిపోవాలా?

నీ పూర్వపు చైతన్యాన్ని ఎవరు పునరుద్ధరిస్తారు?

యూరోటా తీరం దాటి సమాధినుంచి నిన్ను ఎవరు పిలుస్తారు?

ఇదీ Child Harold లో అతని తిరుగుబాటు కేకలు!

'నేనేమి చేయను?' అని వాపోతున్నాడు ఒక గ్రీకు. 'తిరగబడు' అని అరిచాడు. 'బానిసవా?' అని తిట్టాడు? నీవు గ్రీకువని చెప్పుకోవటానికి సిగ్గుగా లేదు? 'ప్రతీకారం తీర్చుకో' అని బోధిస్తాడు.

హాబ్ హౌస్‌తోపాటు బైరన్ రెండు గదులు అద్దెకు తీసుకున్నాడు.

బైరన్, బ్రిటీష్ వైస్ కాన్సుల్ విధవరాలు. మేడమ్ థియోడోరా మెర్సితోపాటు ఉంటాడు. అతని గదికి ఒక బాల్కనీ వుంది. అక్కడ నుంచి చూస్తే లోపల పెరడులో ఒక నిమ్మచెట్టు పసుపుపచ్చ కాయలు, దానికిందే ముగ్గురు ముగ్ధలు ఆడుకుంటున్నారు. ఇలాంటి అవకాశాన్ని బైరన్ వదులుకుంటాడా – అతను ప్రేమించటానికి ఇంతకంటే మంచి సమయం సందర్భం అవకాశం కావాలా? అంటే గ్రీస్‌ను (గ్రీకును కాదు) ప్రేమిస్తున్నాడు. "చెప్పటం మర్చిపోయాను. ప్రేమకోసం పరితపించిపోతున్నాను. ఇక్కడ ముప్వురు గ్రీకు ముగ్ధలు, అదీ ఏథెన్సులో! అదే ఇంట్లో వుంటున్నారు. థెరిసా, మేరీ యానా, కటింకా వారి పేర్లు. వీరు దేవకన్యలు. అందరూ పదహారులోపే."



గ్రీకు శిధిలాలు

Byron

థెరిసా కోసం పద్యమే రాశాడు!

ఓ ఏథెన్సు దేవతా మనం విడిపోదాం.

నా హృదయం నాకిచ్చేయి

అది ఎప్పుడో నన్ను వదిలి నిన్ను చేరింది

పోనీలే – కొంత ఇచ్చి అంతా వుంచుకో

నీమీద ఒట్టు – వెళ్ళేముందు చెప్తున్నా

నా ప్రాణంకంటే నిన్నెక్కువ ప్రేమిస్తున్నా!

ఈ ప్రేమించింది బైరన్? కాదు. చైల్డ్ హెరాల్డ్ ఆమెకోసం ఒక అపురూపమైన బహుమానం పంపుతాడు. ఆమె ముందు తన చిన్న డాగర్‌తో గుండెమీద గాయం చేసుకుంటాడు. ఆమె ఎంతో స్థిరంగా ఈ ప్రేమను నెత్తురు సాక్షిగా అంగీకరించింది. ఆమె అందానికి అంకితమైన ఈ లేత నెత్తుటి మరకను ఆదరించింది!

'అటిగా' (Attica) వరకూ వారితోపాటు ఫ్రెంచ్ కాన్సుల్ వస్తాడు. ఆలివ్ చెట్ల చిట్టడవిగుండా, పచ్చిక మైదానాల మీదుగా కేప్ సునియమ్ (Cape Suniam) వరకు వచ్చారు.

అక్కడ పాలరాతి ఆలయపు ఆకారం ఎర్ర సముద్రపు (ముందు) నీడగా కనపడుతోంది.

మన స్కూలు పిల్లవాడు బైరన్, ఆలయపు గోడ, దానిమీదే తన పేరు చెక్కాడు! ఆ పాలరాతి మెట్లు మీద కూర్చుని అక్కడి సాయంత్రాన్ని సముద్రపు గాలిని బంగారు రంగు ఆకాశాన్ని తనివితీరా ఆస్వాదించాడు. ఒంటరిగా ఏకాకిగా కేవలం తనే! ఎంతో ఆనందంగా సంతోషంగా ఆ క్షణాలు గడిచాయి. ఈ వసంతం అనంతంగా, మబ్బుల్లేని నీలాకాశం ఇవన్నీ స్వర్ణసమానం, సమాంతర స్వర్గధామం.

గ్రీకులంటే ఏదో బంధం ఏర్పడింది. మిగతావారు విశ్వాసఘాతకులు. అయినా ఎవరు గ్రీకు ప్రజలకు న్యాయం చేశారు?

టర్కీ ఆక్రమణదారులను ఎవరు నిలవరించారు?

అక్రోపోలిస్‌ను ఇంగ్లీషువారు దోచుకోలేదా?

ఫ్రెంచ్‌వారు కేవలం సలహాలేతప్ప సాయం చేయలేదే – ఇప్పుడు ఏం జరుగుతోంది లార్డ్ ఎల్గిన్ (Lord Elgin) పరివారం పాంథియన్‌ను నాశనం చేయటంలా? అరె! టర్కీ గవర్నరు కూడా కంటతడిపెట్టాడు.

ఈ స్తంభాలను (Pediments) పగలగొడుతుంటే గ్రీకులను ఎంత ప్రేమించినా టర్కీలతో బైరన్‌కు ఎలాంటి పేచీలేదు. తనను ఇబ్బంది పెట్టినందుకు అక్కడి పోలీసు అధికారి ఒక పౌరుణ్ణి కొరడా దెబ్బలు కొట్టించాడు.

“నియంతృత్వపాలన మన దేశంలో ఎలావున్నా ఇక్కడ మాకు బాగా ఉపయోగపడింది” హబ్ రాస్తాడు. యాత్రికుడు ఆగటానికి వీలు లేదుకదా!

అక్కడ నుంచి ఇంగ్లీషు నౌక పైలాడిస్ స్మిర్నా వెళ్తోంది. అందులో ప్రయాణమయ్యారు. ఆ నౌక అక్కడి గ్రీసు ద్వీపాల రాళ్లను తాకుతూ అలల తాకిడికి Ulysses సముద్రంలో చేరింది. ఎలాంటి సముద్రపుటలలు? వైన్ తీగల రంగుల్లో చిక్కిన రత్నాల్లా మెరుస్తున్నాయి.

స్మిర్నాలో బైరన్ Child Harold చైల్డ్ హెరాల్డ్ రెండో కాంటో పూర్తి చేశాడు.

హాబ్ హౌస్‌కు ఇది అంతగా నచ్చినట్లు లేదు. అన్ని అతిశయోక్తులు, ఘాటయిన విమర్శలు! ఇంతకంటే పోప్ కవిత్వం ఎంతో మేలు అంటాడు. బైరన్‌కు పద్దెనిమిదవ శతాబ్దపు కవిత్వం ఎంతో నచ్చింది. ఇప్పుడు తన సహజ కవితాధోరణికి తానే ఆశ్చర్యపోతాడు! కానీ ఈ రాతలన్నీ తన ప్రయాణపు సంచి అడుగున పడవేస్తాడు. కీర్తికోసం మరో మార్గం ఎంచుకోవచ్చు అనుకుంటాడు.

స్మిర్నా నుంచి కాన్స్టాంటినోపుల్ తీసుకువచ్చిన నౌక టెనిడోస్ దీవిలో ఆగింది. అక్కడ నుంచి డార్డినెల్లాస్‌కు మార్గాన్ని చూస్తాడు. అతి ఇరుకైన కనుమ. రెండు ఖండాలను కలిపే మార్గం! గట్టిగా అలవస్తే ఈ ఖండాలు విడిపోతాయి! ఆ రెండు కొండల నడుమ నదిలా ఈ సముద్రపుటలలు ఎప్పుడూ ఎగసిపడుతూనే వున్నాయి. ఆ కొండ కొమ్ములు నగ్నంగా వర్ణరహితంగా కళావిహీనంగా వున్నాయి.


అదిగో అక్కడే కదా హెలిస్ పాయింట్. ఇక్కడే కదా లీయాడర్ తన ప్రేయసి కోసం ఈ నదిలాంటి సముద్రపు పాయను ఈదుకొంటూ వెళ్ళాడు!

బైరన్ అతన్ని అనుకరించాలని ప్రయత్నిస్తాడు. మొదటిసారి విఫలమై రెండోసారికూడా పూర్తిచేయలేకపోతాడు. కానీ మే నెల 3వ తేదీన తను అనుకున్నది సాధిస్తాడు. ఐరోపా ఖండాన్నుంచి ఆసియా ఖండానికి ఈదుకుంటూ వెళ్ళిన ఘనత సాధిస్తాడు. గంటన్నర పైగా నీటిలో వుండిపోతాడు. అతని సహచరుడు ఎకిన్‌హెడ్ (Mr. Ekenhead) బైరన్‌కంటే అయిదు నిమిషాలు ముందుగా వుంటాడు. ఇద్దరూ అలసిపోలేదు. కానీ చలికి వణికిపోయారు. బైరన్ ఆనందంతో కూడిన అద్భుతమైన భావానికి లోనయ్యాడు.

ఈ విషయం అమ్మకు, హాడ్జిసన్‌కు, ప్రపంచం అంతటికీ రాస్తాడు. నేను రెండు ఖండాలను ఈదుకుంటూ కలిపాను! అంటూ సెస్టోస్ నుంచి ఎబిడోస్‌కి తన సాహసాలు, ఆలీపచా తన చిన్న చెవుల రాచరికపు చిహ్నం. తన సేవకుని బాధలు (ఫ్లెచర్) అన్నీ అతని ఉత్తరాలలో చోటుచేసుకున్నాయి. "నేను సాధించింది సామాన్యమైనది కాదని చెప్పగలను. ఇంతకంటే వేరే కీర్తి కెరటాలు నాకు రాజకీయంగా, కవిగా, లేదా విమర్శకునిగా దక్కకపోవచ్చు" అని రాస్తాడు.

ట్రినిడోస్‌లో వున్నప్పుడు ట్రోడ్ చూస్తాడు. ఇడా కొండను చూస్తూ తన 'హారో' రోజులు గుర్తుచేసుకుంటాడు. అక్కడి నుంచి ట్రోజన్ మైదానం చూస్తాడు. ఇప్పుడు మిగిలిన పట్టణం ఏమిటి? విధ్వంసకారుల సమాధులు తప్ప? తనకిష్టమైన 'అనంతశూన్యపు' లేదా చివరి (అంత్యశూన్యం)పై మమకారంతో తన కథానాయకులు విశ్రాంతి తీసుకునే స్మశానంలో అచిలెస్ విశ్రాంతి సమాధి రాయి దగ్గర ధ్యానముద్రలో కూర్చుండిపోతాడు. అక్కడ నుంచి కాన్స్టాంటినోపుల్‌కు బయలుదేరిన నౌక సోరాగ్లియోకి ఏడు గోపురాల మధ్య మే 13, 1810 తేదీన లంగరు వేసింది.

ఇది బైరన్‌కు ఎంతో ఆహ్లాదాన్ని కలిగించిన ప్రదేశం. పశ్చిమ తూర్పు కొండలు ఇవన్నీ రాజభవనాలతో అలంకరింపబడివున్నాయి.



అక్కడి బంగారు తాపడం చేసిన గుమ్మటం (Dome) అది సోఫియా చర్చిది. అక్కడి నుంచి ప్రింకి పో దీవి దూరంగా అస్పష్టంగా కనపడుతోంది. "లండన్ సంపదతో పోలిస్తే ఇక్కడి తూర్పు ఆసియా బజారు అంత ఖరీదయినవి కావు" అంటాడు.

కానీ ఈ సుల్తానుల సమాధుల మధ్య తిరగటం అదో వింత అనుభవం. అదీ ఎర్రని మిలిటరీ యూనిఫాంతో చుట్టూ బంగారు అంచుతో వున్నది (సుల్తాన్‌లాగా). పెద్ద అంచుగల టోపీ పెట్టుకుని తనవెంట సేవకుల బృందం రాగా ఈ బజారుల్లో తిరగటం ఎలాంటి అనుభూతి!

అక్కడి రాయబారి సర్ రాబర్ట్ అడైర్ (Sir Rober Adire) ఈ యాత్రికుల్ని చాలా గౌరవంగా ముఖ్యమైన వారిగా మర్యాదలు చేశారు. అక్కడ నాయకుడు ఆలీ పచా నాయకుడుని పరిచయం చేశాడు.

బైరన్‌కు తన సేవకుడు పెద్ద తలనొప్పి అయి కూర్చున్నాడు. అతనికి తనకంటే ఎక్కువ సుఖాలు అవసరాలు కావలసి వస్తున్నాయి.

బైరన్ ఒంటరిగానే తిరిగేవాడు. రోజంతా గుర్రంమీద తిరుగుతూ ఆసియావైపు Sweet Waters లోకి పడవమీద వెళ్ళేవాడు. ఇదంతా అతనికి ఎంతో తృప్తినిచ్చింది.

చివరికి జూలై 24 తేదీని 1810 సం॥లో బైరన్ కాన్స్టాంటి నోపుల్ వదిలారు. అక్కడ నుంచి హాబ్ హౌస్ ఇంగ్లాండు తిరిగి వెళ్ళిపోతున్నాడు. బైరన్ మరోసారి ఏథెన్సు వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు.

వీరి ఎడబాటుకు విచారం ఏమీలేదు. సంవత్సరం పైగా కలిసి ప్రయాణం సాహసప్రయాణం చేశారు. ఒకరొకరు తోడుగా నవ్వుతూ గడిపారు. కానీ ఇలాంటి దూర ప్రయాణాలు అదీ సముద్రయానం నిజమైన మైత్రికి పరీక్ష. మార్పు అవసరమే. బైరన్ అమ్మకు రాస్తాడు; "మళ్ళీ ఒంటరి జీవితం. నాకు తోడుగా వున్నవారు విసుగుపుట్టిస్తారు. వారు చెడ్డవారని కాదు. నాకు ఒంటరితనం ఎంతో ప్రీతిపాత్రమైనది".

నిజానికి ఈ ఎడబాటు బాధాకరంగానే జరిగింది. హాబ్ హౌస్ తన జర్నల్‌లో.

"అదిగో ఆ ఒంటరితనం మిత్రుని దగ్గర్నుంచి రాతి చప్టామీద పూల గుత్తితో నిలబడి వున్నాడు. శలవు తీసుకోవటం బాధగానే ఉంది."

తర్వాత బైరన్ హాబ్ హౌస్‌కి రాస్తాడు, "మిత్రమా! నీవు ఇచ్చిన పూలగుత్తిని అలాగే వుంచాను. పూలు రాలిపోతాయి. అయినా పారవేయబుద్ధి కాలేదు" అంటూ "దీనికి ఏమి కారణం చెప్పగలను? నీవు కూడా చెప్పలేవనుకుంటా" దానికి సమాధానం హాబ్ హౌస్ "నీవు రాసిన వుత్తరం ఎంతో బాధాకరంగా వుంది. ఈ వాడిన పూలగుత్తి గురించి నీవు రాయబోయే నవలలో రాయి. ఇది హాస్యాస్పదంగా వుందా – నీవు నవ్వుతున్నావుకదూ" అని ముగించాడు.

బైరన్ రెండోసారి ఏథెన్స్ వెళ్ళినప్పుడు కపూసియ (Capucians) మఠంతో వున్నాడు. అది చాలా అందమైన ప్రదేశం. హైమెటస్ ఎదురుగా, అక్రోసోలిస్ వెనుక జూస్ ఆలయం కుడిప్రక్కన, పట్నం అంతా ఎడమభాగంలో అదీ ఆ మఠానికి పరిసరాలు! "ఇదీ సందర్భం. ఇదీ సంగతి. ఇదీ సాదృశ్యం. ఇలాంటి అద్భుతం ఎక్కడ వుంటుంది – మాన్సన్‌హౌస్ (Mansion House) కూడా దిగదుడుపే" అంటాడు. Lysicrates స్మారక భవనం – ఇదీ మఠంలో మధ్యభాగంలోనేవుంది. అది ఒక వర్తులాకారపు సుందరాలయం. దీనిని సన్యాసులు ఒక గ్రంథాలయం చేశారు. అందులోనుంచి నారింజ తోటలోకి వెళ్ళవచ్చు.

ఈ మఠంలోని దినచర్య మరీ అంత పవిత్రమైనదేమీ కాదు. మఠాధిపతికాక, మరో ఆరుగురు యుక్తవయసులోవున్న సన్యాసుల సంఘం ఉంది. అందులో, ముగ్గురు కాథలిక్కులు – ముగ్గురు సనాతనులు!

బైరన్ వీరికి కుస్తీపోటీలు నిర్వహించేవాడు! మఠాధిపతికి కాథలిక్కులు గెలిస్తే ఆనందం కలిగేది. ఇక్కడి దినచర్య స్కూలురోజుల్లోలాగా వుండేది. ఆడుతూ పాడుతూ గోలగా ఇష్టం వచ్చినట్లు రోజులు దొర్లిపోతుండేవి. బైరన్ ఎప్పటికీ బడిపిల్లవాడే! అతని అంతరాంతరాల్లో హారో స్కూలు రోజులు ముద్ర చెరిగిపోదు! అతనికి ఇక్కడ రోజులు గడపటం ఎంతో ఆహ్లాదాన్ని కలిగించింది.

ఈ సమయంలోనే తను కాపాడవలసిన అవసరపు వ్యసనాన్ని వదులుకోలేక నికోలా గిరాడ్ (Nicolo Giraud) అనే కుర్రవాణ్ణి దగ్గరకు తీస్తాడు! గ్రీకు పౌరుడేగానీ ఫ్రెంచ్ వారసత్వపు రక్తం ఎక్కువ వున్నట్లుంది.

అతనికి ఇటాలియన్ బాగా వచ్చు. బైరన్‌కు పాఠాలు కూడా చెప్తాడు. “నేను అతనికి శిష్యుణ్ణి! రోజూ రెండు గంటలు పాఠాలు చెప్తాడు. తర్వాత “నేను మీతో ప్రపంచం చూస్తాను. మనం కలిసి బ్రతుకుదాం – కలిసి చనిపోదాం” అంటాడు.

రోజులు నవ్వుల పువ్వుల్లా రాలిపోతున్నాయి. ఉదయాన్నే బైరన్ వీరి కేకలతో నిద్రలేస్తాడు. గమ్మత్తులు చాలా జరుగుతున్నాయి. “థెరెసా మెర్సి – తల్లి ప్రత్యక్షమైంది. నేను ఆమెను వివాహం చేసుకుంటానని ప్రచారం చేసింది. ఇదీ ఆనందించటానికి బాగుంది”.

ఫ్లెచరు – తన పనివాడు. ఈ ప్రయాణం ప్రారంభంలో తన భార్య నుంచి ఎడబాటుకు గోలపెట్టాడు. ఇప్పుడు ఇక్కడ ఒక గ్రీకు ఉంపుడుగత్తెను దగ్గరకు తీశాడు. తన ఇద్దరు అల్బేనియా సేవకులు తన తర్జుమాదారుడు. వీరుకూడా ఇదే బాటపట్టారు! ఎలాంటి ప్రేమ జీవితాలు! ఆహా! “నేను అందరితో మాట్లాడుతుంటాను. మంచీ–చెడు వీరి పార్థనలలో పాలుపంచుకుంటాను.

ఇవన్నీ పళ్ళు తినటంతో రాళ్ళు విసురుకోవడంతో, ఆటలాడటంతో అంతరాయం కలుగుతోంది!”

హాబ్ హౌస్‌కు రాస్తాడు. “నిజానికి ఇప్పుడు నేను స్కూలులో వున్నాను మళ్ళీ. నేను చదివినప్పుడు మాదిరిగానే ఇక్కడా పెద్దగా నేర్చుకుంటుందీ లేదు. సమయం వృథా అయిపోతోంది.”

సాయంత్రాలు టర్కీ అధికారులు గొప్ప విందులు ఇచ్చేవారు. ఒకసారి తేబీస్ ముర్తాను, ఏథెన్సు గవర్నరు చిత్తుగా తాగారు. ఆ రోజు విందు బహుపసందుగా సాగింది. అతనికి ఈదటం సహజమైన వ్యసనం. ఇక్కడ Pisacius నదిని ఈదాలి. ఈ నికోలా చాలా నాసిరకం ఈతగాడు. ఒకరోజు బైరన్ నీటిలో దూకుతుండగా అతనికి ఒక ఇంగ్లీషువాని కేక వినిపించింది. అతని హారో స్కూలు సహాధ్యాయుడు మార్కిస్, అక్కడ వున్న చిన్న నౌకపై నుంచి పిలుస్తున్నాడు.

బైరన్‌కు ఈ కలయిక ఆనందాన్నిచ్చింది. మార్కిస్‌తోపాటు లేడీ హెస్టర్ వున్నారు.

బైరన్ వీరితో కలిసి చాలాచోట్ల తిరిగాడు. అతనికి తన ఇటాలియన్ యువకులతో వున్నంత సన్నిహితంగా సహజంగా ఈ ఇంగ్లీషు దొరలతో వుండలేకపోతున్నాడు.

లేడీ హెస్టర్ చాలా నిశితంగా "అతని చూపుల్లో చాలా 'దుర్నీతి' వుంది. అతని కళ్ళు అంత దగ్గరగా వుంటాయి. కనుబొమ్మలు ముడిపడి వుంటాయి" అని విమర్శించింది.

"చాలా వింత మనిషి. అతని కారుణ్యం ఏదో అవసరానికే అనిపిస్తుంది. ఒక్కోసారి చాలా దిగులుగా వుండి మాట్లాడటానికి ఎవరినీ దగ్గరకు రానివ్వడు. మరోసారి చాలా సరదాగా వుండి, కల్పించుకుని నవ్విస్తాడు" అంది.

ఒక్కసారి ఇంగ్లీషువారు దగ్గరగా వస్తే అతని ఆనందం అంతా ఆవిరయిపోతుంది.

వారి సన్నిధి అతనికి ఒక్కసారిగా ఆంగ్ల సమాజం – అదే – తన చేతనంలో భయపడేది, అచేతనంగా గౌరవించేది, గుర్తుకువస్తుంది. వీరందరి నుంచి దూరంగా వున్నప్పుడు అతను ఆశ్చర్యంతో ఆలోచిస్తాడు. తన గురించి వీరంతా ఏమనుకుంటున్నారు? తనకి తెలియదా? తనొక వింత. ఎవరికీ చెందని వ్యక్తినని? చిన్ననాటి మూఢనమ్మకాలు తనని విడిపోలేదని? తన విచిత్రమైన అలవాట్లు తనకు తెలియవా? ఎప్పుడూ గుళ్ళునింపిన పిస్తోళ్ళు జేబులో పెట్టుకుని తిరుగుతాడని! తనను ఎవరూ గమనించటం తనకిష్టం వుండదని?

హాబ్ హౌస్ తనకు ఎంత దగ్గరగా వచ్చినా, తన సేవకుడు ఫ్లెచర్ తననెంత ఇబ్బందిపెట్టినా ఎందుకు తను భరిస్తున్నాడు? ఇక్కడి ఏథెన్సు దైనందిన జీవితంలో బాల సన్యాసుల మధ్య, ఈ తుర్కుల ఆక్రమణ దేశంలో, ఈ నారింజ తోటల నీడల్లో వున్నా, న్యూస్టెడ్ హీరో – లోలోపల కాస్త చతురత హాస్యమున్నా ఇంకా సాంప్రదాయాన్ని కాపాడే కాపలాదారేనన్న విషయం తనకి తెలియదా?



ఏథెన్సు శిథిలాలు

ఈ ద్వితీయావధిలో, బైరన్ ఎన్నో యాత్రలు ఏథెన్సు పరిసరాలలో చేశాడు. మోరియా (Morea) నుంచి ఎంత దూరం వెళ్ళాడు. ట్రిపోలిట్జ్ వరకూ.

ఎటు వెళ్ళినా Patras దగ్గర ఆగాల్సిందే. అక్కడ బ్రిటీష్ కాన్సుల్ మిస్టర్ స్ట్రానె వున్నాడు. ఈయనగారే తనకు ఆర్థిక సలహాదారు.

ఈ రేవు పట్నం అతనికి చాలా ఇష్టమైనది. కొండపై ఇళ్ళమీద నుంచి చూస్తుంటే క్రింద రేవులో నౌకలన్నీ తెరలు ఎత్తుకుని ఎండలో తళతళలాడుతుంటాయి. రెపరెపలాడుతుంటాయి సముద్రపుగాలికి.

కానీ ఇది చాలా ప్రమాదకరమైన ప్రదేశం 'మిస్సిలోంగి' నుంచి గాలులు వీస్తే అప్పుడే దోమల దాడి మొదలవుతుంది. దానితో మలేరియా వస్తుంది.

ఆలనాపాలనా లేని బైరన్‌కు మలేరియాతో ప్రాణం మీదకు వస్తుంది.

ఇక్కడి హంతకునిలాంటి వైద్యునితో జ్వరపీడితుడైన తను ఏమిచేయగలడు?

తన మరణశాసనం రాసుకోవడంతప్ప!

వయసు, ప్రకృతి అంతులేని ప్రేమ

ఇవే నా ప్రాణదీపాన్ని ఆరకుండా ఉంచాయి

కానీ ఈ 'రోమనల్లి' బలమైన గాలి

ఈ మూడింటినీ, చివరికి నన్ను ఆర్పింది!

ఈ పరిణామాలన్నీ ఫ్లెచర్ మతి పోగొడతాయి. కానీ అల్బేనియా సేవకులు ఆ వైద్యుడిని చంపేస్తామని బెదిరించారు, పొరపాటున తమ యజమాని ప్రాణాలుపోతే!

ఒకవేళ ఈ బెదిరింపా, లేక ప్రేమదేవతా, లేక అతని చిన్న (యౌవన) వయసా – ఏది పనిచేసిందో – చివరికి బైరన్ బ్రతికి బట్టకట్టాడు!

ఈ జబ్బుపడటంతో బైరన్‌కు తనెంత అల్పజీవో అర్థమయింది.

తన మాతృభూమికి ఎంతో దూరాన, జ్వరంతో వణుకుతూ పళ్ళు పటపట కొట్టుకుంటూ ఈ సముద్రతీరాన పడివుండటం. అదీ రెండు నెలలు పైగా. ఎలాంటి దుస్థితి?!

"అరె! మరణిస్తే బాగుండుననుకున్నాను. ఈ బాధ భరించలేక, మరో జీవితం – పునర్జన్మకోసం ఆశించకుండా.

కానీ ఒక నమ్మకం, దేవుడు మనల్ని శిక్షించే దేవుడు నన్ను ఈ ఆశ్రమంలో ఈ స్థితిలో వదిలి బ్రతికించాడని అనుకుంటాను".

కానీ "ఎవర్ని అయితే దేవతలు ప్రేమిస్తారో వారు త్వరగా చనిపోతారు".

στους οποίους οι θεοί αγαπούν πεθαίνουν νέοι…..

(stous opoíous oi theoí agapoún pethaínoun néoi)

లేదా తాము ప్రేమించినవారిని దేవతలు త్వరగా తీసుకుపోతారు" అని గ్రీకులో రాస్తాడు.

ఏథెన్సు తిరిగివస్తాడు. పూర్తిగా పాలిపోయి పూర్తిగా చిక్కిపోయి! అప్పటివరకు తను కాపాడుకుంటూ వస్తున్న తన నాజూకుతనం లావణ్యం ఇలాంటి పరిస్థితిలో

తనను ఆదుకోవని తెలుసుకుంటాడు. వారానికి మూడురోజులు టర్కీ స్నానాలు వినిగర్‌తో ద్రవపదార్థాలు కొద్దిగా, వరి అన్నం. ఇదీ అతని ఆహారం.

ఈ చలికాలం అంతా, అతను జబ్బుపడిన మనిషిలాగానే రోజులు గడిపాడు. వెళ్ళబుచ్చాడు. కొద్దిగా కవిత్వం రాశాడు. కొంత అధిక్షేప వ్యాసాలు కూడా రాశాడు. కొన్ని పోప్ శైలిలో Hints from Horace మరొకటి Lord Elgin మీద ఘాటుగా విమర్శ. 'The Curse of Minerva'. ఒకరోజున మఠాధిపతిని అడుగుతాడు.

“నేను మీ మఠంలోని గదిలో వుండవచ్చా?” అని.

ఏమో ఈ సన్యాసి జీవితం తనను రక్షించవచ్చు! ఈ విసుగుదల నుంచి ఈ వేదననుంచీ! ఆయనతో “నేను నాస్తికుడిని కాదు. నాకు ఒక శిలువ ఇవ్వండి” అని దానిని కన్నీళ్ళతో ముద్దుపెట్టుకుంటాడు! మతం కూడా బైరన్‌కు ఒక గాఢమైన భావనే! మిగతా అన్ని విషయాలలాగానే.

లండన్ నుంచి హాన్సన్, బైరన్ లాయరు, ఇక డబ్బు పంపటం ఆపేశాడు. వెంటనే ఇంటికి వచ్చేయమన్నాడు. లేకపోతే న్యూస్టెడ్ అప్పులవాళ్ళపాలయి పోతుందని హెచ్చరిస్తాడు.

చివరికి బైరన్ తిరుగు ప్రయాణం చేయాల్సివస్తుంది. పాపం! ముందుగా ఫ్లెచర్‌ను పంపుతాడు. తన రాకను పరిరక్షించటానికి. సామానులన్నీ తీసుకుని శ్రీమతి బైరన్‌కు ఉత్తరంతోసహా!

“అమ్మా! చాలా పుస్తకాలు కాగితాలు పంపిస్తున్నాను. ఇవన్నీ జాగ్రత్తచేయి. నేను వచ్చిన తర్వాత తాగటానికి కొంత షాంపేను ఉండనీ. నాకు చాలా దాహంగా వుంది. నీ ఇంటినిండా చిల్లర వాళ్ళున్నారేమో ఉన్నవి లేనివి మాట్లాడుతూ” అని రాస్తాడు. ఈ తిరుగు ప్రయాణం ఫ్లెచర్‌కు బాగా ఉపయోగపడింది. “ఇన్నాళ్ళు నాతో ప్రయాణం చేసిన ఫ్లెచర్ పచ్చడి కింద నలిగిపోయాడు. రొట్టిలాగా కాలిపోయాడు. మాంసంలాగా మాడిపోయాడు. చివరకు అన్ని భరించటం అలవాటు చేసుకుని ఇప్పుడు వేదాంతిలాగా మారిపోయాడు. మఠాధికారిగా మారి ఫ్లెచర్ వంశానికో కీర్తి తీసుకువస్తాడు” ఇదీ ఫ్లెచర్ గురించి బైరన్ అభిప్రాయం.

ఫ్లెచర్ వెళ్ళిన కొన్ని వారాలకు బైరన్ కుడా తిరుగు ప్రయాణమయ్యాడు. Volage నౌక మీద అతనితోపాటు నికోలో గిరాడ్ తోడుగా వున్నాడు. అతను 'మాల్టా' వరకు వస్తాడు.

అల్బేనియా సేవకుల్లో ఒకరిని పంపేయవలసి వస్తుంది. అతను కన్నీళ్ళ పర్యంతమయి బైరన్‌ను వదిలివెళ్తాడు.

"ఇప్పుడు నాకోవిషయం గుర్తుకువస్తోంది. నేను ఇంగ్లాండు వదిలే ముందు నాకు వీడ్కోలు ఇవ్వటానికి సమయంలేదని తన ఆడవాళ్ళతో దుకాణాలకు వెళ్ళాలని చెప్పిన పెద్దమనిషి గుర్తుకు వస్తున్నాడు. ఇప్పుడు ఈ సేవకుడు నన్ను వదిలి వెళ్ళటానికి కన్నీళ్ళు పెట్టుకుంటున్నాడు. ఇది అవమానకరమైనదే అయినా ఆశ్చర్యపోను."

మాల్టా నుంచి ఇంగ్లాండు చేరటానికి 34 రోజులు పట్టింది.

బైరన్ ఒంటరిగానే వున్నాడు. ఎవరూ సరైన తోడు లేరు. కానీ ఈ ఒంటరితనమే అతను ఇష్టపడ్డాడు.

మొత్తంమీద ఈ ప్రయాణాలు అతనికి ఎంతో ఆహ్లాదకరమైనవే.

ఒక టర్కీ బోటులో మునిగిపోయేవాడే. మాల్టాలో ఒక వివాహితపట్ల మోజుపడ్డాడు. అక్కడ ఒక 'పచా'ను కలుస్తాడు. ఏథెన్సులో ముగ్గురు ముగ్ధలను ప్రేమించాడు.

డార్డనెలీస్ (Darda Nelles) దాటాడు. ఎన్నో కవితలు రాశాడు.

ఎలాంటి ప్రదేశాలు దర్శించాడు! ఎంతటి వీరుల స్మారక చిహ్నాలు చూశాడు. తన వయసు ఆరు నెలలు పైగా తగ్గిపోయినట్లుంది. ఇటాలియన్ మఠంలో ఎలాంటి రోజులు గడిపాడు!

ఫ్రెంచివారితో గ్రీకు, ఇటలియాన్ పౌరులతో మాట్లాడాడు. అమెరికన్లను కలిశాడు. ఇతర దేశాల తీరుతెన్నులు సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకున్నాడు.

ఇంగ్లాండు క్లబ్బులో ఒక వంద సంవత్సరాలు పొగతాగుతూ గడిపినా, ఇలాంటి అనుభవం రాదుకదా.

ప్రదేశాలు చూడటం పరిశీలించటం ఎంతో ఉత్సాహంగా వుంటుంది.

కాలంతో ప్రయాణం మనిషిని క్రమేపీ కఠినంగా తయారు చేస్తుంది. అతని వ్యక్తిత్వానికి ఆకృతిని ఇస్తుంది.

తన పూర్వీకులైన గోర్డాన్ల హింసాత్మక వైఖరి, బైరన్ల చైతన్యం, అతనిలో భౌతికంగా గూడుకట్టుకుని ఒక అనిశ్చయమైన స్థితిని రెచ్చగొడుతూ ఈ ప్రపంచం అంటే అసహ్యం, తనమీద తాను కక్ష సాధించుకోవటంలోని ఆనందం ఏకకాలంలోనే అనుభూతికి వస్తోంది.

తనకు స్కాట్ బోధకులు చిన్ననాడే నేర్పిన మతవిశ్వాసాల అంధకారం. దీని పైన అది నాశనం కాకుండానే తను చదివిన వోల్టేరు స్వాతంత్ర్యభావాలు. తర్వాత కేంబ్రిడ్జి కాలేజీ చదువులు (?) – తర్వాత–తర్వాత యౌవనపు భావోద్రేకాలు. ఇవన్నీ పరస్పర విరుద్ధమైన భావాలను ప్రోదిచేసినాయి. ఎంత హాస్యాస్పదం?!

ఇప్పుడు తను దర్శించిన ఈ విశ్వాంతరాళపు రూపురేఖలు తన అంతరంగంలో చాలా సరళంగా పరచుకున్నాయి.

ఈ ప్రపంచం ఎవరో సృష్టించారు. ఎందుకో మనకు తెలియదు. ఆ సృష్టికర్తకు మన కష్టాలు పట్టవు. పట్టించుకోడు.

వారివారి ఇష్టాలనుబట్టి మానవులు తమ అనుభవాలకోసం, అందరికి ఆమోదయోగ్యమైనవి, పరుగులుపెడతారు; అవి తెలివిగలవా, తెలివిమాలినవా, కీర్తిని తెస్తాయా మూర్ఖమైనవా, ఎలా తెలుస్తుంది?

రాజ్యాలు ఏర్పడతాయి, కూలిపోతాయి, అవి సముద్రంలో అలలమాదిరి.

అంతా అహంకారమే. ఆనందం ఎక్కడ? ఈ భావాలన్నీ అతనికి ఈ తూర్పు ప్రయాణాల్లో బాగా బలపడిపోయాయి. ఎక్కడికన్నా వెళ్ళు – ఈ జీవితం ఒక వ్యాపకం–

దుర్మార్గం అంతటావుంది – ఇక మరణం ఎంతో సహజం – అంత తేలికయినది కూడా!

ఇస్లాం చెప్పే, అన్నింటికీ 'అదృష్టమే' కారణం అనే సిద్ధాంతం, అతనికి మరింతగా తన ఆలోచనలు స్థిరీకరించుకోవటానికి ఉపయోగపడింది.

ఆ మతం ఆడవాళ్ళపట్ల చూపించే నిర్లక్ష్యవైఖరి అతనికి బాగా నచ్చింది!

ఇన్ని మతాలు పుట్టాయి అంటే, అది వాటిలోని బలహీనతేకదా! అతనితోపాటు అన్నీ సందేహాలే మోసుకొచ్చాడు. అవి ఎంత బలంగా వున్నాయంటే మతవిశ్వాసాలంత గాఢంగా రూపుదిద్దుకున్నాయి. ఇంతకాలం ఒంటరి బ్రతుకు తన గురించి కూడా చాలా సత్యాలను వెలుగులోకి తెచ్చింది.

ఇప్పుడు అతనికి ఆనందాన్నిచ్చేది స్వేచ్ఛమాత్రమే. అదీ ఎలాంటి శృంఖలాలు, నైతిక శృంఖలాలు లేని స్వాతంత్ర్యం. అంటే అతను చట్టవిరుద్ధమైన జీవితంలోనే ఆనందంగా వుండగలిగాడన్నమాట.

తననెవరూ గుర్తుపట్టని, ఎవరూ లెక్కచేయని ప్రదేశాలలో ఎంతో ఆనందంగా గడిపాడుకదా! దూరాలు అతనికి అసహ్యాన్ని బోధించింది.

మిడిమిడి జ్ఞానంగలవాడు నీ గురించి విమర్శ రాస్తే అది నిన్నెలా ప్రభావితం చేస్తుంది? మధ్యలో అట్లాంటికా సముద్రం మధ్యధరా సముద్రం పరచుకుని వుంటే వాడెవడో లెక్కచేయవలసిన అవసరం లేదుగా!

అంతేనా – పదాడంబరంతో మోగే చెడురాతలు – హెల్స్ పాయింట్ (Hells point) హోరులో కలిసిపోతుంటే! ఇప్పటినుంచీ ఒక నిర్ణయానికి వచ్చాడు. ఇంగ్లాండులో తనకి అనుకూల పవనాలు లేకపోతే ఒక పక్షంరోజుల నౌక ప్రయాణం అతనికి నీలాకాశాన్ని ఎండలో మెరిసిపోయే దీవుల్ని దగ్గర చేర్చగలదు.

నౌక డెక్‌మీద ఒంటరిగా నిలబడి అలలు లేచి పడటం గమనిస్తున్నాడు.

ఈ సుదీర్ఘ ప్రయాణం తనకేమి సంపాదించిపెడుతుంది – తన తల్లికి ఎలాంటి లాభం చేకూరుస్తుంది? ఆమెను చాలా కాలం వరకూ చూడాలని అనుకోవటంలేదు. "నాకోసం న్యూస్టెడ్‌లో నా గదులు శుభ్రం చేయించు దయచేసి – నేను ఒక సందర్శకుని మాదిరిగానే వస్తున్నాను. చాలాకాలంగా శాఖాహారం

మాత్రమే తీసుకుంటున్నాను. కనీసం చేపగానీ మాంసంగానీ ముట్టటంలేదు. అందుకని నాకోసం బంగాళాదుంపలు, కూరగాయలు, బిస్కెట్లు వుంచండి. నేను వైను తాగను. నాతోపాటు ఇద్దరు సేవకులు వుంటారు. ఇద్దరు మధ్యవయస్కులే. ఇద్దరు గ్రీకులే. నీకోసం ఎక్కువమంది సందర్శకులు వస్తారని అనుకోను. ఒకవేళ ఎవరైనా వస్తే వారికి మర్యాదలు చేయాలికదా. కానీ నాదాకా రానీకు. నాకు ఒంటరితనం కావాలి! ఈ సమాజంపట్ల నాకు మోజు లేదు.

నీకోసం ఒక శాలువా తెస్తున్నాను. అత్తరు (రోజా) కూడా తెస్తున్నాను" అని కబురు పంపాడు.

ఈ ఎస్టేటు యజమానిగా దేనీని ఎవరితో అతను పంచుకోవాలని అనుకోవటంలేదు.

ఫ్లెచర్‌కు ఏదో కొంత ముట్టచెప్పాలి. అంతా నువ్వే పరిపాలించు. అప్పులతోసహా."

ఈ ప్రపంచంలో ఆమె తప్ప తనకెవరున్నారు? హాబ్ హౌస్? అతని గురించి వార్త రాలేదు. అతను ఏదో సైనికుని అవతారం ఎత్తాడని తెలిసింది. హాడ్గ్‌సన్ ఇతను చాలా భక్తుడైపోయాడు.

ఇక తన మారుటి అక్క? అగస్టా (Augusta) ? ఇప్పటి వరకు ఆమెను మరిచేపోయాడు.

ఇప్పుడు ఈ దేశంతో తనకు పని ఏమిటి? న్యూస్టెడ్‌లో రైతుల దగ్గర అద్దెలు వసూలుచేయటమా? రోష్‌డేల్‌లో బొగ్గు అమ్మటమా?

లండన్‌లో అప్పులు తీర్చటమా?

ఇవన్నీ ఛండాలపు పనులేకదా.

ఇప్పుడు ఎవరిని చూడాలి? ఆఁ అవును, డల్లాస్ వున్నాడు. మర్యాదస్తుడు. డల్లాస్, గంభీరమైన డల్లాస్ వున్నాడు. తనకు సహాయంగా వుంటాడు.

ఇంకా కొద్దిరోజులకు చేరతాడనగా డల్లాస్‌కు రాస్తాడు. "రెండేళ్ళ తర్వాత మళ్ళీ ఇంగ్లాండు వస్తున్నాను. ఎన్నో చూశాను. టర్కీలు, గ్రీసులో ట్రోడ్,

కాన్స్టాంటినోపుల్, అల్బేనియా. ఇతర ప్రయాణాలకు భిన్నంగా నేను ఏమి సాధించానోనని చెప్పలేను.

కానీ నేను మే 3, 1810 తేదీన 'సెస్టోస్' (Sestos) నుంచి అబిడోస్ (Abydos) వరకు ఈదానని చెప్పగలను. ఇది సహనంతో చేయగలిగిన సాహసమే కదా" అంటూ ముగించాడు.



యౌవనంలో బైరన్



కాన్స్టాంటినోపుల్

రెండవ భాగం

ఈ జీవితానికి గొప్ప లక్ష్యం – సంచలనం!
మనం జీవంతో వున్నప్పుడే ఎరుక – అది బాధాకరమైనా
సరే! ఈ శూన్యశోధన – చీకటిలో వెదుకులాటే
మనల్ని పోరాటాలకు సిద్ధం చేస్తుంది – ప్రయాణాలకు
బయలుదేరదీస్తుంది – శృతి మీరినా, గొప్ప అనుభూతినిస్తుంది
ఎటువంటి అన్వేషణకైనా సిద్ధం చేస్తుంది –
అవి సాధించగలిగినా – లేకున్నా అందులోని ఉత్సాహం;
ఆకర్షణ – ఇవే ముఖ్యం !

–బైరన్





యువరాజు

XIV

న్యూస్టెడ్ యువరాజు

(1811-1812)

జేమ్స్ వీధిలోని రెడ్డిష్ హోటల్‌లో ఆగాడు. అమ్మ కోసం తెచ్చిన శాలువా, గులాబి అత్తరు తనతోనే వున్నాయి.

హాబ్ హౌస్ కోసం కొన్ని పాలరాళ్లు – తనకోసం విషమూలికల రసాయనపు మందు సీసా,

నాలుగు గ్రీకు కపాలాలు – కొన్ని బ్రతికి వున్న తాబేళ్లు!

బైరన్ రాకకోసం డల్లాస్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నాడు. అతని రాక తెలిసి వెంటనే వాలిపోయాడు. బైరన్ తన ప్రయాణపు విశేషాలు చాలా ఉత్సాహంగా చెప్పటం మొదలుపెట్టాడు.

"ఇవి రాయాలని నాకిప్పుడు అనిపించలేదు" – తన అధిక్షేప రచనలపైనే ఎక్కువగా మక్కువ చూపాడు. 'Art of Poetry' హోరిస్ (Horace)కు వ్యాఖ్యానం రాశాడు. ఇది డల్లాస్‌కిచ్చి ముద్రణ విషయం చూడమన్నాడు!

డల్లాస్ మర్నాడు 'అది' చదివి ఎంతో నిరాశచెందాడు. బైరన్ అంటే అతనికి చాలా ఇష్టం. కానీ ఏమిటీరాతలు? రెండు సంవత్సరాల యాత్రల్లో ఇదా ప్రతిఫలం?!

కొంత హాస్యం – కొంత అధిక్షేపణ.

ఇందులో కొత్త ఆలోచనలు ఏవి?

డల్లాస్ రెడ్డిష్ హోటల్‌కు వచ్చి, ఏదో మాటవరసకు బాగున్నాయి అన్నాడు. "ఇంతకంటే ఏమీ రాయలేదా?" అంటూ అడిగాడు.

"ఏవో చిన్న కవితలున్నాయి' మరికొన్ని యాత్రా విశేషాలున్నాయి. అవి అంత ముఖ్యమైనవి కాదు" అంటూ తన పెట్టెలో వున్న 'Child Harold' Piligrimage - తీసి ఇచ్చాడు.

డల్లాస్ ఇవి కూడా పుచ్చుకుని నిష్క్రమించాడు.

అల్బేనీ ద్వీపంలో యువకుడొకడు-
విలువలంటే విలువతో సంతోషం - అతనికి-
కాని రోజులు వృధాగా గడిపేస్తాడు-
చివరికి విసిగి - చీకటి రాత్రి ఆవులిస్తాడు-

అతనే చైల్డ్ హెరాల్డ్ - అతని పేరు వంశం
చాలా ఘనమైంది - చెప్పకుండా వుండటం మేలు.
ఒకవేళ ముందుముందు కీర్తి లభిస్తే?

మధ్యాహ్నం ఎండలో తడిసిపోతాడు-
ఎగిరే తూనీగ లాగా-
రోజు పూర్తి కాక మును పే-
చిన్న శబ్దం అతన్ని బాధపెట్టవచ్చు-
అతని మూడోవంతు జీవితం గడవక మును పే
మహాపాపం - చుట్టుకుంది-
అందులో అతనికి ఏదో తృప్తి!

కాని సొంత వూరు పొమ్మంది-
అది అతనికి జైలు గదికంటే ఇరుకయిపోయింది-

అతని ప్రయాణాలు పాపపు
వరండాలలో
ఎందరినో పోగొట్టుకున్నాడు-
ప్రేమించిన ఒక్కరు దక్కలేదు-
ఆ ఒక్కరు అతనికి ఎప్పటికీ
దక్కరు!



బైరన్ పందిరిమంచం

చైల్డ్ హెరాల్డ్ తల్లిని వదిలి
కదిలాడు
తన సోదరిని ప్రేమించి! -
వీడ్కోలు
చివరి వీడ్కోలు - చెప్పలేక యాత్ర
మొదలు పెట్టాడు
అతని సన్యాసుల నివాసం-దుష్టుల ఆవాసం-
మూఢనమ్మకాలు ఏలిన చోటు
ఇప్పుడు - పనివాళ్ళ పిల్లలు ఆడుతూ పాడుతున్నారు

పురాతన దినాలు - అరె ఏథెన్సు ఎక్కడ?
నీ వీరులు - నీ శూరులు - గొప్పవాళ్ళంతా
ఏరి? మహాస్వప్నాల దారులవెంట-
రథ చక్రాల ఇరుసుల్లో - కీర్తికోసం బలి!
అవును - విజయం సాధించి - వీరమరణం పొందారు.
ఇదేనా చరిత్ర-
ఒక బడి పిల్లవాడు నేర్వాల్సింది?
ఒక గంట పాఠంలో?
వీరులు ఆయుధాలు - కుటిల నీతి
అన్ని వృథా - శిథిలాల గుట్టల్లో

కాలం కప్పిన పొరల అడుగున-

అధికారం - అంధకారం అయిపోయింది!

డల్లాస్ చైల్డ్ హెరాల్డ్ చదివి అదిరిపోయాడు. బైరన్. ఇదీ బైరన్ అంటే! డల్లాస్‌కు ఎంతో నచ్చింది.

పరిపక్వత అంతగా లేకున్నా, ఈ కవితలన్ని స్వేచ్ఛానుభవంలో నుంచి పెల్లుబికినవే.

మానవీయ వ్యవహారాల్లోని డొల్లతనాన్ని ఎండగట్టేవే! ఎంత గొప్పగా వున్నాయి. డల్లాస్ తన ఆశ్చర్యాన్ని అణచుకోలేకపోయాడు - వెంటనే బైరన్‌కు ఉత్తరం రాశాడు. అప్పటికి బైరన్ హారోకు వెళ్తాడు. "నీవు రాసిన కవితలు ఇప్పటివరకు నేను చదివిన అన్నింటికంటే ఎంతో సమ్మోహనంగా ఉన్నాయి. చైల్డ్ హెరాల్డ్ ఎంత గొప్పగా వుందంటే, ఇంతవరకూ ఆపకుండా చదువుతూనే వున్నా" అని ప్రశంసించాడు.

ఇది చదివి బైరన్ ఆశ్చర్యపోతాడు.

"అరె! ఇది కవిత్వమా?" అని ఆశ్చర్యంతో అడుగుతాడు - "నువ్వు సరిగ్గా చదివావా? ముందు 'హారిస్'ను ముద్రణ పనిచూడు" అని హెచ్చరిస్తాడు.

డల్లాస్ "అలాగే - నేను "చైల్డ్ హెరాల్డ్" కూడా ముద్రింపిస్తాను" అని ఆత్మవిశ్వాసంతో చెప్తాడు.

బైరన్ అమ్మకు ఉత్తరం రాస్తాడు. లండన్‌లో ఆగిపోవలసి వచ్చింది. లాయరు కొన్ని సంతకాలకోసం ఆపేశాడు. "త్వరలో వస్తాను. నేను కేవలం చుట్టంచూపుగా - న్యూస్టెడ్ యజమానివి నీవే" అని ముగించాడు.

పాపం! ఆ ఒంటరి తల్లికి ఇది ఏమైనా ఓదార్పా? ఇన్నాళ్లు తన భరణంతోనే కాలం వెళ్ళబుచ్చుతోంది - కొడుకు సొమ్ము ఒక పెన్ని కూడా ముట్టలేదు!

అప్పటికే అనవసర ఖర్చులన్నీ తగ్గించివేసింది. హాన్సన్ (లాయరు)కు జమాఖర్చులు పట్టీకూడా పంపింది-

తోట పనివాళ్ళకు	**156 పౌండ్లు**
పశువుల కోసం	**39 పౌండ్లు**
జో ముర్రే	**50 పౌండ్లు**
ఆడ పనిమనిషి	**30 పౌండ్లు**
అడవికుక్క ఖర్చు	**20 పౌండ్లు**
ఎలుగుబంటి	**20 పౌండ్లు**
పన్నులు	**70 పౌండ్లు**
మొత్తం 385 పౌండ్లు	

అయితే తనకు అంత ఆదాయం ఏది? మరి ఏమిచేయటం? "నా ఖర్చులన్నీ తగ్గించేసుకున్నాను. పని అమ్మాయిని సంవత్సరం క్రింద పంపించేశాను. రెండు కుక్కల్ని కౌలుదారుకు ఇచ్చాను. ఇక ఎలుగుబంటి ఈ మధ్యనే చచ్చిపోయింది" ఇది ఆ వుత్తరం సారాంశం.

బైరన్ వెళ్లిన దగ్గర్నుంచి ఆమెకు లోలోపల ఒక సందేహం తొలచివేస్తోంది – "మళ్ళీ తన కొడుకుని చూస్తానా?" అని అనుమానమే. చివరికి లండన్ నుంచి ఉత్తరం వస్తుంది "ఒకవేళ నేను బైరన్‌ను చూడకుండానే చనిపోతే అంతకంటే వింత ఏముంటుంది?" అని తన పనివాళ్లతో అంటుంది.

ఆ వారంలోపే ఆమెకు జబ్బుచేస్తుంది. చిన్నపాటి జ్వరమే – కానీ ఆమె మొండితనంతో, అదే పెద్దదయ్యింది. ఒక దర్జీవాడికి ఇవ్వవలసిన మొత్తం, ఆమె కోపానికి కారణమయ్యింది.

ఆ కోపం కట్టలు తెంచుకుని చివరకు ఆమె ప్రాణం మీదకు వస్తుంది. రక్తనాళాలు చిట్లి స్పృహ తప్పి అలాగే మరణించింది!!

అప్పటికి బైరన్ లండన్‌లోనే వున్నాడు. డల్లాస్‌తో ముద్రణ పనుల్లో. ఇక న్యూస్టెడ్‌కు బయలుదేరాలని అనుకుంటున్నాడు. అప్పుడే అమ్మ మరణవార్త అతనికి చేరుతుంది. అదీ ఆగస్టు మొదటి తారీఖు.

అతను విధినెప్పుడూ గుడ్డిగా నమ్ముతాడు! బైరన్ల చరిత్రలో ఈ విషాదం చాలా సర్వసాధారణమేగా! ఇంతకంటే దారుణమైన క్రూరమైన సందర్భం ఏముంటుంది – ఇంటికి తిరిగి రావటానికి?!

న్యూస్టెడ్‌కు వెళ్లే దారిలోనే పిగాట్‌కు రాస్తాడు–

"పాపం, అమ్మ నిన్ననే చనిపోయింది. ఆమెను, మా కుటుంబ సభ్యులు సాయుధుల మధ్య చేర్చటానికి వెళ్తున్నాను. దేవుని దయ, ఆమె ప్రశాంతంగానే వెళ్ళిపోయింది. ఆమెకు తన చివరి క్షణాలు తెలియనేలేదు.

అవును. మిస్టర్ గ్రే అన్నట్లు – మనకు ఒక తల్లి మాత్రమే ఉంటుంది" ఆమెకు – శాంతి కలగాలి".

న్యూస్టెడ్ చేరిన తర్వాత ఆమె మరణించిన తీరు పనివాళ్ళు చెప్పగా వింటాడు.

మరణం తమ మనస్పర్థలన్నీ మరిపిస్తుంది. మరణం మనుష్యులను తమ కష్టంలో, ఒకటిగా చేస్తుంది. స్మృతులన్నీ తిరగతోడుతుంది.

"నాకు చావు గురించి అర్థం కానిదేదో, మాట్లాడటానికి ఆలోచించటానికీ ఇష్టం వుండదు. చూడు – నాకు జన్మనిచ్చిన శరీరం – ఎలా నిశ్చలంగా పడివుందో! ఇప్పుడు నా సందేహం – ఈ చనిపోయింది ఎవరు? అమ్మా – లేక నేనా?" నాకు జీవాన్నిచ్చిన ఆత్మను పోగొట్టుకున్నాను. దానితోపాటు నాలో చైతన్యం, కొన్ని దీవెనలు కూడా చనిపోయినట్లే.



బైరన్ తల్లి

సమాధి దాటి నాకు ఆశలు లేవు. భయాలు లేవు."


అమ్మను సమాధి చేయటానికి శవపేటికతో పాటు వెళ్లటానికి నిరాకరించాడు.

తన శిథిల భవనపు సింహద్వారం దగ్గర నిలబడి ఆమె పార్థివ దేహాన్ని మోసుకుపోతున్న పేటికను శూన్య దృక్కులతో వెంబడించాడు.

కౌలు రైతులు, పనివాళ్లతో Hacknall Torkard చర్చికి తరలి వెళ్ళిపోయింది – తల్లి!

అప్పుడు రాబర్ట్ రష్టన్ (Robert Rishton) కుర్రాణ్ణి పిలిచాడు. బాక్సింగ్ గ్లౌవ్స్ (Boxing Gloves) తీసుకురమ్మని.

అంతే – అతని మౌనం, అతని గుద్దుల లోని హింసాత్మక కాఠిన్యం – అతని దుఃఖాన్ని దాచలేకపోయాయి.



శూన్య దృక్కులతో

రెండు రోజుల తర్వాత మరొక దుర్వార్త వింటాడు. తనకిష్టమైన మాథ్యూస్ నదిలో మునిగి చనిపోయాడు. ఈతకు వెళ్ళి నీటిలోని కలుపు తీగలు కాళ్లకు చుట్టుకుని ఎంతో బాధాకరంగా పెనుగులాడి చివరికి ఊపిరి వదిలి నీళ్ళు తాగి మరణించాడు.

తనెప్పుడూ చెప్పేవాడు – నీకు సరిగా ఈత రాదు. నీ శరీరం అంతా నీటి బైటనే వుంటోంది. ఇలా అయితే ఎప్పుడో నీళ్లలోనే మునిగిపోతావని – హెచ్చరించేవాడు – చివరికి అదే జరిగింది.

తనకు ఎలాంటి ఆహ్వానం లభించింది! ఎంత భయంకరమైనది – దుఃఖపూరితమైనది? తల్లి – తనకిష్టమైన మాథ్యూస్!

తనకు కనిపించని శత్రువు ఎవరో తనను చాలా కఠినంగా శిక్షిస్తున్నాడు.

ఇవి ఎంత బాధాకరంగా వున్నాయి – మొదటిదానిలో నుంచి తేరుకోనేలేదు. వెంటనే మరొకటి – ఏది తీవ్రమైనది? ఏది బాధ?

Byron

నా నెత్తిమీద శనిదేవత కూర్చునుంది. నా తల్లి ఈ ఇంట్లోనే శవంగా పడివుంది. నా స్నేహితుడు నీటిలో మునిగిపోయాడు. ఏమని చెప్పను - ఏమనుకోవాలి? చనిపోయినవాళ్లంతా ప్రశాంతంగా వుండాలి.

నా విచారం - దుఃఖం, వాళ్లను ప్రాణంతో తీసుకురాలేదు కదా - ఒక నిట్టూర్పు విడిచి - ఈ నిస్సారమైన బ్రతుకు సాగిద్దాం - మనకీ ఒక ముగింపు తప్పకుండా వుంటుంది కదా.

ఆ విశాల శిధిల భవనంలో ఒంటరిగా తన చుట్టూ వింత-వింత రక్షలతో: ఒకటి - సన్యాసి కపాలంతో చేసిన మగ్గు, నాలుగు గ్రీకు పుర్రెలు, తన చనిపోయిన కుక్క మెడ తోలు పట్టి, అరె! ఎలాంటి వాతావరణం!

ఇక్కడేగా తన స్నేహితులతో ఎంతో ఉల్లాసంగా రోజులు గడిపాడు.

హాబోను రమ్మని ఆహ్వానం పంపాడు. అతనితోపాటు మాథ్యూస్‌ను గుర్తు చేసుకుంటూ తాగారు.

"అతని స్మృతి కోసం తాగుదాం - అది ఎలాగూ వారిని చేరలేదు - బ్రతికి వున్నవాళ్లను సేదదీరుస్తుంది. బ్రతికి వున్నవారినేగా చావు బాధించేది" అంటాడు.

అతని ఒంటరితనం - అతను ఏకాకి. తన కుక్కతో, తన తాబేళ్లతో ఈ గ్రీకు తలలతో!

అరె! ఎంత బద్ధకంగా వుంది-

"23 ఏళ్లకే - ఇంత ఒంటరినైపోయానే!

డెబ్బయి ఏళ్లకు ఎలావుంటామో? అవును నాకు వయసు తక్కువే - మళ్లీ జీవితం కొత్తగా మొదలుపెట్టవచ్చు - కానీ ఎవరితో సంతోషంగా గడపాలి?"

సోఫాలో పడుకుని - పొగాకు నమలడం, ఆకలిని చంపటానికి అలవాటు చేసుకున్నాడు. బద్ధకంగా ఆవులించడం - ఇదీ దినచర్య.

చుట్టుపక్కల వాళ్లతో కలవవచ్చు.

"నేను – సంఘ జీవిని కాదు. ఈ యువతులు జమీందారీ బిడ్డలతో నాకెలా పొసుగుతుంది? అదీ స్వేచ్ఛాజీవనం చూసి – ఆ దేశాలలో అక్కడ ఆడవారి కోసం ఎగబడటం వుండదు. వారిని ప్రత్యేకంగా చూడటం వుండదు. దీనికి భిన్నంగా ఇక్కడ వారికోసం కత్తి యుద్ధాలు చేయాలి. లేదా నృత్యాలు చేసి ఆకర్షించాలి. ఇదెలా వీలవుతుంది?!

మరో 'మేరీ చావర్తు' ఎక్కడ దొరుకుతుంది? తన శారీరక సుఖాలతో కాలక్షేపం మొదలుపెట్టాడు. అందమైన యువతులతో, తన పొగబారిన గదులు అలంకరించాడు. నెమళ్ళు – పావురాలు – కుందేళ్ళు – ఆడపిల్లలు – అందరితో నింపివేశాడు. టోపీలు పెట్టుకోవచ్చు – జుట్టు కత్తిరించకండి – ఆదేశాలు జారీ చేశాడు. ఆ విధంగా న్యూస్టెడ్ భవనంలో కొత్త జీవితం మొదలయ్యింది.

మధ్యయుగపు మరణమృదంగం మ్రోగుతున్నట్లు – బ్రతికినవాళ్ల నగ్న శరీరాలతోపాటు – కపాలాలు – కంకాళాలు సజీవంగా, వికృతంగా కదులుతున్నాయి.

న్యూస్టెడ్ చీకటి గదుల్లో రాత్రి కొవ్వొత్తుల
ఊపిరులు ఆరిపోతుంటే ఆ వెలుగు నీడల్లో
సజీవ నగ్న శరీరాలతో పాటు
కంకాళాలు మౌనంగా కదలుతున్నాయి
కపాలాలు వికటంగా నవ్వుతున్నాయి.

అసలు రాయటం మానివేశాడు – కొత్తగా ఒక్క పద్యం రాయలేదు. ఇప్పుడు అతను చూసేది – చేసేది 'చైల్డ్ హెరాల్డ్' ప్రూఫులు దిద్దటమే!

డల్లాస్ ఎంతో నమ్మకంతో అతన్ని ఒప్పించి కొన్ని మార్పులు చేయించాడు మానవ నైజానికి భిన్నంగా – విశ్వాసాలకు భంగకరంగా వున్న కొన్ని పద్యాలను మార్పించాడు.

బలహీనులను – అవినీతిపరులను మతాలు తమ ప్రభావంతో మరింతగా దిగజార్చవచ్చు – దేవతలు తమ తప్పులను మళ్ళీ మళ్ళీ చేయవచ్చు. ఇవన్నీ దారితప్పిన మనుష్యుల మెదళ్ళలో ప్రవేశించవచ్చు. అంతమాత్రాన 'మతవిశ్వాసం' సమ్మతమని అనలేం!

అసలు నిఖార్సయిన మతమేలేదు.

"ఒకసారి మెదడులో అవినీతి బీజం పడిన తరువాత – ఎలాంటి ఋషి, ముని, సన్యాసి ఇక దానిని బాగుచేయలేడు. దేవుని శక్తి పరిమితమని కాదు. కానీ, అవినీతి బురద అంటిన దానిని శుద్ధిపరచటం అసంభవం."

ఆ విధంగా ఆత్మ శాశ్వతత్వాన్ని కేవలం ఒక పరికల్పనగా చిత్రించాడు. శాశ్వతమైన 'ఆత్మ' అనేది లేదని – అదొక 'భావన' మాత్రమేనని తన కవిత్వంలో రాశాడు.

ఆ తీరానికావల ఆత్మల వలయం–
పవిత్రులు వెళ్ళవలసిన చోటు–
'సద్దూసీ' సిద్ధాంతానికి సిగ్గుచేటు
ఈ మిథ్యాకీర్తి కోసం – ఎంత వృథా–
మన నైతిక జీవనాన్ని సులభతరం
చేసేవారు ఎంత ప్రియమైనవారు!

అక్కడక్కడ తన చనిపోయిన మిత్రుల గురించి ప్రస్తావించాడు–

"ఇప్పుడు దుఃఖమంటే తెలియకుండా పోయింది! కేవలం భయాందోళనలే మిగిలాయి. విధిని నమ్మకుండా ఎలా వుండను? నాకు దగ్గరగా వచ్చినవాళ్లంతా నాశనమైపోతున్నారే?!

తన యాత్రల నుంచి తిరిగి వచ్చిన తర్వాత తన మారుటి అక్క అగస్టాతో వుత్తర ప్రత్యుత్తరాలు జరుపుతాడు. ఆమెను చూడనేలేదు. కానీ ఆమె సంతోషంగా

లేదని తెలుసుకుంటాడు. ఆమె ఎంతో ఇష్టపడి చేసుకున్న భర్త కలొనెల్ లీ. చాలా పెద్ద జూదరి. సంవత్సరంలో పది నెలలు ఇంటిపట్టునే వుండడు. ఒకవేళ తిరిగి వచ్చినా అది గుర్రపు పందాల కోసమే. ఆ సమయంలోనే ఆమెకు ఒక బిడ్డను "ప్రసాదించాడు".

"ఇక్కడ నా దగ్గరవాళ్లంతా దూరమవుతున్నారు. నీవు నీ బంధువర్గాన్ని పెంచుకుంటూ పోతున్నావు" అని రాస్తాడు.

అప్పటికే అగస్టాకు 27 సంవత్సరాలు. బైరన్ ఇప్పుడు తన అక్కపక్షం నుంచి రక్షణకోరే తమ్ముడు కాదు.

తన అనుభవంతో ఆమెకంటే చాలా పెద్దవాడిగా తనను తాను ఊహించుకుంటున్నాడు. ఒకరకమైన సానుభూతి. పెద్దతనంతో ఉత్తరాలు సంబోధిస్తున్నాడు.

ఈ ధోరణి ఆమెకు కొత్తగా వుంది. రెండు సంవత్సరాలు విదేశాలలో తిరిగి వచ్చిన 'తమ్ముడు', ఒక్కసారిగా తన అనుభవాన్ని ఆమెకు వివరిస్తుంటే ఆశ్చర్యపోయింది!

ఆమె కూడా ఉత్తరాలు రాయటానికి ప్రయత్నం చేసింది. ఎప్పుడూ ఏదో అవాంతరం వస్తుండేది. కొంత భయం, ఒక్కోసారి ఏడ్చే బిడ్డ – మరోసారి పనివాళ్లతో పేచీ. ఇలా జరిగేది.

"నువ్వు పెళ్లి చేసుకో. ఇప్పటికే పెళ్లిపట్ల నీ ఆలోచనలు మారినందుకు సంతోషం. నాకు కాబోయే మరదలు – అందంగా వుండాలి. డబ్బు కూడా వుండాలనుకో. కానీ అన్నిరకాల యోగ్యురాలై ఉండాలి సుమా!" అంటూ రాసింది!

పెళ్ళి విషయంలో వివాహ వ్యవస్థపట్ల, బైరన్ ఎన్నో సంప్రదాయాలకు బానిసలాగానే, ఈ వివాహ వ్యవస్థను కాదనలేదు!

ఒకరకంగా శిథిలమైపోయిన తన అదృష్టాన్ని తిరిగి పరీక్షించుకోవటానికి వివాహం ఒక మార్గం! తన భార్యను ప్రేమించ గలగటం కేవలం హాస్యాస్పదమే.

కాని, ఆమెకు గౌరవం సంపాదించి పెట్టగలడు. అందరూ ఆమెను గౌరవించే విధంగా చూడగలడు! తన వంశ గౌరవాన్ని నిలిపే సంతానంపట్ల అతని అనుబంధం వుంటుంది. అదేకదా – ఈ న్యూస్టెడ్ శాసనం!

"లేడీ బైరన్, అలాంటి ధనికురాలు, నన్ను వివాహం చేసుకోవటానికి సిద్ధపడితే – అలాగే నన్ను భరించగల మూర్ఖురాలు తారసపడితే, ఆమెకు నన్ను, నా జీవితాన్ని దుఃఖ భాజనం చేయటానికి అవకాశం కలిగిస్తాను" అంటూ అగస్టాకు రాస్తాడు!

"ఇక్కడ ధనమే ప్రధానం. కానీ ఎంత వయస్సు ఎక్కువ వుంటే అంత మంచిది. త్వరగా స్వర్గం చేరుతుంది కదా! ఇక నా ఆరోగ్యం గురించి అడిగావు. బాగా చిక్కిపోయాను. ఎక్కువ వ్యాయామంతో తక్కువ ఆహారంతో – ఈ ప్రయాణాల్లో నేను నేర్చుకున్నది – పొగాకు నమలటమే...!"

అతని గాంభీర్యం – మనుష్యులంటే అసహ్యంలో నుంచి వచ్చింది. ఒంటరితనంలో నుంచి పుట్టింది. ఈ అసహ్యంలో కొంత అహంకారం కూడా ఉందేమో?! అవును – తను లార్డ్ బైరన్! బారన్ బైరన్ – రోష్‌డేల్ సంస్థానానికి! న్యూస్టెడ్‌కు టైమన్!

తన కుక్క చనిపోయిన దగ్గర్నుంచి, మనుష్యుల్ని ప్రేమించటం మానివేశాడు. కేవలం తన పరిసరాల స్మృతులు – బక్కచిక్కిన లేడిపిల్ల – మెల్లగా కదిలే గ్రీకు తాబేళ్లు – ఇదే ప్రపంచం అతనికి!

బాగా వయసు మళ్లిన జమీందారిణిని పెళ్ళి చేసుకుంటాడు. ఇక తన ఆస్తిపాస్తులు – ఒక వింత మరణ శాసనం రాయించాడు. ఈ న్యూస్టెడ్ ఎస్టేటు ఆన్సన్ బైరన్‌కు ధారాదత్తం చేస్తాడు. రోష్‌డేల్ అమ్మగా వచ్చిన మొత్తంలో ఏడు వేల పౌండ్లు నికోలా గిరాడ్‌కు వుంచాలి (ఇతను ఏథెన్సువాడు) ఫ్లెచర్, జో ముర్రే, తన గ్రీకు పనివాడికి – జోగ్రాఫో – ఇద్దరికీ 50 పౌండ్లు – రాబర్ట్ రష్ టన్‌కు వెయ్యిపౌండ్లు.

న్యూస్టెడ్ మిల్లు ఫ్లెచర్‌కు – లైబ్రరీ – హబ్‌హౌస్‌కు స్క్రోప్ డేవిస్‌కు ఇవ్వాలని రాయించాడు. లార్డ్ బైరన్ పార్థివ శరీరాన్ని న్యూస్టెడ్ తోటలో సమాధి చేయాలని

ఎటువంటి మతసంస్కారాలు – సంప్రదాయ క్రతువులు లేకుండా పాతిపెట్టాలని, సమాధి రాయి మీద కేవలం 'బైరన్' అని రాయాలని వయసు కూడా వేయాలని ఇదివరకు సమాధి చేసిన తన కుక్కను అక్కడే వుంచాలని నిర్దేశిస్తాడు.

దీనికి అతని లాయర్లు అభ్యంతరం చెప్తారు. కానీ బైరన్ ఆ నియమాన్ని మార్చనీయడు.

అక్టోబరు – నవంబరు మాసాల్లో అనేకసార్లు లండన్ వెళ్లివచ్చాడు. క్రిస్మస్ సమయానికి న్యూస్టెడ్‌కి తిరిగి చేరాడు. హేమంతం వచ్చింది. భవనం చుట్టూ వున్న పచ్చికబయళ్లు మంచుతో పరచుకున్నాయి. దాదాపు ఖాళీగా వున్న ఈ మఠం, ఏదో బాధతో హాయిగా వున్నట్లు మౌనంగా రోదిస్తోంది. ఆ సమయంలోనే విలియమ్ హార్నెస్, తన హారో మిత్రుడు, తనను చూడటానికి వచ్చాడు. అతను కాస్త అవిటివాడు. తన కేంబ్రిడ్జి మిత్రుడు – హాడ్జసన్, (ఇతను మతాచార్యునిగా తర్ఫీదు పొందుతున్నాడు) కూడా వచ్చి రెండు మూడు వారాలు తనతో వున్నారు. చాలా ఉత్సాహంగా సమయం గడచిపోయిది.

బైరన్ చైల్డ్ హెరాల్డ్ (Child Harold) ప్రూఫులు దిద్దుతూ మార్పులు చేర్పులూ చేస్తున్నాడు! సాయంత్రాలు – కవిత్వం గురించి 'మతాల' గురించి చర్చించుకుంటున్నారు.

తన యాత్రల నుంచి తిరిగి వచ్చిన తర్వాత, మత విశ్వాసాలపట్ల బైరన్ దృక్పథంలో మార్పు వచ్చింది.

"క్రీస్తు మానవజాతిని రక్షించటానికి వచ్చాడు. మంచివాడు (మతపరంగా) స్వర్గానికి వెళ్తాడు. చెడ్డవాడు నరకానికి వెళ్తాడు. ఎప్పుడూ ఎటువంటి బోధనలు వినని మానవులు రక్షింపబడితే, అదీ టింబుక్టో, ఒటాహీట్, టెర్రా ఇన్‌కాగ్నిట ప్రదేశాలలో.

సనాతనులు కానివారిని రక్షించలేకపోతే ఇక క్రిస్టియానిటీ ఉపయోగం ఏముంది?

Byron

జుడాయి బోధించేవాడిని రక్షించి మిగతా మానవజాతిని గాలికి వదిలివేస్తే? అదీ నీగ్రోలను ఇంకా ఇతరులు ఏనాడూ, చీకట్ల నుంచి వెలుగు రేఖలు చూడనివారిని, తమ చీకటి కూపాలలోనే వదిలి తమ అజ్ఞానానికి వారిదే బాధ్యత అన్నట్లు దేవుడు శిక్షిస్తాడా?”

ఇదీ బైరన్ వాదన.

హాడ్జ్‌సన్ – త్వరలో మతబోధకుడుగా ప్రమాణం చేయబోతున్నాడు. అతనికి బైరన్ వాదనలను ఎదుర్కోవటం చాలా ఇబ్బందిగా ఉంది.

బైరన్ అంటాడు–

“నాకెలాంటి నమ్మకాలు లేవు. కానీ ఇప్పుడు దేవుని ప్రేమతో కొట్టుకు చస్తున్న ఈ డెబ్బయి రెండు తెగలకంటే భిన్నంగానే వుండదలచుకున్నాను. ఇక నువ్వు చెప్పే అమరత్వం! అరె! మళ్ళీ పుట్టే అవసరం వుంటే ఇప్పుడు చనిపోవటం దేనికి? ఒకవేళ మన శవాలన్నీ మళ్ళీ ప్రాణం పోసుకుంటాయా? నిజంగా ఆ అర్హత మనకు, వుందా? అలా అయితే, నా రాబోయే జన్మలో ఈ రెండు కాళ్ళు, అదే ఇరవయి రెండేళ్లు నన్ను మోసిన ఈ రెండు కాళ్లు మరింత బాగుండాలని అనుకోవటంలో తప్పులేదుగా – అలా వీలు కానపుడు ఆ స్వర్గంలోనే ఏదో మూల సర్దుకుంటాను...”

శలవలయిపోగానే మళ్ళీ ఒంటరిగా మిగిలిపోయాడు. తన పనివాళ్లను అదే పనిచేసి తన అవసరాలను తీర్చే ఆడవాళ్లను కూడా పంపివేశాడు. ఆ అమ్మాయి తనని మోసం చేస్తుందని పసికట్టి, ఈ విషయం హాడ్జిసన్‌తో చెప్పి, “ఎప్పుడూ నీ వుత్తరాల్లో ఆడదాన్ని గురించి రాయకు. అసలు శృంగారం గురించి పొరపాటున చెప్పకు. నిజానికి ఈ విశాల ప్రపంచంలో మనకు నమ్మకమైనది మనం నమ్మతగింది ఏదీ లేదు!”

అని ఖరాఖండిగా అంటాడు!

“ఈ వాతావరణంలో, నా నరాలన్నీ బలహీనమయిపోతున్నాయి. చదవలేక పోతున్నా – రాయలేకపోతున్నా – కనీస సంతోషాలు లేకుండా పోయాయి.

పగళ్లు ముందుకు సాగవు. రాత్రిళ్లు నిద్రపోవు. అసలు ఇక్కడ ఎవ్వరూ తోడులేరు. ఎవరైనా వుంటే భరించలేకపోతున్నా.

"ఈ చలికాలం, ఈ మఠంలో అంత్యక్రియలు జరపనా? ఈ కవిత్వం తప్పులు సరిచేయనా?

ఇప్పుడు నాకు ఎండ కావాలి. నీలాకాశం గొడుగు పట్టాలి. నాకిష్టమైన ప్రదేశాల గురించి ఈ చలిమంట గూటి ప్రక్కన బొగ్గుల కుంపటి ప్రక్కన కూర్చొని చెప్పలేను."

ఇంకా అతని మనసులోని మాటలు హాబ్హౌస్‌కు రాస్తాడు!

"నా జీవితపు రెండో మలుపులో నాకు చేదు అనుభవాలే ఎక్కువ. ఇవన్నీ మొదటిభాగపు అభాగ్యపు సంఘటనలే కారణం.

నేను ఎంతో మూర్ఖంగా ఇవన్నీ జయించానని అనుకున్నాను. కానీ అది ఎంత అవివేకమో కూడా తెలుసుకున్నాను. నేనెంత క్రూరంగా రోజులు గడిపానో చెప్పకపోతే నేనేమీ తెలియజేయనట్లే. నీవు అనుకున్నట్లు బాధతో మగ్గిపోయిన పెద్దమనిషిని కాదు.

ఇది నవ్వుకోవలసిన విషయమే?!"

ఇది నిజమే. బైరన్ తన గురించి ఇంతగా ఇప్పటివరకూ ఎవ్వరికీ చెప్పలేదు. అతనికి బాధలోనే మగ్గిపోవాలని అలాగే మిగిలిపోవాలనే ధైర్యం లేదు.

కానీ మానవ జాతిపట్ల, స్త్రీ జాతిమీద అతనికి ఏర్పడిన అపనమ్మకంతో కేవలం సుఖలాలసునిగా జీవితం గడపాలని, ప్రేమరాహిత్యంలో, స్నేహితులు కూడా లేకుండా తన జీవితాన్ని వెళ్ళబుచ్చాలని ఊహించుకుంటున్నాడు. ఇది ఎంత దారుణంగా తయారయ్యిందంటే, తానే భరించలేని స్థితికి చేరింది. బాధలుపడి మగ్గిపోయేవాళ్ళు, తమ బాధలు కేవలం స్మృతుల్లో మరచిపోయే అలవాటుపడినవారు వీరికి బద్ధకంపట్ల అద్భుతమైన అభిరుచి ఉంటుంది. బాధ మన జీవితాలను భరింపలేనిదిగా చేస్తుంది. అలాగే అదే బాధ మానసిక శూన్యతను, భావావేశంతో నింపివేస్తుంది!

బైరన్ తన జీవితాన్ని ఎంతో ప్రేమతో ఆరంభించాడు. కానీ అదే ప్రేమ తిరస్కారానికి గురికాబడి, ఒకవిధమైన మానసికోల్లాసానికై కోరికలతో వాంఛలతో పరుగెత్తించింది.

ఆరోగ్యకరమైన ఆహారాలు రుచిగా లేనట్లే, అతను ప్రశాంతంగా ఏదీ ఆనందించలేకపోతున్నాడు. ఎలాంటి హింసాత్మకమైన కోరికలైనా తీర్చుకోవాలని ఆరాటపడుతున్నాడు. అవి చట్టవిరుద్ధమైనా అనైతికమైనా సరే! కేవలం తన అస్తిత్వాన్ని తెలియజేస్తుండాలి. అంతే!

అదేవిషయాన్ని హాడ్జసన్‌కి కవిత రాసి పంపాడు!

మళ్ళీ మేరీ చావర్తు ప్రేమకు ప్రాణం పోస్తూ!

ఇది కానీ - ఇది పోనీ - ఇంక బాధపడను-
మళ్ళీ తూర్పు తీరాలకు పోను-
ప్రపంచానికి - ఆలోచనలే కావాలి-
లౌకిక లోకంలో పరుగులు పెడతా-
రాబోయే కాలంలో
బ్రిటన్ వేసవిలో-
ఇక్కడ ప్రేమ, సానుభూతి వుండదు-
ఆశలు - కీర్తి - ప్రజల మెప్పు ఆశించరాదు-
వంశ కీర్తి - అహంకారపు గర్వం -
అంతస్తుల మెట్లపై-
రాజరికపు పుస్తకాల గుర్తింపులో-
అతన్ని గుర్తుపడతావు-
అప్పుడు మర్చిపోవుకూడా-

హాడ్జసన్ ఎంతో ఆశావాది. ఇదంతా బైరన్ కూడా నమ్మడు అని ఆ కవిత ప్రక్కనే రాస్తాడు!


కానీ బైరన్, తన స్నేహితులనుకున్నంత సంతోషంగా లేడు. అంతకంటే క్లిష్టమైన మానసిక స్థితిలో మగ్గిపోతున్నాడు.

లండన్ వెళ్ళి అక్కడేవుండి పోవాలని నిర్ణయించుకుంటాడు. అక్కడ పార్లమెంటు వుంది. సరిచేయటానికి ప్రూఫులుంటాయి.

"ఏదైనా సరే – నన్నీబద్ధకపు శాపం నుంచి రక్షించగలిగింది ఏదైనా సరే!"



న్యూస్టెడ్ ముఖద్వారం



1812లో 'హౌస్ ఆఫ్ లార్డ్స్'

XV

అద్భుతమైన సంవత్సరం!

(1812)

ఆడవాళ్ళను ఆనందపరచటానికి
రాయనిది ఎవరు?

–బైరన్

పూర్వంలాగా, లండన్‌లో అతనికి కేవలం హాన్సన్ – డల్లాస్ ఇద్దరేకాదు, ఎక్కువమందే పరిచయమయ్యారు. డల్లాస్ 'చైల్డ్ హెరాల్డ్' యాత్రలు జాన్ ముర్రేకు ముద్రణకు అప్పగించాడు. జాన్ ముర్రే చాలా చైతన్యంగల సమర్థుడు. అతని స్నేహితులందరికీ చైల్డ్ హెరాల్డ్' పద్యాల గురించి చెప్తూనే వున్నాడు.

బైరన్ 'కత్తియుద్ధం' అభ్యాసంచేసి తిరిగి వస్తూ, ముర్రే దగ్గర ఆగుతాడు. ముద్రణ ఆలస్యం గురించి కొంత గొడవ చేస్తాడు. అక్కడ వున్న కొన్ని 'బైండ్' పుస్తకాలు తీసి 'బాగుంది' అంటూనే, తను కొత్తగా రాసిన కవితలు ముర్రేకు ఇస్తాడు. అక్కడ నుంచి బైరన్ తన స్నేహితుడు టామ్ మూర్‌తో కలిసి బాండ్ వీధిలోని 'స్టీవెన్స్'లో డిన్నర్ చేయటానికి వెళ్తాడు.

ఈ టామ్ మూర్ కూడా కవే – శృంగారపరంగా రెచ్చగొట్టే కవితలు, బైరన్ హారో యువకులను ఆనందపరిచేవి!

బైరన్ తన 'ఇంగ్లీషు బార్డ్స్'లో ఇతన్ని గురించి విమర్శ గుప్పిస్తాడు. అది మూర్‌ను ఇబ్బందిపెట్టింది. అంతే, తనతో కత్తి యుద్ధానికి రమ్మని బైరన్‌కు

సవాలు పంపిస్తాడు. అదీ హాడ్జసన్ చిరునామాకు! అప్పటికే బైరన్ తన యాత్రలకు బయలుదేరి వెళ్ళిపోతాడు. ఆ వుత్తరం అలాగే తెరవకుండా పడి వుంటుంది. బైరన్ తిరిగి వచ్చిన తర్వాత మూర్ తన సవాలు గురించి వాకబు చేస్తాడు. బైరన్ వుత్తరం కోసం వెతికిస్తే, అది సీలుతోసహా అలాగే వుంటుంది. దానిని మూర్‌కు పంపుతాడు.

సరే, ఇప్పుడు ద్వంద్వ యుద్ధం బదులు, 'భోజనం' కలిసి చేద్దాం అంటాడు మూర్! దానికి బైరన్ సరే అంటాడు.

మూర్ ఎవరికైనా విందు ఇవ్వాలంటే అతనికి సామ్యూల్ రోజర్స్ గుర్తుకు వస్తాడు.

ఈ రోజర్స్ ఒక బ్యాంకర్‌కు వారసుడు. కవిత్వం కూడా రాస్తాడు. తన ఇంటిని అద్భుతమైన సామానుతో వర్ణచిత్రాలతో అలంకరించాడు. అప్పటికే Pleasures of Memory ప్రచురిస్తాడు! అతను బ్యాంకర్ – కవిగా అందరికీ తెలుసు! అతని ఇల్లుకూడా ఒక పద్యంలా కవితలా చక్కగా అందంగా అలంకరించి వుంటుంది.

గ్రీన్‌పార్క్ దగ్గర్లో వున్న ఇంట్లో ప్రతివస్తువూ ప్రత్యేకమైనదే. ఇంట్లో లేనిది లేదు. (ఇంటి ఇల్లాలు) తప్ప. అతను బ్రహ్మచారి జీవితం చాలా తాపీగా గడుపుతుంటాడు. ఇలాంటి సమయంలో పెళ్లి హఠాత్తుగా తీసుకునే నిర్ణయం కాదుగా!

రోజర్స్ ఇంట్లో విందు అంటే అది ఎంతో ప్రత్యేకమైన వ్యవహారం. వంటల విషయంలో, అతిథుల విషయంలో అన్నీ ఎంతో జాగ్రత్తగా ప్రణాళికాబద్ధంగా జరుగుతాయి.

ఈరోజు మధ్యాహ్నపు విందుకు బైరన్, మూర్‌తోపాటు థామస్ కాంప్‌బెల్ కూడా వుంటారు.

బైరన్‌ను చూసి అతని అందాన్ని చూసి, వీరు ఆశ్చర్యపోతారు. అతని గొప్ప శైలికి మరింతగా ఆశ్చర్యపోతారు. అమ్మ చనిపోయిందని నల్లని దుస్తుల్లో వస్తాడు. అతని తెల్లని దేహఛాయ. మరింతగా మెరుస్తూంటుంది.

“సూప్ తీసుకుంటారా?” “నేను సూప్ తాగను”

“చేప?” “ఎప్పుడూ చేప తినను.”

“కొద్దిగా మాంసం?” అదే సమాధానం!

“వైన్?” “ఎప్పుడూ లేదు.”

“మరి ఏమి తింటారు?”

“బిస్కెట్లు – సోడా” అంటాడు.

దురదృష్టం ఆ రెండూ అక్కడ లేవు!



లేడీ ఆక్స్‌ఫర్డ్

బైరన్ కేవలం బంగాళాదుంపలు – వెనిగర్ వేసి తింటాడు.

“అరె! ఇలా ఎంతకాలం – బైరన్ ఈ ఆహారంతో గడుపుతాడు?” అని హాబ్ హౌస్‌ను అడుగుతాడు రోజర్!

“మీరు గమనించినంతకాలం!”

ఆ రోజు నుంచి బైరన్, మూర్ చాలా దగ్గరయిపోతారు.

ఇప్పటివరకు స్నేహితులే లేని బైరన్‌కు, ఎవరైనా ‘దొరికితే’ చాలనుకున్నాడు. అతనికి మూర్ బాగా నచ్చాడు. అతనికి ఎవ్వరు తెలియని ఈ లండన్‌లో, మూర్‌తో చాలా ప్రశాంతంగా వుండగలుగుతున్నాడు.

ముర్రేకు, మూర్ పట్ల అతని రచనలపట్ల అంత సదభిప్రాయం కాదు కానీ, బైరన్‌కు మూర్ ప్రతి రాత్రి చక్కని విందులు చేస్తూనే వున్నారు.

మూర్, రోజర్ స్నేహంతో, బైరన్ లండన్ చీకటి వీధులు కూడా చూస్తున్నాడు. జూదగృహాలు తిరుగుతున్నాడు. తన అయిష్టతను అణచుకుంటాడు. తనలోని మంచిని కొంత చంపుకుంటూ ఈ ఆనందాలను ఆస్వాదిస్తున్నాడు. కానీ అది ప్రశాంతంగా మాత్రం లేదు! చాలాసార్లు ‘న్యూస్టెడ్’ అమ్మకానికి పెట్టి, ఆ సొమ్ముతో

ఏదో దీవికి పోయి తూర్పు దేశాల కవిత్వం చదవాలని వారిలాగా దుస్తులు ధరించాలని ఉబలాటపడతాడు. ఇంగ్లాండు చలిగాలులు అతన్ని చాలా ఇబ్బంది పెట్టేవి. ఒకరకమైన నైరాశ్యాన్ని కలిగించేది. అలాగే ఇక్కడి ఆధ్యాత్మిక వాతావరణం అతనికి ఏమాత్రం ఉత్సాహానివ్వదు. పెత్తందారీ రాజకీయాలు నడుస్తున్నాయి. ఐరోపాలోని యుద్ధాలు, ఇక్కడి పాలకులను ఏమాత్రం ప్రభావితం చేయలేదు. వీరి జీవన సరళి చాలా సరళం. ఖాళీసమయాలు వేటలోనూ, ఆడవారితోనూ లేదా పార్లమెంటులో గడుపుతారు! ఐరోపా ఖండంలోని సంఘర్షణలు, ఇక్కడ స్వతంత్ర ఆలోచనలను అణగతొక్కే పాలకులు కోబాట్ స్వతంత్రంగా ఆలోచించి రాసిన రాతలకు రెండేళ్ళు జైలుశిక్ష వేశారు!

తమకు అర్థం కాకుండానే జనసామాన్యం యాంత్రీకరణ విప్లవానికి గురవుతున్నారు. బాధలు పడుతున్నారు. కానీ వీరి గోడు పట్టించుకునే నాథుడు లేడు. ఇదే సమయంలో హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో ఒక బిల్లుమీద చర్చ జరుగుతోంది. అది ఎవరైనా యంత్రాలను విరగ్గొటితే ఎలాంటి కఠినమైన శిక్ష విధించాలి అని!

బైరన్ న్యూస్టెడ్‌లో వున్నపుడు, తరచూ చూసేవాడు. అక్కడ కూలీలు యంత్రాలను విరగ్గొట్టటం. ఎందుకు అవి వారి నోటిదగ్గర ఆహారాన్ని, తమ పనిని దోచుకుంటున్నాయి – అందుకు.

ఏడుగురు చేసే పని ఒక్కరితో అయిపోతోంది. మిగతా ఆరుగురూ పని లేకుండా వుంటున్నారు.

వీరంతా మిలిటరీ కాంపులకు పోవలసి వస్తోంది.

వీరికి మరణశిక్ష విధించాలని ఇప్పుడు బిల్లు. అదీ, యంత్రాలను విరగ్గొట్టినందుకు!

బైరన్ స్వయంగా చూశాడు ఈ పేదకూలీలను. వారి కోపంలో న్యాయం వుందని నమ్మాడు. అంతే – తను 'లార్డ్స్ హౌస్'లో ఈ విషయంపై మాట్లాడాలని అనుకుంటాడు. లార్డ్స్ మధ్యలో నిలబడి, వారి హింసాత్మక చర్యలను ఖండించాలని నిర్ణయించుకుంటాడు. అంతేకాదు, తన చిన్ననాటి పేదరికం గుర్తుకు వస్తుంది.

తన ప్రియురాలిని దొంగిలించిన జాక్ మస్టర్స్ అంటే మిలిటరీ కెప్టెన్ కూడా గుర్తుకు వస్తాడు.

ఇలాగా తన వ్యక్తిగత స్మృతులు తోడయి, ఇప్పటి 'విగ్‌పార్టీ' తరఫున (తన తల్లి తరఫువారంతా విగ్గులే) వాదించటానికి, అందుకోసం లార్డ్ హాలండ్‌ను సంప్రదిస్తాడు. దూతగా డల్లాస్‌ను పంపిస్తాడు.

ఆ విధంగా తన ప్రసంగాన్ని ఎంతో అసహజంగా వినిపిస్తాడు. అయితే పార్లమెంటులో అది అంత నాసిరకంగా లేదు.

కూలీల దారుణమైన పరిస్థితులను అన్ని ఏకరవు పెడతాడు. "కేవలం వారి పేదరికమే, వారి మరణ శిక్షకు కారణంగా చెప్తారా?" అని అడుగుతాడు. "వారి పేదరికం పోగొట్టడానికి మీరు ఏమి చేశారు?" అనీ అడుగుతాడు!

"ఇప్పటికే వున్న మరణశిక్షలపై వున్న చట్టాలు మీకు చాలవా" అని నిలదీస్తాడు. అతని ప్రసంగం అద్భుతంగా వుంటుంది. కొంత నాటకీయంగా కూడా!

"ఇలాంటి దారుణమైన చట్టాలు టర్కీలో కూడా లేవు" అని చెప్పటం అసందర్భమైనా, అవి కళ్ళారా చూశాను అని చెప్పటమే అతని ఉద్దేశ్యం.

ఆ విధంగా అతనికి "హాలండ్ హౌస్"కు తలుపులు తెరుచుకుంటాయి. ఈ హాలండ్ హౌస్ లేడీ హాలండ్‌కు, లార్డ్ హాలండ్‌కు చెంది, ఇప్పుడు లండన్‌లో మేధోవర్గపు సభాంగణం! ఇదే సమయంలో ముర్రే 'చైల్డ్ హెరాల్డ్' ప్రచురణ మొదటి రెండు 'కాంటోలు' తీసుకు వస్తాడు.

అప్పటికే దాని ప్రతులను డల్లాస్ మేధోవర్గానికి చేరుస్తాడు. ఇన్ని జరిగినా, బైరన్‌కు 'చైల్ హెరాల్డ్' మీద అంత నమ్మకం లేదు!

అయితే చైల్డ్ హెరాల్డ్ ప్రూఫులు, సామ్యూల్ రోజర్స్, జనవరి నుంచి చూస్తూనే వున్నాడు. అతని మిత్రవర్గం బాగా చదివినవారే వున్నారు. వీరందరూ 'చైల్డ్ హెరాల్డ్'తో సరికొత్త కోణం, సహజ సౌందర్యం, మనుషుల ఆవేదన, అన్ని వున్నాయని అంగీకరిస్తారు. కానీ ఇవి పాఠకులకు ఎలా చేరతాయి? వారి స్థాయికి ఇవి చేరతాయా? లేక వీటి స్థాయికి పాఠకులు ఎదగ గలరా? ఇదే సంశయం.

రోజర్స్ కాస్త అనుమానంగానే, ఈ సాహిత్యకారులతో ప్రసిద్ధురాలు లేడీ కారొలెన్ లాంబ్‌కు ఈ కవితలు చూపిస్తాడు. ఎవ్వరికీ చూపవద్దని చెప్తాడు కూడా. కానీ ఆ రాత్రే అవి లండన్‌లో చేరవలసిన అన్ని గొప్ప భవనాలకు చేరుతాయి. అంతే – 'ఇది అద్భుతం', 'అమోఘం' అంటూ లేడీ కారొలిన్, రోజర్‌తో, 'నేను బైరన్‌ను చూడాలి' అంటుంది! 'అతని కాలు అవిటి' – 'గోళ్ళు కొరుక్కుంటాడు' అంటాడు. 'అతను ఎంత కురూపి అయినా సరే' అని పట్టుపడుతుంది.

ఆ విధంగా లండన్ ఆడవాళ్ళంతా చైల్డ్ హెరాల్డ్ మాయలో పడిపోతారు. బైరన్ జీవితం, రాత్రికి రాత్రి మారిపోతుంది. అరేబియన్ నైట్స్ హీరోలాగా, మంత్రదండం తనని అద్భుతంగా మార్చివేసినట్లు.

"అరె – ఒక్కరోజు నిద్ర లేచేసరికి ఇంతగా కీర్తి వచ్చిందేమిటి?" అని ఆశ్చర్యపోతాడు. ఒకప్పుడు లండన్ ఎడారిలా వుందని అనుకునేవాడు, పరిచయస్తులు లేక! ఇప్పుడు అరేబియన్ నైట్స్ నగరంగా దీపాలతో అందగత్తెలతో భవనాలతో అతన్ని ఆహ్వానిస్తోంది! అతనికోసం చాలా 'ఫాషన్‌బుల్' సొసైటీ ఎదురుచూస్తోంది ('నాలుగు వేలమంది – లండన్ అంతా నిద్రపోతున్నా వీరు, మేల్కొనే వుంటారు' అంటాడు).

అయితే వీరు చాలా త్వరగా మారిపోతుంటారు. వీరి ఇష్టాయిష్టాలు రాత్రికి రాత్రే మారిపోతుంటాయి. ఈ నాలుగువేల మంది సాహిత్య, సంగీత, చిత్రకారుల జీవితాలను మెరుపు వేగంతో, కీర్తి అపకీర్తి డోలికల్లో, తేలుస్తుంటారు. వారికి మెచ్చుకోవటానికి ఏదో విషయం కావాలి!

ఫ్రాన్సులో విప్లవం – బోనపార్టీ – ఇవన్నీ ఆంగ్లేయ యువతకు కొత్త ఆశలు రేపాయి. కానీ నెపోలియన్ నిరాశపరిచాడు.

ఇంగ్లాండులో నైతిక విలువలు అంతగా లేని సమాజంలో, పటాటోపంతో జీవన సరళి వెలిగిపోతోంది.

దీర్ఘకాలం కొనసాగుతున్న యుద్ధాలతో, మిలిటరీ పదవుల కోసం పాకులాట. టోరీల ప్రభుత్వాధికారంతో రాజకీయ పదవుల కోసం వెంపర్లాట – ప్రముఖంగా కనపడుతున్న తెలియని ప్రమాదమేదో ముంచుకువస్తున్నట్లు కనపడుతుంది.

ఇక సాహిత్యకారులు – కవులు, తమ పిరికితనంతో మగటిమి లేమితో, తమ నిరసనను తెలియజేయలేని స్థితి! అటువంటి సందర్భంలో 'చైల్డ్ హెరాల్డు' ఒక్కసారిగా వారి విషాద నైరాశ్యాన్ని ప్రతిధ్వనించింది. రోగగ్రస్తమైన ఒక తరాన్ని తట్టి లేపింది!

అరె – చివరికి 'కళ' జీవితంతో జతకట్టింది! చివరికి ఒక ఆంగ్ల యువకుడు, – అప్పటి ఆంగ్ల ఐరోపాను, యుద్ధాలు తిరుగుబాట్లు తూట్లు పొడిచిన జాతిపై వెలుగు ప్రసరింపజేశాడు!గత శతాబ్దకాలంగా మిగతా ఐరోపా ఖండంతో ఎటువంటి సంబంధాలు లేని, సంబంధాలన్నీ తెగిపోయిన జాతికి, అల్బేనియా యాత్రలు సులోటీస్ సాహసక్రీడలు ఎంతో ఉత్తేజాన్ని కలిగించాయి. చెల్డ్ హెరాల్డ్‌లో ధైర్యంగా వ్యక్తపరచిన రాజకీయ వ్యాఖ్యానాలు పాఠకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఇది సముద్ర గీతం! వైకింగ్ జాతి, ఇన్నాళ్ళుగా ఆంక్షలతో సముద్ర తీరాల కావలనే ఆగిపోయిన, ఉప్పుగాలులు, ఇన్నాళ్ళు వాళ్ళు మరచిపోయి లేవనుకుంటున్న సముద్రపు నీటి తుంపర్లు, ఇప్పుడు ఈ జాతిని తట్టి లేపుతాయి.

టోరీ ప్రభుత్వ విమర్శకులు బైరన్‌కు ఎంతో సహాయం చేశారు. క్వార్టర్లీ రివ్యూలో బైరన్‌ను విమర్శలతో గుప్పించారు. ఏమిటా రాజుగారి సైన్యం? కూలికి తెచ్చుకున్న సైనికునిలా? ఇరవయి ఏండ్లుగా, కవులు రచయితలు అందరూ రాజుగారి సొత్తులా మారిపోయారు. కానీ ఎంతటివారికైనా, ఎంతటి సుఖాలైనా విసుగు పుట్టించక మానవు. సరిగ్గా అటువంటి సందర్భలోనే 'చైల్డ్ హెరాల్డ్' ఆంగ్ల ప్రజల జీవితంలో ప్రత్యక్షమైంది!

కానీ చాలా సందర్భాలలో ఒక గొప్ప రచన చేసిన రచయిత, వ్యక్తిగా నిరాశపరచవచ్చు. ఇక్కడ 'చైల్డ్ హెరాల్డ్' రచయిత తన రచనకు ధీటుగా నిలబడగలిగిన హీరో! గొప్ప వంశానికి వారసుడు – ఇప్పటి సమాజం అతనికి అందుకే నీరాజనం పట్టింది, గొప్ప వంశానికే ఘనకీర్తి సంపాదించి పెట్టాడని. ఎందుకంటే విమర్శకులు ఎప్పుడూ ఈ గొప్ప వంశీకులనే దాడికి గురిచేస్తారు.

ఈ రచయిత యువకుడు, అందగాడు. అతని నీలి, బూడిద రంగు కళ్ళు ఉద్వేగంతో మెరుస్తుంటాయి. అతని పొడవాటి కనురెప్పలు అతని భావోద్వేగాన్ని దాచిపెడుతుంటాయి. అతని శరీర ఛాయ ఎంత తెల్లగా వుంటుందంటే, అతను తాగే సోడా కూడా చర్మంలో నుంచి కనపడుతుంది.

అతని పెదవులు రమణీయమైన యువతి మూతిలాగా వుంటాయి. పెదవుల చివర్లు ఆహ్వానిస్తూ గొప్పగా వంగి వుంటాయి.

అతని అవిశ్వాసాలు కూడా అతనిపట్ల ఉత్సుకతే కలిగించాయి. *'చైల్డ్ హెరాల్డ్'* విచారగ్రస్తమైన కథానాయకుడు. తనేకదా! *'చైల్డ్ హెరాల్డ్'* లాగానే బైరన్ టర్కీ, గ్రీసునుంచి తిరిగి వచ్చాడని అందరికీ తెలుసు. 'చైల్డ్ హెరాల్డ్' అనుభవించిన బాధా, వేదన, ఒంటరితనం, కష్టాలు అన్నీ బైరన్‌వేనని తెలుసు. అతనికే ఆపాదించారు! లార్డ్ బైరన్‌కే!

ఏ కళాసృష్టి అయినా జీవితానుభవాన్ని ప్రతిబింబాలి - ఇది పాఠకులు ఎంత గాఢంగా రచయితకు అన్వయిస్తారో, సత్యాసత్యాలు ప్రక్కన పెడితే, ఆ రచన అంతగా ప్రశంస పొందుతుంది!

లండన్ అంతా బైరన్ గురించే చర్చ జరుగుతోంది. ఖ్యాతిగల వారి గుంపులు అతన్ని కలవటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వారి విజిటింగ్ కార్డులు వదిలి వెళ్తున్నారు.

అతను వుండే జేమ్సు వీధి, గుర్రపు బగ్గీలతో నిలిచిపోయింది. రాకపోకలు ఆగిపోయాయి కూడా! ఒక పుస్తకాల దుకాణంలో ప్రిన్సెస్ చార్లొట్ కోసం, బైండ్ చేసిన చైల్డ్ హెరాల్డ్ పుస్తకం ప్రదర్శనకు పెట్టారు! స్వయంగా బైరన్ చేతుల మీదుగా రీజెంట్ రాజకుమారుడు పుస్తకాన్ని అందుకున్నాడు. అప్పుడే కవుల గురించి కవిత్వం గురించి చర్చించాడు.

మేఫెయిర్ విందుల్లో బైరన్ గురించి మాట్లాడుకుంటున్నారు. బైరన్ - బైరన్ అని మాత్రమే వినపడుతుంది.

ఆ రోజుల్లో ప్రతి ఋతువుకు ఒక సింహ చిహ్నం వుండేది. అది సాహిత్యమా, రాజకీయాలా, లేక సైనికులా అనేది ముఖ్యంకాదు. 1812లో బైరన్‌కు ఆ సింహనాదం దక్కింది.

'చైల్డ్ హెరాల్డ్' పాలరాతి హృదయాన్ని, అతను నివసించిన మఠభవనాన్ని ఊహించుకున్న ఆడవారు, ఆశ్చర్యపోయేవారు. అయినా గౌరవించటం మానలేదు. అతని కోసం కాపు కాసేవారు.

వీరంతా రమణీయమైనవారు. అంతకంటే భయపడేవారు. ఆ భయంతో అరుదైన ఆనందాన్ని పొందేవారు.

లేడీ రోజ్‌బేరీ ఒకరోజు, బైరన్‌తో ఒక గది గుమ్మంలో నిలబడి మాట్లాడుతుండగా ఆమె హృదయం విపరీతంగా స్పందించటంతో, అతనికి సమాధానమే చెప్పలేకపోయింది. అది బైరన్ గమనించి, తన వాలుచూపుల ప్రభావాన్ని మరింతగా ప్రయోగించాడు!

డల్లాస్ ఒకరోజున, బైరన్, చైల్డ్ హెరాల్డ్ గట్టిగా చదవటం గమనించాడు. అతను తన రచనలో తనను వెదుక్కొంటున్నాడు – సందేహం లేదు. ఇతరులు ఆరాధించేది అతన్నేగదా! ఆ రచనలో హీరోనే కదా!

"ఈ విధంగానైనా బైరన్, తన బాల్యంలోని విషాదాన్ని పోగొట్టుకో గలుగుతాడని నమ్ముతాను" డల్లాస్ జోస్యం చెప్పుకుంటాడు. కానీ డల్లాస్ అంచనా తప్పు. బైరన్ వ్యక్తిత్వంలో, విషాదం, ఒక అంతర్భాగం – విడదీయలేని గుణాత్మకం. దీనినే అతని పాఠకులు ప్రేమిస్తున్నారు. ఈ విషయం బైరన్‌కు తెలుసుకూడా!

తనకోసం, చైల్డ్ హెరాల్డ్ కోసం వారంతా ఎదురు చూస్తున్న విషయం తెలిసే, వారి డ్రాయింగ్ రూంలో ప్రవేశించేవాడు. విషాదకరమైన అసహ్యంతో, బైరన్‌లకు జన్మతః సంతరించిన బిడియాన్ని బెట్టుగా దాచిపెట్టి, వారిముందు గంభీరంగా కనిపించేవాడు. అతనికిప్పుడు, ఆడవారంటే ఎటువంటి బెరుకూ, తడబాటూ లేవు. తన చిన్నప్పుడు లెక్కపెట్టినట్లు ఒకటి, రెండు, మూడు అంటూ సణుగుకోవలసిన అవసరం లేదు! కానీ తన పొడిపొడి సంభాషణల మాటున, తన గాఢమైన ఉద్రిక్తతను అణచిపెట్టుకునేవాడు!

ఈ విశాల ప్రపంచంలో చైతన్యంతో వర్ణరంజకంగా వున్న ప్రపంచం ఇప్పటివరకు తనను నిర్లక్ష్యం చేసిన ప్రపంచం – ఇప్పుడు తనను ఆహ్వానిస్తోంది. కానీ, దానిలో తనవారెవ్వరూ లేరు. బంధువులు – స్నేహితులూ ఎవరూ లేరు.

ఇప్పుడు తనతో పరిచయం కోసం వస్తున్న వారందరూ, పరస్పర స్నేహితులు. ఎప్పటినుంచో కలిసి వున్నవారు. ఒకరినొకరు ఆప్యాయంగా ఏకవచనంలో సంబోధించుకుంటున్నారు!

వీరి గురించి తనకేమీ తెలియదు. ఒక్క విషయం కూడా – తన సౌత్‌వెల్ అలవాట్లను ప్రదర్శించటానికి వెనకాడేవాడు – తన అవిటితనాన్ని బైట పెట్టుకోవటానికి ఇబ్బందిపడేవాడు. కానీ, ఇవన్నీ అతనికి ఒక వింత ఆనందాన్నిచ్చేవి. అది ఎలాంటి సంతోషమో, ఇంకా అతనికి తెలిసిరాలేదు.

మిగతావారు నృత్యం చేస్తుంటే, అతను కదలకుండా వుండిపోయేవాడు. అదీ తన అవిటి కాలు కారణంగా. అక్కడి బంగారు రంగు గుమ్మంలో నిలుచుని తన హీరోలాగా, ఠీవిగా నౌక ముందు కొనలో నిలబడి దూరదూరంగా ఎగసిపడుతున్న అలల తాకిడిని చూస్తున్న తను హీరోలాగా నిలబడేవాడు!

మూర్‌కు, బైరన్‌లో చాలా ఉత్సాహవంతుడైన స్నేహితుడు కనిపిస్తాడు. అతను చిన్నపిల్లవాని మాదిరిగా నవ్వగలడు. తన విషాదాన్ని కేవలం హాస్యంగా తీసివేయటానికి ప్రయత్నించేవాడు. కానీ బైరన్, ఇది నటనో భంగిమో కాదని తన విచారం, హృదయపు లోతుల్లోనే వున్నదని, కనిపించే సంతోషం కేవలం, పై పూతేనని గుండెల్లో దుఃఖం పొంగుతూనే వుందని భావించేవాడు!

ఈ కొత్త ప్రపంచంలో అతను ఏమీ సంతోషకరంగా లేడు. హాయిగా అసలు లేడు! అతనికి ఈ ప్రపంచం తన పాదాక్రాంతమైనదని తెలుసు. తన కవిత్వం ద్వారా వచ్చిన ఈ కీర్తి ఎంతవరకు నిలబడుతుంది?

హబ్‌హౌస్ నిజాయితీగానే కుండబద్దలు కొట్టినట్లు చెప్తాడు. పోప్ తర్వాత మరే కవీ నిలబడలేదు. బైరన్ కూడా అలాగే అనుకున్నాడు.

వారిద్దరూ చైల్డ్ హెరాల్డ్ విజయం వెనుక, వ్యాధిగ్రస్తమైన భావావేశపు వ్యక్తీకరణే కారణమని! కాని ఇది ఎంతకాలం నిలబడుతుంది – పాఠకులు

విమర్శకులు త్వరలోనే మళ్ళీ పోప్‌వైపు మళ్ళటానికి ఎక్కువ సమయం పట్టకపోవచ్చు! ఏది ఏమయినా ఆ 1812 వసంతకాలం 'బైరన్ జ్వరంతో' వణికిపోయింది.

"ఇప్పుడు విందులు – సమావేశాల్లో చర్చించేది స్పెయిన్, పోర్చుగీసు రాజకీయాలు కాదు, యుద్ధవీరులు దేశభక్తులు గురించి అసలేకాదు – కానీ 'బైరన్ – బైరన్ గురించే సంభాషణలన్నీ' అని డేవన్ షోర్ యువరాణి రాసింది.

చైల్డ్ హెరాల్డ్ పుస్తకం అందరి ఇళ్ళల్లో వుంది. ఇక బైరన్‌కు దక్కిన గౌరవ మర్యాదలకు లోటులేదు. పాలిపోయి, జబ్బు పడినట్లున్న బైరన్ అందమైన అతని ముఖారవిందం, ఎక్కడ విన్నా బైరన్ గురించే.

మగవారు – అతనంటే అసూయితో

ఆడవారు ఒకరిపై ఒకరు అసూయతో" – ఇదీ! డచెస్ రాసిందాని సారాంశం! అతనికి తెలిసిన, రోజర్స్ – మూర్, లార్డ్ హాలండ్ వీరి ముగ్గురికి అంతులేని ఒత్తిడి పెరిగింది. బైరన్‌ను పరిచయం చేయమని, బైరన్‌తో విందు ఏర్పాటు చేయమని, "మీరు మా ఇంటికి విందుకు రండి. మీతో బైర్‌ను తీసుకురాగలరా?" ఇదీ అప్పటి వాతావరణం!

బైరన్‌లాంటి యువ కవికి, అవిటి అందగానికి ఎలాంటి అదృష్టం పట్టింది!

కొద్ది సంవత్సరాలకు క్రితమే కదా, ఎంతో పదిలంగా తన వంతు (ఎనిమిదోవంతు వాటా) పాత్రను మోసుకుంటూ నాటింగ్ హామ్ వీధుల్లో తిరిగాడు! ఎలాంటి మలుపు!

లేడీ కారొలైన్ 'వింత కురూపినైనా' సరే బైరన్‌ను చూడాలి అనికదా అంది. చివరికి లేడీ వెస్ట్‌మోర్ ఆవరణలో 'ఆ బైరన్'ను కలుస్తుంది. అతనికి దగ్గరగా వచ్చి ఆశ్చర్యపోతుంది. ఎలాంటి అందగాడు ఎంత అద్భుతమైన ముఖకవళికలు– ధనుస్సులా వంగిన కనుబొమ్మలు, ఉంగరాల జుత్తు, మెరుస్తున్న వుంగరాల జుత్తు, వెలుతురు మండుతున్న ఉంగరాలు! గ్రీకు శిల్పంలా అతని అందమైన నోరు! నాజూకుగా వంగిన పెదవులు! ఒక్క క్షణం అతని స్వరాన్ని, మృదుల

స్వరాన్ని వింది. ఎంత శ్రావ్యంగా వుంది! 'ఈయన చిన్నపిల్లవానిలా శ్రావ్యంగా మాట్లాడతాడు' అనికదా అన్నారు. అతని మర్యాదలను జాగ్రత్తగా గమనించింది! అతని గర్వాన్ని అణకువను పరిశీలించింది. ఆడవారు అతని చుట్టూ చేరటం చూసింది. అంతే వెనుదిరిగి వెళ్ళిపోయింది. ఆ రాత్రి ఆమె జర్నల్ రాసుకుంది – మహా చెడ్డ, పిచ్చి ప్రమాదకారి! రెండు రోజుల తర్వాత ఆమె హాలండ్ హౌస్‌కు వచ్చింది. అక్కడకు బైరన్ వచ్చినపుడు ఆమెకు పరిచయం చేశారు!

"నిన్ననే మన పరిచయం జరగాల్సింది. మీరు ఎందుకు కాదన్నారు?" అని అడుగుతాడు. సన్నగా నాజూకుగా పెద్ద కళ్ళతో అందంగా వుందా? ఏమో? కాని ఆకర్షణీయంగా వుంది!

"మిమ్మల్ని కలిసి మాట్లాడవచ్చా?" అని అడుగుతాడు. ఆమెను ఎంతో ఆసక్తిగా పరిశీలిస్తాడు. మంచి వంశంలో జన్మించిన స్త్రీ. చక్కని సంభాషణ చేయగలదు. ఆలోచనాపరంగా, ఆవేశపరంగా, చక్కని స్వరం, కాస్త ముక్కుతో మాట్లాడినట్లున్నా. ఇది డెవాన్ షార్ ఇంటిల్లిపాదికీ వున్న లక్షణమే.

ఆ రాత్రి ఆమె తన జర్నల్ రాసుకుంది, బైరన్ గురించి. "ఆ పాలిపోయిన అందమైన ముఖమే – నా అదృష్టం, నా విధి. నా తలరాత!



లేడీ కారొలైన్

XVI

ప్రేమ

(1812-1813)

పిచ్చి! చెడ్డ? అరె! ఎంత తొందరపాటు, ఈ విమర్శ?! అతనిలో ఏమి చూసింది? ఇంత ఘాటు విమర్శ చేయటానికి? అతని సమాధానాలలోని లెక్కలేనితనమా? వెక్కిరించే కర్కశత్వమా? అతని మూతి విరుపులోని నిర్లక్ష్యమా? అసహనంగా, విసుగుతో వాలిపోతున్న అతని కనురెప్పల చాటునున్న చూపులా?

పిచ్చి – చెడ్డ – కాదు – అతను అలాంటివాడు కాదు. కానీ ప్రమాదకారి. తెలుసుకున్నకొలదీ ప్రమాదమే. ఎందుకు? తన గాయాల నుంచి అపనమ్మకాల నుంచి తనను తను రక్షించుకోవటానికి! మరోసారి, మరో మేరీ చావర్తు, తనను గాయపరచకూడదు. అతని నమ్మకం, తనకు ఆడవారి గురించి బాగా తెలుసునని. వారినెలా వాడుకోవాలో! తన జీవితంలో ఆర్ద్రతకు, మార్దవానికి చోటు లేదు. ఇప్పటివరకూ ఈ దేవతాస్త్రీలు తనకు నేర్పిన గుణపాఠం చాలా కఠినమైనది. అది చాలు! అది ఎలా మరిచిపోతాడు!

లేడీ కారో తన అత్తగారితో 'మెల్‌బోర్న్ హౌస్'లోనే వుంటుంది. ఆమెను చూడటానికి వెళ్ళినప్పుడు అక్కడ మూర్ – రోజర్స్ ఉండటం గమనించాడు. తను రాకమునుపు, ఆమె గుర్రపు స్వారీకి వెళ్ళి తిరిగి వచ్చి, అలాగే సోఫాలో కూలబడింది. అక్కడ అప్పటికే మూర్, రోజర్స్ వున్నారు. ఇంతలో బైరన్ వస్తున్నట్లు కబురు!

అంతే – ఆమె దుస్తులు మార్చుకోవటానికి లోనికి పరుగుపెట్టింది.

“మీరు అదృష్టవంతులు. ఇప్పటివరకు మురికి బట్టల్తో కూర్చున్న లేడీ కారో మీరు వస్తున్నట్లు విని అందంగా తయారవటానికి లోనికి వెళ్ళింది” అని రోజర్స్ అంటారు బైరన్‌తో!

బైరన్, వీళ్ళిద్దరినీ చూసి ముఖం చిట్లించుకుంటాడు. తను మాత్రమే ఆమెను ఏకాంతంగా కలవకూడదా?

అతన్ని, రాత్రికి ‘డిన్నర్’కు రమ్మంటుంది. అతను వస్తాడు! ఆమెను జయించాడు! అంతే! ‘మెల్‌బార్న్ పాలెస్’, లండన్‌లో ఒక గొప్ప మేధోవర్గం కలిసిమెలిసి విందులు, వినోదాలు జరుపుకునే భవంతి. లండన్‌లో ముఖ్యంగా ప్రధాన ప్రతిపక్షం అయిన ‘విగ్’ పార్టీకి సమావేశ ప్రదేశం, ‘హాలెండ్ హౌస్’తోపాటు.

‘లాంబ్స్’ వీరికే మెల్‌బోర్న్ టైటిల్ వుంది. వీరికి కావలసినంత సంపద, పేరు ప్రతిష్టలున్నాయి. ‘మెల్‌బోర్న్’లకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు తండ్రి – లార్డ్ మెల్‌బోర్న్ పోలిక. రెండోవాడు అమ్మకూచి. బాగా గారాబం చేసి చెడగొట్టింది. అదిగో అతని భార్య, ఈ లేడీ కారో! ఇప్పుడు బైరన్ కలిసింది!

ఈ లేడీ కారో, చాలా సంపదలో పెరిగింది. ఇంట్లో పనివాళ్ళమధ్య గారంగా ఆలస్యంగానే లాటిన్, గ్రీకు నేర్చుకుంది. సంగీత నాట్యాలు, అలవోకగా నేర్చింది. చిత్రకళ కూడా అభ్యాసం చేసింది. అందంగా, యుక్తవయసుకే లండన్‌లో ప్రముఖురాలుగా గుర్తింపు పొందింది.

ఆమెకు సంప్రదాయం అంటే భయం! ఉత్తరాల్లో తేదీలు వేయదు. చిరునామా రాయదు! ఆమె తెలివితేటలు చాలా ప్రచారం పొందాయి. ఆమె ఏ సమావేశంలో వున్నా అక్కడ వెలుగులే. అంతేకాదు, ఆమెలో గొప్ప గుణం, క్షణంలో తన ముఖకవళికలు మార్చుకోగలగటం. ఇంతలో నవ్వగలదు. అంతలో విచారంగా కనిపించగలదు. ఆమె అభిమానులు, ఆహా గంధర్వ కన్య – దేవత – మత్స్యకన్య, ప్రమాదకారి అని ఆమెను ముద్దుగా పిలిచేవారు. ఆమె సంపద, పెంపకం ఆమెను చెడగొట్టినాయి అంటారు. ఆడవారు ‘అంతా కృత్రిమం’ అంటారు. ఆమెతో పోటీ చేయడానికి ఆమెలాగా వుండటానికి ప్రయత్నించేవారు.

ఆమె, 'విలియం లాంబ్'ను పెళ్లి చేసుకోవటం ఒక ప్రహసనం!

పెళ్ళిరోజునే, ఆమె పిచ్చిగా వ్యవహరించింది. ఈ బంధాలు, ఆమెను ఇబ్బంది పెడతాయని అప్పుడే తెలుసుకుంది. కానీ ఆశ్చర్యంగా, 'విలియం' ఆమెను కట్టడి చేయలేదు. మరింతగా 'గారాం' చేశాడనవచ్చు. ఆమె అత్తగారు చాలా విశాల హృదయం కలది. కోడల్ని కూడా తనలాగానే స్వేచ్ఛగా వుండనిచ్చింది. 'మెల్‌బార్న్' హౌస్ చాలా ప్రసిద్ధులకు ఆటస్థలం కదా!

లేడీ కారో – అత్తగార్ని, స్వాతంత్ర్యాన్ని ఎంతగానో స్వాగతించి, ఆరాధించింది. తన తెలివితేటలతో భర్తను గెలిచింది. ఎన్నో నేర్పింది. అంతేకాదు – తనకు తెలియని ఎన్నో, నేర్చుకుంది కూడా. ఇక్కడ అన్ని విషయాలు ధర్మమైనవే! న్యాయమైనవే! 'విలియం' తన ముసుగు వెనకాల, ఆమె ప్రవర్తనకు, దిగులు చెందటం మొదలుపెట్టాడు. ఆమె? అతనికేంకావాలి? "ఏమో! అది మనిద్దరికీ తెలియదు. ఇద్దరం సంతోషంగా లేము" అంటుంది.

ఇదిగో ఇలాంటి వాతావరణంలో బైరన్ ప్రవేశించాడు!

పరిచయస్థులు, స్నేహితులే లేని బైరన్‌కు, ఈ 'మెల్‌బోర్న్ భవంతి' ఎన్నో ద్వారాలు తెరిచింది.

మధ్యాహ్నం పదకొండు తర్వాత, అక్కడికి వచ్చేవాడు. ఉత్తరాలు తెరిచేవాడు. పిల్లలతో ఆడేవాడు. ఆమెకు దుస్తులు ఏరి ఇచ్చేవాడు. తన తియ్యటి స్వరంతో కబుర్లు చెప్పేవాడు. తన యాత్రల గురించి, అమ్మ మరణం గురించి, తన గురించి, తూర్పుదేశాల యువతుల గురించి అన్నీ చెప్పేవాడు. లేడీ కారో చిన్నకొడుకుని తన ఒళ్ళో కూర్చోబెట్టుకుని ఆడిస్తూ ఉండేవాడు. ఆమె ఎంతో ఆసక్తిగా వింటూ చూస్తుండేది. ఇతను తన భర్తకంటే ఎంత భిన్నమైనవాడు! ఆశ్చర్యపోయేది! ఎంత అందగాడు – అని మెచ్చుకునేది.

అతను ఆమెను ప్రేమించాడా? ఈమెలో తనకు కావలసిన లక్షణాలు ఏవి? ఎంత నాజూకుగా ఉన్నా, ఇంత బక్కగా వుందేమిటి? ఆ లేడి కళ్ళు ఏవి? అలాగే ఆ సిగ్గేది? 'పేరి' (Peri) హుందాతనం తను చిన్ననాటి నుంచి అన్వేషించే రూప లావణ్యాలు ఏవి?

కానీ ఈమెలో వున్నది – అంతులేని చైతన్యంతో మెరిసిపోతోంది!

ఈ 'మెల్‌బోర్న్' భవనంలో, అతనిలోని యుక్తవయస్సు, గర్వాన్ని సంతృప్తిపరచే వాతావరణం పుష్కలంగా వుంది. ఇక్కడికి ప్రవేశంతోనే, నిన్నటివరకూ ఒక్క స్నేహితుడూ లేని తనకి, ఒక ప్రదేశంలోనే లండన్ మేధోవర్గంతో సంపర్కం ఏర్పడింది. పైగా వీరంతా తననెంతో గౌరవంగా చూస్తున్నారు.

లేడీ కారోలో వున్న భావోద్వేగాన్ని అతను గ్రహించాడు. అందుకు లొంగిపోవాలని ఆరాటపడ్డాడు కూడా.

ఒకరోజు డల్లాస్ అతన్ని చూడటానికి వచ్చాడు. అప్పుడు బైరన్ అక్కడ పడివున్న ఉత్తరాలు తెరుస్తున్నాడు. సిల్కు లేసు దుస్తుల్లో వున్న ఒక యువతి అతనికి సపర్యలు చేస్తోంది. డల్లాస్ అతనికి, 'జాగ్రత్త' అని హెచ్చరికలు పంపిస్తాడు కూడా. పైగా ఆమెను అందరూ 'పిచ్చిదాని'గా ముద్రవేశారు!

కానీ బైరన్ తన జాగ్రత్తలో తను లేడా?

ఇప్పుడు, బైరన్ ప్రవేశించటానికి అర్హత పొందిన ఈ పెత్తందారీ సమాజం – ఇది పద్దెనిమిదవ శతాబ్దపు నీతినియమాలకు లోబడి నడుస్తోంది. అయినా భౌతిక వ్యవహారంలోనే! మానసిక భావావేశాలకంటే, నడుస్తోంది.

నిజానికి బైరన్‌కు అంతర్గతంగా ఇది చేరువకాకపోయినా, ఈ బైరన్, మూర్‌కు, రోజర్‌కు స్నేహితుడు – పైగా తన భ్రమల తాలూకు నిరాశలతో వుండిపోయిన బైరన్. అతనిలో కేవలం నులివెచ్చని స్పర్శతోనే కరిగిపోయే మార్దవపు పార్శ్వం, అలాగే వుండిపోయింది! అతను 'లేడీ మెల్‌బోర్న్' స్వేచ్ఛా–స్వాతంత్ర్యాలను ఎక్కువ ఇష్టపడేవాడు, వీటిని తాను అందుకోలేనని తెలిసికూడా. అందుకనే మరీ స్వేచ్ఛను అతను భరించలేకపోయాడు. అంతేకాదు నీతినియమాలకు కట్టుబడిన మగవాళ్ళు, ఆడవాళ్ళను కూడా ఎక్కువ ఇష్టపడేవాడు. ఆ దృష్టితో లేడీ కారో అతనికి విసుగుపుట్టించేది.

లేడీ మెల్‌బోర్న్ నిజంగా అతనికి మానసికంగా చాలా దగ్గరయింది. ఆమె స్వతంత్ర ఆలోచనలు అతన్ని ఉత్తేజపరచేవి.

ఇక్కడ ఈ 'మెల్‌బోర్న్ భవనం', తను కేంబ్రిడ్జిలో వున్నప్పటి మతమంటే అపనమ్మకం ఏర్పరచిన మాథ్యూస్‌లాగా, లేడీ మెల్‌బోర్న్ అతన్ని మతంపట్ల విముఖత ఏర్పరచటానికి దోహదం చేసింది. వీరి ఆలోచనలు సంప్రదాయాన్ని నిరసించటమే.

"నిజానికి లేడీ మెల్‌బోర్న్, నాకు అమ్మ అయి వుండాల్సింది. ఎంతోమంది ఈనాటి యువతులకంటే కూడా నాలో, ఎంతో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తుంది. ఆమెలోని ఆకర్షణ అద్భుతం!

ఈ ఆధునిక అస్పేసియా, మగవాని శక్తిని స్త్రీ మార్దవాన్ని ఏకం చేయగల అస్పేసియా! ఈమె వయసు కాస్త తక్కువ వుండి వుంటే బహుశా నన్ను మరింతగా ఆకట్టుకోగలిగేది! అన్ని సందర్భాల్లో నా హృదయాన్ని లోబరుచుకుంది. నాలో తేలికైన ఆలోచనలు రేకెత్తించింది. నాలో రాక్షస ప్రవృత్తి వత్తిడిగా వున్నప్పుడు చల్లబరిచేది!" అని రాసుకున్నాడు.

లేడీ మెల్‌బోర్న్ తర్వాత అతన్ని ఎక్కువ ఆకర్షించింది విలియం లాంబ్! లేడీ కారో భర్త!

ఇతను నాకన్నా ఉన్నతంగా ఉన్నాడు.

ఇతన్ని, ఇంతటి నమ్మకస్తుని నేను ఎలా మోసం చేయగలను - నా స్నేహాన్ని మనస్ఫూర్తిగా కోరుతున్నవాణ్ణి ఎలా మోసం చేయాలి?

అరె - ఈ స్త్రీ ఆకర్షణ ఎలాంటి ద్రోహానికైనా ఒడిగడుతుందికదా!

ఒక వసంతకాలపు వుదయం మొదటి రోజాపువ్వు తీసుకువస్తాడు. "మీరు అరుదైన, ప్రత్యేకమైన వాటిని ఎంతో ఇష్టపడతారని, అది క్షణకాలం, అని విన్నాను!" అంటాడు నర్మగర్భంగా.

దీనికి సమాధానం ఆమె వుత్తరంలో పంపింది. ఎలాంటి వుత్తరం?!

చక్కని కాగితం - చుట్టూ లేసుమాదిరి. పై మూలలు రెండు గవ్వల రూపంలో.

ఉత్తరంలో భావసాంద్రత, భాషా విధానంతో మరుగున పడిపోయినట్లు "అవును, నేను పొద్దుతిరుగుడు పువ్వును. నా మీద అద్భుతమైన సూర్యకిరణాలు

క్షణకాలం మెరిసి మాయమైపోయాయి. మళ్ళీ అలాంటి సందర్భం ఎలా వస్తుంది? అంతకంటే విలువైన ఆరాధించగలిగిన సందర్భం ఎలా వస్తుంది?!"

ఇది బైరన్‌ను అవమానపరుస్తుంది. బైరన్‌కు, ఆడవారు తనని, 'పెద్దక్క'లాగా భావిస్తే అభిమానిస్తాడు. కానీ ఒక అధికారిలాగా అనుకుంటే? లేక పెత్తనం చెలాయించేవానిలాగా అనుకోరాదుకదా! ఆనందం – ప్రేమ ఈ రెండూ మగవానికి చాలా ముఖ్యం. ఇవే మరువలేని అనుభూతుల్ని మిగులుస్తాయి.

యౌవనంలోని బైరన్‌కు, భౌతికానందం (ఇదే ప్రాణులకు వరంలాంటిదికదా) అతనికి ప్రేమలోని ఏకాంత విషాదం దక్కకుండా పోయింది.

అతని యౌవనారంభంలో ఇద్దరు యువతుల్ని ఆహ్వానించాడు తన జీవితంలోకి. తన కలల రాణి, బిడియంతో ముడుచుకుపోయే 'మేరీ చావర్తు' ఒకరు, రెండవవారు బాలికామూర్తి, మార్గరెట్ పార్కర్! వీరి సాంగత్యపు సుఖాన్ని. కానీ అతనికి ధైర్యంగా ప్రేమించగల స్త్రీ ఇంకా పరిచయం కావలసివుంది. అతనికి ఎదుటివారి భావనలు అంతగా పట్టవు. అతను పట్టించుకోవాలనుకోడు కూడా!

ఈ సందర్భంలో లేడీ కారో వుత్తరంలోని ఎత్తిపొడుపు విధానం అతని హృదయంలో సంగీతపు ధ్వనులను వినపడకుండా చేసిన అనవసర శబ్దాలైపోయాయి. అంతకంటే నువ్వంటే ఇష్టం, నిన్ను ప్రేమిస్తున్నాను, నువ్వు కావాలి, లాంటి మాటలు అతనికి అతని విషాదాన్ని మరిపింపజేసేవి.

అరె! తనంటే ఆరాధన ఏది? ఇందులో అంత విసుగు (నిరుత్సాహం), ఆయాసం దాగివుందా?

లేడీ కారో ఎంతో అద్భుతమైన వుత్తరాలు రాయగలదు. తను అంతగా ప్రేమించని భర్తకు రాస్తున్నది కూడా! కానీ బైరన్‌కు రాసే ఉత్తరాలలో అంతులేని విషాదాన్ని నింపింది. ఆమె ఉద్దేశ్యం, అతనికి ఈ సమాజపు రూపాన్ని చూపి ఆనందింపచేయాలనే! అతని కోసం వుదయపు విందులు ఏర్పాటు చేసింది. లండన్‌లో సుందరాంగులందర్నీ ఆహ్వానించేది. కానీ వీరి పైపై కబుర్లు మన యాత్రికుణ్ని అలసిపోయేట్లు చేసేవి. ఇదే యాత్రికుడు ఆరెనెలల క్రిందట నీలాకాశం క్రింద పర్వతాలను చూస్తూ పొగతాగుతూ ఆనందించాడు. నిన్నగాక

మొన్న న్యూస్టెడ్‌లో ఏమని రాశాడు – "అరె! ఈ బద్ధకం అనేదిగాక ఇంకేదయినా ఫర్వాలేదు..." అని కాదా!

మరి ఇప్పుడు తను పోగొట్టుకున్న ఏకాంతం కోసం పరితపించటం మొదలుపెట్టాడు!

ఈ సందర్భంలోనే ఒక తెలివిగల పిల్ల అతన్ని చాలా నిశితంగా పరిశీలిస్తోంది. ఆమె ఎవరోకాదు ఈ లేడీ మెల్‌బోర్న్‌కి దూరపు చుట్టమే. పేరు 'ఆనీ ఇజబెల్లా' మిల్‌బాంక్! అనెబెల్లా అది ఆమె ముద్దుపేరు. చక్కని విద్య, మతవిశ్వాసం గల యువతి. ఇలా లండన్ వచ్చినప్పుడు ఇక్కడి సమాజరీతి పోకడలు పరిశీలిస్తుండేది!

తన విచ్చలవిడి కారో కజిన్‌నూ చూస్తుండేది! అయిష్టంగానే.

మార్చి 24న ఆమె డైరీలో రాసుకుంది. "ఇప్పుడే 'చైల్డ్ హెరాల్డ్' పూర్తి చేశాను లార్డ్ బైరన్ రాసింది. చాలా మంచి కవితాశైలి". ఆ మర్నాడు పొద్దుటి విందుకు మెల్‌బోర్న్ భవనానికి ఆహ్వానం వచ్చింది. చాలామంది చాలా నగలు ధరించి అక్కడ గుమిగూడారు. అనెబెల్లా – ఏమిటి మీరంతా ఈ సంగీతాన్ని ఏదో విధంగా వింటున్నారే?" అనుకుంటుంది. లేడీ కారో – ఆమెకు, బైరన్‌ను చూపిస్తుంది. అనెబెల్లా – అతన్ని పరిశీలించింది. "అతని ముఖ కవళికలు, అతని భావాల్ని ఆలోచన్ని దాచిపెడుతున్నాయి" అనుకుంటుంది. అంతేకాదు ఇక్కడ జరిగే తంతు అతనికి ఇష్టంలేని సంగతీ గుర్తించింది.

"ఈ రోజు అమ్మాయిలందరూ అతని మీద ఎగబడుతున్నారు. నీకు మరోసారి అతన్ని పరిచయం చేస్తాను" అంటుంది కారో!

కొద్దిరోజుల తర్వాత కలిసినప్పుడు, అతను సిగ్గరి అని గుర్తించి మాట్లాడిస్తుంది. అతను ఆశ్చర్యపోయాడు "ఏమిటీ! ఇక్కడ ఎలా వుండగలుగుతున్నావు. వీరిలో ఒక్కరైనా ఇంటికి వెళ్ళి తమ ముఖం తాము అద్దంలో చూసుకోగలరా?" అని ఆశ్చర్యపోయాడు.

ఇది ఆమెకెంతో నచ్చింది కూడా! ఇతను తనలాగే ఆలోచిస్తున్నాడనుకుంది. దానిలో ఎంతో నిజాయితీ కూడా వుంది! ఇందులోనుంచి దూరంగా వెళ్ళలేక తనలో వున్న మరో బైరన్ – అదే ఏథెన్సులో – న్యూస్టెడ్‌లో ఒంటరిగాడు. అతని కోసం పరితపిస్తాడు! కానీ ఇవి, కొత్తగా పరిచయమైన తనకు ఎందుకు చెబుతున్నాడు? ఆమెలో ఏదో ఆకర్షణ వుంది. ఆమెలో ఏదో సహజత్వం వుంది. ఆమె శరీర ఛాయలో కొత్తదనం, బుగ్గల్లో గులాబి రంగులున్నాయి. మరీ పొడగరి కాదు, కానీ, ఎత్తుకు సరిపోయిన శరీరం వుంది.

అప్పుడు మూర్‌ను అడుగుతాడు, "ఈమె ఎవరికి తోడుగా వచ్చింది" అని. అబ్బే! అలాంటిదేమీ లేదు. నువ్వు ఈమెను పెళ్ళిచేసుకో. గొప్ప సంపదకు వారసురాలు. న్యూస్టెడ్‌ను బాగుచేయించవచ్చు" అంటాడు.

బైరన్, అనెబెల్లా గురించి కారోతో గొప్పగా మాట్లాడుతాడు, పొగడుతూ. వారిద్దరినీ మధ్యమధ్య పోలుస్తూ చాలా మంచి గుణాలున్నాయి అనికూడా అంటాడు. మెల్‌బోర్న్ భవనంలో ఈ విందులు నృత్యాలు ఆపివేయమంటాడు. అంతే. ఆమె అతని మాట దాటదు. అన్ని విధిగా పాటిస్తుంది. అతనికి పూర్తిగా లొంగిపోతుంది. కారో, బైరన్‌కు ఎంతో ధైర్యంగా ప్రేమలేఖలు రాస్తుంది. "నీ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి వున్నాను. నా ప్రేమ, నేను, నా నగలు అన్నీ నీవే" అంటూ ముగిస్తుంది.

అతను, ఆమెను అంత తొందరగా అంగీకరించలేదు. కానీ అతని అంతరాంతరాల్లో ఇంకా మేరీ చావర్తు విషాదం తొలుస్తూనే వుంది.

అతని సిద్ధాంతం ప్రకారం, తనను తాను సమర్పించుకోని స్త్రీ – ప్రేమకు అర్హురాలు ఎలా అవుతుంది? అంతేకాదు, అతను వెంటబడే రకం కూడా కాదు. అలా వెంటబడటం మంచిది కాదు కూడా! కానీ, ఆమె దారిలోనే వుంటాడు. మరో వారం రోజుల్లో ఆమె, అతని ప్రక్కలోకి చేరుతుంది!

ఆమెను చాలా మామూలుగా అనావేశంగా దగ్గరకు తీస్తాడు. ఒకప్రక్క ద్వేషంతోనే ఆమెతో శృంగారం సాగిస్తాడు. ఎటువంటి భ్రమలు లేకుండానే, ప్రియురాలిని ఉంపుడుగత్తెలాగానే చూస్తాడు.

"ఎటువంటి దయ–కరుణ లేదు. కానీ ఇది నిజమేకదా! ఇది ప్రేమ కాదుకదా – కానీ ఇంతటి సుముఖురాలు, శృంగార దేవతను ఎప్పుడూ చూడలేదే. అంతేనా, మేధోపరంగా కూడా – కానీ ఇన్ని మంచి లక్షణాలు! కొద్దిగా నైతికత కూడా వుంటే?! నీ హృదయం ఓ కారో, అది ఒక అగ్నిగుండం. నీ రక్తనాళాల్లో లావా ప్రవహిస్తోంది. నిన్ను ఎప్పుడూ ఎంతో తెలివిగల, అనుకూలమైన, అసంగతమైన, అసంబద్ధమైన, క్లిష్టమైన, ప్రమాదకరమైన, చాలా అద్భుతమైన ప్రాణిగా భావిస్తున్నాను.

"నీ అందాన్ని గురించి మాట్లాడను. దగ్గరయిన కొలదీ అందాలు మారిపోతాయి! నీవు అంతకంటే గొప్పదానివే!" అంటాడు.

"నేను అంత అందంగా లేనా, నన్ను నువ్వు ప్రేమించవు" అంటుంది.

ఇతరులకు అద్భుతంగా తోచే ఆమెలో, ఎన్నో గుణాలు బైరన్‌కు నచ్చవు.

ఆమె ఆలోచనలన్నీ (పుస్తకాలతో – రచనలతో) మంటలు రేపుతుంటాయి.

తన ప్రేమ వ్యవహారం ఒక రమణీయ కావ్యం కావాలని తపిస్తుంది.

ఈ కవిని, కవుల గురించి మాట్లాడితే, కవిత్వం గురించి చర్చిస్తే, తనదగ్గర పడివుంటాడని అనుకుంటుంది – ఆశిస్తుంది!

అతను నిర్లక్ష్యంగా, తన ప్రియురాలు, గ్రీకు, లాటిన్ కవుల గురించి మాట్లాడటం వింటాడు.

అతని ఆలోచనలన్నీ తన చిన్ననాటి వేగుచుక్క – ఆన్స్ లే చావర్తువైపు – తను విచ్చలవిడిగా తిరిగిన తూర్పు తీరాల తారలవైపు మళ్ళిపోతుంది.

అతను ఒక్కరోజు రాకపోతే, తన చుట్టూవున్న అనేక సేవకుల్లో మెరికల్లాంటి వారిని, పంపిస్తుంది. ఒక్కోసారి ఆమె మారువేషంలో ఉత్తరం తీసుకు వెళ్తుంది.

బైరన్‌కు ఇలాంటివి అసహ్యం. ఆమె తన బండివాడితో దగ్గరవుతుంది. ఫ్లెచర్‌తో అతనికి ఉత్తరం పంపుతుంది, రాత్రికి తలుపు తీసి వుంచమని! బైరన్

హాజరయ్యే విందుకు, తనకాహ్వానం లేకపోతే సిగ్గు విడిచి, అతనికోసం వీధిలో నిలబడుతుంది.

డావన్ షైర్ జమీందారిణి, లార్డ్ విలియంకు రాస్తుంది – "నీ భార్య అన్నిరకాల అఘాయిత్యాలు చేస్తున్నది, బైరన్‌తో, బైరన్ కోసం. అతను తొందరలోనే నాక్సోస్ దీవులకు వెళ్ళిపోతున్నాడు. లండన్‌లోని భర్తలంతా ప్రశాంతంగా నిద్రపోవచ్చు..." అని.

కారో ఆరాధన బైరన్‌ను కదిలించి వుండాల్సింది. కానీ అతన్ని ఇబ్బంది పెడుతుంది. తనని నవ్వులపాలు చేస్తుందని అనుమానిస్తాడు. అంతకంటే అతనిలోని స్కాట్ మత పెంపకం, ఈ సంబంధం అక్రమమని గొణుగుతుంటుంది.

"నెపోలియన్‌లాగా నాకూ ఆడవారంటే అసహ్యం. ఈ అభిప్రాయం, ఏదో తొందర్లో హఠాత్తుగా వచ్చింది కాదు. నా స్వీయ అనుభవఘాతాలతో ఏర్పడింది. నా కవితలు, వారిని ఉన్నతంగా చూపవచ్చు. అలాగే నా ఊహలో వారికి సౌందర్య చిహ్నాలుగా స్థానం ఇవ్వవచ్చు. నేను ఒక చిత్రకారుడుగా వారి అందాన్ని చూపుతాను. ఈ విధంగా ఉండాలి – ఉంటే బాగుంటుందని – వారు ఈ సమాజంలో ఒక అసహజమైన స్థితిలో వున్నారు – వుంటున్నారు!

తుర్కులు, తూర్పుదేశాల ప్రజల ఆడవారి విషయంలో ఎంత చక్కగా సమర్థించుకుంటున్నారు. వారిని ఇంటిపట్టునే వుంచుతారు. అక్కడే వారు సంతోషంగా వుంటున్నారు. ఆడవారికి అద్దం – కొన్ని తీపి పదార్థాలు ఇవ్వండి. వారు ఎంతో తృప్తిగా వుంటారు" అంటాడు!

ఇక్కడ విషయం, కారో భర్త తుర్కు కాదు. అతని జర్నలులో కాగితాలు కన్నీటితో తడుస్తున్నాయి. "వివాహంతో ఏదీ స్థిరం కాదు. ఆడవారి అభిప్రాయాలు ఎగసి పడుతుంటాయి. మారిపోతుంటాయి. ప్రపంచంలో వారు చదివేవి వినేవి వారిని ప్రభావితం చేస్తుంటాయి. అవి చిన్నవైనా, పెద్దవైనా, వివాహం నిన్ను బలహీనుణ్ణి చేస్తుంది సమాజంలో!! రక్షణలో వుండమంటుంది!" అని విలియం రాసుకుంటాడు! ఈ సమయంలో లేడీ కారో తల్లి లేడీ బస్‌బరో చాలా ఆందోళనపడింది. తన కూతురి వ్యవహారం, బైరన్‌తో ఆమె అవమానకరమైన

ప్రవర్తన, ఇవన్నీ ఆ తల్లిని అతలాకుతలం చేశాయి. ఆమె బైరన్ స్నేహితుడు 'హాబ్ హౌస్'కు కబురు పంపింది. ఈ రెండు కుటుంబాలను నాశనం చేస్తున్న ఈ వ్యవహారం విషయంలో, కల్పించుకోవాలని అడుగుతోంది. హాబ్ హౌస్ ఎప్పుడూ సిద్ధంగా వుంటాడు. తన స్నేహితునికి హితవు చెప్పటానికి. కానీ ఇది బైరన్ తప్పు అని ఎలా చెప్పగలడు?

నిజానికి బైరన్, కారో తల్లికంటే ఎక్కువ చిరాకుగా వున్నాడు. కారో ప్రవర్తనతో! పైగా ఈ విషయం కారో అత్తగారికి, లేడీ మెల్‌బోర్న్‌కు బాహాటంగా వివరిస్తాడు. ఆమె చాలా స్వతంత్రంగా ఆలోచించే ధీరమతి. బైరన్‌తో అన్నీ – తన కోడలు ఎలా పిచ్చిదైపోతున్నదో మాట్లాడటానికి వెనుకాడదు.

బైరన్, మూర్‌తో, హాబ్ హౌస్‌తో ఎక్కువ సమయం గడుపుతుంటాడు.

అనబెల్లాతో మతపరమైన ప్రసంగాలు వినటానికే వెళుతుంటాడు. ఆమె లండన్‌లో వున్న సమయంలో ఎక్కువగా, ఈ మత సిద్ధాంత సదస్సులకే వెళ్తుంది. చివరిగా 'ఈ ప్రపంచం ఎటుపోతోంది' అనే సెమినార్లో పాల్గొని, ఎంతో శ్రద్ధగా వివరాలు రాసుకుంటుంది. ఇది చూసిన బైరన్ ఆశ్చర్యపోతాడు. దీనిలో ఇంత విజ్ఞాన శాస్త్రం వుందా? అని. తర్వాత, లేడీ మెల్‌బోర్న్‌తో అంటాడు కూడా. "అనబెల్లా పెద్ద గణిత శాస్త్రజ్ఞురాలుగా వుందే?" అని. అతనికి అనబెల్లా అంటే ఒకరకమైన 'గౌరవం' ఏర్పడుతుంది. ఏది ఏమయినా, ఈ దృఢమైన 'అనబెల్లా' 'ఈ భూగోళపు భవిష్యత్తును' చర్చించగల దృఢచిత్తురాలు. ఖచ్చితంగా నైతికురాలే' అనుకుంటాడు.

అనెబెల్లా అడిగితే, కారో, తన కజిన్ రాసిన కవితలు కొన్ని బైరన్‌కు పంపుతుంది. అవి చదివి, "అన్నా ప్రత్యేకమైన యువతి. ఆ అమాయిక ముఖం వెనుక ఇంతటి ఊహాశక్తి వుండటం గొప్పగా వుంది!" అంటాడు.

అన్నా, ఈ ప్రశంస వింటుంది. ఆమెకు తెలియాలనే బైరన్ వుద్దేశ్యం కూడా. ఆమె గురించి, ఆమెకు వివరంగా తెలియటమే, ఆమె ఏకైక లోపం! ఆమె తలిదండ్రులకు ఏకైక సంతానం. ఎంతో గారాబంగా పెంచారు. మంచి విద్యాబుద్ధులు గరిపారు. ఎంతో సంపదకు వారసురాలు కూడా. ఇప్పటికే ఆమెను

ఆరేడుమంది గొప్పింటి బిడ్డలు పెళ్ళిచేసుకోవటానికి సిద్ధంగా వున్నారు. ఆమె కరుణకల ఆడది. కానీ ఎలాంటి అనైతికమైన నడవడిక అంగీకరించదు. హేతుబద్ధంగా వ్యవహరించాలని ఆరాటపడుతుంది. ప్రతిభగల గణితశాస్త్రవేత్తలా. ఖచ్చితమైన విజ్ఞానం కోసం తాపత్రయపడుతుంది.

కారొలైన్ చెప్పుకునే గొప్పలు, పైపై పాండిత్యం చాలా అల్పమైనదే అన్నా దృష్టిలో. పైగా ఆమె అమాయకురాలిగా కనపడాలనుకోవటం ఎంత చిరాకు పుట్టిస్తుంది?! ఇప్పుడు బైరన్ పిచ్చిలో ఆమె మూర్ఖత్వం తారాస్థాయికి చేరింది. తాను ప్రపంచాన్ని లెక్కచేయననుకుంటే, అదే ప్రపంచం, ఆమెను వదిలిపెడుతుందా? పైగా ఆమె అనైతికతను హేతుబద్ధమైన దారిలోకి తీసుకురాకుండా వూరుకుంటుందా?

ఇవీ అన్నా ఆలోచనలు, కారో పట్ల! అయితే అన్నా బెల్లా తన హేతువాద ప్రక్రియను బాహాటంగానే ప్రదర్శిస్తుంది. "మీ అన్నాను అర్థం చేసుకోవటం, కష్టం!" డావన్‌షోర్ జమీందారిణి – తన కుమారునికి రాస్తుంది. అతనే అన్నాను ప్రేమిస్తున్నాడు, "ఇష్టమో కాదో, కాస్త దాక్షిణ్యంకలదే, కానీ పేదరికం అంటే భయం. ఆమెను సరిగా తూకంవేయటం నా వల్ల కాదు. ఎందుకు కష్టాలు కొనితెచ్చుకుంటావు? నా దృష్టిలో ఆమె మంచుగడ్డ!"

కానీ అన్నా మంచుముక్క కాదు. చిన్నతనంలో బైరన్‌లాగానే ఆమె ప్రేమకథలు ఆమెకున్నాయి! ఆమెకు డైరీలు రాయటం అలవాటే. పైగా సాహిత్యమంటే మక్కువ కూడా. తన పుస్తకాల్లో తనే హీరోయిన్, కథానాయిక! ఎన్నో సాహస క్రియలు చేస్తుంది. ప్లేగ్ రోగులకు సేవ చేస్తుంది. ఆమెలోగల కాఠిన్యాన్ని అంతా ఆధ్యాత్మిక ఆలోచనలతో అణచివేస్తుంది. "ఇంత సామర్థ్యం కలది, బైరన్‌ను లెక్కచేస్తుందా? కానీ కవిగా అతన్ని గౌరవిస్తుంది. అతను ఆమెను భార్యగానే చూడగలడు"

ఇదీ విషయం!

నిజానికి అతన్ని కవిగానే ఆరాధిస్తుందా? దీనినీ మనం అనుమానించాలి. తన కజిన్ పరిస్థితి అదే బైరన్ పిచ్చిలోపడి అపఖ్యాతి పాలయింది కదా. "అతను జరిగిన పాపానికి చాలా విచారిస్తున్నాడు. కానీ మరొకరి సాయం లేకుండా అతనికి నిష్కృతి ఏది?" అనుకుంటుంది.

'నేను నేలపాలయిన గంధర్వుణ్ణి!' అని బైరన్ తన గురించి చెప్పుకున్నది ఆమెకు బాగా నచ్చింది. తన నమ్మకాలతో, తన సాయంతో, ఈ భూమిపాలయిన అందమయిన గంధర్వుణ్ణి రక్షించలేదా? తనతో, అతను చాలా సాధారణంగానే వుంటాడుగదా. మంచి నడవడికతోనే మసలుకుంటాడుకదా! కానీ అతనిలో శౌర్య సాహసాల కోసం తాపత్రయం వుంది. ముఖ్యంగా ఆడవారితో వున్నప్పుడు ఒకరకంగా, మగవారి సాంగత్యంలో మరోరకంగా ప్రవర్తిస్తాడు.

నిజానికి ఇప్పుడు అన్నా ఇజబెల్లా మిల్‌బాంకీ, బైరన్ గురించి అతని రక్షించాలని ఎక్కువగా ఆలోచనలోపడింది. ఇది ఆమెకు మేలు చేస్తుందా? కనీసం ఈ భూమిమీద?

ఆగస్టు 1812. కారోలైన్ ఎప్పుడూ దుబారా మనిషే. ఇప్పుడు మరీ భరించలేనంతగా, ఆమె ప్రవర్తన పుట్టినింటికీ మెట్టినింటికీ తలనొప్పిగా తయారయింది. అంతే వియ్యపురాళ్ళిద్దరూ దీనిని ఖండించారు, ఏకమై పైగా కారో, మామగారితో పేచీపడి, కనీసం సరిగా దుస్తులు వేసుకోకుండా ఇల్లు విడిచి వెళ్ళిపోయింది!

అమ్మ – అత్త ఆమె బైరన్ దగ్గరకే వెళ్ళిందని అనుకుంటూ, పాపం! అతని దగ్గరకే పరుగుపెడతారు. వారు తనని ఇలా ప్రార్థించటం – "బాబూ కారోను వదలిపెట్టు" అంటూ అతనికి ఈ ఆడజాతి మొత్తంమీద కక్ష సాధించినట్లే ననుకుంటాడు. నిజానికి కారో అతని దగ్గరకు పోలేదు. చివరికి వెదికి కెన్సింగ్‌టన్ డాక్టరు దగ్గర పట్టుకుని బలవంతంగా మెల్‌బోర్న్ భవనానికి తీసుకుపోతారు. అమ్మకు మరోసారి గుండెపోటు వస్తుంది ఈ వత్తిడితో.

ఈ వార్త లండన్ అంతా చక్కర్లు కొడుతుంది. యువరాజు రీజెంట్ (Prince Regent) దృష్టిలో పడి ఆయన కబురుపెడతాడు, కారో అమ్మకోసం. అంతే ఇప్పుడు అమ్మ, అత్త, భర్త, చివరకు ఆమె ప్రేమకు అందరూ కారోని లండన్ వదిలి వెళ్ళిపొమ్మని ప్రాథేయపడుతున్నారు.

బైరన్ ఇక తనను చూడవద్దంటాడు. ఆమె అతనికి వుత్తరం రాస్తుంది.

"నీకోసం ఏ వీధిలో నిలబడను – ఏ వర్షంలో తడవను? అరె! ఎంత పాలిపోయావు – పాలరాతి విగ్రహంలా – నీ జుత్తు, కనుబొమలు, నీ వంటి ఛాయకు ఎంత వ్యతిరేకంగా/విరుద్ధంగా వున్నాయి! ఎవరైనా/ఏ శిల్పి అయినా ఇప్పటి నీ ముఖబింబాన్ని అలాగే శిల్పిస్తే, అతనికి నా దగ్గరున్నదంతా ఇచ్చివేస్తాను."

ఆహా! ఎలాంటి వుత్తరం!

కానీ ఇలాంటివి ఎవరికోసం ఉద్దేశించినవో వారిని ఎలా కదిలిస్తాయి?

చివరికి లండన్ వదిలి వెళ్ళటానికి అంగీకరిస్తుంది. తల్లితో పాటు ఐర్లెండు వెళ్ళిపోతుంది కూడా. కాని కేవలం జీవచ్ఛవంలా తయారవుతుంది. ఈ సంఘటన బైరన్‌కు గొప్ప ఉపశమనం కలిగిస్తుంది. లేడీ మెల్‌బోర్న్‌కు రాస్తాడు ."చివరికి ఇది మీకు ఆనందాన్నిచ్చిందనుకుంటాను. మీ దుఃఖాన్ని సముద్రం (విడదీస్తోందిప్పుడు) దాటించి పంపగలిగారు. నా వంతు నేను, దీనికి దూరంగా వుండటమేకాదు, మళ్ళీ తిరగతోడను. అంటే మరెవరినో ప్రేమిస్తున్నానని కాదు. అసలు ప్రేమ నా దారిలో లేదు. నేనీ మూర్ఖత్వంలో అలసిపోయాను. ఎంత సమయం వృథా అయిపోయింది! నా ప్రణాళికలన్నీ తారుమారయిపోయాయి. ఇప్పుడే కనువిప్పు కలిగింది.

ఈ ప్రేమ వ్యవహారం నీళ్ళలో ఈదడంలాంటిది. అంత భౌతికంగా వుండాలి!

నీటిలో ఈదటం, శృంగారం, ఇవి రెండూ నాకు చాలా ఇష్టమైనవి. ఈదాలంటే నీళ్ళలో దూకాలికదా! అలాగే శృంగారం కూడా కోరుకుంటేనే ముఖ్యంగా అవతలివారు" అంటూ ముగించాడు.

నిజానికి ఆమె, అతన్ని వదలిపెట్టిందా అతని ప్రియురాలు? ప్రమాదకరమైన ఉత్తరాలు రాస్తోంది. "కేవలం ఎనిమిది గినీలు చాలు నిన్ను చేరటానికి!" ఆమె స్నేహంతో అతనికి సుఖంలేదు. ఇప్పుడు అపకీర్తిని కూడా మోయాలి. ఆమె కోసం కవిత్వం రాయటానికి సిద్ధమవుతాడు. ఆమె తనవైపు రాకుండావుంటే – ఇక్కడే లేడీ మెల్‌బోర్న్ ఆలోచనలు వీరిద్దరి వ్యవహారం, ఎంతో సంయమనంతో

తీసుకుంది. 'దయచేసి ఆమెను ఎటువంటి కఠినమైన – నిర్దాక్షిణ్యమైన మాటలతో గాయపరచకు. అలా అని నిన్ను ఏ త్యాగం చేయమని అడుగను. దానివల్ల ఇద్దరికీ దుఃఖమే కలుగుతుంది. గాయానికి మందు వేస్తే నొప్పి కలగవచ్చు. కానీ గాయం మానుతుంది కదా. ఇప్పుడు కారోకి ఇలాంటి చికిత్స కావాలి. కాస్త బాధగా వున్నా, పూర్తిగా నాశనం కాకుండా రక్షించాలి. కారో మరీ అంత అమాయకురాలు కాదు. అంతా నీవే. నీ ప్రణాళికే అనుకోదు. కొన్నాళ్ళకు మరో సరదా కోసం ప్రయత్నించవచ్చు.

నీవు పెళ్ళి చేసుకో – అది నీకూ ఎంతో మేలు చేస్తుంది. ఆమెనూ రక్షిస్తుంది!

ఈ రొచ్చులో నుంచి బైటపడవచ్చు." ఇదీ ఆమె సలహా!

పెళ్ళి! అవును. ఇది బైరన్ ఆలోచనలకు అనువుగానే వుంది! పైగా బైరన్ వివాహ వ్యవస్థను విశ్వసిస్తాడు! అదే అతని ఆఖరి భ్రమ!

ఈ బైరన్ – యువ పరిశోధకుడు. తాగాలి, జూదమాడాలి, ప్రక్కవాడి పెళ్ళాంతో సరసాలాడాలి. ఇలాంటి సాహసాలు చేసిన తర్వాత ధనికురాలిని పెళ్ళి చేసుకోవాలి. ఆమెను ప్రేమించాల్సిన పనిలేదు. తనకు వారసుల్ని ఇవ్వగలిగితే చాలు. అదికదా సంప్రదాయం. అదికదా న్యూస్టెడ్ సూత్రం!

ఈ సందర్భంలోనే అతను లేడీ మెల్‌బోర్న్‌కు తన మనసులోని మాట చెబుతాడు. ఎవరో కాదు, నీ కోడలికి చెల్లెలి వరస, అనబెల్లాను చేసుకుంటానని!

మామూలుగా లేడీ మెల్‌బోర్న్‌కు ఏ విషయమూ ఆశ్చర్యం కలిగించదు. కానీ ఇప్పుడు బైరన్ చెప్పిన విషయం ఆమెను ఆశ్చర్యంలో ముంచింది.

అరె! ఇంతకంటే వింత జంట ఒక ప్రక్క గణిత శాస్త్రజ్ఞురాలు, మరో ప్రక్క కవి 'చైల్డ్ హెరాల్డ్' గ్రంథకర్త ఎలాంటి జంట!

బైరన్‌కు కావలసింది ఇలాంటి 'వ్యతిరేక'త ప్రత్యేకం! ఈ విరుద్ధ లక్షణాలు అతన్ని ఉత్తేజపరుస్తాయి.

ఇప్పటివరకు అతన్ని దగ్గరకు, దగ్గరగా రానివ్వని యువతి, ఆమేకదా! "ఆమె గురించి నాకెక్కువగా తెలియదు. పైగా నాకు అంత మంచి పేరు వారి

మధ్య లేదుకూడా. కానీ అలాంటి యువతిని గౌరవిస్తాను. మీ కుటుంబంతో సంబంధం కూడా నాకు చాలా ముఖ్యమయినదే!" అంటాడు. ఈ విషయం లేడీ మెల్‌బోర్న్, తన మేనకోడలికి తెలియజేస్తూ "అతను త్వరగా మారిపోతాడు. మన జాగ్రత్తలో మనం వుండాలికదా" అని.

బైరన్‌కు "నీవు ఇద్దర్నీ ఎలా సంబాళిస్తావు – అసంభవం. ఒక స్నేహితుడుగా ఎలాగైనా వుండు. ముందు ఒకరి నుంచి బైటపడేవరకూ, రెండో వారితో పెళ్ళి ప్రసక్తి వద్దు" అని సలహా ఇస్తుంది.

"మీరన్నది నిజమే. నేను సిద్ధంగా వున్నానా? ఏమో కానీ మీమీద నమ్మకం వుంది. మీ అనుభవం మీద నమ్మకం వుంది. పెళ్ళికి కావలసింది నమ్మకమే. ప్రేమ ఒక వారం రోజుల్లో పుడుతుంది, అవతలవారు సహకరిస్తే. పెళ్ళి, సమాజంలో గౌరవాన్ని, విశ్వాసాన్ని కలిగిస్తుంది. దానిలో ప్రేమాయణం పాలు తక్కువైనా, ఇక అందచందాలా? చూడటానికి రమణీయంగా వుంటే చాలు. మరీ ఎక్కువ సౌందర్యం అడ్డమైన వాళ్ళనూ ఆకర్షిస్తుంది" అంటాడు.

ప్రేమకు ప్రాధాన్యం లేని ఈ పెళ్ళి వ్యవహారాన్ని అనబెల్లాకు తెలియజేయ మంటాడు. ఆమె తలిదండ్రులకు ముఖ్యంగా! ప్రస్తుతం బైరన్ దృష్టిలో ముగ్గురు లేక నలుగురున్నారు పెళ్ళికి.

ఒకరు ఇటాలియన్ పాటగత్తె. ఆమె భర్తతోనే వుంటుంది.

రెండు ఒక డచ్ విధవరాలు. ఈ సంబంధం ఫ్లెచర్ తెస్తాడు.

మూడు అనబెల్లా – మిల్ బాంకీ.

నాలుగు కారోలైన్!

ఎవరిని చేసుకోవాలి – అది తన తలరాత నిర్ణయిస్తుంది. లేక, లేడీ మెల్‌బోర్న్ నిర్ణయిస్తుంది అనుకుంటాడు. నిజానికి అతను లేడీ మెల్‌బోర్న్ మీదే ఎక్కువ భారంపెట్టాడు. ఇలాంటి తిరుగుబోతు, నిండా పాతికేళ్ళు లేని 'డాన్ వాన్' లాంటి హీరోకి పెళ్ళి, అదీ తన మేనకోడలితో–

తనెంతో పవిత్రంగా చూసే వివాహ తంతు ఇతనికి ఒక ఆటమాత్రమేనా – కానీ ఆమె హృదయాన్ని ఎప్పుడో తాకాడు. 'ఇప్పుడున్న ఈ ఆడవారందరికంటే మీరే చాలా కోరుకోదగనివారని' అన్నప్పుడే! ఈ యువకుడు చాలా కావలసినవాడు అనుకుంది.

'అనబెల్లాకు ఈ వివాహం మేలే చేస్తుంది'

'ఆమెలో వున్న అపనమ్మకాలను పారద్రోలకలదు'

'ఆమె కళ్ళల్లో వెలుగు నింపగలదు'

ఇలా అనుకుంటూ ఇక తన ప్రయత్నం మొదలుపెడుతుంది.

ఇక అన్నా బెల్లా బైరన్‌ను మరచిపోలేదు. అతన్ని పాపకూపంలోంచి రక్షించాలని కంకణం కట్టుకున్నట్లు ఊహించుకుంటుంది.

అప్పుడే కారో వ్యవహారం పాకానపడి, ఇక ఇతన్ని రక్షించటం తన వల్ల కాదనుకుంటుంది. ఆ సమయంలోనే తన తల్లిదండ్రుల చెంతకు తిరిగి వస్తుంది. అక్కడ సముద్రం, ఆకాశం ఆమెకు ఎతో సాంత్వన కూరుస్తాయి.

ఈ అసాధ్యాల మధ్య నడవటం ఎంతో ఆనందదాయకంగా వుంటుంది.

ఈ ప్రపంచంలో బైరన్‌కు నిర్లక్ష్యం, మానవ దుఃఖం మాత్రమే కనపడితే ఆమెకు ప్రతి అణువులోను దేవుని కరుణే కనిపిస్తుంది.

ఈ సందర్భంలోనే ఆమె 'బైరన్'ను తన పదాలతో చిత్రించటానికి ప్రయత్నిస్తుంది.

"అతని అభిరుచులే చిన్నప్పటినుంచీ అతన్ని నడిపిస్తున్నాయి. అంతరాంతరాల్లో అతని క్రిష్టియన్ మత నమ్మకాలు దాగివున్నాయి. (నాకు లేని మంచి గుణాలను, ప్రేమిస్తాను) రహస్యంగా అతనికి మానవోద్రేకాలంటే చాలా అసూయ. ఇలాంటి అసహజమైన గర్వంతో తన గొప్ప లక్షణాలన్నీ మరుగున పడిపోతున్నాయి.

అతని కోపం, అతని ఆలోచనలను అణచివేస్తుంటుంది. అతని గుణాలన్నీ కాపట్యాన్ని సంతరించుకుంటాయి. అందులో నుంచి ద్వేషం ధిక్కారం జనిస్తుంది.

అతను, మంచివారనుకున్న వారి ముందు హృదయాన్ని విప్పి చెప్పగలడు. అతను గౌరవించే వారి ముందు, ఎంతో అణకువతో వుండగలదు. వారితోనే తన తప్పిదాలను చెప్పుకోగలడు".

ఈ బైరన్ గౌరవించే వ్యక్తుల్లో తనే వున్నాననుకుంటుంది. అందుకే ఒక రకంగా అతన్ని ఆరాధించటానికి వెనుకాడదు. ఆకర్షణలోని ప్రమాదాన్ని గుర్తించింది!

ఈ లేడీ మెల్‌బోర్న్ రాయబారం ఒకరకంగా బెడిసికొడుతుంది. ఎందుకంటే లేడీ మెల్‌బోర్న్‌పట్ల అనా బెల్లాకు అంత సదభిప్రాయం లేదు. అందుకనే ఆమెకు సమాధానం పంపిస్తుంది.

"ఇప్పుడు నిజం చెప్పకపోతే, నేను బైరన్‌కు ద్రోహం చేసినట్లే.

నాకు సంసారపరంగా అతను, ఆనందాన్నిస్తాడని అనుకోను. ఇప్పటి అతని ఆలోచనలు పరిగణనలోనికి తీసుకుంటే, అతనికి ఆ ఉద్దేశ్యం ఉన్నట్లుగా లేదు. మీరు ఇంతగా అతనిపట్ల పక్షపాతం చూపించటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇది నా ఆలోచనలకు భిన్నంగా వుంది.

అతని ప్రతిపాదనను నేను తిరస్కరిస్తున్నానని చెప్పవచ్చు. ఈ విధంగా బాధ కలిగించటం నాకూ విచారంగానే ఉంది! భవిష్యత్తులో ఏమి జరుగుతుందో అది, అతని విజ్ఞతకే వదిలివేస్తున్నాను."

ఆమె ఎందుకు నిరాకరించింది? అతన్ని ప్రేమించలేకనే.

ఇది మన హీరోకు ఒక సరికొత్త అనుభవం!

XVII

లుక్రిటియస్ దేవతలు

(1812-1815)

మొదటి అభిరుచితో ఆడది ప్రేమికుణ్ణి ప్రేమిస్తుంది
ఆ తరవాత ఆమె ప్రేమించేది ప్రేమభావాన్నే
ఇది అలవాటుగా వ్యసనంగా మారి బైటపడలేదు
వదులైన చేతి తొడుగులా ఆమెకు నప్పదుకూడా

–బైరన్

ఒకప్పుడు తనతోపాటే న్యూస్టెడ్ భవిష్యత్ అనుకునేవాడు. ఆ ఆలోచన ఎప్పుడో వదిలివేశాడు. ఇప్పుడు అతని అప్పులు పాతికవేల పౌండ్లు దాటిపోయాయి. సెప్టెంబరులో 1812 – తన ఎస్టేటును అమ్మకానికి పెట్టాడు. తనకు నమ్మకస్తుడు హాబ్ హౌస్‌ను ఈ బేరం చూడటానికి పంపాడు. హాన్సన్ వుండనే వున్నాడు. లక్షా పదమూడు వేల పౌండ్ల వరకూ లాగారు – ఆ పైన మరో పదమూడువేలు తన అమ్మ తాలూకు ఆస్థి! అరె! ఇది బాగానే వుందే అనుకున్నాడు. ఎందుకంటే అప్పుడు అతని చేతిలో కేవలం ఇరవయి ఒక్క షిల్లింగుల ఆరు పెన్నీలు మాత్రం ఉన్నాయి! చివరికి మిస్టరు క్లాటర్ అనే పెద్దమనిషి లక్షా నలభై వేల పౌండ్లకు బేరం కుదుర్చుకుని పాతిక వేలు బయానా కూడా ఇచ్చాడు.

"నాకోసం ఒక స్నానాల తొట్టి, ఒక ఖజానా గది కట్టించాను!

"ఇప్పుడు న్యూస్టెడ్ అమ్మేశాము. ఇక ఇక్కడ నన్ను పూడ్చిపెట్టటం, నా సమాధి కట్టటం కూడా వీలుపడదు కదా!" అని విచారిస్తాడు!

ఈ బేరం పూర్తయితే బైరన్‌కు చాలా ధనం వచ్చిపడేది. కానీ మిస్టర్ క్లాటర్ ఇది తన తలకు మించిన పనిగా తెలుసుకోవటానికి ఎక్కువ రోజులు పట్టలేదు. తెలివైన హాన్సన్, బయానాగా వచ్చిన పాతిక వేల పౌండ్లు తిరిగి ఇవ్వవలసిన అవసరం లేకుండా చేయటంతో, బైరన్‌కు కొంత ఊరట!

అక్టోబరు నెలలో అతనికి కొత్తగా పరిచయమైన స్నేహితులు ఆహ్వానం పంపుతారు, తమతో కొన్ని వారాలు గడిపేందుకు. ఆ సందర్భంగా ముందుగా లేడీ జెర్సీ, ఆక్స్‌ఫర్డ్ కుటుంబాలతో వుంటాడు. లేడీ జెర్సీ చాలా సొగసైన నాగరీక సుందరి! కేవలం తీరికలేక పవిత్రంగా వుండిపోయింది! ఎక్కడ ఎలాంటి మిత్రులతో వున్నా చాలా ఉత్సాహంగా అక్కడ ఉత్తేజాన్ని నింపగలదు. చూడటానికి ఎంతో సౌందర్యవతి. నల్లని వత్తైన జుత్తు, పాలమీగడలాంటి శరీరం, లేత గులాబీరంగు ముత్యాలహారం, ఆమెలో ఎలాంటి లోపాన్ని కనిపెట్టలేం. కాస్త బొద్దుతనం తప్ప!

ఎన్నో సందర్భాలలో, ఎన్నోసార్లు, ఎన్నోచోట్ల ప్రత్యక్షమయ్యింది. బైరన్ అంటాడు – “మీరు మరీ అంతగా చేతులు తిప్పుతూ మాట్లాడకపోతే, మరింత అందంగా వుంటారు” అని హెచ్చరిస్తాడు! ఆమె మాట్లాడుతుంటే కళ్ళు, చేతులు, నాలుక, నోరు, పెదవులు అన్నీ కదులుతుంటాయి, ఎక్కువగా! ఆ విధంగా అతను ఆ వారం ‘పవిత్రం’గా వుండిపోవలసి వచ్చింది.

తర్వాత ఆక్స్‌ఫర్డు కుటుంబంతో గడపటానికి వెళ్తాడు. లేడీ ఆక్స్‌ఫర్డును లండన్‌లో కలుస్తాడు మొదటగా. ఇప్పుడు ఆమె ఎస్టేటుకు వస్తాడు. లేడీ కారో ఉపద్రవం తరువాత అతనికి కాస్త ఊపిరి పీల్చుకోవటానిక వీలు చిక్కింది. “లేడీ ఆక్స్‌ఫర్డ్, ఈమె (పెయింటర్) క్లాడ్‌లోరెన్ (Claude Lorrain) చిత్రించిన పచ్చికబయలు మాదిరి ఉంటుంది. అటు వెనుకగా పొద్దు దిగిపోతుండగా ఆ దృశ్యం మరింత రమణీయంగా వుంటుంది. ఆ ఆరిపోతున్న, అస్తమిస్తున్న బంగారు కిరణాలు ఆ దృశ్యాన్ని మరింత సొగసుగా మారుస్తుంది. లేడీ ఆక్స్‌ఫర్డ్ ఈ యౌవనాంతపు సొగసులు ఆ ఎరుకలో మరింతగా రమణీయంగా వున్నాయి సుమా!”

“స్త్రీకి ఆ మొదటి – చివరి విజయాలే చాలా ముఖ్యమైనవి” అంటాడు బైరన్!

"లేడీ ఆక్స్‌ఫర్డ్ మొదటి శృంగార విజయం, నేను పుట్టక మునుపే లభించింది. కానీ ఈ చివరిది నాకోసం వేచివుందని చెప్పుకోవచ్చు" అంటాడు.

పద్దెనిమిది సంవత్సరాల క్రితం లేడీ ఆక్స్‌ఫర్డ్ ఎడ్వర్టు హార్లేను వివాహం చేసుకుంది. అతను ఆక్స్‌ఫర్డు జమీందారు! అతను మానసికంగా, భౌతికంగా కూడా నిర్వీర్యుడు. ఆయన పూర్వీకుడు ఒక మంచి ఆంగ్ల గ్రంథాలయాన్ని స్థాపించాడు. అందులో ఎన్నో అందమయిన ప్రచురణలను సంకలనపరిచాడు. దానినే Harleian Miscillany అని అంటారు.

అదే పేరు లేడీ ఆక్స్‌ఫర్డ్ సంతానానికి వర్తిస్తుంది. ఎందుకంటే ఆమె సంతానం చాలా రమణీయమైన సంతానం.

వారంతా ఆమె భర్త అందమైన స్నేహితులను పోలివుంటారు.

లేడీ ఆక్స్‌ఫర్డ్‌కి ఈ జీవితంపట్ల ఎటువంటి భ్రమలు లేవు. ఆమె లూక్రిటియస్ చదివింది. ప్రేమభావాలు రోగగ్రస్తమనీ, భౌతిక సుఖాన్ని మించిన మరో ఆనందం లేదని నమ్మింది. ఆమె విశాల నేత్రాలు, ఎప్పుడూ విప్పారి వుంటాయి, ఎటువంటి సుఖాన్నయినా అందిపుచ్చుకునేందుకు! పైగా ఇదంతా, తనకు ఈ భర్తను చేసిన తలిదండ్రుల మీద కక్ష సాధింపు చర్య అని సమర్థించుకుంటుంది కూడా! ఆమెకు ప్రేమపట్ల చక్కని అవగాహన వుంది. ఆమె ఒక ప్రియుడు, 'నీవు నా హృదయాన్ని పగలగొట్టావు' అంటాడు. 'బహుశా అది అజీర్తి లక్షణమై వుంటుంది' అంటుంది!

ఆమే, బైరన్‌ను తన గ్రామీణ ఎస్టేటులోని అతిథి గృహానికి రమ్మంటుంది ఆహ్వానిస్తుంది. ఈవుడ్‌లో! అక్కడే (1812) అక్టోబరు నవంబరు మాసాలు అతను మరో ఆలోచన లేకుండా గడుపుతాడు. ఆ శృంగార దేవత అనుభవం – బైరన్ ప్రేమరాహిత్యం – అతనికి అద్వితీయమైన ఆనందాన్నిస్తాయి!

ఆమె చక్కగా కవిత్వం చదవగలదు – అంతకంటే చక్కగా సంగీతం వినిపించగలదు. ఒకవేళ ఆమె ప్రియుడు తనను వదిలి వెళ్ళిపోతే ఏ మాత్రం విచారించదు!

పాపం! లార్డ్ ఆక్స్‌ఫర్డ్ పగలంతా తన ఎస్టేటు చెట్ల నీడల్లో తిరుగుతుండేవాడు.

బైరన్ తన ప్రియురాలితో లుక్రిటియస్స్ దేవతల్లా సమయం గడిపారు.

"...ఎటువంటి బాదరబందీ లేకుండా, ప్రశాంత వాతావరణంలో, ఎవరితో అవసరం రాకుండా హాయిగా ఇదే శాశ్వతానందంగా గడిచిపోయింది.."

ఆమె గొప్పగా అతన్ని మాయచేసేది. అంతకంటే గొప్పగా లాటిన్ కవిత్వం చదివేది. ఆమెను ఆరాధిస్తున్న ఈ యువకుణ్ణి, ఏ విధంగా అదుపులో పెట్టుకోవాలో ఆమె అనుభవమే నేర్పింది. ఇద్దరు, తమ ఈ 'ఎపిక్యూరియన్' జీవితంలోని హాయిని గర్వంతో అనుభవించారు. ఇప్పటికీ రెండుసార్లు బైరన్ ఎటువంటి ఆందోళనలు లేకుండా ప్రాపంచికంగా విడివడి ఇటువంటి ఆనందాన్ని పొందగలిగాడు. మొదటిది హారోలో తన స్నేహితులతో – రెండవది తూర్పుదేశాల యాత్రలతో!

నిజానికి అతను మానవమాత్రుడే – పైగా, చాలా, అతనికిలాంటి గంధర్వ లోకంలాంటి ఆనందాలు చాలాచాలా నచ్చేవి.

అతని హృదయంలోని ఆటవిక పార్శ్వం, అతని బుద్ధికుశలతను కప్పి అణచివేసేది! లేడీ ఆక్స్‌ఫర్డ్ ప్రౌఢ – శృంగారం, ఆమె ధైర్యం అతన్ని కట్టిపడవేసింది. ఒక్కోసారి అతను ఆశ్చర్యపోయేవాడు, ఈమె జంతు ప్రమాణపు శృంగారం తనను ఏ తీరాలకు తీసుకుపోతుందా అని.

అసలే బద్ధకస్తుడు. ఇప్పుడు ఏ పనీచేయటమూ మానివేశాడు. తన ఇక్కడి చివరి రోజులు, ఆమె అందమైన సంతానంతో అడవిలో నీటిపైన ఆడుకుంటూ, ఆమె ప్రేమికులందర్నీ ఎంతగానో అభినందించాడు.

ఒక సందర్భంలో ఈ లేడీ ఆక్స్‌ఫర్డ్ పెద్ద కూతురు చార్లొట్‌తో ప్రేమలో పడిపోయాడుకూడా! అప్పటికీ ఆమెకు పదకొండు సంవత్సరాలే అయినా, సౌందర్య దేవతగా ఎంతో వయసున్న దానిలా కనిపించేది. ఆమెకోసం చైల్డ్ హెరాల్డ్‌లో ఒక పద్యం రాశాడు. ఈ తతంగం అంతా అతనికి ఎంతో సంతృప్తినిచ్చింది. అతని కష్టాలు ప్రాపంచిక అవసరాలు వేలమైళ్ళ దూరంలో వున్నట్లు భావించాడు.

పాగన్ సిద్ధాంతానికి ఇదీ విజయం కదా!

ఈ సమయంలోనే కారో, తన ఓటమిని అంగీకరించకుండా, బైరన్ ఈవుడ్‌లో వున్నాడని తెలిసి అక్కడ ఎందుకుంటున్నాడో అని అసూయతో రగిలిపోతుంది. ఆమెకు లేడీ ఆక్స్‌ఫర్డ్ బాగా తెలుసుకూడా. కొంతకాలం క్రితం వారు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. గ్రీకు జ్ఞానం ఈ శరీర సౌఖ్యాలను పవిత్రం చేస్తుందా లేక మరింతగా రెచ్చగొడుతుందా అని!

లేడీ కారో, దీని విషయంలో ఎటువంటి సందేహం లేదు, ప్రతిరోజు ఉత్తరాలతో దాడిచేసేది. బైరన్‌కుగానీ లేదా ఆక్స్‌ఫర్డ్‌కు గానీ ఉత్తరం రాని రోజు లేదు.

"స్నేహితులారా, బైరన్ నా మీద కోపంతో వున్నాడు. అతనితో చెప్తావా? నేనేమీ కాని పని చేయలేదని? ఇప్పుడు దారుణమైన పరిస్థితిలో వున్నానని – వేలసార్లు క్షమించమని అడుగుతున్నానని – నాకు తెలుసు. అతనికి నేనంటే విసుగుపుట్టింది. ఇక అతనికి రాయను. బాధపెట్టను. అతను క్షమిస్తే చాలు. మళ్ళీ అతని జీవితంలోకి తిరిగి చూడను". ఇలా రాసేది.

లేడీ ఆక్స్‌ఫర్డ్ కనీసం జవాబు కూడా రాయలేదు.

అంతే! వచ్చి వాలిపోతానని బెదిరించింది! ఆమె, భర్త ఆక్స్‌ఫర్డ్‌కు రాస్తానని చచ్చిపోతానని బెదరించింది.

ఈ వుత్తరాలన్ని ప్రేమికులిద్దరూ కలిసి చదివారు, నిరసించారు, అసహ్యంతో.

లూక్రిటియస్ సిద్ధాంత కర్తలకు ఆ వుత్తరాలు చెత్తతో సమానం కదా!

బైరన్, లేడీ మెల్‌బోర్న్‌తో చాలా సఖ్యంగా వుండేవాడు. అతనికి కారో ఏమి చేస్తుందో, ఆమె ద్వారా తెలుస్తుండేవి.

"కారో – తన మీద తనే కక్ష సాధించాలని ఆలోచిస్తోంది. ఈ విషయంలో నేనేమీ చేయలేను!

నేను ప్రేమించటానికి ఎవరూ లేకుండా వుండలేను. ఇప్పుడు నాకు ఎంతో అనుకూలమైన ప్రేమికురాలు దొరికింది. నాకు తెలిసినంత వరకూ నాతో, ఆమెకూ

ఎటువంటి ఇబ్బందీ లేదు. ఇద్దరం అన్యోన్యంగా హాయిగా వున్నాము (పూర్వపు అనుభవంతో పోలిస్తే) చేయవలసింది చాలావుంది. చేయటానికి సమయం లేదు! ఇప్పుడు ఎవరికోసం సమయాన్ని వృధా చేయలేను!

ఆమెతో (కారోతో) సాన్నిహిత్యం నా భవిష్యత్తును నాశనం చేస్తుంది. ఏనాడూ సుఖంగా లేను. అది నా సహజ ప్రవృత్తి. నేనెవరిని ప్రేమిస్తానో నాకే తెలియదు. కానీ ఆమెను మాత్రం ద్వేషిస్తాను. ఇప్పుడు నా మనసు విప్పి మీకు చెప్పాను కదా ఇవే నా చివరి మాటలు. ఆమెతో ఇవన్నీ చెప్పలేను కదా. ఆమెను నొప్పించటం నాకిష్టంలేదు. కానీ నా మానసిక స్థితి ఇది అని, మీకు చెప్పగలను. మిమ్మల్ని ప్రార్థించేది ఆమెను మమ్మల్ని కలవకుండా చూడమనే! నిజంగా కలవవలసి వస్తే అది 'డాంటే నరకంలో గొలుసులతోనే" అని ముగించాడు.

ఇది లేడీ మేల్‌బోర్న్‌కి బాగా నచ్చింది కూడా. తన కోడలి ప్రవర్తనను ఎంతగానో నిరసించింది. కఠినంగా ఖండించింది.

బైరన్‌కు రాసింది – "ఈ రోజే రెండు వుత్తరాలు కారో నుంచి వచ్చాయి. ఒకదానిలో విందులు, వినోదాలు, నృత్యాలు, అసత్యాలు. రెండోదానిలో తన దుఃఖం, నిరాశా, నిస్పృహ! ఏది నిజం – ఆమె త్వరలోనే అన్నీ మరచిపోతుంది. ఆమె ప్రవృత్తి నాకు తెలుసు. త్వరలోనే నిన్ను మరచిపోతుంది" ఇది సారాంశం.

బైరన్ మనసులో ఎక్కడైనా కాస్త సానుభూతి వుంటే దీనితో అదీ మసకేసి పోయింది.

ఆడవారికే కదా – మరో స్త్రీ అసత్యాలు పూర్తిగా అవగాహన అయ్యేది.

దీని తరువాత కారో వుత్తరాలకు బైరన్ ఓర్పుగానే సమాధానం రాశాడు. కానీ కారో తన జాబుల దాడిని, వాటిలో వేడిని తగ్గించలేదు. దానితో విసిగిపోయిన బైరన్, లేడీ ఆక్స్‌ఫర్డ్ సలహామేరకే కావచ్చు ఘాటుగా జవాబు పంపాడు.

"నేను నిన్ను ఇప్పుడు ప్రేమించటంలేదు. ఈ విషయం స్పష్టంగా చెప్పమని నన్ను వేధిస్తున్నావు కాబట్టి వివరిస్తున్నాను. అంతేకాదు, ఇప్పుడు నేను మరొకరి

ప్రేమతో బంధించబడ్డాను. ఆమె పేరు చెప్పటం మర్యాద కాదు. ఇప్పటివరకూ నీవు నాకిచ్చిన మర్యాదకు కృతజ్ఞుణ్ణి. నేను ఎప్పటికీ నీకు, స్నేహితుణ్ని. ఒక్క సలహా, నీ అతిశయం కాస్త తగ్గించుకో. నన్ను ప్రశాంతంగా ఉండనీ. నీ సేవకుడు."

–బైరన్

ఇంత జరిగినా లేడీ కారో బైరన్‌ను వదలలేదు. ఆమె పరిస్థితి చాలా దయనీయంగా వుంది. తన కోటు గుండీల మీద 'క్రీడ్ బైరన్' అని కుట్టించింది. బైరన్ పబ్లిషర్‌కు, బైరన్ సంతకంతో ఉత్తరం రాసి అతని బొమ్మ తెప్పించుకుంది.

ఆ తర్వాత బ్రోకెట్ హాలు దగ్గర పెద్ద తంతు నడిపింది. బైరన్ దిష్టిబొమ్మ తగలపెట్టించింది. ఆ మంటలో అతని పుస్తకాలు అతని వెంట్రుకలు, అతనిచ్చిన వుంగరాలు, అతను రాసిన వుత్తరాల ప్రతులు పడవేసి తగలపెట్టింది. ఆ మంట చుట్టూ తెల్లని బట్టలు వేసి పల్లెటూరు అమ్మాయిలతో నృత్యాలు చేయించింది. అంతేనా ఇదంతా బైరన్‌కు పూసగుచ్చినట్లు తెలియజేసింది.

బైరన్ ఈ విషయం లేడీ మెల్‌బోర్న్‌కు చెప్పుకున్నాడు. "దిష్టిబొమ్మ తగలబెట్టి ఆ మంటలో కాగితాలు, బంగారు గొలుసులు, పూలు అంతేనా అన్ని రకాల మూర్ఖపు..." అని పంపాడు.

ఫిబ్రవరి 1813లో కారో తల్లి లేడీ బస్‌బరో లండన్ వచ్చి బైరన్‌తో మాట్లాడాలని ప్రయత్నించింది. అతని నిర్లక్ష్యానికి అవాక్కయింది. కూతురు ఎన్ని తప్పులు చేసినా తల్లి తన వారసత్వపు ప్రేమతో సహనంతోనే వుంటుంది. ఆమెకు బైరన్‌తో మాట్లాడటమే గగనమైపోయింది. ఎలాగైనా బైరన్‌తో తన కూతురు మాట్లాడాలని పట్టుబట్టింది. దీనికి లేడీ ఆక్స్‌ఫర్డు అడ్డుచెప్పటంతో బైరన్ నిరాకరించాడు. చివరికి విషయం లాంబ్, కారో భర్త కూడా కల్పించుకోవలసి వచ్చింది.

"ఇది నిజంగా హాస్యాస్పదమే. ఆమెతో మాట్లాడితే అతనికి అవమానం, మాట్లాడకపోతే ఆమెకు అవమానం..." అంటాడు బైరన్! లేడీ మెల్‌బోర్న్ –

కల్పించుకుని సాక్షి సమక్షంలో సంభాషించమని సలహా ఇస్తుంది. బైరన్ చివరికి లేడీ ఆక్స్‌ఫర్డ్ సమక్షంలోనే మాట్లాడతానంటాడు!

ఎలాగో జూలై 6, 1813న ఈ కలయిక ఒక విందులో జరిగింది. అప్పుడు లేడీ మెల్‌బోర్న్ కూడా వుంది. చాలామంది లార్డులు, లేడీలు వచ్చారు. ఒక్కసారిగా గుంపు రెండుగా చీలి, బైరన్ రాక తెలియపరచింది. ఆ 'ప్రమాదకరమైన అందగాడు' కుంటుతూ వచ్చాడు! ఎదురుగా కారొలైన్ మండే కళ్ళతో!

అప్పుడే వాల్ట్‌జ్ సంగీతం వినిపిస్తోంది. "ఏమిటి బైరన్? నృత్యం చేయనా?" అని అడుగుతుంది. "ఆఁ ఆందరితోపాటు" అంటాడు. కొంతసేపు అయిన తర్వాత ఆమె తూలిపడబోయింది. దగ్గర్లో వున్న గదిలోకి వెళ్ళింది. అక్కడే విందు ఏర్పాటు చేశారు. ఆమె అక్కడ వున్న చిన్న కత్తి తీసింది. "ఏమిటి రోమన్ నాటకమా? అయితే కానీ, నీ కత్తితో నీ గుండెల్లో పొడుచుకో. ఎందుకంటే నా గుండెల్లో ఎప్పుడో పొడిచావు కదా" అంటాడు.

తర్వాత ఏమి జరిగిందో 'బైరన్' అంటూ అరిచింది. కత్తితో లోపలికి వెళ్ళిపోయింది. కొందరు ఆమె పొడుచుకుంది అన్నారు. మరికొందరు గ్లాసు పగిలి గుచ్చుకుంది అన్నారు. ఏమయినా రక్తంమాత్రం చిందింది. ఈ విషయం తెలిసి బైరన్, 'ఇది మరో ఎత్తు' అని మాత్రం అంటాడు.

ఈ కథంతా మర్నాడు 'సెటైరిస్ట్' అనే జర్నల్‌లో వస్తుంది. "గొప్ప అప్రతిష్ట" సిగ్గుపడవలసిన సంఘటన అంటూ గోలపెట్టింది.

కొన్ని వారాల తర్వాత ఆమె (కారో) బైరన్ ఇంటికే వెళ్ళింది. అప్పుడతను లేడు. అక్కడ బల్లమీద బెక్‌ఫోర్డ్ పుస్తకం 'వాతెక్' వుంటే దానిమీద రాస్తుంది. 'నేను గుర్తున్నానా?' అంటూ.

బైరన్ తిరిగివచ్చిన తర్వాత చూస్తాడు! అక్కడే రాస్తాడు–

గుర్తున్నావు – గుర్తున్నావు!

అవమానం – విచారం – నీతోనే వున్నాయి.

నిన్ను వెన్నాడే కలలాగా–

గుర్తున్నావు - అనుమానించకు-

నీ భర్తకూ గుర్తున్నావు-

నిన్నెవరు మర్చిపోతారు-

అతనికి అబద్ధం నీవు - నాకు దెయ్యానివి!

చివరికి, తనని ప్రేమించినందుకు, బైరన్ ఆమెకు ఇచ్చిన గౌరవం ఇది. ఆమె భర్తను ఎత్తి చూపటం, ఇది అతని వ్యక్తిత్వంలోని విశిష్టమైన లోపమందామా?

నిజానికి అతనికి ఓర్పు నశించిపోయింది. ప్రేమ వ్యవహారాలు ఇంత దారుణంగా ఉంటాయనుకుంటే అసలు ఆడవాళ్ళకే దూరంగా వుండాలి. ఎవరైతే అతన్ని అలరిస్తారో వారే అతన్ని కష్టాలపాలు చేస్తున్నారు. ఆమె స్వతంత్రంగానే ఉంది. ఎప్పుడూ స్థిరంగా లేదు. లేడీ ఆక్స్‌ఫర్డ్ మాత్రం అతనికి స్నేహితురాలే! కానీ త్వరలోనే ఆమెకు మరో స్నేహితుడు దగ్గరవుతాడు. బైరన్‌ను చాలా నిజాయితీగా ప్రక్కనపెట్టింది! ఆమె ద్వారానే అతనికి నిజాలు తెలుస్తున్నాయి. ఆమెకు దూరమవటం అతనికి కష్టంగానే వుంది.

నీవు అబద్ధం కాదు - కాని చంచలం!

నిన్ను కోరుకున్నవారికి

కన్నీరే మిగులుస్తావు.

ఎంత తొందరగా ప్రేమిస్తావో

అంత అవసరంగా వదిలివేస్తావు.

అవును అబద్ధం కాదు - నీవు చంచలం!

అందరూ కలిసి సి సి లీ వెళ్ళాలని ప్రణాళిక వేస్తారు. కానీ లార్డ్ ఆక్స్‌ఫర్డ్ హఠాత్తుగా నిద్ర మేల్కొన్నట్లు, కేవలం వారి కుటుంబం మాత్రమే ఈ ప్రయాణానికి సిద్ధం చేస్తాడు.

తెలివిగల లేడీ ఆక్స్‌ఫర్డ్ అందర్నీ ప్రక్కన పెట్టి, భర్త సంతానంతో నౌక ఎక్కటానికి ప్రయాణమవుతుంది. జూన్ 28, 1813 తేదీన!

బైరన్ – 'ఆс! వారు ఎప్పటికీ ఆనందంగా జీవించటానికి వెళ్ళిపోయారు"

"నిన్న లేడీ ఆక్స్‌ఫర్డ్, నౌకలో వెళ్ళిపోయింది. ఇంక ఆమె పేరు మళ్ళీ నాకు చెప్పకండి. ఈమె కారో లైన్‌ను మించిపోయింది" అని లేడీ మెల్‌బోర్న్‌కు రాస్తాడు మన హీరో!



లేడీ జెర్సీ



పొగ మంచులో న్యూస్టెడ్

XVIII

అగస్టా!

(1813)

ఆకర్షణకు, ప్రేరణకు లొంగని బానిస
ఎవరు? ఎక్కడున్నాడు?

–బైరన్

అసలు ప్రణాళిక ప్రకారం, బైరన్, ఈ దంపతులు (లేడీ ఆక్స్‌ఫర్డ్ – లార్డ్ ఆక్స్‌ఫర్డ్) కుటుంబంతో నౌకవరకు వెళ్ళాలి కానీ, చివరి నిమిషంలో ఆ ప్రయత్నం మానుకోవలసి వచ్చింది! కారణం అగస్టా, అతని మారుటి అక్క, తన తండ్రి మొదటి భార్య సంతానం. తన భర్త డబ్బు ఇబ్బందుల మూలంగా, తను దూరంగా రావలసిన అవసరం పడిందని రాస్తుంది. దాని పర్యవసానంగా బైరన్‌తో వుండటానికి లండన్ వస్తున్నట్లు తెలియపరిచింది!

"ప్రియమైన అగస్టా – నీ కోసం ఎవరిని వదులుకుంటున్నానో తెలిస్తే నా పెద్దరికాన్ని గౌరవిస్తావు సుమా" అంటాడు!

తన యాత్రల నుంచి రెండు సంవత్సరాలపైగా తిరిగి వచ్చిన తర్వాత అగస్టాను చూడనేలేదు. అగస్టా నివసించేది సిక్స్‌మైల్ బాటమ్ (Six mile Bottom). అదీ ఒక దేశవాళీ ఇంట్లో, అదీ న్యూమార్కెట్ రేస్ కోర్సు దగ్గర్లో, తన ముగ్గురు సంతానంతో. ఆమె భర్త కలోనెల్ లీ (Colonel Leigh) గర్విష్ఠి, జూదరి, దుబారా కోరు. అప్పుల్లో కూరుకుపోయి వున్నాడు.

సంవత్సరంలో పదిమాసాలు తన స్నేహితులతో పేకాటలో సమయం గడుపుతాడు. పనిపిల్లల్తో సరదాలు తీర్చుకుంటాడు. కేవలం న్యూమార్కెట్టు గుర్రపు పందాలకే, భార్య దగ్గరకు తిరిగి వస్తాడు.

ఇంత జరిగిన అగస్టా నీతిగానే బతుకుతోంది. ఆమె అమ్మమ్మ పెంపకం అలాంటిది. ఆమె పాపభీతి, దైవ చింతన అలాంటిది. ఎవరికైనా బహుమతి ఇవ్వాలంటే ఇచ్చేది!!

తన ఇబ్బందులు, ముగ్గురు పిల్లల్ని సాకడంతో ఆమెకు తీరుబడే వుండదు. ముగ్గురిలో ఒకరికి ఎప్పుడూ ఏదో జబ్బు పీడిస్తుంటుంది.

అప్పులవాళ్ళకు సమాధానం చెప్పటం, ఉత్తరాలకు, నోటీసులకు జవాబు రాయటం. ఆమె భర్తకు రాయటం రాదు. ఇదే పనిలో దీనాతి దీనంగా జీవితం గడుపుతోంది.

అదిగో, ఆ స్థితిలో అతని అక్క అగస్టాను లండన్‌లో తన బెన్నెట్ వీధిలోని అపార్టుమెంటులోకి తీసుకు వస్తాడు. అది ఆదివారం, జూన్ 17, 1813. ఆమెను చూసి ఎంతో సంతోషించాడు. ఆమె సౌందర్యం అతన్ని ఆశ్చర్యపరచింది! మొదటి చూపులోనే!

ఆమె సహజంగానే అందంగా వుంటుంది!

బైరన్‌లాగానే కను ముక్కు తీరు వుంటుంది. ఇద్దరూ ఒకేమాదిరిగా 'R' ను పలుకుతారు.

బైరన్‌కు, తనంటే తనకు చాలా ఇష్టం. అలాంటివానికి, తనకు సంబంధించిన మరో భాగం అయిన అగస్టాపట్ల, మరింతగా ఆకర్షితుడవుతాడు. పైగా ఆమె అందం ఆకర్షిస్తుందికూడా.

వారిలో చాలా పోలికలున్నాయి, గుణపరంగా కూడా. బైరన్‌లకు వంశ పారంపర్యపు బిడియం, అంతర్గతంగా వుండిపోయిన ఆటవిక ప్రవృత్తి కూడా బైరన్ గుణమే. వారిద్దరూ చాలా మౌనంగానే వుండేవారు. కానీ ఒంటరిగా వున్నపుడు ఎంతో ఆనందంగా వుండటం గమనించారు.

ఏమిటి? ఆమె తన సోదరి కావటం మూలంగానా – ఎన్నో విషయాలు తమ మధ్యలో సాధారణ స్థాయిలో సహజంగా వుండటం మూలంగానా? వారి స్మృతులు కూడా తమ చపలచిత్తుడయిన తండ్రి జ్ఞాపకాలు.

తన తల్లి డోవేజర్‌తో గడిపిన కాలం!?

మొదటిరోజు నుంచి వారు సన్నిహితంగా సరదాగాను వుండగలుగుతున్నారు. ఆమెకు పెళ్ళి అయిపోవడం ఎంత విచారకరం?!

తన దగ్గరకు న్యూస్టెడ్ వచ్చి ఇల్లు చక్కదిద్దితే ఎంత బాగుండేది!

ఎవరో తెలియని వ్యక్తిని పెళ్ళి చేసుకునేబదులు, ఇది ఎంత వీలుగా వుండేది! ఇవీ అతని ఆలోచనలు!

అతనికి కొత్తవాళ్ళు, పరిచయం లేనివాళ్ళు అంటే చిరాకు. నిన్ను గురించి తెలియనివాళ్ళు, నీ బాగు ఎలా చూస్తారు? నీ సున్నితమైన హృదయాన్ని ఎలా సేద తీరుస్తారు – నీ అవిటి పాదాన్ని ఎలా మర్దన చేస్తారు? నీ చిన్ననాటి బాధల్ని ఎవరు వింటారు.. సానుభూతిగా?

అగస్టాతో ఇవన్నీ చాలా సులభ సాధ్యం! నీవు నిశ్చింతగా వుండవచ్చు. అన్నీ ఆమెకు వదిలి! ఇక ఆమెకు ఈ 'బేబీ బైరన్' అంటే ఎంతో సానుభూతి!

ఆ ఆదివారం – ఆమెకు చిన్న చీటీ రాస్తాడు. "ప్రియమైన అగస్టా – ఇవాళ సాయంత్రం నాతో విందుకు వస్తావా? లేడీ డేవీ భవనానికి? అక్కడ నీకు ఒక పెళ్ళి కాని యువతికి కావలసినట్లు కావలి వుంటారు. నీకు తెలిసినవాళ్ళు, నాకు తెలిసినవాళ్ళు ఇద్దరికీ తెలియనివాళ్ళు ఎవరితోనైనా మాట్లాడవచ్చు. నేను జాగ్రత్తగా చూస్తుంటాను.

ఇతరుల ముందు మన సాన్నిహిత్యంలో ఒక సంచలనాన్ని గుర్తించగలం!" అంటూ తనను, తన జీవన సిద్ధాంతాన్ని, సంచలన సిద్ధాంతాన్ని, ఆమెకు నేర్పాలని ప్రయత్నిస్తాడు. కానీ ఆమెకు ఇవన్నీ పట్టవు. బాతు మీద నీరు పడినట్లు అంటీ ముట్టనట్లే వుంటుంది. ఆమె డోలాయమాన మానసిక స్థితిలో ఏదీ నిలవదు.

మొదట్లో అతని కవిత్వం చదవాలని ఉత్సాహం చూపింది. అవి నీకు అర్థం కావని అంటాడు. అంతే ఒక్క నవ్వుతో తృప్తి పడింది.

ఆమె చిన్ని పిల్లలాగా మాట్లాడేది. ఏవో కథలు చెప్పేది. అయిదు నిమిషాల తర్వాత ఆమె చెప్పేది ఏమిటో వినేవారికి అర్థం కాదు. ఇవన్నీ బైరన్ లక్షణాలే! ఒక దానికి ఒకటి సంబంధం లేని విషయాలు చెప్పుకుంటూ పోయేది. 'ఆహాఁ', అబ్బో' అంటూ.

ఆమె కబుర్లకు 'అగస్తనియిన్ మిస్టరీలు' అనేవాడు. త్వరలోనే అతను ఆమెపట్ల సోదర భావాన్ని ప్రక్కనపెట్టి, ప్రేమికునిలా అనురాగంతో మాట్లాడటం హాస్యంగా మొదలుపెట్టాడు.

జూలై అంతా లండన్‌లోనే గడిపింది. ఆమె బైరన్‌తో కలిసి లేదు. కానీ విందులు, వినోదాలకు అతనితోనే వెళ్ళేది.

ప్రతిరోజు అతని అపార్ట్‌మెంటుకు వస్తుండేది. అతనికి ఇంటి కాపలాకు ఆయా మూల్ వుండేది. ఆమె దెయ్యంలా అందరికీ హడలు పుట్టించేది. కానీ బైరన్‌ను ఆరాధించేది.

బ్రహ్మచారి గదులు – ఒక ఆయా – ప్రతిరోజూ ఆమె రాక. ఇవన్నీ వింత వాతావరణాన్ని సృష్టించాయి.

వారికి తెలియకుండానే ఒకరకమైన భౌతిక ఆకర్షణకు లోనవడం మొదలయింది!

ఇదంతా బైరన్ పతనానికే దారితీస్తోంది. పైగా అగస్టా రాకకు, ఎలాంటి ఆటంకం లేదు కదా. వారు మారుటి అక్క తమ్ముళ్ళు. కాబట్టి సొంత సోదరీ సోదరుల్లా వారికి ఎలాంటి 'రక్షణ' అవసరం లేదు. "పైగా ఇద్దరూ కలిసి పెరగలేదు. అంతేనా! ఎప్పుడూ కలవనూలేదు" కూడా.

వారికి తల్లి వేరు. కుటుంబం వేరు. కానీ ఆమెలో వుండవలసిన గొప్ప లక్షణాలన్నీ వున్నాయి. గొప్ప పుట్టుక! Duke of Leedsకు మారుటి సోదరి! మహారాణికి సేవకురాలు. St. జేమ్స్ పాలెస్‌లో ఆమె నివాసం ఉంది! ఇంత ప్రత్యేకమైన యువతి అతన్ని ఆకర్షించటంలో వింత ఏముంది?

తనకు పరిచయం లేని స్త్రీ ఆకర్షించినట్లు అగస్టా కూడా అతన్ని మానసికంగా బంధించింది.

తనని ఆడవారు పెద్ద దిక్కుగా ప్రేమించి, ఆదరించాలని బైరన్ ఆశించేవాడు. పైగా తన గురించి తనకు పూర్తిగా అవగాహన వుంది. తనకు ప్రేమతో స్నేహం, శృంగారం, మాతృభావన ఇవన్నీ కలగలిసి వుండాలని ఆశించేవాడు! ఇదేనా 'పెద్దదిక్కు' అంటే?

ఒక్కసారి అతనికి ఒక ఆలోచన తట్టింది. చాలా బలంగా! ఈ 'సోదరి శృంగారం' అతన్ని వెన్నాడి వెంబడిస్తోంది. అరె! ఇంతకంటే 'ప్రమాదకరమైన వ్యసనం' ఏముంటుంది? తన తలరాతలో ఇదికూడా వుందా!

తన వంశం బైరన్ల గోర్డాన్ల వంశం! ఎలాంటి చరిత్ర! ఎంత భయంకరమైన చరిత్ర! బోర్గియాస్ (Borgias) లాంటిది కాదూ! తన చిన్నతనం నుంచే తన పతనం మొదలయింది 'Zeluko'లాగా ఏదో అతి ఘోరమైన, దారుణమైన నేరం చేయబోతున్నాడు? ఈ జనసామాన్యపు నీతిసూత్రాలను అవహేళన చేయబోతున్నాడు?

ఈ సాహస క్రియలో, తన పాపాన్ని అనుభవించాలి! ఈ ఎరుకతో ఈ అనుభూతి మరింత ప్రియంగా వుంటుంది. ఇది 'బైరన్' – తనే, కేవలం తనే ఈ అతి సహజమైన ప్రేమ శృంగారానికి, తన మారుటి అక్కతో దీనినేనా 'సోదరి శృంగారం' అంటారు? ఒక నేర రూపాన్ని ఇవ్వబోతున్నాడు!? దీనిలో నుంచి తప్పించుకోలేని బలహీనత – అతన్ని మిగతా ప్రపంచంకంటే వేరుగా విడిగా ప్రమాదకరంగా మార్చింది? ఇప్పుడు ఆ బలహీనతేనా తనకు ఆసరాగా నిలబడింది? ఎందుకు? ఈ స్త్రీతో, ఆమె తనలాంటిదే, తనలాగానే వుంది, ఆమె తనే అనుకుంటున్నాడు. అందుకే ప్రేమిస్తున్నాడు, కోరుకుంటున్నాడు. ఆమెపట్ల ఈ ఆకర్షణ, కోరిక. దీనితో ఒక రకమైన 'స్వీయ శరీరాకర్షణ' దాగివుందా?

రెండు మూడు సంవత్సరాల క్రితం అయితే, తన వయసు, అనుభవలేమి, బిడియం అతన్ని ఈ సంక్షోభం నుంచి దూరంగా వుంచేవే. కానీ, కారొలైన్ లాంబ్, లేడీ ఆక్స్‌ఫర్డ్‌లతో శృంగార సంబంధాలు అతనికి ఒక విధమైన

'విశ్వాసాన్ని, విజయాన్ని' ఈ కర్మకాండకు ఆపాదించిపెట్టాయి. ఇది, అనుభవం. అతనికి దారుణమైన శక్తిని, అదీ అనుభవంలేని అమాయకురాలైన ఆడదాన్ని లొంగదీసుకునే ఒడుపును సంపాదించిపెట్టాయి.

ఇక అగస్టా – పాపం. అందరి ఆడవారికంటే కూడా బలహీనమైనది. అతన్ని నిలవరించగల మానసిక శక్తి, యుక్తులు ఏమాత్రం లేవు.

మానసికంగా గాని, మర్యాదకు గాని ఏమాత్రం శక్తి లేని ఆమెను గెలవటానికి అతనికి ఎక్కువ సమయం అవసరం లేకపోయింది! ఆమెను 'గస్' అనీ 'గూస్' అనీ హాస్యమాడేవాడు. అంతేనా, 'నీవు అమాయకురాలవు' అనేవాడు. ఆమె నవ్వుతూ వినేది.

ఈ అగస్టా – లీ (Leigh) – భార్య – ఈమె మతనమ్మకాలు కేవలం పైపైవి మాత్రమే. ఆమె ప్రవర్తనపై, ఏమాత్రం ప్రభావం చూపేవి కావు. ఆమె కరుణార్ద్ర హృదయం కలది. ఈ కరుణకు అంతగా సామాజిక నీతినియమాలు వర్తించవు. అందుమూలంగానే, ఈ పాపకార్యంలో అదీ మరొకరికి సుఖాన్ని ఆనందాన్ని అందించే, ఈ శృంగార క్రియతో ఆమెకు ఎటువంటి నేరం కనిపించలేదు. కరుణ ముసుగులోనే, ఈ నేరాన్ని దాచిపెట్టగలిగింది. తన మనసులో, ఆమె బుద్ధి, చాలా తేటతెల్లంగానే వుంది! ఆమె ఆలోచనలలో నేరం, పాపం ఇవన్నీ ఎక్కువ సమయం వుండవు! త్వరగా మర్చిపోగలదు!!

ఈ వ్యవహారం గురించి త్వరలోనే లేడీ మెల్‌బోర్న్‌కు తెలియజేయటం మొదలుపెట్టాడు. "ఇందులో అగస్టా తప్పేమీ లేదు. ఆమెకు కరుణాగుణమే కాని కాంక్ష కాదు. దేవుడు నన్ను దుఃఖానికే పుట్టించాడు. మరొకరి మంచికోసం కాదు! ఆమెను ఏమాత్రం తప్పు పట్టకండి. వెయ్యోవంతు కూడా. ఆమె ఏ ప్రమాదంలో చిక్కుకుందో చివరివరకూ ఆమెకే తెలియదు. తరవాత కేవలం నిమిత్తమాత్రంగానే వుండిపోయింది. మీ ఆడవారంతా కాస్త ప్రేమగా, దయగా చూస్తే అతుక్కుపోతారు కదా" అంటూ తెలివిగా రాశాడు!

అగస్టాతో శృంగార ప్రేమ వ్యవహారం, అతనికి తను పాపం చేస్తున్నాననే జ్ఞానంతో మరింతగా తృప్తినిచ్చింది! దీనితో పోలిస్తే అదే ఈ సుఖదుఃఖాల కలగలపు. పాపపు శృంగారపు సౌఖ్యంలోని విషాదం/విచారం. దీనితో పోలిస్తే అతని పూర్వపు సాహసాలన్నీ విలువ లేకుండాపోయాయి. ఈ 'సోదరితో శృంగారం' – ఈ అనైతిక, పాపకార్యం – ఇది మానవ జాతి అతి పురాతనమైన నైతికతను, భగ్నం చేయటమే. అతనికి ఈ 'తిరుగుబాటులో' శరీర సుఖంతో పాటు అంతులేని ఆనందం లభించింది!

పాపం – అగస్టా చాలా అమాయకురాలు. ఊరికే లొంగిపోయింది. అయ్యో! అగస్టా ముగ్గురు పిల్లల తల్లికి ఎంత కష్టం – ఎంత సాహసం – ఎంత ప్రమాదం!

ఇందులో వింతేమిటంటే ఆమె తన భర్తను, సంతానాన్ని ఎంతగానో ప్రేమిస్తోంది. కానీ ఈ 'బేబీ బైరన్' కోరికను ఎలా కాదనగలదు?

అయ్యో! అమాయకురాలా – అగస్టా – ఆలోచించటం మానివేసిన ఆడవాళ్ళలో నీవు కూడా చేరిపోయావా? గతాన్ని అవలీలగా తుడిచివేయగలిగావా? ఒక కొమ్మ నుంచి మరో కొమ్మకు ఎగిరే పిట్టలాగా నీ ఆలోచనలను మార్చుకోగలవా?!

ఒక్కోసారి బైరన్ తన పాపకార్యాన్ని తలచుకుని దుఃఖిస్తుంటే ఆమె ఓదార్చేది. అతనికి తియ్యని కబుర్లు చెప్పి నవ్వించేది!

జులై చివర్లో తన ఇంటికి, న్యూ మార్కెట్‌లో తీసుకువెళ్ళింది! ముగ్గురు పిల్లల్తో బైరన్ ఆడుకుంటుంటే చూసి ఆనందించింది. బైరన్‌ను చూసి ఆ చిన్నారులు గంతులు వేశారు. బైరన్, బైరన్ అంటూ గోలచేశారు.

అతనితోపాటు అగస్టా లండన్ తిరిగి వచ్చింది. ఆమె భర్త ఆర్థికమైన ఇబ్బందులు, అతన్ని ఇంటిపట్టున వుండనివ్వవు. ఈ సమయంలోనే మన అక్క తమ్ముళ్ళు, ప్రయాణపు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇటలీకో సి సి లీ కో వెళ్ళిపోవాలని దీనికి మరో కారణం. బైరన్‌కు లండన్ విసుగుపుట్టింది. సంస్కరణ వంతుడనుకున్న

ప్రిన్స్ రీజెంట్ నిరంకుశుడుగా పాలిస్తున్నాడు. మేధావి అయిన Leigh Huntను, తనను విమర్శించాడని జైలులో పెట్టించాడు. ఇలాంటి దేశంలో తనెలా వుంటాడు?

"అరె! ఇక్కడకు తిరిగి వచ్చి ఎంత పొరపాటు చేశాను" అనుకున్నాడు. అతనికి ఒక్కసారిగా మల్లెపూలు, ఊదాపూల వాసనలు గుర్తువచ్చాయి. అక్కడి పర్వత సానువుల ఆకుపచ్చదనం సముద్రంలో కలిసిపోవటం చూశాడు. అక్కడేకదా, ఎటువంటి ఆలోచన లేకుండా, ఎవరి గురించి ఆలోచించలేకుండా, నిన్ను గురించి మరెవ్వరూ ఆలోచించకుండా రోజు గడిపేయగలవు?

అదిగో! అక్కడికే అగస్టాను తీసుకుపోతాను. గ్రీకు – లేదా సి సి లీ కి, ఇదీ అతని ఆలోచన! కానీ అతని నోరు ఊరుకోదు. తన స్నేహితులకు తన మర్మక్రియలు గురించి చెప్పకుండా వుండలేడు. మూర్‌కు రాస్తాడు – "నా శృంగార క్రియలు ఈ మధ్య మీకేమీ చెప్పలేదు. కానీ ప్రస్తుతం చాలా లోతైన వ్యవహారంలో వున్నాను. ఇది సరికొత్త కోణం. ఈ ఆడవారున్నారు చూశావూ, వీరు వున్నా బ్రతకలేం. లేకపోయినా బ్రతకలేం!" అంతే... తర్వాత లేడీ మెల్‌బోర్న్‌కి తమ ప్రయాణం గురించి తెలియజేస్తాడు.

ఆమె ఎంత స్వతంత్రురాలయినా, ధైర్యస్థురాలయినా ఈ 'సోదర శృంగారాన్ని' విని అదిరిపోయింది! ఆమె, నైతికతకు అంత ప్రాధాన్యత ఇవ్వకపోయినా, ఈ దారుణమైన పాపకార్యాన్ని జీర్ణించుకోలేకపోయింది! "అరె! నీవు పతనపు అంచున వున్నావు. ప్రమాదపుటంచున వున్నావు. అక్కడ నుంచి వెనక్కు తిరగకపోతే నిన్ను ఈ ప్రపంచంలో ఎవ్వరూ రక్షించలేరు. మరో లోకం సంగతి దేవుడెరుగు?" అని ఘాటుగా రాసింది!

ఇది బైరన్‌ను ఎంతో గర్వంగా నిలబెట్టింది. చివరికి లేడీ మెల్‌బోర్న్ కూడా భయపడిపోయింది!? "చూశారా – ఆమె ఎంత మంచిదో – ఆమెను కూడా ఆపగల స్థితి ఒకటుంది సుమా!" అంటాడు.

కానీ, ఆమె మాటకు విలువ ఇచ్చి ప్రయాణం మానుకుంటాడు. అగస్టాతో లండన్‌లోనే వుండిపోతాడు. "మీ మాట విని ఆగిపోయాను. ఇంకా ఇక్కడే వున్నాను" అని కబురుపెడతాడు.

లండన్ ఆగస్టులో ఖాళీ అయిపోయింది. ఆ ఖాళీ లండన్‌లో అగస్టాతో సంతోషంగా రోజులు వెళ్ళిపోతున్నాయి.

"ఇప్పుడేం చేస్తున్నావు? ఇక్కడ ఏముంది చేయటానికి? పట్నం ఖాళీ – అదీ మంచిదే – ఒక్క పురుగూ లేదు. ఇప్పుడు పూర్తిగా సోమరిపోతుగా పడివున్నాను. ఇందులో నుంచి బైటపడాలని లేదు. నాకెవ్వరూ కనపడటంలేదు. నేనేమీ మాట్లాడటంలేదు. నేనేమీ చేయటంలేదు. నాకే కోరికా లేదు!"

ఈ తంతుకు ముందు – వసంత కాలంలో ఒక పద్యకావ్యం ప్రచురించాడు ("The Giaour") 'చైల్డ్ హెరాల్డ్' తర్వాత అది ఒక్కటే రాశాడు. అది అంత సరుకున్న కవిత్వం కాదు.

తన ఏథెన్సు జ్ఞాపకాలు, ఒక స్త్రీ కథ. ఆమెను తుర్కులు సముద్రంలోకి పడవేద్దామని తీర్మానిస్తారు. ఆమె వివాహేతర సంబంధం పెట్టుకున్నందుకు. అదే పుస్తకానికి శిశిర ఋతువులో, అయిదువందల లైన్లు అద్భుతంగా ఇనుము కరిగించి పోతపోసినట్లు కలిపాడు.

లైలా నా ప్రతి ఆలోచనా నీవే
నా మంచి నా చెడు నా సుఖం నా దుఃఖం
నా ఆశ నా నిరాశ, నిస్పృహ
ఈ ప్రపంచంలో నీవులా ఎవ్వరున్నారు?
ఒకవేళ వున్నా నాకెందుకు?
నీలాంటి అమ్మాయి కోసం ఏ ప్రపంచంలోను వెతకను
నా యౌవనపు నేరాలన్నిటికీ
ఇప్పటి నా మరణశయ్య సాక్షి
ఇప్పటికే ఎంతో ఆలస్యం నీవే, ఎప్పటికీ నీవే
నా పిచ్చి నా కోరిక నా హృదయం
నీవే నీవే



అగస్టా లీ

అతని పిచ్చి, అతని హృదయం, అతని కోరిక ఇవన్నీ అగస్టానే! అతని ఆశ నిరాశ అన్ని ఆమే.

అతనికి తెలుసు. ఈ పిచ్చితో బ్రతకలేనని. ఇది ముందుకు సాగదని.

ఇప్పుడు లేడీ మెల్‌బోర్న్ అతని కోసం, అతని బాగుకోసం తపించిపోతుంది.


"ఇందులో నుంచి బైటపడు" అని అంటుంది! అతనికి అంత ధైర్యం లేకపోయింది. అగస్టా, ఆగస్టు అంతా అతనితోనే వుండిపోయింది. సెప్టెంబరు మొదటివారంలో అతన్ని వదలి వెళ్ళేసరికి ఆమె గర్భంతో వుంది.

న్యూస్టెడ్‌లో సింధూరపు చెట్టు





న్యూస్టెడ్‌కి దారి



XIX

దగ్గర గూడు!

(1813)

నా హృదయం ఎప్పుడూ అందుబాటులో వున్న
కొమ్మమీదే వాలుతుంది!

–బైరన్

బైరన్, లేడీ మెల్‌బోర్న్‌కు రాసిన వుత్తరాల్లో, తన ప్రియురాళ్ల పేర్లన్నీ మొదటి అక్షరంతోనే తెలియపరుస్తాడు.

కారోలైన్ – అంటే 'C', Annebella your A అని, Augusta is my A అని! ఒక్కసారి అని కూడా. కానీ లేడీ మెల్‌బోర్న్ అతని దగ్గర్నుంచి పశ్చాత్తాపంతో పొగిలిపోయే వుత్తరం వస్తుందని ఎదురు చూసింది.

బైరన్, తన అక్కతో సాగించిన శృంగార ప్రేమాయణం తర్వాత!

"అవును, నేను ఎంతో ప్రయత్నించాను. నాలోని దుర్మార్గాన్ని దునమాలని. కానీ ఏమి లాభం – దాని ఫలితం మరో కథ!" నా ప్రేమ మరో కొమ్మమీద వాలకముందే, అలాంటి అవకాశం నా ముంగిటే వుండగానే, మీకీ విషయం విపులంగా రాయాలి! నా ఆలోచనలు మీ ముందు పరచటానికి నాకు సిగ్గెందుకు?"

అగస్టా వెళ్ళిపోగానే బైరన్ ఒకప్పటి కేంబ్రిడ్జి పరిచయస్థుడు, తరువాత ఏథెన్సులో కలసిన వ్యక్తి వెబ్‌స్టర్ తన భవనానికి ఆహ్వానించాడు. అప్పుడే అతనికి ఒక మగపిల్లవాడు, తన అందాల భరిణి భార్యవల్ల కలిగాడు.

ఆ సందర్భంలో తన స్నేహితుడు బైరన్‌ను వచ్చి తమతో వుండమంటాడు. ఈ వెబ్‌స్టర్ వట్టి వాగుడుకాయ. అన్ని విషయాల్లో కల్పించుకుంటాడు. అతన్ని భరించటం చాలా కష్టం! కానీ బైరన్‌కు ఇలాంటివారే కదా హాస్యాన్ని అందిస్తారు!

అతని భార్య, లేడీ ఫ్రాన్సిస్ చాలా అందంగా వుంది. పాలిపోయి పగిలిపోయే గ్లాసులాగా.

ఆమె శరీరం, వెలిగిపోతున్న ఆమె కనులు, కను రెప్పలపైన పైకి వంగిన (Eye lashes) – 'అరె! ఈమె ఎలా జీవిస్తుంది' అనుకుంటాడు! ఆమెతోపాటు ఆమె చెల్లెలు కూడా అంతకంటే నాజూకుగా మరింత పాలిపోయి వుంది!

ఈ పాలిపోయిన అందాలు! అనుకుంటాడు.

ఈ సమయంలోనే అతని అనుభవాలన్నీ మెల్‌బోర్న్‌కు విపులంగా రాస్తాడు. వెబ్‌స్టర్ తెలివిగలవాడే కానీ తిరుగుబోతు.

అతనికి, బైరన్‌తో వున్న ప్రమాదం తెలుసు. అయినా, అతనిని సోమరిగా ఎటువంటి చైతన్యం చూపకుండా ఈ 'భర్తను' ఎందుకు ఇబ్బంది పెట్టటం అనుకుని వుంటున్నాడు.

'మేము రోజూ బిలియర్డ్సు ఆడుతున్నాం. లేడీఫ్రాన్సిస్ చూపులు ఆహ్వానిస్తునే వున్నాయి. ఒకరోజు అడిగింది కూడా

"ఆడదాని ఇష్టాన్ని ఎలా తెలియజేయాలి" అంటూ!!

ఆమె భర్త, తన భార్య క్రీస్తు అంత పవిత్రురాలు అనుకుంటాడు. అంతకంటే వర్జిన్ మేరీ అనుకోవచ్చు. నిజానికి ఆమె మానసికంగా వర్జిన్ అనవచ్చు. అంత నిర్మలంగా వుంటుంది.

నా నిర్లక్ష్యాన్ని చూసి చాలా ఆందోళన చెందింది. 'నేను అందంగా లేనా – లేక అతను గుడ్డివాడా' అనుకుంటుంది!

ఈ పరిణామం – ఇది అతన్ని ప్రశాంతంగా వుండనివ్వదు. కానీ మగవాళ్ళు, సత్యాన్ని చూడలేరు. వారికి కథలు, కల్పనలు కావాలి.

అతని తెలివి, అతని లౌకిక జ్ఞానం అతని నిర్లక్ష్యం ఇవన్నీ అక్కడివాళ్ళకు అంతుబట్టవు!

ఎందుకంటే – ఒక్కసారి, ఈ ఒక్కసారి, అతను ఎటువంటి 'ఆట' అడకుండా ప్రశాంతంగా వుండాలని అనుకుంటాడు.

అంతేకాక – అతను ఇంతవరకు ఏ ఆడదాన్ని చెడగొట్టలేదు.

ఎవరైనా ఇష్టంతో సగం దూరం వస్తే మిగతా సగం దూరం అతను వెళ్ళి చేతినందుకున్నాడు.

కానీ స్త్రీ నైతికతలోని పెళుసుతనం అతన్ని ఆశ్చర్యపరిచేది!

ఆ తర్వాత అతనికి చాలా దగ్గరా వచ్చి, మరింత ఇబ్బంది పెట్టింది లేడీ ఫ్రాన్సిస్.

మధ్యలో వచ్చిన భర్త ఏదో పిచ్చి వాగుడు వాగి వెళ్ళిపోయేవాడు. డిన్నర్ టేబిల్ దగ్గర, ఆమె చూపులు, చేతి స్పర్శలు ఆకర్షిస్తూనే వున్నాయి.

కానీ ఈ భవనంలో అతనికెలా కుదురుతుంది?

"ఆమె అడిగిందానికి చిన్న సమాధానం చీటీమీద రాసి ఇచ్చాను. బిలియార్డ్ గదిలోనే – అంతలోనే ఆమె భర్త వచ్చాడు. అతను చూడకుండా ఆమె హృదయానికి దగ్గరగా దాచింది, ఈ చీటీని! ఆ హృదయాన్నే కదా నేను చేరాలి!"

ఇది మరింతగా, లోతుగా, నడుస్తోంది ఈ వ్యవహారం. ఆమెతో నడక – రాత్రి కబుర్లు – చేతులు కలుపుకోవటం ఎప్పుడైనా ఒక ముద్దు కూడా. అంతకంటే ముందుకు వెళ్ళలేదు.

'నా హృదయం ఎంత బలహీనమైనది – నీ కోసం తపించిపోతోంది. నీ దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి కొట్టుకుంటోంది' అంది. 'అరె! నేను నీవాణ్ణే – నమ్ము' అంటాడు. ఇది ఎలా నిజం? ఇంతలోనే అగస్టాను మరిచిపోయాడా?

ఈ 'హృదయ కన్యను', క్రూరుడైన భర్త నుంచి తాను రక్షించాలా? ఈమెతో లేచిపోవాలా? లేక ఆమె భర్తతో ద్వంద్వ యుద్ధానికి దిగాలా?

నిజానికి ఈ 'కన్య'లో తను వెదికేదేమిటి? 'మేరీ చావర్తు' ప్రేమనా? తనెప్పుడో సమాధి చేసిన ప్రేమ ఆనవాళ్లనా? తను ఎక్కడ వుండాలనుకుంటున్నాడు – లేదా ఎక్కడ సమాధి కావాలనుకుంటున్నాడు. తనకింత వరకూ సంభవించిన ప్రణయ మరణాల మధ్యనా?

అవేనా తన హృదయానికి కావలసింది?

తన విరక్తి ముసుగులో దాగిన భావుకుని ఆశ ఎప్పటికీ తీరేదికాదా? తను దాగివున్న లేదా దాస్తున్న (కపట) ఈ పవిత్రత, ఎవరైనా ముట్టుకుంటేనే పటాపంచలవదా? కరిగిపోదా? మంచు గడ్డలాంటి ఈ పవిత్ర ముసుగు చేతి వేడి స్పర్శకే కరిగిపోదా?

తనని, మానసికమైన మార్మిక భావనతో, ఎంత తేలికగా వశపరచుకోవచ్చు – ఈ బలహీనత తనకు తెలీదా? ఈ లేడీ ఫ్రాన్సిస్ బిడియం, మౌనభాష, పాలిన అందం అతనిమీద ఎంతో ప్రభావం చూపటంలేదా?

ఇలాంటి సమయంలోనే భర్త ప్రోత్సాహంతో తన సామ్రాజ్యమైన న్యూస్టెడ్ వస్తారు అందరూ. అక్కడ, ఇది తనకు తెలిసిన ప్రదేశం, తనే రాజు – ఆమె తన అధీనంలో వుంది. తన తోట, ఫౌంటెన్, తన జంతువులు, తన పూవులు, అన్నీ ఆమెకు ఎంతో ప్రియంగా చూపిస్తాడు. ఎన్నాళ్ళని ఈ అమలిన శృంగారాన్ని సాగిస్తాడు – 'డాన్ వాన్'? పైగా న్యూస్టెడ్‌లో తన కెదురేమి వుంది?

ఒక రాత్రి ముహూర్తం పెడతాడుకూడా. అమలిన శృంగారంలోని రమణీయ కోణం – చక్కగా చేతులు పట్టుకుని ఎంత దూరమైనా నడవవచ్చు. ఎన్ని అర్థంలేని కబుర్లను చెప్పుకోవచ్చు? కళ్ళల్లో కళ్ళుపెట్టి చూడనూవచ్చు. అప్పుడప్పుడు ముద్దులూ ఎంగిలి పడవచ్చు. నిట్టూర్పులూ విడువవచ్చు.

కానీ కాగితపు నోట్లు, డబ్బు విలువ తగ్గించినట్లు, ఈ న్యూస్టెడ్‌లో తన కందుబాటులో వున్న ఆమె శరీరం పై, అతనికి ఎటువంటి కోరికా లేకుండా వుండిపోతాడు. అవకాశాలు, అవసరాన్ని తగ్గిస్తాయేమో!

అయినా ఈ సాహసానికి తన ముద్ర వేయవద్దా? ఒక అర్ధరాత్రి ఆమె ఆశ్చర్యంతో చూస్తుండగానే, తన కపాల మగ్గుతో వైను తాగుతాడు. ఆమెను

తోటలోకి చలిలోకి చేయి పట్టుకు తీసుకువెళ్తాడు. వారి వెనకే అతని లేడిపిల్ల గంతులు వేస్తుంది. ఎత్తైన చెట్లక్రింద ముద్దులు పెట్టుకుంటారు. ఆమె అసహాయతను మర్యాదను గౌరవిస్తాడు. “నేను నీదాన్ని, వెచ్చనిదాన్ని, నీ దయ కోసం నిరీక్షిస్తున్నదాన్ని – ఈ బాధ్యత నాదే. ఇది తప్పయితే, నీకు నిజమే చెప్తున్నాను. నన్ను ఎలా కావాలంటే అలా తీసుకో” ఇలా ఆమె మాటలు.

“కానీ ఆమెను అలాగే వదిలివేశాను. ఆమెలో ఏదో గుణం వుంది. కనీసం ఇసుమంత కూడా వెసులుబాటు లేకుండా లేదు. వద్దనటం లేదు. ఆమె పూర్తిగా లొంగిపోయిందని అర్థమయింది. ‘వద్దు వద్దు’ అని ఎన్నిసార్లు విన్నాను.

ఇప్పుడు ఆ శబ్దం ఏది? నా చెవిలో సైతాను పోరుతున్నాడు. కానీ – కానీ ఆమెను అలాగే రక్షించాను! నేను ఆమెను ప్రేమిస్తున్నానా? అవును. ప్రేమిస్తున్నా – కానీ ఎందుకని?

‘నీ మనసులో ఎవరైనా వున్నారా? నేను అర్థం చేసుకోగలను! – పోనీలే’ అంటుంది.

ఎంత పాలిపోయి వుంది – గాజులా పగిలిపోయేలా వుంది?

అరే! ఆ కన్నుల్లో నీరు ఉబుకుతోంది!”

ఆమెను పవిత్రంగానే వదిలివేశాడు. ఆమెపట్ల దయతో, ఆమెను పవిత్రంగా వుంచివేశాడు! ఆమెకు పాపభీతి వుండదా? ఒకవేళ నాది తప్పయినా సరే – ఏమిటీ ఈ బైరన్ ఒకప్పటి ‘డాన్ వాన్’కి నకలా? లేడీ మెల్‌బోర్న్ అన్నట్లు – పోనీలే నాకు స్త్రీలు అర్థంకారు. నాకు తెలియాల్సిన పనేముంది? అలా నటించాల్సిన అవసరం ఏముంది? పవిత్రత – దాని ఫలితాలు దానికుంటాయి. అది ఎంతో మంచిది కూడా! ఎందుకంటే మరో పర్యవసానం వుండదు కదా! ఒక ఉదయం ఈ ప్రేమికులు విడిపోతారు. బైరన్ ఎంతో కంపించిపోయాడు. లేడీ ఫ్రాన్సిస్ నిబ్బరంగానే మార్మికంగానే వుండిపోయింది. ఆమె భర్త వెబ్‌స్టర్ – బైరన్‌కు ఒక జ్ఞాపిక ఇస్తాడు – ఈ పక్షం రోజుల గుర్తుతో అది ‘ముక్కుపొడుం డబ్బా’, ‘మండుతున్న అక్షరాలతో’ అతని పేరు చెక్కి మరీ ఇస్తాడు.



లేడీ మెల్‌బోర్న్



లార్డ్ మెల్‌బోర్న్

XX

కార్సెయిర్

(1813-1814)

ఈ పంతొమ్మిదో శతాబ్దం అన్వేషణ ఏమిటో
తెలిసికోవటం అంత కష్టం
కాదు - బలమైన ఉద్వేగాల కోసం ఆరాటం చెందటమే
దాని గుణం-

-స్టెండాల్ *(Stendahl)*

బైరన్ పతనానికి సైతాను చాలానే ఎరలు వేస్తున్నాడు. ఎలాగైనా ఈ జీవి పతనం రాసిపెట్టి వున్నదే!

బైరన్ తన పాపకార్యం నుంచి బైటపడేందుకు ఎంతగానో సంఘర్షణ పడుతున్నాడు. దానిలో నుంచి బైటపడటానికి మరో ప్రేమ వ్యవహారాన్ని ఎంచుకున్నా, చివరి క్షణంలో తనను రక్షించుకున్నానని భావించాడు. తన మంచి ఆలోచనలే అందులో నుంచి బైటపడేశాయని అనుకున్నాడు.

ఈ విధంగా రాత్రింబవళ్ళు విచారంతో అగస్టాను పోగొట్టుకున్నందుకు, లేడీ ఫ్రాన్సిస్‌ను వదిలివేసినందుకు, విచారంతో కుమిలిపోయాడు. ఈ పశ్చాత్తాపంతో ఎలాంటి నిజాయితీ లేదు. నిరర్ధకమైన విచారమే. అలా చేస్తే ఎలా వుండేది - ఇలా కాకుండా వుండేదేమో. ఇవే ఎడతెగని ఆలోచనలతో విచారంతో పశ్చాత్తాపంతో ఉడికిపోయాడు.

కవితావేశం - లావాలాంటిది
అది పెల్లుబికి బైటపడితేనే గుండె పగలకుండా వుంటుంది

భూకంపం రాకుండా వుంటుంది!

అలాంటి ప్రమాదం నుంచి బైటపడేందుకు బైరన్ ఆసువుగా 'కవితాధార' పరుగులు పెట్టింది. అలవోకగా ఆ వేసవి అంతా అతని ఆలోచనలు 'The Bride of Abydos' గురించే. జులేకా సలీమ్‌ను ప్రేమిస్తుంది – ఆమె సోదరుణ్ణే!

సలీమ్ నా ప్రియాతి ప్రియమైన సలీమ్
భయమా – అసహ్యమా? ఏమిటో చెప్పలేవా?
నీ శిరస్సు నా హృదయం మీద విశ్రాంతి తీసుకోనీ
నిన్ను విశ్రాంతిగా నీకు శాంతిగా

ఎవరు మనల్ని వేరు చేసేది?
ఎన్నేళ్ళు గడిచిపోయాయి
నీ నుంచి నన్ను వేరు చేసింది కాలం!
మనల్ని అంతం చేసే ఆయుధం
అందర్నీ విడదీస్తుంది
మనం ఈ మట్టిలోనే ఏకమైపోదాం!

ఇది మలిన శృంగార కథ. అనైతిక గాథ. కానీ అతను తన మేధను మరో విధంగా మరల్చలేక పోతున్నాడు – అగ్నిపర్వతంలాంటి తన మథనాన్ని చల్లార్చుకోవాలంటే కవిత్వం రాయాలి –

లండన్ రాగానే, నాలుగు రాత్రులలో పన్నెండు వందల లైన్లు, దీర్ఘ కవితను రాశాడు. అందులో తనను తొల్చివేస్తున్న రెండు బొమ్మల్ని ఇద్దరు ప్రియురాళ్ళను జిలిబిలిగా అల్లి, కవిత్వం చెప్పాడు.

"ఈ పని చేయకపోతే పిచ్చివాణ్ణి అయిపోయేవాణ్ణి" అనుకుంటాడు. "నా హృదయాన్ని నేను నమిలివేయవలసి వస్తుంది!"

ఇలాంటి రక్తసంబంధితో మైథున వ్యవహారం – ఇది ఎంత ప్రమాదకరమైన ప్రేమ. దీనిని ప్రచురించటం ఇంకా ప్రమాదం. అదీ తన జీవితంతో ముడిపడి వుంది! అతను గాల్ట్ (Galt)కు రాస్తాడు. ఇందులో మొదటి భాగం 'నేను చూసినవి నా జీవితంలో పరిశీలించినవి' అని. లేడీ మెల్‌బోర్న్ 'రెండో భాగం – మీ కోసమే'

లేడీ మెల్‌బోర్న్‌కు రాస్తాడు. ఇది నా టర్కీ యాత్రల కథ. ఇవి మీకు తప్పనిసరిగా నచ్చుతాయి. ఇందులో నేనెక్కడ వున్నానో మీరు చెప్పగలరా?"

ఎందుకలా? మౌనంగా వుండవచ్చుగదా? కానీ బైరన్ అగస్టాలాగా ఉపేక్షలో బ్రతికేవాడు కాదు. తన అనుభవాలను నెమరు వేసుకుంటూ తన తప్పిదాలను తలచుకుంటూ కుమిలిపోవల్సిందే. "అరె – నాటకం రాద్దామనుకున్నాను. అందులో అన్నీ పచ్చిగా కనపడుతున్నాయి. నవల కూడా ప్రయత్నించాను. నిజాలన్నీ నగ్నంగా నిలబడి వెక్కిరిస్తున్నాయి.

కవిత్వంలోనే అన్ని ఆలోచనలు అంతర్లీనంగా ప్రవహిస్తాయి. పొగమంచులో బొమ్మల్లా."

లండన్ వచ్చినప్పటినుంచీ తన దినచర్య అంతా జర్నల్ రాయటం మొదలుపెట్టాడు.

అందులో బైరన్, బైరన్‌తో మాట్లాడుతూ ఏమాత్రం దాపరికం లేకుండా నిప్పులాంటి నిజాల వెచ్చదనంతో ఆరగా ఆరగా కవితా పంక్తులతో ఈ జర్నల్ ఒక అద్భుతమైన గ్రంథంలా తయారయ్యింది!

తన 'చైల్డ్ హెరాల్డ్'లో తొంగి చూసిన బైరన్ 'ఆత్మ'ను, దీనిలో పూర్తిగా చూపిస్తాడు. తన గర్వం అహంకారం తన దుర్మార్గమైన స్వార్థపరత్వం పచ్చిగా విప్పిపెట్టాడు.

ఇప్పుడు అతని జీవితం, బైరన్‌తో, మాట్లాడే బైరన్ దీర్ఘ సంభాషణ!

రాత్రి జర్నల్ మూసేముందు "ఆc ఆవులింతలు వస్తున్నాయి. ఇక నిద్రపోతాను బైరన్!" అంటూ ముగించాడు.

బైట లౌకికపరమైన సంఘటనలన్నీ అతనికి, అవీ రాసినా, ఎక్కడో ఎత్తులో కూర్చొని క్రింద పోట్లాడుకునే జంతువుల అరుపులను నిర్లక్ష్యంగా వింటూ, అదీ ఏదో మంచు తెరల్లో నుంచి చూస్తున్నట్లు!

అంతేనా? షేక్స్పియర్ క్లియోపాత్రా అతన్ని ఎంతో కదిలించింది.



"ఆమె శృంగార దేవత! ప్రేమదేవత, సౌందర్య దేవత, భయంకరమైన భూతం! చివరి వరకూ విలాసం! ఆకర్షణ! ఆమెకు బుట్టలో పాము, ప్రక్కలో ఆంటోనీ ప్రేమా, ఏమీ తేడా లేకుండా చూడగలిగింది!" ఇదీ అతని ఆలోచనలు!

ఆమె ఆంటోనీ ప్రేమ ఘాటు, బుట్టలోని పాము కాటు – రెంటినీ స్థితప్రజ్ఞతో ఆహ్వానించింది!

అతని రాతలేవీ ఇంతగా బైరన్ మనస్సును విప్పి చూపలేదు. ఎంత ఒంటరిది అతని హృదయం. పదిహేను సంవత్సరాలయినా అతని తొలి ప్రేమను మరచిపోలేదు.

"ఇప్పుడు ఆమెను చూడాలనుకోవటం అవివేకం – నా ఊహలకు ఇప్పటికీ ఆమె ఎంత అందంగా వున్నా అది సరి రాదు. – నా మనోభావాలకు అది విఘాతమే–"

పైపైకి అతను విందులకు వినోదాలకు వెళ్తున్నా, బైరన్ ఏమాత్రం సంతోషంగా లేడు. అతను బాధలో వున్నాడు. అతని ఆలోచన – అరే! ఏదీ చైతన్యం – కార్యరూపం దాల్చని ఈ జీవితం ఎందుకు!?

దీనికి నిష్కృతి లేదా? తన జీవితం సాహసాలకే గానీ, ఈ కవిత్వం రాయటానికి కాదని అతని గాఢ విశ్వాసం.

"ఏ పనీ పాటా లేనివాడే కదా రాసేది?" ఇంతకంటే మంచి పనివుంటే ఇది ఎందుకు?" అంటాడు. 'సాహసం – సాహసం చేయి' అనికదా డెమొస్తనీస్ (Demosthenes) అంది? 'సాహసానికే జీవితం' అంటాను నేను. ఈ కవితా పంక్తులు రాయటానికి కాదు నేను బ్రతికేది! ఇదీ అతని ఆలోచన–

అతను ఒక మహా 'మృగం' – ఈ సంఘపు ఇనుప చట్రానికి లోపల బద్ధకంగా ఆవులిస్తున్న మహా మృగరాజు! సింహం! ఆ లోపల, ఇనుప చువ్వల లోపలి నుంచి నిస్సహాయంగా ఈ ప్రపంచాన్ని చూస్తున్న ప్రమాదకరమైన క్రూర మృగం! జంతువు!

ఈ విందులు, వినోదాలు – ఈ గోల, అతినికి దూరదూరంగా వుండిపోయిన తూర్పు దేశాల తీరాలు, అక్కడి నిశ్శబ్ద పర్వత సానువులు, వినీలాకాశం ఇవన్నీ మరీమరీ గుర్తు చేస్తున్నాయి!

"అరె! ఇక్కడెందుకున్నాను? ఎందుకు వీరిని పట్టించుకోవాలి? ఇక్కడ నాకెలాంటి కీర్తికావాలి? ఈ ప్రపంచాన్ని గెలవాలని అనుకోవటం లేదుకదా! ఇప్పటికీ నాకు కట్టబెట్టిన కీర్తిని దాని చపల చిత్తంతో ఎగతాళి చేస్తూనే వుందికదా! అదే ప్రపంచం!!

నా బ్రతుకు ఇక్కడ ఛిద్రమయిపోతోంది. నాకు సాహసక్రీడలు కావాలి. కనీసం ప్రయాణిస్తూ వుండాలి – ఇది ఎంత రోగగ్రస్తంగా వుంది. కదలిక లేకపోవటం–

నాకు నాగరకత అంటే అసహ్యం" ఇవీ అతని ఆలోచనలు

తన వెబ్‌స్టర్ అనుభవం, లేడీ ఫ్రాన్సిస్ అనే అనుభూతం తనకు ఆడవారంటే ఎలాంటి అభిప్రాయం వుందో దానినే బలపరుస్తోంది.

"ఏముందీ ప్రపంచంలో – పిగ్మాలిన్ విగ్రహం తెలియచెప్పటం లేదా – ఏవో కొన్ని ముద్దులు ఏవో కొన్ని సాహసాలు. ఈసరికే లేడీ ఫ్రాన్సిస్ మరో ప్రియుణ్ణి నాకంటే ధైర్యం కలవాడిని ఎంచుకోవచ్చు – నాలాంటి బలహీనుణ్ణి ఎందుకు గుర్తుపెట్టుకోవాలి" అలా అనుకుంటూ మళ్ళీ అగస్టా గురించి తన అనురాగాన్ని తిరగతోడటానికి ఆలోచిస్తుండగా అనుకోని వుత్తరం ఒకటి వస్తుంది. అది తన తొలిప్రేమ, వేగుచుక్క నుంచి వచ్చింది. చిన్నదే నాలుగు వాక్యాలు–

"ప్రియమైన లార్డ్ – మీరు నాటింగ్ హామ్ వైపు వస్తే ఎడిల్‌టన్‌లో నేనున్నాను – మీకోసం ఎదురుచూసే స్నేహితురాలు" నీ మేరీ–

ఇదీ వుత్తరం!

ఈ నాలుగు ముక్కలు అతని బాధలన్నీ తిరగతోడాయి. ఆమె ఆనందంగా లేదని తెలుసు. ఆమె భర్త ఆమెను సుఖపెట్టటం లేదనీ విన్నాడు. పాపం! ఎంత

ఇబ్బందిలో వున్నదోగదా? కానీ తను వెళ్ళగలడా – తనుకోరే దేవత ఆమెలో ఇంకా మిగిలిందా? ఇంక తన అనుబంధం ఆమెతో ఎంతవరకు? కానీ తనకు కావలసింది తన ఊహాలోకపు మేరీ. ఇప్పుడు ఈ మేరీకి కావలసిది ఏమిటి? తనను ప్రేమించగలదా? అది జరిగే పనికాదు. ఆమె చాలా పవిత్రురాలని విన్నాడు. పైగా తనని 'సోదరా' అని పిలుస్తోంది! 'నీవు చాలా ప్రపంచాన్ని చూశావు – నేను నూతిలో కప్పలా వుండిపోయాను. అదే నాకసహ్యం పుట్టిస్తోంది. కానీ నేను ఆశించింది మంచి – అందరిలో మంచినే చూడాలనుకున్నాను", ఇలాంటి భాష అతనికెలా సరిపడుతుంది. ఈమె స్నేహం తనకెందుకు? ఒక్క క్షణం ఆకర్షించబడ్డాడు. అతని హృదయం 'దగ్గర కొమ్మ' మీదే వాలుతుంది కదా. కానీ ఆమె తనను అంగీకరిస్తుందా? ఈ ఆడవారంతా ఎందుకు పారిపోతారు – పట్టుబడటానికేనా? అదే వారి కోరికా? ఈ ఆటలో దిగితే – ఎంత ప్రమాదం?

ఈ విషయంలో లేడీ మెల్‌బోర్న్ సలహా అడుగుతాడు కదా – "అరే! నీవు నాకు అంతుబట్టటం లేదు. నీకెలాంటి స్త్రీ కావాలి? ఎంతమంది కావాలి?" అంటూ ఇంకా నీకు ఆడవారు అర్థంకాలేదా?" అంది!

తన బలహీనత అర్థం చేసుకోనివ్వవుకదా – లేడీ ఫ్రాన్సిస్ స్మృతిని మరిచిపోయి ఇప్పుడు పూర్తిగా అగస్టా ఆలోచనతోనే నిండిపోయాడు. నవంబరులో ఆమెకు తన చిత్రాన్ని పంపిస్తాడు. అగస్టా అతన్ని ప్రేమికుడుగా అంగీకరించటానికి భయపడుతూనే, అతని ప్రేమను పోగొట్టుకోవటానికే ఇష్టపడదు.

నీ బాధలన్నీ పంచుకుంటూ – నీ భావాలన్నీ

నీ మనసుతో చూస్తూ – నీ ఆదేశాల కోసం

చూస్తూ – నా అయిష్టాన్ని నీ చేతిలో పెడుతూ

అంటూ రాస్తుంది. తన వెంట్రుకలు పంపిస్తుంది!

అంతే! ఇక అతను ఇతర ఆలోచనలను పక్కన పెట్టేస్తాడు. మానసిక సంఘర్షణలోనుంచి బైటపడి, అదే లేడీ ఫ్రాన్సిస్, మేరీ చావర్త్ అందరినీ పక్కనపెట్టి అగస్టాను రమ్మంటాడు.

అదే సమయంలో తన కొత్త కవితను The Corsair మొదలుపెడతాడు. ఇవన్నీ తన అనుభవాలే - తన ఆలోచనలే - కానీ "అతని ఆలోచనలు అతనితోపాటు నిద్రపోవు". ఈ కథానాయకుడు తిరుగుబాటుదారు - దొంగల నాయకుడు - హింసాత్మకుడు - ఒంటరిగాడు, తన మానసిక రుగ్మతతో పరుగులుపెట్టేవాడు.

తన సంఘర్షణలు ప్రపంచం మీదకు తుఫానులా వదిలిపెట్టగలడు- ఎప్పుడు వస్తాడో ఎటునుంచి వస్తాడో తెలియదు. ఎప్పుడు మంచుతెరల చాటునే వుంటాడు. అతని గతం అంతా నేరమయమే. అది ఎవ్వరికీ తెలియదు. 'అతనికి పశ్చాత్తాపం అంటే, విచారం అంటే తెలియదు'. జరిగింది - తిరిగి మార్చలేము. చెరిగిపోనిది - చెరిపివేయలేము - అతనికి ఎలాంటి శాంతి, బ్రతికి వుండగా లభించదు. - ఎప్పుడు తిరుగుబాటే, నాస్తికుడు కూడా.

నాకు స్వర్గం ఎందుకు? కావలసింది శాంతి కదా!

తనకి సాహసాలు కావాలి- సంఘాన్ని సవాలు చేస్తాడు. దొంగల నాయకుడిగా విరుచుకుపడతాడు. అతని మనోక్షోభ నుంచి పరుగులుపెడతాడు.

ఆ విధంగా చనిపోయినా ఫరవాలేదు. కానీ ఈ జీవితం వృథాగా గడిచిపోగూడదు. ఇదీ అతని హీరో లక్షణాలు!

ఈ కథానాయకుడికి బైరన్‌కు చాలా పోలికలున్నాయి! గొప్ప వంశం - గొప్ప హృదయం - గొప్ప నిరాశ - గొప్ప అవమానం - అంతులేని కోపం.

కానీ బైరన్‌వి అన్నీ కలలే. అతని హీరోవి అన్నీ క్రియలే.

తన హీరోలాగా, తన సాహసం చేయలేకపోతున్నందుకు విచారిస్తాడు.

అతని నవ్వులో దెయ్యాలున్నాయి

అవి భయపెడతాయి - బుసలు కొడతాయి!

కానీ తనో! అంత ఎదగలేదు-

నిజ జీవితంలో ఇది సాధ్యం కాదుకదా-

కానీ తన హీరోతో ప్రమాదకరంగా స్నేహం చేస్తాడు-

తన బలహీనతలన్నీ వారి బలంగా చూస్తాడు.

అతనికి మనిషి అంటే ద్వేషం

విలువలంటే అసహ్యం

అందరూ అతనిని మోసం చేసినవారే

గాయపరచినవారే

తన గాయాలకి లేపనం తిరుగుబాటు – మనిషీ వద్దు – స్వర్గమూ వద్దు.

ఇదేనా – బైరన్ కోరేది కూడా?

తన మంచితనమే, తన పతనం!

ఇది ముఖ్యంగా ఆడవాళ్ళ విషయంలో ఎంత నిజం!

తన హీరోకి – అందరూ శత్రువులే – తన ప్రేమికురాలు తప్ప.

ఇదీ బైరన్ ప్రియురాలే – భౌతిక సుఖాల కోసమే – ప్రాపంచిక ఆనందంకోసం మిగతా భావాలన్నీ తెరలచాటుకే – మరచిపోవాలి – లేకపోతే అసహ్యం పుడుతుంది.

కేవలం ఖాళీగా వుండకుండ వుండటానికే, ఈ సాహసాలన్నీ. జీవితంలోని బద్ధకాన్ని పోగొట్టుకోవటానికే నా క్రియలన్నీ. ఈ శృంగారంలోనే – స్త్రీ నిజంగా సత్యం! తనలాగానే తన హీరో కూడా చివరికి 'పేరి'ని ప్రేమించి ఆమెతోనే దోబూచులాడుతాడు.

ఈ దీర్ఘ కవిత పూర్తయిన తర్వాత తన ప్రచురణ కర్తకు ఇచ్చి అగస్టాతో న్యూస్టెడ్‌కు జనవరి 17, 1814 – వెళ్ళిపోతాడు! అప్పుడే చలి మొదలవుతోంది. ఇప్పుడు కూడా మేరీ చావర్తును రమ్మందామని అనుకుంటాడు. చాలా దగ్గరగా వుంది. కానీ దారులే అనుకూలంగా లేవు. అసలు అగస్టా వుండగా మరొకరితో ఎందుకు సావాసం – అనుకూలవతి తన కుటుంబంలోనిది. ఇద్దరికీ అభిప్రాయభేదమే లేదు. తానెప్పుడు ఆమెకు 'బేబీ బైరన్' గానే వున్నాడు.

అగస్టాకు ఇటాలియన్ నేర్పుతాడు. ఇదే మొదటిసారి, ఇద్దరు కలిసి వుండటం. ఆమెకు బైరన్‌ను అంత దగ్గర చూడటం ఇదే మొదటిసారి. గుళ్ళతో, పిస్తోళ్లు పక్కలో పెట్టుకొని రాత్రంతా నిద్ర లేకుండా గడుపుతాడు.

ఒక్కోసారి పళ్ళకింద గుడ్డలు పెట్టుకొని కొరుక్కోకుండా, సోడానీళ్ళు తాగుతూ దాహంతో ఆరిపోతాడు.

ప్రొద్దుటిపూట మెగ్నిషియా తీసుకుంటాడు. అరుగుదల లేకుండా మెలికలు తిరిగిపోతూ, కోపంతో ఊగిపోతూ, హింసాత్మకంగా మారిపోతూ, అశాంతితో అల్లాడిపోతూ...

ఇదంతా గోర్డాన్ల రక్తమే – అనుకుంది అగస్టా. ఎప్పుడైనా పెళ్ళంటూ చేసుకుంటే ఇతన్ని భార్య భరించటం కష్టమే అంటుంది.

వారిద్దరూ అన్నీ మర్చిపోయి వుండిపోతారు. “అగస్టా నిస్వార్థపరురాలు. ఆమెకు స్వార్థమే లేదు. కేవలం నాకు సుఖం అందించటానికే వుంది. ఇది వావి తప్పిన చీకటి తప్పని నాకు తెలియదా? కానీ ఆమె హృదయం ఎంత మంచిది – కనీసం ఆ భావనతో కూడా నన్ను ఇబ్బంది పెట్టదు.

ఇంతకంటే నాకు కావలసింది ఏముంది? రోమన్ చరిత్రలో చదివాను అసలు నేను అగస్టాను ఎందుకు చేసుకోకూడదు?”

జనవరి ఆఖరుకు ఆమె కనటానికి నెలలు నిండుతాయి. ఇక వెళ్ళిపోవాలి కదా!

మళ్ళీ ఒంటరిగా తనకిష్టమైన ప్రదేశం. సంతోషంగానే వుంటాడు కదా – ఈ సారి న్యూస్టెడ్ మకాం. అదీ అగస్టా సాంగత్యంలో హాయిగా గడిచిపోయింది.

తర్వాత లండన్ వెళ్ళగానే అందరూ అతని మీద విరుచుకుపడ్డారు. అగస్టాతో అతని వావితప్పిన శృంగారం అందరికీ తెలిసిపోయింది. పైగా బైరన్ ఇది దాయాలని అనుకోలేదు కూడా. అయినవాళ్ళకీ, కానివాళ్ళకీ అందరికీ, బహిర్గతమయి పోయింది. అలా చెప్పుకోవటంలో అతనికి ఒకరకమైన శాంతి లభించేదేమో! ఈ విషయాన్ని కారొలైన్ లాంబ్ టాం–టాం చేసింది.

అప్పటికే ప్రచురించబడిన "The Bride of Abydos" చదివి, ఈ జులేకా, అగస్టా ఒకరేనా అని అడుగుతున్నారు.

బైరన్ ఒకసారి లేడీ హాలెండ్ భవనంలో ఈ విషయాన్ని దాయటానికి ఏమీ ప్రయత్నించకుండా, "నేను ఎంతగానో ప్రేమించిన యువతి. ఇప్పుడు నా వల్ల బిడ్డను కనబోతోంది. ఆమె ఆడపిల్లను కంటే 'మెడోరా' అని పేరుపెడతాను" అంటాడు. ఇంతకంటే స్పష్టంగా ఎవరైనా చెప్పాలా? ఆ రాత్రినుంచే అన్నీ స్పష్టంగా తెలిసిపోయాయి. ఇప్పటివరకూ అతన్ని అసహ్యంగా చూసిన వారికి, ఈ మలిన శృంగారం, తన మారుటి అక్కతో, పైగా బిడ్డను కనబోవటం మహా నేరంగా పరిగణించారు. దీనికి నిష్కృతి లేదు. పైగా అతను రాజకీయంగా కూడా ప్రతిపక్షంలో వుండి రాజాగ్రహానికి గురికావచ్చు కూడా. నెపోలియన్ ఎడల అతని ఆరాధన కూడా బహిర్గతం. అప్పటికి మిత్రసేనలు ఫ్రాన్సును ఆక్రమించాయి. అయినా బైరన్ నమ్మకం, తను ఎంతగానో ఆరాధించే నెపోలియన్ బోనపార్టీ "Mine Heros de Roman" ఆ సేనల్ని తిప్పికొట్టగలడని!

బైరన్‌కు మిగతా ఐరోపాలో వున్న 'స్తబ్దమూర్ఖ' రాజకీయ వాతావరణం ఎంతమాత్రం ఇష్టంలేదు. "రాజుల నాసికాగ్రాలపైని దర్భలను నిలబెట్టే" ఆచారం అతనికి అసహ్యం! ఇలాంటి అభిప్రాయాలను బహిరంగంగానే తెలియజేసేవాడు! అదీ యుద్ధ వాతావరణం చుట్టూవుండగా! అప్పటికీ, అతనికి కవిగా గొప్ప కీర్తి, ప్రేమ వ్యవహారాల విచ్చలవిడితనపు చెడ్డ పేరు, అతనికి శత్రు సైన్యాన్ని తయారుచేసింది.

అతని గర్వం – నోటి దూకుడు – లెక్కలేని తనం – ఇవన్నీ ముప్పేట అతని మేధోసంపత్తి – సౌందర్యం – అతని స్వతంత్ర భావాలన్నీ కలగలసి అతనికి వ్యతిరేకంగా లండన్‌లో వైరివర్గాన్ని తయారు చేసింది. అది ఎంతగా రగిలిపోతోందంటే ఏపాటి చిన్న వంక దొరికినా కక్ష సాధింపుకు సిద్ధమవుతోంది.

అలాంటి సందర్భం రానేవచ్చింది!

ఎనిమిది వరసల కవిత అతను ఎప్పుడో సంవత్సరం క్రితం రాసినది. ప్రిన్స్ రీజంట్‌కు వ్యతిరేకంగా. అప్పుడు ఎవ్వరూ పట్టించుకున్నవారు లేరు. దాని సందర్భం అతని తోటి లార్డులు – విగ్స్, అతనితో ప్రిన్స్ రీజంట్ కూతురు చార్లెట్ కళ్ళ నీళ్ళు పెట్టుకుందని.

అప్పటి వార్తను చూసి–

ఆమె కోసం, తన పేరు లేకుండా ఈ పంక్తులు రాశాడు –

దుఃఖించవమ్మా రాజకుమారీ
తండ్రి అవమానం – రాచరికపు పతనం
నీ కన్నీటి చూపులు – తండ్రి తప్పులు
కడిగివేస్తాయి.

దుఃఖించు – నీ దుఃఖాశ్రువులు పవిత్ర జలాలు
అవి – ఇప్పుడు బాధల్లో వున్నవారికి ఊరట!
ముందు కాలంలో నీకు ప్రజలు
తమ చిరునవ్వులతో
బాకీ తీర్చుకుంటారులే...

అప్పుడు ఇవి ఎవ్వరూ పట్టించుకోలేదు.

మన హీరో అంతటితో పోనివ్వడు కదా. ఇప్పుడు 'Corsair' ముద్రణ సమయంలో ఈ ఎనిమిది పంక్తులు ముద్రించి చివర తన పేరుతో ప్రచురించమన్నాడు. దానికి ముర్రే 'అది చాలా ప్రమాదం' అని హెచ్చరించాడు. అయినా బైరన్! వింటాడా–

"దానికి పర్యవసానాలు నేను లెక్కచేయను. నాకు ఇప్పుడు రాజకీయాలు, ముసలివాడికి పడుచు ప్రియురాలిలాంటివి. అవి ఎంత ఛండాలంగా తయారయితే నాకంత ఇష్టం" అంటాడు.

అనుకున్నంతా జరిగింది. ఈ ఎనిమిది పంక్తులు వార్తాపత్రికల్లో తుఫాను రేపాయి. ఇది రెండువైపులా పదునుకల కత్తి. కేవలం అతని రాజకీయ అభిప్రాయాలనే కాదు, అతని వ్యక్తిగత జీవితాన్ని దుయ్యబట్టాయి. అంతేనా అతని మతవిశ్వాసాన్ని, అదే విశ్వాసం లేకపోవటాన్ని ఎండగట్టాయి.

ఎంత ఘోరంగా విమర్శలు వచ్చాయంటే, అతని స్నేహితులు ఆ విమర్శకులను వదిలిపెట్టవద్దన్నారు.

"నేను, నాకు సమవుజ్జీలతోనే పోరాడతాను. ఇలాంటి అల్పులను శిక్షించటంలో నాకెలాంటి ఆనందం వుండదు" అంటాడు.

ఈ విమర్శలు, ఎదురు దాడులవల్ల అతని పుస్తకానికి మంచి గిరాకీ లభించింది. విడుదల రోజునే 13 వేల కాపీలు అమ్ముడయిపోయాయి. ఇది కనీవినీ ఎరుగనిది.

ఇది కేవలం అతనిమీద జరిగిన వ్యతిరేక ప్రచారమే కారణం కాదు. అసలు ఆ 'Corsair' కథ వింత. ఆశ్చర్యకరమైనది! దానిలోని కవితాశక్తికి అందరూ ముగ్ధులయ్యారు. ఇప్పటివరకూ, అలాంటి 'విధానం' అప్పటివరకు సాంప్రదాయకంగా వున్నదానిపై తిరుగుబాటు, గొప్ప శైలి, తిరస్కరణ సంప్రదాయాన్ని మూలాల్లో ఛిద్రం చేయటం, సాంఘిక నియమాలు నీతిసూత్రాల శృంఖలాలను తుంచేస్తు అక్రమ సంబంధాలు, అగమ్యాగమన శృంగార బంధం అతని స్వాతంత్ర్యం – సముద్రపుటలల లయగా విరుచుకు పడుతున్నట్లు, నురగలు కక్కుతూ పరుగులు పెట్టటం, ఇవన్నీ అద్భుతంగా ఆశ్చర్యంగా అసూయగా వ్యక్తికీ మిగతా సంఘానికి, ఘర్షణలను చెలరేపింది.

ఈ విషయంలో మధ్య వ్యక్తి ఒక వంద సంవత్సరాలు ముందు చూపుతో, అదీ అప్పటి కవిపండితుల గుంపులతో పోలిస్తే వుండిపోయాడు. ఇది వారికి ఎలా మింగుడు పడుతుంది? ఇది అసహజంకదా! ఇప్పటివరకూ ఎన్నో తరాలు స్వతంత్ర భావాలు కరవై దాహంతో కొట్టుమిట్టాడుతుంటే 'Corsair' హీరో మగటిమికి, తన సహజత్వ విశృంఖలత్వానికి మూర్తిమంతమై నిలిచాడు.

"బైరన్ ప్రభావం సామాన్యమైనది కాదు. ఇప్పటివరకూ వున్న అతని ముందుతరాలు, వారి వారసులు అందరూ దీనిలో పడి కొట్టుకుపోయారు!

అతన్ని అందరూ చదివారు. మగవాళ్ళు, ఆడవాళ్ళు, నౌకాదళాధిపతులు, వ్యాపారస్థులు, గుమాస్తాలు, దర్జీలు, గౌనులు కుట్టి అమ్ముకునేవారు, అప్పటి న్యాయాధిపతులందరూ చదివారు. మళ్ళీమళ్ళీ చదివారు.

ఆ కవితల నేపథ్యం, అది – తూర్పు దేశాల నీలాకాశం, పచ్చని తీరాలు, ఎత్తైన కొండలు – ఇవన్నీ వారిని ఆశ్చర్యపరిచాయి. 'చైల్డ్ హెరాల్డ్' కంటే కూడా

ఈ 'Corsair' లోని ఘర్షణలు, భావోద్వేగాలు, మరీ లోతయినవి. అవే బైరన్‌ను కవిగా, తిరుగుబాటుదారునిగా అందర్నీ ఆశ్చర్యపరచింది. వారంతా ఇటువంటి స్వాతంత్ర్యం కోసం, అదీ రాజకీయాలు, భావోద్వేగాలకు సంబంధించింది, వీటన్నిటికోసం మొఖం వాచి వున్నారు!

లండన్ – ఇక్కడ చుట్టూ గుంపులున్నా నువ్వు ఒంటరిగాడివే. డాబు, దర్పం, గర్వం, పటాటోపం, ఇవే గుంపులు.

"నాకు ఆశ్చర్యం వేస్తుంది! ఇలాంటి ప్రపంచంలో ఎలా సయోధ్య సమ ఉజ్జీ కుదురుతుందని ఈ షోకులు, షికార్లు, రాజకుమారులు, వారి పక్క వాద్యగాళ్ళు, ప్రౌఢస్త్రీలు, వయసు వాలుతున్న మగవారు – వీరందరి మధ్యలో నేను ఏమి చేయాలి! దీనికి మించి ఏమయినా వుందా? ఎలా తెలుస్తుంది? నాకేం తెలుస్తుంది?

జనవరి 22కు 26 ఏళ్ళు వచ్చాయి. నాకు ఆరువందల ఏళ్ళు వచ్చినట్లుంది.

కానీ నా ఆలోచనలు, ఆశలు ఆరేళ్ళ కుర్రవాడిలాగా!"

ఇప్పుడు కూడా ఆహ్వానాలు వస్తున్నాయి. ఏవో నాటకాలు చూస్తున్నాడు కూడా. హాబ్ హౌస్ అంటాడు, నీవు వంటరి పక్షివి అయిపోతున్నావని!

"పోయిన వారమంతా చదువుతూ గడిపాను. ఒకరిద్దరు సందర్శకులు వచ్చారు. ఆవులింతలు వస్తున్నాయి. ఏమీ రాయలేకపోయాను. నాకీ సంఘంతో పని ఏమిటి – అవసరం ఏమిటి? నేనిప్పుడు కావాలనుకోవటంలేదు! అందుకోసం విచారం కూడా లేదు. "నాకు 'మనిషి' ఆనందాన్నివ్వలేదు! ఒక్క స్త్రీ చాలు. అదీ, కొంతకాలం!

నాలో ఆలోచనలు, స్త్రీ సమక్షంలోనే మార్దవంగా వుంటాయి. ఒక వింత ప్రభావం కూడా వుంటుంది! వారు నన్ను ప్రేమించకపోయినా – అయినా శృంగారం అంటే నాకు పెద్ద గొప్ప అభిప్రాయం ఏమీలేదు. "వారి సన్నిధిలో ఒక ప్రశాంతత వుంది. నాలో హాస్యం, ఆనందం వుంటుంది. చివరికి నిప్పు

రాజేసే మూల్ దగ్గర్లో వున్నా ఆమె పురాతన వదలిపోయిన ప్రాణి, నాలో హాస్యాన్ని రగిలిస్తుంది.

నాకు నేను దగ్గరగా నా దీవిలో నేను హాయిగా.”

కింగ్ లియర్, హామ్‌లెట్, మాక్‌బెత్ నాటకాలు చూస్తూ గడిపేశాడు సాయంత్రాలు. అతనికి షేక్స్పియర్ కంఠతా వచ్చు. అతనితో జీవించాడు! అతను తన జర్నల్‌లో చాలా తరుచుగా ప్రిన్స్ డెన్మార్క్ గురించి రాసేవాడు. ఈ చలికాలం పూర్తిగా షేక్స్పియర్‌తోనే గడిచిపోయింది.

ఇక ఇంగ్లాండు యుద్ధ వాతావరణం బాగా వేడెక్కింది. హాబ్ హౌస్ అంటాడు – ఫిబ్రవరి చివరికి ఇంగ్లండు సైన్యాలు, పారిస్‌లో అడుగుపెడతాయి అని.

బైరన్ తన హీరోని వదల్లేదు. ఆ రాత్రే పందెం వేస్తాడు. నెపోలియన్ విజయం గురించి. 28 Feb, Blucher - Meaux చేరతాడు అంటూ! బైరన్ అప్పటికి గెలిచినట్లే–

ఒక వారం రోజుల్లో అంతా మారిపోయింది. మార్చిలో La Fere-Cham penoise లో జరిగిన యుద్ధం. అతనికి మరింత ఆశ కల్పించింది. Blucher ని కలవాలని అనుకుంటాడు. కానీ అంతా వారంలో తారుమారయింది.

ఏప్రిల్ 9, నెపోలియన్ తన సింహాసనాన్ని వదిలిపెట్టాల్సి వచ్చింది.

“అరె! దొంగలు పారిస్‌లో చేరారా?”, బైరన్ ఆశ్చర్యం! 10 ఏప్రిల్ – నెపోలియన్ ఎల్బా దీవిలో నిర్బంధం – అన్నీ జరిగిపోయాయి.

బైరన్ – హాబ్ హౌస్ బైటకు వెళ్ళి విజయ సంరంభం చూశారు. లండన్ అంతా వెలుగులతో నిండిపోయింది.

ప్రిన్స్ రీజంట్ భవనం – ‘కారల్‌టన్ హౌస్’ వెలిగిపోయింది.

'Long Live The BourBons' అని వెలుగుతోంది.

ఆ రాత్రి బైరన్ తన జర్నల్‌లో రాశాడు. "ఈ రోజు గుర్తుంచుకోవలసిందే.

"నెపోలియన్ తన సింహాసనాన్ని వదిలిపోయాడు! చాలా బాగుంది. Sylla గొప్పగా వ్యవహరించాడు. నెపోలియన్ అంత త్వరగా తన ఓటమిని అంగీకరించాలి కదా - ఆగండి! అతనిని ఎల్బా దీవిలో వుండటానికి ఏర్పాటయింది కదా - ఇదంత చాలా గందరగోళంగా వుంది.

"అతనితో పోలిస్తే నేనెంత? కానీ నా జీవితం అదే దారిలో వుందా? ఒక కిరీటంకోసం చనిపోవాలా? అలాగే మరి దేనికోసం బ్రతకాలి?"

తనకు ఎంతో నిరాశ మిగిల్చిన హీరోని అసహ్యించుకుంటూ, కింది పంక్తులు రాశాడు.

అంతా అయిపోయింది - నిన్న చక్రవర్తి!
తన చుట్టూ రాజులున్నారు-
ఇప్పుడో? ఊరూ పేరూ లేని వాడివి!
నికృష్ట జీవివి - ఇంకా బ్రతికి వున్నావు!
ఇతనేనా వేయి రాజ్యాలు గెలిచాడు-
ఈ భూమినంతా శత్రువుల బొమికలతో నింపాడు
ఇతనేనా ఇంకా మిగిలి వున్నాడు-
వేగుచుక్కలు చూడలేనివాడు-
ఎప్పుడూ పతనమయిపోతాడు!!

హాబ్ హౌస్‌కు ఎప్పుడు ఏమి జరుగుతోందోన్న ఆరాటం - అందుకే ఫ్రాన్స్ వెళ్ళి నెపోలియన్ చివరి గుర్తు లేమైనా వున్నాయా అని చూడాలనుకున్నాడు. బైరన్‌ను కూడా తీసుకెళ్ళాలనుకున్నాడు. కానీ అగస్టా కనబోయే రోజులు అతన్ని కదలనివ్వలేదు. ఏప్రిల్ 15 ఆడబిడ్డను కన్నది. బైరన్ ఏ మాత్రం ఆలోచన లేకుండా 'మెడోరా' అని నామకరణం చేశాడు. అప్పటికే లేడీ మెల్‌బోర్న్, ఈ సంతానం వావీవరస లేని లైంగిక సంబంధపు పాపఫలం! తప్పనిసరిగా ఒక 'పిశాచి' అనే నమ్మింది. "అలా అనుకోవద్దు. నన్ను ప్రేమించేవారి కోసం తపించిపోతున్నాను. మేమిద్దరం తప్పనిసరిగా సఖ్యంగా వుంటామని ఆశిస్తాను".

అగస్టా పాపను కన్న తర్వాత కొద్దిరోజులకే మూడువేల పౌండ్లు బహుమతి పంపిస్తాడు.

ఆమెను ఎంతగా ప్రేమించాడంటే ఈ పంక్తులే సాక్ష్యం.

1. నీ పేరు చెప్పలేను - నీ పేరు ఉచ్ఛరించకూడదు!
అందులో బాధ దుఃఖం ఉంది, పరితాపం ఉంది.

కానీ ఇప్పుడు నా చెక్కిలి కాల్చివేస్తున్న కన్నీటిబొట్టు

గుండెల్లో నా లోతైన భావాల్ని మౌనంగా చూపిస్తాయి.

2. ఇది మన ఉద్వేగానికి సమయం చాలదు
మనశ్శాంతికి అనంతమైనదే.
మనం సంతోషంగా గడిపిన కాలం అందులోని
చేదు అనుభూతులు అంతమవుతాయా?

3. పశ్చాత్తాపం - త్యాగం - మన శృంఖలాలు తెంచుకోవాలి!

మనం విడిపోవాలి - ఈ ఎడబాటు - కలవటానికే

4. ఆనందం నీది- అపరాధం నాది!
నన్ను క్షమించు - నిన్ను ఆరాధిస్తున్నాను
తప్పనిసరి అయితే త్యజించు!

5. ఈ హృదయం నీదే - అది అలాగే నశించిపోతుంది
హృదయాన్ని పగలగొట్టటం ఏ 'మనిషి' వల్లకాదు
నీవేమనుకున్నా

...నీవు నా ప్రక్కనుంటే
ఈ ప్రపంచం మన పాదాలచెంతే..

ఇది చదివి అగస్టా ఏమని అంటుంది-
ఈ ఉద్వేగపు దుఃఖాన్ని ఎలా భరించగలదు-

ఆమె కూడా అతన్ని ప్రేమించలేదా? అది తన దారిలోనే, అతను లేకుండా ఆమె వుండగలదు. అతనికి ఒక భార్యను వెదికి పెట్టేదే – ఈ అక్రమ సంబంధాన్ని ఈ పాపపు బంధాన్ని తెంపివేసేదే – కానీ అతని ముందు ఆమె నిస్సహాయురాలు – అతడు తన సోదరుడు – తమ్ముడు – చాలా కీర్తిగలవాడు, ధనవంతుడు, తన ఇరుకు, విసుగు జీవితంలో అతనే ఆశాకిరణం, తనను రక్షించగల వీరుడు. అందుకని అతని పాలనలోనే వుండిపోవలసి వస్తోంది!

ఇంగ్లాండును పాలించే నాలుగు వేలమంది పరిపాలకులు – వీరంతా మిగతా దేశమంతా నిద్రపోయే సమయంలో మేల్కొని వుంటారు. వీరే పాలించేది. వీరికి ఇంగ్లాండు విజయం శాంతిని తెచ్చింది.

యుద్ధాన్ని పండుగ చేసుకున్నట్లే – ఈ 'శాంతిని' కూడా ఉత్సవం చేసుకుంటున్నారు.

రష్యా రాజుకు, ప్రష్యా రాజు కోసం విందులు వినోదాలు నడుస్తున్నాయి.

బైరన్, క్లబ్‌లో వెల్లింగ్‌టన్ రాజకుమారుని కోసం విందు ఏర్పాటు చేశాడు. హాబ్ హౌస్ అల్బేనియా వీరుని దుస్తుల్లో, బైరన్ ఒక సన్యాసి గౌనులో వస్తారు. ఆ రాత్రి కారోలైన్ చాలా విశృంఖలంగా ప్రవర్తించింది.

తెలతెలవారుతుండగా తన 'అల్బేనీ' అపార్టుమెంటుకు వచ్చాడు. అది 'పికాడెల్లీ'లో ఎంతో రమణీయమైన వాతావరణంలో వుంది. ఆ రాత్రి చివరి ఘడియల్లో 'లారా' కథ రాయటానికి కూర్చున్నాడు. అదీ దీర్ఘ కవితే. ఎవరీ లారా?' అతనికి ఏ దేశమూ లేదు. ఎవరికీ సంబంధించిన వాడుకాదు. స్వచ్ఛమైన బైరన్ హీరో! చాలా ఉదారుడు. అతని హృదయం ప్రేమించటానికే సర్వసిద్ధంగా వుంటుంది! కానీ తన చిన్ననాటి చితికిపోయిన బాల్యం. తర్వాత తొలి యౌవనంలోని తీరని భ్రమలు. అవి ఎంత మూర్ఖమైనవో తెలిసినవే. అది 'లారా' స్వరూపం. అతనికీ 'కోన్‌రాడ్'కీ చాలా దగ్గర పోలికలున్నాయి. కోన్‌రాడ్‌కీ, 'చైల్డ్ హెరాల్డ్'కీ దగ్గర పోలికలున్నాయి. వీళ్ళందరికీ బైరన్‌కీ గాఢమైన ముద్రలున్నాయి.

'లారా'లోని ఈ మూడు కోణాలు – రచయిత వ్యక్తిత్వాన్ని స్పష్టంగా చిత్రించబడ్డాయి. అవి ఎంత తేటతెల్లంగా పారదర్శకంగా వున్నాయంటే అగస్టా కూడా ఆశ్చర్యపోయింది!

1. ఎవరితను? ఎక్కడివాడు?

ఇతన్ని ప్రేమించాలా? ద్వేషించాలా?

అతని మౌనం – ఇతరుల ఊహలకే తావిస్తోంది.

వాళ్ళమధ్యనే నడుస్తూ అంతస్తు గలవాడే

ఎందుకు అతనికి వారంటే అసహ్యం?

అతని నవ్వు చిరునవ్వు పెదవులను దాటదు

అది అప్పటికే వాడిపోతుంది

అతని ఆనందం కనుల్లోను చూడలేం

అతని హృదయం నవనీతం – బలహీనం

అతని అహానికి తగింది కాదు

అతని గుండెల్లో గూడు కట్టుకున్న నిరసన

ఇంతకంటే ఏమి పోతుంది?

ఈ ప్రపంచంలో ఒక అపరిచితుడు

మరో లోకం నుంచి పొరపాటున పడిపోయిన గంధర్వుడు...

ఈ ప్రపంచంలో తనొక అపరిచితుడు – ఇదే భావనలో వుండిపోయాడు.

దిక్కుతోచని ఆత్మ! పతనమైన దేవత!

ఒక మహత్కార్యానికై అవతరించిన వాడు – వీరుడు!

కానీ విధిరాతవల్ల దుర్మార్గంలో సంచరిస్తున్నాడు. 'కోన్‌రాడ్'లాంటి హింసాత్మక భయంకరమైన దొంగల నాయకుడు. నీతిగా జీవితాన్ని మొదలుపెడితే అతని కోపాగ్నికి కారణం అతని పశ్చాత్తాపంతోపాటు అసూయా ద్వేషాలు, అదే అతనికంటే సంతోషంగా వున్నవారి అసూయా ద్వేషాలు అతన్ని చిత్రవధ చేశాయి.

ఈ సంఘర్షణ ఎవరితో మానవ జాతితోనా, లేదా, అతడు మంచిగా మారలేకపోయిన మనిషితోనా? కేవలం లిప్తకాలం తన అస్తిత్వంలో మనగలిగిన వ్యక్తితోనా?

నరకంలో వున్న 'లూసిఫర్'కు, స్వర్గంలోని 'లూసిఫర్' అంటే అసూయ. అలాగే బైరన్ అంటే బైరన్‌కు అసూయ. ఇందులో ఎవ్వరు సుఖంగా ఆనందంగా వున్నారు?

అప్పుడు 'ఇడా పర్వతంమీద' ఎంత ఆనందంగా గడిపారు ఆ వయసులో. ఇప్పుడు అగస్టాతో గడిపిన కాలం అదే జెన్నిట్ వీధిలో, ఇది ఏ విధంగా పశ్చాత్తాపంతో పునీతమవుతుంది.

తను కాలేకపోయిన బైరన్ ఎక్కడవున్నాడు? తన మార్దవ హృదయం ఏమంటుంది – తన చైతన్యం ఎటుపోయింది?

ఆ వేసవి దగ్గర పడింది. బైరన్, అగస్టాను సముద్ర తీరానికి తీసుకుపోతాడు. అక్కడ ఆగస్టు – సెప్టెంబరు నెలలు గడుపుతారు. హేస్టింగ్సులో అది 1814, పారిస్‌లో సైనికులు "It Reviendra" అని పాటలు పాడుతున్నారు. తన పొడవాటి గ్రే కోటులు కావాలని పాడుతున్నారు.

అగస్టా, ఆమె తమ్ముడు ఉత్తరాలు రాసుకుంటున్నారు. చిన్నపిల్లల్లా ముద్దులు గుర్తులు పెట్టుకుంటూ...



న్యూస్టెడ్ నెమలి

XXI

నిశ్చితార్థం !

(1814)

న్యూస్టెడ్!

పూర్వం జరిగిన బేరసారాల గురించి లాయర్ల వాదోపవాదాలు జరుగుతూనే వున్నాయి. కానీ హాన్సన్ గట్టిగా నిలబడ్డాడు. తన ఒప్పందం ప్రకారం, 'అబ్బే'ని తిరిగి బైరన్‌కు ఇప్పించాడు. దానితోపాటు బయానాగా ఇచ్చిన పాతిక వేల పౌండ్లు బైరన్‌కు దక్కాయి. పాపం మిస్టర్ క్లాటన్! కాని బైరన్ ఈ పాతిక వేలతో కొన్ని అప్పులు తీర్చగలిగాడు. ఒక పక్షం రోజులు తన శిథిల భవనపు శోభను అనుభవించటానికి వస్తాడు. టామ్ మూర్‌ను కూడా ఆహ్వానించాడు. "అరె – ఈ పరిసరాలు దీని శిథిల శోభ చూడతగింది. దీనిలో కొంత జీవం మిగిలివుంది! ఇక్కడి దెయ్యాలు, ఆటవికంగా మోటయిన తీరు ఇంకా, ఇక్కడి నీటిసెల – ఒంటరి – నిర్జన ప్రదేశం తప్పనిసరిగా చూడతగింది. దీనిలో ఇంకా ప్రాణం వుంది" అని కబురు పెడతారు. కానీ మూర్‌కి ఈ మొరటు నిర్జన ప్రదేశంపై అంత ఆకర్షణ లేదు.

అప్పటికిక బైరన్ రాత్రిపూట తిరిగే సన్యాసి దయ్యాల సహచర్యంలోనే – సమయం గడపాల్సి వుంది.

ఈ అవాస్తవిక సన్యాసి తన మెరిసే కళ్ళతో ఆ వరండాలో ఆగకుండా వెళ్ళిపోతుంటే బైరన్ నిర్లిప్తంగా చూస్తుండేవాడు. ఈ ఒంటరితనం అతన్ని వివాహం గురించి ఆలోచింపజేసింది. ఎందుకు పెళ్ళి చేసుకోకూడదు? "ఇలాంటి

విచారగ్రస్తమైన ప్రదేశంలో నాకు తోడు వుంటే మంచిదే. ఆమెతో కలిసి ఆవులించవచ్చు కదా". తనకి ఏకాంతం అంటే ఎంత ఇష్టమో, ఆ విషయం ఒక స్త్రీకి చెప్పటం ఇంకా ఇష్టపడేవాడు!

అతను చూసిన ప్రేమవ్యవహారాలన్నింటిలో వివాహం అన్నది లేదుకదా – ఇదీ ప్రయత్నిద్దాం! తనలాంటి 'పేరున్న' వ్యక్తికి పెళ్ళి – ఒక హఠాత్సంఘటనేకదా. ఆశ్చర్యపరిచేదిగా వుండాలి!

అతని సలహాదారులు – స్నేహితులు పెళ్ళి చేసుకోమని ఒత్తిడి చేస్తున్నారు. లేడీ మెల్‌బోర్న్, "నీకు చట్టబద్ధమైన భార్య కావాలి – ఆమె మాత్రమే నిన్ను రక్షిస్తుంది" అని ఖచ్చితంగా చెప్పింది!

అగస్టా కూడా తనకు తెలిసిన ఓ యువతిని చేసుకోమని సలహా ఇస్తుంది.

బైరన్, లేడీ మెల్‌బోర్న్‌కు రాస్తాడు–

"ఇప్పుడు వివాహమే నాకు సరైన మార్గం. కానీ ఎవరిని? ఇంక నాకు హృదయం, అందులో ప్రేమ మిగిలివున్నాయా? అలాగే ఎవరి ప్రేమను నేను పొందగలను? కానీ మూర్ అన్నట్లు, 'ఒక అందమైన భార్య, నాలాంటి వాడికి అలంకారమైన గర్వకారణం కదా? నా స్వేచ్ఛ నాకు వుంచి, తన పని తను చూసుకోగల సమర్థురాలు ఎవరున్నారు? నాకు ఇప్పుడు కావలసింది ఒక తోడు. భావోద్రేకంతో నన్ను బాధించే మరో శృంఖలం కాకూడదు. మళ్ళీ నేను ఎవరినైనా ప్రేమిస్తే అదీ పెద్ద విషాదం! దుఃఖాన్ని కలిగించవచ్చు. బహుశా అది జగరకపోవచ్చు అనలేను. ఎందుకంటే నా అలవాట్లు అంత త్వరగా మారిపోవు! ఇలాంటి సన్నివేశం, నన్ను మళ్ళీ దుర్మార్గపు ఉద్వేగానికి గురిచేస్తుంది."

ఎవరిని ఎంచుకోవాలి? పెద్ద సంఖ్య వుంది. Lady Francis Webster అందమైనది, చిన్నది. 'కానీ ఒట్టి తెలివితక్కువది' Lady Adelaide Forbes అగస్టా స్నేహితురాలున్నది. Lady Gower, లేడి కళ్ళ చిన్నది. అందాల ఎల్ఫిన్‌స్టోన్ వుంది. ఈమెతో కొంత ప్రేమాయణం నడిపాడు. కానీ ఆమె దూరంగానే వుంచింది. అన్నింటినీ మించి Lady Annabella Milbanke వుంది!

వీరు కలిసి రెండు సంవత్సరాలయింది. కానీ వీరిద్దరూ మానసికంగా దూరం కాలేకపోయారు.

ఆమె నిరాకరించిన తర్వాత, అతను తన బాధను పైకి చూపించే పిరికివాడు కాదు. ఆ గౌరవం కాపాడుకున్నాడు. కానీ తను మామూలు మనిషిలాగానే, పక్షపాత ధోరణిలో ఈ అవమానాన్ని ప్రదర్శించలేదు. "కానీ నిజానికి దీనిలో నుంచి నేను బైటపడ్డానా? మొన్న వేసవిలో 'No' అంది. రేపు 'అవున'నంటే ఎలా తీసుకోవాలి?"

ఈ ఆలోచనలన్నీ అతనికి, ఆమెపట్ల గౌరవాన్ని పెంచాయి. ఆమె స్థైర్యమే అతన్ని కాదన్నదికదా! ఎందుకో తెలుసుకోవాలని అతనికి ఉత్సుకత వుండదా? ఆమెకు ప్రేమించటం తెలుసా – ఈ తత్త్వవేత్తకు? ఇలాంటి ప్రాణిని, గర్వోన్నతిని తీవ్రమైన ఆలోచనాపరురాలిని మచ్చిక చేయటం ఆనందకరమేకదా?" అవీ ఆలోచనలు.

ఆశ్చర్యమేమంటే అనబెల్లా ఇలాంటి ప్రమాదం ఏమయినా జరుగుతుందేమోనని భయంతోనే ఆదుర్దాపడుతోంది. నిజానికి, తన కజిన్ కార్లోని కాదన్న వ్యక్తిని, తను ఆకర్షించగలిగిందంటే కాస్త గర్వంగానే భావించింది. అంతేనా, కేవలం తనే అతన్ని రక్షించగల పవిత్రురాలని నమ్మింది. ఈ అందమైన పాపి తనవల్లనే బాగుపడాలి!

ప్రేమ – ఎన్నో రూపాలు ధరించగలదు. ప్రేమికుల హృదయాల్లో ప్రవేశించటానికి!

కేవలం అతన్ని రక్షించాలనే కోరిక అనబెల్లాను దుర్బలంగా నిలబెట్టింది. ఆమె స్థైర్యాన్ని ఛిద్రంచేసింది!

తన నిరాకరణ ముహూర్తం నుంచి ఆమె ప్రశాంత జీవితంలో కల్లోలం మొదలయింది. ఆమె జీవితంలో బైరన్ యువరాజు, అశాంత మూర్తిని ప్రశంసించలేకపోయినా, అతని వ్యవహారాల గురించి ఆందోళనపడుతోంది.

లండన్‌లో అతని గురించి జరుగుతున్న ప్రచారం ఆమెను మరింతగా ఆందోళనపరిచాయి. ఇవన్నీ మనసులో పెట్టుకుని తన పెద్దమ్మకు కబురు పెట్టింది.

"అతన్ని కలవటానికి నాకు అవకాశం లేదు. కానీ మీరు నా మాటగా తెలియజేయండి. సంతోషంగా వుండాలని, కోరుకుంటున్నానని!" "ఒకవేళ నా వలన ఎలాంటి గౌరవం ఆయనకు కలుగుతుందన్నా, నా మంచి అభిప్రాయం మీద ఆధారపడవచ్చుని", "ఒకసారి కలవాలని అనుకుంటున్నాను" "ఒకవేళ నేను కలవటంవల్ల నాకు చెడు పేరు వచ్చినా ఫర్వాలేదు. అది ఆయనకు కీడు చేయకూడదు" ఇలా సాగింది. ఆమె లేడీ మెల్‌బోర్న్‌కు పంపిన సమాచారం.

చివరికి 1814 ఆగస్టులో, ఆమె చాలా స్థైర్యంగా–ధైర్యంగా బైరన్‌కు రాసింది – ఆహ్వానం లేకుండానే, "ఇప్పుడు నేను స్నేహం చేయటానికి సిద్ధంగా వున్నాను" అని. అలాగే అతనికి ఒక సలహా కూడా ఇచ్చింది. "ఎందుకు నిన్ను నువ్వు బాధలపాలు చేసుకుంటావు? క్షణికానికి బానిసవయిపోతావు? జీవితం ఎంతో గొప్పది. గొప్ప కార్యాలకు నిర్దేశించబడింది. ఒక లక్ష్యం పెట్టుకో. అది నీ ఆలోచనలు కార్యకలాపాలను పూర్తిగా ఆక్రమించి వుండాలి. మనిషిని ప్రేమించు. మంచి చేయి" ఆహాఁ ఎలాంటి ఉద్బోధ! అదీ బైరన్‌కు!

మన హీరో 'Corsair' నవ్వుకున్నాడు! అతని సమాధానం చాలా నిజాయితీగా పంపాడు. "నీవు, కేవలం, నీలాంటి యువతే నన్ను పెళ్ళిదాకా తీసుకువెళ్ళగలదు." లేడీ మెల్‌బోర్న్ చెప్పినట్లు ఈ యువతులందరిలో ఆమెనే ఎంచుకుంటాడు! అప్పటికీ ఎప్పటికీ!

"నీతో స్నేహమా? ఇంకా నేను ప్రేమించగలనా?

నా భావన ఎలా వున్నా నిన్ను గౌరవిస్తాను"

అరె! ఎంతగా మారిపోయాడు. ఇతను బైరన్ – తనకు తెలిసిన బైరనేనా? అనుకుంది లేడీ మెల్‌బోర్న్.

నిజానికి బైరన్‌లో నిజాయితీ ఎంత?

లోతుగా ఆలోచించే వ్యక్తులందరిలో ఒక ఊసరవెల్లి అంతర్లీనంగా వుంటుందేమో?

ఆమెకు రాసేముందు ఆమెను ఒకసారి గుర్తుకు తెచ్చుకున్నాడు.

ఆమె మోము గుర్తుంది. గుండ్రటి ముఖం! చెక్కినట్లున్న ముఖకవళికలు. చాలా అందమయినది! ఆమెను సంతోషపరచటానికి అతను మరొక అవతారం ధరించాడు. తన ప్రణాళికను ముందుకు తీసుకుపోవటానికి!

ఈ స్నేహం, పెళుసు! వ్యతిరేక భావాలు కలదే. కానీ కొన్నాళ్ళు బాగా సాగింది. బైరన్‌కు చాలా ఆనందంగా కూడా వుంది. తన విజయం కనుచూపు మేరలో కనపడుతోందని.

లేడీ మెల్‌బోర్న్ పాత్ర చాలా ముఖ్యమైనదే. పైగా అనబెల్లా ఇంతకు పూర్వం తను బైరన్‌ను తిరస్కరించినందుకు చాలా బాధపడింది.

మళ్ళీ అతనే వివాహ ప్రసక్తి తీసుకువస్తే బాగుండునని ఆశించి ఆ విధంగానే ప్రవర్తించింది.

ఏది ఏమయినా బైరన్‌ను ఉద్ధరించాలని తన జీవిత లక్ష్యంగా పెట్టుకుంది. అతని మంచి గురించే ఎక్కువ వినటానికి ప్రయత్నించింది! అతని కీర్తికంటే అతని గొప్పతనం ఎక్కువని నమ్మింది. అతని నవ్వులో సంతోషం లేదని దయతో ఆలోచించింది. నిజంగా ఇతను నాస్తికుడా? ఏమో నమ్మలేకపోయింది.

ఈ విషయంలో బైరన్ చాలా నిజాయితీగా వున్నాడు.

“ఇప్పటి వరకూ నీతో చర్చించటానికి ఇష్టపడని విషయం ఇది. నాకిష్టం లేనిది – కారణం మతం! నేను పెరిగిన బాల్యంలో గుడ్డి Calvinist నమ్మకం నాకు ఏవగింపు కలిగించింది.

ఆ తరవాత, నేను దర్శించిన ప్రదేశాలు స్పెయిన్, గ్రీకు, టర్కీ. అక్కడ పరిస్థితులు మరో విధంగా వున్నాయి. ఏదీ నిర్ణయించుకోలేని స్థితి. అయితే ‘దేవుణ్ణి నమ్ముతాను’. ఆ నమ్మకం బలపడితే మరింత సంతోషంగా వుంటాను.

కానీ, సంప్రదాయాన్ని మతాన్ని గుడ్డిగా నమ్మలేను. అరే ఈ మానవ జాతి సృష్టించిన మతాలను అసలు నమ్మలేను. నా నమ్మకం సృష్టికర్తమీద! అతను సృష్టిమీద కాదు!”

ఆమె అతనికి సలహా ఇచ్చింది జాన్ Locke చదవమని సాక్ష్యాల కోసం వెదకవద్దని చెప్పింది.

కానీ బైరన్ Lockeని నిరసించాడు. Job Isaih వీరు ప్రబోధకులే కానీ వారి సందేహాలు వారికున్నాయి!

'నాకు విశ్వాసం లేదు' అనే నిజాన్ని అతను కాదనలేదు.

"నేను ఏ నమ్మకాన్ని పెట్టుకోలేదు. సందేహాలు హానిచేస్తాయి.

"నేనెవరిని? ఇక్కడకు ఎందుకువచ్చాను? ఇక్కడ నుంచి ఎక్కడకు వెళ్తాను? ఇవన్నీ నిరర్థకమైన సందేహాలు.

బ్రతికివున్న ప్రాణులు – చనిపోయిన శవాల మధ్య ఈ శిథిలాల మధ్య నక్షత్రాలు, గ్రహాలు అనంతం, వీటన్నిటి మధ్య నేను అణువు గురించి ఎందుకు విచారించాలి?"

తిరుగు టపాలో ఆమె 'అవును, మనం అణువులం, ఈ విశ్వాంతరాళంలో, అణువుకు విలువ లేదా? అనంత శక్తికి అణువుతో పని లేదా?' ఆ సర్వోన్నతుని శక్తిని తక్కువ అంచనా వేయటం, శంకించటం, అంతకంటే అందులో లీనమయిపోవటం క్షేమకరం కాదా?"

అతనికి ఒక రకమైన ఆధ్యాత్మిక గురువుగా మారిపోయింది.

"దయ, కరుణ, భూతదయ అలవాటు చేసుకో. మంచి చేయి, నీవు ఎంతో మందిని ప్రభావితం చేయగలవు. నా అనుభవంలో నుంచి చెబుతున్నాను. నేను ఎంతో సంతోషాన్ని, ఆనందాన్ని అనుభవిస్తున్నాను."

ఆమె దృష్టిలో తాను, ఈ బైరన్ అనే బలహీనుణ్ణి రక్షించటానికి పూనుకున్నట్లు అందులో విజయం సాధించబోతున్నట్లు భావిస్తోంది. పాపం అనబెల్లా! అతనికి రాయకుండా వుండలేకపోతోంది. అతని కవిత్వం అంతా చదివింది.

"గొప్ప కవి – అతని భాష, అందులోని ఉద్వేగం, ముఖ్యంగా ప్రేమగురించి అతని గాఢమైన కవిత్వం, నన్ను ప్రేమించేట్లు చేస్తున్నాయి."

లోలోపల అతనంటే ఆరాధనతో, ఆలోచనలతో నిమగ్నమయిపోయింది. ఇది ఎంత దూరం వెళ్ళిందంటే, తన తల్లిదండ్రుల ద్వారా, బైరన్‌ను వారింటికి రమ్మని ఆహ్వానం పంపించింది. అతన్ని తనే సరైన మార్గంలో పెట్టగల విశ్వాసం గలది. బైరన్ పాపం ఏమాత్రం హాని చేయలేని అమాయకుడు.

ఈ విషయం మేనత్తకు తెలియజేసింది. "బైరన్, తన యాత్రకు బయలుదేరుతున్నాడని విన్నాం. ఈ సమయంలో ఆహ్వానించటం సరైన సమయమని ఆలోచించాను." దీనికి లేడీ మెల్‌బోర్న్ వత్తాసు పలికింది. ఈ విషయంలో మేనకోడల్ని ఆమె సమర్థించింది.

తన మేనకోడల్ని నీకెలాంటి భర్త కావాలని అడిగి, తన అవసరాన్ని తెలియజేయమంది. దానికి సమాధానంగా ఈ సమాచారం అందింది.

భర్త:

* అతనికి స్థిరమైన అభిప్రాయాలు, మంచి అభిప్రాయాలు ఉండాలి. దయాగుణం, హేతుబద్ధంగా ఆలోచించాలి.

* మేధావి కానవసరం లేదు. కానీ పైన చెప్పినవాటిలో కలిసిన తెలివితేటలు ఆహ్వానిస్తాను.

* అనుమానాలు, అసూయలాంటి భయాలుండకూడదు. అలాగే కుళ్ళు హాస్యాన్ని భరించలేను.

* నన్ను ప్రేమించగలిగి వుండాలి. అందులో సమతుల్యం వుండాలి.

* నా భర్త నన్ను, మంచి సలహాదారునిగా భావించాలి. కానీ గుడ్డిగా నా మీద ఆధారపడకూడదు.

* అతని అంతస్తుతో పనిలేదు. కానీ మంచి, అవసరమయిన పరిచయాలు చాలా ముఖ్యం.

* అందానికి అంతగా ప్రాధాన్యం ఇవ్వను. కానీ పెద్దమనిషిగా గౌరవప్రదంగా ప్రవర్తన వుండాలి.

* పిచ్చివాళ్ళ కుటుంబంలోకి ప్రవేశించటం, నాకిష్టం లేదు.

ఈ సమాచారం చదివి, ఆమె భుజాలెగరవేసింది. అరె! తానేమీ చేయగలదు–

"హేతుబద్ధమైన, ఋజువర్తనగల" వీటికి వ్యతిరేకమైన వ్యక్తిని, బైరన్‌ను, మంచిగా, నిజాయితీగా వుండమని ఎలా అడగగలదు – వీళ్ళిద్దరికీ పొసిగేదెలా?

"అరె! అవన్నీ సాధ్యమేనా – నీకు లౌక్యం తెలీదా?" అని తన మేనకోడల్ని చీవాట్లు పెడుతుంది!

ఈ విషయాన్ని బైరన్‌కు చేరవేస్తే, "అరె! ఆమె ఇంతగా చెడిపోయిందా? ఫిజిక్స్‌కు, మెటా ఫిజిక్స్‌కు తేడా తెలీదా? నేను ప్రేమిస్తున్నానా? నిజానికి ఆమె 'నైతికత'తో బరువెక్కిపోయింది!" అంటూ తెలియజేస్తాడు.

అతను న్యూస్టెడ్‌లో వుంటాడు. అదే సమయంలో, లేడీ ఫ్రాన్సిస్ వెబ్‌స్టర్ తన భర్తను మోసం చేసి, తన దగ్గరకు రాగలదా అని ఆలోచిస్తుంటాడు.

బైరన్ న్యూస్టెడ్‌లో ఆగస్టు 1814 లో వుండగా తనకు పెళ్ళి చేసుకోక తప్పదని నిర్ణయించుకున్నాడు.

అనబెల్లాకు రాస్తాడు. "నేను ప్రేమించగలను. నాకది అలవాటే. దాని నుంచి నాకు నిష్కృతి లేదు. మన పరిచయం మొదలయిన దగ్గర్నుంచి నీవంటే నాకు గౌరవం. నీవు ఎవరినైనా రక్షించగలవని నమ్మాను.

నేనంటే అయిష్టానికి కారణం ఏముంది – ఒకవేళ అలాంటి కారణాలు వుంటే తెలియజేయి. నేను అర్థం చేసుకోగలను."

ఇలాంటి వుత్తరం కోసమే చూస్తున్న అనబెల్లా సమాధానంగా–

మెట్ట వేదాంతంతో సమాధానం రాస్తుంది. "నాకు కావలిసింది ఒక గురువు. నడిపించగల గైడ్. నన్ను పూర్తిగా ఆదుకుని ఈ భూమి మీద ఒక ఉదాహరణగా, అనంత శాశ్వతం వైపు దారి చూపగల గురువు..." అని రాస్తుంది.

దీనితో బైరన్‌కు చిరాకు పుట్టి, అగస్టాకు అధికారం ఇస్తాడు, తనకు తెలిసిన లేడీ గోవర్‌కు కబురు పెట్టమని!

దురదృష్టం అక్కడ నుంచి వ్యతిరేక సమాధానం వస్తుంది!

చివరికి తనే స్వయంగా అనబెల్లాను అడగాలని నిశ్చయించుకుంటాడు.

ఆమెకు "నీకో విషయం చెప్పాలి. ఇప్పట్లో నిన్ను చూడలేకపోవచ్చు. అందుకనే ఇప్పుడే చెప్పాలనుకుంటున్నాను. నీవు చెప్పిన అడ్డంకులన్నీ దాటలేనివేమీ కాదు. నా గురించి ఇప్పటికే చెప్పాను. మళ్ళీ చెప్పటం చర్వితచరణమే! మళ్ళీ నీకు ఇబ్బంది కలిగించటం నా వుద్దేశ్యం కాదు. ఇప్పుడు మళ్ళీ నీ అంగీకారం కోసం రాయటంలో ఔచిత్యం వుండదనుకుంటాను."

దీనికి సమాధానం కోసం ఆతృతగా చూస్తున్నాడు. ఆ సమయంలో అగస్టా న్యూస్టెడ్‌లోనే వుంది.

ఉత్తరాలు వచ్చే సమయానికి, బైరన్ మెట్లమీద కూర్చొని ఆదుర్దాగా వున్నాడు. అగస్టా గమనిస్తుంది!

మర్నాడు బైరన్, అగస్టా, భోజనాల బల్ల దగ్గర కూర్చున్నపుడు తోటపనివాడు "తవ్వుతుంటే ఇదిగో ఇది దొరికింది" అని శ్రీమతి బైరన్ 'పెళ్ళి ఉంగరం' తెచ్చి ఇస్తాడు.

అప్పటికి ఎన్నో సంవత్సరాలకు పూర్వం ఆమె పోగొట్టుకుంది.

బైరన్‌కు ఏదో శకునం కనిపిస్తుంది. అదే సమయంలో ఆ వుత్తరం కూడా వస్తుంది. "దీనిలో ఆమె అంగీకారం వుంటే, ఈ వుంగరంతోనే పెళ్ళి చేసుకుంటాను" అంటాడు. ఆ వుత్తరం అనబెల్లా నుంచే!

"నేను ఎప్పుడో నాకు నేను, 'మాట' ఇచ్చుకున్నాను. నిన్ను సంతోషంగా వుంచటానికి నా ప్రయత్నం, నా జీవితాశయం అని. నిన్ను సంతోషపెట్టగలను. నాకు మరో ఆలోచనలేదు. నిన్ను నమ్ముతున్నాను. నిన్ను ప్రేమించగలను. నా ధ్యేయం, నీ అంచనాలకు చాలనేమోనని. నా ఆలోచనలలో అవసరాలలో మార్పేమీ లేదు".

"ఈ ఉత్తరం నీకు సమయానికి రాదేమో అనే అనుమానంతో, నీవు న్యూస్టెడ్‌లోకాక లండన్‌లో వుంటే అక్కడకు ఒక ఉత్తరం పంపాను. నీకు కావలసిన అన్ని విషయాలతో".

బైరన్ విజయోత్సాహంతో వుత్తరాన్ని అగస్టాకు అందిస్తాడు. అగస్టాకు ఇక్కడ జరుగుతున్న సంఘటనలన్నీ చూస్తూ చాలా నిరాసక్తతతోనే చెప్పింది. "ఇది నాకెంతో ఆనందాన్నిస్తోంది" అంటుంది. అంతేకాదు, తాను వెంటనే వదినగారి అవతారం ఎత్తి, తన తమ్ముడికి అక్కలాగానే ఈ పెళ్ళి జరిపించటానికి సిద్ధపడిపోతుంది. నీ హారికలాంటి తన మనసులో తమ బంధాన్ని పక్కనపెట్టి!

ఆ వుత్సాహంతో మూడు రోజుల్లో మూడు ఉత్తరాలు రాస్తాడు – అనబెల్లాకు.

"నీ ఉత్తరం నాకు కొత్త ప్రాణాన్ని పోసింది. నా అస్తిత్వాన్ని మార్చింది. – నిన్ను ఆహ్వానించటం కేవలం చాలా సామాన్యమైన మాట. కానీ ఇంతకంటే ఎలా చెప్పాలో తెలియదు. నా ఆనందం నీ చేతుల్లో వుంది. ఆ పని అప్పుడే చేస్తున్నావు కూడా. నిన్ను ఎప్పుడెప్పుడు కలవాలా అని ఉవ్విళ్ళూరుతున్నాను. ఉత్తరం తెరిచే ముందు నేను, నా అక్క ఒక్క క్షణం భయపడ్డాం ఏమి చదవాల్సివస్తుందోనని.

నీవే నన్ను నడపాలి – నీవే నా బోధకురాలివి?

నా స్నేహానివి – నా మనసంతా నీవే

మూడు రోజుల్లో ఇది మూడో వుత్తరం"

"...గౌరవంగా మరొక్కమాట కలపవచ్చా–

ప్రేమతో ఎప్పటికీ, నీవాణ్ణి"

ఆ విధంగా డాన్ వాన్ నిశ్చితార్థం జరగబోతోంది. ఈ తతంగంలోని కొత్తదనం అతన్ని ఎంతో ఉత్సాహపరిచింది. తను, పెళ్ళికోసం తపనపడలేదూ ఇన్నాళ్ళు? తను మేరీ చావర్తును ప్రేమించిన నాటినుంచీ? తనకు ప్రశాంత జీవితం అవసరం లేదూ?

ఈ సుగుణాల రాశి కంటే మంచి భార్య, అనుకూలమైన సంబంధం దొరుకుతుందా? ఆమెను ప్రేమించటం లేదా? అది రెండు రోజుల్లో జరిగిపోతోంది. తనీ వ్యవహారంలో పండిపోయాడు కదా! ఈ విషయం లేడీ మెల్‌బోర్న్‌కు తెలియజేయాలి. "మై డియర్ ఆంట్", అని మొదటిసారిగా సంబోధిస్తాడు. తనకు ఇన్నేళ్ళు పెద్దదిక్కుగా సలహాలిచ్చిన స్నేహితురాలు, ఇప్పుడు తనకు 'పెద్దమ్మ' కాబోతోంది! ఇది అతనికెంతో ఆనందాన్నిచింది!

నీ మేనకోడలు ఇలాంటి నిర్ణయం ముందుగానే తీసుకుని వుంటే, ఎందర్నో రక్షించి వుండేది కదా కష్టాల్లోంచి!

అయినదేమో అయిపోయింది. ఇదంతా నీ పుణ్యమే. నీవు కుదిర్చిందే! నా గర్వాన్ని, గౌరవాన్ని (అది వంశపారంపర్యంగా సంక్రమించింది కదా) నీవే కాపాడావు! నేను వివాహ ప్రసక్తి తీసుకు వచ్చింది, కేవలం ఆమెతోనే కదా. అదే నిశ్చయమయింది. పెళ్ళయిన తర్వాత ఇంకెవ్వరూ దొరకరు కదా. ఇది కేవలం సమాచారం కోసం అడుగుతున్నాను!" అంటూ ముగించాడు.

అతని స్నేహితులకు కూడా తెలియజేయాలి కదా. మూర్‌కు రాస్తాడు - త్వరలో నాకు పెళ్ళి జరగబోతోంది. అంటే ఆమె నన్ను చేసుకోవటానికి అంగీకరించింది! నా బిడ్డలకు తల్లి కాబోయే స్త్రీ పవిత్రురాలు – అంటూ తెలియజేశాడు. హాబ్ హౌస్‌కు, డేవీస్‌కు తెలియపరుస్తాడు.

ఇప్పుడు మిగిలింది – అనబెల్లాను – అగస్టాకు అనుకూలంగా మార్చటమే.

"నీకు అగస్టా ఉత్తరం రాసిందని తెలిసి ఆనందించాను. ఆమె నిస్వార్థ పరురాలు. నేనంటే చాలా అనుబంధం. నేను నిన్నే చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నది. ఇప్పటి వరకు నిన్ను కలిసే అవకాశం, అదృష్టం కలగలేదని విచారిస్తోంది. ఆమె చాలా సిగ్గరి. లేడి లాగా బెదిరిపోతుంది, కొత్తవాళ్ళ దగ్గర, మీ ఆహ్వానాన్ని ఇప్పుడు ఆమె స్వీకరించే స్థితిలో లేదు." ఒక ప్రక్క అనబెల్లా – మరోప్రక్క అగస్టా వచ్చే శీతాకాలం న్యూస్టెడ్‌లో అద్భుతంగా గడవవచ్చు!

అనబెల్లా తన నిర్ణయాన్ని అమ్మ-నాన్నలకు తెలియజేసింది.


వారికి బైరన్ కీర్తిప్రతిష్టల మీద గౌరవంకంటే భయాలే ఎక్కువ! అయినా సీహాం (అనబెల్లా నివాసం) వస్తున్నాడు కదా. చూద్దాం అనుకున్నారు. ఇక్కడే ఒక్క విషయం చెప్పాలి. అనబెల్లా తన చిన్ననాటి స్నేహితురాలికి, తన కాబోయే భర్త గురించి రాస్తుంది "ఈ ప్రపంచంలో లార్డ్ బైరన్‌ను లౌకికపరంగా బేరీజు వేయకూడదు. అతని దగ్గరవాళ్ళ ద్వారా అతను సహాయం చేసినవాళ్ళ ద్వారా అతని సేవకుల ద్వారా, బైరన్ దయాహృదయాన్ని అంచనావేయాలి.

గత రెండు సంవత్సరాలు, అతని బాధలకు నేనే కారణం. కానీ ఇప్పటి నా నిర్ణయం ఇద్దరికీ ఆనందాన్నిస్తుందని ఆశిస్తున్నాను". నిజానికి తనకు కాబోయే భర్త పూర్తి స్వరూప స్వభావాలు, వ్యక్తిత్వం, జీవితం గురించి ఆమెకు తెలిసింది తక్కువే. అది బాధాకరమైన అజ్ఞానమే. బైరన్ అంటాడు – "ఆమె మితిమీరిన ఆత్మవిశ్వాసం ఆమెను కష్టాల్లోకి దింపుతుంది సుమా". దీనిలో చాలా సత్యం వుంది. దీనికి ప్రత్యామ్నాయంగా ఆమె నమ్మకం చూడండి. వారి నిశ్చితార్థం జరిగిన వారం రోజుల్లో మరో వుత్తరం రాస్తుంది అదే స్నేహితురాలికి!

"నా పరిపక్వమైన నిర్ణయం, నన్ను ఆధ్యాత్మిక శాశ్వతత్వంలోనికి తీసుకోపోగల వ్యక్తినే కట్టబెట్టింది". పాపం, ఇది సహజమేకదా, ఇంకా లోకం తెలియని కన్యలకు తమ నిర్ణయంలోని అభిరుచులకు, కోరికలకు వ్యత్యాసం తెలియకపోవటం!

బైరన్‌కు, అనబెల్లాకు చాలా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. నిశ్చితార్థం జరిగిన తరువాత-

"బహుశా నీకు గుర్తుండకపోవచ్చు. మన మొదటి కలయిక మెల్‌బోర్న్ భవనంలో, వుదయం అతిథులందరూ వస్తున్నారు. అక్కడ నేను కొత్త. నాకెవరూ తెలియదుకూడా. కానీ నీ సాధారణ అమాయక సౌందర్యం నన్ను ఆకట్టుకుంది. నీవు అసలు మాట్లాడనేలేదు. కానీ నాకు తెలుసు నేను ఒక అసాధారణ వ్యక్తి సన్నిధిలో వున్నానని."



“అవును. నాకు బాగా గుర్తు. మన ఆలోచనలు ఒకే రకంగా వున్నాయి. తర్వాత ఒక రాత్రి విందులో మీకు, నా మేనత్తకు మధ్యలో నేను కూర్చున్నాను. కానీ మీరు ఆమెతోనే మాట్లాడుతున్నారు. ఆ సందర్భంలో ‘నాకీ ప్రపంచంలో ఒక్క స్నేహితుడు లేడు” అని అనే మాటలు నా మనసులో గుచ్చుకున్నాయి. మీ ప్రక్కనే వున్న ‘స్నేహాన్ని’ మీరు గుర్తించలేకపోవటం – తర్వాత నా గదికి వెళ్ళి చాలాసేపు దుఃఖించాను. మీకు ఈ ప్రపంచంలో ఒక స్నేహితురాలు వున్నదని, అలాగే పైన దేవుని స్నేహం కూడా వుంటుందని.”

బైరన్‌కు ఇది బాగా హృదయానికి హత్తుకుంది. ఈ లేఖలోని నిజాయితీ సౌందర్యం అన్నీ – కాని, బైరన్‌కదా. న్యూస్టెడ్ నుంచి లండన్ వెళ్ళేముందు తన తోటలోని చెట్టుమీద, తన పేరు అగస్టా పేరు కలిపి చెక్కాడు!



బైరన్ డైనింగ్ టేబిల్ దగ్గర



మిల్‌బాంకీ అనబెల్లా

XXII

వివాహం

(1814-1815)

పెట్రార్క్ లారాను పెళ్ళి చేసుకుని వుంటే–
జీవితమంతా లఘుగీతికలే రాస్తుండేవాడు!

(డాన్ వాన్)

తన విజయానికి అతను గర్వించాడు! కానీ అనబెల్లా ఇంటికి వెళ్ళటానికి చాలా సమయం తీసుకున్నాడు. ఎప్పుడూ హాన్సన్ దీనికి కారణమంటాడు. రాత కోతలన్నీ పూర్తవాలని పట్టుపడతాడు. ఈ వివాహం మూలంగా బైరన్‌కు పెద్దగా ఆర్థికంగా ఫలితం వుండకపోవచ్చు. అనబెల్లాకు సాలీనా వెయ్యి పౌండ్ల భరణం వస్తుంది. అందులో బైరన్ ఏడువందలు వాడుకోవచ్చు. ఇది అతని సంసారానికి, పిల్లాజెల్లా చేరితే ఏ మూలకు? తర్వాత ఎప్పుడో ఆమెకు 7, 8 వేల పౌండ్ల వారసత్వంగా రావచ్చు – సంవత్సరానికి.

కానీ బైరన్ తన ఆస్తిపాస్తులు పంచటానికి సిద్ధపడి ఆమెకు తన ఎస్టేటులో 60,000 పౌండ్లు రాస్తాడు. సంవత్సరానికి 2 వేలు ఆదాయం వస్తుంది! బైరన్ ఈ వివాహపు తంతును ఒక 'సంచలనం'గా నిలపాలని అనుకుంటాడు. కానీ ఇప్పుడు ఆమెను చూడటానికి వెళ్ళటానికే సిగ్గుపడుతున్నాడు.

"అరె – ఒక రోజు నిద్ర లేచేసరికి ఈ పెళ్ళి అయిపోతే ఎంత బాగుంటుంది? బిడియం, ఈ బిడియం నన్ను జీవితాంతం వెంటాడుతోంది. లేదా ఏదో తెలియని భయం? ఇప్పటివరకు జరిగిన జీవితం భవిష్యత్తులో ఎలా మారుతుందోనని ఉన్నదానిని వదులుకోవటం ఇష్టంలేకనా? కానీ అన్నింటికంటే బిడియమే "నేను

అనబెల్లా ఇంట్లో అడుగుపెట్టిన క్షణం చాలా వింతగా వుంటుంది. దానికి కారణం సిగ్గు, బిడియం, కొత్తవాళ్ళను కలవటంలో ఏమాత్రం ఉత్సాహం వుండదు. ఈ బిడియాన్ని ఎప్పటికీ జయించలేను" అని లేడీ మెల్ బోర్న్‌కు చెప్పుకుంటాడు.

ఈ లోపు, ఈ శిశిర ఋతువు లండన్‌లో తన స్నేహితులతో ఉత్సాహంగా గడుపుతాడు. ఈ బ్రహ్మచారి జీవితం మళ్ళీ రాదుకదా. అల్బేనీలో తన 'నలుపు తెలుపు' గదుల అలంకరణతో ప్రతి సాయంత్రమూ డగ్లస్ కిన్నార్డ్‌తో, హాబ్ హౌస్‌తో, మూర్‌తో విందులారగించాడు. పియానోమీద మూర్ ఐరిష్ పాటలు పాడుతుండేవాడు. ఆ సమయంలోనే బైరన్ ఒకటి, రెండు గ్లాసులు బ్రాందీ మింగేసేవాడు. అంతే చాలా ఉద్వేగంగా మాట్లాడేవాడు. మూర్–*'తొలిప్రేమ' పాటలు పాడుతుంటే, అతని మనోవీధిలోకి మేరీ చావర్తు, అగస్టా – మెదిలేవారు.*

సంగీతం – పూల పరిమళంలాగా, అతన్ని తన గతంలోకి తీసుకుపోయేది! అప్పటి మధురమైన స్మృతులు ఇప్పటి సత్యాల్ని మరుగున పడవేసేవి!

ఇవన్నీ తలచుకుని బైరన్ కళ్ళల్లో నీరు నిండేది. తను ప్రేమించిన వారెవ్వరూ సుఖంగా లేరు! – అతని స్నేహితులు హాయిగా నవ్వుకుంటూ పాటలు పాడుకుంటున్నారు. నిశిరాత్రిలో మూర్ పాట బరువుగా స్మృతులను రేపుతోంది...

నిన్ను ప్రేమించా నీ వెంటపడి

ఎంత సమయం గడిచిపోయింది!

నీ కనుల్లో వెలుగు చూడాలని

నా గుండె కొట్టుకులాడింది

నీ చూపులే కదా నే చదివిన పుస్తకాలు!

అవి నాకు నేర్పిందంతా తప్పుల తడకలే!

నా తెలివంతా ఏమయిపోతుంది?

నీ కనులమాయలో మరుగున పడిందా

బంధాలు – బాధలు – ఒక్క చూపులో

ఇంత తెలివిమాలిన అదృష్టమా?

నీ ఒక్క చూపుకోసం ఎంతగా

చిక్కి శల్యమైపోయాను?

ఈ పాటలో ఎంతో విషాదముంది

'తెలివి తక్కువ అదృష్టం' ఎవరిది?

ఇప్పుడు కూడా 'జార్జి గోర్డాన్ బైరన్' 'The wicked Lord' ఇప్పుడు వివేకంగా నడుచుకోగలడా?

ఇప్పుడు మారగలడా – మరో బైరన్ ఉద్భవించగలడా? ఎప్పటికీ జరగదు.

అతనికి తెలియని భయం పట్టుకుంది. రాబోయే రోజులు ఎలాంటి దారుణానికి దారి తీస్తాయో?

చివరికి – నవంబరులో అనబెల్లా ఇంటికి Seaham వెళ్ళటానికి ధైర్యం చేస్తాడు.

అప్పటికి, అది ఊరూ పేరూ లేని చిన్న రేవు పట్నం! మిల్‌బాంక్స్ భవనం సముద్ర తీరానికి దగ్గర్లోనే వుంది.

బైరన్ గుర్రపు సార్టు అక్కడికి చేరే సమయానికి అనబెల్లా తన గదిలో పుస్తకం చదువుతోంది!

కిందకు వచ్చి, బైరన్, హాలులో చలిమంట గూటి దగ్గర్లో కూర్చొని వుండటం చూసింది – అతను చేయి అందిస్తే అందుకుని ముద్దుపెట్టుకుంది. మాటలు లేవు. ఇద్దరూ మౌనంగా వుండిపోయారు.

చివరికి "మనం కలిసి చాలాకాలం అయింది" అని "అమ్మా–నాన్నను పిలుస్తాను" అంటూ వెళ్ళిపోయింది.

ఆ తర్వాత వారి ముగ్గుర్ని జాగ్రత్తగా పరిశీలించాడు. ఒకరితో ఒకరు ఆనందంగానే వున్నారు. అమ్మ పెత్తనం ఎక్కువ వున్నట్లుంది.

అతను మతం, రాజకీయాలు మాట్లాడాడు. వారు ఇంటి విషయాలు, తిండి విషయాలు మాట్లాడారు. అతని కథలు వారికి నచ్చలేదు. కానీ అతని 'పెద్దరికాన్ని' గుర్తించారు.

బైరన్‌కు ఈ సందర్శన చాలా అసంతృప్తిని కలిగించింది. అనబెల్లా కూడా అతన్ని ఉత్తేజపరచలేక పోయింది. అరె! ఎంత పొరపాటు జరిగింది – అని చింతించాడు! ఇది చాలా పాతకథే! దూరంలో వున్నపుడు ఆమె చుట్టూ రమణీయమైన కథ అల్లుకున్నాడు. ఇది ఆమెను కలవకుండా వున్నంతకాలం రమణీయంగా వుండేది. అతని మనసులోని ప్రేమ, దేవతల గుంపులో భద్రంగా మిగిలేది.

అతని ఊహల్లోని ఏ స్త్రీ అయినా నిజ జీవితంలో అతనికి దగ్గరగా వస్తే అదే ఆమెకు పతనం! అనబెల్లా నుంచి అతను ఆశించింది, ఆమె చాలా సున్నితమూ – ధైర్యమూ కలబోసిన వనిత – తనకు ప్రేమతో దారిచూపుతుంది అనుకుంటాడు.

అందరి కవుల్లాగానే తన స్వప్నసుందరి సాక్షాత్కారం జరగగానే వారిక ప్రేమకు పనికి రారు. ఇది ప్రేమలో వున్న బలహీనత అని మళ్ళీ తన ఊహల్లోకి నిష్క్రమిస్తాడు.

బైరన్‌కు నిజంగానే అర్థం కాలేదు. తన నిరుత్సాహం దేనిపైనో–

ఈమె స్వచ్ఛమైన కన్యే. అంత అందంగా లేదు. ఆమె తెలివితేటలు ఆమె బాధలు దాయలేదు. అతని ప్రతి మాటను ఆమె పరిశీలించి పరిశోధిస్తోంది. అతని కబుర్లేమీ ఆలోచించి మాట్లాడేవి కాదు. వీరి సంభాషణలు – వారి నీతి సూత్రాల గురించి, సెంటిమెంట్సు గురించి ఎక్కువగా వుండేవి. బైరన్‌కు అవేకదా సరిపడనివి. అతనికి పెళ్ళి రూపంలో ఒక తోడుకావాలి. సెంటిమెంటు కాదు – ఒక స్నేహితురాలు కావాలి. ప్రేమికురాలు కాదు. అసలు ఈ పెళ్ళి జరుగుతుందా అని అనుమానం వచ్చింది అతనికి! అప్పటికి ఎలాగో బైటపడ్డాడు.

పెళ్ళి కొన్నాళ్ళు వాయిదా వేశాడు. హాన్సన్ వంకతో, న్యూస్టెడ్ అమ్మకుండా, సరైన ఆదాయం లేకుండా పెళ్లెలా చేసుకుంటాడు? ఇది పెద్ద విషయం కాదు. దీనికోసం పెళ్ళి వాయిదా వేయటం ఎందుకంది? సాధారణంగా జీవించటానికి పెద్ద అదృష్టాలతో పనిలేదంది! ఆమె తలిదండ్రులు కూడా తొందరపెట్టారు. "ప్రియా నీతోనే – ఆనందం సంతోషం వస్తుంది" అని కబురుపెట్టింది.

"ఆనందంగా వుండటం వ్యక్తులవలనే కాదు, పరిసరాలు, పరిస్థితులు కూడా కలిసి రావాలి" అంటాడు. పెళ్ళి ముహూర్తానికి ముందు రోజుల్లో కూడా, 'బాగా ఆలోచించావా?' అంటాడు.

చివరికి డిశంబరు 23, వెళ్ళటానికి ముహూర్తం పెట్టాడు.

"అనబెల్లా, మన కలయిక పెళ్ళిలోనే, పెళ్ళి బంధం లేకుండా ఒకే ఇంట్లో వుండలేము. అది గౌరవం కూడా కాదు" అంటాడు.

అతనికి అగస్టా వుత్తరాలు చాలా ఆందోళన కలిగిస్తాయి.

హాబ్‌ను తనతో వుండమంటాడు. ఈ ప్రయాణం రెండు రోజులు పడుతుంది. దారిలో, 'పెళ్ళి' 'లైసెన్సు' కోసం దరఖాస్తు చేస్తారు. అధికారి, ఆ సర్టిఫికేట్ చేతికిస్తుంటే, "ఎంతమంది – పెళ్ళికి అంగీకారం తెలిపారు. ఎంతమంది విడాకులకు వచ్చారు" అంటాడు?

ఈ రెండురోజులు ఎంత ఆలస్యంగా గడిస్తే అంత మంచిదన్నట్లు పెళ్ళికొడుకు అడ్డంకులు పెడుతూనే వున్నాడు.

దారిలో అగస్టా దగ్గర ఆగుతాడు. హాబ్ హౌస్‌ను ముందుకు వెళ్ళమని, ఆమెతో క్రిస్టమస్ గడుపుతాడు. అక్కడ నుంచి అనబెల్లాకు రాస్తాడు.

ఇక్కడ క్రిస్టమస్ గడుపుతున్నాను, హాయిగా, వెచ్చగా. పెళ్ళి లైసెన్సు నా పెట్టెలో వుంది. మనం ఇంటిలో పెళ్ళి చేసుకోవచ్చా – మరోచోట ఇద్దరికీ జబ్బు, జలుబు చేయవచ్చు."

26వ తేదీ మళ్ళీ ప్రయాణం మొదలయింది. వారికి నాలుగు రోజులు పట్టింది, 'సీహాం' చేరటానికి వర్షం, మంచు కారణాలు. పెళ్ళికొడుకుకి, రోజురోజుకీ అతనికి ఓర్పు పెరిగిపోతోంది.

Byron

అనబెల్లా ఇంటిల్లిపాదీ, వీరి రాకకు ఆలస్యం జరగడంతో ఆందోళన పడిపోయారు. తల్లిగారయితే ఆందోళనతో మంచం ఎక్కింది. అనబెల్లా కన్నీళ్ళ పర్యంతం అయిపోయింది. హాబ్ హౌస్ ఆలస్యానికి కారణాలు చెబుతూనే వున్నాడు. పెళ్ళికొడుకు ఏమాత్రం తొందరపడడంలేదు మరి!

హాబ్ హౌస్, బైరన్ పుస్తకాలన్నీ చక్కని పసుపురంగు సిల్కులో బహుమతిగా ఇచ్చాడు. పెళ్ళికూతురు బహుమతి విప్పుతుండగా, హాబ్ హౌస్ చూస్తున్నాడు. పెద్ద అందగత్తేమీ కాదు, ఆడంబరంగా దుస్తులు వేసుకుంది.

చాలా మౌనంగా మాట్లాడకుండా వుంది, అణకువగా. బైరన్ అంటే ఇష్టంగా వుంది! అతనివంకే తదేకంగా ఆరాధనతో చూస్తూంది!

హాబ్ హౌస్, అనబెల్లా తండ్రి మిల్‌బాంక్, ఇద్దరు పురోహితులు అందరూ కలసి విందారగించారు. చూడగా చూడగా హాబ్ హౌస్‌కు, అనబెల్లా మంచి పిల్లగానే కనిపించింది. ఎవరైనా ఆమెను ప్రేమించి, గౌరవించవచ్చు అనే నిర్ణయానికి వచ్చాడు. మర్నాడు ఆ సంవత్సరం చివరి రోజు అందరూ సముద్ర తీరానికి వెళ్ళాలి. పెళ్ళి రిహార్సల్ వేసి సందడి చేశారు. రాత్రి పొద్దుపోయేవరకూ సరదాగా గడిపి కొత్త సంవత్సరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

జనవరి ఒకటి 1815. ఉదయాన్నే బైరన్ హాబ్ సముద్ర తీరంలో చాలా దూరం నడిచారు. ఆ రోజు అంతా బరువుగా గడిచింది.

బైరన్, "హాబ్ హౌస్, ఇవ్వాళ ఒక్కరోజే నీవాడిని. రేపటినుంచి అనబెల్లా అధీనంలోకి వెళ్ళిపోతాను" అంటాడు.

జనవరి 2వ తేదీ పెళ్ళికి ముహూర్తం!

మర్నాడు నిద్ర లేచేసరికి అతని పెళ్ళిబట్టలు పెట్టివున్నాయి. అవి చూసి బైరన్ ఒక్కసారిగా విచారంలో మునిగిపోయాడు.

అల్పాహారానికి కిందికి వచ్చిన బైరన్‌కు అందరూ హడావుడి పడటం గమనిస్తాడు, పురోహితుడు నోయిల్ వివాహ తంతుకోసం తన దుస్తుల్లో వస్తాడు. హాల్లో పెళ్ళి తంతుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బైరన్ బైటకు తోటలో తిరగటానికి వెళ్ళాడు. అవసరమైనపుడు కబురు పెట్టమన్నాడు. చివరికి అనబెల్లా తన తెల్లటి సిల్కు గౌనులో కిందికి దిగింది. బైరన్‌కు కబురు వెళ్ళింది. అతను వచ్చి పెళ్ళికూతురు ప్రక్కనే మోకాళ్ళ మీద వంగి, చాపలు చాలా మోటుగా వుండటం గమనించాడు. రెవరెండు థామస్ నోయిల్ పెళ్ళి తంతు నడిపారు. అనబెల్లా చాలా ప్రశాంతంగా వుంది. ఆమె బైరన్‌నే తీక్షణంగా చూస్తుంది.

బైరన్‌కూ ఏమీ వినపడలేదు.

ఏదో పొగమంచు అతని చూపును మందగించింది.

అతనికి మేరీ చావర్తును నుంచి విడిపోవటం, అక్కడి హాలులోంచి బైటకు రావటం, పచ్చని తోట, ఆమె సుందరమైన ముఖారవిందం, తర్వాత కన్నీటి నిప్పుల్లో కాలిపోవటం, ఇవన్నీ అతని మనసులో మెదులుతున్నాయి (దేవుడికే తెలియాలి ఎందుకో!). ఈ స్మృతులలో నుంచి తెంచుకుని, ఇప్పుడు ప్రమాణాలు చెప్పటానికి ఎంతో ఘర్షణకు లోనయ్యాడు.

“నా వనరులన్నింటితో నిన్ను ఆదుకుంటాను...” అంటూ హాబ్ హౌస్‌ని చూసి అరనవ్వు నవ్వుతాడు. దగ్గర్లోని చర్చి గంటలు మోగుతాయి. కొన్ని మందుగుండు సామాను కూడా పేల్తాయి తోటలో. మతపెద్ద మౌనంగా వుండిపోతాడు. మిగతావారు శుభాకాంక్షలు చెప్తున్నారు.

అప్పుడు బైరన్‌కు స్పృహ వస్తుంది. తనకు పెళ్ళి జరిగిపోయినట్లు తెలుసుకుంటాడు. ఇప్పుడు ‘లేడీ బైరన్’ ఒక్క నిమిషం మాయమైపోతుంది, దుస్తులు మార్చుకోవటానికి! వెంటనే నల్లని బూడిద రంగు గౌనులో తిరిగి వస్తుంది. చుట్టూ తెల్లని కుచ్చులుంటాయి.

అనబెల్లా తల్లి కన్నీరు నింపుకుంటుంది. తండ్రి గంభీరంగా వుండిపోతాడు. హాబ్ హౌస్ తన కర్తవ్యాన్ని, పెళ్ళికూతుర్ని బండి ఎక్కించి, పూర్తి చేస్తాడు.

“మీకు నా శుభాకాంక్షలు. ఎన్నో సంవత్సరాలు, మీరు సంసార సుఖాన్ని ఆనందంగా అనుభవించాలని కోరుకుంటున్నాను” అంటాడు.

"నేను సంతోషంగా వుండలేకపోతే అది నా బాధ్యతే అవుతుంది" అంటుంది అన్నేబెల్లా.

అప్పుడు బైరన్ హాబ్ హౌస్ చేయిపట్టుకుని బండి ఎక్కుతాడు.

సేవకుడు బండి తలుపు మూస్తాడు.

అరె – బైరన్, హాబ్ హౌస్ చేయి విడిచిపెట్టటానికి చాలా సమయం తీసుకుంటాడు. తన ఆత్మీయ మిత్రుడు దూరమైపోతున్నాడు.

ఒకటికి రెండుసార్లు పట్టుకుని వదులుతాడు.


గుర్రాలు కదులుతున్నా అతని చేయి పట్టుకునే వున్నాడు.

చివరికి హాబ్ హౌస్ ఎంతో విచారంగా, ఒంటరిగా అక్కడ శూన్యదృక్కులతో మిగిలిపోతాడు.

'నా పాత్ర సరిగా పోషించానా'! అని అడుగుతుంది అనబెల్లా తల్లి హాబ్ హౌస్‌ను.

హాబ్ హౌస్ తన ప్రియమిత్రుణ్ణి శాశ్వతంగా పోగొట్టుకున్నట్లు విచారంలో మునిగిపోతాడు.

సెలవు మిత్రమా



XXIII

మబ్బుల్లో చంద్రుడు

(శోభనం రాత్రులు)

(1815)

అతను నటిస్తున్నాడో – లేదో అప్పుడే చెప్పలేను!

–లేడీ బైరన్

'హాలన్‌బీ'లో ఒక భవనం, తన కూతురు శోభనం రాత్రులు గడపటానికి – అద్దెకు తీసుకుని అవసరమైనవన్నీ సిద్ధం చేశారు – సర్ రాల్ఫ్!

ఎలాంటి జంట? పెళ్లి కూతురు – ఉత్సాహంతో ఆదుర్దాగా ఉంది. మరోప్రక్క అధైర్యంతో, ఆగ్రహంతో వణుకుతున్న పెళ్లికొడుకు! ఎందుకని? అరె! ఎందుకీ పెళ్లి తనకు?

అగస్టాను రక్షించటానికా? ఆమె నుంచి వేరుపడటానికా? ఆమె గర్వాన్ని తృప్తిపరచటానికా?

అరె – ఇక తను చనిపోయేవరకూ ఈ గంభీరమైన అవక్రమైన, తనకు అపరిచితమైన ప్రాణి తన ప్రక్కనే వుండిపోతుంది కదా! ఇప్పటికే తనని పరీక్షగా గమనిస్తోంది – అంచనా వేస్తోంది.

అతని హృదయంలో రగిలే వ్యతిరేక భావంలో ఏదో పిచ్చి వుంది. అది దాయటానికి వింతగా పాడటం మొదలుపెట్టాడు – అలవాటు ప్రకారం! తన దౌర్భాగ్యాన్ని దాచుకోవటానికి తన దుఃఖాన్ని మరుగున పడవేయటానికి!!

దర్హాం వీధుల గుండా ప్రయాణం సాగింది. ఎక్కడో గంటలు మోగుతున్నాయి. "మన సంతోషం కోసం – ఆనందం కోసం మోగుతున్నట్లున్నాయి?" అని ఎగతాళిగా అంటాడు. చుట్టు అడవులు – భూములూ మంచుతో అలంకరించి వున్నాయి. మాట్లాడటం మొదలుపెట్టాడు.

ఈ పెళ్లి – నా వరకు ఒక ప్రతీకార చర్య – ఇప్పటి వరకూ ఈ మర్మాన్ని ఛేదించటానికి ఈ జీవితాన్ని గడిపా, పట్టుకు కూర్చున్నా! నేను హీరోగా నిలబడటానికి, అదీ శృంగార వీరునిగా చలామణి కావటానికి, కావలసిన ఆసరా ఎప్పుడూ అందుబాటులోనే వుంది. ఏమిటి ఈ పెళ్లి నన్ను కేవలం ఒక్క స్త్రీతో బంధించి పరిమితం చేస్తుందా? అలాగే కానీ – మన పాత్రలు మనం పోషిద్దాం!

నిజానికి కక్షసాధింపు కోసం పెళ్లి చేసుకోలేదు. మొదటిసారి పెళ్లి ప్రసక్తి తెచ్చినపుడు – నిజానికి తన జీవితంలో తోడు కోసం – ఆనందాన్నిచ్చే స్త్రీ కోసం తన మీద అజమాయిషీ చేసే వ్యక్తి కోసం ఆశించాడు. కానీ ఈ అనబెల్లా ఆమె కాదు! అందుకని 'నిన్ను' బాధితురాలినిగా చేస్తున్నాను – నన్ను కాదన్న క్షణం నుంచే ప్రతీకారానికి బీజం పడింది. అది బైరన్ వంశపు పిచ్చి లక్షణం!

ఆలీపచా నలభై రెండేళ్ల తరువాత కూడా, తన సోదరిని మోసం చేసిన వాడిని పట్టుకుని శిక్షించాడు – ఆ కథ మర్చిపోలేదు. 'బైరన్ రక్తం' కూడా అలాంటిదే! ఎప్పటికీ మర్చిపోదు.

ఇవీ అతని ఆలోచనలు – ఆమెతో వాగుడు!

"నీవు నీ ఊహలకు – నకిలీ మనిషివి!

నీలాంటి స్త్రీ నన్ను మార్చగలదా? నాలో పరివర్తన తేగలదా? ఒకప్పుడు ఆ అవకాశం వుండేది. కానీ ఇప్పుడు చాలా ఆలస్యం జరిగిపోయింది. అవకాశం చేజారిపోయింది.

"ఇప్పుడు నీవు నా భార్యవు! ఆ కారణం చాలు, నేను నిన్ను అసహ్యించుకోవడానికి" అంటాడు.

"మొదటిసారి నేను చేయి జాపినపుడు, అప్పుడు అంతా నీ అధీనంలోనే ఉండేది! కాని ఇప్పుడు ఒక సైతానును పెళ్లాడినట్లు తెలుసుకుంటావు" అని – ఆమె కంగారు పడటం చూసి నవ్వుతాడు? ఎంతో సహజంగా? ఆమె అతను హాస్యమాడుతున్నాడనుకుంటూంది!

అనబెల్లా – తన ధైర్యాన్ని, ఆధిపత్యాన్ని పోగొట్టుకుంటోంది. ఆమె స్నేహితులు బంధువులు ఆ గుణాలనే గొప్పగా చెప్పుకునేవారు!

అరె – ఈ విధంగా తనను ఎంతకాలం అతను శిక్షిస్తాడు? అక్కడ హాబ్ హౌస్ వుంటే చెప్పేవాడు, "నీవు గమనించినంతకాలం!" అని. కాని ఆమె గమనించకుండా ఎలా వుండగలదు? ఆమె చదువు, ఆనందం, ఆమె విజయాలు – ప్రమాదకరమైన ఆమె ఆత్మవిశ్వాసం – ఆమెను గమనించకుండా వుండనీయవు కదా!

బైరన్‌ను ఎలా అర్థం చేసుకుని – జీర్ణించుకోగలదు?

ఆనాటి సాయంత్రానికి వారు ప్రయాణిస్తున్న గుర్రపు బగ్గీ – హాలన్‌బీ భవనం చేరింది.

మంచు కురుస్తున్న రాత్రి మసక చీకటిలో – మార్మికంగా వారికి ఆహ్వానం పలికింది.

అనబెల్లా బండి దిగి – అలసటతో ఆలసత్వంతో ఇంట్లోకి ప్రవేశించింది. రాత్రి డిన్నర్ సమయంలో "ఇప్పుడు నీవు నా అధీనంలో వున్నావు – నా శక్తి నీకు తెలిసేట్లు చేస్తాను, నా శక్తి నీకు రుచి చూపిస్తాను" అంటాడు.

విలియం లాంబ్ గురించి మాట్లాడుతూ–

కారోలైన్ – తన భర్త హృదయానికి జారిపడుతున్న ఒక నీటిబిందువు – అది పడి బద్దలయిపోతుంది! అంటాడు..

ఒక రకమైన వికటంతో నీకు కూడా అలాంటి తోడు దొరికిందనుకో అంటాడు.

ఆ తరువాత దొరిలిన రాత్రి, పగళ్లను అతను Treacle Moon అంటాడు. అంటే హనీమూన్ కాదు – ఇది బెల్లపు పాకపు (వెన్నెల) రాత్రులు – శృంగారపు ఘడియలు అంటాడు – ఆ రాత్రుల్లో చంద్రుడు ఎప్పుడూ మబ్బుల మాటునే వుండిపోతాడు.

బైరన్ – భయంకరమైన భర్త – అలాగే ఆమెను ఎప్పుడూ ఊపిరాడనివ్వని భర్త!

కొద్దిక్షణాలు – అతని క్రూరమైన హాస్యం – ఉదయపు పొగమంచులా విడిపోయేది. ఆ సమయంలో ఎంతో ఆనందంగా – అన్యోన్యంగా వుండగలిగేవారు.

తన భార్యతో చిన్నపిల్లవాడిలాగే ఆడుకునేవాడు. ఆమెను చిన్నపిల్లగా మార్చేవాడు.

'పిపిన్' అని పిలిచేవాడు – ఆమె ప్రశాంతతను ఆనందించేవాడు – పాపం ఆమెకు ఇలాంటి మధుర క్షణాలు – అరుదైనవి – అందుకని మరింత మధురంగా ఉండేవి.

'ఎడారిలో వసంతం' అంటుండేది. అంతలోనే ఆమె మాటల్లోని కొన్ని 'పదాలు' అతన్ని క్రూరంగా మార్చేవి. కోపంతో రెచ్చిపోయేవాడు. తనని తాను అదుపు చేసుకోలేక – కర్కశంగా నిజాయితీగా అరిచేవాడు.

పాపం అనబెల్లాకు 22 ఏళ్లు. జీవితం గురించి ఏమీ తెలియని అమాయకురాలు. ఆమె ఇప్పుడు నేర్చుకుంటున్నది. ఆమె ఊహించిన జీవితానికి ఎంతో భిన్నమైనది.

ఆమె భర్త ఎంతో సహజ గుణాలు కలవాడు.

అతని భౌతిక – నైతిక విశ్వాసం కనీసం మన ఊహకు అందనిది.

తన ఆరోగ్యం గురించి అలుపు లేకుండా మాట్లాడగలడు. రాలిపోతున్న కేశాల గురించి, కదులుతున్న పంటి గురించి గంటల తరబడి చెప్పగలడు. తన

అవిటి కాలు గురించి మాట్లాడే సమయంలో, ఎంతో భావోద్రేకంతో వణుకుతాడు. తొలి పరిచయంలో దీన్ని గురించి అసలు మాట్లాడలేదు. ఆమె స్వతంత్రించి తమ జీవితం, రోజులు సాధారణ స్థితిలో జరిగిపోవాలని ఆశించి తానే ఆ విషయం ప్రస్తావించింది.

బాధ నుంచి బైటపడాలంటే, ఆ విషయం గురించి చర్చించుకోవాలని చదివింది. అప్పటి నుంచి అతను బాహాటంగానే మాట్లాడడం మొదలుపెట్టి, కాస్త బెరుకుతో నవ్వుతుండేవాడు. 'నా చిన్ని పాదం' అంటుండేవాడు.

అతను వీధిలో నడిచే సమయంలో ఎవరైనా ఎదురైతే చాలు – టక్కున ఆగిపోయేవాడు. అవతలి వారికి – తన అవిటితనం తెలియకుండ!

తన దుస్థితిని వారు గమనించకూడదు–

ఆ ఆలోచనే అతన్ని కోపంతో వణికించేది!

అలాంటి భావనే అతన్ని కోపంతో మండించేది.

(ఆ ఎరుకతోనే భగ్గుమని మండేవాడు)

వారు అతని కాలివంక చూస్తే చాలు కోపంతో మండిపడేవాడు!

అనబెల్లా నైతిక సూత్రాలను (భావాలను) చెదరగొట్టటానికి కంకణం కట్టుకున్నాడు.

జాగ్రత్తగా మొదటి అడుగు వేయాలి – అనుకునేవాడు.

సాయంత్రానికి, అసలు మతంలోగాని నైతికతలోగాని, ఎటువంటి 'సత్యం' లేదంటాడు. అలా నమ్మించాలని ప్రయత్నించాడు. ఇదే నా నమ్మకం "ఇప్పుడు నన్ను మార్చగలవా?" అని సవాలు చేస్తాడు.

ఆమె అంతగా పట్టించునేది కాదు. క్షమాగుణం దీనికి మందు – నిర్లక్ష్యం, సరదాగా వుండటం – ధైర్యంగా ప్రవర్తించటం ఇవే అతన్ని మార్చగలవని మగవాళ్లంతా చెడు కాదని నమ్మించాలని చూస్తుంది.

ఇప్పుడే బైరన్ 'మతమని' చెప్పేది – తన చిన్నతనంలో విన్న చీకటి కథలు – అవి అతనిలో గాఢమైన ముద్రవేసాయి. దీనికితోడు అతను రెండు సంవత్సరాల తూర్పుదేశాల – అదీ ఇస్లాం మత నమ్మకాల నడుమ – మరింతగా అతనిలో నైరాశ్యాన్ని నింపాయి.

ఆ విధంగా అనబెల్లా – "దేవుడు విశ్వసించినవారికే – వుంటాడు – ఇది కూడా అతని ఇచ్ఛమేరకే" అంటుంది.

బైరన్‌తో కాపురం చేయటానికి ముందు, అతడు కేవలం 'వోల్టేరు' సిద్ధాంతం మేరకు దైవాన్ని అనుమానిస్తున్నాడు అనుకుంది. రానురాను అతని అంతరాత్మలో Calvinism గూడు కట్టుకుపోయిందని గుర్తించింది. అంటే దేవుడే మోక్షాన్ని ప్రసాదిస్తాడు!

ఏ ప్రాణికీ, దేవుని నిర్ణయాలు తెలియవు. కాని 'అతని' నిర్ణయానికి, దయాదాక్షిణ్యాలుండవు!

బైరన్ 'మతం' – భయంతో కూడుకుంది. కాబట్టి తిరుగుబాటు చేస్తాడు. కొంతమంది స్వర్గానికి వెళ్లటానికి పుట్టారు. మరికొందరు నరకకూపంలో మగ్గిపోవాల్సిందే. దీనిని ఎవ్వరూ మార్చలేరు. తను ఈ రెండోవర్గంలో వున్నాడు. ఈ 'జ్ఞానం' అతన్ని ఈ ప్రపంచం అన్నా విశ్వాంతరాళం అన్నా ఒక నిరంకుశ ప్రదేశం అని మండిపడతాడు. నేనెందుకు 'నీతి'గా వుండాలి? అందుకే విశృంఖల జీవనశైలి – విచ్చలవిడి శృంగారం.

అంతులేని నిరాశ!

ఒకరోజు ఇలాంటి చర్చలతో విసిగిపోయి కుర్చీలో కూలబడి, "అన్నింట్లోకి వింత ఏమిటంటే, నేను 'నమ్ముతాను' – అదే దేవుణ్ణి – ఎవ్వరైతే మనిషి కష్టాలకు కారకుడో, ఆ కష్టాల ఫలితాలను చూసి ఆనందిస్తున్నాడో, అదే తను సృష్టించిన ప్రాణం పాట్లు చూసి నవ్వుకుంటున్నాడో, ఆ దేవుణ్ణి ఎలా క్షమించగలను" అని మండిపడతాడు!

"ఈ వ్యతిరేకతలన్నీ నీతిసూత్రాలతో కట్టుబడి వుండాలంటే ఎంత దారుణం – ఈ ప్రాణి స్వర్గానికి ఎలా వెళ్లగలదు?" ఇదీ చర్చ!

ఎలాంటి వ్యతిరేక భావాలుగల భార్యాభర్తలు!

ఇద్దరి గుణాలు – పరస్పర వ్యతిరేక విలువలు –

ఇది వారికి అంతులేని దుఃఖాన్ని మిగుల్చుతుందికదా!

అనబెల్లా – తన నమ్మకాలు – తన చదువు – తన ప్రసంగాలతో – బైరన్‌ను ఆలోచనలో పడవేస్తుంది. కానీ బైరన్ తన ధోరణిని మార్చుకోమని చెప్పటం, ప్రపంచ తీరుపై హింసాత్మకమైన తిరుగుబాటే!

అతను అందమైన అవినీతి అతివలపట్ల మోజు పడటంలో ఒక నిజాయితీ వుంది! దీనితోనే అతనికి 'నిర్వాణం' దొరుకుతుంది! ఇలాంటి ప్రాపంచిక విషయాల వలయంలోనే!

కాని అనబెల్లాకు ఇది సమ్మతం కాదు!

ఆమె మానసిక శక్తి చాలా కఠినమైనది. ఆమె బైరన్ వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా అంచనావేసింది!

"అతని దురదృష్టం – ఎప్పుడూ అంతులేని ఉత్సాహం కోసం వెంపర్లాడుతాడు – అలాంటివి లభ్యమయ్యేది ప్రచండమైన ఉద్వేగాలతోనే – కాని నీతిమంతులు జీవనశైలి ఒక పద్ధతిలో నడుస్తుంటుంది.

ఒకరకమైన స్తబ్దత – నిస్తేజ జీవనశైలి ఈ ప్రమాదకరమైన దారుల్లోకి తరుముతుంది! అందువలనే – అతని ప్రవర్తన – చెడు ప్రమాణాలతో ప్రభావం పొందుతుంది.

తనను తను శిక్షించుకోవటంలోని ఆనందానికి కారణాలు పైన చెప్పినవే – తాగుడు – జూదం, వ్యభిచారం ఇలాంటి ఉదాహరణలు, ఎన్నైనా చెప్పవచ్చు.

ఒక్కోసారి భార్యతో అంటాడు – “దేనికే ప్రాముఖ్యత లేదు – నైతిక విలువలు – వాతావరణాన్ని బట్టి – చుట్టూ వున్న వ్యక్తులనుబట్టి మారిపోతుంటాయి” ఆమె ఇవి నమ్మటానికి ప్రయత్నిస్తుంది.

“ఒక్కోసారి అనిపిస్తుంది – అతనికోసం అన్ని వదులుకోవాలని – బానిసగా మారాలని” అంటుంది. “ఒక వ్యక్తిని ప్రేమించాలంటే – అతనికి ప్రేమను అందించాలంటే, అది మంచితోను – చెడుతోను అతని నేరాలను క్షమించి కూడా”. “అంతకంటే గొప్ప ప్రేమ ఎక్కడుంటుంది?” ఇది ఆలోచన! కాని అనబెల్లా – ఆమె సహేతుకమైన నైతిక విలువలు, ఆమెను ఒక్క తప్పటడుగు వేయనీయవు. ఆమె తార్కికమైన జ్ఞానం – ఆ హృదయాన్ని తొణకనీయదు. ఇక అతని మూఢనమ్మకాలు – ఆమెను ఆశ్చర్యపరిచేవి – *అతనిలో పరస్పర విరుద్ధమైన చిన్ననాటి భయాలకు బలయిపోయిన బాధితుడు – విద్య జ్ఞానంతో విముక్తుడైన యువకుడు – ప్రక్కప్రక్కనే జీవిస్తున్నారు!*

“నేను సమాధుల మధ్యలో పెరిగాను. ఎంత దారుణం?

ప్రతి సంఘటన నాకు శకునమే – దుశ్శకునమే.

నల్లకోటు వేసుకుంటే కీడు జరుగుతుంది – గదిలోకి గబ్బిలాలు వస్తే దురదృష్టం వచ్చినట్లే..”

ఒక రాత్రి మంచు కురుస్తున్న రాత్రి

వెన్నెల కురుస్తున్న రాత్రి – తోటలో నిలబడి

“చూడు ఆ మబ్బు చంద్రుని కప్పివేస్తే – అది

నాకు దుశ్శకునం – లేదా నాకు అంతా మేలుజరుగుతుంది”

ఆ రాత్రి, ఆ మబ్బు చంద్రుని వెలుగు మూసివేసింది!

తన తల్లి పెళ్లి వుంగరం – ఆమె వేలికి చాలా పెద్దదయిపోయింది. దానికి నల్ల దారం చుట్టింది. అంతే–

'నల్ల రిబ్బను కట్టావా' అని అరుస్తాడు.

అది తీసివేసేవరకు వూరుకో లేదు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఆమె చేతులు వెనక్కు పెట్టుకుని చలిమంట గూటి దగ్గరకు వెళ్ళింది. రిబ్బను తీయటంతో వదులైన ఉంగరం నిప్పుల్లో పడిపోయింది. దానితో బైరన్ చాలా సమయం, గంటల తరబడి గందరగోళంలో పడిపోయాడు.

అతని ఈ 'పిచ్చి' నమ్మకాలతో, ఆమెకు పిచ్చెక్కిపోయేది. "ఏమిటి ఇది నిజమా, నటనా" అనుకునేది. ఏమో – అతనికి ఎప్పుడూ మార్మికమైన ఉత్తేజం కావాలి. ఎప్పుడూ అంటుండేవాడు – "నేను నేలకు పడిపోయిన దేవతను" అని – నిజంగానే నమ్మేవాడు – "అనబెల్లా – నీవు, బైబిల్ చెప్పినట్లు స్వర్గం నుండి వచ్చిన కాందిశీకుని ప్రేమిస్తున్నావు" అంటాడు– అతను చదవటంలోకూడా శకునాలు వదిలేవి కాదు.

జలుకోని మరిచిపోలేదు. అతని గురించి అనబెల్లాతో వివరంగా చెబుతాడు.

జలుకో, తన కొడుకునే పీక పిసికి చంపుతాడు. "బహుశా నేను కూడా ఆ పనే చేస్తానేమో?" తనని ఏదో దుష్టశక్తి నేరమయ జీవితంవైపు తరుముతోంది. "నేను తూర్పుదేశాలకు పోవాలి – బహుశా అక్కడే చనిపోతాను.""

అతనికి భవిష్యత్తు అంతా రాసిపెట్టివుంది. దానికి బలమైన శకునాలు, మంత్రకత్తె వచనాలున్నాయి:

"నువ్వు 37 ఏళ్లు రాకుండానే చనిపోతావు"

ఇది అతను గట్టిగా నమ్మాడు.

లేడీ బైరన్ – అతని భార్య – ఆమె విజ్ఞాన శాస్త్ర విద్యార్థి – ఇదంతా వింతగా, ఆశ్చర్యంగా వినేది – "ఏమిటి ఇతనికి పిచ్చా? లేక హాస్యమాడుతున్నాడా? లేక రెండూ కలిపి నాటకం ఆడుతున్నాడా?"

ఆమె ఏమీ నిర్ణయించుకోలేకపోయింది.

అంతటితో అయిపోలేదు! ఈ మొదటి నల్లటి తెరమాటున మరింత చీకటి కోణం వున్నట్లు పసికట్టింది!

వారిద్దరూ హాల్నబీ చేరిన మొదటిరోజునే – మర్నాటి వుదయం – అగస్టా నుంచి ఉత్తరం వచ్చింది! బైరన్ చాలా ఉత్సాహంగా చదివి వినిపించాడు. “నా ప్రియాతి ప్రియమైన - best of human beings..." అని సంబోధించింది.” “ఏమంటావు?” అని అనబెల్లాను అడుగుతాడు!

పెళ్లయిన కొద్దిరోజులకు – హాల్నబీ భవనంలో అద్దం ముందు నిలబడి – ‘చూడు, నీకు నాకు పోలికలున్నాయి’ అంటాడు.

“అవును – అన్న – చెల్లెలు మాదిరి” అంటుంది!

నవ్వుతూ – “ఏమిటి వాగుతున్నావు?” అని ఆమె మణికట్టు మెలేసి అరుస్తాడు!

ఆమెలో తెలియకుండా పెరుగుతున్న ఆందోళనకు పర్యవసానంగా, మరొకరోజు Dryden విషాదాన్ని – అదే అక్కాతమ్ముళ్ల అక్రమ సంబంధాన్ని Don Sebastian గురించి ప్రస్తావిస్తుంది. అంతే అతను అగ్గిమీద గుగ్గిలం అయిపోతాడు! ఇది అతన్ని భయభ్రాంతుణ్ణి చేస్తుంది.

పాపం, అమాయకురాలయిన అనబెల్లా అతన్ని అర్థం చేసుకోవటానికి అన్ని ప్రయత్నాలు చేస్తుంది. ఎలాంటి సమాచారం లేకుండా సమస్యను అర్థం చేసుకొని పరిష్కరించాలని అనుకుంటుంది.

ఆమె అభిప్రాయం, ఈ పెళ్లి తనను శిక్షించటానికి చేసుకోలేదు. అతని ఘోరమైన నేరాన్ని దాచిపెట్టుకోవటానికి, అదేమిటో ఆమెకు తెలియదు, ఈ తంతు నడిపాదని ఆమె అనుమానం!

ఆమెకు మరో వింతైన ఆశ్చర్యకరమైన ఆసక్తి :

‘ఏమిటి ఇతనికి, తన అక్కతోనే సంబంధం

వున్నదా పొరపాటున’ అనుకుంటుంది!

రాత్రిళ్ళు అతను పీడకలలతో పీడింపబడటం చూసేది. నిద్రలో వాగటం వినేది. నిద్రలో నడవటం కూడా ఆశ్చర్యంగా చూసింది. గుళ్ళు నింపిన పిస్తోళ్లతో తిరగటం, కత్తులు, కటార్లు తిప్పటం – పళ్ళు పట్టపట కొరకటం – ఇవన్నీ భయంభయంగా దూరం నుంచే గమనించింది!

ఆ తరువాత అతని దగ్గరకు వచ్చి నుదుటి మీద చేయివేసి అతని భుజం మీద తల పెట్టుకుని ఆమె వుంటే, "అరె, నీకు నా హృదయం కంటే మెత్తని తల దిండు కావాలి" అనేవాడు! ఆమె మెల్లగా, "ఎవరి గుండె ముందుగా పగిలిపోతుందో ఆశ్చర్యంగా వుంది" అంది.

మరొకసారి మెల్లగా అడిగింది – "నీవు ఎవరినైనా చెడగొట్టావా?" అని, "ఈ విషయం అగస్టాకు తెలుసా?" అని కూడా అంటుంది.

అతను, "నా జీవితంలో భయంకరమైన రహస్యం దాగివుంది. నీకు బిడ్డపుట్టిన తరువాత చెప్పగలను" అంటాడు!

ఆమె ఒకటి రెండుసార్లు, అతన్ని వదిలి పారిపోదామా అనుకుంది. కానీ అతనిపట్ల ప్రేమ, జాలి మూలంగా ఆ పని చేయలేకపోయింది. "మొదటిసారిగా, నేను దేవుని సన్నిధిలో ఒంటరిగా వుండటంలోని అనుభూతిని పొందాను" అని అనుకుంటూంది!

మరి అతను? ఈమె గురించి ఏమనుకుంటున్నాడు – ఇంతవరకు తన జీవితంలోకి వచ్చిన స్త్రీలందరికంటే, ఎంతో భిన్నమైన వ్యక్తి! ఒక్కోసారి అతని మనస్సు ఆర్ద్రమయిపోయేది! "నీవు చాలా ధైర్యస్థురాలివి – నన్ను అమరుణ్ణి చేయగలవు" అనేవాడు–

నేను స్వర్గ నరకాలు నమ్మాలంటే, ఇప్పటి నీ ముఖారవిందంలోని భావన చాలు. అరే నీవు నాకంటే మంచివాడిని పెళ్లి చేసుకుని, వుండాల్సింది" అని

బాధపడేవాడు. ఆమెను చూసి సానుభూతి కనపరచేవాడు. కాని అనూహ్యంగా ప్రవర్తించేవాడు.

'చైల్డ్ హెరాల్డ్' రోజుల నుంచి – తన పాత్రను అతనే పోషిస్తున్నాడు. ఇప్పుడు అతనికి ఒక గొప్ప విద్యార్థి – ఆశ్చర్యంతో కంగారుపడే ప్రేక్షకురాలు లభించింది కూడా! అదికూడా, ఆమె కేవలం నవ్వి చూస్తుంటే, అతను తన ధోరణి మార్చుకుని వుండేవాడు – అతనికి కావల్సింది లేడీ ఆక్స్‌ఫర్డ్ లాంటి ప్రశాంతమైన ప్రేక్షకురాలు – అనబెల్లా గంభీరమైన వ్యక్తి అతన్ని రెచ్చగొట్టేది–

"నాకు కావల్సింది – నవ్వగల – నన్ను చూసి నవ్వగల స్త్రీ – ఆ పని అగస్టా మాత్రమే చేయగలదు – ఆమే నన్ను సంతోషంగా వుంచగలదు!" అంటాడు. ఇంత క్రూరంగా ఎలా వుండగలడు? తనని తను పెద్దమనిషిగా చెప్పుకునే బైరన్ – కేవలం ఆడదాని సమక్షంలో ప్రశాంతంగా వుండగల బైరన్ – ఇంత క్రూరంగా అనబెల్లా పట్ల ఎలా వుంటున్నాడు! అది అతనికే అర్థంకాని స్థితి. తనలో బైరన్ రక్తం ప్రవహిస్తోంది. ఏదో పిచ్చి కోపం తనని ఆవహిస్తోంది.

"అర్థం లేని ఉద్వేగం నన్ను పిశాచిగా మార్చివేస్తుంది – నీకు తెలియదు!" అంటాడు. తను ఈమెకు కట్టుబడిపోయాడు. ఆమె అధీనంలో వుండిపోయాడు – తమ నిశ్చితార్థం తెంపుకోమని అడిగాడు – కానీ ఆమె బలవంతం మీద, పెళ్లి చేసుకున్నాడు. పైగా తనకేమీ విచారం లేదంటుంది. ఇదిగో ఇప్పుడు ఇక్కడ – తన జీవితంలో ఒక అపరిచితురాలు!

ఆమె పట్ల జాలి చూపేవాడే – ఆమె బలహీనంగా కనపడితే – కాని అనబెల్లా తన బలహీనతను గొప్పగా కప్పిపుచ్చుకోగలిగింది! ఆమెకు – అగస్టాలాగా బిడియంలేదు – లేడీ ఫ్రాన్సిస్‌లాగా పెళుసు కాదు. ఆమె ధైర్యం మొక్కవోనిది – ఆమె బుగ్గలు గులాబి రంగులో ఆరోగ్యంగా వుంటాయి! ఇక్కడ చట్టాలు – ఆమె నిర్దేశిస్తుంది – ఇక్కడ న్యాయం – తీర్పు ఆమె చెప్తుతుంది! ఇక్కడి సమస్యలు ఆమె పరిష్కరిస్తుంది! ఆమె ఆలోచించకుండా – పద్ధతి ప్రకారం నిదానంగా చేస్తుంది. ఈలోపు అతను నిమిషాల్లో తినటం ముగిస్తాడు. అతను చేతులు పైకిపెట్టి "ఎందుకు, అంతగా ఉద్రేకపడతావు" అంటాడు.

ఆమె – మనిద్దరికీ బాగా ఒద్దిక కుదిరింది కదూ – అంటుంది.

అతనికి ఒంటరితనం – ప్రశాంతత కావాలి. ఒకటికి రెండుసార్లు నువ్వు గది బైటికి పో అంటాడు. నీతో నాకు పనిలేదు అంటాడు. ఒకోసారి ఈ పెళ్లి నాకు మేలే చేసింది. నా స్నేహితులంతా వదిలిపోయారు అంటాడు!

అతనికి త్వరలోనే తెలిసివచ్చింది. ఈ పెళ్లి–శోభనపు దినాలు చివరికి వచ్చాయని!

ముందుగా అతని పుట్టిన రోజుకు, 20 జనవరికి అత్తమామలతో గడపాలనుకుంటాడు. తీరా బయలుదేరేముందు ఈరోజు శుక్రవారం నేను ప్రయాణం చేయను అంటాడు. భార్యతో క్షమాపణగా నేను ఇస్లాం దేశాలలో తిరిగాను, అని సంజాయిషీ చెప్పుకుంటాడు. 21 జనవరి ప్రయాణంలో అతను మంచి మానసిక స్థితిలో వుంటాడు "మనం హాయిగా గడపవచ్చు ముమ్ముందు" అంటాడు ఆమె కళ్లల్లోకి చూస్తూ.

వారు హాల్నబీలో గడిపిన దురదృష్టపు రోజులు, రాత్రులు గుర్తుచేసుకుంటే ఆమెలోని మంచి గుణాలను అతను మెచ్చుకోకుండా వుండలేడు.

అతనికోసం ఆమె ఎంతో కష్టపడింది 'Hebrew Melodies' అన్నీ నకలు రాసిపెట్టింది. అవి అతను నాథన్ అనే సంగీత దర్శకుని కోసం రాస్తున్నాడు. ఆమె చాలా తెలివిగలది. అతనితో ఆ విషయాన్ని చర్చించగల సమర్థురాలు. కానీ ఈ పెళ్లి స్తబ్దతకు ఆమె కారణం కాదా – ఇంతవరకూ సర్వస్వతంత్రుడయిన తనకు ఈ సంకెళ్లేమిటి? తల్లి తరఫు బంధాలు లేని తనకు, అత్తమామల సంబంధాలేమిటి? మళ్లీ సర్ రాల్ఫ్‌ను 'సర్ పాపా' అని పిలవాలి! అతనికి ఈ సీహామ్ రోజులు, లండన్ సాయంత్రాలతో పోలిస్తే నిస్తేజంగా కనిపించాయి.

అనబెల్లాను పిప్ – అంటున్నాడు

నువ్వు మంచి భార్యవే అంటాడు –

ఆమెతో పేకాడతాడు – పాయింట్లు రాసిన కాగితాలు అగస్టాకు పంపుతానంటాడు. 'అలాగే – కానీ తేడా తెలియటానికి క్రాస్‌లు పెడతా'నంటుంది – అనబెల్లా. అంతే అతని ముఖం పాలిపోతుంది. ఆ పని మాత్రం చేయకు. ఆమెకు ఆ గుర్తులు భయంగొలుపుతాయి' – అంటాడు. సముద్ర తీరంలో సరదాగా వుంటాడు ఆమెతో – ఎంతో దూరం నడిచేవారు. అక్కడ వున్న చిన్న రాతికొండ మీద పడుకునేవారు. ఇదే 'హంసతూలికా తల్పం' అంటాడు. తనతోపాటు ఎక్కగలవా అంటాడు. ఆమెకంటే ముందు పైకి వెళ్లేవాడు.

అది, ఆ భయం, అతనితో 'చిన్నపిల్లవాడిని' బైటకు తెచ్చేది! అంటుంది! ఒక్కోసారి అమాయకపు బాలునిమాదిరి నిర్మలంగా వుంటాడు! తనకు తనే మాట్లాడుకుంటూ 'ఒరే బైరన్' అనుకుంటూ వుండేవాడు. 'నువు మూర్ఖుడివిరా' 'పాపం బైరన్' 'వాడు ఒట్టి ఫూల్' అంటుండేవాడు!

'నేను నిన్ను ప్రేమిస్తున్నాను అనుకుంటున్నా' అంటాడు. అందులో నిజాయితీ వుంది. ఇప్పుడు అతనికి ఆమె 'అలవాట'యిపోయింది! ఆమెకు కూడా అతని పిస్తోళ్లు – కత్తులు – నిద్రలో మాటలు అన్నీ మామూలు అయిపోయింది.

ఇలా అతను మరికొన్ని నెలలు అక్కడే వుండిపోయాడు – ఇంకా కొన్నాళ్లుంటే ఆ దినచర్యల్లో పడి బైటకు వచ్చేవాడు కాదు. ఇది అతని గుణంలోనే ఉంది అలవాటు పడడం అనేది. "ఇక్కడ మార్పులేదు. ఈ స్తబ్ధత నన్ను పూర్తిగా – పళ్లు తినటం – ఆవులించటంలో, పనికి రాని లెక్కల పుస్తకాలు చదవటంలోనూ, దినపత్రికలు తిరగవేయటంలో, సముద్ర తీరంలో నత్తగుల్లలు పోగుచేయటంలో – తోటలో గడ్డిపెరగటం చూడటంలో, అరె – ఇంతకంటే చెప్పటానికేముంది – మా యిద్దరికీ బాగా కుదిరింది. 'తెలివిగలవాడు పెళ్లి చేసుకోడు', కాని మూర్ఖునికి అంతకంటే స్వర్గం మరొకటి వుండదు. అమృతమయం కదా! అందుకే అంటాను – పెళ్లి ఒక 'కాలావధి'కి మాత్రమే పరిమితం కావాలి! కాని నా సమయాన్ని పొడిగిస్తాను – మరో 99 సంవత్సరాలు" అని మూర్‌కు రాస్తాడు!

బైరన్ దంపతులు వసంత కాలంలో లండన్ వెళ్లాలనుకుంటారు. మార్చి 9 – మళ్లీ గుర్రపుబగ్గీ వీరిని తీసుకుని బయలుదేరుతుంది.

దారిలో 'సిక్స్‌మైల్ బాటమ్' (Six Mile Bottom) దగ్గర, అగస్టా దగ్గర తను ఒక్కడే ఆగుతాను అంటాడు – కాని లేడీ బైరన్ తను కూడా లేడీ లీ (Lady Leigh)ను చూస్తానంటుంది. ఆ సాయంత్రానికి, నువ్వు నన్ను సంతోష పెట్టటానికి పెళ్లి చేసుకున్నావు కదా – అలాగే సంతోషపెట్టు" అంటాడు.

వారికి అగస్టా స్వాగతం పలుకుతుంది – ముందు తన ఇంట్లో సౌకర్యాలు లేవని వద్దంటుంది. ఇద్దరూ కలసి మేడమీదకు వెళ్లతారు వదినా మరదళ్లు. అక్కడ అనబెల్లా అగస్టాను కౌగిలించుకుంటుంది.

రాత్రి భోజనాల సమయంలో బైరన్ బ్రాందీ – తాగుతూ కూర్చుంటాడు.

భార్యను వెళ్లి మేడమీద పడుకోమంటాడు. తర్వాత ఆమె దగ్గరకు వచ్చి "చూడు నీతో నాకు పనిలేదు – నన్ను పెళ్లి చేసుకుని ఎంత పొరపాటు చేశావో" అంటాడు.

ఇది అనబెల్లానెంతో బాధిస్తుంది. అగస్టా అంటే అసహ్యం పుడుతుంది.

మర్నాడు వుదయం అగస్టా చాలా సాధారణంగా సహజంగా వారిని కిందికి ఆహ్వానిస్తుంది.

"అగస్టా! నేను మారిపోయానుకదా" – అంటాడు.

"ఆఁ కనపడుతూనే వుంది" అంటుంది.

ఇక్కడ వున్న రోజుల్లో అగస్టా – తన మరదల్ని ఎంతో అనురాగంతో చూసింది. ఒకరకంగా బైరన్ అంటే భయపడుతోంది. అతన్ని తప్పించుకోవటానికి ఎంతో శ్రమపడుతోంది.

ఇది బైరన్‌కు ఆటగా మారింది – "అగస్టా మనం ఎగిరిపోవాలి" అంటాడు భార్యకు అర్థమయ్యేట్లు. మెడోరాని చూపి "చూడు ఈమె నా కూతురు" అంటాడు. అగస్టా అందుకు అవకాశం ఇవ్వకుండా దూరంగా వుండిపోయింది.

అలాగే లైడీ బైరన్ ఇది అర్థం చేసుకోవటానికి నిరాకరించింది. 'పాపం', అగస్టా అనుకుంది. ఆమె ఎంత బాధపడుతోందో – తన భర్త గురించి ఎటువంటి అనుమానం రాకుండా మనసును అదుపులో పెట్టుకోగలిగింది లెడీ బైరన్!

అనబెల్లా, అగస్టా ఇద్దరూ చాలా స్నేహంగా గడిపారు. ఎంతో దూరం నడిచి షికార్లు చేశారు. వారు బైరన్ గురించే మాట్లాడుకున్నారు. అనబెల్లా మనసులో అనుమానాల మబ్బులు కమ్ముతూనే వున్నాయి. అందుకని అగస్టాను తన నమ్మకంలోకి తీసుకుంది. తన మరదలు ప్రేమ చూసి, అగస్టా చలించిపోయింది. 'నేను నీకు తెలియక, దయగా వున్నావు' అంటుంది. అనబెల్లాకు, బైరన్‌ను ఎలా అదుపు చేయాలో సలహా ఇస్తుంది.

ఆమెకు అన్నీ, చాలా సాధారణంగా కనపడతాయి. "బైరన్ బాధలన్నీ అజీర్తిమూలంగానే" అంటుంది. "సన్నగా వుండటానికి కడుపు మాడుస్తాడు. తర్వాత ఆకలికి ఎక్కువగా తినేస్తాడు. అంతే అజీర్తితో బాధపడతాడు. మెగ్నేషియా ఎక్కువగా తీసుకుంటాడు. ఇదీ సంగతి" అంటుంది.

అనబెల్లా 'బైరన్ భర్తగా కష్టమే' అంటుంది. తన ప్రేమతో అతని ప్రేమ సంపాదిస్తానని నమ్ముతుంది. "అతనికి 'అలవాటు' అనేది వ్యసనం. దాని శక్తి చాలా బలమైనది" – అంటుంది! అగస్టా ఎంత బాగా చూసినా, అనబెల్లాకు ఇక్కడ ఆగటం ఒక పీడకలగానే మిగిలిపోయింది. బైరన్‌కు తనంటే చిరాకు, అగస్టా అంటే చిరాకు – తన భార్య అంటే చిరాకు – అతనికి తాను ఆశించిన సుఖం దొరకలేదని నిరాశతో – ఎక్కువ తాగుతాడు మరచిపోవాలని. దానితో అతని వాగుడు మరీ భరించరానిదిగా తయారయ్యింది.

అగస్టాను వుత్తరాలన్నీ చదవమంటాడు. "చూశావా, నేను నీకోసం చచ్చిపోతున్నాను అనుకున్నావా" అంటాడు భార్యతో. "నువ్వెళ్లి పడుకో", అని భార్యను పైకి పంపేవాడు. అతను అగస్టాతో కూర్చొని తాగేవాడు. అనబెల్లా కుళ్లిపోయి తినటం మానేసింది. ఎంతో ఏడ్చింది. "ఇది జరగదు, ఇది ఇలా జరగదు" అనుకునేది.

ఒకరోజు అగస్తాకు మేడమ్ నెకర్ రాసిన కొటేషన్ చూపిస్తుంది.

"నీ ప్రమేయం లేకపోతే కష్టాలు అవేపోతాయి – కానీ హద్దులు – వేదనలు పశ్చాత్తాపంతోనే నిర్ణయింపబడతాయి". అది విని అగస్టా మరదల్ని కన్నార్పకుండా చూస్తుంది. ఇద్దరిమధ్యా ఒక మౌన అంగీకారం కుదిరింది!

ఇంక ఇది భరింపరానిదిగా తయారయింది. దానిలో నుంచి బైట పడటానికి బైబిల్ చదవటం మొదలుపెట్టింది, లైడీ బైరన్! ఆమె భావోద్వేగానికి సరిపోయిన సందర్భాలు దొరికేవి. అందులోనుంచి మార్మికమైన ఉత్సాహాన్ని పొందగలిగేది. అంతే – ఇక వీరిద్దర్నీ రక్షించగల వ్యక్తి తనేనని నిర్ణయించుకుంది. వీరిని తప్పనిసరిగా రక్షిస్తాను అనుకుంది. అరె! ఇదెలా సాధ్యం – అతన్ని నీవు ప్రేమిస్తున్నావు – అతను నిన్ను ద్వేషిస్తున్నాడు! ఇదెలా సాధ్యం?

ఇక్కడే, నెపోలియన్ ఎల్బా నుంచి తిరిగి వచ్చాడని వింటాడు. అంటే మళ్లీ గరుత్మంతుడు ఎగురుతాడు. రాయల్ సైన్యాలు తిరిగి పోయాయి! ఇది అతన్ని ఎంతో ఆనందానికి గురిచేసింది. తన హీరో ఓడిపోలేదు. అతను ఈ సైన్యాన్ని తోలివేస్తాడు. డబ్బుకు కొనే విలువపోతుంది. అతను ఫ్రాన్సును రక్షిస్తాడు.

లండన్‌లో నిరాశా నిస్పృహలు!

చక్రవర్తి పారిస్ చేరినట్లు వార్తలు!

ఫ్రాన్స్ దాటుకుంటూ ఇరవయి రోజుల్లో వచ్చాడు.

డోవర్ రేవులో మూడు రంగుల జెండా ఎగిరింది!

బైరన్ తన యిద్దరి స్త్రీలతో అక్కడే వుండిపోయేవాడే – కాని అగస్టా వారి ప్రయాణానికి ఏర్పాట్లు చేసింది. 28 మార్చి అనబెల్లాను తీసుకుని బైరన్ బయలుదేరాడు. అప్పటికే అనబెల్లా మానసిక స్థితి దారుణంగా మారింది – ఆమె పూర్తిగా చితికిపోయింది!



అగస్టా



బైరన్



అనబెల్లా

XXIV

13, పికడిల్లీ టెర్రేస్

(1815-1816)

ఎన్నో విషయాల మాదిరిగానే, వివాహ
వ్యవస్థలోని విషాదం ఏమిటంటే – వధూవరులు
ఎదుటి వారిలో చూడగలిగింది పూర్తి సత్యం కాజాలదు!

(HJc Grierson)

పికాడిల్లీ టెర్రేస్‌లో చక్కని 'టౌన్‌హౌస్' అద్దెకు తీసుకుని కాపురం పెడతారు. వారికి సేవకులు వున్నారు. రెండు అందమైన గుర్రపు బగ్గీలున్నాయి. మరి? సరిపడా ఆదాయం లేదు. ఇంటి అద్దె సంవత్సరానికి 700 పౌండ్లు. ఇది లేడీ బైరన్‌కు వచ్చే భరణం మొత్తం సరిపోతుంది. ఇక బైరన్ ఇప్పటికే అప్పుల్లో ఉన్నాడు. న్యూస్టెడ్ ఆదాయం వడ్డీలకే చాలదు.

వీరి విలాసవంతమైన జీవనశైలి స్నేహితులకు అప్పులవాళ్ళకు తెలిసింది. ఆకర్షించింది కూడా!

హాబ్ హౌస్ వాళ్లను చూడటానికి వస్తాడు. తన స్నేహితుడు, ఎంతో విచారంతో వుండటం గమనిస్తాడు. బైరన్ కారణాలు ఏమీ చెప్పలేదు – కాని "నువు పెళ్లి చేసుకోకు" అని సలహా ఇస్తాడు.

ఇక్కడి జీవితం మొదటి కొన్ని రోజులు ఆనందంగానే వుంది. "పదిరోజులు చాలా ప్రశాంతంగా వున్నాడు. ఇంతవరకు, అంత శాంతంగా ఎప్పుడూ చూడలేదు" అనుకుంది కాని అనబెల్లాకు ఆశలేమీ మిగిలిలేవు!

"ఆశ – అది వర్తమాన అస్తిత్వానికి పై పూత మాత్రమే! "నిజం" కాస్త తగిలితే, ఆ పూత రాలిపోతుంది. చిక్కిపోయిన బుగ్గల అసలు కురూపి స్వరూపం బైటపడుతుంది."

బైరన్ ఇప్పుడు మరింత అందంగా కనపడుతున్నాడు. అతని ముఖంలో కొత్త వెలుగు చోటుచేసుకుంది. అతని అశాంతిలోని చైతన్యంతో!

అతను ధరించే నలుపు దుస్తులు, అతని వంటి ఛాయను మరింతగా ప్రస్ఫుటంగా కనిపింప చేస్తున్నాయి. అందులో గొప్ప ఆధిక్యతను సంతరించిపెట్టింది! అనబెల్లా అతన్ని అలుపు తెలియకుండా చూస్తుండేది! అతనితో బైటకు వెళ్లటానికి ఎంతో ఇష్టపడేది! తనతోపాటు తీసుకువెళ్లి లీ హంట్ (Leigh Hunt) ఇంట్లో వదిలి, ప్రక్కనే వుండే దుకాణాలకు వెళ్లేది.

బైరన్, హంట్ సంతానంతో ఆడుకుంటూనే ఆనందించేవాడు. చిన్న ఊగే గుర్రం మీద కూర్చునేవాడు. అప్పటి రాజకీయం గురించి చర్చించుకునేవారు. ప్రభుత్వం – పేపర్లు, నెపోలియన్‌కు వ్యతిరేకంగా కేకలుపెట్టాయి. కాని బైరన్ మరో దేశపు అంతర్యుద్ధంలో మీకేమి పని అని విమర్శించేవాడు.

తిరుగు ప్రయాణంలో లైడీ బైరన్, తన భర్తకోసం వచ్చేది. తన అందమైన బగ్గీలో అతని కోసం ఎదురు చూస్తుంటే, అతను, మెట్లమీద హంట్ పిల్లల్తో ఆడుతుండేవాడు.

ఎంత చక్కటి సన్నివేశం! అందమైన కొత్త పెళ్లికూతురు – బైరన్ హుందాగా వారికి వీడ్కోలు చెప్పటం, బగ్గీ గుర్రాలు సకిలిస్తూ, ఎండలేని వెలుతురు – అరె ఇంతకంటే రమణీయ దృశ్యం – భార్యాభర్తల జీవితంలో ఇంకేమి కావాలి?

పికడిల్లీ ఇంట్లో – బైరన్ తన కొత్త కవిత రాస్తున్నాడు Parisina. అనబెల్లా ఎంతో శ్రద్ధగా నకలు తయారు చేస్తున్నది.

చూశారా – వర్తమానం ఎంత 'అందం'గా కనపడుతుందో?

లేడీ బైరన్ – తన విచారంలో నుంచి బైటపడలేక పోతోంది. ఆమె తన పల్లెటూరి ఆరోగ్యాన్ని సహజత్వాన్ని పొందలేకపోతోంది. బైరన్ స్నేహితులు – కిన్నార్డ్, హాబ్ హౌస్ – వస్తుండేవారు. వీరిని 'పికడిల్లీ సిబ్బంది' అంటుండేది. అంతగా ఆమెకు నచ్చేవాళ్లు కాదు. కిన్నార్డ్, బైరన్ పేరుతో డ్రూరీ నాటక శాలలో వాటాలు కొంటాడు. ఆ విధంగా ఆ నాటకశాల అధికార కూటమితో పాలుపంచుకోవటానికి! ఇది అనబెల్లాకూ ఇష్టం వుండదు. నాటకాలు – గ్రీన్ రూం – అదో లోకం – అంతేనా? అతను మళ్లీ మెల్‌బోర్న్ హౌస్‌కు తరచూ వెళ్తున్నాడు. తన మేనత్త చాలా అపాయకరమైన సలహాదారు – పైగా అక్కడ బైరన్ మాజీ ప్రియురాలు కారో వుందికదా – తన భర్త విలియంతో సహా! అక్కడ బైరన్‌కు ఎప్పుడూ ఆహ్వానం ఉంది. కారోలైన్ గురించి అతను గునుస్తూనే వున్నాడు. ఒక మాజీ ప్రియురాలు ఎన్ని వేషాలయినా వేస్తుంది. ప్రియుణ్ణి మళ్లీ ఒడిలోకి రప్పించుకోవటానికి!

ఒకసారి లేడీ బైరన్, మెల్‌బోర్న్ మేనత్తను చూడటానికి వెళ్తుంది – అక్కడ ఆమె దురదృష్టం, మేరీ చావర్తును చూస్తుంది!

ఈ విధంగా తన భర్త మాజీ ప్రియులంతా ఆమె మీద కక్షకట్టినట్లు – వెంటాడుతుంటారు! తన స్వచ్ఛమైన సముద్రతీరపు జీవితానికి, ఈ లండన్ కుళ్లు నాగరకతకు ఎంత తేడా వుంది!

వీటన్నిటికి మించి – అగస్టా వచ్చి పికడిల్లీ ఇంట్లో తిష్టవేసింది. అరె, ఎందుకు అగస్టాను ఆహ్వానించింది – లేడీ బైరన్?

"వారిని విడిగా వుంచటంలో ఏమాత్రం ఉపయోగం లేదు. వారు కలిసి వున్నప్పుడు, పవిత్రంగా వుండటంలోనే న్యాయం వుంది" ఇదీ అనబెల్లా సిద్ధాంతం! వీళ్ళిద్దరికీ తనే గార్డియన్! ఇది బైరన్‌కు ఏమాత్రం నచ్చదు. తన వాలు చూపులతో అలవాటయిన అసహ్యాన్ని వ్యక్తపరుస్తాడు. "నీకు బుద్ధి వుందా? ఆమెను ఎందుకు రానిచ్చావు? ఇప్పుడు అనుభవించు" అంటాడు నిజాయితీగా! మళ్లీ! Six Mile Bottom రాత్రులు అనుభవంలోకి వస్తుంది అనబెల్లాకు!

అతను ఆలస్యంగా మెట్లెక్కి వస్తుంటే ఆమెకు తెలిసిపోయేది – ఎలాంటి స్థితిలో వస్తున్నాడో! ఒక్కసారి విపరీతమైన ఆవేశంలో – మరోసారి నిస్సత్తువగా – ఒకోసారి అగస్టాతో కలిసి మెట్లెక్కి. 'పిప్' అని తనని – 'గూస్' అని అగస్టాని, అగస్టా – బైరన్‌ని 'బేబి' అని, ఇవి వారి సంబోధనలు!

"నీవు అయిదేళ్ల నుంచీ నాకు తెలిసివుంటే సుఖపడేవాళ్లం" అనేవాడు.

ఒక్కోసారి, అగస్టాను చంపేయాలని అనుకునేది – 'నాకు పిచ్చెక్కిపోతోంది' కాని ఆమెను క్షమించేస్తాను – అంటుండేది.

సహజంగానే – ప్రేమించే ఆడది, తన మగడిని మరొకరితో పంచుకోలేదు కదా! కాని తన భర్త గతాన్ని ఎలా తెచ్చుకోగలదు – ఆ గతాన్ని వర్తమానంలో ఎలా కలిపి తనతో వుంచుకోగలదు! ఇందుకు అగస్టా సహకారం కావాలి కదా – ఈ విషయంలో అగస్టా – లేడీ బైరన్‌కు మేలే చేస్తుంది.

ఏమయినా జూన్ చివరికి, లేడీ బైరన్, తన వదిన గారిని పంపించివేస్తుంది.

వసంత కాలం 1815లో ప్రతి ఉదయం బైరన్ రెండు గంటలు జాన్ ముర్రే కార్యాలయంలో గడిపేవాడు. అక్కడ అతనికి సర్ వాల్టర్ స్కాట్ కలిశారు. పరస్పరం ఎంతో గౌరవం కలవారు. మతం, రాజకీయాల విషయంలో ఇద్దరూ వ్యతిరేక భావాలు కలవారు. కాని ఈ గౌరవానికి ఏమీ భంగం కలగలేదు. ఎన్నో విషయాలు చర్చించుకునేవారు. "మీరు ఎప్పటికైనా, కాథలిక్‌గా మారతారు" అనేవారు స్కాట్! "దీనివలన మీ ఊహాశక్తి మరింతగా కవిత్వానికి ఉపయోగపడుతుంది" అంటారు. బహుమతులు ఇచ్చి పుచ్చుకుంటారు. సర్ స్కాట్ బంగారు పిడితో వున్న బాకు ఇస్తాడు. బైరన్ – ఒక మిత్తిభరిణి – బొమికలు పెట్టి ఇస్తాడు – దానిమీద–

Expande Annibalem: Quot Libras in duce summo Invenies

Mor sola Fatetur

Quantula sint hominum Corpuscula అని రాస్తాడు–

సర్ స్కాట్‌కు బైరన్‌ను శాంతింపచేయటం తెలుసు. "అతను చాలా దుఃఖంలో వున్నాడు. ఇలా నేను చెప్పినపుడు – అతను ఆలోచించేవాడు. మెల్లగా అతని ముఖం తేటపడేది! అప్పుడు సహజంగా మాట్లాడేవాడు" అనేవారు స్కాట్! ఇదే విషయం లేడీ బైరన్‌కు, ఈ సూత్రం తెలిసి వుంటే ఆమె ఆనందంగా వుండగలిగేది. ఫికడిల్లీ ఇంట్లో శాంతి నెలకొనేది. కాని ఆమె, పాపం అతన్ని ప్రేమిస్తున్నది – పైగా ఆమె పవిత్రురాలు. సంపూర్ణమైన పవిత్రురాలు.

ఇవి చాలా ప్రమాదకరమైన అడ్డంకులు కదా జ్ఞాన మార్గంలో!

అనబెల్లాకు మూడోనెల నిండింది. జూన్ 1815!

అప్పటికే (20 జూన్) నెపోలియన్ వాటర్ లూలో పూర్తిగా ఓడిపోయాడు. హాబ్ హౌస్ ఫ్రాన్స్‌లోనే వున్నాడు. బైరన్ 'అయ్యో పాపం' అంటాడు. 'చాలా విచారించదగిన విషయం!' అప్పటికి ఆంగ్ల యువతులు, తమ ప్రియులకు, భర్తలకు సేవచేయటానికి బెల్జియంలో వున్నారు. కారో కూడా వెళ్లింది. లేడీ వెబ్‌స్టర్ కూడా ఈమె విషయంలో బైరన్ జోస్యం నిజమే అవుతుంది. బైరన్‌కంటే ధైర్యం కలవాడు 'వెల్లింగ్‌టన్', వాటర్ లూ ఆలస్యంగా రావటానికి ఆమే కారణం అంటారు.

హాబ్ హౌస్ తిరిగి ఇంగ్లాండు వస్తాడు. అతను, బైరన్ కలసి బెల్లెరోఫాన్ (Bellerophon) అనే విషాద నాటకం రాస్తాడు. నెపోలియన్ చక్రవర్తిని 'సావేజ్ రాస్కెల్' అని తిట్టిన ఇంగ్లీషు అడ్మిరల్‌ను విమర్శిస్తారు.

నెపోలియన్ ఓటమి అన్ని ఆశలు ఆర్పివేస్తుంది. ఇక 'రిపబ్లిక్' అనేది కనుచూపు మేరలో లేదు. ఈ పాత తుప్పుపట్టిన రాజ్య వ్యవస్థ మిగిలిపోయింది. యుద్ధం – మారణకాండ – ఇవేనా రాజకీయాలంటే?

దేవుడు వీరికేనా సాయం చేస్తాడు? వీరికి – ఈ దేవతలకు ప్రాణుల విలువ తెలియదా?

ఈ ఆలోచనలకు ఏమిటి అవసరం, విలువ? "అంతా చెప్పిన తర్వాత అంతా జరిగిన తర్వాత, మనం ప్రొద్దున్నే నిద్రలేచి ఏం చేస్తున్నాం – సరిచేయటానికి?"

'మనం రాత్రి నిద్రకు ఉపక్రమించే సమయానికి, రాజ్యాలు కూలిపోతున్నాయి. ఉదయానికి నిద్ర మేలుకొనేసరికి, అవన్నీ మన గుమ్మం ముందు పరచుకుంటున్నాయి. పోయినయి పోతున్నాయి – ఇక్కడ ఇంత కుళ్లు చేరిపోయింది!

తూర్పు – గ్రీస్ – టర్కీ వెళ్లిపోదాం – కాస్త మనశ్శాంతి వుంటుంది!

అక్కడ గడిపిన సమయం ఎంత గొప్పది – ఎంత వెలుగు! ఎంత హాయి! కాలం ఎలా పరుగులు పెట్టింది – హాబ్ హౌస్‌తో, ఫ్లెచర్‌తో ఆ నీలాకాశం క్రింద–

ఇప్పటి స్తబ్ద జీవితం ఈ పెళ్లి సంకెళ్లు భరించలేనంతగా తయారయ్యింది. స్వతంత్ర గాలులు పీల్చే తనకు ఇది పిచ్చి ఎక్కిస్తున్నది.

అనబెల్లా గురించి తన అంచనాలు అన్నీ సబబే. ఆమె ఎంతటి పరాజయంలోను – అవినీతికి చోటు కల్పించదు – అన్ని పద్ధతి ప్రకారం నైతిక సూత్రాలకు కట్టుబడి నడవాల్సిందే! ఇది ఆమె నమ్మినంతకాలం, ఆమె నిర్వీర్యత ఆమెకు తెలియజేయాలని ఉబలాటపడతాడు.

వైన్‌లో నుంచి వెనిగర్ వచ్చినట్లు–


ప్రేమలో నుంచి పెళ్లి – ఒక చేదు అనుభవం!

ప్రేమ అనే అమర భావనలో నుంచి

పెళ్లి అనే సాధారణ సంసార బంధం–

అయ్యో ఎలాంటి స్థితి –

లారా, పెట్రార్క్ పెళ్లాం అయితే – అతను జీవితం అంతా కవిత్వమే రాసేవాడు!



ముర్రే, అతన్ని ఎంతో మెచ్చుకుంటాడు. పెళ్లి గురించి బైరన్ రాసిన పద్యాలు ఎంత గొప్పగా వున్నాయో అని!

ఇప్పుడు పరిస్థితులు మరింతగా దిగజారాయి. అతనికి మరింత చిరాకు పుట్టిస్తాయి. లేడీ మిల్‌బాంకీ సోదరుడు లార్డ్ వెన్‌ట్ వర్త్ చనిపోతాడు. ఇప్పుడు ఆమెకు సంవత్సరానికి 8 వేల పౌండ్లు ఆదాయం రావాలి! కాని ఇది ఆమెకు లేడీ నోయిల్ అని బిరుదు మాత్రం ఇస్తుంది. ఆదాయం తన తల్లి అనంతరమే.

ఇప్పుడు పికడిల్లీ ఇంట్లో కష్టాలు మరింత గూడుకట్టుకున్నాయి. అప్పుల వాడు ఇంట్లోనే వుంటున్నాడు. అపరిచితుని ఇంట్లో పెట్టుకుని, బైరన్ ఎలా నిదురపోతాడు? లేడీ బైరన్‌ను రమ్మని కబురుపెడతాడు. "అదిగో ఇదికూడా బాగానే వుంది! అప్పులవాడి మూలంగా కూడా తన భార్యతో శృంగారంలో పాల్గొనవచ్చు" అంటాడు! హాస్యానికి – వ్యంగ్యానికి అంతమేమిటి?

తన దురదృష్టాన్ని అంతా, తనతో జీవితాన్ని పంచుకోవటానికి వచ్చిన స్త్రీ ముంగిట వదిలిపెట్టటానికి వెనకాడడు!

డబ్బు తక్కువైపోయింది. చివరికి అప్పులవాళ్లు పుస్తకాలు, ఇంట్లో సామాను అమ్మటానికి సిద్ధపడతారు. మెట్లమీద వారంటు తెచ్చిన వాడి అడుగులు వినపడుతున్నాయి! అదీ బైరన్, లార్డ్ బైరన్ ఇంట్లో! ఇప్పుడు తనకి రక్ష – ఈ నైతికంగా ప్రమాదకరమైన స్త్రీ మాత్రమే! ఆమెను తను అంతగా శిక్షించి వుండకూడదని జాలిపడతాడు. ఏమిటి? తన పశ్చాత్తాపానికి కారణమయిన ఈమెను మరింతగా ద్వేషిస్తాడు – "నేను విలువైన దానినని నీవు అనుకుంటే, నన్ను ఇంతగా అసహ్యించుకోవు" అంటుంది. ఆమె అతని 'చేతన'గా కన్పిస్తుంది! లేడీ బైరన్ చాలా శక్తిగలది! ఆమె అతని 'చేతన'లా అవతరించింది. ఆమెను చూసి అతను అసూయపడేంత శక్తిగా మారింది. అంటే ఈమె తనముందు వుండకూడదు! చూడండి – ఎవరినైతే రక్షగా తెచ్చుకున్నాడో, ఆమెనే భరించలేక వదిలించు కోవాలనుకుంటున్నాడు. ఒకప్పుడు మరో బైరన్‌ను చూసి ఎలా అసూయపడేవాడో తన రచనలలోని

హీరో బైరన్‌ను చూసి అలాగే లేడీ బైరన్‌ను చూసి, అసూయ పడుతున్నాడు. తనకు మనశ్శాంతి కావాలంటే వెళ్లిపోవాలి దూరంగా. NAXOS దీవులకు తెరచాప లేపాలి! లేదా ఆమెను ఇంటికి పంపాలి.

అనబెల్లా తనముందు తిరుగుతుంటే అతనికి ఏదో పిశాచి తిరుగుతున్నట్లుంది. తనలో నుంచి బైటకు వచ్చిన ఒక 'దెయ్యం' రూపు కట్టినట్లు భావిస్తున్నాడు. ఏదో చెడు చేయటానికి అరచేయి దురద పుట్టిస్తున్న క్రూర పిశాచిలాగా చూస్తున్నాడు. అతను రెండుగా చీలిపోయి మరో బైరన్ ప్రవర్తనను తీక్షణంగా పరిశీలిస్తున్నాడు. అది చాలా ప్రమాదకరంగా తయారయ్యింది. కోపంతో ఊగిపోయేవాడు. కోపం ప్రేరణలాంటిది. ఈ ప్రేరణలోని వింత ప్రవర్తనను చూడటానికి ఇష్టపడేవాడు. ఆ కోపానికి లొంగిపోవడానికి సిద్ధపడేవాడు. అది చాలా పవిత్ర కార్యమనుకున్నాడు.

ఒకరోజు అలాంటి కోపంతో అక్కడవున్న గడియారాన్ని నేలకేసి కొట్టాడు. దానిని కత్రతో ముక్కలు చేశాడు. తన అమ్మలాగానే, కిట్టి గోర్డాన్ లాగానే.

తనలో నుంచి తన పూర్వీకులు బైటకు రావటాన్ని ఎవరు ఆపగలరు? ఈ సంఘర్షణ సంఘంతోనేకాదు, తనలో తాను, బైరన్‌తో బైరన్ ద్వంద్వ యుద్ధం చేసి గాయాలు పాలవుతున్నాడు. తన పాప తాపాగ్నికి తానే కాలిపోతున్నాడు!

అనబెల్లా ఈ సంఘటనలన్నీ చూసి, ఆమె కనటానికి ఇంకా మూడు నెలలే వుంది సమయం, తన ప్రక్కనే పెద్ద ప్రమాదం వున్నట్లు గుర్తించింది. గతిలేక తనకు తోడుగా అగస్టాను రమ్మంది. "ఆగస్టులో, బైరన్ వీలునామా రాశాడు. తనకున్నదంతా నీకే చెందాలని రాశాడు. అది న్యాయమే అనుకున్నాము. నీవు అంటే మాకు అంత ప్రేమ" అని రాసింది.

ఇప్పుడు ఈ కష్టకాలంలో తను అసహ్యించుకునే వ్యక్తిని సహాయం కోసం రమ్మనవలసిన దుస్థితి వచ్చింది.

అగస్టా వచ్చి, బైరన్ పరిస్థితికి భయపడిపోయింది. అప్పటికే అతని లివర్ పాడయిపోయి బాధలో వున్నాడు. ఒంటి రంగు పసువులోకి దిగింది. జబ్బు, విచారం. కనీసం కవిత్వం రాయటంలోని ఆనందం కూడా లేకుండాపోయింది. బాధ నుంచి ఉపశమనానికి 'Laudanum' వాడుతున్నాడు. ఎప్పుడూ తనదగ్గరే

వుంచుకుంటున్నాడు. ఆ ఉపశమనం తాత్కాలికమే. తర్వాత కొద్దిసేపటికే అంతకంటే విపరీతమైన బాధపడేవాడు.

తన ఇంటిలో ఇప్పుడు పరిస్థితి, కనటానికి సిద్ధపడుతున్న స్త్రీ, అప్పులవాళ్ల ఏజంట్లు – తనకు శాంతి ఏది – ప్రశాంత వాతావరణం ఏది? దీనంతటికీ కారణం?

తను కూడా తన పూర్వీకులు గోర్డాన్ల లాగా అవతారమెత్తుతున్నాడు. జంతువులాగా, ప్రమాదకరమైన పులిలాగా తయారవుతున్నాడు.

అగస్టాను అవమానపరుస్తాడు. ఆమె భర్త గురించి, సంతానం గురించి వాగుతాడు.

'అరె – నీ బాధ్యత మరిచిపోతున్నావా' అంటుంది. అంతే, 'బాధ్యత దేవునికి వదిలిపెట్టు' అని కేకలు పెడతాడు. "ఈ పెళ్లి తంతు అసహ్యకరం – ఈ బంధాలన్ని తెంచుకోవాలి – అసలు ఇప్పుడు ఇంట్లోకి ఉంపుడుకత్తెను తీసుకువస్తాను" అంటాడు.

వదినా, మరదళ్లు అవాక్కయిపోతారు. బెదిరిపోతారు. ఇప్పుడు అనబెల్లాకు బైరన్‌కు, అంటే అనబెల్లాకు భయానికి మధ్యలో గోడ అగస్టా మాత్రమే. వారు గుసగుసలాడటం అతను భరించలేకపోతున్నాడు. తనమీద నిఘా పెట్టారని మండిపడుతున్నాడు.

ఇప్పుడు ఇంట్లోకి రక్షణగా జార్జి ఆన్సన్ బైరన్, అనబెల్లా గవర్నెస్, క్లేర్‌మాంట్ వున్నారు.

ఇది ఇంకా అతన్ని పిచ్చివాణ్ణి చేస్తుంది. ఏమిటి బైరన్‌కు పిచ్చి ఎక్కిందా? వదినా మరదళ్ల అనుమానం! పిచ్చి కాకపోతే. అమాయకురాలయిన అనబెల్లాను ఎందుకు ఇన్ని ఇబ్బందులపాలు చేస్తాడు? అగస్టాకు అదే అనుమానం.

అతని చూపులో మార్పు – అతని పొడవాటి కనురెప్పలు మాటు నుంచి దొంగచూపులు ఏమిటి? ఇది పిచ్చి లక్షణం కాదా? ఇది మందుల ప్రభావమా?

లేక ఈ స్తబ్ద వాతావరణమా? లేకపోతే మేధావి కవి తనలో తను మాట్లాడుకుంటూ ఏమి రాయాలో నిర్ణయించుకుంటున్నాడా?

పాపం ముగ్గురు – ఇద్దరు ఆడవాళ్లు – జార్జి బైరన్ – ఒకరినొకరు చూసుకోవటం – దానితో బైరన్ మరింతగా తనను వారు గమనిస్తున్నారని ఇంకా వింతగా ప్రవర్తించడం!

అనబెల్లాతో జార్జి, "నీవు ఎంత త్వరగా ఇక్కడ నుంచి వెళ్లిపోతే అంత మంచిది. లేదా మీ నాన్న గారికి కబురు చేయాల్సి వస్తుంది" అంటాడు!

డిశంబరు 10న ఆడపిల్ల పుడుతుంది. ఇదికూడా బైరన్‌కు నిరాశే. తన వారసుడు ఏడి?

పాపను చూడటానికి హాబ్ హౌస్ వస్తాడు!

పాప పేరు 'అగస్టా అడా' అంటాడు బైరన్. అది 'కింగ్‌జాన్' వారసత్వమట.

అక్కడ నుంచి హాబ్ హౌస్, హాలాండ్ హౌస్ (Holland House)కి విందుకు వెళ్తాడు. కారోలైన్ ప్రక్కనే కూర్చుంటాడు. ఆమె నవ్వుతూ తుళ్లుతూ హాస్యమాడుతుంటుంది. హాబ్ హౌస్ ఆశ్చర్యపోతాడు.

ఎంత త్వరగా మర్చిపోయింది బైరన్‌ను? "సత్యమంటే, నీవు ఇప్పుడు ఈ క్షణం ఆలోచించేదే" అంటుంది.

తర్వాత హాబ్ హౌస్

"అక్కడ బైరన్, తన బోనులో కుళ్లిపోతుంటే ఈమె ఎంత ఆనందంగా వుంది? "ఈ సృష్టి అంతా ఒక బిందువైతే అదే బిందుపరిధిలో నా వంతు మంచి నేను చేయాలి – నేను వున్నంతవరకూ" అని రాసుకుంటాడు.

డిశంబరు 28 అనబెల్లాను, తల్లి, ఇప్పుడు తమకు లభించిన ఎస్టేటు 'కిర్కీబీ మాల్లరీ'కి రమ్మని ఆహ్వానం పంపిస్తుంది. బైరన్‌కు ఏమాత్రం ఇష్టం లేదు. కాని ఈ వంకతో తన 'బరువు'ను వదిలించుకోవాలనుకుంటాడు.

జనవరి 3న లేడీ బైరన్‌తో, 'ఈ ఇంట్లో ఒక నటిని పెడదామనుకుంటున్నాను' అంటాడు. మూడు రోజులు వరకు కనపడకుండాపోతాడు. ఆరో రోజున ఉత్తరం పంపుతాడు. నీవు వీలయినంత త్వరగా లండన్ వదలి వెళ్లిపో. ఎంత త్వరగా వీలయితే అంత మంచిది. ఇప్పుడు పరిస్థితులు అలాంటివి. నా ప్రణాళికలన్నీ నీవు ఇంటికి చేరిన తర్వాత వివరంగా రాస్తాను. నీవు కిర్క్‌బీకి వెళ్లినా సరే. సీ హామ్‌కు వెళ్లినా సరే, నీ ఇష్టం. కాని త్వరగా వెళ్లటం మంచిది అని రాస్తాడు.

ఆమె మర్నాడే రాస్తుంది. "నీవు చెప్పినట్లే వింటాను. వీలయినంత త్వరగా లండన్ వదిలి వెళ్లిపోతాను" అని రాస్తుంది.

అతనికి పిచ్చిపట్టిందని భయపడతారు. డాక్టర్ బైలీని – డాక్టరు లీమాన్‌ను సంప్రదిస్తారు. వాళ్లు కూడా అతన్ని రెచ్చగొట్టే పని ఏమీ చేయవద్దని – ప్రస్తుతం మీరు వెళ్లిపొండి. తర్వాత బైరన్‌ను డాక్టర్ల పర్యవేక్షణలో కిర్క్ బీకి తీసుకువస్తామని చెప్తారు.

ఆమె లండన్ వీడి వెళ్లిపోయే రోజు తనకు వీడ్కోలు ఇవ్వమంటుంది. ఆమె చేతుల్లో 'అదా' వుండగా అతను నిర్లక్ష్యంగా వెళ్లి రమ్మంటాడు.

ఆ రాత్రి బాగా నిద్రపోయింది. కాని మర్నాడు అశాంతిగా నిద్రలేచింది. బగ్గీ గుమ్మం ముందే వుంది. మెట్లు దిగి వస్తుంది. హాల్లో బైరన్ గది ముందు న్యూస్టెడ్‌లోని కుక్క నిద్రపోయిన చాప వుంటుంది!

ఆమెకు ఒక్క క్షణం దానిమీద పడి నిద్రపోవాలనిపిస్తుంది. అది క్షణికమే. అది దాటి మెల్లగా నడిచి బగ్గీ ఎక్కి వెళ్లిపోతుంది.

"ప్రియమైన బైరన్ – నేను, పాప బాగానే వున్నాం" మొదటి రోజు ప్రయాణం తర్వాత రాస్తుంది. నీవు బాగున్నావని అనుకుంటాను. ఎక్కువ మందులు వాడకు. బ్రాందీ కూడా మంచిది కాదు. మంచిగా, నీతిగా వుండు. నీవు కిర్క్‌బీ వచ్చే ముందు తెలియజేయ్. ప్రేమతో నీ పిప్" ముగిస్తుంది.

మర్నాడు కిర్క్‌బీ చేరిన తర్వాత రాస్తుంది.

జాగ్రత్తగానే జేరాము. మమ్మల్ని హాలులోకి బదులు, వంటింట్లోకి తీసుకువెళ్లారు. ఆకలితో వున్నవాళ్లకు అదే మంచిది కదా!

ఇప్పుడు 'అడా'కు సామాను పెరిగిపోతున్నాయి. కొంచెం లావయింది. అందరూ 'చిన్నారి దేవత' అంటున్నారు. ఆమెకు తెలియకపోవటమే మంచిది కదా!

నిన్ను అందరూ ఇష్టపడతారు - నేను ప్రేమిస్తున్నాను - ఎప్పటికీ నీ దానిని.

నీ పిపిన్ - నీ పిప్ - ని పిన్!"



లండన్, పికడిల్లీ

XXV

వీడుకోలు

(1816)

అనబెల్లా పాపతో వెళ్లిపోయిన తరువాత బైరన్ మామూలు స్థితికి వస్తాడని డాక్టర్లు, అనుకుంటారు. అప్పటికీ అగస్టా, జార్జి అతనితోటే వున్నారు. బైరన్ ప్రవర్తనలో ఏమీ తేడా రాలేదు.

అగస్టా దాదాపు ప్రతిరోజు తన మరదలుకు బైరన్ ఆరోగ్యపత్రం పంపుతూనే వుంది. "ఈరోజు ఇంటిదగ్గరే వున్నాడు. బ్రాందీ తాగలేదు. మందులు వేసుకోలేదు. సాయంత్రానికి జార్జి అడిగిన దానికి కేకలు వేశాడు. 'కిర్క్‌బీ వెళ్దామా' అంటే "నాకేం పని?" "దానిని గురించి ఆలోచనే లేదు" అని. అప్పటి నుంచి అన్ని రకాల పిచ్చివాగుడు మొదలుపెట్టాడు. నన్ను, నా భర్తని నా పిల్లల్ని నువ్వు విన్నావుగా అలాగే పేలాడు" ఇలా వుండేవి.

అగస్టా దృష్టిలో బైరన్ ఒక సహజమైన ప్రాణి. ప్రకృతిలో భాగం, బాధ్యతగల మనిషి కాదు. తమ్ముడు గురించి అక్కలాగా, బిడ్డ గురించి తల్లిలాగా భావించేది. బహుశా అందుకేనేమో అతడు ఆమెను ప్రేమిస్తాడు!

ఇక్కడ బైరన్ తన పాలన సాగుతున్నది అనుకుంటున్నాడు. కాని కిర్క్‌బీలో అతని జాతకం మారబోతోంది.

లేడీ బైరన్ రూపురేఖలు మారిపోవటం ఆమె ఆరోగ్యం క్షీణించటం ఆమె తల్లితండ్రులు జీర్ణించుకోలేకపోయారు. సరిగా నిద్రపోలేకపోయింది. ఇప్పుడేం చేయాలి? తన అమ్మకు నాన్నకు ఏమిచెప్పాలి?

ఇప్పటికీ బైరన్‌ను ప్రేమిస్తూనే వున్నదే–

కాని అతను, కనీసం తనకు అవకాశం ఇవ్వాలికదా? అతనికి పిచ్చి – అందుకని అతన్ని నిందించలేము. అతన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. ఇది బాధ్యత! అవును బాధ్యత!

అగస్టా విషయం తప్ప – అన్నీ పూసగుచ్చినట్టు చెప్పాల్సి వచ్చింది.

"నీకు తెలియదు, నాన్నగారికి ఎంత కోపం వచ్చిందో – కాని బైరన్ ఆరోగ్యం దెబ్బతిన్నది – అని తెలుసుకున్న తర్వాత అతన్ని క్షమించి ఆందోళనపడ్డారు. ఇక్కడకు తీసుకువచ్చి సేవలు చేయాలని అనుకుంటున్నారు" ఇలా తెలియజేసింది.

బైరన్ కూడా తన భార్యతో జీవితం సాగిద్దామని ఎన్నోసార్లు అనుకుంటాడు. ఒక కొడుకు న్యూస్టెడ్ వారసుడు పుట్టిన తర్వాత ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని అనుకుంటాడు!

ఆ రకంగా రోజులు దొర్లిపోతున్నాయి.

అనబెల్లా తల్లి, లండన్ వెళ్లి లాయర్లను సంప్రదించాలనుకుంటుంది. దానికోసమే ప్రయాణం కూడా అయ్యింది. అప్పుడే డాక్టర్లు తమ అభిప్రాయాన్ని తెలియజేస్తారు అనబెల్లాకు.

"అతనికి ఎలాంటి పిచ్చి లేదు. కేవలం 'లివర్' సరిగా పనిచేయక అతనికి కోపం. మిగతా అవలక్షణాలు బయటపడుతున్నాయి. ఇవన్నీ వైద్యంతో తగ్గించవచ్చు."

బైరన్ మానసికంగా ఆరోగ్యంగా వుంటే, అతనికి అనబెల్లా కుటుంబం క్షమాపణ ఎలా ప్రసాదిస్తారు? అన్నీ ఎరుకలోనే జరుగుతున్నప్పుడు, ఈ భూమి మీద మన జీవితం గడపవలసింది, పరలోకంలో శాశ్వతంగా వుండటానికే. ఇదే లేడీ బైరన్ విశ్వాసం.

అలాంటి విశ్వాసం వున్నప్పుడు ఒక శాపగ్రస్తమైన వ్యక్తి మూలంగా తను ఈ మర్త్య లోకంలో శాశ్వతంగా వుండిపోవాలా? ఇదెలా సాధ్యపడనిస్తుంది? ఈ నిర్ణయంతోనే, తన భర్త నుంచి వేరుపడటానికి, కఠినమైన నిర్ణయానికి వస్తుంది. కాని ఆమె బాధను ఎవరు పోగొట్టగలరు?

అనబెల్లా తల్లి లండన్ జేరి, సర్ సామ్యూల్ రోమెల్లీ ఈయన చాలా ఘనత వహించిన న్యాయాధికారి, మరొకరు డాక్టర్ లూషింగ్‌టన్ అనే యువ లాయర్. వీరి సలహాతో బైరన్‌కు, తన భర్త పేర తాఖీదు పంపడానికి ఒక నిర్ణయానికి వచ్చి, దీనికి తన కూతురు అంగీకరించటంతో ఎంతో ఆనందిస్తుంది!

ఆ తాఖీదు సారాంశం – బైరన్‌తో ఒక అంగీకారానికి రావటం – అతను అంగీకరించకపోతే మతపరంగా గృహహింస పేర విడాకులు పొందటం!

ఫిబ్రవరి 2 – ఆ తాఖీదు పంపిస్తారు. ఆ వుత్తరం అగస్టా చేతిలో పడుతుంది! ఆమె దానిని తిప్పి పంపుతుంది. ఘర్షణ పడటం ఇష్టం లేక–

దాని పర్యవసానం సర్ రాల్ఫ్ లండన్ వచ్చి మరొక వుత్తరం – ఈసారి చేరవలసిన చోటికి చేరుస్తారు. దాని సారాంశం "నీ భార్యను – నీ దగ్గరకు పంపటం, ఆమె తల్లిదండ్రులకు ఏమాత్రం సమ్మతం కాదు. ఆమెకు క్షేమం కాదు. తరువాతి పరిణామాలు చర్చించేందుకు మీ న్యాయవాదిని ఎవరిని నియమించుకుంటారు?!"

అంతే బైరన్‌కు కళ్లు బైర్లు కమ్ముతాయి. అవాక్కయిపోతాడు! తన చేతిలో అనబెల్లా నిన్నగాక మొన్న రాసిన వుత్తరాలున్నాయి?! ఇంతలో ఏమిజరిగింది? ఈ నిర్ణయం అనబెల్లా తీసుకున్నదని నమ్మలేకపోయాడు.

నిజమే, తన ప్రవర్తన ఆమెకు కష్టం కలిగించింది. కాని ఆమె క్షమించానని చెప్పలేదా? మరి అగస్టా? ఈ వదిన, మరదళ్లు తనకు వ్యతిరేకంగా జట్టుకట్టారా?

అతడు తనకు ఆనందాన్నిస్తాయని అనుకున్న సూచితాలు, ఇవి ఎలా నిరూపించబడతాయి? అయినా ఇవన్నీ పెళ్లికి పూర్వంకదా! ఈ విధంగా తన

నుంచి ఎలా వేరుపడగలదు? ఇది అసంభవం కదా! ఆమె ఎదురుగా వుండగా విడిపోవాలనే ఆలోచనతో తాను తమాషా చేసి వుండవచ్చు. కాని ఈ నిజస్థితి అతన్ని భయకంపితుణ్ణి చేసింది.

భావోద్రేకాల ఊసరవెల్లి! అప్పుడే అతని ఆలోచనలు తామిద్దరు ఎంతో ఆనందంగా గడిపిన క్షణాలు గుర్తుకు తెచ్చుకుంటున్నాడు. అక్కడదాకా ఎందుకు, నిన్న సాయంత్రం లేడీ మెల్‌బోర్న్‌తో చెప్పలేదా? అనబెల్లా సద్గుణాలన్నీ ఏకరువు పెట్టలేదా?

"నేను చెప్పేదంతా ఏమీ ఉపయోగం వుండకపోవచ్చు. అలాగే నేను చెప్పగలిగిందంతా పనికిరాకపోనూవచ్చు. కాని ఇప్పటికీ ఆవిరవుతున్న ఆశలనే నమ్ముకుని, ముక్కలయిన సంసార నావ చెక్కలనే పట్టుకుని, అది పూర్తిగా మునిగిపోవటానికి ముందుగా, ఇంకా ఆశతో వున్నాను.

అరె – నీవు ఎప్పుడూ నాతో ఆనందంగా సంతోషంగా లేవా? అలా వున్నానని నాతో ఎప్పుడూ చెప్పలేదా?

మన మధ్యలో ఎలాంటి అనుబంధం వెచ్చని ప్రేమ బంధం లేదా? ఒక రోజుకూడా అలాంటి సందర్భం రాకుండా గడచిందా?" ఇదీ అతను, ఆమెకు రాసింది!

ఈ ఉత్తరం ఆమెలో కదలిక తెస్తుందని ఆశించటంలో అతని ఆలోచన సరైనదే. ఆ సమయంలో అనబెల్లాతో ఫ్లెచర్ భార్య వుంది. ఆమె దీనికి సాక్ష్యం కూడా. అనబెల్లా ఎంతో కదిలిపోయింది. కాని ఆమె మానసిక స్థైర్యం గొప్పది! బైరన్‌తో ఎలాంటి సంసార జీవితం సాధ్యం కాదని ఆమెకు పూర్తిగా తెలుసు! బైరన్, ఆమె మతసంబంధమైన విశ్వాసాల నిశ్చయాలను తక్కువ అంచనా వేశాడు! ఇంత కనికరం లేనిదనుకోలేదు – కాని తన నిర్ణయాలకు దేవుడే కారణమని నమ్మే ఆమె, మరొక విధంగా ఎలా వుంటుంది?

అగస్టాకు రాస్తుంది "నా నిర్ణయాలు అన్నీ దేవుని సేవలో భాగమనుకుంటున్నాను. ఇప్పటి నా కార్యాచరణకూడా అందులో భాగమే" అంటుంది.

బైరన్ తనకు చేతనైన విద్యలన్ని ప్రయోగిస్తాడు. తన అమాయకత్వం – తన రమణీయ వాక్చాతుర్యం, తన భాషాపటిమ అన్ని ప్రయోగిస్తాడు. "ప్రేమ పాత్రమైన 'పిప్' ఇప్పటి నా ఆశ – నీవు నన్ను వదలవని, ఈ పరిణామాలన్నీ నన్ను మరింత కృంగదీస్తున్నాయి..." కాని ఆమె నుంచి సానుకూలమైన సమాధానం రాకపోవటంతో, ఇక చివరి అస్త్రం ప్రయోగిస్తాడు. తమ నిశ్చితార్థ సమయంలో ఆమె రాసిన "నీతో నేను ఎంతో ఆనందంగా వుంటాను. దీనికి ఇక తిరుగులేదు సుమా..." అని వుంటుంది. ఈ మాటల్ని గుర్తుపెట్టి మరీ పంపుతాడు. ఆ ప్రక్కనే రాస్తాడు "అనుకున్నదే జరిగింది, 16 ఫిబ్రవరి 1816" – ఆ క్రిందనే డాంటే వాక్యాలు కలుపుతాడు.

నీవు చేసిన బాసలన్నీ

ఇచ్చిన మాటలన్నీ గాలిలో కలిసిపోయాయి! తెలుసా!

ఇలాంటి వార్తలు లండన్‌లో తొందరగా వ్యాపిస్తాయి. ఇలాంటివి వ్యాప్తి చేయడానికి చాలామంది డాక్టర్లు, లాయర్లు, సేవకులు అందరూ వున్నారు!

ఇప్పటి నుంచే ఏమి జరిగింది – ఎలా జరిగింది అయ్యో – దీనిని ఆపలేవా? నీకు ఎలాంటి సహాయం కావాలి – ఇలాంటి వాకబుతో అతనికి దుర్భరంగా వుంది. ఇవన్ని అతనికి మేలు చేయటానికే కావచ్చు. కాని ఒంటరిగా వుండలేని దురదృష్టవంతులు వూరుకోరుకదా!

లేడీ మెల్‌బోర్న్, "నీ గురించి ఎన్నో పుకార్లు వింటున్నాను. ఇవన్నీ నీ దాకా వస్తున్నాయో లేదో, నీవు, అనబెల్లా విడిపోయారని, మామూలుగా ఇలాంటి అసత్యమైన పుకార్లు పుట్టినపుడు, వాటికి అంత విలువ ఇవ్వకుండా వదిలివేయాలి. కాని చాలా ఎక్కువగా ఈ చర్చ జరుగుతోంది. దీనిని ఖండించాలంటే ఆమెను నీ దగ్గరకు రప్పించు. లేదా నీవే ఆమె దగ్గరకు వెళ్లు" అని సలహా ఇస్తుంది.

అందరి సలహాలు సూచనలు విన్నాడు. అతని స్నేహితులతో "ఇప్పటికీ నేను నమ్మలేకపోతున్నాను, ఈ గందరగోళం, ఈ చేదు అనుభవం ఇవన్నీ లేడీ బైరన్ ద్వారా వచ్చాయంటే, ఆమెకంటే ఉత్తమురాలు ఎక్కడ వుంటుంది?" దీనికి మూలం తన అనారోగ్యమేనంటాడు – దానికి ముందుగా తన కోపంతోపాటు ఆపుకోలేని ఆగ్రహావేశాలు తన కఠిన ప్రవర్తన ఇవే కారణమంటాడు.

బైరన్ గాని అతని స్నేహితులు కాని, లేడీ బైరన్ నిర్ణయాన్ని మార్చలేమని తేలిన తరువాత, ఇక ఈ వ్యవహారాలను ఇరువైపుల న్యాయవాదులకు వదిలివేశారు.

హాబ్సన్ ఎప్పుడూ బైరన్ మేలు కోరేవాడే! పికడిల్లీ టెర్రెస్ ఇంట్లో జరిగిన దురదృష్టపు సంఘటనలకు తన ఉపయోక్త (కక్షిదారు) విచారిస్తున్నట్లు ఇందుకు సాక్ష్యంగా అతను రాసిన ఉత్తరం "డియర్ డక్..." చూపిస్తాడు.

దీనికిబదులుగా, లేడీ బైరన్ లాయరు, ఆమె అభియోగాలన్నీ ఏకరువు పెట్టకుండా, ఇప్పుడు ఎటువంటి అంగీకారం కుదరకపోతే, తన అభియోగాలన్నీ న్యాయస్థానంలోనే వినిపిస్తానంటాడు. నిజానికి అతని చేతిలో అనబెల్లా పద్ధతి ప్రకారం, లెక్కల పద్దులాగా, పేరాల ప్రకారం (ఆమె Princess of Parallelogram కదా) ఆమె తన జీవితంలో అత్యంత విషాద ఘట్టాలలో కూడా తన విద్యను మరిచిపోలేదు. తన నిర్ణయానికి రహస్య కారకాలన్నీ పట్టీ ఇచ్చింది!

దీనితో బైరన్‌కు అత్యంత విశ్వాసపాత్రుడైన స్నేహితుడు హాబ్ హౌస్ కల్పించుకుని, అతనికి, తన స్నేహితుని జీవనశైలి అలవాట్లు, మంచి గుణాలు అన్నీ తెలుసుకదా. ఇలాంటి స్వేచ్ఛాజీవికి పెళ్లి సంకటం ఎంత దారుణమైన అనుబంధాలకు దారితీస్తుందో తెలిసినవాడు, బైరన్ మానసిక స్థితి – అతని హింసాత్మక జంతుప్రవృత్తి పూర్తిగా అవగాహన వున్నవాడు – అసలు అనబెల్లా నిర్ణయానికి మూలకారణం తెలిసినవాడు, బైరన్‌తో తన స్వీయానుభవం తెలిసినవాడు, అతని సౌందర్యం, వికృతాలను చూసినవాడు, ఒక రకంగా లేడీ

బైరన్ తనంతట తనే ఈ బోనులోకి నడుచుకుంటూ వెళ్లింది. బైరన్ సహజ లక్షణాలను మరింతగా రెచ్చగొట్టింది – ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని.

"లార్డ్ బైరన్‌పై అభియోగాలేమిటి? అతను ఆలస్యంగా నిద్రలేస్తాడనా? ఒంటరిగా భోజనం చేస్తాడనా? ఎప్పుడూ ఆలోచిస్తుంటాడనా? అప్పుడప్పుడూ హాస్యమాడుతాడనా?" అంటాడు.

ఇక అగస్టా విషయం వచ్చేసరికి – హాబ్ హౌస్ – లేడీబైరన్‌ను తను తయారు చేసిన పత్రాన్ని సంతకం చేయమంటాడు. దానిమీద మార్చి–6, 1816 తేదీ వేసివుంది.

"నేను – లేడీ బైరన్ – ఈ విడిపోవటానికి ముఖ్య కారణం, మా యిద్దరి అలవాట్లు అభిప్రాయాలు మానసిక స్థితులు కలవకనే. దీనివల్ల మా వివాహ జీవితం సాఫీగా జరగదని అనుమానిస్తూ, నమ్ముతూ, ఇంతకంటే మరే ఇతర దారుణమై కారణాలు నేనుగాని, నా కుటుంబ సభ్యులుగాని భవిష్యత్తులో ముందుకు తీసుకురాము. ప్రచారం చేయము..." ఇదీ దాని సారాంశం!

కాని లేడీ బైరన్ దీనిమీద సంతకం చేయదు! ఆ తరువాత దీనికి మారుగా మరొక పత్రాన్ని తయారు చేసి పంపిస్తారు. బైరన్ శ్రేయోభిలాషులు.

"ఇక్కడ ప్రచారంలో వున్న పుకార్లను నమ్మటంలేదని – ఒకవేళ ఈ విడాకులు కోర్టుదాకా వెళ్లితే – లార్డ్ బైరన్ వ్యక్తిత్వానికి భంగకరంగా అభియోగాలు లేవని, దీనికి తానుగానీ తనవారుగానీ కర్తలు కారని.."

ఇది హాబ్ హౌస్ రాసిన దానికంటే భిన్నమైనది? కాని ఎక్కడో ఒకచోట అంగీకారం కుదరాలి కదా!

తరువాత ఇక ఆర్థికపరమైన విషయాలు ఇది బైరన్‌కు చాలా ముఖ్యమైనవి. ఇప్పుడు అతని దగ్గర ఒక్క పెన్నీ లేదు. ఇప్పుడు న్యాయవాదులకు ఇవ్వటానికి కూడా వెతుక్కోవాలి. అయినా అతనికి ముర్రే ఒకప్పుడు పంపిన 1500 పౌండ్లు తిప్పి పంపాడు కదా.

కాని చివరికి ఇప్పుడు ముర్రే వెయ్యి పౌండ్లు పంపుతాడు. బైరన్ అయిష్టంగానే తీసుకుంటాడు.

చివరికి ఇరువైపు న్యాయవాదులు అంగీకారానికి వస్తారు.

లేడీ బైరన్‌కు వచ్చే 1000 పౌండ్లు చెరిసగం తీసుకునేట్లు. తరువాత అనబెల్లా తల్లి మరణం తరువాత ఎస్టేటులో – అప్పుడు మధ్యవర్తులు అదీ ఇద్దరికీ న్యాయంగా పంపకాలు జరిపేటట్లు.

ఆ విధంగా బైరన్ తనకు వచ్చే ఆదాయంకాక ఈ ఆదాయం కూడా పొందగలడు. హాన్సన్ ఈ వ్యవహారం చాలా బాగా పరిష్కరించినట్లేకదా!

--0--

ఇప్పుడు పికడిల్లీ టెర్రెస్ ఇంటి వాతావరణం – మేడమీద ఎవరిదో శవం ఉన్నట్లు భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది.

క్రింద గదుల్లో అప్పులవాళ్లు తిరుగుతూ, పుస్తకాలు వస్తువులూ కట్టలు కడుతున్నారు, త్వరలోనే అమ్మకానికి వీలుగా! ఆగస్టు 6 – ఇవన్నీ ముర్రే కొంటాడు. బైరన్ తను అంటించిన బొమ్మల బోర్డు – జాక్సన్ – ఏంజెలో వున్న కుస్తీపోటీల బొమ్మలు.

బైరన్ గదిలో మందులు మాకులు, అన్నీ అతని కాలేయం జబ్బు తాలూకు మందులే – అక్కడక్కడ అనబెల్లా గుర్తులు ఇదీ వాతావరణం.

బైరన్ మెల్లమెల్లగా ప్రశాంతత సంతరించుకున్నాడు. ఈ విచారగ్రస్తమైన చీకటి గదుల్లో....

ప్రకృతిలో కొన్ని ప్రాణులు, తేమతో చీకటిలోనే మనగలవు. మంచులో, నీటిలోనే పెరగగలవు. అలాగే బైరన్ సంతోషాల వెలుగు చూడలేదు. అతనికి వేదనామయ జీవితం అలవాటయిపోయింది. అనబెల్లా వెళ్లిపోయిందా? ఇది నిజమేనా? తనవాళ్లందరూ చనిపోలేదా – ఎడిల్స్‌టన్ – మాథ్యూ – తన మేరీ చావర్తు – తన తల్లి అందరూ తనని విడిచిపోలేదా?

ఇప్పుడు చివరికి అనబెల్లా, వింత అనబెల్లా కూడా తనను దాటిపోయింది. ఈమెకూడా తన జీవితంలో చోటుచేసుకున్న మరణచ్ఛాయల రమణీయతను మరింతగా మార్మికంగా మార్చి వెళ్లిపోయింది.

అంత గొప్ప ఇంట్లో – ఒంటరిగా ఆ గదుల్లో బోనులో చిక్కిన పులిలాగా తిరుగుతున్నాడు.

చివరికి తన రాతబల్ల దగ్గర ఒక చీకటి సాయంత్రం ఆలోచనల భారంతో కూర్చుండిపోయాడు. తన తల ఆలోచనలతో బరువెక్కిపోతుంది. ఆలోచనలు ఎడతెగని ఆలోచన! ఈ తల బరువెక్కిపోతోంది. అతని మెడ మోయలేనంతగా. తన జీవితంలో నుంచి నిష్క్రమించిన "Tiny girl", అతను అనేవాడు "Implement of torture"

తనను 'హింసించే పరికరం' అనేవాడు ఎదురుగా వున్నపుడు–

ఇప్పుడు ఆమె లేనప్పుడు ఆమె సన్నిధి కోసం తపించటం మొదలుపెట్టాడు.

దుఃఖం – బాధ – వేదన ఇవే కేవలం

ఇవే – అతని కవితాధారకు మూలాధారాలు!

అప్పుడే ఓ కాగితం తీసుకుని కన్నీటి ధారలు బల్లమీద పడి చిందిపోతుండగా రాస్తాడు– అద్భుతమైన లయతో భావావేశంతో!!

వెళ్లిరా – చెలీ – వీడ్కోలు – వెళ్లిరా

ఇదే తుది వీడుకోలు–

ఎప్పటికీ క్షమించలేకపోయినా–

నిన్ను నా మదినుంచి పంపలేను (నిన్ను మరచిపోలేను).

ఎప్పుడైనా నీ రొమ్ముని నగ్నంగా వుంచుతావా?

అక్కడేగా నా శిరస్సు వాల్చి విశ్రమించాను–

అప్పుడేగా నీవు ప్రశాంతంగా నిద్రపోయావు,

మళ్లీ అలా నిద్రపోగలవా?

ఈ ప్రపంచం నిన్ను సమర్థించవచ్చు–

నా గాయాలను చూసి నవ్వనూవచ్చు -

నా దుఃఖాన్నుంచి జనించిన దాని మెచ్చుకోలు

నిన్ను మాత్రం శాంతంగా వుండనిస్తుందా?

నా తప్పులన్ని నన్ను వికృతంగా చేసినా-

నాకు మరో స్నేహహస్తం ఎక్కడిదీ-

నన్ను ప్రేమగా చూసి మానని నా గాయాలకు

సాంత్వన కలిగించినదేకాక?

అయినా - అయినా - నిన్ను నువ్వు మోసం చేసుకోకు-

ప్రేమ - ప్రేమ - మెలమెల్లగా మరుగైపోతుంది

అలాగే ఒక్కసారిగా బాధతో

గుండెలు బద్దలైపోతాయి.

నీకు శాంతి దొరకకపోతే

మన బిడ్డకు పలుకులు వస్తుంటే

నాన్నా అని నేర్పుతావా?

ఎలాగూ ఆమె నాన్న ప్రేమను పొందలేదు కదా!

ఆమె చిన్నారి చేతులు నీ బుగ్గలు నిమిరితే,

లేత పెదవులు నీకు ముద్దుపెడితే

నీ కోసం ప్రార్థించే వాడిని తలుచుకో

నీవు ప్రేమతో చూసినవాడిని గుర్తుకు తెచ్చుకో-


ఇంతా జరిగిన తర్వాత ఇంక మాటలెందుకు?

నా మాటలకు విలువ లేదుకదా-

కాని ఆలోచనలను ఆపగలమా

అవి మన ఇష్టప్రకారం వస్తాయా?

వెళ్లిరా - చెలీ - వీడ్కోలు - వెళ్లిరా!



ఇలా విడిపోదాం!

మన బంధాలన్ని తెగిపోయి–

గుండె విరిగిపోయి – ఒంటరిగా మిగిలిపోయి

ఇంతకంటే ఎలా చావను?

వెళ్లిరా – చెలీ – వీడ్కోలు.

తర్వాత అతను కోపంతో ఊగిపోయాడు – దీనికి కారకులయిన వారినందర్నీ చీల్చి చెండాడాడు. తనను తాను నిర్దేశించుకోలేని స్థితికి వస్తాడు.

అతన్ని ఒక క్రూర జంతువులాగా సమాజం వెన్నాడి వేటాడుతోంది.

ఇప్పుడు రాజకీయంగా అతనిపై కుట్ర, కక్ష వ్యతిరేకత! మొదలయ్యింది – అతను Corsair రాసిన కాలంనాటి శక్తులన్నీ మళ్లీ పుంజుకున్నాయి. అతని తొందరపాటు – నెపోలియన్‌ను పొగడుతూ 'On the star of the Legion of Freedom' రాయించింది.

The Champion అతని రాతలను ప్రచురిస్తూ ఇదీ మన ఇంగ్లీషు లార్డు దేశభక్తి! రాజకీయ, నైతిక వ్యక్తిత్వం! అంత ఉత్తమురాలయిన ఇంగ్లీషు యువతిని కష్టాలపాలు చేసిన వ్యక్తి, ఏనాడయినా ఆంగ్ల జాతి విలువలకు విలువ ఇచ్చాడా? ఇలాంటి రాతలతో అతన్ని చీల్చి చెండాడి ఆనందించింది – తన పాఠకులకు అందించింది!

ఈ కవి స్వేచ్ఛా జీవి – అవిటివాడు – ఎప్పుడైనా ఇంగ్లీషువాడిగా ప్రవర్తించాడా? చాలాకాలం ఇతని అధికార పక్ష వ్యతిరేక భావాలు – ప్రిన్స్ రీజంట్‌పై విమర్శ, అవి లార్డ్స్ వరకే పరిమితమైనాయి. కాని అనబెల్లా విషయంలో – సామాన్య మధ్యతరగతి వర్గం అతనికి వ్యతిరేకంగా ధ్వజమెత్తింది.

అతను హౌస్ ఆఫ్ లార్డ్సులోకి ప్రవేశించటానికి వెళ్లుతుంటే, ఎవరు పలకరించేవారు కాదు. లార్డ్ హాలండ్, 'హల్లో' అనేవారు. టోరీ పేపర్లన్నీ అతన్ని

'నీరో' అంటున్నాయి. హెన్రీని పోలుస్తున్నారు! అసలు 'డెవిల్' (Devil) అంటున్నాయి.

రోజర్స్ – ఇవన్నీ ఈ సమాచారమంతా బైరన్‌కు చేరవేస్తూనే వున్నాడు. ఒకరోజు వార్తాపత్రికతో అతని దగ్గరకు వస్తాడు. అందులోని విమర్శనంతా చదివి, ఇది 'ఆ దుర్మార్గుడు క్రోకర్ రాసిందే' అంటాడు. బైరన్ ప్రతిస్పందన గమనిస్తూ 'ఇతన్ని వదలకు' అని సలహా ఇస్తాడు. అలాగే విగ్గు (wig) సభ్యులు కూడా అతనికి ఎలాంటి సమర్థనా ఇవ్వరు.

ఇది అతను కోరుకున్న తీరు, 'తీర్చిదిద్దుకున్న' జీవితం! ఇదేనా తాను కావాలనుకుంది? ఇప్పుడు తనని సమర్థించేదెవరు? లేడీ మెల్‌బోర్న్ కూడా ఏమీ చేయలేకపోతోంది. లేడీ జర్సీ – ఆమె చాలా ధైర్యస్థురాలు. అతనికి మద్ధతుగా ఒక రాత్రి విందు ఏర్పాటు చేస్తుంది. దానికి బైరన్, అగస్టాలను ఆహ్వానిస్తుంది.

అతిథులున్న హాలులోకి ఈ అక్కాతమ్ముళ్లు రాకతో, అంతలోనే హాలు ఖాళీ అయిపోతుంది. పాపం, లేడీ జెర్సీ నిర్ఘాంతపోతుంది. ఆమె ఏర్పాట్లు, ఆమె అందచందాలు, ఏమీ సహాయం చేయలేకపోతాయి. ఆమేగాక బైరన్‌తో మాట్లాడినది లేడీ ఎల్ఫిన్‌స్టోన్ మాత్రమే. మగవారయితే చాలా కఠినంగా కనికరంగా లేకుండా వుండిపోతారు. బైరన్ ఒక మూల కూర్చుని ఈ శత్రు సంఘాన్ని అసహ్యంగా చూస్తుంటాడు. అందులో అందర్నీ ఒక్కొక్కరిగా పరిశీలిస్తాడు.

ఆ రాత్రి నుంచి అతని దృష్టి, అభిప్రాయం, మరింతగా కఠినంగా మారిపోతుంది. అప్పుడే అతను గుర్తిస్తాడు. ఏదైనా ఒక సవాలు, తనలోని ధైర్యాన్ని ఎలా బహిర్గతం చేస్తుందో పసికడతాడు!

తన పతనం గొప్పది! భంగపాటులోని అద్భుతం – తనకు కావలసిన అవసరమైన శక్తిని సమకూరుస్తుంది! ఇప్పుడే తన తిరుగుబాటుతో ఈ సమాజంపై తను వికృతమైన పాత్ర పోషించబోతున్నాడు.

ఈ సమాజ తిరస్కారంలో, ఒక సౌందర్యాన్ని చూడగలుగుతున్నాడు.

ఈ సంఘ బహిష్కరణలో ఒక విప్లవాన్ని దర్శించగలుగుతున్నాడు!

ఇప్పటికీ, మానసికంగా తనను వెంటాడి వేటాడి తరుముతున్న కపట ఉన్నత వర్గం – ఇప్పుడు తనను మధ్యతరగతి సమాజపు తిరస్కారంతో కాందిశీకునిగా, తన మాతృభూమి నుంచి వెళ్ళిపోయే స్థితికి తీసుకువచ్చింది. దీనికి వేరే ఎన్నిక ప్రక్రియ అవసరంలేని హింసాత్మకమైన తీర్పు జారీ చేసినట్లే! అలాగే కానీ!

ఇంగ్లండు పొమ్మంటే తన యాత్ర మళ్లీ ప్రారంభించటానికి సిద్ధపడతాడు!

ఈ యాత్ర మొదలుపెట్టటంలో తను కోల్పోయేది ఏముంది – తనవాళ్లు ఎవరున్నారు? కేవలం అగస్టా తప్ప? ఆమెకోసమే అతను బాధపడతాడు–

ఒక ఆదివారం, ఏప్రిల్ 14, ఆమె, అతనికి వీడ్కోలు చెప్పటానికి వస్తుంది. తరువాత మళ్లీ తన 'జైలుకు', ఆమె తిరిగి వెళ్లిపోవాలి. ఆ సాయంత్రం చాలా విచారపూరితమైన రాత్రి – గడుపుతుంది. మొదటిసారిగా తన దుఃఖాన్ని తన పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేస్తుంది. కన్నీటి పర్యంతం అయిపోతుంది.

ఆమె వెళ్లిపోయిన తరువాత – బైరన్ – తన భార్యకు రాస్తాడు – "మరికొన్ని చివరి మాటలు – ఎక్కువ కాదులే – నీవు చేయగలిగిందే – దీనికి సమాధానం కోసం ఎదురుచూడను. వస్తుందనీ అనుకోను. కాని ఇది వినమని అడుగుతున్నాను. ఇప్పుడే నా సోదరి వెళ్లిపోయింది. నీవు నాకు మిగిల్చిన చివరి ప్రాణి ఆమే కదా – నేను ఎటుపోయినా చాలా దూరతీరాలకు పోతున్నాను. మళ్లీ నువ్వూ నేను, ఈ ప్రపంచంలో కలవగలమని అనుకోను. మరో లోకంలో కూడా! – నాకేదయినా ప్రమాదం జరిగితే అగస్టాను దయతో చూడు – ఆమె లేకపోతే ఆమె సంతానాన్ని చూడు"

ఇవీ అతను తన భార్యకు రాసిన రాతలు!

బయలుదేరడానికి ఒక వారం రోజుల ముందునుంచీ ఒక క్రొత్త సాహసం మొదలవుతుంది. ఇది ఆడవారిపట్ల అతనికున్న చులకన భావాన్ని తగ్గించేదేమీ కాదు. ఈ వారంరోజులుగా ఎవరో తెలియని యువతి, ప్రేమ లేఖలతో

దాడిచేస్తోంది. మొదట్లో మారుపేర్లతో రాసినా తరువాత తన పేరు క్లేర్ క్లైయిర్‌మాంట్ అని రాస్తుంది. తను రచయితనని తను రాసిన నాటకాన్ని సరిచూడాలని అడుగుతుంది. ఆ తరువాత ధైర్యంగా "రాత్రికి ఊరి బైట బగ్గీలో కలుద్దాం. ప్రొద్దుటి వరకు నీతో వుంటాను. ఎలాంటి ప్రశ్నలు అడగను..."

ఇప్పుడు అతని మనఃస్థితి స్తబ్దంగా వుంది. ఈ సాహస యువతితో కొత్త అనుభవంతో, ఆమె అందంగానే వుందని తన పనివాళ్లు చెప్పారు. కొంత చైతన్యం కలగవచ్చు. ఆ విధంగా ఒక రాత్రి ఆమెతో గడపటానికి అంగీకరిస్తాడు! అంతే!

యాత్రలకు సామానులన్ని సర్దుతారు. ముందుగా ఒక గొప్ప బగ్గీ సిద్ధం చేయమంటాడు. అది చక్రవర్తి నెపోలియన్ బగ్గీలాంటిది. తనతోపాటు ఫ్లెచర్, ఒక వైద్యుడు ఇటాలియన్ డా॥ పోలిదోరి – ఇతను ఎడిన్‌బర్గ్‌లో వైద్యం చదివాడు! ముర్రే, ఈ డాక్టరుకు ఈ యాత్ర విశేషాలు రాయమని 500 పౌండ్లు ఇస్తాడు. పికాడెల్లి టెర్రెస్ ఇంట్లో విందులు వినోదాలు మొదలవుతాయి. సంగీతకారుడు ఇజాల్ నాథన్, లాయరు హాన్సన్ Leigh Hunt - (లీ హంట్) రచయిత – హాబ్ హౌస్ అందరూ వస్తుంటారు. కన్నార్డ్ షాంపేన్ తెస్తాడు – వారి చర్చలు – ఆటలు – పాటలు ఇతనికి అంతర్గతంగా వున్న విషాదాన్ని మరిచిపోవటానికి జరిపే తంతు మాత్రమే. ప్రయాణానికి రెండురోజులు ముందు బైరన్, అనబెల్లా, 'విడిపోయే' అంగీకార పత్రాల మీద సంతకాలు చేస్తారు. బైరన్ తన సంతకం పక్కనే రాస్తాడు.

ఒక ఏడాది క్రితం నేనంటే ఇష్టమని మాట ఇచ్చావు! 'ప్రేమించటం అంటే గౌరవించటం' ఈ మాటలేకదా! ఇలాంటి ప్రమాణాలు – వీటి విలువ ఇదా?! నాథన్ ప్రయాణం రోజున కొన్ని కొత్తగా వచ్చిన బిస్కట్లు కేకులు పంపిస్తూ ఇవి ఎంతో ప్రత్యేకం – ఒక దేవత దీవెనలతో, ఆమె ఒక దేశాన్నే ఆశీర్వదిస్తుంది. ఆమె దీవెనలు మీరు ఎక్కడికివెళ్లినా మీతోనే వుండాలని కోరుతూ"

ఏప్రిల్ 24 – ఈ యాత్రాబృందం బయలుదేరుతుంది. బైరన్ ఇంటి బైట గుంపులు చేరతారు. బైరన్ బైటకు అడుగు పెడతాడు. అతనితో స్క్రోప్‌డేవీస్, డా॥ పోలిదోరి, హాబ్ హౌస్ మరో బగ్గీలో ఎక్కుతారు. ఫ్రెంచ్ ప్రభుత్వం అతని ప్రయాణానికి 'తమ దేశం గుండా' అంగీకారం తెల్పదు. దాని కారణంగా స్విట్జర్లాండు – డోవర్, ఓస్టెండ్, బెల్జియం మీదుగా వెళ్లటానికి ఏర్పాట్లు జరుగుతాయి.

ఫ్లెచర్ ఆలస్యంగా వచ్చి కలుస్తాడు – "అప్పులవాళ్లు ఇంట్లో చిత్తుకాగితం కూడా వదలలేదు. వాళ్లను వదిలించుకుని వచ్చాను..." అంటాడు!

డోవర్ జేరిన తరువాత నౌక మర్నాటి వరకూ బయలుదేరదని తెలుసుకుంటారు. బైరన్ అక్కడ దగ్గర్లో వున్న "చార్లెస్ చర్చిల్" అనే రచయిత సమాధి దర్శిద్దామంటాడు. అందరూ ఒక గైడ్‌తో వెళ్తారు. అక్కడ ఒక మట్టిదిబ్బ ఒక నాపరాయి మాత్రమే వుంటాయి. బైరన్ అడిగితే, గైడ్ తనకేమీ తెలియదంటాడు – రచయిత గురించి. అక్కడి ముసలాయన – ఈ "బొంద నేను తవ్వలేదు" అని చెప్పగానే బైరన్‌కు 'హామ్లెట్'లో సమాధుల గుంటలు తవ్వేవారు గుర్తుకు వస్తారు. అంతే అతనిలో ఆశ్చర్యంతో కూడిన విచారం చోటుచేసుకుంటుంది. "ఎంత కీర్తి అయినా, ఇక్కడికేగా చేరేది" అంటూ ఆ మట్టిదిబ్బ మీద పచ్చగడ్డిలో వెల్లకిలా పడుకుని – అందర్నీ ఆశ్చర్యపరుస్తాడు!

మర్నాడు 25, ఏప్రిల్ డోవర్‌లో – బైరన్ దిగిన హోటల్ బైట చాలా హడావుడి కనపడుతుంది. గొప్పింటి ఆడపడచులు – పనివాళ్లలాగా దుస్తులు వేసుకుని బైరన్‌ను చూడటానికి బైట నిలబడి వుంటారు. హాబ్ హౌస్ ముందుగా బైటకు వస్తాడు. బైరన్ ఏడి? అతను మూర్‌కు వీడ్కోలు రాస్తున్నాడు.

నా బోటు తీరంలో వుంది.

నాకోసం – పిలుపు సముద్రంలో వుంది–

వెళ్లేముందు మూర్ నీకు వీడ్కోలు–

Byron

ఒక నిట్టూర్పు - నీ అభిమానం-

ద్వేషించేవారికి ఒక చిరునవ్వు

నా రాత ఎలా వున్నా-

నా హృదయం పదిలం!

ఇక్కడే ఆపేయాల్సి వస్తుంది.

నౌక కెప్టన్ కేకలు పెడుతున్నాడు. చివరికి హాబ్ హౌస్ భుజం మీద చేయివేసి బైరన్ వస్తున్నాడు. హాబ్ హౌస్‌కు చిన్న పెట్టి ఇస్తాడు. మిస్ ఎల్ఫిన్ స్టోన్‌కు ఇవ్వమంటాడు. అది చక్కని 'వర్జిల్' పుస్తకం. తన హారో రోజుల్లో బహుమతిగా వచ్చింది.

"ఆమెతో చెప్పండి - ఆమెలాంటి స్త్రీని పెళ్లి చేసుకునే అదృష్టవంతుణ్ణి అయితే, ఇప్పుడు ఇలా కాందిశీకునిగా దేశం వదలిపోవలసిన అవసరం వచ్చేది కాదు" అని! రేవులో మోత - గోల ఇవన్నీ అతన్ని నౌకలో చేరవేసాయి. ఒక్కసారి నౌకలో ఎక్కిన తరువాత చాలా విచారంగా కనిపించాడు!

తొమ్మిది గంటలకు నౌక రేవు వదిలింది. హాబ్ హౌస్ - జెట్టీ చివరవరకూ పరుగుపెట్టాడు! అప్పటికే అలలు లేచి పడుతున్నాయి. గాలులు బలంగా వున్నాయి. జెట్టీ చివరికి నౌక కదలిపోతుంటే హాబ్ హౌస్‌కు

"అదిగో నిటారుగా నిలబడి నా ప్రియమిత్రుడు" కనిపిస్తాడు. బైరన్ తన టోపీ తీసి చేయి ఊపాడు. వీడ్కోలు పలుకుతూ-

"దేవుడు అతన్ని రక్షించాలి - సాహసి - మంచివాడు - దయాళువు -" అంటూ హాబ్ హౌస్ కదిలిపోతాడు.

మూడవ భాగం


బ్రతుకు పయనంలో
ఎంతో సమయం
వృథాగా గడిచిపోతుంది–
ఏదీ తిరిగి రాదు –
దేనినీ పొందలేము
కేవలం కళారూపంలో లేదా
అనంతత్వంలో మాత్రమే
జీవితం మిగిలిపోతుంది !


–సాంతాయన



బైరన్ బగ్గీ

డోవర్ రేవులో హోటల్





డోవర్ రేవు

XXVI

పగిలిన హృదయం

(1816)

నెత్తురోడుతున్న గుండె!
మరోసారి ఈ సముద్రం మీద మరోసారి!
అలలు అలలు, గుర్రంమాదిరి
తమ రౌతు గుట్టు తెలిసినట్టు !

ఇప్పటికే కాందిశీకుని బాధ, మరో 'చైల్డ్ హెరాల్డ్'గా రూపొందుతోంది.

తన జీవితంలో నాటకీయ పరిణామాలు అవమానాలు, సామాజిక ద్వేషం, అగస్టాను తప్పుపట్టి వేలెత్తి చూపించేవాళ్లు – మొత్తం ఇంగ్లీషు జాతి శత్రుత్వం, ఇవన్నీ అతని ఆలోచనలలో నిండి వున్నాయి. ఇవన్ని అతని బుర్రలో ఎంత ఉధృతంగా తిరిగాయంటే, ఆ ఘర్షణతో మంటలే లేస్తాయని అనుకున్నాడు. ఇప్పుడు అతని అవసరం ఏమిటి? ఎందుకు? మరో అత్యంత తీవ్రమైన ఆలోచనాపరమైన 'సాంద్ర జీవితా'న్ని సృష్టించుకోవడానికి! ఇది సాధ్యమేనా!

బైరన్! ఏప్రిల్ 1816 – ఇప్పుడు అనామకుడు! ఏమీ కానివాడు!

ప్రతీకారంతో – విచారంతో – సంతోషంగా, ఆశగా, హేతుబద్ధంగా వోల్టేర్‌లాగా క్రూరంగా తీవ్రమైన గాలిలాగా ఉధృతమైన వాయువులాగా ("ఏమిటి నేను! ఏమీ కాను! కానీ నీవు? ఓ మనసా నీవు నా ఆలోచనవు!)

మళ్లీ బైరన్ కావాలంటే, మళ్లీ 'హెరాల్డ్' 'చైల్డ్ హెరాల్డ్' కావాలి – ఈ యాత్రలో మూడవ కాన్‌టో (Canto) రావాలి!

హెరాల్డ్ మళ్లీ కాందిశీకుడై తిరుగుతున్నాడు!

ఎలాంటి ఆశా లేకుండా – కాని ఎందుకు బాధ?

వ్యర్థ జీవితం గడిపిన ఎరుక –

అదే సమాధికి మరో ప్రక్క!

అంతా అయిపోయినట్లే.

అది తెలిసే నవ్వుకుంటున్నాడు!

అతని అంతరంగంలోని ఎడతెగని ఆలోచనలు, సుడులు తిరిగి మరిగిపోతున్నాయి. అతనిలోని కవి – ఈ విచారకరమైన, వేదనామయ భావావేశాన్ని మూసలో పోసి ఒక ఆకారం ప్రదానం చేయాలని తపిస్తున్నాడు. అదే సమయంలో, బైరన్ ఇంగ్లీషు పెద్దమనిషి – చిదానందంగా పోలిదోరితో ఇష్టాగోష్ఠి జరుపుతున్నాడు – నౌక డెక్ మీద కూర్చొని ప్రయాణంలోని పదనిసల గురించి!

బైరన్ – బైరన్‌లాగా మారటానికి ఎక్కువ సమయం తీసుకోలేదు. మొదటి మజిలీ (Ostend) ఆస్టెండ్ చేరగానే తన తండ్రి కెప్టెన్‌లాగానే హోటల్‌లో సేవకురాలి సేవలందుకున్నాడు!

డా॥ పోలిదోరి అన్ని వివరాలు రాస్తూనే వున్నాడు. బెల్జియం – ఆంటెవెర్ప్ – హోటల్‌కి వెళ్లాం – అందరూ పేకాడుతూ – ఆడవాళ్లు అందంగా వున్నారు. ఊరంతా ఫౌంటెన్సు వున్నాయి. వీధుల్లోనే పనికిరాని పుస్తకాలు అమ్ముతున్నారు. పదిమంది గుమిగూడే చోటే ఛండాలపు పనులన్నీ జరుగుతున్నాయి. మగవాళ్లు వాంతులు చేసుకుంటున్నారు" ఇలాంటి వివరాలు రాస్తున్నాడు.

కాని బైరన్‌కి ఇలాంటి పైపై విషయాలపై ఆసక్తి లేదు. అతని జ్ఞాపకాల భావావేశంతో కంటిముందు కనిపించేవి పేలవంగా వుంటాయి.

ఒక్కసారి వాటర్‌లూ చేరగానే అతనిలోని భావుకుడు మేల్కొన్నాడు.

ఇక్కడేనా తన హీరో అలసటతో పడిపోయాడు? ఇక్కడ బ్రస్సెల్స్‌తో యుద్ధపూర్వపు రాత్రి తన స్నేహితులు నిద్రపోయారు? యువకులు, అప్పటివరకు సంతోషంగా వున్న యోధులు, మర్నాడు చనిపోతారు? నెత్తుటిలో తడిసిన ఈ నేలమీదనే లేడీ ఫ్రాన్సిస్, డ్యూక్ వెల్లింగ్‌టన్‌ను ప్రేమతో చూసింది?

ఆ రాత్రి విలాసపు ధ్వనులు వినిపించలేదా? ఆ మర్నాడు తుపాకి పేలుళ్లు – చావు కేకలు!? అయ్యో ఎంత దారుణం!!

ఒక బండి మాట్లాడుకున్నారు – 'వాటర్ లూ' చూసి రావటానికి. దారిలో ఒక చక్రం తిరగకుండా మొండికేసింది! బైరన్ మెల్లగా నడవడం మొదలుపెట్టాడు – డాక్టరు చేయిపట్టుకుని ఎక్కడైనా బొమికలు దొరకుతాయో అని వెతుకుతూ – అతనికి ఒక రైతు బండి గుర్రాన్ని అమ్ముతాడు. దానిమీద తన పరిశోధన సాగిస్తాడు. అప్పటికే పూల మొక్కలు విరుస్తున్నాయి. అక్కడి భూమి అంతా దున్నుతున్నారు.

ఇక్కడ తిరుగుతున్న పిల్లల చేతుల్లో మెరుస్తున్న గుండీలు కనిపించకపోతే – ఇక్కడ యుద్ధం జరిగిన చిహ్నాలే లేవుకదా! అక్కడ వున్న చర్చిలో బైరన్ – పొలిదోరి తమ పేర్లు చెక్కుతారు. బైరన్ యుద్ధం గురించి ఫ్రెంచి వారి ధైర్యసాహసాల గురించి డాక్టరుకు చెప్తాడు.

అక్కడనుంచి ఒంటరిగా దూరంగా వెళ్లి ధ్యానంలో కూర్చుంటాడు.

ఇక్కడ సాధారణంగా కనిపించే ఈ నేలమీద ఒక్కరోజులో మనుషుల జాతకాలు మారిపోయాయి. మానవజాతి తన విధికి బలి అయిపోయింది.

నిజానికి కార్యాచరణ, కీర్తికంటే తక్కువేంకాదు. ఈ ప్రపంచంలో గెలిచినా ఓడినా విలువ ఏముంది?

అసలు తెలివి, ఎప్పుడు తప్పుకోవాలో ఎప్పుడు మౌనంగా వుండాలో ఎప్పుడు ద్వేషించాలో తెలుసుకోవడమే!

నెపోలియన్ ఒక సామ్రాజ్యాన్నే పాదాక్రాంతం చేసుకున్నాడు. అలాగే బైరన్ 'చైల్డ్ హెరాల్డ్' రాశాడు.

జ్వరపీడితునిలా మనుషులు అటూ ఇటూ

తిరుగుతుంటారు – చల్లదనం కోసం –

కాని ఉష్ణం శరీరంలో వుంటుంది కదా!

సాయంత్రానికి యుద్ధభూమి వదిలి తిరిగి వెళ్తుంటారు. బైరన్ పెద్దగా టర్కీ పాట పాడుతుంటాడు.

ఫ్రాన్స్‌లో ప్రవేశించటానికి వీలు లేదుకదా. అందుకని దక్షిణంగా ప్రయాణం చేసి మూజ్ (Mause) రైన్ (Rhine) లోయల గుండా స్విట్జర్లాండు చేరతారు.

బైరన్ ప్రయాణం చేసే రాచరికపు గుర్రపు బగ్గీ బిచ్చగాళ్లను బాగా ఆకర్షించేది.

వాళ్లు 'జెనరల్' అని "కింగ్ హానోవర్" అని కేకలు పెట్టి పిలిచేవారు. ఇవి బైరన్‌కు చాలా బాగా నచ్చేవి. అలాగే డా॥ పొలిదోరిని ఆనందపరచేవి. "నేను బైరన్‌తో సమానంగా వున్నాను" అనుకునేవాడు.

ఒకరోజు బైరన్‌ను అడుగుతాడు, 'మీకు – నాకు ఏమిటి భేదం?' అని. "నాకంటే మీరు దేనిలో గొప్ప" అని అడుగుతాడు.

నేను మూడు విషయాలలో నీవు చేయలేనివి బాగా చేయగలను. ఒకటి అదిగో ఆ నది ఈదగలను – ఆ కొవ్వొత్తిని ఇరవయి అడుగుల దూరం నుంచి ఊది ఆర్పగలను. నేను రాసిన పద్యకావ్యం ఒక్కరోజులో 14 వేల కాపీలు అమ్ముడుపోయాయి" అంటాడు.

వీరు ఎక్కడికి వెళ్లినా నెపోలియన్ చిహ్నాలు ప్రస్ఫుటంగా కనపడుతున్నాయి.

ఈ స్మారక భవనం – ఈ మార్గం – ఈ కాలువ ఇవన్నీ నెపోలియన్ గుర్తులు అంటారు.

ఇది బైరన్‌ను ఎంతో సంతోషపరుస్తుంది. ఎప్పుడూ నెపోలియన్‌తో పోలిక ఇష్టపడే బైరన్ "N.B." అని అన్నిచోట్లా ఉండటంలో అది "Noel బైరన్" అని అనుకుంటాడు!

కొండ కోనల్లో – కోటలు – పర్వత సానువుల్లో ద్రాక్షతోటలు – ఇవన్నీ చైతన్యంతో వెలుగుతున్న పరిసరాలు. అగస్టాను గుర్తుకు తెస్తాయి. ఇప్పుడు అతని మార్మిక ప్రపంచంలో అగస్టా ఒక్కటే మిగిలింది. తన 'దురదృష్టంలో – ఆసరా'గా!

ఆమె కోసం కవిత రాస్తాడు.

అదిగో డాబిన్ ఫెల్స్ కోట–

అది – రైన్ నదిపై కోపంతో చూస్తోంది.

అదే దృశ్యాన్ని ప్రపంచంలో ఎవ్వరూ చెప్పలేని విధంగా వర్ణిస్తాడు.

అదే దృశ్యం–

నీవు ప్రక్కనుంటే – మరింత అందంగా వుంటుంది!

ఈ భూమి మీద – నాకు ప్రియమైనది–

ఎక్కడుంది?

నీ కళ్లు – నా చూపుని అనుసరించక పోతే–

అప్పుడు ఈ నదీ తీరం మరింత మధురంగా వుంటుంది...

ఈ కవితతోపాటు కొన్ని పూలు ఎండబెట్టి ఆమెకు

పంపిస్తాడు – కాని ఆమె అతనికి ఎంతో దూరంగా వుండిపోయింది!

అక్కడనుంచి Morat - యుద్ధభూమి దాటారు. అక్కడే స్విస్ సిపాయిలు

Duke Charles Burgundy ని ఓడించారు. అక్కడ దొరికిన బొమికలు కొన్ని కొంటాడు. ఘనత, కీర్తి చేరే చివరి మజిలీ ఇదే కదా! బైరన్ ఎప్పుడూ కీర్తి – పతనాన్ని ఆరాధించేవాడు కదా. చివరికి మే 25, 1816. లేక్ జెనీవా ప్రక్కనే Dejean's హోటల్‌లో దిగుతాడు. అది సెచిరాన్‌లో వుంటుంది.

అక్కడి రిజిష్టర్‌లో – తన వయస్సు – 100 అని రాస్తాడు!

అంతకు కొద్దిరోజులు ముందు అదే హోటల్, క్లెయిర్ క్లేర్‌మాంట్‌కి – ఆహ్వానం పలుకుతుంది. ఆమెతోపాటు ఆమె మారుటి అక్క మేరీ గాడ్విన్ – ఆమె ప్రియుడు పెర్సీబీష్ షెల్లీ కూడా వుంటారు.



క్లేర్

అప్పటివరకు బైరన్, షెల్లీని కలవనేలేదు. కాని అతని కవితలు చదివాడు. ముఖ్యంగా 'క్వీన్‌మాబ్'.

క్లేర్ – వీరిద్దరినీ పరిచయం చేసింది "షెల్లీ – అందగాడు – సిగ్గరి – 21 సం॥రాలే. బక్కగా వున్నాడు. భార్య నుంచి విడిపోయాడు. ఇప్పుడు గాడ్విన్ కూతుళ్లతో వుంటున్నాడు. ఒకరు బైరన్ కోసం!" ఇదీ పోలిదోరి రాసుకున్నాడు.

షెల్లీ, బైరన్ చాలా తొందరగా కలిసిపోతారు.

ఇద్దరూ – ఆలోచనాపరులే. ఇద్దరికీ స్వేచ్ఛాప్రియత్వం ఉంది! సామాన్య ప్రజలపట్ల ప్రేమ! వాటర్లూ యుద్ధం మూలంగా విద్వేష రాజకీయాలు పెరుగుతాయని భావిస్తారు. ఇద్దరూ భావనాపటిమ కలవారే!

ఇద్దరు సాధారణ జీవితం అంటే ఇష్టపడేవారు. అప్పటికే షెల్లీ ఒక చిన్న పడవ అద్దెకు తీసుకుంటాడు. దానిలో జెనీవా సరస్సులో రోజూ నలుగురూ తిరుగుతుంటారు. వీరితో పాలిదోరి కూడా కలుస్తుంటాడు.

అప్పుడు తన మానసిక స్థితి – అశాంతి, విచారగ్రస్తమై ఉంది. దానిలో నుంచి ఈ సరస్సు పరిసరాల ప్రశాంత వాతావరణం – పర్వతాల నీడలు – రాత్రి కనిపించే తొలి తారకలు – ఇవన్నీ ఎంతో మనోజ్ఞంగా వుంటాయి. అలాంటి ఒక సాయంత్రం వీరు పడవ ప్రయాణంలో వుండగా గాలులు ఉధృతంగా వస్తాయి. సరస్సులోని అలలు ప్రమాదకరంగా ఎగసిపడుతుంటాయి. దానితో బైరన్‌లో చైతన్యం వెల్లివిరిస్తుంది. చూడండి – వినండి నేను అల్బేనియా పాట పాడతాను. అని చేతులు పైకెత్తి ఒక పెద్ద కేక పెడతాడు. అంతే అందరూ నిర్ఘాంతపోతారు! అతనికి కావల్సింది అదే–

అప్పటి నుంచి ఆడవాళ్ళిద్దరూ అతని 'అల్బా' అని పిలుస్తారు. ఆ పేరే స్థిరపడిపోతుంది! ఒక్కోసారి పడవ గట్టుకు చేరగానే, షెల్లీ దూకి కొండల్లోకి వెళ్లిపోయేవాడు. వేగంగా అతనితో పాటే మేరీ, క్లెయిర్ కూడా – బైరన్ మెల్లగా కుంటుకుంటూ కథ్రసాయంతో తనలో తను ఓ కవిత పాడుకుంటూ వుండిపోయేవాడు.

రెండు వారాల తరువాత షెల్లీ సరస్సుకు అవతలి ప్రక్కన ఒక రైతు ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. బైరన్ ఆ పైన కొండచరియలో 'విల్లా దయోడటి' రెండంతస్థుల భవనం తీసుకుని తన అంతస్థుకు తగినట్లే ఇంటి సామాను పెట్టించాడు. అక్కడ నుంచి చూస్తే జెనీవాసరసు – ఆకాశపు రంగులో తీరమంతా రంగులపూలతో చాలా అందంగా కనిపించేది. అవతలి తీరానే జెనీవా నగరం – జూరా పట్నం వుండేవి.

ఈ పురాతన పల్లెటూరి బంగళా బైరన్‌కు బాగా నచ్చింది. తన న్యూస్టెడ్ అలవాట్లు త్వరాగానే మొదలుపెట్టాడు. ఆలస్యంగా నిద్రలేవటం – అల్పాహారం తరువాత షెల్లీని చూడటం, అక్కడ నుంచి సరసులో పడవ విహారం – సాయంత్రం అయిదు గంటలకే రాత్రి భోజనం ఒంటరిగా పూర్తి చేయటం, మళ్లీ బోటులో షెల్లీతో నీటిలో పడవలో గడపటం, ఆకాశంలోని చుక్కలు నీటిలో పడుతుంటే పరవశించి పాడుకోవటం, వాతావరణం అనుకూలంగా లేకపోతే తన మేడలో షెల్లీతో రాత్రంతా చర్చల్లో గడపటం ఇదీ వారి దిన, రాత్రి చర్యలు.

మేరీ తన జీవితాంతం గుర్తుపెట్టుకున్న విషయం, బైరన్ తన మధురమైన గంభీరమైన గొంతుతో మాట్లాడటం – షెల్లీ తన ఉత్సాహంతో సన్నటి స్పష్టమైన మాటల్తో సమాధానం చెప్పటం! మేరీ కళ్లు మూసుకుని ఈ సంభాషణను తనివితీరా వినటం – ఇదీ ఆమె జీవితాంతం గుర్తుకు తెచ్చుకొని ఆనందించిన మహత్తర సన్నివేశం – ఈ మేధావి కవులు – ఎన్నో గ్రంథాలు, మరెన్నో విషయాలు, కవితలు, వాద సంవాదాలు రాత్రంతా జరుపుతూనే వుండేవారు.

మొదటగా బైరన్ – షెల్లీని ఉన్నతంగా, అనుమానంగా అంచనా వేశాడు. ఎందుకంటే ఎదుటివారిలో నైతిక విలువలను చూశేవాడు. అందులో క్లెయిర్ అంటే అతనికి ప్రేమా – గౌరవం లేదు – అలాంటి క్లెయిర్ స్నేహితుడయిన షెల్లీని అనుమానంగానే చూశాడు. కాని అతని నిశితమైన పరిశీలనతో షెల్లీ మేథోపరమైన ఔన్నత్యాన్ని త్వరలోనే దర్శించాడు. తన స్నేహితులు హాబ్ హౌస్ – మాథ్యూస్‌కంటే చాలా సజీవంగా కనిపించాడు. తను చిన్నతనం నుంచే ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతూనే వున్నాడు.

ఈ విశ్వాంతరాళం ఏమిటి? మనం ఎక్కడ నుంచి వచ్చాం? దేవుడు ఈ సృష్టికి కారణమా? ఇలా ఎన్నో..

వీటన్నిటికీ షెల్లీ తన స్పష్టమైన గొంతుతో సమాధానాలు చాలా తెలివిగా చెప్పేవాడు.

బైరన్, దేవుడు – డెవిల్ గురించి అడిగితే, షెల్లీ తన హేతువాద దృష్టితో వీటన్నిటిని మానవుడే తన స్వార్థం, భయంతో సృష్టించుకున్నాడు.

"నీవు స్వచ్ఛంగా వుంటే అన్నీ స్వచ్ఛంగా వుంటాయి" అంటాడు.

జోవ్ – ద్వేషానికి మూలం అదే ప్రొమిథియస్ హృదయంలో ప్రతిష్టించాడు. సాటన్ దుష్టుల గుండెల్లో వుంటాడు.

ప్రపంచంలో క్రూరత్వం దుష్టత్వం వున్నాయి. కాని అది ప్రకృతిలో లేదు. అవి మొలకెత్తింది స్వార్థపరులైన సమాజ సంఘటనలో కృత్రిమమైన సంప్రదాయమనే

వికృతిలో – ఇదీ మనుషుల స్వార్థపర సమాజంలో నుంచే ప్రాణం పోసుకుంది. అవన్నీ పెళ్లి, సైనికులు, న్యాయాధిపతులు రాజులు ఈ రూపంలో వ్యక్తీకరించబడుతుంది!

ఈ ప్రకృతిలో కనిపించేది సౌందర్యమే! అది ప్రకృతిలోని సామరస్యం, పొందికలో ఉంది. అవి దర్శనమిచ్చేది, చల్లని సాయంత్రాలలో, ప్రశాంతమైన సరసులో, పక్షుల కిలకిలరావంలో, నక్షత్రాలలో, ఆడవారి వాలుకన్నుల్లో...

ఈ ప్రేమ సిద్ధాంతాన్ని విని బైరన్ ఆశ్చర్యపోయాడు. తనవంతుగా ఇదంతా విధిప్రకారం మనిషి తలరాత ప్రకారం జరుగుతాయి.

కాదు – షెల్లీ అనుకున్నట్లే ఇది అంత తేలిక విషయం కాదు. ప్రపంచంలో చెడుకు కారణం – మనిషి మనసులోని కల్మషమే – మనిషిలోని సంఘర్షణే – అదే పాపం – పాపమే దుర్మార్గం – బైరన్‌కు ఈ సంఘర్షణ తెలుసు. ఎంతమంది స్త్రీల పతనానికి తను కారణం కాలేదు? కొంతమందిని ప్రేమించినా కొంతమందిని గౌరవించినా–

తనకు తనవంతుగా తెలుసు. మనుషుల సంక్లిష్టత తనలోని సంఘర్షణకే సమాధానం దొరకలేదు. అది తన దుఃఖానికి దారితీయడం లేదా?

అయితే షెల్లీకి – తన కడిగిన ముత్యంలాంటి హృదయంతో ఆడవారి గురించి మగవారి గురించి తెలీదు. అతనిది హ్రస్వదృష్టే! తనమీద తనకు అంత కఠినమైన భావన లేదు. ఆకర్షణకు లోనవుతాడు. అదే విలువ సౌందర్యారాధన అనుకుంటాడు.

బైరన్ తన తప్పిదాలు పూర్తిగా అవగాహన వున్నవాడు. వాటిని సిద్ధాంతాలతో వాదనలతో పై పూత పూయలేదు!

అతనికి మనిషి దుర్మార్గుడని తెలుసు. రాజకీయంగా షెల్లీతో ఏకీభవిస్తాడు. కాని తమ కష్టాలకు అస్పష్టమైన పదాలున్నాయని అంగీకరించాడు.

అతను కోరేది చైతన్యం – అదీ హీరోలాగా స్పష్టమైన ఫలితంతో – అదీ తెలిసిన కనిపించే ప్రజలకోసం! అతనికి ఈ సమాజ నిర్మాణమంటే

భయాందోళనలు సామాన్యమైనవి కాదు. అది షెల్లీకి తెలిసింది కాదు. షెల్లీ స్పష్టత అంతా మంచే కనపడుతుంది. మంచిగా వుండాలి – అతను అసహ్యంలో కూడా తన ఊహాజనితమైన ప్రపంచంలో వుండిపోగలడు. అతనికి రక్తమాంసాల ప్రపంచంతో పరిచయం లేదు.

బైరన్ – యదార్థవాది – తను జయించాలని ఆశించిన సమాజం నుంచి ఇప్పుడు పలాయనం చేస్తున్నాడు, పారిపోతున్నాడు.

నేను ఈ ప్రపంచాన్ని ప్రేమించలేదు. అదీ నన్ను ప్రేమించలేదు.

షెల్లీకి జీవితం సామాన్యమైన సాధారణమైన సమస్య. అది మంచీ చెడుల మధ్య సంఘర్షణ, అదీ ఆంతరికమే – ఈ ప్రపంచానికి అతను ఎప్పుడూ దూరమే! అతనిలో ద్వంద్వీకరణ లేదు. అతనికి ఒక్క షెల్లీ తెలుసు – అతను ఒక్కడే.

కాని బైరన్‌లో ఎందరో బైరన్‌లు వున్నారు. అతని సంఘర్షణే వ్యక్తిత్వ సంబంధి. మానసికమే కాదు, తన వ్యక్తీకరణే పెద్ద యుద్ధం!

ఒకరు ప్రేమమూర్తి అయితే మరొకరు రాక్షస ప్రవృత్తికలవాడు. ఒకరు మార్దవమూర్తి అయితే, మరొకరు గర్విష్టి! ఒకరు సనాతనుడైతే మరొకరు విప్లవకారుడు. ఒకరు కరుణామూర్తి అయితే మరొకరు క్రూరుడు.

తన విధివ్రాతకు తనను ఇన్ని సుడిగుండాలలో తిప్పిన తలరాతకు తనే కారణమెట్లా అవుతాడు? ఎక్కడో తనకు తెలియని శక్తి వుండేవుండాలి.

షెల్లీ నమ్మినట్లు, మనిషే అన్ని శక్తులు కలవాడని అనుకోలేదు. మళ్లీ ఈ ప్రపంచాన్ని సృష్టించగల శక్తి మనిషికే వుందని విశ్వసించలేదు. అతని నమ్మకం తనను ఏదో తెలియని శక్తి, తనలోని దివ్య–దానవ గుణాలను రెంటినీ పెనవేసి వుంచాయని గాఢంగా నమ్ముతున్నాడు.

బైరన్ సృష్టికర్తను నమ్ముతాడు. కాని అతను సృష్టించినది మంచిది కాదు.

బైబిల్‌లో కేన్ – దేవుడిపై ఫిర్యాదు చేసినట్లు ప్రొమితియాస్ – జోవ్‌ను శంకించినట్లు – జార్జి గోర్డాన్ బైరన్ – ఇప్పుడు అమాయకుడైన బాధితుడు!

దేనికి? తన వారసత్వపు గుణాలకు తన వారసత్వపు గోర్డాన్ల తరతరాల రక్తంలోని తిరుగుబాటు లక్షణాలకు! రాక్షస లక్షణాలకు!

ఈ విధంగా వారిద్దరూ పరస్పరం సమాధానం చెప్పుకోవటానికి ప్రయత్నించారు, బైరన్ – షెల్లీ!

బైరన్ – షెల్లీ వ్యక్తిత్వంలోని ఔన్నత్యాన్ని గుర్తించి కూడా ఒక్కోసారి అతని లౌకిక విషయాలపట్ల అవగాహనలేమి గ్రహించి ఇబ్బంది పడేవాడు.

షెల్లీ – మేరీతో చెప్పేవాడు. బైరన్ రాచరికపు వాసనల జీవనశైలి వదలలేకపోతున్నాడని!

కాని ఇద్దరూ ఎంతగా అతుక్కుపోయారంటే, వీరిని చూసి డా॥ పోలిదోరి అసూయపడటం మొదలుపెట్టాడు. అది చూసి ఓర్వలేక తనతో ద్వంద్వ యుద్ధానికి రమ్మనేంతగా అసూయపడ్డాడు. పోలిదోరి ప్రతి సంభాషణ చెడగొట్టేవాడు. అక్కడి స్థానికులతో పేచీపడేవాడు.

బైరన్ – "నా జీవితంలో ఎక్కువ సమయం – నా డాక్టరు బాగోగులు చూడటానికే గడిచిపోయింది" అంటాడు.

ఒక సాయంత్రం షెల్లీ – బైరన్ సరస్సులో షికారు బయలుదేరారు. అదృష్టవశాత్తు పోలిదోరీని ఒడ్డునే వదిలి! కొంత దూరం వెళ్లిన తరువాత వాతావరణం మారిపోయింది. మబ్బులు కమ్మి గాలులు వీచటం మొదలయ్యింది. అలలు లేచి పడవ కదిలిపోతోంది. అప్పటికే బైరన్ తన బట్టలు వదిలి సరస్సులో దూకటానికి సిద్ధమయ్యాడు – షెల్లీని కూడా రక్షిస్తానంటాడు – షెల్లీకి ఈత రాదు. షెల్లీ నవ్వి "వద్దు – నేను ఇక్కడే కూర్చుంటాను. నీటిలో మునిగిపోవటానికి సిద్ధమే – పెనుగులాట కూడా వుండదు" అంటాడు.

ఇద్దరూ కలిసి రూసో తిరిగిన ప్రదేశాలు తిరిగారు. తమ వ్యక్తిత్వాలలోని వ్యత్యాసాలు బాగా ఎరిగినవాళ్లు హాయిగా కలిసిపోయారు.

షెల్లీ కోడి కూసినపుడే నిద్రలేచి, కొండల్లోకి వెళ్లిపోయేవాడు. అడవులన్నీ తిరిగి పరుగులు పెట్టేవాడు.

బైరన్ ఆలస్యంగా నిద్రలేచేవాడు. అతనికి నడక అంత ఇష్టం ఉండేది కాదు, తన అవిటితనంతో!

ఇద్దరూ కలసి Nouvelle Heloise మళ్లీ మళ్లీ చదివేవారు. అందులో వర్ణించిన స్థలాలలో కూర్చొని అలాంటి వాతావరణంలో మమేకమై ఆనందించేవారు.

Castle of Chillon - ఎంతటి భయంకరమైన స్మారక భవనం?! ఇంతటి దుర్మార్గపు కార్యం మనిషిని హింసించి ఆనందించే జాతి – ఎంతటి నిరంకుశం ఇది". అని ఆశ్చర్యపోతాడు షెల్లీ.

బోనివార్డ్ డంజన్‌లో – బైరన్ తన పేరు చెక్కుతాడు – ఇక్కడే పాలకుల కర్కశత్వంలో చితికిపోయిన బాధితుని గురించి వింటారు.

ఒక్క రాత్రిలో ఒకే బైరన్ The prisoner of Chillon రాస్తాడు.

షెల్లీ Hymn to Intellecutal Beauty పద్యాలు కూరుస్తాడు.

ఈ సమయంలోనే బైరన్ తన 'చైల్డ్ హెరాల్డ్'కు ఎన్నో స్టాంజాలు కలుపుతాడు. అవి 'రూసో' గురించి క్లారెన్సు – గురించి–

క్లారెన్సు – ప్రేమ పుట్టిల్లు!
అక్కడి పల్చని గాలి – యౌవనోద్రేకం–
అక్కడి చెట్లు ప్రేమలో పెరుగుతాయి
పైన మంచు–
పై మంచు కొండలు తన భావాలకు రంగులద్దుతున్నాయి–
వాలిపోతున్న పొద్దు – మంచుకు గులాబిరంగు పూతపూస్తోంది
సాగుతున్న కిరణాలు రాళ్ళలో నిద్రపోతాయి

అదే ప్రేమకు పంజరం-
ప్రపంచం నుంచి రక్ష.

మర్త్యులు ప్రమాదకరమైన దారులవెంట
కీర్తి కోసం పరుగుల పెడతారు-
గొప్ప ఆశయంతో - గురుతర బాధ్యతతో-
వారి ఆలోచనలే పిడుగులు కురిపిస్తాయి.
స్వర్గం నుంచి అగ్ని పుట్టిస్తుంది - అదే అతనికి ప్రతిఫలం!

గిబ్బన్ వనంలో బైరన్ కసివింద కొమ్మ విరిచి దానికింద నిలబడతాడు. ఇది Mont Blanc తన చివరి వాక్యం తన 'చరిత్ర' గురించి చివరి వాక్యం రాసిన తరువాత అలాగే నిలబడతాడు!

షెల్లీ ఆ విధంగా చేయటానికి నిరాకరిస్తాడు. ఎందుకు? రూసో - అంత గొప్ప 'పేరు'ను అనుకరించటం ఇష్టంలేక!

ఈ సమయంలో బైరన్‌పై, షెల్లీ ప్రభావం చెప్పుకోదగిందిగా కలుగుతుంది. షెల్లీ, బైరన్‌కు వర్డ్స్‌వర్త్ పద్యాలు మెల్లగా రుచిచూపిస్తాడు. అప్పటి వరకూ బైరన్ ఆ కవిని చదవటానికి నిరాకరించిన వాడు - షెల్లీ ప్రభావంతో అతనిలోని రమణీయకోణాన్ని గుర్తిస్తాడు.

ఈ సరస్సు - ఈ పర్వతాలు ఈ పరిసరాలు షెల్లీ సాన్నిధ్యం - బైరన్‌కు వర్డ్స్‌వర్త్ కవిత్వంలోని సౌందర్యాన్ని ఆస్వాదింపచేస్తుంది.

షెల్లీ చెప్పే ప్రేమ సిద్ధాంతాన్ని ఇందులోనే గుర్తిస్తాడు. ఇలాంటి ప్రభావంతోనే తన కవితల్లో తొంగి చూస్తున్న కొత్త కోణాన్ని గమనిస్తాడు.

'The Vanity of Vanities' ముఖ్యంగా బైరన్ కవిత్వంలో కనిపించే Basso - profondo లక్షణం - ఇప్పుడు కొంత మార్దవ పార్శ్వంతో తారసపడుతోంది!

ప్రశాంతమైన నీటిసరసు – అద్భుతమైన మంచు పర్వతాలు – ఇంకా సుందరమైన పర్వత సానువుల్లోని అడవులు – ఇవన్నీ హెరాల్డ్ అదే బైరన్‌కు చివరికి 'శాంతి' ప్రశాంత చిత్తం – లభించిందని భావిస్తాడు.

ఏకాంతం – ప్రకృతి బహుశా వీటిలోనే తను వెదికే ఆనందం ఉంటుందేమో – ఇప్పటివరకూ తనకు చిక్కనిది! తను వెదికేది ఇదేనేమో?!

అరె – ఈ పర్వతాలు, ఈ అలలు
ఈ నీలాకాశం నాలో భాగం కాదా?
ఇవన్ని నా మనసులో లేవా?

"...........
నాలో నేను ఎలా వుంటాను?
నా చుట్టూ వున్న దాంట్లో భాగమే నేను.
.....ఈ పర్వతాలు – నాకు ఒక భావన...
నగరవాసుల శబ్దాలు – నాకు హింస!
ప్రకృతిలో ద్వేషించటానికి ఏమీ కనిపించదు–
కేవలం మన రక్తమాంసాల శృంఖలం తప్ప–
"..... ప్రాణులన్నింటిలో ఉత్తమం అంటామే–
మన ఆత్మ ఎగిరిపోగలదని–
ఈ ఆకాశంలో – ఈ సముద్రంలో – ఈ పచ్చికలో
ఈ నక్షత్రంలో ఎందుకు కలిసిపోదు?..."

"....
ఈ కొండలు – కోనలు – ఆకాశం,
ఈ సముద్రం – అలలు – ఇవన్నీ నేను కాదా?
నా ఆత్మలో భాగం కాదా?...."

ఈ పద్య నిర్మాణం బైరన్‌దే. స్పష్టంగా నిర్మలంగా కనిపిస్తుంది. కాని వర్డ్స్‌వర్త్ – శైలి, మెల్లగా ప్రవహించే సెలయేరుని పోలి వుండకపోయినా ఇది దీనిలోని సారం అంతా ఆ కవి మానసికంగా దర్శించిందే – అదే ప్రపంచం!! బైరన్ గుండె లోతుల్లో మార్మోగేది ఆ సన్నటి స్పష్టమైన గొంతు! బైరన్, ఒకోసారి, ప్రత్యేకంగా ఒక్క సాయంత్రం చుక్కలతో నిండిన సరసు నీటిలోకి చూస్తూ అందులో పర్వతాల నీడల్ని పోల్చుకుంటూ – అనంతాకాశం క్రింద ఈ నేల, నీటి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ తన గుండెలోలోతుల్లోని మార్మోగే ధ్వనుల్ని వినగలుగుతున్నాడు. కాని బైరన్ ఎరుకతో ఇలాంటి ఆలోచనలు కేవలం తాత్కాలికమే. తన అస్తిత్వాన్ని ఎలా మరిచిపోతాడు? ఈ అనంత సౌందర్యంలో తనను తను ఎలా పోగొట్టుకోకలడు? అరె, అలాంటి విషయం తనలాంటి గర్వాధికారికి సాధ్యమేనా?

ఈ ప్రయాణంలోని కొత్త పరిచయాలు, క్రొత్త పరిసరాలు అతని దుఃఖాన్ని విషాదాన్ని కొంత మరిపింపజేసినా, ఈ డయోడోటి భవనంలో అతను కుదురుకున్న తరువాత తనలోని దుష్టశక్తులను మళ్లీ వెలికితేగలుగుతాడు.

నిజానికి జీవితం చాలా సాధారణమైనది! జీవితమా? ఏమిటది? ఈ పచ్చిగడ్డి పర్వతాలు ఈ ప్రశాంతమైన సరస్సు? ఇక్కడికి పికడిల్లీ టెర్రెస్ పడకగది ఎంతదూరం? కింద తిరిగే అప్పులవాళ్లు, మందుల సీసాలు, ఖాళీ బ్రాందీ సీసాలు – *కనిపించనివి చనిపోయినట్లే!*

అవన్నీ వెలిసిపోతున్న నీడలు – జ్ఞాపకాల మరుగున పడుతున్న జ్ఞాపకాలు చనిపోతున్న చిహ్నాలు! కానీ – చనిపోయినవారిలాగానే కనిపించనివారూ మనల్ని వెన్నాడుతారు. వారి జ్ఞాపకాలతో మనల్ని ముంచెత్తుతారు. మేరీఆన్, అగస్టా – అనబెల్లా వారంతా తన Corsair రోజుల్లో మాదిరి. ఈ ఆలోచనలు ప్రతివిషయంలో ప్రసరిస్తున్నాయి. అవును అన్ని చీల్చుకుంటూ పోతున్నాయి!

తను చేసిన తప్పులు – ఘోరమైన తప్పిదాలు – అయినా తనకు అపరాధభావనే లేదు. తన యౌవన చైతన్యం – గొప్పది! మానవ ప్రకృతిలోని

వికృతి, తనని రాక్షసుణ్ణి చేసింది? అరె – ఈ నైతిక విలువలు ఎంత వృథా అయినవి? తనకు విధి చేసిన అన్యాయం – అకృత్యం తనను ఎంతగా రెచ్చగొట్టి వదిలింది! మళ్లీ నిద్రలేస్తున్న తన మానసిక దౌర్బల్యంతో తను వదిలి వచ్చిన దారులలో దారాలన్ని మళ్లీ పేనుకుంటున్నాడు – తన ఆన్‌స్లే – ఈ ప్రేమ – తన తొలిప్రేమ మళ్లీ చిగురింపజేసి The Dream అని కవిత రాస్తాడు!

"కొండ మీద చెట్లు కిరీటంలాగా
మనిషి నాటినవే – ప్రకృతి సిద్ధం కాదు–
ఆ యిద్దరూ అక్కడే – ఒకరు కన్య – అతను యువకుడు,
కిందికి చూస్తూ ఆమె!– అతను! ఆమెను చూస్తూ
ఒకరు అందంగా దిగంతంలో చందమామ!
కన్య – యువతి కాబోతోంది – యౌవనం అంచున!
కుర్రవానికి మరిన్ని వేసవులు, వసంతాలు కావాలి!......."

అరె – ఇది నిజంగా ఆశ్చర్యం – అంత చిన్ని సాహసం – అతన్ని వెంటాడుతోంది – తరువాత అగస్టా గురించి:

"......పతనమైన గతం నుంచి–
ఇప్పుడు ఎలా పిలవాలి?
నేను కోరుకున్నది – నాకు ప్రియమైనది–
ఎడారిలో ఒయాసిస్సు ఒకటుంది–
విశాలమైన శూన్యంలో ఓ కోయిలపాట
ఇప్పుడే నీవు నాతో వుంటావు...."

అగస్టాకు ఏమి జరుగుతోంది – ఇక్కడికి ఎంత దూరంలో వుండిపోతుంది. అతనికి తెలియని స్థితి! తన భవనం కిటికీలో నుంచి చూస్తుంటే నీటి తళతళలు తనకి న్యూస్టెడ్ సరసు గుర్తుకు వస్తుంది. అగస్టాతో ఎంతగా ఆనందించాడు!

ఆమెకు ఎన్నో ఉత్తరాలు రాస్తాడు – "ఇది తేలికగా తీసుకోకు – నిన్ను నీవు నిందించుకోకు – నీవు ఎవరినైనా నిందించ తలిస్తే – అది నన్నే – కాని ఆ పనీ చేయకు – అది నన్ను చంపివేస్తుంది. మనిద్దరి ప్రేమ – ఒకరినొకరు

ప్రేమతో చూసుకోగల జీవులం మనమే ఈ ప్రపంచంలో. "అరె – ఎంత మూర్ఖుణ్ణి! పెళ్లి చేసుకున్నాను! ఈ విషయంలో నీవు కూడా తెలివిగా ప్రవర్తించలేదు సుమా. మన ప్రేమ అలాగే మిగిలిపోయేది. మన సంతోషం అలాగే సాగిపోయేది. బ్రహ్మచారులకు సేవకురాళ్లలాగా మీలాంటి స్త్రీ ఎక్కడ దొరుకుతుంది నాకు? నీకూ నాలాంటివాడు (ఇది చెప్పటం దండగే)?

మన జీవితాలు అలా సాగిపోతే ఎంత బాగుండేది! ఇప్పుడు చూడు – నన్ను ప్రేమించే ఏకైక వ్యక్తి దూరమై – పరిస్థితుల ప్రభావంతో – మిగిలిపోయాను! నీవు సన్యాసినివి అయినా, నేను సన్యాసి అయినా మనిద్దరి మధ్యలో ఇనుపతెర వున్నా కనీసం మాట్లాడుకునేవాళ్లం కదా! ఫర్వాలేదులే – నా మాట, నా మనసు నీదేలే" ఇలా రాస్తాడు!

అగస్టా ఎలాంటి సమాధానం రాయలేదు. ఆమె అస్పష్టమైన నిస్సారమైన వుత్తరాలు – ఆమె అనబెల్లాను ఎక్కువగా కలుస్తున్నట్లు ఆమె ఎంతో దయతో తనని చూస్తున్నట్లు తెలియజేస్తుంది. ఏమిటీ లేడీ బైరన్ దయతో చూస్తోందా? ఇది అతన్ని ఆశ్చర్యపరుస్తుంది!

అనబెల్లా మనసులో దయవుందా! తనతో ఎంత నిర్దయగా వ్యవహరించింది? ఆమె నైతికతే ఆమె నిర్దయకు హేతువా?

అనబెల్లా అతని హృదయాన్ని పగలగొట్టింది – ఒకప్పుడు తన హృదయం రాయిలాంటిదని గొప్పలు చెప్పుకున్నాడు – కాని ఇప్పుడు దానినే ఏనుగు కాళ్లతో ఛిద్రం చేసిందే! అవును, లేడీ బైరన్‌కు తనను దండించే అర్హత వుంది. కాని ఆమె తన భార్యకదా – తనను భర్తగా స్వీకరించింది కదా. అంగీకరించింది కదా – మంచికీ చెడుకూ! దేవుడు, ఆమెను తనను దెబ్బ తీయటానికి ఉపయోగించాడని అనుకోడు. ఏదో ఒక రోజు విధి తనమీద కక్ష తీర్చుకుంటుంది! దేవుడే శత్రువైతే! పురాతన దేవుళ్లంటే అతనికి గౌరవం ఏమీ లేదు. కాని శనిదేవతను ఎక్కువ గౌరవిస్తాడు! ఏదో ఒకరోజు ఆమె ప్రవర్తన ఆమెకే కీడు చేస్తుంది – అది నా ద్వారా కాదు – నేను ఆమె మీద కక్షసాధింపు

ఆలోచనలలో లేను. కాని ఆమె తప్పక కష్టాలపాలవుతుంది అని అనుకునేవాడు.

ఆమె జబ్బుపడిందని తెలిసి ఆమెకు రాస్తాడు.

"నీవు జబ్బుపడ్డావా? అయినా నీతో నేను లేను,
నీవు జబ్బు పడ్డావు! నీ దగ్గర నేను లేను–
నేను లేనిచోట – ఆరోగ్యం, ఆనందం వుంటాయనుకున్నా –
నాతో బాధా దుఃఖం మిగిలిపోతాయి!

"......నా పాపాలన్నింటికీ నీవే బాధితురాలివి–
ఈ శూన్యవేదనకు నిష్కృతి లేదు–
లోతైన శాపానికి నీవు దిగిపోతున్నావు–
నా బాధలో నీ అస్తిత్వం ముడిపడి
చేదు ఫలాలనే పండిస్తోంది...."

అతనికి దగ్గర్లో పరిచయమైన మేడమ్ స్టీల్ చిన్న పాలెస్‌లో వుంటోంది. దాని పేరు కోపెట్! చాలా రమణీయంగా ఎర్రని ఇటుకలతో ముందు వెనకా తోటలతో చిన్న నీటి యంత్రంతో చాలా రమణీయంగా వుంటుంది అక్కడికి ఇంగ్లీషు అతిథులు వస్తారు. వారికి బైరన్‌ను చూస్తే ఒక రకమైన జుగుప్స!

మేడమ్ స్టీల్ అంటుంది – "బైరన్, మీరు చాలా తప్పుచేశారు. ప్రపంచం మీద యుద్ధం ప్రకటించి చాలా పెద్ద తప్పు చేశారు. అది అసంభవం – మీరు గెలవలేరు. మీరు ఒంటరి, ప్రపంచం మొత్తం, అది చాలా శక్తిగలది. ఒకప్పుడు నేనూ అలాంటిది ప్రయత్నించాను. కాని అసంభవం!" అంది.

ఆమె సరిగానే సత్యమే చెప్పింది. బైరన్, ఇంగ్లీషు లార్డ్‌లు, వారి సంప్రదాయాల మూలాలను చెదరగొట్టాలని అనుకున్నాడు. వాటిమీద తుఫాను లేపాడు. కాని అవన్నీ పర్వత శిఖరాలపై తిష్టవేసుకుని వున్నాయి. ఏ వ్యక్తి

వాటిని తాకలేడు. అలాంటి తను రహస్యంగా విశ్వసించే దేవుళ్లను ఏ మానవమాత్రుడు తాకలేడు! పైగా ఇప్పుడు తనని ఈ రాళ్లమీద కదలకుండా మేకులు కొట్టి వదిలిపెట్టారు! ఎలాంటి స్థితి!

మేడమ్ స్టీల్ ద్వారా కారోలైన్ రాసిన నవల గురించి విన్నాడు – దానిలో తననే హీరోగా చూపింది. తన కార్సెయిర్‌లో నుంచి తీసిన పాదాలను–

రాబోయే కాలానికి అతను వదిలిన పేరు–

ఒక మంచి గుణం – వేయి నేరాలతో ముడిపడి వుంది!

ఇది ఎంతో కష్టపడి రాసింది. అతను కష్టపడి చదివాడు. అతను తన జ్ఞాపకాలను చెరిపేద్దామనుకుంటాడు – 'కనిపించనివారు చనిపోయినట్లే', కాని ఒక్కోసారి మనం చనిపోయినవారితో జీవించాలి! అలాంటి పరిస్థితి వస్తుంది!

ఇప్పుడు తనతో తన చెలిగా వుంటున్న క్లేయిర్ ఎవరు? అలాంటి ఛాయ! ప్రతి సాయంత్రం వస్తుంది. ఉదయమే వెళ్లిపోతుంది. ద్రాక్షతోటలకు అడ్డంపడి షెల్లీ మేరీ ఇంటికి పరుగుపెడుతుంది! ఇప్పుడు కడుపుతో ఉంది. చాలా విచారంలో వుంది. ఏమీ కాని తనతో బిడ్డను కనబోతోంది. Prisoner of Chillon కాపీలు రాస్తోంది. 'చైల్డ్ హెరాల్డ్' కూడా రాసిపెడుతుంది. అతనికి ఏమాత్రం ఉత్సాహం లేదు ఆమె పట్ల – ప్రేమ అసలే లేదు. ఈ సిగ్గులేని యువతి తనంతతనుగా తన ఒడిలోకి వచ్చిపడింది. ఇప్పుడు తనతో బిడ్డను కనబోతోంది. కననీ – బైరన్ సంతతి పెరగాలికదా! బిడ్డను పెంచుతాడు!

తల్లిని మాత్రం చూడడు! ఇవీ అతని ఆలోచనాకర్మలు!

షెల్లీకి చాలా సాధుభావాలున్నాయి. ఆమెపట్ల సోదర ప్రేమ చూపుతాడు. బైరన్ క్లేయిర్‌పట్ల చూపే కఠినమైన వైఖరికి నొచ్చుకుంటాడు.

బైరన్‌లోని కవి షెల్లీని ఆశ్చర్యపరుస్తాడు. అతని వ్యక్తిత్వం మాత్రం అతన్ని ఇరుకున పడవేస్తుంది. చాలా ఆగ్రహాన్ని తెప్పిస్తుంది.

బైరన్ సిద్ధాంతపరంగా ఉదారవాదే కాని. వంశానికి జన్మకి ప్రాధాన్యత ఇస్తాడు. తనకంటే షెల్లీ అంతస్తుపరంగా తక్కువనే విషయాన్ని మర్చిపోనివ్వడు. తన 'లార్డ్‌షిప్' తప్పనిసరిగా కనిపింపజేస్తాడు.

ఇక ఆడవారి విషయంలో అతని నిర్లక్ష్యంతో షెల్లీని నిర్ఘాంతపరుస్తాడు.

బైరన్ కూడా లోలోపల షెల్లీ కనిపించేంత స్వచ్ఛంగా వుండగలడా అని అనుమానిస్తాడు.

హాబ్ హౌస్ – డేవీస్ వస్తున్నట్లు కబురుపెడతారు. అరె ఎలాంటి వార్త – డేవీస్ నత్తి మాటలు వినడం ఎంత ఆనందంగా వుంటుంది! కొన్నాళ్లు ఈ వర్డ్స్‌వర్త్ – ప్రేమ సిద్ధాంతాన్ని మరచిపోవచ్చు!

తమ లండన్ సాయంత్రాలు గుర్తుకు తెచ్చుకోవచ్చు.

ఆగస్టు 29 – షెల్లీ పరివారం అక్కడ నుంచి వెళ్లిపోతారు. వారితోపాటు క్లెయిర్‌నూ తీసుకుని. కొన్ని రోజుల తర్వాత బైరన్ అగస్టాకు రాస్తాడు. "ఒక మూర్ఖురాలు – ఎంత వద్దన్నా నా వెంటపడింది. నేను ఏమి చేయను – ఎంత పొమ్మన్నా వినలేదే – నేనామెను ప్రేమించలేదు – అసలు ఎవరిని ప్రేమించటానికి నాలో ప్రేమ మిగిలివుంటేగా?!

నన్ను తాత్వికునిగా మార్చటానికి ఎనిమిది వందల మైళ్లు వచ్చిన ఆ యువతితో ఎలా ప్రవర్తించాలి – ఏమయినా ఇప్పుడు అంతా ముగిసిపోయింది"

అని ముగించాడు.

XXVII

హిమసంపాతాలు

(1816)

హోబ్ హౌస్ – స్క్రోప్ డేవీస్ బైరన్ వుంటున్న డయోడటి భవనానికి వచ్చి – అక్కడ నుంచి కనిపించే సుందర దృశ్యాన్ని చూసి, జెనీవా సరస్సు, 'జూరా' అందాలను ఎంతో మెచ్చుకుంటారు. బైరన్ కావాలని రాసిన వస్తువులన్నీ తీసుకుని వస్తారు. మెగ్నీషియా, కత్తిలాంటి కఱ్ఱ – మిస్టెర్ వైట్ ఎఱ్ఱ పళ్లపొడి ఇలాంటివి. వారి స్నేహితుని ఆకారం – ఆరోగ్యం చూసి సంతోషిస్తారు. అతను లండన్ వదిలినపుడు వున్న పాలిపోయిన పసుపురంగు ఇప్పుడు లేదు. కాస్త రక్తం పట్టి ప్రశాంతంగా వున్నాడు. ఇప్పుడు అతను కనిపిస్తున్న అత్యంత ప్రశాంత స్థితి – ఇది తన అంతర్గతంగా చెలరేగుతున్న హింసాత్మక ప్రేరణను అణచిపెట్టే ప్రయత్నమే!

ఇప్పుడు లండన్‌లో ప్రచారంలో వుంది ఏమిటి?

ఇక్కడ స్విస్‌లో 'రూయిబాసి'లోని పనివాళ్లతో వ్యభిచరిస్తున్నాడని! తిరుగుతున్నాడని! అంతేనా తన మారుటి అక్క – అగస్టా ఇక్కడే మారువేషంలో వుంటోందని! కాని హోబ్ హౌస్ రావటం మంచిదే – ఇక్కడి జీవితం పవిత్రంగానే సాగుతోంది. ఆ విషయమే మిస్టర్ లీ హంటు పత్రికకు వార్తలాగా పంపిస్తాడు.

"మీ బంధువు, మిత్రుడు – ఇక్కడ చాలా క్రమశిక్షణతో దినచర్య గడుపుతున్నాడు. మనుషులకుగాని దేవునికిగాని ఎలాంటి హాని చేయకుండా తనమానాన తను హాయిగా జీవిస్తున్నాడు! అతని ఆరోగ్యం కూడా చాలావరకు

సాధారణ స్థితికి వచ్చింది. బ్రాందీలేదు – ఆలస్యంగా నిద్ర లేపటం లేదు. మగ్నీషియా అవసరం లేదు. కనీసం సోడానీళ్లు కూడా తీసుకోవటం లేదు. ఆవేశ కావేశాలన్నీ అణిగిపోయాయి. ఎంత సంతోషంగా వుండాలో, అంత సాధారణంగా కనిపిస్తున్నాడు! ఇవన్ని ఎందుకు తెలియజేస్తున్నాము? బైరన్‌లాంటి అంతస్తుగల వ్యక్తి గౌరవానికి భంగం కలిగించే పుకార్లన్నీ, నిరాధారమైనవి. అన్యాయమైనవి అని తెలిపేందుకే…” అని ముగించాడు.

హాబ్ హౌస్ స్విట్జర్లాండు చూడాలని ఆశిస్తాడు. అంతే ట్రినిటీ కాలేజి ముగ్గురు వీరులు. వెనుక పోలిదోరితో Chamonix (చామోనిక్స్) మాంట్‌బ్లాంక్ వెళ్లారు.

మంచుతో జారిపోయే పర్వతాలు ఎక్కటానికి బైరన్ ఇబ్బంది పడతాడు.

Montanvers హోటల్‌లో షెల్లీ పేరుచూస్తాడు. “నాస్తికుడు, తత్త్వవేత్త” అని గ్రీకులో రాసివుంటుంది! బైరన్ వాటిని కొట్టివేస్తాడు “నేను షెల్లీకి మేలు చేస్తున్నాను” అంటాడు!

తిరిగి వచ్చిన తర్వాత తన స్నేహితులను కోవెట్ పాలెస్‌కు – మేడమ్ స్టీల్ ఇంటికి తీసుకువెళ్తాడు. అప్పటికే హాబ్ హౌస్ మేడమ్ స్టీల్ రాసిన Adolphe చదివి వుంటాడు. అందులోని మిణుగురుల గురించి మిణుగురుల వెల్తురు తమ చుట్టువున్న ఎండుటాకులనే చూపుతున్నాయి అని అంటాడు – మేడమ్ స్టీల్ చాలా సంతోషిస్తుంది!

చైల్డ్ హెరాల్డ్ మూడో కాంటో తన మిత్రులకు ఇప్పుడు ఎలాంటి జంకు లేకుండా ఇస్తాడు. అప్పటివరకు ‘షెల్లీ’తో ఎప్పుడూ వుండని హాబ్ హౌస్‌కు ఈ ‘చైల్డ్‌హెరాల్డ్’ మూడో ‘కాంటో’లో అతని ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది! “చాలా సున్నితంగా వుంది! “కాని ఇవి ముందు భాగాలంత బాగున్నాయో లేదో చెప్పలేను! ఇందులో ఎంతో మార్మిక వాతావరణం – మెట్ట వేదాంతం పుష్కలంగా కనిపిస్తోంది” అంటాడు.

అందులో అగస్టా గురించి రాసిన పాదాలను నిర్దయగా తీయించి వేస్తాడు.

నువు కవివే - అంతమాత్రాన మమ్మల్ని నిందించకు -

నీ చాతుర్యంతో - మా హాస్యం స్నేహం చేయాలి-

అవును నువు పాలకుడివే - మమ్మల్ని ప్రేమించు!

మేము ఇదంతా ఉత్తిదే అనుకున్నామని!

నమ్మి ఇచ్చినా - నిన్నెవరూ ముట్టుకోరు!

నువ్వు విడిపోయింది - ఆమె నీ భార్యకదా!

'మోలీ' నీకు ముఖ్యమా?

అదేమి జీవితం?"

ఈ విధంగా హాబ్ హౌస్ అతన్ని సమాధానపరుస్తాడు!!

బైరన్ అతన్ని కాదనలేదు!

ముందు డేవీస్ తిరుగు ప్రయాణం అవుతాడు. అయితే బైరన్ రాళ్లు రతనాలు గొలుసులు నెక్లెస్‌లు పంపిస్తాడు. కొన్ని 'లీ' సంతానంకోసం కొన్ని తన కూతురు 'అడా' కోసం! ఆమె తన సృష్టికదా. ఎంత ప్రేమ! అతని ఊహల్లో – ఆ చిన్న ప్రాణి తన ప్రేమనంతా నింపుతాడు! కేవలం రెండుసార్లు చూశాడు – అంతే– ఆ తరవాత డా॥ పోలిదోరిని పంపేస్తారు. ఇది హాబ్ హౌస్ విజయమే – ఇప్పుడు డయెడాటిలో ఇద్దరే వుంటారు. మరో యాత్ర, పర్వతాలకు, మంచు పర్వతాలకు 'జుంగ్‌ఫ్రూ'కు బయలుదేరుతారు

ముదురాకు పచ్చని లోయలు – ఆవుల మెడగంటలు – లోయల్లో మార్మోగుతుంటే – ఇంగ్లండుదాకా వినపడతాయేమో?! పశువుల కాపర్లు కొండకొన మీద నుంచి పాటలు పాడుతున్నారు. వాళ్లు స్వర్గంలో వున్నారనిపిస్తుంది! పర్వత శిఖరాలపైన కరగకుండా మిగిలిన మంచు గోపురాలు – లేత ఎండలో మెరుస్తాయి, అతనిలో చీకటిని వెక్కిరిస్తూ. తన చిన్ననాటి హైలాండ్ శలవు రోజులు మదిలో మెదులుతున్నాయి.

అరె – హాబ్ హౌస్ చూడు – ఎంత అద్భుతంగా సహజంగా వున్నాయో – ఇది నిజమనేకంటే స్వప్నంలో వున్నట్లు! మంచుతో కప్పివున్న కొండచరియలు – ఒకవేళ తుఫాను గడ్డకట్టిందేమో?!

అంత ఎత్తునుంచి మంచు కరిగి ఉద్ధృతంగా ఉరుకుతున్న శీతల జలపాతాలు, ధవళశ్వేతశ్వాల సమూహంలాగా గిట్టల తాకిడితో నన్ను తొక్కివేస్తాయేమో? తెల్లటి నురగలు పరుగులు పెడుతున్నాయి. ఒకవేళ మరణ దేవత స్వారీ చేస్తున్నదేమోకదా! అటుచూడు – ఆకాశం కింద ఎర్రని జేగురు రంగు ఏదో రసాయనంతో వర్షించబోతున్న మంటల సముద్రం, పైన వున్నట్లు! ఈ వింతలన్నీ చూస్తుంటే అతనికి అగస్టా తన ఆలోచనలతో తిరుగుతోంది. ఈ యాత్ర మొత్తం ఆమెకోసం తన జర్నల్‌లో రాస్తూనే వున్నాడు.

....నిన్న సెప్టెంబరు 17, 1816 – ఈ యాత్రలో హాబ్ హౌస్‌తో బయలుదేరారు. పర్వతాలను మంచుపర్వతాలను చుట్టిరావాలని!

"ఈ ఆవుల గంటలు – పచ్చని బయళ్లు ఇవి బ్రిటన్‌లోని ఎత్తైన పర్వతాలకంటే ఎత్తుగా పరచుకున్నాయి.

పశువుల కాపర్లు మమ్మల్ని చూసి అబ్బ ఎంత ఎత్తులో వున్నారో వారు భూమిమీదకంటే ఊహకందని మరో లోకంలో వున్నారేమో? ఎంత స్వచ్ఛంగా అమలినంగా వుంది! అనంతంగా ఒంటరిగా భయంకరంగా! మమ్మల్ని చూసి 'Rauz des Vaches' అని పాడుతున్నారు. అదే వారి వీడ్కోలు!

"ఈ మధ్య నేను ప్రకృతిలో కలిసి కదులుతున్నాను. రాత్రి 9 గం॥లకు నిద్రకు హాబ్ హౌస్ ప్రక్క గదిలో తలుపుకు తలకొట్టుకున్నాడు. ఈ రోజు అలసిపోలేదు. కాని నిద్రపోతాను. షిల్లర్ (Schiller)ది అనువాదం చదువుతున్నాను. ప్రియమైన అగస్టా శుభరాత్రి!"

మళ్లీ మర్నాడు గ్రిండెన్‌వాల్డ్ (Grindenwald) వచ్చారు. పైన నక్షత్రాలు రమణీయంగా వున్నాయి కాని భయంకరమైన దారి, జాగ్రత్తగానే చేరాం. కాస్త మెరుపులు – అడివి – అన్నీ దేవదారు చెట్లు. ఆకు రాలి, బెరడు ఊడి కేవలం

ఒక్క శీతాకాలంలోనే ఒక్క ఋతువులోనే ఆకులన్నీ రాలిపోయి చివరికి బెరడుకూడా వూడిపోయి మోడుగా, బోడిగా మిగిలిపోయింది.

అందరూ వదిలి వెళ్లిపోయిన
నా జీవితంలా! మోడు బ్రతుకు…"

"బెర్న్ (Bern) నుంచి ఫ్రీ బోర్గ్ – ఇక్కడంతా క్యాథలిక్కులు. ఇప్పుడే ఒక యుద్ధభూమి దాటాము. ఒక తోకలేని కుక్కను కొన్నాను. చాలా వికృతంగా వుంది. దాని పేరు 'మట్జ్'!

"సెప్టెంబరు 29 – ఇలాంటి అతి శీతల వాతావరణంలో పదమూడు రోజులు ప్రయాణం. చాలా అదృష్టం హాబ్ హౌస్ నాతో వుండటం. అలాగే ఈ ప్రయాణం నిరాటంకంగా సాగడం, ఎంత ఆనందంగా వుంది. నేను ప్రకృతి ప్రేమికుణ్ణి కదా – అలాగే అందాన్ని ఆరాధిస్తాను కదా! ఎంతటి అలసట అయినా భరిస్తాను. జీవితావసరాలను ఆహ్వానిస్తాను. ప్రపంచంలోనే సుందర రమణీయ దృశ్యాలను చూశాను…"

"…కాని ఇంత సుందర ప్రకృతి పరిసరాలు నా గుండెలోని చీకటిని జ్ఞాపకాల చేదును పోగొట్టలేకపోతున్నాయి. నా సంసారంలో విషాదం, బహుశా నా జీవితమంతా వెన్నాడుతుందేమో! నన్ను ఇప్పుడు మానసికంగా తొలిచివేస్తోంది. పశువుల కాపర్ల పాటలు, విరుచుకుపడుతున్న మంచుచరియలు, జలపాతపు వేగం, ఆ పర్వతాలు, ఆ అడవులు, ఆ మేఘాలు ఇవన్నీ కూడా కేవలం ఒక్క తృటికాలం నా గుండె బరువును తగ్గించలేకపోయాయి. నన్ను నాకు దూరం చేయలేకపోయాయి. ఈ ప్రకృతి శక్తులు, అద్భుతమైన వాటి ఘనత, గౌరవప్రదమైన వాటి ఋతుచక్రం – ఇవన్నీ నన్ను చుట్టుముట్టి వున్నా నా మనసు తేలికపరచలేకపోయినాయి!

"అన్ని విషయాలకు ఒక సమయం వుంటుంది. ఇప్పుడు నేను నిందలన్నింటికీ అతీతంగానే వున్నాను! అలాగే నాలో ప్రతీకార వాంఛా లేదు – నేను బాధలపాలయింది ఎవరివల్లనో, నాకెవ్వరూ తెలియదు! కాని నా బాధలన్ని నేను అనుభవించాలికదా. కానీ, ఇక చాలు చాలు…"

"...అగస్టా – నాకు చాలా ప్రియమైన నీకోసం ఈ జర్నల్ రాస్తున్నాను – నేను చూసింది, అనుభూతిపొందింది, నీకోసం జాగ్రత్త చేస్తున్నాను – నిన్ను ఇష్టపడే నన్ను ప్రేమించు..."

ఆగస్టు మాసంలో 'డయోడాటి' భవనానికి మాథ్యూలూయిస్ - 'The Monk' రచయిత వచ్చారు. ఆయనే బైరన్ కోసం గోతే రాసిన ఫాస్ట్ (Faust) నుంచి కొన్ని భాగాలు అనువాదం చేసి ఇస్తారు.

ఇదీ అతని హృదయాన్ని కదిలించిన కథ! ఇందులో అనాదిగా ఫాస్ట్ అడుగుతున్న ప్రశ్నలకు అదీ ఈ విశ్వాంతరాళం గురించి – డెవిల్‌తో ఒప్పందం – మార్గరీటాను పోగొట్టుకోవటం ఇదంతా తన కథకాదూ? కాని బైరన్ గనుక 'ఫాస్ట్'ను సృష్టించినట్లయితే అతన్ని ఇంకా ధైర్యవంతునిగా ఇంకా విషాదంగా చూపించేవాడు. ఎందుకు ఈ ప్రకృతి శక్తుల ముందు వణికిపోవాలి? ధైర్యవంతుడు వాటిని ఎందుకు తృణీకరించకూడదు – మరణాన్ని ఎందుకు తోసిరాజనలేడు? – ఇవీ అతని ఆలోచనలు!!

కళాసృష్టి – ఎప్పుడూ ఒక దిగ్భ్రాంతికి లోనయినప్పుడు ఒక కలకలం ఆకస్మిక ఘాతంతో బలమైన తాకిడికి గురైనపుడు – కళాసృష్టికి అనువైన వాతావరణం లభిస్తుంది. బైరన్‌లో అందుకు పుష్కలమైన వనరులున్నాయి. అతని మనస్సులో వ్యథ/ఆక్రందన/విషాదం కుతకుత ఉడుకుతోంది. ఈ అశ్మజ ఉష్ణద్రవం తన అణగారిన అనుభూతులు – తన భయాందోళనలు, తన ప్రియురాళ్ళు, కోర్కెలు, విషాదాలు, పశ్చాత్తాపాలు, పాపతాపాగ్ని కీలల నుంచి జనించి ఇప్పుడు తననే దహించటానికి సిద్ధమవుతోంది.

'ఫాస్ట్' చదవటంతో కలిగిన దిగ్భ్రాంతి, అలంఘనీయమైన ఈ ఆల్పైన్ పర్వత సానువుల పరిసరాలు ఈ సందర్భం నుంచి ఒక అద్భుతమైన కవితాధార వెలువడింది – అదే మాన్‌ఫ్రెడ్! అందులోని రెండు భాగాలు పన్నెండు రోజుల్లో రాశాడు – అదీ ప్రయాణం చేస్తూ– అగస్టా కోసం చిక్కిన పచ్చికబయళ్లన్నీ, అహేతుకమైన తన విషాద అనుభూతుల భయాలన్నీ గుప్పించాడు. తన

ప్రయాణంలోని ప్రకృతి సౌందర్యాలు – పశువులకాపర్ల పాటలు – వీడ్కోలు పాటలు – ఇవన్నీ పద్యపాదాలలో చోటుచేసుకున్నాయి. అందులోని కథావస్తువు ఎంత మార్మికమైనదంటే సముత్థానమై అన్నింటికీ చోటు కల్పిస్తోంది!!

మాన్‌ఫ్రెడ్, ఆల్ప్‌లో ఒక పట్టణాధికారి!

అతను మాయలు మంత్రాలు నేర్చాడు! ధనవంతుడు! బాగా చదివిన జ్ఞాని! కాని, కాని అతని మనసులో తన గత ధూర్తకార్యం మూలంగా, ఘోర నేరం వలన వ్యథాభరితుడై ఆక్రోశిస్తున్నాడు!

అచ్చంగా 'ఫాస్ట్' కావ్యం ప్రథమార్థం లాగానే మాన్‌ఫ్రెడ్ పంచభూతాలను ఆహ్వానిస్తాడు! భూమి, కడలి, వాయువు, రాత్రి, పర్వతాలు అన్ని ప్రత్యక్షమవుతాయి. ప్రకృతి శక్తులన్నీ అతన్ని

'ఏమిటి? మాతో నీకు ఏమి కార్యం – ఓ మర్త్యుడా?' అని నిలదీస్తాయి!

"మరపు – నేనెవరో ఎందుకో ఎక్కడో నాలో వున్నదీ అన్నీ మరచిపోతాను".

అతనిలో ఏముంది? మనమే ఆలోచిద్దాం!

ఒక స్త్రీ కోసం ఆర్తి – వేదన – అస్టార్టే! తను పోగొట్టుకున్నాడు. ఇప్పుడు కోరుకుంటున్నాడు. కాని తను కక్ష సాధించాల్సింది ఎవరిమీద – ఆ పేరు చెప్పలేదు! ఈమె గురించి ఒక క్షుద్రమంత్రాన్ని జపిస్తూ – అదీ మార్మికమైన కంఠధ్వనితో ఆమెను శపిస్తున్నాడు.

ఎందుకంటే బైరన్ ఇప్పుడు శక్తిహీనుడు. తన నుంచి తాను పలాయనం సాగిస్తున్నాడు. తన అస్థిత్వాన్ని మరుగున పడవేయాలని తపన పడుతున్నాడు!

ఈ సామ్యాలన్నీ చాలా మంచుతెరల్లో వున్నా చిహ్నాలన్నీ చాలా స్పష్టంగా వున్నాయి. మాన్‌ఫ్రెడ్ బైరన్! అస్టార్టే – అగస్టా – ఇక తను శపించే ప్రాణి అనబెల్లా! అతని కవితాధార ఈ వ్యథాభరిత హృదయం నుంచి దావాగ్ని శిలాద్రవం గుండెలు పగలకుండా వుండగలిగేందుకు ప్రవహించింది.

అదిగో చంద్రుడు - అలల మీద-

అదిగో మిణుగురులు గడ్డిలో!

చూడు - సమాధి మీద ఉల్కాపాతం!

....

...... నిన్ను ఈ మబ్బుల నుంచి

పోగు చేశాను-

నీవు నాతోనే వుండిపోతావు!

అతని శాపాలు:

నీ చలి చనులు, నీ

వంకర నవ్వులు

నీది అంతా మోసం-

నీతిగా కనపడతావు-

నీ గుండె నిండా

కాపట్యమే-

నిన్ను శపిస్తున్నా -

నీవు నరకానికి పో-



చలి కొండలు

ఆ విధంగా అనబెల్లాను నరకానికి తోస్తాడు.

అప్పుడు మంత్రగత్తెను పిలిచి అస్టార్టేను తన దగ్గరకు రప్పించమంటాడు. ఆమె అగస్టా!

మాన్‌ఫ్రెడ్:

ఆమె నాలాగానే వుంటుంది-

ఆమె జుత్తు, ఆ కనులు - ఆ పెదవులు ఆ పోలికలన్నీ!

ఆమె గొంతు కూడా నా కంఠంలాగానే

ఆమె తప్పులనీ నావే–
ఆమె సుగుణాల రాశి!
ఆమెను ప్రేమించాను – ఆమెను నాశనం చేశాను...!

మంత్రగత్తె: నీ చేత్తోనా?

మాన్‌ఫ్రెడ్:
కాదు – నా హృదయంతో – ఆమె
గుండెల్ని పగలగొట్టాను.
నా మీద అనురాగంతో ఆమె హృదయం
ఎడారి అయింది.

ఆమె నెత్తురోడుతుంది–
నేనెలా ఆపగలను?

నేను ప్రేమించి నాశనం చేశాను–
ఇదీ మాన్‌ఫ్రెడ్ ఆక్రందన! అదే బైరన్‌ది కూడా!

ఇవన్నీ తన దయోడాటి భవనంలోని
అతిథుల సందడిలో మరుగు పడిపోతున్నాయి.

నా ఏకాంతం – ఇక ఒంటరి కాదు–
నా చుట్టూ జనాలు – పొద్దుగూకేవరకు–
పిచ్చి కోసం ప్రార్థన చేశా–
మరణానికి ఎదురు వెళ్లా–
కాని ఒక మహాప్రేతం – ఒక్క వెంట్రుకతో
నన్ను బంధించింది – విడుదలే లేదు–

మార్మిక శక్తులు అస్టర్టేని నిద్ర లేపుతాయి–
కాని ఆమె మూగగా మౌనంగా వుండిపోతోంది–
అతని జ్ఞాపకాలలో నుంచి ఆమె కనుమరుగయి
పోతుంది – పెదవులు బిగించి – మూగగా –
తెరల చాటునే వుండిపోయింది.

"మాట్లాడు - నన్ను ప్రేమించలేదా?
మన ప్రేమను మించి అలంఘనీయమైన పాపం
ఏముంది?

నీ కోసం ఏ స్వర్గం వెదకను?
ఈ నేల నాలుగు చెరగులా తిరిగాను.
నీలాంటి - నీ పోలిక గలవారెక్కడ?
మాట్లాడవా?"
ఇదీ అతని ఆక్రోశం! - ఆక్రందన -
చివరికి మాన్‌ఫ్రెడ్ నిరాశలోని
భయంకర రూపాన్ని గ్రహించిన-
భూతాలన్ని - ప్రకృతి శక్తులన్ని-
అరె ఇతను మనలో ఒకడైతే-
మనల్ని మించిపోయేవాడే-"
అంటారు!

ఆ విధంగా అశ్మజ ఉర్ణద్రవం పొంగిపొర్లింది. అద్భుతమైన 'మాన్‌ఫ్రెడ్'!! రెండు భాగాలే రాశాడు. మూడోభాగం రాయకుండానే దయోడాటి తిరిగి వస్తాడు. అప్పటికే అతని చుట్టూవున్న మంచుపర్వతాలన్ని విపరీతంగా ఏడుస్తున్నాయి - కన్నీరు మున్నీరుగా!

మాన్‌ఫ్రెడ్ మానసిక వేదనకు మూలకారణం - అస్టార్టె మౌనం! ఎందుకు అగస్టా మూగగా సమాధానాలు రాస్తోంది? అర్థంపర్థం లేని పదాలు వాక్యాలతో - ఇవి బైరన్ ఊహాశక్తికి రమణీయంగానే వున్నా - వాటి ఆంతర్యం ఏమిటి?! అతని ఆందోళన - తెలుసుకోవాలని ఆత్రుత. అగస్టా చుట్టు వున్న అవ్యక్తమైన మంచు తెరలను చీల్చి సత్యాన్ని చూడలేకపోయాయి!

ఆమెను ఆవరించిన శక్తిని ఛేదించలేకపోయాయి!

బైరన్ లండన్ వదిలి యాత్ర వెళ్లిపోయిన తర్వాత లేడీ బైరన్ కొన్ని వారాలు లండన్‌లో వుండిపోవలసి వచ్చింది. అదీ ఆమె న్యాయ సలహాదారులకు అందుబాటులో ఉండటానికి! తిరిగి తన చిన్నారి 'అడా' దగ్గరకు వెళ్లేముందు అగస్టాను కలిసింది. అప్పటికే బైరన్‌పట్ల ఆమె చాలా కోపాగ్నితో వుంది. అతన్ని ఎంతగా ప్రేమించింది! అతన్ని ఎలా అసహ్యించగలదు! ఇలాంటి ఆలోచనతో అతలాకుతలమైన లేడీ బైరన్‌లోని వైరుధ్యాలు, పాపం ఆమె వయస్సు కేవలం 24 ఏండ్లే. అప్పుడే జీవితం ముగిసిపోయిందా? ప్రేమ సమసిపోయిందా – ఆమెలో ఏదో తెలియని ప్రశాంతత ప్రవేశించింది. ఈ ప్రమాదకరమైన విశ్రాంతి చనిపోయిన వారిలోనే చూడగలం అనుకుంది అగస్టా!

ఇప్పటి లేడీ బైరన్ సమస్య, అగస్టాను ఎలా రక్షించాలని! ఆమెను స్నేహితురాలిగానా లేక శత్రువుగా పరిగణించి రక్షించాలా?

ఈమె తన భర్తకు సోదరి, భార్య! ఈమెను ఇప్పుడు దూరం చేస్తే మళ్లీ బైరన్ ఒడిలో చేరిపోతుందేమో? వీరిద్దరినీ కలవనీయకూడదు. ఆ విధంగా ఇద్దర్ని రక్షించవచ్చు! అగస్టా మౌనానికి కారణం ఆమె మరదలే. ఆమె తెలివితేటలతో అగస్టాను పూర్తిగా లొంగదీసుకుంది. లేడీ బైరన్ స్నేహితులు శ్రీమతి విల్లియర్స్ ఈ కథంతా విని పూర్తిగా లేడీ బైరన్‌ను సమర్థించింది.

వారిద్దరూ కలిసి అగస్టాను తమ ఉత్తరాలతో, మాటలతో ఆమె పాపాన్ని అంగీకరించి – పశ్చాత్తాపం పొందాలని మార్గం నిర్దేశిస్తారు. అగస్టా తన సోదరుడు రాస్తున్న వుత్తరాలన్నీ వారికి చూపుతుంది. వాటికి సమాధానం ఎలా రాయాలో కూడా వారే చెప్తారు. "అతని బాధలన్నిటికీ నేనే కారణమవుతాననుకోలేదు. ఇప్పుడు కూడా అతని సుఖాన్నే కోరుకుంటున్నాను" అంటుంది అగస్టా. ఆ విధంగా ఆమె మౌన భాష – మూగబోయిన పశ్చాత్తాపం, పాపప్రక్షాళనం అన్ని అనబెల్లా దర్శకత్వంలో జరిగిపోతుంటాయి.

ఇప్పుడు జెనీవా పరిసరాలు మంచువర్షంతో నివాసయోగ్యంగా వుండవు. సెచరాన్ నుంచి సరసు తీరం వెంబడి మన ఇంగ్లీషు యాత్రికులు బైరన్ ఇంటి

పరిసరాలు బైనాక్యులర్లతో వేగుల మాదిరి చూస్తుంటారు. ఎక్కడైనా పొట్టిగౌను కనపడుతుందేమోనని! ఇవన్ని బైరన్‌కు చిరాకు పుట్టిస్తాయి. ఇక్కడి కథ వరకు తన వెంటబడి తరిమిన సంఘసభ్యులు – ఇక్కడా తనని వదిలిపెట్టడంలేదు. ఈ పర్వతాలను అధిరోహించి ఆవలివైపు వెళ్ళిపోదాం అనుకుంటాడు. అవతలి ప్రక్కన అడ్రియాటిక్ సముద్రం వుంది! తన దాహం అక్కడ తీరవచ్చు!

అక్టోబరు మొదటి వారంలో డయోడాటి వదిలి హాబ్ హౌస్‌తో కలిసి, ఫ్లెచర్ వెంట రాగా సింప్లన్ మీదుగా మిలన్ వెళ్లాలని ప్రయాణం మొదలుపెడతారు. ఆరు గుర్రాలు బైరన్ బగ్గీని లాగుతుంటాయి. ఎత్తైన సింప్లన్ కనుమ గుండా దేవదారు అడవులు దాటి రాతికొండల బండల మీద అంతూపొంతూ లేని మంచుగడ్డల మీద ప్రయాణం సాగుతుంది. పర్వత శిఖరాలమీద ఎలాంటి గోడ కనపడక తమ పేర్లు రాసిన కాగితం ఒక బండకింద పెడతారు. అక్కడ నుంచి ఆవైపు దిగటానికి మంచువాలులు, దేవదారు అడవులు దాటి దోమోదోసోలా లోయలోకి వస్తారు. ఇది చాలా ప్రమాదకరమైన ప్రదేశం. అందరూ వేగులే. అప్పటికే నెపోలియన్ ఓటమి తర్వాత ఇది ఆస్ట్రియా పాలనలోకి వెళ్లిపోయింది. ఇటలీ అంతా పరాధీనమై మగ్గుతోంది. అక్కడి ఉదార వాదులతో బైరన్ వెంటనే స్నేహం చేస్తాడు.

మేడమ్ స్టేల్ సిఫారసుతో మార్కిస్ బ్రియ్‌ను కలవగలుగుతాడు. అతని సాయంతో ఆ దగ్గర్లోని పేరున్న కవి సిల్వియో పెలికోని కలుస్తాడు. అతనికి ఆ దేశం బాగా నచ్చింది. ఆడవాళ్ల నల్లని విశాల నేత్రాలు వారి ముఖాలు/వారంతా గర్వంగా ప్రేమ భావంతో వెలిగిపోతున్నారు! ఆ దగ్గర్లోని అంబ్రోసియన్ గ్రంథాలయం అక్కడే లుక్రీసియా బోర్గియా అవశేషాలు చూస్తాడు. పొడవాటి ఆమె జుట్టుపాయను చూసి ఆశ్చర్యపోతాడు. "ఇంత అందగత్తె జీవించి ఉన్నప్పుడు పుట్టకపోవటం ఎంత దురదృష్టం" అనుకుంటాడు. ఆమె అందకత్తేకాదు తన అందాన్ని ఎంత చక్కగా వుపయోగించుకుంది!

బ్రెమీ (Breme) అన్నీ పూసగుచ్చినట్లు చెప్తాడు. మాస్కో నుంచి నెపోలియన్ తన సేనను వెనక్కు మళ్లించినపుడు తను నెపోలియన్‌తో వున్నానని అంటాడు.

నెపోలియన్ భార్య, తన భర్త సమాధి మీద, "ముప్పయి అయిదేళ్ల చరిత్ర – ఒక్కనాటి పొరపాటు" ఇదీ నెపోలియన్!

ఆ ప్రాంతంలోనే డా॥ పోలిదోరి మళ్లీ వీరికి తారసపడతాడు! ఏదో చిక్కులో వుంటాడు. బైరన్ అతనికి వెంటనే సహాయం చేస్తాడు. బైరన్ గుండెల్లో తడి ఎప్పటికీ ఆరదు కదా! ఇక్కడే బైరన్ గురించి బ్రెమీ తన అభిప్రాయాలు, ఇవి, సర్ వాల్టర్‌స్కాట్ అభిప్రాయానికి దగ్గరగానే వుంటాయి – వెలిబుచ్చుతాడు.

"బైరన్ – లార్డ్ బైరన్ – చాలా ప్రేమాస్పదుడు. అతనికి అవకాశం చిక్కినపుడు తప్పక సహాయకారిగానే వుంటాడు. కొందరు పదిమందిలో కలవలేకపోవచ్చు. కాని వారికి మానవత్వపు మానవీయ దృక్పథం పుష్కలంగా వుంటుంది. లార్డ్ బైరన్‌కు ఎన్నో గొప్ప లక్షణాలు, వ్యక్తిత్వం వుంది. అతని జీవితంలోకి దగ్గరగా వచ్చినవారికి మాత్రమే ఇవి పరిచయమవుతాయి. అతనికి స్వదేశంలో అతని బంధువర్గంలో దక్కవలసిన గౌరవం కరవయింది. ఇతరులలో అతను గుర్తించలేనిది అది అతనికీ దక్కకుండా పోతోంది.

ఇక్కడ మేము అతనికి ఎంతో స్వేచ్ఛనిచ్చాము. అతని ప్రతిభను గుర్తించి కీర్తించాము. పరస్పరం అర్థం చేసుకుని అతనిలోని మంచిని చూడగలిగాము. ఇక్కడ అతను ఎంతో ప్రశాంతంగా వుండగలుగుతున్నాడు! ఈ విధంగా ఎన్నో బాధల్లో ఎంతో వేదనతో ఉడికిపోతున్న బైరన్‌కు ఇది సాంత్వనే. కష్టాలలో వున్నవారిని అర్థం చేసుకునేవారికి లభించే ప్రతిఫలం ఏమీ వుండదు. ఒంటరిగా మిగిలిపోతారు!

బైరన్‌కు ఇటాలియన్ స్నేహితులు మిలన్‌లోని అన్ని ప్రదేశాలు దర్శింపచేస్తారు. సిమనోటా ప్రతిధ్వని వింటాడు. వెన్నెల్లో డ్యూమో చూస్తాడు.

బైరన్, డేనియల్ క్రిస్పి వేసిన చిత్రాన్ని చూసి చలించిపోతాడు. చర్చి మధ్యలో శకపేటికలో ఒక ఫిరంగితో వుంటాడు! అక్కడే పూడ్చిపెట్టడానికి మంత్రాలు చదువుతుంటారు. అంతే ఒక్కసారిగా పేటికలో నుంచి బైటకు వచ్చి 'I am Damned by a Just Judgement' అని అరుస్తాడు – ఈ చిత్రాన్ని చూసి

బైరన్ చలించిపోతాడు. కన్నీళ్ల పర్యంతం అవుతాడు. అతని స్నేహితులు ఎంతో గౌరవ సూచకంగా తమ గుర్రాల మీద దూరంగా వెళ్లి అతనికోసం వేచివుంటారు.

చిట్టచివరికి నవంబరు 4 న, బైరన్, హాబ్ హౌస్, వెనీస్‌కు ప్రయాణమవుతారు. బ్రాసియా దాటి, వెరోనా ద్వారా ప్రయాణం! బైరన్‌కి చాలా ఆనందం కలుగుతుంది. వెరోనా! ఇది జూలియట్ జ్ఞాపకాలు మోసుకొస్తుంది – వెనీజియా ఒక రాత్రి గండోలా ప్రయాణం. చీకటి ఆకాశం క్రింద – ఒక్కసారిగా వెనీస్ దీపాల వెలుగు! వారి గండోలా తెడ్లు మోత. ప్రతిధ్వని వినిపిస్తుంది. రియాల్టో అని అరుస్తాడు పడవవాడు. అది రియాల్టో బ్రిడ్జి!

మరి కొంతసేపట్లో గ్రాండ్ కానల్ మీద వున్న హోటల్ డిగ్రాండీ బ్రెటానీ లోకి అడుగుపెడతాడు. మేడమీదికి అద్భుతమైన మెట్లు, పాలరాతి మెట్లు ఎక్కుతూ తమ గదుల్లోకి ప్రవేశిస్తారు. సిల్కు తెరలతో పూలరంగులతో రమణీయంగా వుంటాయి గదులు.



వెనీజియా గండోలా

XXVIII

అద్భుత నగరి


(1816-1818)

“నేను ఆశించినట్లే వెనీస్ నాకెంతో నచ్చింది. కొన్ని ప్రదేశాలు మనకు, చూడకముందే పరిచయం వుంటాయి! ఈ నగరం నా ఊహల్లో ఎప్పుడూ వెన్నాడుతూనే వుంటుంది. తూర్పుదేశాల మాదిరిగా. వీరి దిగులుగా కనిపించే గండోలాలలోని విచార వాతావరణం, ఇక్కడి కాలువలలో కదిలే నిశ్శబ్దమైన అలలకెరటాలు! ఇప్పటికే శిథిలమవుతున్న నగర శోభను నేను అభినందించలేకపోతున్నాను. వెనీస్ అందాల రంగు రుచీ మాసిపోతున్నాయని బాధగావుంది. అయినా ఇంకా చాలా మిగిలివుందిలే. త్వరలోనే కార్నివాల్ సందడి రాబోతోంది కూడా” అని తన ప్రచురణకర్త ముర్రేకి రాస్తాడు!

“ఇక్కడ శీతాకాలం వరకూ వుండిపోవాలని నాకు కోరిక. ఇంతవరకు తూర్పు ప్రాంతాల తర్వాత నా ఊహలలో పచ్చగా మిగిలిపోయిన ద్వీపం! వెనీస్!! నాకేమాత్రం నిరాశ కలగలేదు! నాకు చిన్నప్పటినుంచి శిథిలాల మధ్య జీవించటం అలవాటయిపోయింది కదా!” అని మూర్‌కు రాస్తాడు కాస్త బాధగా!

అతనికి వెనీస్ యాస ఎంతగానో నచ్చింది. భవనాల రంగులు బొంగురుగా వింతగా గురకతో మాట్లాడుతున్నట్లుండేవి!

గులాబి రంగు పాలరాయి ‘పలాజీ’లో పరచుకుని వింతగా వుండేది. అన్నింటికంటే గండోలాల నల్లటి రంగు – మెరిసిపోతూ అది అంత్యక్రియలకు సాగిపోతున్నట్లు ఎంతో ‘రమణీయంగా’ ఉంటుంది!



బైరన్ లైబ్రరీ

ఒక్కసారి ఈ వీధుల్లో తిరిగితే చాలు – మర్చంట్ ఆఫ్ వెనీస్ – మూర్, పోర్షియా డెస్‌డొమానా షేక్స్పియర్, అందలి ప్రేతాలు మన వెంటనే వుంటాయి!

అతని అవిటితనం – ఇక్కడ ఎక్కువగా నడవవలసిన పని లేదుగా. అంతా పడవల ప్రయాణం! అతన్ని ఎక్కువ ఇబ్బంది పెట్టేది కాదు! ఇప్పుడు వెనీస్ స్వతంత్ర పాలన లేదు. రెక్కల సింహాలు – ఇప్పుడు –

ఇక్కడి కౌన్సిల్‌ను, సెయింట్ మార్క్‌ను కాపలా కాయటం లేదు!

బూసెంటూర్‌ను ఫ్రెంచ్ దళాలు తగలబెట్టాయి!

మిలన్ నుంచి ఆస్ట్రియా గవర్నరే పాలిస్తున్నాడు!

ఇన్ని జరిగినా ఈ పట్నం – తన సరదాలు పండుగలు మానుకోలేదు. సందడిగా సంబరంగా నడిచిపోతుంది ఇక్కడి జీవితం!

వెనీస్‌లో ఎనిమిది నాటక శాలలున్నాయి. అవి లండన్, పారిస్‌లో వున్నవాటికంటే ఎక్కువ! ఇక్కడి ఇటాలియన్లు – కౌంటెస్ ఆఫ్ బ్రిజిని చాలా తొందర్లోనే – లార్డ్ బైరన్‌కు పరిచయం చేశారు. 'చాలా కీర్తి గడించిన కవి'గా పరిచయం చేశారు. వీరందరూ కలవటానికి 'కన్వర్‌జేషన్' అని ఒక ప్రదేశం వుందికూడా!

డిశంబరు 4 వ తారీఖున – హాబ్ హౌస్ రోమ్‌కు ప్రయాణమయ్యాడు. బైరన్ వెనీస్‌లోనే వుండిపోయాడు. అతనికి వెనీస్‌లో మంచి భవనంతోపాటు ఒక ప్రియురాలు కూడా లభించింది. అ యింటి యజమాని భార్య ఆమె! ఆ యజమానికి ఒక బట్టల దుకాణం వుంది. అది అంతంతమాత్రంగా నడుస్తోంది. 'సైనార్ సెగాట' అతని పేరు! అతని భార్య యౌవనవతి – సౌందర్యవతి! చక్కగా పాడగలదు. ఆమె మధురమైన కంఠస్వరం మూలంగానే, ఆమెకు, ఆమె భర్తకు వెనీస్ ధనికుల సాంగత్యం లభించింది. ఆమె మేరియానా! బైరన్ ఒడిలో వాలిపోవటానికి ఎక్కువ రోజుల అవసరం లేకపోయింది. పైగా మీరే నా మొదటి ప్రియుడు అని కితాబు కూడా ఇచ్చింది! ఆమెకు వెనీస్‌లో రసికురాలిగా మంచి పేరే వుంది!

బైరన్ తను ఆ నివాసంలోకి వచ్చిన మొదటి వారంలోనే ఆమెను ప్రేమించాడు. ఎంతో రాశాడు. ఆమె సాంగత్యం అతనికి గొప్ప సుఖాన్ని ఇచ్చేది. ఇంకా ఇరవయి రెండేళ్లు కూడా లేవు. చక్కని చిక్కని కళ్లు. నల్లని వత్తైన జుత్తు – చైతన్యంతో వెలిగిపోయే వదనం ఇంకా చాలాచాలా వున్నాయి"

ఆమె అతనికి వెనీస్ యాస నేర్పింది. ఎప్పుడు కావాలంటే అప్పుడు సంభోగ సుఖాన్ని అందించింది. అతని ఉద్వేగానికి చక్కగా ఒదిగిపోయింది. పైగా ఎటువంటి మేథోపరమైన బరువు అతనిపై మోపేది కాదు.

అతను తన పెంపుడు జంతువును ప్రేమించినట్లు ఆమెను ఎంతగానో ప్రేమించాడు, గారాము చేశాడు. అతనికి అన్నివిధాలా లొంగిపోయిన ఆమె ప్రేమ పాత్రమైన సహచరి! ఆమె సాంగత్యంలో అతను ప్రశాంతత పొందగలిగాడు. ఉద్వేగాలు, విచారాలు, బాధలు, బరువులు అంతర్లీనంగా అణగిపోయాయి.

ఆల్ప్స్ పర్వతాలు 'మాన్‌ఫ్రెడ్' రచన ఇటలీ చైతన్యం – ఇవన్నీ కలసి అతని అంతరంగాన్ని అతనికి దర్శింపజేశాయి. ఇప్పటివరకూ తనలోనికి చూడటానికే భయపడేవాడు.

కనీసం అతని బాధలు వ్యథలు పూర్తిగా తొలగిపోకపోతే, ఇంతకు పూర్వంలా వాటిలోనే సుఖాన్ని వెదకటం మానివేసాడు. ఇది నిజంగా అతనికి చాలా గొప్ప ముందడుగు అనుకోవాలి!

తన ప్రియురాలి లాటిన్ బూతులు అతని చెవుల్లో మోగుతుంటే, అతనికి ఒక వింత శాంతి లభించేది. తన శరీర శ్రమకు – ప్రతి సాయంత్రం గుర్రపు స్వారీకి వెళ్లేవాడు. అడ్రియాటిక్ సముద్రపుటలలు గుర్రాల గిట్టలను తాకుతుంటే అతనికి ఎంతో అలసట, అందులోనే ఆనందం!

అక్కడే గండోలాలో తిరుగుతూ చర్చి ఫాదర్లను స్నేహం చేసుకున్నాడు. ఫాదర్ పాస్కల్, ఇంగ్లీషు ఆర్మీనియన్ భాషలో మాట్లాడుతుంటే చర్చి అందాలు, పూల అద్దాల అందాలు చూస్తుండేవాడు.

ఎందుకు ఇదంతా? "నా మేథకు ఏదో సంచలనం కావాలి. గడ్డకట్టిన బద్ధకం పగిలిపోవాలి. ఇక్కడ నాకు తెలిసి వచ్చింది ఏమిటంటే ఈ చిన్ని చిన్ని ఆనందాలు ఇవన్నీ నేను ఎంచుకున్నవి. నన్ను నేను హింసించుకుని చైతన్యంలోకి రావాలని!?

'ఇక్కడ ఎన్నాళ్లుంటారు' అని అడిగేవారు చర్చి ఫాదర్లు. ఈ శీతాకాలం వరకూ, మేరియానా, ఆర్మీనియా పాఠాలు తనను అంతవరకూ జాగ్రత్తగా చూడాలి. వీరితో మాట్లాడటం ఆనందం! వీరి ఏకాంతం, వారి ప్రాపంచిక విషయాలపట్ల నిరాసక్తత, వారి ప్రశాంతత అతనికి ఎంతగానో నచ్చాయి. ఫాదర్ ఆచర్ ఈ ప్రదేశం "నేలమీద స్వర్గం" అని వర్ణించాడు. అది, బైరన్ వెదికే స్వర్గం ఎక్కడుందీ, ఆ దేవునికి తెలియాలి! ఇక్కడే వెనీస్‌లో వుందా? ఒక్కోసారి అలాగే అనుకునేవాడు.

ఈ గండోలాలు, ఈ గుర్రపు స్వారీలు ఈ ఆర్మీనియన్ పాఠాలు – అన్నింటినీమించి మేరియానా కౌగిళ్లు – ఇవన్నీ అతనికి గొప్ప శత్రువైన 'బద్ధకాన్ని' అల్లంత దూరంలో ఉంచుతున్నాయి.

సాయంత్రాలు చిన్ని సభలు జరుగుతుండేవి. వెనీస్ పౌరులు అతన్ని తమ నగరానికి అలంకారంగా ఒక ఆస్థిగా భావించి అన్ని సమావేశాలకు ఆహ్వానం పంపుతున్నారు. 'డివైన్ కామిడీ' చదవటం మూలంగా, ఏథెన్సులోని నికోలా గిరాడ్ నేర్పిన ఇటలీ భాష అతనికి ఎంతగానో ఉపయోగం ఉంది.

ఇతర భాషలు నేర్చాను - అదే కారణం - అపరిచితులు - నన్ను అపరిచితునిగా చూడటంలేదు!

ఒక సంవత్సరం క్రితం, గ్రీసులో వున్నపుడు మాదిరిగా, తన అస్తిత్వాన్ని వదులుకుని, తన సొంత గడ్డ వాసనలు మాపుకుని ఇంగ్లీషు యాత్రికులు వేటాడే చూపులను తప్పించుకుని తన మనసులోని ఇంగ్లీషు చట్టాలను మరచిపోగలుగుతున్నాడు!

కిన్నార్డ్‌కు రాస్తాడు - ఇప్పుడు నేను వున్న తీరులోనే వుండగలిగితే నేను సంతోషంగా వుండటమేకాదు సంతృప్తిగా కూడా వున్నట్టే! నా ఉద్దేశ్యంలో ఈ సంతృప్తిని సాధించటం చాలా కష్టమైన వ్యవహారం! సంతోషంగా వుండటం తేలికయిన పనే! పుస్తకాలున్నాయి - చక్కని దేశం! అన్నీ సమకూరాయి కూడా. ఇక్కడి భాష ఎంతో మధురమైనది. ఇవన్ని జీవితావసరాలే కాదు - సరదాలు కూడా. నాకెంతవరకు కావాలో అంతలోనే స్నేహితులు - హితులు! అన్నింటినీ మించి అందమైన ప్రేమికురాలు. ఎప్పుడూ నన్ను ఉత్సాహపరుస్తుంది. ఎటువంటి మూర్ఖత్వం ప్రదర్శించకుండా నన్ను జాగ్రత్తగా చూసుకుంటుంది. ఈ జీవితంలో ఇంకా నేను చూడవలసింది ఏముంది? నేను లోనుకాని - అనుభవించనిది పంచుకోవటానికి ఏమి మిగిలింది? నా అదృష్టంతో తగవులాడటం చిలిపిగా వుంటుంది. అది ఎక్కువకాలం నిలబడలేదు కూడా. అదికూడా నా తప్పిదమే. ఇలాంటి వర్తమానంలో నుంచి భూతకాలంలోకి రానా? ఇక నువ్వు నన్ను గతకాలపు చిహ్నంగానే భావించవచ్చు! ఎందుకంటే ఇక నా అంతట నేను ఆ "ఇరుకు, చిన్న ద్వీపం" (ఇంగ్లండు)లో జీవించటం జరగదు" అని ముగించాడు!

కార్నివాల్ రానేవచ్చింది. వెనీస్‌లో అది చాలా పెద్దపండుగ! అన్ని మాయలు, మంత్రాలు, మర్మాలు ఇప్పుడే జరిగిపోతాయి. ఇది వెనీస్ మొగుళ్లకు మింగుడుపడదు. కాని ప్రియులకు ఎంతో ఉత్సాహం! ఆడవారు పాపభీతి పశ్చాత్తాపాలు మూటగట్టి మూలపెడతారు!

బైరన్‌కు ఇప్పుడే ఈ వెనీస్ నల్ల కళ్ల సుందరీమణులు అర్థమవుతున్నారు. వీళ్లందరికీ ఒక ప్రియుడు తప్పనిసరిగా వుంటాడు. ఈ 'కార్నివాల్' సమయంలోనే ఆ ప్రియుణ్ణి మార్చివేస్తారు. వారు ధరించిన ముసుగులమాటున అలవోకగా! మారియానా మాత్రం తన ఇంగ్లీషు ప్రియుణ్ణి అలాగే వుంచుకుంది!

వెలిగిపోయే రంగుల దుస్తులు – తుర్కులు – జూస్, గ్రీకు, రోమను అందరూ – నల్లగా మెరిసిపోయే శవపేటికల్లాంటి గండోలాలలో తిరుగుతుంటాయి.

బైరన్ ఈ సంగీత నృత్యరీతుల జీవితానికి పూర్తిగా లొంగిపోయాడు. అతడు మూర్‌కు రాసిన వుత్తరాల్లో వెనీస్ గిటార్లు మోగుతున్నాయి.

అరె – మూర్ ఏం చేస్తున్నావు? ఇప్పుడు–
ఇప్పుడేం చేస్తున్నావు–
ఓ థామస్ మూర్ – ఇప్పుడు!
నిట్టూరుస్తున్నావా – ఇప్పుడు –
పాడుతున్నారా – ఎవరికైనా వలలు వేస్తున్నావా ఇప్పుడు–
థామస్‌మూర్ ఏం చూస్తున్నావు?
ఇక్కడ కార్నివాల్ వస్తోంది–
ఓ థామస్ మూర్–
కార్నివాల్ వస్తోంది–
ముసుగులు – ముసిముసినవ్వులు–
ముద్దులు – మద్దెళ్లు–
గిటార్లు – తంత్రులు ఇప్పుడు–
ఓ థామస్ మూర్ – ఇప్పుడు! కార్నివాల్ వస్తోంది...


కార్నివాల్

ఇక్కడి చీకటి వీథుల్లో పాటలు, ముద్దులు, తెల్లవార్లూ సాగుతూనే వున్నాయి. రాత్రంతా మారియానా, బైరన్ తిరుగుతూనే వున్నారు. ఇలా కొన్ని రోజులు దొర్లిపోయాయి.

అలసిపోయిన బైరన్ జ్వరం పాలయ్యాడు. ఆరోగ్యం క్షీణించిపోతోంది!

మళ్లీ మలేరియానా? పాట్రోస్‌లో తనను దాదాపు మృత్యుముఖంలోకి తోసిన జ్వరమా?

లేక వార్ధక్యమా? అప్పుడే? ఇప్పుడేగా 29 ఏళ్లు నిండాయి! మరియానా కోసం మధురమైన కవితలు రాస్తాడు!



వెనీస్ ముసుగు

"...ఇక పడవలో తిరుగుడు వద్దు–
అపరాత్రి – అర్ధరాత్రి వద్దు–
మనసులో ప్రేమ వున్నా–
చంద్రుడు – వెలిగిపోతున్నా–
వరదలయిపోతుంది
ఖడ్గం మెరుస్తూనే వుంటుంది.
గుబ్బలు జారినా గుండె వెలిగిపోతూ వుంటుంది–
హృదయం కాసేపు ఆగాలి – గాలి పీల్చుకోవాలి–
ప్రేమకూ విశ్రాంతి కావాలి–
రాత్రి ప్రేమకోసమే వున్నా–
ఉదయం రానే వస్తుంది.
అందుకే – ఇక పడవలో తిరగవద్దు.
అపరాత్రి – అర్ధరాత్రి! వెన్నెల్లోకూడా!..."

అతను ఈ రోజులన్నీ, పడకమీదే గడిపివేయాల్సి వచ్చింది. జ్వరపు సంధిలో మళ్లీ గతకాలపు జ్ఞాపకాలు అతన్ని ప్రమాదకరంగా వెంటాడాయి.

అగస్టాకు ఏమయింది? ఆమె వుత్తరాలేమో – ఏమాత్రం అర్థం లేకుండా వున్నాయే– "నీకు వుత్తరాలన్ని అందుతున్నాయి. నీ బాధలు అన్ని నర్మగర్భంగానే వుంటున్నాయి. ఇప్పుడయినా నీ రహస్యాలు చెప్పాల్సిన అవసరం వుంది. లేడీ బైరన్ దయ – కారుణ్యం ఎలా వర్ణించను?...

"నిన్ను నువ్వు నిందించుకోవడం మానివేయి – నీ మర్మాలన్నీ వివరించాల్సిన సమయం..."

ఇవీ ఆమె రాతలు!

జ్వరంతోనే 'మాన్‌ఫ్రెడ్' మూడోభాగం పూర్తిచేశాడు. మాన్‌ఫ్రెడ్‌ను మృత్యుముఖంలోకి తీసుకు వస్తాడు. మృత్యువుతో సంభాషిస్తాడు.

తను చర్చి ఫాదరుతో జరిపిన సంభాషణలు చోటుచేసుకొంటాయి.

'బిడ్డా – నీకు క్షమాపణ – పశ్చాత్తాపమే,
దండన లేదు – గతకాలం గుర్తులు–
మతం – వెసులుబాటు – విశ్వాసం –
ఆ శక్తి నాకిచ్చాయి–
పాపపుణ్యాలు దేవునికి వదిలి –
ఆయన తరపున నిన్ను ప్రేమిస్తున్నాను"

దీనికి మాన్‌ఫ్రెడ్:

ఓ ముసలివాడా – నీకెలాంటి శక్తి లేదు–
నీ ప్రార్థనలో – మంత్రాములేదు, పవిత్రత లేదు.
పశ్చాత్తాపం – ఉపవాసం – ప్రార్థనలు –
ఇవన్నీ – నిరాశలోని దుఃఖాన్ని చూపవు–
నరకమంటే భయంలేని వేదన!
అదే చాలు – మరో లోకం – మరో స్వర్గం ఎందుకు?
పాపాలు – తప్పులు – కక్షలు సాధింపులు,

అన్నీ తనమీదే – భవిష్యత్తు బాధ లేదు–

తన ఆత్మను తనే కాల్చుకోగలడు!!

చివరి భాగంలో నరకం నుంచి వచ్చిన భూతాలు–

మాన్‌ఫ్రెడ్‌ను తమతో తీసుకుపోవాలని ప్రయత్నిస్తాయి!

కాని అతను వాటిని త్రిప్పికొడతాడు–

పొండి నరకానికి!

నా మీద మీకెలాంటి అధికారం లేదు–

మీరు నన్ను ఆవహించలేరు – ఇది నాకు

తెలుసు – పొండి నరకానికి–

నేను చేసింది చేశాను – అది నేనే భరిస్తాను–

నేను మీకు ఆహారాన్ని కాదు–

నా మీద మరణఛ్ఛాయ వుంది – మీది కాదు!!

ఆ విధంగా షెల్లీ ప్రభావంతో ఈ అధివాస్తవిక ప్రతిబింబాలను ఆహ్వానించి – బైరన్ మొదటిసారిగా, తన దుష్కర్మ సంజాతపు పాప పంకిలాన్ని వదిలించుకోలేక రాజీపడటానికి సిద్ధమవుతాడు. ఈ అనుమానపు సిద్ధాంతంలో నరకమూ–స్వర్గమూ వుండవు. వాటి ఉనికిని గుర్తించబడదు!!

దీని పర్యవసానం బైరన్ పరిష్కారం! ఈ వ్యవస్థకు పూర్తిగా తనే కేంద్రబిందువు. తన కోపతాపాలు తనవే – బైరన్‌ను – బైరన్నే పునీతం చేస్తాడు. బైరన్ కేవలం బైరన్ మాత్రం తనను నాశనం చేసుకోగలడు. మరో లోకంలో కూడా ఈ బైరన్ మాత్రమే ఉంటాడు! నరకం వుంది. కాని అది తన చిన్నతనంలో మేరీ గ్రే చదివిన నరకం కాదు. ఇది మనలోనే తనలోనే వుంది. ఈ జీవులంతా తమంత తాము అందులో దూకుతారు – మునిగిపోతారు.

"ఓ ముసలివాడా! చనిపోవటం కష్టంకాదు!" ఇవి మాన్‌ఫ్రెడ్ చివరి మాటలు – ఆఖరి ఆక్రందన!! ఇందులోనే 'మాన్‌ఫ్రెడ్' కవితలోని ఆత్మ వుంది. మనుషులందరూ మరణానికి భయపడరు. కొంతమందికి ఆ భయం వుంటుంది. ఎందుకంటే వారికి ఈ జీవితంపట్ల ప్రేమ! మరికొందరికి భవిష్యత్తు అంటే భయం. కాని మానవ మనుగడే గొప్ప సంఘర్షణ. అంతస్సంఘర్షణ! అది ఎప్పటికీ అంతం కాదు. ఎవరికి ఈ మరణం ఒక వరంలా కనిపిస్తుంది? అలాంటివారిలో బైరన్ మొదటివాడు. ఈ జీవన సంఘర్షణ నుంచి పారిపోయే పిరికిపంద కాడు. అతని ఆలోచనలో ఎప్పుడూ తన 'అంతం' వుంటుంది. ఒక ప్రక్క ఈ 'కార్నివాల్' పండగ వాతావరణంలో కూడా! ఈ రంగురంగుల వెనీషియన్ భవనాల నీడల్లో తన న్యూస్టెడ్ బూడిదరంగు గోడల నీడల్లో ఈ మరణ మృదంగం మ్రోగుతూనే వుంది!!

ఈ మూడో భాగం రాయటానికి చాలా యాతనపడవలసి వచ్చింది. మొదటి ప్రతిని ముర్రేకి పంపాడు. అతని స్నేహితులు అది చాలా రసహీనంగా వుందన్నారు. దానినే మళ్లీ తిరగరాశాడు. చిట్టచివరికి ఈ డ్రామా ఇంగ్లాండులో జూన్ 1817లో ప్రచురణ పొందింది. దీనివల్ల అగస్టాకు మేలేమీ జరగలేదు. బైరన్ కవితలో ఆమె పూర్తిగా బైటపడింది. "ఇంతకంటే స్పష్టంగా రాయటానికి ఇంకా అక్షరాలేవి" అంది విలియర్స్! అప్పటి వార్తాపత్రికల్లో 'మాన్‌ఫ్రెడ్' గురించి దానిలోని వ్యక్తుల గురించి వివరంగా విమర్శలున్నాయి. అమాయకురాలు అగస్టా తన మరదల్ని సలహా అడుగుతుంది. "ఎవరైనా నన్ను 'మాన్‌ఫ్రెడ్' గురించి అడిగితే ఏమిచెప్పను?" అంటూ!

'కేవలం 'మాన్‌ఫ్రెడ్' గురించి మాట్లాడు' అని హుకూం జారీ చేస్తుంది అనబెల్లా! నీ అనంగీకారం స్పష్టంగా తెలియజేయి – అని కూడా అంటుంది.

వసంతం వచ్చేసరికి బైరన్ ఆరోగ్యం కాస్త కుదుటపడుతుంది. వైద్యుల సలహా స్థల మార్పు కావాలి. ఇంతకంటే మెరుగైన వాతావరణం మంచిది.

ఆరోగ్యం బాగుపడుతుందని గట్టిగా చెప్తారు. అప్పటికి అయిదు మాసాలుగా రోమ్‌లో పురావస్తు సేకరణలో వున్న హాబ్ హౌస్ తన మిత్రుణ్ణి తన దగ్గరకు రమ్మంటాడు. ముందు బైరన్ తటపటాయిస్తాడు. అప్పటికి అతని అనారోగ్యంలో ఎంతో సేవచేసిన మేరియానాని వదలాలంటే కష్టమే! ఒక స్త్రీ అంతఃకరణ రమణీయత అతని ప్రేమను చిగురింపజేయాలని ఒక పిచ్చి ఆలోచన! మేరియానా అతని ఆశలకు దగ్గరగా వస్తుందా? తను కోరుకునే 'beau ideal' ఈమేనా? ఏది ఏమైనా రోమ్ ప్రయాణంలో తన 'చైల్డ్ హెరాల్డ్' నాలుగో భాగం రాయవచ్చు. అందుకని, డాక్టర్ల సలహా పాటించాలని నిర్ణయిస్తాడు.

ఫెర్రారా (Ferrara) ద్వారా ప్రయాణం సాగుతుంది. The Lament of Jasso రాస్తాడు – (Ariosto) ఆరియస్టో సమాధిని దర్శిస్తాడు. అక్కడ నుంచి ఫ్లారెన్సు దాటి రోమ్ మార్గంలో ప్రయాణం చేస్తాడు.

రోమ్ : రోమ్‌లో బైరన్ ఎప్పుడూ రెండు జీవితాలను గడిపేవాడు. ఒకటి బైరన్ రెండోది 'చైల్డ్ హెరాల్డ్'!

బైరన్ – ఎక్కువగా గుర్రపు స్వారీ చేస్తూ రోమ్ చూసేవాడు. 'మాన్‌ఫ్రెడ్' మళ్లీ మళ్లీ సరిచూసేవాడు. ఎందుకంటే ముర్రే – ఎంతవరకూ అంగీకరించేవాడు కాదు. బైరన్, మూర్‌కు రాసేవాడు. రోమ్‌లో ఏమీ చూడలేదు. రోమ్‌ను ఎలా వర్ణించాలి – అది పర్యాటకులకు అవసరమైన 'గైడ్‌బుక్' లాగానే వుంది. రాత్రి లార్డ్ లాన్స్‌డేనీతో విందులో పాల్గొన్నాను. ఇక్కడ ఇంగ్లీషువాళ్లు తక్కువే–

రోజంతా గుర్రం మీదే తిరుగుతున్నాను. ఇక్కడకు వచ్చిన దగ్గర్నుంచీ అంతే– రోమ్ – కాన్‌స్టాంటికు పెద్దక్కలాంటిది. అంతకంటే అందంగా వుంటుంది. కలోసియంకు – పాంతియాన్, వాటికన్, సెయింట్ పీటర్ – అన్నీ అన్నీ తిరిగాను. చెప్పానుకదా 'గైడ్‌బుక్' అని! ఇవేమీ మనకు అర్థంకావు. చూడాల్సిందే! బ్రతికివున్న పోప్‌ను – చనిపోయిన కార్డినల్‌ను చూశాను. ఇద్దరికీ

పెద్ద తేడా ఏమీలేదు! "అరె – ఇప్పుడే హాబ్ హౌస్ వస్తున్నాడు.. నేను గుర్రం దిగాలి – campus martiusలో దిగాలి".... ఇవీ అతని వుత్తరాలు!

రోమ్‌లోని శిల్పి – తోర్‌వాల్డ్ సేన్ (Thorwaldsen) బైరన్ శిల్పాన్ని తయారు చేయటానికి, అదీ జమీందారిణి ఆల్‌బ్రిడ్జి సిఫారసు చేస్తే, బైరన్ కొన్నాళ్లు కూర్చున్నాడు. ఆ శిల్పి 'బైరన్ – చైల్డ్ హెరాల్డ్' చక్కగా మిళితం చేసి శిల్పంగా తయారు చేశాడు. శిల్పి ముందు కూర్చున్నప్పుడు – అతను చాలా భిన్నమైన శైలిలో వుండేవాడు.

'మీరు కదలకుండా వుండలేరా? అంత చిరాకుగా ఉంటారే?' అని శిల్పి అడిగాడు.


'ఇదే నా సహజమైన వ్యక్తీకరణ' అనేవాడు బైరన్.

అంతా అయిన తర్వాత– "నా ముఖం ఇంకా విచారంగా వుండాలే?" అంటాడు. చైల్డ్ హెరాల్డ్ రాయటానికి రోమ్ ఎంతో అనుకూలమైన వాతావరణం సమకూరుస్తుంది! ఇంతకంటే ప్రపంచంలో అద్భుతమైన నేపథ్యాలు బైరన్ కథనాలకు ఎవ్వరు ఇవ్వగలరు?

మహోన్నతమూ అధ్వాన్నమూ, శిథిలము – సౌందర్యమూ నిద్రాణమూ – చైతన్యవంతం, ప్రశాంతమైన ప్రదేశాలు అన్నిచోట్లా, ఎటు తిరిగితే అటు కనిపించేవి!

సిసిలియా మెటెల్లా (Cecilia Metella) సమాధి మీద – కూర్చొని ధ్యానం చేస్తాడు!!

అరె – ఎవ్వరీమె – ఇక్కడ చనిపోయింది?
ఈ మహల్లో సమాధి? ఆమె అందగత్తేనా, పవిత్రురాలా?
రాజుకు సరిజోడా? ఈ రోమ్ అందుకు పాన్పా?
ఎలాంటి హీరోలను – ఆమె భరించింది?
ఆమె వయసులో చనిపోయిందా?



సంతానాన్ని, బంధువుల్ని - అందాల్ని వదిలి?
వెండి జుత్తు - నెరిసిన జుత్తు పొడవాటి జుత్తు?!

ఈ చనిపోయిన అపరిచితురాలి మృతిపట్ల అతని ఉద్వేగం గుండెలు కరిగించేది- ఆ తరువాత Palatine శిథిలాలపై అతడు కలలు కన్నాడు. అప్పుడు రాత్రి పక్షులు పరస్పరం పిలుచుకుంటున్నాయి. సతత హరిత లతలు చుట్టుకొంటున్న శిథిల శిల్పాలను, ఒకప్పటి రాజాధిరాజులు సౌధాలను చూసి...


> ***"..ఇదీ మానవజాతికి నీతికథ!***
> ***అరె ఇది ఎప్పుడూ పునరావృతం అవుతుందే-***
> ***ముందు - స్వాతంత్ర్యం, తరువాత కీర్తి, తరువాత,***
> ***సంపద - దుర్మార్గం - అవినీతి, రాక్షసత్వం - చివరగా!***
> ***ఇక చరిత్ర - ఎంత విస్తృతమైనా,***
> ***ఒక పుట మాత్రమే- అది ఇక్కడ రాసిందే-***
> ***నిరంకుశత్వం - సర్వ సంపదలు పోగుజేసి-***
> ***కనువిందు - వినసొంపు, మనిషి కోర్కెలన్నీ వెతికి వెలార్చి..***
> ***చరిత్ర ఒక పుట..."***

వాక్చాతుర్యమా? పదాటోపమా? వాటి అవసరం కూడా వుంటుంది కదా!

ఒక పున్నమి నాటి రాత్రి - ఆకాశం నిర్మలంగా వున్నపుడు - వెన్నెల వెలుగు నక్షత్రాల ధూళితో పడుతున్నప్పుడు కలోసియంలో నిలబడి - ఆ వర్తులాకారపు ఎత్తైన గోడల మీద అవే శిథిలమయిన గోడలమీద రెల్లుపూలు తెల్లగా, చిరుగాలికి కదులుతుంటే - అక్కడ అక్కడే నెత్తుటి మడుగులో బలి అయిపోయిన వీరులు తన ఆలోచనలలో అశాంతి రగిలిస్తుంటే బైరన్ - తన మృత్యుదేవతను ఆహ్వానించి - కాలంమీద అదే తనను కష్టాలపాలు చేసిన కర్కశమైన కాలం/శత్రువుల మీద కక్ష సాధించటానికి-

ఓ మరణమా – పాపపుణ్యాల తుల్యమానం తప్పకుండా,
నీకు – తమ ప్రాణాలతో రక్తంతో తర్పణజేశారు!
అగాధంలో నుంచి ఎలాంటి రాక్షసులను రప్పించలేదా –
ఓరెస్టెస్ వీడ్కోలుగా కీచుగొంతుతో శబ్దం చేయలేదూ –
అసహజమైన గౌరవానికి – న్యాయంగానే–
ఇప్పుడు మళ్లీ ఒకసారి లేచి వస్తావా?
ఈ ధూళిలో నుంచి – ఈ నెత్తుటి దుమ్ములో నుంచి లేచి రా!
ఓ మరణదేవతా, నాకోసం – నా కసి తీర్చాలి – లేచిరా!"

చైల్డ్ హెరాల్డ్ నాలుగో అధ్యాయం ఇంకా రాయలేదు. కాని అందుకు అవసరమైన సన్నివేశాలు పుష్కలంగా వున్నాయి. హాబ్ హౌస్ నేపుల్స్ వెళ్తున్నాడు. కొన్నాళ్లు వుండేందుకు. అతనితో బైరన్‌ను తీసుకెళ్లటానికి సంతోషంగా అంగీకరించేవాడు. కాని బైరన్, మేరియానాకు దూరమవటం విచారంగా వుంది. ఆమెను రోమ్ రమ్మని రాసి – వచ్చిన తరువాత ఆమెతో మళ్లీ వెనీస్ వెళ్లిపోతాడు.


రోమ్ కొలోసియమ్

అది వేసవి కాలం. వేడిగా వుంది. బైరన్‌కు జ్వరం భయం పట్టుకుంది. ఈ వేసవిలో వుండటానికి లామీరాలో ఒక భవనం అద్దెకు తీసుకున్నాడు. అది వెనీస్‌కు కొద్ది దూరంలో వుంది. అక్కడికే మేరియానా వచ్చి అతనితో వుండిపోయింది. ఆ భవనం ఒకప్పుడు ఒక కాన్వెంటు. అందులోని చర్చి మాయమైపోయింది. ఒక ఆర్చి కింద – బైటకు పొడుచుకువచ్చిన రాతిమీద ఈ విధంగా చెక్కి వుంది (లాటిన్)

HIC SAEPE LICEBIT
NUNC VETERUM LIBRIS
NUNC SOMNO ET INCERTIBUS HORIS
DUCERE SOLLICITAE
IUCUNDA OBLIVIA VITAE

జీవితపు తీపిగుర్తులు... వినపడుతున్న గంటలు...

ఇక్కడ ఇరుగు పొరుగూ మంచివారే. ఎదురుగా తొంభయిఏళ్ల మెక్సికన్ నివసిస్తున్నాడు. మరోప్రక్క ఫ్రెంచ్ పౌరుడు – వోల్టేరుతో పరిచయం వున్న పెద్దమనిషి! బ్రెంటా నీటిలో సూర్యాస్తమయాలు అద్భుతంగా వుంటాయి. హాబ్ హౌస్ నేవుల్స్ నుంచి బైరన్‌తో వుండటానికి వస్తాడు. ఇద్దరూ ఎంతో శ్రమించి చైల్డ్ హెరాల్డ్ నాలుగో అధ్యాయం పూర్తి చేస్తారు. హాబ్ హౌస్ అంటాడు. "బైరన్ చాలా ఉత్సాహంగా ఉన్నాడు. ప్రశాంతంగా – సౌఖ్యంగా సంతోషంగా రోజులు నడిచిపోతున్నాయి. ఈ రాత్రి కుటుంబ విషయాలు మాట్లాడాము. అతని భార్య గురించి అతనికి ధ్యాసే లేదు" అంటాడు.

ఇద్దరూ తరచుగా వెనీస్ లాగూనుకు లిడోకు వెళ్తారు పడవలో – అలలు లేచిపడుతుంటే హాబ్ హౌస్ కేరింతలు కొడతాడు.

జనవరి 2 బైరన్ పెళ్లిరోజు! ఈ తేదీకి చాలా ప్రాముఖ్యత ఉంది. 'చైల్డ్ హెరాల్డ్' నాలుగో అధ్యాయం హాబ్ హౌస్‌కు అంకితం ఇస్తాడు.

"హబ్ హౌస్" Erq. Am. FRS.... నాకు ఎప్పటి నుంచో తెలుసు. నా వెంట చాలా దూరం వచ్చాడు. నేను అనారోగ్యంతో వున్నప్పుడు, మెలకువగా వున్నప్పుడు, నేను విచారంలో వున్నప్పుడు ఎంతో దయతో చూశాడు. నా అభివృద్ధికి ఆనందిస్తాడు. నా మూర్ఖత్వాన్ని గట్టిగా వ్యతిరేకిస్తాడు. ఎప్పుడూ ఏమీ కోరడు" ఇదీ అంకితంలో రాసింది! మూడో అధ్యాయం షెల్లీ ప్రభావంతో రాసింది – చాలా కవితాత్మకంగా వుంది. ఎంతో రమణీయం వుంది. వెనీస్ అందాలన్ని గుదిగుచ్చి వున్నాయి. ప్రేమ గురించి, "ఓ ప్రేమా! నీకు ప్రపంచంలో చోటెక్కడ? నీవు కనిపించక పోయినా నమ్ముతానుగదా – ఆ నమ్మకంతోనే గుండెలు పగిలేది–

ప్రేమలో ఏది నిజమో – కోరికల్లో కూడా అదే నిజం!
మనిషి కోరికలన్నీ సహజంగా వుండవుకదా.
పరిపూర్ణత కోసం తాపత్రయ పడతాం – కాని
చెరపివేయలేని పాపపంకిలం అంటుకునే వుంటుంది.
గొప్పగొప్ప విషయాలకై కలలు కంటాము – కాని
మూర్ఖత్వానికి బలయిపోతాము..

ఇది బైరన్ విషయంలో ఎంతో ఆనందంగా రమణీయంగా సాగిపోవలసిన జీవితాన్ని – ఎలా నాశనం చేస్తుందో అనుభవించాడు–

"ఈ జీవితం వృథా అనుకోను–
నా ఆలోచనలు శక్తి తగ్గవచ్చు – రక్తంలో వేడి కూడా–
నా శరీరం బాధలను భరించటంలో కృశించిపోవచ్చు–
కాని – నాలో కష్టాన్ని, కాలాన్ని, జయించగల
శక్తి – నా తరవాత కూడా ప్రాణంతో వుంటుంది"

ప్రొమితియస్ లాగా అన్నింటినీ ఎదిరించగల గర్వాతిశయం!

మనిషి ఏమి చెయ్యగలడు – తన అశక్తతతో? ఏమీలేదు. ప్రకృతిలో తనకు కావలసిన ఆనందాన్ని వెతుక్కుంటాడు. అతనికి సమాజం అదే నిరాకరిస్తుంది. అదే ప్రకృతిలో అన్వేషిస్తాడు.

చివరిగా....

"....నా ఆటలు – ఆనందాలు నీతోనే – ఓ మహాసముద్రమా!
నీ అలలు – నీ నురుగులు – నా చిన్ననాటి నుంచీ –
కెరటాలు భయపెడితే అది ప్రియమైన భయమే–
అలాంటి ఉయ్యాలలోని పాపనే కదా – నీ బిడ్డనే–
నిన్నే నమ్మి దగ్గర దూర తీరాలలో–
నా శిరసు నీ పేరుమీదనే వాల్చానుకదా..."

ఆ విధంగా 'చైల్డ్ హెరాల్డ్' పూర్తి చేశాడు. లామిరాలో అయిదు నెలలు హాయిగా గడిచిపోయాయి. ఇంకా చాలా కవితలు రాశాడు–

'బెప్పో' - ఇది వెనీస్ కథ – దీనికి ప్రేరణ 'పుల్సి' కవిత. అది లార్డ్ కిన్నార్డ్ వెనీస్ వచ్చినపుడు బైరన్‌కు ఇస్తాడు. అది ఎంతగానో బైరన్‌కు ప్రేరణ కలిగిస్తుంది.

పుల్సి శైలిలో ఇంగ్లాండు మీద కవిత రాస్తాడు!

ఓ – ఇంగ్లాండ్ – నీ తప్పులెన్ని వున్నా – నిన్ను ప్రేమిస్తాను–

... ప్రభుత్వాన్ని, వాక్స్వాతంత్ర్యాన్ని–
చట్టాలను – మనకుపయోగపడినపుడే!
పార్లమెంటులో చర్చలు – అదీ త్వరగా ముగిసిపోతేనే!
... పన్నులు కూడా – మరీ ఎక్కువ కాకపోతే–
...ఇలా సాగిపోతుంది!!
చివరికి దేవుడు రాజును, చర్చిని, రక్షించుగాక!!

సైనోరాసెగటీ భార్య మారియానోతో బైరన్ ప్రేమ వ్యవహారం దాదాపు చివరికి వచ్చింది. ఇది మారియానా తప్పిదమే - బైరన్ ఆమెకిచ్చిన బహుమతులు - వజ్రాలు - వైఢూర్యాలు ఆమె అమ్మేసేది. అది తెలిసి బైరన్ అవి మళ్లీ కొని ఇచ్చేవాడు. ఈ అత్యాశ ఆమెను నాశనం చేసింది. ఈ చలికాలం ఈ ప్రేమికురాలు చాలా ప్రియమైపోయింది! అంతేకాదు - ఆమెకు అసూయ కూడా ఎక్కువైపోయింది. అంతలోనే అతనికి మార్గరీటా కోగ్ని అనే 22 ఏండ్ల పాటగత్తె పరిచయమయింది! ఆమె భర్త రొట్టెలు చేసేవాడు. పెళ్లయిన స్త్రీయే కదా, ప్రేమికుణ్ణి వుంచుకోవచ్చు! ఆమె అతన్ని - బైరన్ను ప్రేమించటానికి సిద్ధమేనని చెప్పింది. ఆమెకు చదువు లేదు - చాలా 'నేలబారుగా' వుంటుంది - బైరన్‌కు అలా వుంటేనే ఇష్టం! జనవరి 1818 చివరికి హాబ్ హౌస్ ఇంగ్లాండు వెళ్లటానికి సిద్ధపడతాడు. 'చైల్డ్ హెరాల్డ్' చివరి ప్రతిని తీసుకుని, తన ప్రియమైన స్నేహితుణ్ణి వదిలి ప్రయాణమవుతాడు. రాత్రి పన్నెండు గంటలకు - బైరన్ "నేను చాలా ఉద్వేగపరుణ్ణి పూర్వం - ఇప్పుడు తగ్గిపోయిందిలే" అంటాడు! హాబ్ హౌస్ "అవును, అతని మాటల్లో ఎంతో నిజం వుంది" అని అనుకుంటాడు.

ఎప్పుడైతే తనని నిశితంగా చూసేవాళ్లు లేరో - హాబ్ హౌస్ వెళ్లిపోవటంతో - బైరన్ విచ్చలవిడితనం పెరిగిపోతుంది. అతనికి స్వతంత్ర్యం చాలా ప్రమాదకరమైనది. ఆ తరువాతి కాలంలో చాలా దారుణంగా అతని నైతిక జీవితం దిగజారిపోతుంది. మొదటగా, ఈ దూర ప్రాంతంలో అతనికి ఎక్కడ లేని స్వేచ్ఛ, తనను తప్పుపట్టే సంఘం కాదు. అతను నిర్లక్ష్య వైఖరిని సర్దుకుపోయే పరివారం! రెండోది మరియానా మీద మోజు తగ్గిపోవడం, మార్గరీట్‌కొగ్ని - ఒక ఆటవిక ప్రకృతిగల ఆడది - అతనికి అవసరమైన రీతిలో నడుచుకోగలది- "పెద్ద నల్ల కళ్లు - పొడవాటి ఉంగరాల జుత్తు - ఎత్తైన దృఢమైన శరీరం - మిలమిలమెరిసే కళ్లు - వెన్నెల్లో నల్లగా మెరిసే జుట్టు - అరె, ఈమెతో ఏమయినా చేయించవచ్చు - చేతిలో చాకు పెడితే, ఎవరినైనా పొడిచివేస్తుంది. చివరికి నన్నుకూడా" అని మూర్‌కి రాస్తాడు! మూడోకారణం - అతనికి ఇప్పుడు ఆర్థిక సమస్యలు లేవు - పుస్తకాల విక్రయం మీద, న్యూస్టెడ్ అమ్మకం మీద - అనబెల్లా 50 పౌండ్లు అన్నీ కలిసి అతని ఖాతాలో

సొమ్ము దండిగా వుంది! కొన్ని విషయాల్లో తన అమ్మలాగానే, చిల్లర బంగారు నాణాలు పోగుచేసి పెట్టెలో పెట్టి ఆనందించేవాడు. ఇక్కడ పుకార్లు కూడా దండిగానే వుంటాయి – అతని విచ్చలవిడితనం – చివరికి "లార్డ్‌కి తొమ్మిదిమంది ఉంపుడుగత్తెలు" అని అనేవారు – ఇదికాస్త అతిగా చెప్పిందే. డాంటే – రావెనా వచ్చినపుడు "అతని గడ్డం నరకంలో కాలినట్టుందే..." అన్నారు కదా!

ఏప్రిల్ 1818లో లేడీ మెల్‌బోర్న్ మరణవార్త తెలుస్తుంది. "ఇప్పుడు మరణించిన వారి గురించి విచారించే సమయం దాటిపోయింది. లేడీ మెల్‌బోర్న్ చాలా గొప్ప వ్యక్తి – యుక్తవయసులో – తరువాత కూడా. ఇప్పటికే నాకు పీకలవరకూ కష్టాలున్నాయి" అని వాపోతాడు. "ఇప్పుడు, బాధ కూడా తెలియని తిమ్మిరి ఆవహించి వుంది" అంటాడు. "నాకు ఇంగ్లాండుతో మరో బంధం తెగిపోయింది" అని కూడా అంటాడు.

అనబెల్లా లాయరు సర్ సామ్యూల్ రోమెల్లీ – మెడ కోసుకుని ఆత్మహత్య చేసుకుంటాడు. ఇది కూడా బైరన్‌ను ఎంతగానో కదిలించి వేస్తుంది. రోమ్‌లోని *కలోసియం*లో మృత్యు దేవతను ఆవాహన చేసింది ఇందుకేనా – తనకు కీడు తలపెట్టిన వాటిని అంతం చేయటానికా?

ఇంగ్లండు నుంచి – షెల్లీ దగ్గర్నుంచి వుత్తరాలు వస్తాయి. క్లెయిర్‌కు ఆడబిడ్డ పుట్టిందని – కళ్లు – నోరు అన్ని బైరన్ పోలికలేనని, చంటిది ఎంతో అందంగా వుందని, పేరు పెట్టాలని ఉత్తరం రాస్తాడు. తన స్నేహితుల కష్టాలను, బాధ్యతలను షెల్లీ ఎప్పుడూ మోయటానికి అలవాటుపడే వుంటాడు!

లార్డ్ బైరన్ ఈ బిడ్డను పెంచటానికి ముందుగానే వాగ్దానం చేస్తాడు. ఆ విషయం షెల్లీ గుర్తు చేస్తాడు. బైరన్ తన రక్త సంబంధం చూడాలని ఉబలాటపడతాడు. షెల్లీ మిలన్ వచ్చినపుడు, స్విస్ నర్సు బైరన్ కూతుర్ని తీసుకు వస్తుంది. అప్పటికి ఆమెకు 'వెనీస్' పేరు అలెగ్రా అని పెడతాడు.

బైరన్ తన రక్తం పంచుకున్న బిడ్డను చూసి గర్వపడతాడు – అక్కడి ఆడవాళ్లందరూ పాపను ఇష్టపడతారు. అగస్టాకు రాస్తాడు! పాపకు లేడీ బైరన్ పోలికలెక్కువ వున్నాయి. అంతేకాదు 'అడా' పోలికలూ వున్నాయి. కాని చాలా హుషారుగా వుంది – అది తండ్రి లక్షణం!"

అతనికి మరో బైరన్‌ను చూడటం చాలా ఆనందంగా వుంది. జారజ అయినా!



రియాల్టో బ్రిడ్జి



వెనీస్ గ్రాండ్ కానెల్

XXIX

మోసినీగో పాలెస్

(1818)

డాన్ వాన్ – తన ఆత్మను తనే నాశనం

చేసుకుంటాడు !

"అయ్యా, మా యజమాని లార్డ్, ఈ ఉదయం పదిగంటలు మోగే సమయంలో ప్రాణాలు విడిచారు.

జ్వరం, ఆందోళన, సముద్రపు గాలి, ఆడవాళ్లు, ఎండలోపడి గుర్రపు స్వారీ – ఎంత చెప్పినా వినలేదు. ఇవన్నీ ఆయన మరణానికి కారణాలు – ఈ విషాద వార్త మీకు తెలియజేయటానికి దుఃఖంతో నా హృదయం బరువెక్కిపోతోంది.."

ఇదీ బైరన్ హాస్యం సగం, విచారం సగం కలబోసి (ఫ్లెచర్ సంతకంతో) హాబ్ హౌస్‌కు రాసిన లేఖ సారాంశం!

బైరన్ మేరియానాతో తెగతెంపులు చేసుకున్న తరువాత, ఇక ఆ ఇంట్లో వుండలేదు గ్రాండ్ కానల్‌లో – సంవత్సరానికి 4,800 ఫ్రాంక్‌ల అద్దెకు మోసినిగో పాలెస్ ఒకటి తీసుకుని అక్కడకు తన పరివారంతో మారిపోయాడు.

ఇప్పుడు వెనీస్‌లో తన ఇల్లు ప్రత్యేకంగా వుంది. నీటిలో తనకోసం గండోలా రంగురంగు కర్రలకు కట్టివుంది. ఆకుపచ్చని కెరటాలు మెట్లమీదకు దూకుతున్నాయి.

బైరన్ కోసం వచ్చే సందర్శకులకు ఆ మెట్ల మీదే గండోలా నడిపే టీటా పాల్సెరీ, భారీకాయుడు, బొ(రమీసాల వాడు దర్శనమిస్తాడు. ఇతను కూడా బలమైన తెడ్లు ఎక్కడ దొరుకుతాయో – బలహీనులైన భార్యలు ఎలా వలలో పడతారో బాగా తెలిసినవాడు!

బైరన్ భవనంలో నుంచి కుక్కల అరుపులు, కోతుల కిచకిచలు – పక్షుల కుహూకుహూలూ, వినపడుతుంటాయి. వీటన్నిటినీ మించి మార్గరీటా మధురమైన కంఠస్వరం పాటల్లో మార్మోగేది. అంతేనా? బైరన్ కూతురు అలెగ్రా సన్నని ఏడుపులు – కేకలు కూడా!

ఒకనాటి రాత్రి తన భవనం మెట్ల మీద గొడవ జరగటం చూశాడు. మార్గరీట తన భర్తతో తిరిగి రానని ఖచ్చితంగా చెప్పి పంపటం విన్నాడు. తనకోసం పడిచచ్చే వాళ్ళకోసం అతని బలహీనత తెలిసిందే. ఆమె ఇంట్లో ఎంత పెత్తనం చేసినా, పనివాళ్ళు చెంపలు వాయించినా, ఏమీ అనలేకపోతాడు. అతని ఖర్చులన్ని తగ్గించింది. అతని ఇంటికి తిరిగి వచ్చినపుడు ఆమె చూపే 'తీవ్రమైన ఆనందాన్ని', ఆమెను ఒక 'ఆడ పులి' లాగా అనిపించేది. ఇంత ఆటవిక జంతు లక్షణం అతనికి ఎంతో ఊరటనిచ్చేది. ఇలాంటి ముతక అనాగరిక శృంగారం అతన్ని, మేధోశ్రమ నుంచి సేదదీర్చేది. ఎందుకు? ఇప్పటి వరకు తన సున్నితమైన నాగరికత తనను కష్టాలపాలు చేసింది. దానితోనే ఇతరులకు కష్టాలు తెచ్చిపెట్టాడు కూడా! అతనికి నాగరకత అంటే అసహ్యం!

తన ప్రవాస జీవితం బైరన్‌కు ఎంతగానో కనువిప్పు కలిగించింది. తన జీవన సిద్ధాంతాన్ని మార్చివేసింది. 'మాన్‌ఫ్రెడ్' అతని చివరి తిరుగుబాటు కేక! ఒక వ్యక్తి గుండెల్లోంచి వెల్లువైన దుఃఖపు ఆక్రందన! కాని దానిని ఈ లోకం నిశ్శబ్దంగా మింగివేసింది!

'చైల్డ్ హెరాల్డ్'లో – బైరన్ యౌవనోద్రేకం, బాధాకరంగా అంతమయి పోయింది.

ఇప్పుడు కార్సెయిర్, లారా కవితల్ని నిశితంగా చేశాడు. ఇలాంటి అసంబద్ధమైన పాత్రలను పాఠకులు ఏ విధంగా జీర్ణించుకున్నారో అర్థం కాలేదు.

చాలాకాలంగా వోల్టేర్ రచనలే చదువుతున్నాడు. ఇక్కడ కూడా బైరన్‌కు తన నిరాశావాదమే ఎదురైంది. కాని దీనిలో ఒక చతురత వుంది.

మానవజాతి విధి, ప్రారబ్ధం చాలా విషాదం. ఆత్మను ఒక వ్యక్తితోనే గుర్తించి చూస్తే ఒథెల్లో, హామ్లెట్, వీటికి తార్కాణం వారి బాధలు - క్షోభ - ఖేదం అవి వారికే సొంతం!


కాని ఇదే వ్యవహారాన్ని జాగ్రత్తగా పరిశీలించేవారికి వారి మనసుల్లోని ఉల్లాసాన్ని గమనించి నవ్వుకోవచ్చేమో - ఈ భావోద్రేకాలు ఆరాటము, వింత వేదన కొంత సులువుగా మానవజాతి మొత్తానికి ఆపాదించవచ్చు!

బైరన్ ఎప్పుడు ఉత్తరాలు రాసినా, అతని వచనంలో కొంత హాస్యంపాలు ఉంటుంది.

సంవత్సరం నుంచి డాన్ వాన్ రాస్తున్నాడు. ఇప్పటికి అతనికి కొంత స్వేచ్ఛా ద్వారం కనిపించినట్లు - వోల్టేర్‌లోని నిరాశావాదాన్ని తనలోని హాస్యంపాలుతో రంగరించి ప్రపంచం మీదకు విరజల్లుతాడు!!

"... నా కవిత, మహాకావ్యం-
పన్నెండు భాగాలుగా, ప్రతి పుస్తకంలో యుద్ధం,
ప్రేమ, సముద్రపుటలలు, నౌకలు-
నౌకాధిపతులు - రాజులు, రాజ్యాధికారం.
కొత్త వ్యక్తులు - అధ్యాయాలు - మూడు-
నరకం దృశ్యాలు - అక్కడి వ్యవహారం-
వర్జిల్‌లాగా, హోమర్‌లాగా,
నా మహాకావ్యం - ఎవ్వరికీ తీసిపోదు.

అన్ని విషయాలు
కాలఖండంలో గుర్తిస్తాను,
అరిస్టోటెల్ సూత్రాల
ప్రకారం,
వచనం రాసి కవిత్వమనే
మూర్ఖులు
ఖాళీ పదాలు రాసి
కవిత్వమంటారు–
నాకు అంత్యప్రాస – లయ
ఇష్టం–
మంచి పనివాళ్లకు పనిముట్లు అవసరం–
ఇప్పుడు నాకు మార్మికమైన యంత్రాంగం వుంది.
ఇంకా – నా చుట్టూ అధివాస్తవిక సుందర ప్రాదేశికత...”



డాన్ వాన్

ఇంతకంటే ముందు బైరన్‌లో ఇంత స్పష్టంగా ఎప్పుడూ చెప్పలేదు – ఇప్పుడు అతని కవిత్వం – దాని రూపం చాలా ఆరోగ్యంగా, నర్మగర్భంగా వెలువడుతోంది. అతని శైలి Beppoని పోలి వుంది. అందులో వ్యంగ్యం తొంగిచూస్తోంది. ఆహార్యం అడుగున జీవన సిద్ధాంతం చేదు అనుభవాల పర్యవసానం స్పష్టంగా కనిపిస్తోంది.

ఇప్పటివరకూ లౌకిక సుగుణాలకు లొంగిపోయిన బైరన్ – ఈ ప్రవాస జీవితం ఒక ప్రశాంతత సంతరించిపెట్టింది. తీర్పు తన తీరులోనే వుంది! ఆక్రందనలు – ఆక్రోశాలు అణగిపోయాయి.

ఇప్పుడు బైరన్ చాలా కష్టంగా సున్నితంగా – అదీ వోల్టేరుకు భిన్నంగా దర్శనమిస్తున్నాడు. అతనిలోని వికాసవంతమైన మేథ – దాని చుట్టూ చీకటి తెరల్లా మాయదెయ్యాలు!

బైరన్‌కు తన పాపమేమిటో తెలుసు – కాని దానిలోని మార్మికతను నిలబెట్టుకున్నాడు. దాని పరిధి ఇప్పుడు మారిపోతుంది. అది కేవలం జార్జి గోర్డాన్,

లార్డ్ బైరన్‌దే కాదు – ఈ మార్మిక వికాస – విషాదం విధిలిఖితం – మానవజాతి మొత్తానిది – ఆ విధంగా అది విశ్వాంతరాళ దృక్పథాన్ని సంతరించుకుంది. అందుకే అది మహాకావ్యంగా, విశిష్ట రచనగా మారిపోతోంది!!

మొదటి కాంటోలో తన స్వీయ కథనం కొంత మిగిలింది. అందులో చేదు అనుభూతి వుంది.

అనబెల్లాను గురించిన వివరం – డాన్ వాన్ తల్లిరూపంలో ఉటంకిస్తాడు.

"....ఆమెకు గణిత శాస్త్రమంటే మక్కువ...
కాని ఆమె ఔన్నత్యానికి ఏమీ తక్కువకాదు.
ఆమె నైతిక వ్యక్తిత్వానికి ఏదీ సరిరాదు.
....ఆమెతో దేనినీ పోల్చలేము..."

ఈ విధంగా ఆ కవిత చాలా విస్తృతమైన ప్రశాంతమైన రూపాన్ని పొందింది. ఎందుకు ఈ ప్రపంచంతో ఘర్షణ? ఈ భూమి గుండ్రంగా తిరగవలసిందే – దానితోపాటు ఈ మనుషులు – ప్రాణులుకూడా.

పుట్టినవాడు బ్రతకాలి – చనిపోవాలి – మధ్యలో ప్రేమలు – పన్నులు! అన్ని తప్పవు!!

ఇదంతా గమ్మత్తుగా లేదూ? ప్రమాదకరంగా లేదూ? విషాదకరంగా లేదూ? మరి గత్యంతరం లేదుకదా?!

"...ఇంతేనా – ఇక వద్దు – నా మీద–
మృదుల హృదయం – మంచుబిందువులా
మనం చూసే అందమైన వస్తువుల్లో
ఉద్వేగాలు – అందమైన భావోద్రేకాలు కొత్తగా...
నీ గ్రహచారం తెలుసుకోబాబు–
నీ బైబిల్ చదువు – నీ జేబు జాగ్రత్త!!

ఇలాంటి కొంటె తెలివి – షేక్స్పియర్‌ను తలపిస్తుంది.

అతను కూడా మానవుని కోర్కెలు ప్రేమలు

ఆశయాలు అన్ని భ్రమలే అని నమ్మాడు!

ఈ బ్రతుకు ఒక కల అంటాడు prospero !

అంటూనే ప్రేమను, యౌవనాన్ని అంగీకరిస్తాడు!!

అలాగే బైరన్ తన భ్రమలన్నీ అనుభవించాడు. అందులోనే ఎనలేని సౌందర్యాన్ని అవసరాన్ని గుర్తించాడు.

"...అన్నింటికంటే మధురమైంది...
తొలిప్రేమ! తొలి సమాగమం – అది ప్రత్యేకం!
ప్రొమిథియస్ స్వర్గం నుంచి, మనకోసం తెచ్చిన అగ్నిశిఖ!

ఇక్కడ డాన్ వాన్ చాలా భావావేశంతో చలించిపోతాడు. ఇప్పటి కొత్త బైరన్ ఒక రమణీయ రూపం నుంచి మరో ఓర్పులేని మార్పులోకి ప్రవేశించాడు.

ఈ సమయంలోనే షెల్లీ, మేరీ – బైరన్‌ను, అలెగ్రాను చూడటానికి వస్తారు. అతని జీవనశైలి, ప్రాపంచిక సుఖాలకై తిరుగుబాటు ధోరణి, వారికి మింగుడు పడదు. షెల్లీకి మనిషి మంచి – చెడు – అతని ఆలోచనతోనే వున్నాయని నమ్మకం – బైరన్ ఈ దుర్మార్గం అంతా బయటి – విధి కుట్ర అని విశ్వసిస్తాడు. అప్పటికే అతని ఆరోగ్యం క్షీణించిపోతుంది. డాక్టర్లు అతన్ని గట్టిగా హెచ్చరిస్తారు. తన అలవాట్లను మానుకోమని – ఆడపులిని పంపమని! మార్గరీటా – కారోలైన్ లాగా – ముందు కత్తితో పొడుచుకుంది. తరువాత కాలవలో దూకింది. అప్పుడు గండోలా నడిపేవారు ఆమెను రక్షించారు. అక్కడితో ఆ అధ్యాయం ముగిసింది!

డిశంబరులో హాన్సన్ తన కొడుకును వెంటబెట్టుకుని సంతకాల కోసం బైరన్ వున్నచోటుకు వస్తాడు. అక్కడి భవనాల గులాబిరంగు చూసి

ఆశ్చర్యపోతాడు. బైరన్ భవనంలో వారికి కుక్కలు, ఒక నక్క, అడవినక్క, కోతులు, అన్నీ దాటుకుని, పాలరాతి మెట్లు ఎక్కి బైరన్ గదికి జేరతారు. అతను వున్న దారుణమైన ఆరోగ్యస్థితికి విచారంతో ఆశ్చర్యపోతారు.

"హాబ్‌హౌస్ - ఇంత దూరం రావటానికి ఎంత సాహసం చేశావు?" అని బైరన్ అతన్ని ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తాడు.

"...కవులందరూ ఇలా భావావేశంతోనే కనిపిస్తారు..." అంటాడు హాన్సన్ కొడుకు! లండన్ గురించి - అక్కడ తన స్నేహితుల గురించి - రాజకీయాల గురించి అడుగుతూ వారి సమాధానాలు వింటూ - గోళ్లు కొరుక్కొంటూ వుంటాడు. ఈ అలవాటు అతని చిన్నతనం నుంచి కాపాడుకుంటున్నాడు.

న్యూస్టెడ్ అమ్మగా వచ్చిన సొమ్ముతో అప్పులు తీర్చి (12,000 పౌండ్లు) లేడీ బైరన్‌తో తీర్మానం చేసుకున్న ప్రకారం 66,000 పౌండ్లు వుంచి హాన్సన్ రుసుము 12,000 పౌండ్లు పోగా, బైరన్‌కు చేతిలో ఏమీ మిగలదు! అయితే వడ్డీ తాలూకు 3,300 పౌండ్లు సాలీనా వస్తాయి. ఇప్పటివరకూ ముర్రే అతని రచనలపై 7,000 పౌండ్లు ఇస్తాడు. బైరన్ కిన్నార్డ్‌కు రాస్తాడు!

"...డబ్బు చాలా శక్తి కలది - అది సుఖాలనిస్తుంది! అందుకని దాని అవసరం నాకు చాలా వుంది..." అంటూ

అతని అందమైన వత్తైన ఉంగరాల జుత్తులో వెండి వెంట్రుకలు తొంగి చూస్తున్నాయి. పసుపు పచ్చగా, అతని ముఖం పాలిపోయి ఉబ్బి వుంది.

చేతులు నీరుపట్టి కొవ్వుతో లావుగా వున్నాయి.



మోసినీగో పాలెస్

XXX

రాణిగారి సేవకుడు!

(1819)

మగవాళ్లు వారు ఆశించినదానికంటే ఆనందంగా వుంటారు!

–అలైయిన్ (Alain)

వసంతం వచ్చింది. ఆరోగ్యం తెచ్చింది. బైరన్ జ్వరాలన్నీ చలిగాలులతో పాటే మాయమయిపోయాయి.

చిరుగాలులకు, చిన్నపాటి అలలు, గండోలాలు కట్టిన నీలం – తెలుపు రంగు కర్రలకు తగిలి చితికిపోతున్నాయి. బైరన్ పోగు చేస్తున్న బంగారు నాణాలు పెట్టెనిండి బైటకు తొంగి చూస్తున్నాయి.

ఇప్పటికీ బైరన్ చంచల హృదయం ఏ 'కొమ్మ' మీద వాలదామా అని రెక్కలు అల్లాడిస్తోంది.

ఒక వెనీసియన్ యువతి ఆకర్షించింది. ఆమె గది కిటికీ ఎక్కుతూ, వెనీస్ కాలవలో పడిపోయింది. వెనీస్‌లోనే గొప్ప వంశపు ఆడపడుచు! ఆమెకోసం ఆ కుటుంబ పెద్ద ఒక పోలీసు అధికారిని – ఒక పూజారిని పంపాడు. బైరన్ వారిద్దర్ని కాఫీ ఇచ్చి మర్యాద చేస్తాడు. ఆ యువతి బైరన్‌కు సలహా ఇస్తుంది – "ముందు నీ భార్యను వదిలించుకో" అని. అంటే "విషం ఇమ్మంటావా?" అంటాడు. అంతే ఆమె మౌనంగా తన వారితో వెళ్ళిపోతుంది.

బైరన్‌కు నిజంగా ఆశ్చర్యం! ఏమిటి ఈ నీటి నగరం శోభ! ఇక్కడ ఆడవారి భావావేశం? వీరి నైతిక స్వేచ్ఛ! ఇదంతా ఈ వెచ్చని ఎండ మహిమా?!

మళ్లీ విందులు, వినోదాలు మొదలవుతాయి. అలాంటి సందర్భంలోనే అతనికి గూసిలీ రాణి పరిచయమవుతుంది! ఆమె చాలా చిన్నది. యౌవనంతో మిసమిసలాడిపోతోంది. ముత్యాల్లాంటి పలువరుస! ఉంగరాల జుత్తు, చందమామ లాంటి మోమును మబ్బుల్లా కమ్మివేస్తున్నది. ఆమె వక్షం పరిపూర్ణంగా వుంది! ఒక సంవత్సరం క్రితం 60 ఏళ్ల పెద్దమనిషిని పెళ్లి చేసుకుంది. నిజానికి ఆమె పెళ్లి అయిన మూడవ రోజునే బైరన్ కలిసిన గుర్తు. అప్పుడు ఆమె పట్టించుకోలేదు. నిజానికి యుక్తవయసులో వున్న 'భార్య', కనీసం ఒక సంవత్సరం పవిత్రంగా వుండాలి, ప్రియుణ్ణి ఆహ్వానించడానికి!

ఈ రెండో కలయిక ఆమెను సమూలంగా కుదిపివేసింది. "నిజానికి ఆ రోజు విందుకు కాస్త అయిష్టంగానే వచ్చాడు. కొద్దిగా అలసిపోయి వున్నాడు కూడా. "లార్డ్ బైరన్ దర్శనం అద్భుతం! ఆయన అందం, కంఠస్వరం, శిల్పి చెక్కిన ముఖకవళికలు శరీర కదలికలు ఆయనను పరివేష్టించి వున్న వేయి అందాలు. అరె – ఇలాంటి వ్యక్తిని ఇంతవరకూ కలవలేదే. ఈయన ప్రభావం పడకుండా ఎలా తప్పించుకోవాలి? ఎందుకు తప్పించుకోవాలి?" అనుకుంటుంది గూసిలీ రాణి! ఆమె పేరు తెరాజా! బైరన్ వెళ్లిపోయే సమయంలో ఒక చీటీ ఆమె చేతిలో పెడతాడు రహస్యంగా!

అది కలయిక కోసం ఆహ్వానం! అంతే ఆ రోజు మొదలు వారు రోజూ కలుస్తున్నారు. కలవని రోజు లేదు.

గూసిలీ రాణికి తను స్వతంత్రురాలినని తెలుసు. ఈ లేయెండ దేశంలో రాయని చట్టాలుంటాయి. కాని అవి చాలా నిర్దుష్టంగా వుంటాయి. బాలిక 16 ఏళ్ల వరకూ కాన్వెంటులోనే వుంటుంది. అప్పుడు ఆమెకోసం ఒక ధనిక వయసు మళ్లిన జమీందారుని చూస్తారు – పెళ్లి తంతుకోసం! అప్పటికే ఆ బాలిక తన అందచందాల శారీరక 'శక్తి'ని గ్రహించగలుగుతుంది!

తెరాజా విషయంలో – ఆమెకు 16 ఏండ్లకు గూసిలీ దొరగారు 60 ఏళ్ల ప్రాయంలో వున్నారు. వారి వివాహం తరవాత ఎవరి గదిలో వారు హాయిగా వుంటారు. ఇంకా ఆమె – తన భర్తను 'సర్' అంటూనే వుంది.

గూసిలీ దొర మీద కొన్ని అపవాదులున్నాయి. మొదటిది – తన మొదటి భార్యను విషప్రయోగంతో చంపాడని, రెండోది మాంజోని చావుకు కూడా ఈయనే కారణమని! దొర చాలా నాగరీకుడు – కవి ఆల్‌ఫెరికు స్నేహితుడు. రోమగ్నాలో అందరికంటే ధనికుడు.

“ఇక్కడ – ప్రేమ! ఇంగ్లాండులో లాగా చల్లగా, నిస్తేజంగా, లెక్కల ప్రకారం వుండదు. ఇక్కడ అది జీవితం, వ్యాపకం, అవసరం. తప్పనిసరి వ్యవహారం! ఇక్కడ ఆడదాన్ని ‘ప్రేమించే ప్రాణి!’ అంటారు. వీరు ప్రేమకోసం చచ్చిపోతారు. ముఖ్యంగా రోమన్లు! చాలా చిన్న ప్రాయం నుంచే ప్రేమించడం ప్రారంభిస్తారు. ఇష్టాయిష్టాలు తర్వాత–

ఈ దొరసాని చిన్నారి దొరసాని. పవిత్రంగా వుండవలసిన సమయాన్ని పూర్తిచేసింది! భర్త కూడా ఆమె మీద నిఘా తగ్గించారు! ఇప్పుడు ఒక ప్రియుణ్ణి ఎంచుకోవడానికి మంచి సమయం కదా!

ఈ వ్యవహారం బైరన్‌కు కారొలైన్ లాంబ్ ప్రేమలాగానే అనిపించింది.

గూసిలీ దొరసాని మంచి పెంపకంలో, చక్కగా చదువుకుంది. ఇటాలియన్, ఫ్రెంచ్ భాషలు నేర్చింది. చక్కగా కవిత్వం చదవగలదు. లాటిన్ చరిత్రకారుల పేర్లన్నీ తెలుసు. వర్ణచిత్రాలు వేయగలదు. ఇవన్నీ సరదాగా చేస్తుంది. కాని ఆనందంగా చేస్తుంది. ముందు అమలిన ప్రేమతోనే సరిపెడదామని చూసింది జాగ్రత్త కోసం! ఆమెకు తను నివసిస్తున్న సమాజంపట్ల గౌరవం బాగానేవుంది. అందుకనే తొందరపడి సాహసం చేయలేదు. కాని తనకు సేవకుడులాంటి ప్రేమికుడు కావాలి. అది అవసరం. గౌరవం కూడా. ఇది చాలా చిక్కులతో కూడిన వ్యవహారం. భర్తను ఎంచుకోవటం తేలిక. ప్రేమికుణ్ణి ఎంచుకోవటానికి చాలా ఆలోచించాలి కదా!

త్వరలోనే ఇక్కడ నుంచి (వెనీస్) రావెనా తన భర్తతో వెళ్లిపోవాలి. అక్కడ నుంచి బోలోనాకి మారాలి. అక్కడే దొరగారి ఆస్తులు, సంస్థానాలున్నాయి. మరి అంత దూరం బైరన్ రాగలడా? దొరసానికి సేవకుడు కావాలి కదా!

ఇదంతా డాన్ వాన్‌కి అర్థంకాలేదు. అలాంటి గందరగోళంలో హాబ్‌కు రాస్తాడు–

"నాకు చాలా ఆశలున్నాయి. ఆమె నన్ను రావెనా రమ్మంటోంది. అక్కడ నుంచి బోలోనా కూడా! ఇవన్నీ ఖచ్చితంగా వుంటే బాగానే వుంటుంది. కాని అక్కడకు వెళ్లిన తర్వాత నాకు అవమానం జరిగితే, మళ్లీ వెనీస్ రాగలనా? ఇక్కడ డబ్బుతో పనికాదు. ఆమె చాలా ధనవంతురాలు!

ఆమె అందగత్తే, కాని తెలివి తక్కువ – విందులో గట్టిగా మాట్లాడుతుంది. రహస్యాలు తెలియవు. "ఇదిగో బైరన్" అంటూ కేకవేస్తుంది.

ముఖ్యంగా ఆమె కోరేది నేను, ఇటలీ వదిలిపోరాదు అనేది. అలాంటి వుద్దేశ్యం నాకు లేదనుకో. కాని 'ఉంపుడుగాని'లా 'మిండగాడు'గా వుండిపోవాలా?.."

ఇవన్నీ అతని భయాలు.

రావెనా వెళ్ళడానికి కొద్ది రోజుల ముందు, అతనికి, తన ప్రక్కలో చోటిచ్చింది! ఆ విషయం వెనీస్ సంఘంలో బహిరంగంగా తెలియజేసింది!

ఇది దొరగారిని కొంత ఇబ్బందిపాలు చేసినా లెక్కచేయలేదు. కాని తెరాజాని ఆ తర్వాత రెండు రోజులకే రావెనా తీసుకెళ్లిపోయాడు.

పాపం బైరన్, ఆమె ప్రేమలో పడి మళ్లీ ఒంటరిగా, విచారంగా, నిరాశతో మిగిలిపోయాడు.

తెరాజా రావెనా రాగానే అనారోగ్యంపాలయింది. బైరన్‌ను వెంటనే రమ్మని తనకు సేవచేయమని కోరింది. తనతోపాటే వుండవచ్చు అనికూడా ఖచ్చితంగా చెప్పింది! ఎంతటి ధైర్యం! బైరన్ ఆమె దగ్గరకు వెళ్ళకుండా వుండలేకపోతాడు. అప్పుడే బయలుదేరాడు కూడా. అప్పటికే ఎండలు ముదురుతున్నాయి. దారులన్నీ దుమ్ములేస్తున్నాయి.

రావెనా చాలా బాగా నచ్చింది. ఒకప్పటి దుర్మార్గపు అనాగరికపు సామ్రాజ్యపు ఆనవాళ్ళున్నాయి. చల్లటి ఇరుకైన వీధులు. ఇక్కడే ఫ్రాన్సిస్కో జీవించాడు. ఇక్కడే డాంటే కాందిశీకునిగా వచ్చారు. చిన్ని హోటల్ దగ్గర్లో ఆ కవి అవశేషాలు ఒక సామాన్య సాధారణ గుమ్మటం క్రింద భూమిలో వుండిపోయాయి.

గుర్రపు స్వారీకి దగ్గర్లో దేవదారు అడవులున్నాయి. సముద్ర తీరం వరకూ. అక్కడే రోమన్ నౌకలు లంగరు వేసి వుండాలి. బైరన్‌కు ఈ అడవి ఈ సముద్రతీరం ఈ ఏకాంతం ఎంతో నచ్చింది.

కాస్త గాలికే ఊగే అడవి చెట్లు – పరుగులు పెట్టే సముద్రపుటలలు అతన్ని అలరించేవి!

అతను బసచేసిన చోటుకు గూసిలీ దొరగారు వచ్చి తన ఇంటికి ఆహ్వానిస్తాడు. భార్యను చూసివెళ్లమని అర్థిస్తాడు!

గూసిలీ పాలెస్ చాలా విశాలమయినది. బైరన్ అక్కడకు వెళ్లి ఆశ్చర్యపోతాడు. గూసిలీ దొరసాని తన పాన్పులో అతక్కుపోయివుంది. అంతే బైరన్‌లోని ప్రేమికుడు సేవకునిలా మారి ఆమెకు సేవలు చేస్తాడు.

ఎప్పుడైనా దొరగారి కలవాలం తన గొంతులో దిగవచ్చని భయపడతాడు. కాని చావు ఎప్పుడైనా రావొచ్చు. కాని గూసిలీ రాణి కోసం చనిపోవటం ఎంత రమణీయంగా వుంటుంది! ఇప్పుడు కేవలం బానిసలా మారిపోయాడు.

అతని అసలు భయం తెరాజా చనిపోతుందేమోనని. ఇవన్నీ క్షయవ్యాధి లక్షణాలే. అరె! తను ఇష్టపడిన, బంధం పెంచుకున్న ప్రతి ప్రాణీ చనిపోవాల్సిందేనా?

"యుద్ధంలోనో – అనారోగ్యంతోనో ఏదో ఒక కారణం – నా నుంచి నా వారు దూరమయిపోవటానికి" అనుకుంటాడు.

"ఒకవేళ ఈమె చనిపోతే ఇంకెవ్వరినీ ప్రేమించలేను. ఇదే నా చివరి ప్రేమ.

ఇక స్వేచ్ఛ అంటారా – అది చివరికి వచ్చేసింది. సహజంగానే – స్వేచ్ఛా జీవనంతో విసిగిపోయాను. కనీసం నా అనైతిక జీవనం ఆ వెసులుబాటు కలిగించింది! ఇంక ప్రేమ? దీని అర్థం తెలుసుకోవటానికి ఇదేనా మార్గం – ఇదే నా చివరి సాహసం!" ఇవీ అతని ఆలోచనలు.

వెనీస్ నుంచి ప్రొఫెసర్ అగ్లిఎట్టిని పిలిపించాడు. తెరాజాను పరీక్ష చేయమంటాడు. ఆయన ఇప్పుడు – జరుగుతున్న వైద్యాన్ని, చికిత్సనూ కొనసాగించమంటాడు. అవీ బైరన్ సేవలు!!

తర్వాత తేరాజా ఎంతో సంతోషంగా అతని సేవలు అందుకుని ఆరోగ్యాన్ని పుంజుకుంది. తన ప్రేమను ఎంతో తీవ్రంగా అతనికి అందించింది.

ఇదంతా గూసిలీ పాలెస్‌లోనే జరిగింది!!

దీనిలో ఎంత సాహసం వుందో, అంత ప్రమాదం వుంది. దొరగారు పూర్తిగా గాయపడతాడు. కాని అంత తొందరపాటు మనిషి కాదు. ఇంత జరిగినా బైరన్‌ను పాలెస్‌కు ఆహ్వానిస్తూనే వున్నాడు.

బైరన్, దొరసానిని ఎప్పుడంటే అప్పుడు తన గుర్రం మీద వెళ్లి చూసేవాడు. అలా గడిచిపోతున్న రోజుల్ని ఎంతో ఆస్వాదించాడు. అతనికి రేపటి గురించి ఆలోచనే లేదు.

దొరసాని ఆరోగ్యం కుదుటపడగానే అతనితోపాటు స్వారీకి వచ్చేది.

ఆమెకు దైవభక్తి కూడా ఎక్కువే. అలా వెళ్తున్నప్పుడు చర్చి గంటలు వినపడితే, బైరన్‌ను ప్రార్థన చేయమని అడిగేది.

ఓ మేరియా అదిగో చర్చి గంట!
..........ఆశీర్వదిస్తూ
అడవిలో ఆకులన్నీ ప్రార్థనతో కదులుతున్నాయి..."

అతని ప్రియురాలు కాథలిక్కు నమ్మకస్తురాలు.

బైరన్ అవసరాలకు, రోమన్ చర్చి వేడుకలకు అవినాభావ సంబంధం వుందంటారు. అతని కూతురు అలెగ్రాను కాథలిక్ కాన్వెంటులో పెడతాడు.

అతనికి ఈ ప్రార్థనలన్నీ ప్రకృతిలోని సహజమైన శబ్దాలనిపిస్తాయి!

బైరన్‌ను, తెరాజా, రావెనా రోజుల గురించి కవిత రాయమంటుంది. ఆమెను ఎలా కాదంటాడు!

Prophecy of Dante ఆమెకోసం రాస్తాడు. అది పూర్తయిన తర్వాత డాంటే సమాధి దగ్గరకు తన ప్రియురాలితో, ఆమె నల్లని దుస్తుల్లో, తాను ఎంబ్రాయిడరీ గౌనులో వెళ్లి, ఆ పుస్తకం అక్కడ ఎంతో భక్తిశ్రద్ధలతో వుంచుతాడు. తెరాజా మోకాళ్ళ మీద వంగి ప్రార్థనలో వుండిపోతుంది.

రోజురోజుకీ తేరాజాని వదలలేని స్థితికి వస్తాడు. ఆమె తన గొప్ప విజయంగా భావిస్తాడు. నిజానికి ఆమెకు ఇంగ్లీషు ఒక్క ముక్క రాదు. గొప్ప వంశంలో పుట్టింది. ఎంతో సౌందర్యవతి. కాన్వెంటు వదిలి రెండేళ్ళు కాలేదు. నిండా పదిహేడు సంవత్సరాలు లేవు. తన కవిత్వం గురించి ఆమెక ఏమీ తెలియదు. కాని తనను, గొప్ప కవిగా ఆరాధిస్తుంది. ఆ కవి మూర్తిమత్వాన్ని ఎక్కువ ప్రేమిస్తుంది. ఆ మూర్తే ఆమెకు హీరో! అతనే ఆమెకు అసత్యపు ప్రేమికుడు! ఆడవారికి ఇలాంటి తీయని ఊహలేకదా కావాలి. బైరన్ ఈ భ్రమల్లోనే ఆడుకుంటాడు. అందులో అతనికెంతో ఆనందం లభిస్తుంది.

ఈ యువరాణి ప్రేమించేది పూర్వపు బైరన్‌ను న్యూస్టెడ్, హారోలోని బైరన్‌ను అతనికి కూడా ఆ బైరన్‌పట్ల అభిమానం!

తెరాజా, బైరన్‌ను తన ప్రియుణ్ణి ఎంతగా ప్రేమించినా తన భర్తను వదిలిపెట్టటం పెద్ద నేరంగా పరిగణిస్తుంది! ఈ విషయంలో అనబెల్లాకు ఆమె చాలా భిన్నం!

కొన్నాళ్లు గూసిలీ రాణి దంపతులు బోలోనా వదిలి తమ ఎస్టేట్లు చూడటానికి వెళ్తారు. ఆ సమయంలో బైరన్ తన కూతురు అలెగ్రాను పిలిపిస్తాడు. ఆమెతో కాలక్షేపం అతన్ని సేదతీరుస్తుంది. ఆమె అప్పటికి మూడు సంవత్సరాల పాప. వచ్చీరాని ఇటలీ పదాలు. 'Bon di papa' అతనికి సంగీతంలా వినిపిస్తాయి. అగస్టాలాగానే పాపకు 'ర' పలకదు! తనలాగానే గడ్డం సొట్టపడుతుంది. కనుబొమ్మలు ముడిపడతాయి. తెల్లని ఛాయ! మెత్తని కంఠస్వరం. సంగీతంపట్ల ఇష్టం. కాని చాలా దృఢ చిత్తం! ఇవన్నీ బైరన్ జీన్సు. అతనికెంతో సంతోషాన్ని కలిగిస్తాయి!

అలెగ్రాతో ఆడుకుంటూ గుర్రపు స్వారీ చేస్తాడు.

పలక మారుతున్న ద్రాక్షతోటల్లో తిరుగుతాడు. నీటియంత్రం దగ్గర కూర్చొని కబుర్లు చెప్పుకుంటారు.

ఆ పసిది ఆ ప్రక్కనే వున్న శ్మశానంలోని బొందలు త్రవ్వే తాతతో కబుర్లు చెప్తుంది. అతని పేరు Campo Santo! అతని కూతురు ఎంతో చక్కనిది.

బైరన్ దూరం నుంచి చూస్తుంటాడు.

"నాకు ఆశ్చర్యం వేస్తుంది. ఇంత చక్కని ముఖం! ఇంతటి అందం – తన తండ్రి పోగు చేస్తున్న కపాలాలతో పోలిస్తే ముఖ్యంగా 1766 నాటిది – అది బోలోనాలోనే ఎంతో సుందరాకృతిని ధరించిన కపాలం! ఒక ధనికురాలి ముఖం!

అరె – ఆ యిద్దర్నీ పోల్చి చూస్తే ఎంత ఆశ్చర్యం–

ఎంతటి సౌందర్యం ఎలా అయిపోతుంది! అయ్యో! మనలాంటి గడ్డపోళ్లు ఎలా పోయినా ఫర్వాలేదు – కాని ఈ స్త్రీ సౌందర్యాన్ని కనీసం ఒక వృక్షపు నీడలా కాపాడుకోలేమా?

ఎండలో వాడిపోవాలా? అద్దంలో నిలిచిపోదా?!

ఇవన్ని ఎంతో విచారకరమైన ఆలోచనలు. నిజమే అతను విచారంలోనే వున్నాడు.

ఈ రాణివాసం, అతనికి విసుగు పుట్టోంది. ఆం ఇప్పటివరకూ బాగానే జరిగింది అంటే అతని భావం, ఇందులో ఒక శూన్యగత అహంకారం వుంది. దీనికి తెరాజా బాధ్యత లేదు. ఆమె యౌవనవతి. సౌందర్యవతి అనుకూలవతి. కాని అతని రోజులు ఆమె పాదాల చెంత వృధా అయిపోవాలా?

ఇప్పుడు అతనికి 31 సంవత్సరాలే! తనేం చేస్తున్నాడు? ప్రేమించటమా – డాన్ వాన్‌కి మూడో అధ్యాయం రాయటమా?

"అయ్యో! ఎంత నిరామయంగా, బాధాకరంగా సమయం గడిచిపోతోంది. ఎంత త్వరగా జీవితం హరించిపోతోంది?!

ఫలవంతంగా – సంతోషంగా సాగదా ఈ బ్రతుకు?!"

అతని ఆలోచనలు మరో యాత్రవైపు సాగుతాయి.

ఇంగ్లాండు వెళ్లి ఇప్పుడు జరుగుతున్న సంస్కరణోద్యమంలో పాల్గొందామా? చివరిసారిగా తను వదిలి వచ్చిన దేశాన్ని మళ్లీ వసంతంలో చూడాలనుకుంటాడు. అక్కడ నుంచి దక్షిణ అమెరికా వెళ్లి స్థిరపడదాం – తన కూతురుతో అనుకుంటాడు.

అక్కడి వార్తాపత్రికల్లో కథనాలు – వెనిజులా ప్రభుత్వం విదేశస్తుల్ని వచ్చి స్థిరనివాసం ఏర్పరచుకోమని ఆహ్వానించటం చూసి అవి దాచిపెడతాడు.

అతనికి ఇప్పుడు హీరో, 'Bolivar', అక్కడి స్వతంత్ర సమరయోధుడు!

"ఈ విషయంలో చాలా ఖచ్చితమైన ఆలోచనలు వున్నాయి. ఇటలీ అంటే విసుగుపుట్టి కాదు. కాని మగవాడు ఇక్కడ ప్రియుడుగానే మిగిలిపోవాలి. పాటలు పాడుతూ ఒపేరాలకు ప్రియురాలితో వెళ్తూ వారికి విసనకర్రలతో విసురుతూ – ఇవన్నీ బాగానే చేస్తున్నాడు కూడా.

ఇంతకంటే మొక్కలు నాటటం, చేతకాని వ్యవసాయం చేయటం లేదా వేటాడటం మెరుగుకదా. ఈ విసనకర్రలతో గొడుగు పట్టడంకంటే ఆడదానికి?! వారంటే నాకు చాలా ఇష్టం. కాని ఇక్కడి వ్యవహారాలు నాకెంతగా అనుకూలంగా వున్నాయో

అంతగా విసుగు కలిగిస్తున్నాయి! ఇక్కడ అంతా బహు భర్తృత్వం! ప్రేమికునిగా, భర్తగా, వ్యభిచారిగా ఇప్పుడు దొరసాని సేవకునిగా – అన్ని అవతారాలు ఎత్తాను!

ఇప్పుడు నాకో దేశం కావాలి. ఒక ఇల్లు కావాలి. స్వతంత్ర్యం కావాలి. నా వయస్సు 32 సంవత్సరాలు మాత్రమే. మంచి పౌరునిగా మంచి గృహస్తునిగా మంచి కుటుంబంతో ఇంతకు ముందులా కాకుండా వుండలేనా? ఐరోపాలో స్వాతంత్ర్యం లేదు.

ఇది భూగోళంలో తుప్పుపట్టిన ప్రదేశం!"

ఇవీ అతని ఆలోచనలు.

మార్పుకోసం 'సొసైటీ రొమాంటికా'లో సభ్యునిగా చేరతాడు. ఇది ఇటలీ స్వతంత్రం కోరే మిత్రుల బృందం. బైరన్ బొలోనాలో వుండటం రోమన్ పోలీసుకు తలనొప్పిగా మారుతుంది.

ఇదంతా మతాధికారుల పెత్తనంలో నడుస్తున్న ప్రభుత్వాలు. అతనిమీద నిఘాపెడతారు.

బైరన్, తెరాజా, గూసిలీ దొర వీరి సంబంధాలన్ని రికార్డు చేస్తాయి. "అతను గొప్ప కవి. బాగా పేరున్నవాడు. చాలా ధనవంతుడు. అందుకనే ప్రమాదకారి." పోలీసుల రిపోర్టులు ఇలా వుంటాయి. "అతను పూర్తిగా ఇంగ్లీషువాడు" అని కూడా!



తెరాజ

గూసిలీ దొరసాని లేనప్పుడు తన జీవితంలోని వెలితిని ఒక్కసారిగా గుర్తిస్తాడు.

ఒకరోజు గూసిలీ పాలెస్ తోటలో తిరుగుతూ ఒక పుస్తకం చూస్తాడు. అది మేడమ్ స్టీల్ రాసిన Corinne! దాని చివరి పేజీలో తెరాజాకు వుత్తరం రాస్తాడు.

"ప్రియా – ఈ పుస్తకం చదివాను, నీ తోటలో, నా ప్రేమా! నీవు లేవు – వుంటే

చదవలేనుకదా! నీకు చాలా ఇష్టమైన పుస్తకం – రచయిత్రి నాకు స్నేహితురాలు – నేను రాసే ఆంగ్ల పదాలు నీకు అర్థం కావు. మిగతావారికి దీని అర్థం తెలియదుకూడా. అందుకనే ఇటలీ భాషలో రాయటంలేదు.

నీకు నా చేతిరాత తెలుస్తుంది. ఎంత ఆర్తిగా రాశానో అర్థం అవుతుంది. నీవు ఆరాధిస్తావుకూడా! ప్రేమ గురించి నీ భాషలో (AMOR MIO) ఎంతో అందమైన పదం.

నా అస్తిత్వాన్ని ఇక్కడ తెలియజేస్తుంది. అదే నాభయం కూడా. ఎంతవరకు అనేది నీవు నిర్ణయించాలి. నా విధి వ్రాత నీవు రాయాల్సిందే! నీకు పదిహేడే – కాన్వెంటు నుంచి బైటకు వచ్చి రెండేళ్లు కదా. నీ మనసంతా నేనున్నానని ఆశిస్తాను. అసలు నిన్ను నీ వివాహం తర్వాత కలవకుండా ఉండవలసింది. ఇప్పుడు అన్నీ జరిగిపోయాయి.

మన ప్రేమ పరస్పరమే – నిన్ను ప్రేమించటం ఎలా మానుకోవాలి?

ఈ ఆల్ఫ్స్ పర్వతాలు, మహాసముద్రాలు మనల్ని విడదీసినపుడు నన్ను గురించి ఆలోచిస్తావా? కాని నీ యిష్టం లేకుండా అవి మనల్ని వేరు చేయగలవా?.."

అరె – ఆమె కేవలం మూడురోజులే దూరంగా వెళ్లింది, ఇంతలోనే ఇంత విరహమా?

గూసిలీ పరివారం బోలోనాకు తిరిగి వచ్చిన తరవాత దొరగారు రావెనా వెళ్లాల్సివచ్చింది. ఇప్పుడు తెరాజా దొరసాని తనకి, వెనీస్ గాలి అవసరమని అంటుంది. "మీరు రాలేకపోతే బైరన్‌ను తోడుగా పంపండి" అంటుంది.

అంతే బైరన్ తెరాజా వెనీస్ బయలుదేరతారు. అక్కడకు చేరిన తర్వాత డాక్టర్లు కాస్త పల్లెటూరి గాలి మంచిది, అదీ కొండగాలి అంటారు.

బైరన్‌కు లా మీరా భవనం వుండనేవుంది. ఆ భవనాన్ని దొరసానికి అప్పగించి– తర్వాత అతనూ వచ్చి ఆమెతోనే వుంటాడు!!

లా మీరా వున్న బ్రెంటా తీరం ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది. బ్రెంటా తరంగాలపై అస్తమించే సూర్యుని కిరణాలు బంగారు తీగలను సాగిస్తాయి. సాయంత్రపు గాలులు చుట్టుప్రక్కల అడవుల నుంచి పచ్చివాసన మోసుకొస్తాయి. గూటికి చేరే పక్షుల కిలకిలలు మెలమెల్లగా నిశ్శబ్దంలోకి జారుకుంటాయి. లామీరా లోని జంట అప్పుడే మేల్కొని ప్రేమలోకపు ఆవేశంతో రాత్రిని త్వరగా పరుగులెత్తిస్తుంది.

కాని సాయంత్రాలు బద్ధకంగా సాగుతుంటాయి.

పదిహేడేళ్ల పడుచు తన విజ్ఞానాన్ని ఎంతకాలం సాగించగలదు? ఇది బైరన్‌కు వెలితిగానే అనిపిస్తుంది.

"....అరె నువ్వు పెళ్లి చేసుకున్నావా? అయితే సాయంత్రాలు ఎలా గడుపుతావు..." అని అడుగుతాడు, కర్రెన్ – మూర్‌ని! అది గుర్తుకువస్తుంది.

"ప్రియురాలితో రాత్రులు పరుగులు పెడతాయిగాని సాయంత్రాలు సాగుతుంటాయి అని తెలుస్తోంది..."

కాని ఈ జీవితం అతనికి ఆవలింతలు తెప్పిస్తోంది!

ఈ సమయంలోనే మూర్ వస్తాడు. ఆయన లార్డ్ జాన్ రస్సెల్‌తోపాటు వస్తాడు. ఆ సమయంలో బైరన్ తన స్నానాల తొట్టిలో వుంటాడు. అక్టోబర్ 8!

అతన్ని ఫ్లెచర్ ఆహ్వానిస్తాడు. చివరగా బైరన్ వారి వద్దకు వచ్చి మూర్‌ను చూసి ఎంతో ఆనందిస్తాడు. కాని మూర్ బైరన్‌ను చూసి ఆశ్చర్యపోతాడు.

"......అతనిలో ఆత్మీయమైన కాంతి మాయమైపోయింది. చాలా వయసు మళ్లిన వానిలా వడిలిపోయాడు. సైడ్‌లాక్స్ కూడా పెంచాడు. జుట్టు పొడవుగా పెరిగింది. ఇంతయినా అతని అందానికి లోటులేదు.

కాని అతని కవిత్వం కూడా అతని ఆకృతిలా కూడా మారుతూ వస్తోంది. డాన్ వాన్ రాసినపుడు అతనిలో హాస్యం తొంగిచూసేది. *చైల్డ్ హెరాల్డ్* రాసినపుడుగాని *మాన్‌ఫ్రెడ్* సమయంలో అతనిలో గంభీరమైన శృంగార పురుషుడు కనపడేవాడు.

మూర్‌కు వెనీస్‌లోని పలాజో మోసినీగోలో ఆతిథ్యమిచ్చాడు.

మూర్ వెనీస్ చూసి ఆశ్చర్యపోతాడు ఎంత అందమైన అసత్యపు నగరం!

ఇద్దరు స్నేహితులు ఎన్నో విషయాలు ఆప్యాయంగా చెప్పుకుంటారు. కిన్నార్డ్‌తో బ్రాందీ, ఐరిష్ పాటలు! చిన్న పిల్లల్లా మరో ప్రపంచంలోకి వెళ్ళిపోతారు.

“అరె, ఆ కుక్కకు దూరంగా వుండు. ఆ కోతి కరుస్తుంది. రా, యిది, నా గది. ఇందులో వుండు.”

మూర్ వున్నంతకాలం బైరన్ పగళ్లన్నీ అతనితోనే గడిపాడు. రాత్రి తన ప్రియురాలి దగ్గరకు వెళ్లాలి!

మూర్‌తో వెనీస్ పౌరులు చాలామంది, “నీ స్నేహితునితో చెప్పలేవా నీతిగా బ్రతకమని – ప్రియురాలు వుండటం నేరంకాదు, ఆమెతో కలిసి బ్రతకడం పెద్ద నేరం.” ఇదీ ఇక్కడి నీతి!

ఇప్పటివరకు బాగానే వున్నాడు. గూసిలీ రాణి దొరసానితోనే అసలు చిక్కు వచ్చిపడింది. ఇలా చెప్పారు!

మూర్ వున్నన్నాళ్లు బైరన్‌కు ఆటవిడుపే! అతను వెళ్లిపోయేనాటి రాత్రి బైరన్‌కు ప్రియురాలి నుంచి ‘సెలవు’ దొరికింది!

ఆ రాత్రి ఒపేరా చూసి, స్నేహితునితో విందారగించి St. Marks విశాల ప్రదేశంలో రాత్రి రెండు గంటలు వరకూ వెన్నెల వెలుగులో కాలక్షేపం చేశారు. ఎంత అద్భుతంగా వుంది! ఈ నిశ్శబ్ద నగరం ఈ వెలిసిపోతున్న వెన్నెల వెలుగులో ఎన్ని రాజప్రసాదాలు. నీటిమీద నిద్రపోతూ ఎన్నో గండొలాలు కునికిపాట్లు పడుతూ! ఎన్ని దీపాలు మినుకుమినుకుమంటూ – ఈ ప్రశాంతతలో ఎంత విషాదం వుంది! ముసుగులా! ఆ మర్నాడు లా మీరాకు వెళ్లి బైరన్ దగ్గర సెలవు తీసుకుంటాడు మూర్.

బైరన్ ఒక తోలుసంచి తెచ్చి ఇస్తాడు. ‘ఏమిటది?’ మూర్–

'నా జీవితం – నా సాహసాలు' అంటాడు బైరన్. ఇది నీదే – నేను బ్రతికి వుండగా ప్రచురించకు. తర్వాత నీ యిష్టం."

ఇది చాలా గొప్ప ప్రకరణం అవుతుంది – 19 వ శతాబ్దపు చివరి భాగంలో అంటాడు మూర్.

ఆ విధంగా మూర్ ప్రయాణం మొదలవుతుంది.

ఇక బైరన్ రోజులు గడ్డుగా తయారవుతాయి. ఇప్పటివరకూ గూసిలీ దొరగారు, కళ్లు మూసుకోలేదు కాని చూసి చూడనట్లున్నాడు. కాని నవంబరు 1819 గూసిలీ దొరకు గుస్సా వచ్చింది. నేనో, ప్రియుడో తేల్చుకోమంటాడు.

ఆమె ప్రియుణ్ణి ఎంచుకుంటుంది!

"ఆమె తనతో లేచి రమ్మంటుంది. బహుశా నేను కూడా అదే పని చేసివుండేవాణ్ణి. కాని ఇప్పుడు నేను ముప్పయి ఒకటి. ఆమెకు 18 రాలేదు." ఆమెను ఎంతగా ప్రేమించినా ఎలా సాధ్యం? వారి కుటుంబం అంతా ఎంతో దుఃఖంతో మునిగిపోతుంది. ఆమె చెల్లెళ్లు, తల్లీ, తండ్రి, భర్త ఎంతో కష్టపడి ఒప్పించారు. తన భర్తతో రావెనా వెళ్లమని." "ఆమె భర్త దగ్గర మాట తీసుకున్నాను. ఆమెను ప్రేమించాలని– ఇక నేను కలవనని మాట యిచ్చాను."

తెరాజా దుఃఖానికి చలించిపోయాడు. కాని ఈ విషయంలో దృఢనిశ్చయంతో వున్నాడు.

"నిన్ను రక్షించాలని దూరంగా వెళ్లిపోతున్నా. ఆల్ప్స్ అవతలి ప్రక్కకు – నీవు లేని ప్రదేశంలో నేనుండలేను. ఈ జీవితాంతం నిన్నే ప్రేమిస్తాను" అని రాస్తాడు. ఇక ఇటలీలో వుండటం అతనికి ఇష్టంలేదు. ఇంగ్లండు? ఫ్రాన్స్? అమెరికా? వెనెజులా? ఏమో! ఎక్కడికో. కాని ఇక్కడ మాత్రం వుండలేడు!

ఇప్పుడు అగస్టాకు రాస్తాడు – "ఏమయిపోయావు – ఇన్నాళ్లు అర్థం కాకుండా వుండిపోయావు.

ఇప్పటికి మూడు సంవత్సరాలు – ఎడబాటు – మనకు సారూప్యాలు ఏమున్నాయి. ప్రేమ – అనుబంధాలు తప్ప – మనం చేసిన పాపాలకంటే ఎక్కువ బాధలే అనుభవించాము. ఈ విషయంతో డాంటే మెరుగు అతని నరకంలో – ఫ్రాన్సెస్కోను – రిమిని – ఇద్దర్నీ కలిపే వుంచాడు. నరకంలోనైనా! బాధపడినా వారు కలిసి వున్నారు కదా!"

తర్వాత రెండు వారాలు – ఇటలీ వదిలిపోదామని ఆలోచించాడు.

మూర్ రావటంతో ఇంటిబెంగ (ఇంగ్లాండు) పట్టుకుంది. తన స్నేహితుల కోసం తపించాడు. తన సొంత గడ్డ మీద నిలబడాలని తహతహలాడాడు. తనకు కావలసిన పళ్లపొడి, బ్రష్‌లు మగ్నీషియా అన్ని వుత్తరాల్లో అడుగుతూనే వున్నాడు. కాని ఎవ్వరూ పంపలేదు. ఈ అవసరాలే తన ఇంగ్లాండును మరీమరీ గుర్తుకు తెస్తోంది.

కాని అతని ఆలోచనలకు వ్యతిరేకంగా అతని అదృష్టం నడుస్తోంది.

మళ్లీ జ్వరం వస్తుంది. అలెగ్రాకు అంటుకుంది. తర్వాత నర్సుకు – గండోలా నడిపేవాడికి. చివరికి ఇంటి సేవకురాలికి కూడా.

పలాజో మోసినిగోలో ఒంటరిగా విచారంగా తిరిగాడు – జబ్బుపడిన అందర్నీ నిస్సహాయంగా చూస్తూ.

ఇంగ్లాండు నుంచి ఏ ఆహ్వానం లేదు. అగస్టా స్తబ్దుగా వుండిపోయింది. తన మరదలి మాట జవదాటలేదు. అతనికి ఎటూ పాలుపోదు.

మళ్లీ వసంతం వరకూ ప్రయాణం వాయిదావేద్దామనుకుంటాడు.

ఇంతలో రావెనా నుంచి తెరాజా ఆహ్వానం పంపుతుంది. అన్ని విషయాలు సరిచేశాను. మళ్లీ జబ్బుపడ్డాను. నీవు మాత్రమే నాకు వైద్యం చేయగలవు అంటుంది. ఆమె తండ్రి, అల్లుడు గారిని అడుగుతాడు – భర్త సరేనంటాడు.

అంతే – బైరన్ రాక కోసం ఆమె ఎదురు చూస్తుంది. బైరన్ ఇంగ్లండు వెళ్లటానికి అన్ని సిద్ధం చేయిస్తాడు. సామానులన్నీ పడవల్లో కాలువపై ఊగుతుంటాయి. బైరన్ చేతి గ్లోవ్స్ కూడా తొడుక్కుంటాడు.

అలెగ్రా పడవ ఎక్కింది కూడా. అప్పుడు బైరన్ వింతగా, నా పిస్టళ్లు, కత్తులు ఒంటి గంట కొట్టక ముందు పడవలో వుంటే, ప్రయాణం మానుకుంటాను అంటాడు! అంతే! గంట కొట్టింది. ప్రయాణం వాయిదాపడింది. "ప్రేమ జయించింది! దేశం వదిలిపోవాలని గాఢంగా విశ్వసించలేక పోయాను. నీవున్న దేశాన్ని వదలి పోవటం నా వల్ల కాలేదు.

...నేను ప్రపంచ పౌరుణ్ణి! అన్ని దేశాలు నాకు ఒక్కటే. మన కలయిక మొదటిరోజు నుంచి నీ ఆలోచనలే.

నీ మేలు కోరి నీ కుటుంబం మేలు కోరి నేను దూరంగా వెళ్లిపోదామని అనుకున్నాను. కాని నీవు రావెనా రమ్మంటున్నావు. అలాగే వస్తాను. నీవు కోరినట్లే! ఇంతకంటే ఏమి చెప్పను?"



గూసిలీ రాణి

XXXI

గూసిలీ పాలెస్‌లో ఆయుధాలు

(1819-1821)

ఇటాలియా ఓ ఇటాలియా
నీ సౌందర్యం ప్రాణాంతకం !

–బైరన్

రావెనా రావటం – అతనికి ప్రశాంతంగా వుంది.

సంతోషంగా వుంది.

ఇరుకు సందులు – మార్మికమైన రాజభవనాలు – చర్చిలు, ప్రార్థనాలయాలు, పెంకు, ఎర్రని పెంకు కప్పులు, ఊరిశివార్లు, అనంతంలో కలిసిపోతూ ఆకుపచ్చని అడవి – అద్భుతమైన కీకారణ్యం – సజీవంగా ఎండలో నీడలో తడిసిపోతూ ఇప్పుడు అడుగు మందం మంచులో వీధులన్ని తెల్లగా!

తెరాజా అతనికి – జబ్బుపడిన చిన్ని పిల్లలాగా ఆహ్వానం పలికింది.

తన తలిదండ్రులు ఆడుకోవటానికి సహాధ్యాయుని సమకూర్చిపెడితే ఎంత ఆనందంగా వుంటుంది!

ఇప్పుడు జబ్బులో నుంచి కోలుకోవటానికి సేవచేయటానికి తనకోసం వచ్చాడు – రాణి సేవకుడు!

దొర కాస్త బెట్టుగానే వున్నాడు కాని వ్యతిరేకంగా కాదు. ఇప్పటివరకూ తెరాజా తలిదండ్రులు గంబా కుటుంబం, బైరన్‌ను తమలో ఒకనిగా ఆహ్వానిస్తారు.

పీట్రో గంబా (Pietro Gamba) తెరాజా సోదరుడు, బైరన్‌ను తన స్నేహితునిలాగానే ఆదరించాడు.

తన సోదరి ప్రియుడు – ఇప్పుడు తన బావ!

బైరన్ ఆల్‌బెర్గో ఇంపీరియల్ (Albergo Imperiale)లో గదులు తీసుకుంటాడు. పేరు గొప్ప మాత్రమే ఈ అద్దెగదులు. ఎన్నాళ్లుంటాడు – వారమా – నెలా? సంవత్సరమా? అతనికే తెలియదు.

అతని జీవితం ఆమె చేతి రేఖలా మారిపోయింది. ఆమె రమ్మంది కాబట్టి వచ్చాడు. తను వెళ్లిపోవటం ఆమె అంగీకారంతోనే!

తన అనుబంధం మొదటిరోజుల్లోలాగా వాంఛా జీవితం కాదు. సాధ్యాసాధ్యాల సంబంధం కాదు?!

నడిసంద్రంలో నావలాగా ఊగుతూ తేలుతూ పోవటమే! ఈ నౌకకు లంగరు – గొలుసు గూసిలీ రాణి ఇష్టానిష్టాలపైనే!

అలెగ్రా అతనితోనే వుంది. నర్సు సంరక్షణలో చుట్టూ బొమ్మలతో, హాప్నరు దంపతులు పంపారు వెనీస్ నుంచి వచ్చే ముందు!

ఇంత సరంజామాతో ఆ గదుల్లో కాలంగడపడం బైరన్‌కూ అలెగ్రాకూ అనుకూలంగా లేదు.

గూసిలీ దొర తన బంగళా ఒకటి అద్దెకు ఇవ్వటానికి అంగీకరిస్తాడు. బైరన్‌కు ఆశ్చర్యం కలిగించినా తన సామాను కోసం వెనీస్ కబురుపెడతాడు.

ఈ గూసిలీ భర్తను అర్థం చేసుకోవటం కష్టమే అనుకుంటాడు!

ఇక గూసిలీ రాణి దొరసాని విషయానికి వస్తే ఆమె గర్వమంతా బైరన్ రూపంలో వుంది. ఆ గర్వప్రదర్శన అంటే బైరన్‌ను ఎంబ్రాయిడరీ యూనిఫాం

వేసి, ఒక యువరాజులా తన వెంట విందులకు, అతనికి ఒక కత్తి, డాగర్ కూడా అలంకరించి వినోదాలకు తీసుకువెళ్లటమే. మొదట్లో బైరన్ ఈ ప్రదర్శనకు నిరసన ఎదురవుతుందని భయపడతాడు. కాని, ఈ రావెనా రాజరికం, మతాధికారి 'ఇంకా ఇతర పాపులు!' అందరూ అతన్ని ఆదరిస్తారు. ఇదంతా ఒక రకం పిచ్చి – కాని అందరికీ నచ్చిన పిచ్చే!

బైరన్‌కు ఈ దేశపు ఆచారాలు బాగానే అవగాహనకు వస్తున్నాయి. దేవుని పది సూత్రాలు – ఇక్కడ అర్థం మార్చుకున్నాయి. "నువ్వు వ్యభిచారం చేయి – ప్రక్కవాడి పెళ్లాంతో." ఇక్కడే మరో నియమం వుంది, ఇది ఒక్కరికే పరిమితం.

ఇక్కడ స్త్రీ పురుషుల వ్యక్తిత్వానికి కొలమానం – వారు తమ భర్త – భార్యలతో ఎంత విశ్వాసపాత్రంగా వుంటారని కాదు, వారి ప్రియులపట్ల ఎంత నమ్మకంగా వుంటారనేది ముఖ్యం!

ప్రియుడు, తన ప్రియురాలి భర్తను ఎంతో గౌరవంగా చూడాలి. కొత్తవాళ్లకు వారిద్దరూ బంధువులే అనుకుంటారు! ఇందులో ప్రమాదం, ఈ బంధం అయిదు, పది సంవత్సరాలే వుంటుంది. తర్వాత భర్త చనిపోతాడు! ప్రియుడే భర్తగా చలామణి అవుతాడు.

మగవాడు ఆడదాని జీవితంలో ఒక విలువ లేని వస్తువుగా మారిపోతాడు. శృంగారం జయకేతనం! కాని ఎలాంటి స్థితి! ఎంత దీనాతి దీనం!

బైరన్ హాస్యంగా అనుకుంటాడు. ఒక శాలువా ఎలా మడతపెట్టాలో నేర్చుకుంటున్నాను. తెలియక తిరగవేసి పట్టుకుంటున్నాను.

ఇంతకంటే విచారకరమైన పర్యవసానం ఏముంటుంది? ఎలాంటి వీరోచితమైన కార్యాలు చేయాలని ఉవ్విళ్లూరాడు? ఇప్పుడు ఇక్కడ తన ఆత్మగౌరవం అంతా గులాబీల పరుపుల్లో సిల్కుతెరల గదుల్లో నిద్రాణమయి వుంటుంది!

కాని ఇక్కడే ఇటలీ రాజకీయాలు అతనికి ప్రమాదకరంగా మారిపోతాయి.

కొద్ది నెలలుగా ఇటలీ రాజకీయ పరిణామాలపట్ల చురుకుగా స్పందిస్తున్నాడు. ఇటలీకి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టాలి. ఇటలీ అంటే అతనికి అంత ప్రేమ! ఈ వ్యవహారంలో తన ప్రాణం పోయినా లెక్కచేయడు. ఈ జీవితంపట్ల అతనికెలాంటి భ్రమ – ప్రేమ లేదు!

బోలోనాలో సొసైటీ రొమాంటికాను సభ్యుడుగా కార్యరూపంలోకి తీసుకువస్తాడు. అతనికి విదేశీయునిగా కొన్ని నిరోధకాలున్నాయి. పోలీసు ప్రభుత్వం అతన్ని అంత త్వరగా ఇరికించలేదు. ఇక్కడ విప్లవ సంఘానికి ముఖ్యపాత్ర వహిస్తాడు! అది 1820 సంవత్సరం. 'హోలీ ఎలియన్స్'తో ఐరోపా ఆశ్చర్యపోతుంది. కాస్త తేరుకుని, స్పెయిన్ తన విప్లవ పథాన్ని కేవలం ఆరు సంవత్సరాల ఓర్పుతో ఒక్కరోజు వివరణతో రాజ్యాంగాన్ని సాధించింది.

దీనితో పోప్, నేపుల్స్ రాజు ఆలోచనలో పడతారు. నేపుల్స్‌లో "రాజు కలకాలం బ్రతకాలి! రాజ్యాంగం కలకాలం నిలవాలి" అని స్లోగన్లు వినపడతాయి. ఇది అన్ని నగరాలకు వ్యాపిస్తుంది. రాజు–రాజ్యంగా నిలవాలి. 'పోప్ నశించాలి' అని కేకలు రావెనా వీధుల్లో మార్మోగుతాయి. రావెనా మతాధికారి ఆశ్చర్యపోతాడు.

మతాధిపతులు బైరన్ గురించి ఫిర్యాదు చేస్తారు. అప్పటికే బైరన్ తన నివాసమంతా మందుగుండు, ఆయుధాలు, పిస్టోళ్లు, కత్తులు, కఠారులతో నింపివేస్తాడు. ఎవరైన మీదికి వస్తే 'కాల్చేయండి' అని తన సేవకులకు అధికారం ఇస్తాడు. 'మనం స్వాతంత్ర్యయోధులం' అంటాడు. నూటయాభై తుపాకులు మందుగుండు, తుపాకి మందు డబ్బాలతో నింపుతాడు. ప్రతిరోజు గుర్రంమీద పూర్తి మిలిటరీ దుస్తుల్లో కత్తిపట్టుకుని స్వారీకి వెళ్తాడు. ప్రజలంతా అతనికి అభివాదం చేస్తారు.

గూసిలీ దొర ధనికుడు కదా. ధనికులు ఎప్పుడూ అధికార గణంతో అనుకూలంగా వుండాలి. కాని తన భవనంలోనే విప్లవకారుడు తిష్టవేశాడు. తనకు అందరూ మోసగాళ్లలాగానే కనపడతారు.

అంతేనా చైల్డ్ హెరాల్డ్ ఇటలీ తర్జుమాని ప్రభుత్వం స్వాధీన పరుచుకుంది.

వీరి సంబంధం పూర్తిగా గూసిలీ దొర, లార్డ్‌బైరన్ – వారికి అవగాహనకు వచ్చి నిఘాపెడతారు.

దొరగారు – నేనో – అతనో తేల్చుకోమంటాడు భార్యను!

ఏమిటి ఎవరిని ఎంచుకోవాలా? ఆడదాన్ని, ఆ విధంగా అడిగే అధికారం ఈ దేశంలో లేదే?

బైరన్ తెరాజాను సంయమనం పాటించమంటాడు. కాని అక్కడి బంధువులు ప్రజలు బైరన్‌ను, తెరాజాను సమర్థిస్తారు. ఇక దొరగారికి విడాకులే గతి. కాని విడాకులు ఎవరిస్తారు? ఎవరిప్పిస్తారు?

"నేను బైరన్‌తోనే వుంటాను. అతను నిన్ను కూడా ఉండనిస్తే నాకభ్యంతరం లేదు" అంటుంది!

రోమగ్నాలో ప్రియుడు లేని స్త్రీ ఎలా వుంటుంది? అని నిలదీస్తుంది.

బైరన్ ఈ ప్రాంతంలో చాలా ప్రసిద్ధి. మంచి పేరు సంపాదిస్తాడు. అవసరంలో వున్న అందరికీ సహాయం చేస్తాడు. పేదవాళ్లకు ముసలివాళ్లకు ఎంతో అండగా నిలుస్తాడు. ఎన్నో ప్రార్థనాలయాలకు సొమ్ము ఇస్తాడు. అన్నింటికీమించి ఇటలీ స్వాతంత్ర్యానికి పోరాటం చేస్తున్నాడు. ప్రజలంతా అతని పక్షమే?!

కాని కథ మరో మలుపు తిరుగుతుంది. గూసిలీరాణి తండ్రి తరఫువారు విడాకులు కోరతారు. ఇలాంటి సందర్భం రెండు వందల ఏళ్లలో రాలేదు. లాయర్లు ఎవ్వరూ దొర తరపున వాదించటానికి అంగీకరించరు.

"ఏమిటి పద్దెనిమిది నెలలుగా జరుగుతున్నది నీకు తెలియదా?" అదెలా సాధ్యం–

చివరికి పోప్ గారు ఈ విడాకుల పత్రం విడుదల చేస్తారు.

దొర ఇచ్చే భరణాన్ని కూడా తెరాజా తిరస్కరిస్తుంది.

తరువాతి రోజుల్లో, బైరన్‌కు తెరాజాను పెళ్లి చేసుకోవలసిన తప్పనిసరి పరిస్థితి వస్తుంది. అప్పుడు అగస్టాకు రాస్తాడు.

"ఇదే నా చివరి ప్రదర్శన! ఇది ఆఖరిది. నీకు తెలుసు నా మూలంగా ఒక స్త్రీ తన భర్తను వదిలివేసిందంటే, ఆమెను తన ప్రేమికుడు వివాహం చేసుకోవాలి! చూశావా? ఇక నన్ను నీవు చూడలేవు. ఇప్పుడు నా పాత్ర మారిపోతోంది. మూడేళ్లుగా నీవు స్తబ్దుగా వుండిపోయావు. నీ కోసం అన్ని వదులుకుని వస్తానన్నాను. నీవు మౌనంగా వుండిపోయావు.

నేను పీకల్లోతు ప్రేమలో మునిగిపోయాను, తెరాజాతో! ఆమె నన్ను అంతగా ప్రేమించింది. ఈ బంధం గట్టిపడిపోయింది. ఆమెకు అంతగా చేరువయిపోయాను. లేడీ బైరన్ మరణించినా, గూసిలీ దొర దయ తలచినా, మేము వివాహం చేసుకోవచ్చు. అది ఒకటే దారి – ఇద్దరం ఒకర్ని ఒకరు ద్వేషించుకోవటానికి" అని రాస్తాడు.

"ఇప్పుడు కాబోయే లేడీబైరన్‌కు మన కుటుంబం గురించి బాగా తెలుసు. డాన్ వాన్ ఫ్రెంచి భాషలో చదివి అట్లాంటివి ఇక రాయవద్దని చెప్పింది.

నువ్వంటే, ఆమెకు చాలా ఇష్టం కూడా" అని కలుపుతాడు.

ఎందుకు బైరన్ – తెరాజాతో ఇంతగా పెనవేసుకుపోయాడు. ఆమెలో బైరన్ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి.

ఇది అనుకోని విషయమే – కాని దీనిలో సత్యముంది!

జూలై 16 వ తేదీ 1820, విడాకుల డిక్రీ తెరాజాకు తన తండ్రితోపాటు నివసించటానికి వెసులుబాటు కల్పించింది.

రావెనాలోనే గంబా కుటుంబం నివసించే భవనానికి తెరాజా చేరింది. మతాధికారి, ఈ విధంగా ఆమెను తన ప్రియునికి దూరంగా వుంచాలని అనుకుంటాడు. కాని గంబా కుటుంబం తండ్రి కొడుకులు, బైరన్ అంటే చాలా

ఇష్టపడతారు. అతని రాజకీయ దృక్పథాన్ని అనుసరిస్తారు. అతని మనసులోని ప్రేమను అర్థం చేసుకుంటారు. వారి ఇంటికి రమ్మని అదీ ఊరికి దూరంగా వున్న తమ విల్లాకు రమ్మని ఆహ్వానిస్తారు.

ఆ విధంగా ఈ వేసవి అంతా అతను తన గుర్రం మీద చాలాసార్లు వారింటికి అతిథిగా వెళ్తాడు.

శిశిరంలో తెరాజా రావెనాకు తిరిగి వస్తుంది. ఆ విధంగా ప్రతి సాయంత్రం ఆమెను చూడటానికి బైరన్‌కు ఎటువంటి ఆటంకం వుండదు!

ఇది ఆనందంగానే గడిచిపోతున్న సమయం! ఆమెను చూడటానికి వెళ్లటం ప్రతి సాయంత్రం, ఒక సాహసమే. దొంగచాటుగా జరిగే ఈ అక్రమ సంబంధంలోని ఉత్సాహంతో, అతనికి రోజులు ఎలా గడిచిపోతున్నాయో తెలియలేదు.

1821 చలికాలం. బైరన్ ఒంటరిగా గూసిలీపాలెస్‌లో గడుపుతాడు. వీధులన్నీ మంచుతో నిండిపోయాయి. గుర్రాలన్నీ శాలలో కదం తొక్కుతున్నాయి, బైటకు వచ్చే అవకాశం లేక.

అతను ఇంటి దగ్గరే చదువుకుంటూ సమయం గడిపివేస్తున్నాడు. చలిమంటను శూన్య దృక్కులతో చూస్తూ.

అయినా పుస్తకాలలో ఏముంటుంది కొత్తగా? సోలమన్ చెప్పినదానికంటే మరేమైనా ఎవరైనా చెప్పగలరా?

మళ్లీ తన దినచర్య రాయటం మొదలుపెట్టాడు. ఇప్పుడు రాసేది అతను 1813లో రాసిన దానికంటే ఎంతో భిన్నమైనది – ముఖ్యమైనది కూడా.

గ్రీసు దేశంలోని సూర్యరశ్మిలాగా, బైరన్ దృష్టిలో ప్రతి చిన్న విషయాన్ని తన భావావేశంతో వెలిగింప చేశాడు. ఆ వెలుగులో ప్రతి చిన్న విషయం అద్భుతంగా – ఖచ్చితంగా దర్శనమిస్తోంది.

అతను ఏ విధంగా చూశాడో అదే చెప్పాడు, వర్ణించాడు. తన గురించి ఇతరుల గురించి పచ్చిగా వివరించాడు.

తన ముందు జరిగే సంఘటనలను, సన్నివేశాలను, ఇవన్నీ ప్రకృతిలో భాగంగానే, చివరికి వ్యక్తుల ప్రవర్తన కూడా ప్రకృతి సిద్ధమనే – తన సమదృష్టితో ఈ ప్రపంచం అంతా అదేవిధంగా దర్శనమిస్తుంది.

అతనిలోని గాఢమైన అవసరం, ప్రతి చిన్న విషయాన్ని అక్షరరూపం ఇవ్వాలనే బలమైన వత్తిడి, అందులో తనను తాను చూసుకోవటానికి ఇష్టపడేవాడు. జరుగుతున్న ప్రతి చిన్న విషయాన్ని ఖచ్చితంగా చెప్పేవాడు.

"...... 6 గంటలకే భోజనం అయిపోతుంది. పుడ్డింగ్ వున్న సంగతి మర్చిపోయాను. ఆ విషయం తెలిసేలోపు తినడం పూర్తయింది. అరసీసా ఏదోమత్తు పానీయం తాగాను. బహుశా వైను అయివుంటుంది. రెండు ఆపిల్ పళ్లు తినలేదు. అవి అందుబాటులోనే వుంచారు. రెండు పిల్లులకు ఆహారం పెట్టాను – గద్దకు కూడా. అదిగాక కాకి కూడా వుంది. గ్రీసు చరిత్ర చదివాను.

Retreat of the Ten Thousand

ఇప్పటి వరకూ రాత్రి ఎనిమిది గంటల 6 నిమిషాలు ఇది ఫ్రెంచ్ టైము – ఇటలీ కాదు..."

ఈ జర్నల్‌లో ఒక రకమైన హాస్యం, బఫూనరీ వుంది. షేక్స్పియర్ రచనలలాగానే – ఎలిజబత్ కాలంలోని బఫూన్ల మాదిరిగా.

అతను తన కవితాధార నుంచి ఈ బఫూనరీకి, అందులో నుంచి మళ్లీ కవితలను ఇష్టారాజ్యంగా రాశాడు.

ప్రపంచం అంతా ఒక రాజ్యంగా వుండాలని, తన కాకి ఆరోగ్యంగా వుందని ఒకే విధంగా రాసేవాడు!

"..... ఇంటి దగ్గర వుండిపోయాను, ఉదయం అంతా. చలిమంట మండుతూనే వుంది. ఉత్తరాలు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నా. మధ్యాహ్నం ఒకటిన్నరకు వచ్చింది. ఇంగ్లాండు నుంచి ఏ వుత్తరాలు లేవు.

"..... అరగంటలో అయిదు వుత్తరాలు రాశాను. చిన్నవే కాని చిరాకు – ఆటవికంగా! రాస్కెల్స్ అందరికీ అట్లాగే రాశాను....."

“.....ఇప్పుడే బండి వచ్చింది. పిస్తోళ్లు, పెద్ద కోట్లు తెమ్మన్నాను. అవసరం కదా - బైట చల్లగా వుంది. బండికి గూడు లేదు. చుట్టుపక్కలవాళ్లు రాజకీయంగా ప్రమాదకరంగా తయారయ్యారు. అయినా మంచివాళ్లే. ఒక మంచి దేశానికి తగినవారే. గంట మోగుతోంది. శృంగారానికి వెళ్తున్నాను. ఇది ప్రమాదకరమే కాని కాదనలేను. కొత్త మెమురాండం రాయటానికి కొత్త బోర్డు పెట్టించాను. రేపయినా స్వారీ చేయటానికి అనుకూలంగా వుంటుందని ఆశిస్తాను...”

“...... రాత్రి 11 గంటల 9 నిమిషాలు. తెరాజాను చూశాను. గంబా వాళ్ల ఇంటికి వెళ్లి ఇటలీ రాజకీయాలు మాట్లాడాము. 9 గంటలకు పీట్రో వచ్చారు. 10 గంటలకు ఆమె తండ్రి వచ్చారు. యుద్ధ రీతుల గురించి చర్చించాము.

హంగేరియన్ - హైలాండర్ - వెడల్పాటి కత్తుల గురించి మార్చి 7 లేక 8 రోజులలో తిరుగుబాటు రావచ్చని అనుకున్నాం. అసలు అక్టోబరులోనే రావల్సింది (1820).

ఇంటికి వచ్చేశాను - నిద్రకు సిద్ధమయ్యాను....”

“....జనవరి 6, 1821 పొగమంచు, వర్షం, బురద గుర్రపు స్వారీకి అవకాశం లేదు. 8 గంటలకు బైటకు వెళ్లాను. సంగీతం విన్నాను. చాలా ఇష్టం.

పురాతన గ్రీకు కాలంలో ఆడవారి పరిస్థితి ఏమిటి? బహుశా సుఖంగానే వుండి వుంటారు. ఇప్పటి పరిస్థితులు, ఒకప్పటి ఆటవిక సంప్రదాయం నుంచి మిగిలాయేమో, కృత్రిమంగా, అసహజంగా వుంటాయి?

స్త్రీలు ఇల్లు చక్కదిద్దాలి. చక్కని భోజనం చేయాలి. మంచి దుస్తులు ధరించాలి. కాని సమాజంలో తిరగకూడదు. చదువుకోవచ్చు. మత విషయాలు, కవిత్వం, రాజకీయాలు అవసరం లేదు. వంట చేయటం, ఆధ్యాత్మికం చదవాలి. సంగీతం, చిత్రకళ నేర్వాలి. నృత్యం కూడా కొద్దిగా తోడవని. భూమి కూడా దున్నవచ్చు. ఎపిరస్‌లో రహదారులు బాగుచేస్తున్నారు.

"…..ఇంటికి వచ్చి Mitford చదివాను. కుక్కతో ఆడుకున్నాను. తిండి పెట్టాను. రాత్రికి థియేటర్‌కి వెళ్లాలి. చివరి దృశ్యం – యువరాజు సింహాసనం మీద…. ప్రేక్షకులు నవ్వారు. 'మాకు రాజ్యాంగం కావాలి' అని అరుస్తున్నారు. ఇక్కడ ప్రజాభిప్రాయం అది! జరగదు. ప్రపంచం అంతా ఒక రాజ్యం కావాలి. తప్పనిసరిగా ఎల్లలు లేని రాజ్యం కావాలి!!

"….కాకి కాలు విరిగింది. పిల్లులు లావెక్కాయి. ఒకటే అరుపులు. కోతులు, నేను పట్టించుకొని చాలా రోజులయింది. గుర్రాలు కదం తొక్కుతుంటాయి. కాళ్లు గుదులు కట్టి! ఇటలీలో చలికాలం విచారకరంగా వుంటుంది. మిగతా రుతువులన్నీ ఉత్సాహంగానే గడిచిపోతుంది…"

ఇది బైరన్ జర్నల్ తీరు – అది లండన్‌లో రాసిన దానికి దగ్గరే – The Corsair రోజులకు దగ్గరగా వుంటుంది.

ఇప్పటికి లావా చల్లబడింది. అంతస్సంఘర్షణ సద్దుమణిగింది. బైరన్ నిరామయంగా వుంటున్నాడు. జీవితంలోని అసంబద్ధత అర్థం అయింది. బద్ధకం అలాగే వుండిపోయింది.

ఇంకా ఏదో కావాలి. ఉత్సాహపరిచేది కావాలి అని వుంది. కాని దానికోసం స్త్రీల అందాల వేట మానివేశాడు.

అతని ఆందోళన తగ్గింది. జుత్తు నెరుస్తోంది.

"ఎందుకు నా జీవితమంతా బద్ధకంగా గడిచిపోతోంది – నిరర్థకంగా ఖర్చయిపోతోంది?

నాకు ఇరవయి ఏళ్ళొచ్చేవరకు బద్ధకంగానే వుండేది. ఇప్పుడూ అంత తేడా ఏమీ లేదు. దీనికి సమాధానం ఎక్కడ వెతకాలి? అది నా నిర్మాణంలోనే వుందా – లేక నిరుత్సాహంతో మగ్గిపోవటంలో వుందా? ఎలాంటి శారీరక శ్రమ దీనికి సమాధానం కాదు. దారుణమైన ఆవేశాలు, వాటి ప్రభావంలో కొట్టుకు పోయినపుడు ఇందులో నుంచి బైటపడ్డాను. కాని అది వింతగాలేదూ? ఆందోళన కలిగేది. కాని నిరాశ కాదు. కాస్త ఉప్పు ఎక్కువైతే, షాంపేన్

ప్రభావం బాగుంటుంది. కాని వైను, బ్రాందీ నాకు పడవు. నాలో దుర్మార్గాన్ని ఉసిగొల్పుతాయి. ఈదటం ఉత్సాహంగా వుంటుంది. కాని అది తరుణోపాయం కాదు. అంతా అయోమయం. 19 ఏళ్లకు ఎంత నిస్తేజంగా వుండేదో ఇప్పుడు అంతగానూ వుంది. అది వదిలించుకోవాలంటే వేటాడాలి. తాగాలి. ఏదో చైతన్యం కావాలి. చాలా దారుణంగా వుంటుంది...ప్రస్తుతానికి ప్రశాంతంగానే వున్నా"

"......ఇప్పుడు నా బద్ధకం నాకు శత్రువై కూర్చుంది. అది నిర్లక్ష్యం కంటే అపాయకరమైంది..."

ఇప్పుడు అతని భావోద్రేకాలు – ఉద్వేగాలు తగ్గిపోయాయి. అచ్చమైన ఇంగ్లీషువాడిలాగా వున్నాడు. తన ఇటలీ జీవితాన్ని పరిగణనలోకి తీసుకోవటం లేదు.

కాని ఇంగ్లీషు సమాజం అతనికి సుదూర స్వప్నం! ఒక్కసారి ఏదేనా శబ్దం, పరిమళం, పుస్తకంలో ఒక పేజీ – అతనికి పాత జ్ఞాపకాలు మోసుకొస్తాయి. కోలీ (Cowley) చెప్పినట్లు.

"...... చల్లని, మెరిసే అలల క్రింద..."

ఇవన్నీ ఒక్కసారి నిద్రలేస్తాయి. అదిగో వాల్ట్జ్ సంగీతం వినపడుతోంది, ఇప్పటికి వెయ్యిసార్లు విన్నా. 1812 – 1818 మధ్యలో లండన్ నృత్య సంగీతాల విందుల్లో... దయ్యాలు తిరుగుతున్నాయి. కారోలైన్ లాంబ్ నాట్యం చేస్తోంది. డాన్ వాన్‌తో వెనకాల వెయ్యిమంది నీడల్లా.

అవును. ఇప్పుడు లేడీ బైరన్ ఏం చేస్తుంది? ఆమె ఏదో విందుకు సహాయం చేసిందని వింటాడు. భర్త దూర దేశంలో ప్రమాదంలో వుంటే అక్కడ విందులు!? ఆహాఁ అనుకుంటాడు కాని, అతను అనబెల్లా జర్నల్ చదివి వుంటే మరోరకంగా వుండేది.

అనబెల్లా పికడిల్లీలో తాము వున్న భవనం బయటనుంచి చూసేది. అదిగో ఆ గదిలో కదా కాపురం చేశాను అని. అవును ఎవరో స్నేహితునితో వున్నట్లు

గుర్తు! ఆమె తన విచారమయ గతాన్ని పాతరవేసింది. వారి సంభాషణలు "చచ్చినవాళ్ల కబుర్లు" కాదు, ఆమె అగస్టాను జాగ్రత్తగా చూస్తోంది.

లేడీ బైరన్, అగస్టాకు ఋణపడి వుంది.

ఆ విషయం, ఆమెకు తెలియకపోవచ్చు.

అగస్టాతో అతని బంధం, అనబెల్లా పెళ్లితో తెగిపోయింది. అనబెల్లా – బైరన్ తెగతెంపులతో రెండు సంబంధాలు తెగిపడిపోయాయి.

అతని స్నేహితుడు ఎక్కడో వున్నాడు. హాబ్ హౌస్ పార్లమెంటులో అడుగుపెట్టాడు, రాడికల్ సభ్యునిగా.

ఆ రకంగా జైలుకు వెళ్ళాడు. ఆ వార్త ఇటలీ వార్తాపత్రికల్లో వచ్చింది. అది చూసి బైరన్ ఎంతగానో నవ్వుకున్నాడు. అవును తమ దురదృష్టానికి ఎప్పుడూ నవ్వుకుంటాడు.

నువ్వు ఉపన్యాసం ఇచ్చావా?

అరె హాబ్?

వాళ్లను చేరకుండా ఏం మాట్లాడతావు?

అయినా ఏమౌతుందిలే–

ప్రజల్ని దేవుడే రక్షిస్తాడు–

రాజులందర్నీ శిక్షిస్తాడు

ప్రజలే కిరీటాలు ధరిస్తారు' – అని రాస్తాడు.

స్క్రోప్ డేవీస్ జూదంలో మునిగిపోతాడు–

అప్పులపాలయి మరో దేశం పారిపోయాడు.

అసలు లండన్ స్క్రోప్ నత్తిమాటలు లేకుండా ఎలా వుంటుంది?

బ్రక్నెల్ – కాలీస్ లో–

స్క్రోప్ – బ్రజిల్ లో–

బోనపార్టీ – St. హెలీనా లో

హాబ్ నువ్వు ఆ గేటు వెనకాల–

నేను ఇక్కడ కాందిశీకునిలా రావెనా లో–

ఆహాఁ గొప్ప వారంతా – చెల్లాచెదురై



జనవరి 22, 1821 అతనికి 33 సంవత్సరాలు!

"రేపే నా పుట్టినరోజు – అర్ధరాత్రి పన్నెండు గంటలకు! నాకు ముప్పయి మూడు నిండుతాయి! నిద్రకు మంచం ఎక్కాలి. బరువైన హృదయంతో ఇన్నాళ్ళు బ్రతికినందుకు! ఏమీ ఫలితం లేకుండా ఏమీ సాధించకుండా!

అప్పుడే 12 దాటి మూడు నిమిషాలయింది. ఇప్పుడు నాకు ముప్పయి మూడేళ్లు!

"నశ్వరం! మరణానంతరం పతనం!"
నేను చేసిందానికి చింతించను – చేయలేనిదానికే బాధ!

"జీవన పథం – చీకటి ధూళిమయం–
ఇలా ముప్పయి మూడేళ్ళు ఈడ్చాను!
నాకేమి మిగిలింది?
ఏమీలేదు – ఈ ముప్పయి మూడు తప్ప"

ఆ మర్నాడు చనిపోయిన సంవత్సరానికి, స్మృత్యంజలి రాశాడు!

Byron

1821 ఇక్కడ ఉంది-

ఇప్పుడు అనంతంలో కలిసిపోయింది-

గతంలో చేరిపోయింది.

ఇక తిరిగి రాదు!

ఇంకా మట్టిలో కలిసిపోయేందుకు

ఏమి మిగిలినా-

33 ఏండ్లు వృథాగా గడిచిపోయింది-

కొన్నాళ్లు అనారోగ్యం, కొన్నాళ్లు బద్ధకం

నిరాశ, గతించిపోయింది.

జనవరి 22 - 1821 A.D.

ఇప్పుడు మిగిలింది ఓదార్పు లేని ప్రాణి

తన అస్తిత్వం ఇక వృథా!

ఈ సమయంలోనే రావెనాలో అతను ఎంతో కష్టపడి పనిచేస్తాడు. డాన్ వాన్ అయిదో అధ్యాయంలో అంతరాయం కలిగింది. గూసిలీ దొరసాని వ్యవహారంతో-

".......గూసిలీ రాణి - డాన్ వాన్ ఇక ముందుకు తీసుకువెళ్లవద్దు అని అర్థించింది. అందుకు సరే అన్నాను..." ఈ మాట హాబ్‌కు జూలైలో చెప్తాడు. "ఆమె ఫ్రెంచ్ అనువాదం చదివి - జీర్ణించుకోలేకపోయింది. ఇటలీ నైతిక సూత్రాలకు కూడా డాన్ వాన్ మింగుడుపడలేదు. ప్రపంచవ్యాప్తంగా స్త్రీలు తమ స్వాతంత్ర్యాన్ని వదులుకోవటానికి ఇష్టపడరు. దానితో ఒక భ్రమ తమ భావావేశంతో కలిసి అంతా తన గుప్పిటలో వుండాలనే భ్రమలోనే వుండిపోతారు. రచనలన్ని ఈ భ్రమలపట్ల హాస్యంగానే వుంటాయి. వారి

భావోద్రేకాలను చూసి నవ్వుతాయి. అలాగే డాన్ వాన్ ను అంగీకరించే స్త్రీని ఇంకా కలవవలసింది. కాని ఆమె అభ్యర్థనను కాదనలేకపోయాను…”

ఈ సమయంలోనే డాన్ వాన్ ఆపిన సమయంలో, వెనీసియన్ చరిత్ర కథల్లోని విషాదాన్ని (Marino Faliero); The Two Foscari రాస్తాడు. ఇవికాక బైబిల్ చరిత్ర కథలు కూడా – పద్యరూపంలో విషాదాంతం రాస్తాడు. అతని ఆలోచనలను ఆక్రమించింది Cain కథ – దీనిని వివరంగా పద్యరూపంలో పెడతాడు.

దీనికి ముందు Sardana Palus రాజు కథ – ఇది అచ్చంగా తను వెనీస్‌లో గడిపిన జీవితం – మోసినిగో పాలెస్‌లో.

“ఎన్ని నగరాలు కట్టినా ఒక పద్యానికి సరికాదు. ఏమైనా చెప్పాలి – నా జీవితం ఇలానే – నా పాలన ఇదే.

అంతా సత్యమే – చరిత్ర చిన్నదే అయినా ఇది మానవజాతి చరిత్ర – వినండి.

సార్దనపాలస్ – రాజు – అనసింద్రా కుమారుడు,

ఒక్కరోజులో అంకిలస్ – టార్సన్ నిర్మించాడు–

తినండి – తాగండి – శృంగారంలో తేలండి–

మిగతాది అంతా వృథా – విలువలేదు.

సాలిమెనిస్: *గొప్ప నీతి – తెలివిగల రాతలు.*

తన ప్రజలకు రాజు ఇచ్చిన రాజ్యాంగం!

సార్దన: *రాజాజ్ఞ కాదనకు – సొమ్ము పోగుచేయి.*

రక్తాన్ని చిందించు – పడిపోయి ప్రార్థించు.

నిలబడి ప్రేమించు–

“ఇక్కడే సార్దన ***50*** *వేల మందిని శత్రువులను చంపాడు–*

ఇదే అతని శౌర్యానికి విజయ చిహ్నం!"

ఇలాంటివన్నీ విజేతలకు వదిలివేద్దాం.

నాకు చాలు – నా ప్రజలకు దుఃఖ భారాన్ని

తగ్గిస్తా – మెల్లగా సుఖంగా సమాధి చేరమంటూ–

దీనికి అనుమతి అవసరం లేదు. నాకు లేదు–

మనమంతా మగ పురుగులం!

కాని అన్ని డ్రామాలకంటే Caine అతని గుండెల్లోంచి వచ్చింది. Caine నేరం చేయకముందే దేవుడు శపిస్తాడు. ఇందులో న్యాయం ఎక్కడుంది? దేవుని సృష్టిలోనే దుర్మార్గం వుందన్నమాట!

ఈ డ్రామా మొదట్లోనే ఆడమ్ అతని సంతానం, ఆడమ్ పతనం – తర్వాత అందరూ యెహోవాను పూజిస్తుంటారు. ఒక్క కెయిన్ తప్ప!

కెయిన్, దేవుణ్ణి "చెట్టు నాటావు – అది ఆడమ్ కోసం కాదా? కాకపోతే అతని దగ్గరగా ఎందుకుంచావు? అది పెరిగింది ఎంతో అందంగా నాజూకుగా."

వీటన్నిటికీ వారి సమాధానం ఒక్కటే.

అది దేవుని ఘటన. ఆయన దేవుడు!

అది నాకెలా తెలుస్తుంది?

ఆయన శక్తిమంతుడయితే ఋజువర్తనుడా?

అంతా మంచేనా – అదే మన దారా?

నేను పండ్లను బట్టి తీర్పు చెప్పగలను–

అవి అన్ని చేదుగానే వున్నాయి.

నా తప్పు కానప్పుడు అవే నేను తినాలా?

ఇది కెయిన్ ఆక్రోశం!

లూసిఫర్ – దేవుని తరఫున మాట్లాడుతున్నాడు

కనిపించే ప్రపంచం కాదు – ఆ పైన చూడు!

కెయిన్ తన సోదరి.

తన భార్య కూడా వదలలేదు.

ఆమె పేరు అడా!

కెయిన్‌తో అంటుంది – మనం ఒక్కటే! నీవు అతనితో వెళ్ళకు – నన్ను వదిలి. మనం చేసిన పాపం ఏమిటి?

ఏది పాపం? అసలు పాపం అంటే – పరిస్థితులు పాపాన్ని పుణ్యంగా మారుస్తాయా?

కెయిన్ అంటాడు – కెయిన్ కు ఈ పాపపు చిహ్నం ఏమిటి?

నా నుదుట – ఎందుకు ఈ గుర్తు?

ఇది బైరన్ ఆక్రోశం కూడా.

కెయిన్ లాగానే ఆ పాపపు చిహ్నంతో ప్రపంచం అంతా తిరుగుతున్నాడు. తనుకూడా ఒక బైరన్‌ను చంపాడు కదా!

పాఠకులకు బైరన్ ఇప్పుడు రాసిన డ్రామాలు ఏమీ నచ్చడం లేదు. ఇంగ్లీషు పాఠకులకు ఇవి చప్పగా వున్నాయి.

"చూశావా? బురదలో ముత్యాలు జల్లాను!

అతిశయోక్తులు రాసినంతకాలం నాకు బ్రహ్మరథం పట్టారు. ఇప్పుడు సత్యాలు – జీవన సత్యాలు చెప్పబోతే తోసివేస్తున్నారు.

ఒకరకంగా ఇది నా పొరపాటే. నేనే ఈ పాఠకులను తప్పుదారి పట్టించాను. అందుకని ప్రతిఫలం అనుభవిస్తున్నాను" అంటాడు–

ఇప్పుడు ఇంగ్లీషు పాఠకుల దృష్టి మరోవైపు వుంది!

కాని–

బైరన్ తన కార్యరూపంలో స్థిరంగానే వున్నాడు.

ఎట్లాగయినా ఇటలీని స్వతంత్రం చేయాలి. ఈ విషయం హాబ్‌తో పార్లమెంటులో వున్నపుడు, అతను కారాగారంలో వున్నపుడు గట్టిగా చెప్తాడు.

చలికాలం అంతా గంబా కుటుంబం ఈ విషయంలో కుట్రలు పన్నుతూనే వున్నారు. వారికి యుద్ధం, తిరుగుబాటు ఎలా చేయాలో బైరన్ చాలా స్పష్టంగా నేర్పుతాడు. రండి – గూసిలీ రాణి పాలెస్ అన్నివిధాలా అనుకూలం – మీరు గుంపులుగా విడిపోండి – అన్ని ప్రక్కల నుంచి ఎదిరించండి – పోరాడండి – ఇటలీని విడుదల చేయండి. ఈ విధంగా పూర్తిగా ఇందులో దిగిపోతాడు.

అసలు బైరన్ వ్యక్తిత్వంలోనే తిరుగుబాటు వుంది. ఈ ఉత్సాహం – ధైర్యం తన ఆలోచనల్లో స్పష్టత అన్నీ తన లక్ష్యానికి ఉపయోగిస్తాడు.

కాని ఆస్ట్రియన్ దళాలు తిరుగుబాట్లని అణచివేస్తాయి. రావెనాలో కూడా అదే పరిస్థితి. గంబాలకు కష్టకాలం వస్తుంది.

జూలై 1821 ప్రాంతంలో.

బైరన్ మీద చేయివేసే ధైర్యం ఎవ్వరికీ లేదు. కాని గంబా కుటుంబం దేశం వదిలి పోవాలంటారు.

గూసిలీ రాణి అంగీకరిస్తుంది! కాని బైరన్ లేకుండా ఎక్కడికీ వెళ్లదు.

ఆమెతో ఎటుపోవాలి? స్విట్జర్లాండు – అక్కడ ఇంగ్లీషు యాత్రికులు అతనికోసం సిద్ధంగా వుంటారు.

పరిస్థితి ఇలా వుండగా బైరన్‌కు షెల్లీ దగ్గర్నుంచి వుత్తరం వస్తుంది.

అలెగ్రాను కాన్వెంటులో వుంచటం క్లేర్‌కు ఇష్టంలేదు.

కాని బైరన్, అలెగ్రాను కాథలిక్ కాన్వెంటులో మతవిశ్వాసంతో పెంచాలని– తర్వాత ఒక ఇటాలియన్‌ను పెళ్లి చేసుకోవాలని ఆశిస్తాడు! రావెనా దగ్గర్లోనే 'బాగ్లాకావెల్లో' కాన్వెంటులోకి వెడతాడు.

అలెగ్రా తల్లి క్లెయిర్ చాలా దురదృష్టవంతురాలు. బైరన్‌లోని అహంకారాన్ని, హింసను ప్రేరేపించే ఆడవాళ్లలో ఆమె కూడా ఒకటి.

వీళ్లు 'మంత్రాలు – ప్రేమలు కలిపి చెప్తారు' అంటాడు. ఆమెను క్లేర్‌కు ఎప్పటికీ ఇవ్వను.

"నా కూతురు క్రిస్టియన్‌లా పెరగాలి. వివాహం చేసుకుని సంసారిగా జీవితం గడపాలి..." అంటాడు.

అదీ బైరన్ మనసు మూలల్లోంచి వచ్చిన ఒక నైతిక జీవి ఆక్రందన. ఇప్పటివరకూ సుఖాల చీకటిలో అణిగివున్న ఆత్మ!!

షెల్లీ ఆగస్టు 6న రావెనా వస్తాడు. బైరన్‌ను చాలాకాలం తర్వాత చూసి ఆశ్చర్యపోతాడు.

"చాలా మారిపోయాడు. వెనీస్ బైరన్‌కి, ఈ బైరన్‌కు సంబంధం లేదు.

ఇతను చాలా నైతికంగా జీవిస్తాడు. అతని మేధ అనవసర ఆవేశాల్ని అణగతొక్కుతుంది.

ఇటలీ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. చాలా ఆరోగ్యంగా వున్నాడు. చాలా ఆనందంగా వున్నాడు.

డాన్ వాన్‌లో కొన్ని పద్యాలు చదివి వినిపించాడు, అవి అద్భుతం!!

అతన్ని, అందరి కవులకంటే ఉన్నతంగా నిలబెట్టగల రచన, ప్రతిపదం అమరం!! ఇవీ షెల్లీ మేరీకి రాసింది!

బైరన్ పట్ల తన అయిష్టతను అంతా ప్రక్కనపెట్టి, షెల్లీ అతనిలో గొప్ప లక్షణాలు స్పష్టంగా చూడగలుగుతాడు. షెల్లీ నిస్వార్థపరుడు. నీతిమంతుడు. పక్షపాతం లేకుండా బైరన్‌ను కవిగా ఉన్నతంగా అంగీకరించగలుగుతాడు.

బైరన్, షెల్లీని ఒక వెలుగుతున్న మంటలా, వెలుగు ప్రసరిస్తున్న ఒక వనరులాగా ఇష్టపడతాడు. నిర్మలమైన తేజోమూర్తిగా దర్శిస్తాడు.

షెల్లీకి మంచీచెడులు స్పష్టంగా తెలుసు.

తనకేంకావాలో కూడా స్పష్టత వున్న కవి.

బైరన్, షెల్లీని గొప్పగా చూడటం కాదు. అతని పట్ల అసూయ కూడా పెంచుకుంటాడు. బైరన్ నిశితమైన దృష్టిలో కూడా, షెల్లీలో మచ్చ కనపడదు!!

ఈ కలయికలోనే షెల్లీ, లీహంట్ గురించి బైరన్‌కు తెలియజేస్తాడు. అప్పటికే లీహంటు అతనికి పరిచయమే. ఇప్పుడు ఇంగ్లాండులో చాలా కష్టాలలో వుంటాడు. అతన్ని ఇటలీకి రప్పించి రక్షించాలి. అతన్ని ఇక్కడ ఉపయోగించుకోవచ్చు. ఉపాధీ కలిగించవచ్చు!

బైరన్‌కు ఒక ఆలోచన వస్తుంది. ఇప్పుడు ముర్రే (అతని ప్రచురణకర్త)తో సత్సంబంధాలు లేవు. మూర్ కూడా ప్రయాణించే పరిస్థితులలో లేదు.

లీహంటుతో, ఒక ఫౌండేషన్ సారథ్యంలో తన రచనలన్నీ ప్రచురించవచ్చు. అది లీహంటుకు కూడా పనికివస్తుంది. ఇవి అతని ఆలోచనలు.

షెల్లీ – బైరన్ మనసు మార్చుకోకమునుపే లీహంటుకు రమ్మని కబురు పంపుతాడు.

అంతేకాదు తమ మకాం పీజాలో పెట్టాలని తెరాజాను ఒప్పించమని బైరన్‌తో వాదిస్తాడు. ఈ సలహా తెరాజాకు బాగా నచ్చింది.

షెల్లీని అర్థిస్తుంది. "అయ్యా! దయచేసి బైరన్‌ను ఒంటరిగా వదిలి మీరు రావెనా నుంచి రాకండి..... ఆయన్ను మీతో తీసుకురండి...." ఆమెకు బైరన్ అక్కడ ఒంటరిగా వుండటంలోని ప్రమాదం తెలుసు.

కాని, కాని బైరన్ మీద నమ్మకం లేని వ్యక్తి ప్రపంచంలో ఒకే ఒకరు. అతనే బైరన్!!

అతని గురించి అతనికి బాగా తెలుసు. తన బలహీనతలు ఇంకా బాగా తెలుసు. తెరాజా లేకుండా షెల్లీ లేకుండా రావెనాలో వుంటే ఏమయినా జరగవచ్చు. షెల్లీని కొన్నాళ్లుండమంటాడు. కాని షెల్లీ వచ్చింది

అలెగ్రాను చూసి వెళ్లటానికి – కాన్వెంటులో

అలెగ్రాను చూసి పీజా వెళ్లిపోతాడు.

పీజాలో – మేరీ, షెల్లీ కలిసి బైరన్ పరివారం ఉండటానికి ఒక పాలెస్ చూస్తారు.

దాని పేరు పాలెస్ లాన్‌ఫ్రాంచి! బైరన్ మూడు నెలలు వారిని నిరీక్షణలో వుంచాడు.

తన నిశ్చితార్థపు రోజుల్లోలా – అతనికి 'ఓర్పు ఎక్కువైపోతోంది!' ఆ విధంగా వాయిదాలు వేస్తాడు. అతనికి అదృష్టం కలిసిరావటంలేదు. తను ఇష్టపడినవన్నీ దూరమయిపోతుంటాయి. రావెనా ఎంతగానో నచ్చింది. ఇక్కడి ప్రజలపై అభిమానం పెంచుకున్నాడు. అక్కడ మతపెద్దలు అతన్ని రక్షిస్తున్నారు.

తన రంగురంగు దుస్తుల్లో పండుగల్లో పాల్గొంటున్నాడు. ఇక్కడ తన రాత పని బాగా సాగుతోంది కూడా. వారం వారం వాయిదా వేస్తూ వస్తున్నాడు.

పీజాలో దొరసాని తెరాజా, మేరీ స్నేహాన్ని పొందగలిగింది. "చాలా నాజూకు అందంగల అమాయకురాలు. తన ధన మాన ప్రాణాలన్నీ బైరన్ కోసం త్యాగం చేసింది.

నాకు బైరన్ గురించి ఏమయినా తెలిసి వుంటే, ఆయన త్వరలోనే ఈ రాణి తొందరపాటుకు చింతిస్తాడు", ఇదీ షెల్లీ అభిప్రాయం.

అక్కడ రావెనాలో పెలాజో గూసిలీలో బైరన్ Heaven and Earth, a Mystery – దివి నుండి భువికి పడిపోయిన దేవతల గురించి బైబిల్‌లో వున్న కథ – రాస్తున్నాడు.

ఈ పడిపోయిన (పతనమైన దేవతలు కెయిన్‌లాగా) వారే బైరన్‌ను సానుభూతితో చూసేవారు. అతనికి వీరిపట్ల ఎనలేని ప్రేమ.

అప్పటికే తన సామానులన్నీ పీజా పంపివేశాడు. బైరన్‌కు ఒక బల్ల – ఒక పరుపు తప్ప ఏమీ లేవు.

అదిగో ఆ గుమ్మంలో – ఆ చెత్తలో నుంచి గొప్ప గీతాలు రాశాడు–

అవి Spirits and an Arch Angel's Song!

చివరికి అది పూర్తి చేసి అక్టోబరు 29, పీజా ప్రయాణమవటానికి అయిష్టంగా బయలుదేరతాడు.

'పలాజో గూసిలీ' వదిలి దాని పాత యజమానిని కలిసేందుకు పీజా బయలుదేరతాడు.

దారిలో తన చిన్ననాటి స్నేహితుడు Lord Clare కలుస్తాడు – బోలోనాలో.

"…..ఈ కలయిక, నా హారో రోజుల నుంచి ఇప్పటివరకూ జరిగిన అన్ని సంఘటనలు మరిచిపోయేలా చేసింది.

నేను సమాధి నుంచి లేచినట్లు అనిపించింది. లార్డ్ క్లేర్ కూడా కదిలిపోయాడు. ఆయన గుండె దడ అరచేతుల్లోనే తెలుస్తోంది. బహుశా అది నాదేనేమో! అయిదు నిమిషాలే – ఈ అయిదు నిమిషాల అనుభవంతో – అనుభూతితో నా జీవితంలో ఏ గంటనూ పోల్చలేను.

ఈ జీవితం ఒక వింత స్వప్నం.

వ్యక్తులు వస్తుంటారు. మన సమయాన్ని సంపూర్ణం చేస్తుంటారు. మన జీవిత క్షణాలను వెలిగిస్తుంటారు.

అసూయ – ప్రేమ ఎన్నో అనుభూతులతో, అంతే మెల్లగా వెళ్లిపోతారు. నీడల్లా మాయమవుతారు.

వారిని స్మృతుల అడుగున పడవేస్తాము. అరె, ఎప్పుడో ఒక్కసారిగా ఎదురవుతారు. మళ్లీ అన్నీ మండిస్తారు. అదీ, ఇదిగో దుమ్ము–ధూళి మార్గ మధ్యమంలో ఎండలో వానలో మళ్లీ కలగా మారిపోతుంది జీవితం...

ఈ ప్రయాణంలోనే రోజర్స్ కలుస్తాడు. ఫ్లోరెన్సులో మ్యూజియం చూస్తారు. అక్కడ ఇంగ్లీషు యాత్రికుల దృష్టిని తప్పించుకోవటానికి ఇబ్బంది పడతాడు.

అక్కడి నుంచి బోలోనా ద్వారా సెర్టోజా శ్మశానం దగ్గరకు రోజర్ని తీసుకెళతాడు.

అక్కడేగా, అందమైన కూతురుగల బొందలు తవ్వే వ్యక్తి వుంటాడు. అతను "తీక్షణంగా చూశాడు" అంటాడు.

అక్కడ పేర్చిన కపాలాల గదిలో తనను వదిలి, అతను "హాయిగా గాలి పీల్చుకున్నాడు" అంటాడు.

షెల్లీ – అలెగ్రాను తీసుకు రమ్మంటాడు. అందరికీ దూరంగా ఎందుకు? కాని బైరన్ ఒక్కడే వస్తాడు. ఒక్కడే వచ్చాడా? కాదు–

అతనితోబాటు బాతులున్నాయి. బండి క్రింద పెద్ద పంజరంలో ఎందుకూ–

తన దేశపు ఆచారాలపట్ల అతని ఎగతాళికి!

వేడి బన్నులు – శుక్రవారం బాతు మాంసం, ఇవన్నీ ఇంగ్లీషు ఆచారాలు – ఇంగ్లండు మీద ద్వేషం వుండవచ్చు. కాని కొన్ని ఆచారాలు వదలలేదు. ఒక్కసారి బాతులు కొంటాడు. వాటిని నెలంతా అతనే మేపుతాడు. అవి బాగా

బలిసిన తరువాత, ‘అరె – వీటిని ఎలా వండుతారు – వంట” అంటాడు. ఆ విధంగా ఎప్పుడూ బాతులు అతనితోనే వుంటాయి. అరె! వాటికి సంసార జీవితం కావొద్దా? అంటాడు.

షోపెన్ హావర్ లాగా, ఫ్రాంకఫర్ట్ సంతలో నిలబడి పాపం ‘ఒరాంగుటా’ను దాని కష్టాలను చూస్తున్నట్లు.



XXXII

పడవ మునక

(1821-1822)

నాకు తెలిసిన వ్యక్తుల్లో – ఏ మాత్రం స్వార్థం లేని,
అత్యంత ఉన్నత విలువలుగలవాడు షెల్లీ:
మనిషిలో సహజంగా ఉండే జంతు లక్షణాలు
అతనిలో మచ్చుకైనా కానరావు.

–బైరన్

కెయిన్ లాగా ముఖం మీద 'పాపి' గుర్తు వున్నవారికి, ఏకాంత ప్రదేశం హాయిగా వుంటుంది. రావెనాలో తనకు లభించిన స్వేచ్ఛ–ప్రశాంతత, బైరన్‌కు 'పీజా'లో కరవయింది. వాతావరణం, గంబా కుటుంబం, పినేటా వృద్ధ స్త్రీలు అతన్ని ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా సంతోషంగా వుండనిచ్చేవాళ్ళు.

పీజాలో ఆంగ్లేయుల సమూహం అతని చుట్టూ, మళ్ళీ న్యాయనిర్ణేతల్లా చేరారు.

షెల్లీతో అతనికి ఎలాంటి పేచీ లేదు. అంతేకాదు, అతనితో గడిపిన సమయం షెల్లీని మరింతగా దగ్గరగా చేసింది. అతనిపట్ల గౌరవం పెంచింది. షెల్లీ ధైర్యాన్ని ఎంతగానో మెచ్చుకొని, అతను తన పడవను అదీ అక్కడి ఆర్నో రేవులోని అలలకు వ్యతిరేకంగా నడిపే తీరు, ఈ సమాజంతో, వ్యక్తులతో ఈ ప్రపంచంతో అతని పోరాటాన్ని తలపించేది!

నిజానికి షెల్లీ అవసరం బైరన్‌కు చాలా వుంది. ఎందుకంటే షెల్లీ నిర్ణయాలు ఎంతో త్వరగా చేసేవాడు. బైరన్ ఏదీ నిర్ణయించలేడు. అంతేనా – తనంటే షెల్లీకి ఎనలేని గౌరవం!

అంతరిక్షంలోని దేవుని సృష్టి త్వరగా దగ్గరయిపోతుంటుంది. ఆశ్చర్యం! అంతకంటే ఆశ్చర్యం ఈ గంధర్వుణ్ణి నేను కలవటం – అదీ కృశించిపోతున్న స్వర్గంలాంటి ఈ మర్త్య శరీరంతో!!

కాని షెల్లీ చుట్టూ కఠినమైన, తెలివితక్కువ సమాజం, బైరన్‌లోని కవిని గౌరవించుతూ, అతని వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవటానికి నిరాకరించేది!

అంతేకాదు బైరన్ మానవత్వం, తన బాహిర జీవితానికి భిన్నంగా జీవనశైలి, పాలెస్ నివాసం, విందులు–సేవకుల గుంపు ఇవన్నీ మింగుడు పడేవి కావు! అతని నిరాశావాదం మేరీ షెల్లీని ఆశ్చర్యపరచేది. దీనికితోడు ఈ పీజా గుంపు క్లేర్ చెప్పిన కథలతో మరింతగా బైరన్ అనే వ్యక్తిని నగ్నంగా నిలిపింది!

ఇదంతా అతనికి తెలియదా – అయినా మరో 'బైరన్'ను వారికి పరిచయం చేయటానికి వారికి సమ్మతమైన బైరన్‌ను వెలికి తేవటంలో తన అశక్తతను గుర్తించాడు.

షెల్లీతో మనసు విప్పి మాట్లాడేవాడు కాని, మిగతా వారితో కఠినంగా తెలివిగా సంభాషించేవాడు. ఆ విధంగా తన 'పురాణ పురుష' వ్యక్తిత్వాన్ని భిన్నంగా కాపాడుకున్నాడు.

ఆర్నో తీరాన్ని పైనుంచి చూడటానికి లాఫ్రాంచి పాలెస్ చక్కగా అమరింది. చాలా పెద్ద భవనం! అందులోని చాలా గదుల్లో దయ్యాలుంటాయి. ఫ్లెచర్ చాలాసార్లు గదులు మారాడు కూడా.

ఉదయం పూట బైరన్ తెరాజాతో అక్కడి బత్తాయి తోటలో షికారు చేస్తుండేవాడు. మధ్యాహ్నం తెరాజా, మేరీ షెల్లీతో బగ్గీలో ఊర్లోకి వెళ్ళేది.

బైరన్ – షెల్లీ గుర్రపు స్వారీకి వెళ్ళేవాళ్లు.

కెప్టెన్ విలియమ్స్ ఐరిష్ పౌరుడు. జాక్‌టాఫీ, డాంటే రచనలు అనువాదం చేసినవాడు – కాని కవిగా అసలు నైపుణ్యం లేనివాడు. ప్రిన్స్ మావ్రో కార్డోటో (Prince Mavro Cordoto) మేరీకి గ్రీకు పాఠాలు చెప్పేవారు.

షెల్లీ మారుటి తమ్ముడు, థామస్ మెడ్విన్ (Thomas Medwin) డ్రాగూన్‌లో (Dragoons) మిలిటరీ లెఫ్టినెంట్ – ఇదీ వారి పరివారం! వీరంతా గుర్రాల మీద చాలా దూరం వెళ్లేవారు. అక్కడ ఒక రైతు పొలంలో ఆగి, పిస్టల్ షూటింగ్ అభ్యాసం చేసేవారు. ఆ రైతుకు అతని అంగీకారంతోనే, ఒక నాణెం – అప్పటివరకు అది వారి 'గురి'గా వుండేది! ఇచ్చేవారు!

ఇంటికి తిరిగి వచ్చి – బిలియర్డ్స్ ఆడేవారు. లేదంటే రాత పని చూసేవారు.

రాత్రి భోజనం తర్వాత గంబా కుటుంబాన్ని చూడటానికి వెళ్ళేవాడు బైరన్. తెల్లవారు ఝామున మూడు గంటల వరకూ రాస్తుండేవాడు.

కొన్ని సాయంత్రాలు, తెరాజా, మేరీ, షెల్లీ అపార్ట్‌మెంటుకు వెళ్లి, షెల్లీ తన కవితలు చదవటం ఎంతో ఇష్టంగా వినేది. అలాంటి రోజుల్లో మెడ్విన్ ఒంటరిగా బైరన్ దగ్గరకు వెళ్లేవాడు. అతను మాట్లాడిందంతా 'నోట్సు' రాసుకునేవాడు. ఇది బైరన్‌కు తెలుసు. ఆయనా తన చిన్ననాటి వీరోచిత కార్యాలన్ని పూసగుచ్చినట్లు చెప్పేవాడు.

మెడ్విన్‌కి ఈ గత కాలపు భూతాలు పొరలు పొరలుగా జీవంతో తన ముందు తిరుగుతున్నట్లుండేది. ఇదేనా మేరీ చావర్తు ప్రేమకథ?

"అవి ప్రేమపూరిత దినాలు – ఆమె నేను ఊపిరిపోసిన 'ఊహాసుందరి' – ఆమె చుట్టు నా కాల్పనిక ప్రపంచాన్ని సృష్టించాను. అంతే మొత్తం, స్త్రీ జాతిని అక్కడ ప్రతిష్టించాను.

నిజానికి ఇది నా సృష్టి. ఎందుకంటే మేరీని ఒక దేవతలా సృష్టించాను, ఆమె అందుకు ఏమాత్రం అర్హత లేనిది. మిగతా ఆడవారిలాగే! రూపంలో చాలా సున్నితంగా ఉండేది. కానీ మరీ సన్నగా, ఏమాత్రం ఆకర్షణ వుండేది కాదు. సౌకుమార్యం, రూపలావణ్యం లేవు.

నాకు ఆమె పట్ల ఆకర్షణ చాలా బలీయమైనది. ఆ బంధాన్ని తెంపుకోవటంతో నా హృదయానికి బలమయిన గాయమయ్యింది. ఆమె నన్ను ప్రేమించటం లేదని తెలిసినా..."

తర్వాత అనబెల్లా అతని జీవితంలో దుశ్శకునపు కథ!

".....మొదటిసారి మిస్ మిల్‌బాంక్ (అనబెల్లా) చూసినపుడు అదీ మెట్ల మీద – జారి పడబోయాను. అదే పెద్ద దురదృష్టపు శకునం! ఆ విషయం మూర్‌తో చెప్పాను – అతను నాతోనే వున్నాడు. అలాంటి హెచ్చరికను నేను తీవ్రంగా పరిగణించవలసింది.

".....నాకు జాతకం చెప్పిన శ్రీమతి విలియమ్స్, నాకు 27 వ సంవత్సరం చాల ప్రమాదకరమైన సంవత్సరం అంది. ఆమె చెప్పింది ఎంత సత్యం – జనవరి 2 తారీఖు ఎప్పటికీ మర్చిపోను – నా పెళ్లిరోజు. అక్కడ అవసరం లేని వ్యక్తి లేడీ బైరన్! లేడీ నోయిల్ – ఆమె తల్లి ఏడ్చింది. నేను వణికిపోయాను. అన్నీ తప్పుడు ప్రమాణాలు చేశాను. పెళ్లి తంతు పూర్తయిన తర్వాత ఆమెను 'మిస్ మిల్‌బాంకీ' అని పిలిచాను!.."

ఈ ప్రమాదాలు జరుగుతున్నపుడు ఆగి, తన 'రాతగాణ్ణి' మెడ్విన్‌ను ఓరచూపుతో చూస్తుండేవాడు. తన ప్రభావం ఎలా వుందో తెలుసుకోవటానికి!

డిశంబరు 10 అతను చాలా విచారంగా కనిపించాడు. ఈ రోజు 'అడా' (తన కూతురు) పుట్టినరోజు "......నిజానికి నా జీవితంలో ఈ రోజు చాలా సంతోషంగా గడపవలసిన రోజు. నాకు భయంకరమైన అనుభూతులున్నాయి ఈ సంవత్సరం – తారీఖులతో.

"......నెపోలియన్‌కు జరిగినట్లు – నా పుట్టినరోజు చాలా వింత సంఘటనలు జరిగాయి..."

మర్నాడు మెడ్విన్‌కు ఒక వుత్తరం – ఇంగ్లాండు నుంచి వచ్చినది చూపిస్తాడు. "...రాత్రి నాకు చాలా నమ్మకంగా ఏదో కీడు జరగబోతున్నదని అనిపించింది.

నేను అనుకున్నట్లే డాక్టరు పోలిదోరి చనిపోయాడు. అతను నాకు వ్యక్తిగత వైద్యునిగా వున్నపుడు 'Prussic' ఆమ్లం గురించి చెప్పేవాడు. దాని విషప్రభావాలు కూడా! ఆ విషంతోనే ఇప్పుడు అతను చనిపోయాడు. హఠాత్తుగా..."

జనవరి 28న లేడీ నోయిల్ మరణవార్త తెలుస్తుంది. అంటే లేడీబైరన్ తల్లి – "ప్రపంచం అంతా నాకిది శుభవార్త అనుకుంటారు. ఆమె సంపద లేడీ బైరన్‌కు సంక్రమిస్తుందికదా. అసలు నాకు ఇలాంటి విషయాలపై ఆసక్తి లేదు. ఆమెకు సంతోష లేఖ చాలా కవ్వింపుగా రాశాను..."

ఈ పరిణామంతో పంపకాలు జరుగుతాయి. ఇప్పుడు బైరన్ ఆదాయం సంవత్సరానికి ఏడువేల పౌండ్లు పెరుగుతుంది!

అనబెల్లా – ఈ పరిణామంతో అగస్టాకు కొంత సొమ్ము పంపిస్తుంది!!



షెల్లీ

జనవరి మధ్యలో ఎడ్వర్డు జాన్ ట్రిలానీ అనే పెద్దమనిషి – షెల్లీ పరివారానికి మిత్రుడు. ఒకప్పుడు నావికుడు, తర్వాత సముద్రపు దొంగ. ఆరడుగుల పైన ఎత్తు. నల్లని జుత్తు, అది కూడా ఉంగరాలు తిరిగి ఒత్తుగా నుదిటి మీద పడుతుంటుంది. ముదురు బూడిద రంగు కళ్లు, వత్తైన కనుబొమ్మలు. నిశితంగా బైరన్‌ను పరిశీలించడం మొదలుపెట్టాడు. ట్రిలానీకి షెల్లీ అంటే చచ్చే అభిమానం. కాని బైరన్ అంటే తెలియని అనుమానం!

బైరన్‌కు, తన కార్సెయిర్‌లాంటి వ్యక్తి తన ఎదురుగా కనపడుతుంటే ముందుగా అతనికీ ఉత్సాహంగానే వుంది. ఈ సముద్ర వీరుని ఒక ప్రత్యేక వ్యక్తిగా గౌరవించాడు. ఔత్సాహనికీ, నిపుణునికీ వ్యత్యాసం తెలిసి తనకోసం, షెల్లీకోసం చిన్నపాటి నౌకలు నిర్మించమంటాడు.

బైరన్‌కు లోపల – తన హీరోలకు దగ్గరగా వుండే వ్యక్తులంటే చిరాకు భయం కూడా. ట్రిలానీ కూడా, బైరన్ పట్ల తన అనుమానానికి ఈ విచార వదనంతో కుంటుతూ నడిచే బక్క బైరన్‌ను చైల్డ్ హెరాల్డ్ హీరోగా ఎలా చూస్తాడు? ఇతను Helles point ఈదాడంటే కూడా నమ్మలేకపోయాడు!!

బైరన్ కూడా, ఈ ట్రిలానీ అబద్ధాలు చెప్పటం మానివేస్తే, పెద్దమనిషిగా చెలామణి కావచ్చు అంటాడు. ఇది ట్రిలానీ చెవినిపడి బైరన్‌ను మరింతగా అనుమానంతో ద్వేషించటం మొదలుపెడతాడు.

బైరన్‌కు తన బలహీనతలు బాగా తెలుసు. తన జీవన శైలి, ఇది తన చుట్టూ వున్నవారికి సమ్మతం కాదని, తనలాంటివాడు వుండతగిన విధానం కాదని తెలుసు.

అతనికి తెరాజా – గూసిలీ రాణితో సంబంధాలు సక్రమంగానే వున్నా, ఇదేదో వింత పరిణామంగా అనిపించింది. ఆమె గురించి మాట్లాడుతూ నా ‘అమికా’ (amica) అనేవాడు. తన అవిటి కాలి గురించి 'my little foot' అన్నట్లు! ఇప్పుడు బత్తాయి తోటలో ఆమెతో తిరుగుతున్న ఈ తొడ సంబంధంలో శాశ్వత బంధం ఎంతవరకు? అతనికి Action, Action, Action! కావాలి.

మార్చి 1822 లో మావ్రో కార్డోటో యువరాజు, గ్రీకుల తిరుగుబాటుకు విజయం లభించే అవకాశాలు మెరుగుపడ్డాయని, అలాంటి వారికి నాయకత్వం వహించటానికి బయలుదేరి వెళ్ళిపోతాడు. ఇది బైరన్‌కు చాలా అసూయ కలిగిస్తుంది! ఈ సమయంలోనే, ఈ పీజా మిత్రుల సలహా వినకపోవటంతో, అతని కూతుర్ని అలెగ్రాను తీసుకురావటంలో ఒక విషాదం చోటు చేసుకుంది. కనీసం ఆమెను చూడటానికి కూడా వెళ్ళలేదు. ఆమె కబురు పంపినా కదలలేదు.

అలెగ్రా తల్లి చాలా గట్టిగా వాదించింది. అదీ తన ఉత్తరాల్తో. “ఈ కాన్వెంటు చదువులు పిల్లల్ని చెడగొడుతున్నాయి. ఇటలీలో ప్రయాణించిన ప్రతి యాత్రికుడు బహిరంగంగా చెప్తున్నారు. ఈ కాన్వెంటు వాతావరణం చాలా

దరిద్రంగా వుంటుంది. ఆడవారిని పనికిరాని అమ్మలుగా, అడ్డగోలు భార్యలుగా బాధ్యత లేని, గౌరవించలేని వ్యక్తులుగా, సమాజానికి అప్పగిస్తున్నాయి. అలెగ్రాను అక్కడనుంచి తీసుకుపోయి గౌరవంగా పెంచండి" అని క్లెయిర్ మొత్తుకుంటుంది. అయినా బైరన్ లెక్కచేయడు. ఇలాంటి వాతావరణంలో షెల్లీ దంపతులు ఇమడలేక, పీజా వదిలి వెళ్లిపోవాలని నిర్ణయించుకుంటారు. అందుకు విలియమ్స్ దంపతుల్ని, క్లెయిర్‌ను వేసవి గడపటానికి సముద్ర తీరంలో ఇల్లు వెతకమని పంపిస్తారు. వారు వెళ్లగానే షెల్లీకి, బైరన్ ద్వారా అలెగ్రా మరణవార్త చేరుతుంది!

బైరన్ తనకు ఇష్టం లేని క్లెయిర్‌ను, శిక్షించాలని అనుకుంటాడు. తన అధికారం తండ్రిగా ఉపయోగించి, అమాయకురాలయిన స్త్రీని నిష్కారణంగా కష్టాలపాలు చేస్తాడు. కాని విధి మరో రకంగా బైరన్‌నే శిక్షించింది. తన కూతుర్ని తనే బలి తీసుకున్నట్లయింది! అలెగ్రాను ఎంతగా ప్రేమించాడు! ఆమెను పెంచి పెద్దచేసి చూడాలనుకున్నాడు. తన అందాన్ని, తన నిరాశలను, తన వైఫల్యాలకు ప్రతిరూపంగా చూశాడు. తన వార్ధక్యంలో అలెగ్రా తోడుగా వుంటుందని ఆశించాడు. తన అహంకారంతో జరిగిన నష్టానికి కోపంతో విచారంతో దుఃఖిస్తాడు.

"......ఏదో మరణభయంలాగా అతని ముఖం పాలిపోయింది. అంతే కూలబడిపోయాడు...." గూసిలీ రాణి అలెగ్రా మరణ వార్త విన్న తర్వాత బైరన్ స్థితిని చెప్పింది! ".... కన్నీటి చుక్క రాలేదు. అతని ముఖంలో కనిపించిన నిరాశా నిస్పృహలు, ఒక ప్రశాంత విషణ్ణత, మానవాతీతంగా అనిపించింది. మర్నాడు చాలా నిరాసక్తంగా నిరామయంగా ఉండిపోయాడు. ఆధ్యాత్మిక పరిత్యాగిలా కనిపించాడు!..." అంటుంది.

"... మనందరికంటే ఆమె అదృష్టవంతురాలు. నిజానికి ఆమెను ఈ లౌకిక ప్రపంచం సంతోషంగా ఉండనిచ్చేదా? అందుకే దేవుడామెను తీసుకెళ్ళిపోయాడు...... ఇంకా ఆ విషయం మాట్లాడవద్దు...." ఇదీ బైరన్ ప్రతిస్పందన!

తెరాజా లాగా బైరన్ పట్ల క్లేయిర్ సానుభూతి చూపలేకపోయింది. ఆమె దుఃఖాన్ని ఎవరాపగలరు?

షెల్లీ రాస్తాడు ".... ఈ ఉత్తరం మీ బాధను/గాయాన్ని మళ్ళీ రేపవచ్చు. క్లేయిర్ దుఃఖాన్ని వర్ణించలేను. వీలయితే అలెగ్రా పార్థివ శరీరాన్ని, ఆమెను చూడనివ్వండి. అలెగ్రా బొమ్మ ఒకటి పంపండి.

"........ఈ ప్రకృతిలో మనం ఒక అణువు మాత్రమే. ఫాస్ట్ (Faust) చెప్పినట్లు, 'ఈ మహా ప్రపంచంలో మన చిన్న ప్రపంచం మనం నిర్మించుకుంటాం'. నిజానికి ఆ దివ్యమైన లోకానికి మరో రూపంగా వుండాల్సిన దానికి విరుద్ధంగా..."

బైరన్, అలెగ్రా మరణంతో తన దుఃఖాన్ని తన గత కాలపు ఉద్వేగాలతోనే నింపాడు.

"......ఆమెను హారో కొండ మీద చర్చిలో సమాధి చేయాలని ఆశిస్తాను. ఆ చర్చి ప్రాంగణంలో నడక దారి ప్రక్కన విండ్సర్ (Windsor) కనిపించే స్థలం వుంది. అక్కడే పెద్ద చెట్టు కింద 'పీచే' సమాధి వుంది. అక్కడే కూర్చునేవాణ్ణి గంటల తరబడి. అదే నాకిష్టమైన స్థలం. కాని అక్కడి ప్రార్థనాలయపు ప్రాంగణంలోనే సమాధి చేయాలి. ఆ దగ్గర్లో ఒక ద్వారం ప్రక్కన ఒక స్మృతిఫలకం వుంది, దానిమీద.

దుఃఖాశ్రువులు – ఈ పవిత్ర ధూళిని తడుపుతున్నాయి
కన్నీటి బిందువులు మనకు – దుఃఖం సత్యమే
ఈ దుమ్ము ఆమె కన్నీళ్లతో పునీతమైంది–
ఇదే వేదనామయ నివాళి – ప్రేమస్మృతి

ఇదిగో ఇప్పటికీ నాకు గుర్తున్నాయి – 17 ఏళ్ల తర్వాత అదేమీ చెప్పుకోదగిన గొప్పది కాదు.

కాని నాలో ముద్రపడిపోయింది.

అలెగ్రాను అక్కడే సమాధి చేయాలని కోరిక. ఆమె స్మృతి ఫలకం మీద.



అలెగ్రా స్మృతికి

జి.జి. లార్డ్ బైరన్ కూతురు–

'బాగ్నకవల్లో'లో చనిపోయింది–
ఇటలీ – ఏప్రిల్ 20. 1822.
అయిదు సం॥ మూడు నెలలు!
"నేను ఆమె దగ్గరకు వెళ్తాను.
ఆమె నా వద్దకు రాలేదు". (2nd Samuel XII 23)

ఇదీ బైరన్ విచారమూ, కోరిక!

కాని హారో చర్చి యాజమాన్యం, అలెగ్రాను అక్రమ సంతానం అని చర్చి ప్రాంగణంలో చోటివ్వలేదు. ఆ కొండమీద వున్న చిన్న శ్మశానంలో, అలెగ్రా ఒక గులాబి చెట్టు నీడలో నిద్రపోతోంది.

తనలోని స్తబ్దతను పోగొట్టాలంటే మళ్లీ రాసే పని చూడాలి. పీజాలో బైరన్ చాలా శ్రమ చేస్తాడు. అతను Faust రాసినట్లు ఒక డ్రామా రాశాడు. దాని పేరు The Deformed Transformed. ఇదీ షెల్లీకి ఏమాత్రం నచ్చలేదు. కాని చెప్పుకోదగిన రచనే. మొదటగా అది బైరన్ ఆత్మను, సైతానుకు అమ్మిస్తాడు. గూని పోగొట్టుకోవటానికి "నన్ను ఇతర మానవుల్లా మార్చు – నేను ప్రేమిస్తాను" అంటాడు.

రెండవది ఆర్నాల్డ్ తల్లి 'పోరా గూనివాడా' అంటుంది. 'నేనలాగే పుట్టాను' అంటాడు. ఇవి బైరన్ మాటలే. తన తల్లితో అవి – తన అవిటి కాలు చూసి!

మూడవది – మూడవ అంకంలో ఆర్నాల్డ్ – తనను చూసి, తన పూర్వ రూపం చూసి అసూయ చెందడం తర్వాత, మేథోపార్శ్వంతో ఘర్షణ పడటం... ఇవన్నీ బైరన్ తన వ్యక్తిత్వపు భాగాలన్నింటినీ ఎరుకలోనే

వరుసగా – బైరన్ – బైరన్ మరో బైరన్ – ఇంత స్పష్టంగా ప్రపంచానికి చాటి చెప్పటం.

ఇన్ని రకాలుగా అది విశిష్ట రచనే!!

తర్వాత డాన్ వాన్ మళ్లీ మొదలుపెడతాడు.

"మరో మూడు అధ్యాయాలు రాయటం అసంభవం ఏమీ కాదు. ఎందుకంటే నా ప్రియురాలు నాకు సమ్మతి తెల్పింది, డాన్ వాన్ పూర్తి చేయటానికి. మొదలయితే పెట్టాను కదా ఎలా వస్తుందో చూడాలి."

ఇప్పుడు షెల్లి పరివారం, గంబా కుటుంబం లేకుండా ఒంటరిగా వుంటున్నాడు. ఎక్కువ పని చేయగలుగుతున్నాడు.

బైరన్ సేవకుడు చేసిన చిన్న తప్పు మూలంగా, అక్కడి న్యాయాధిపతి గంబా కుటుంబాన్ని పీజా వదలి వెళ్లిపొమ్మంటాడు. వారు లెగ్‌హారన్ (Leg horn) దగ్గర్లో Monteneroలో భవంతిలో వుండాల్సి వస్తుంది.

ఆ విధంగా 'తెరాజా', బైరన్‌కు దూరంగా వుంటుంది.

ఆమెను చూడటానికి ప్రతి వారం వెళ్ళేవాడు.

ఈ దాగుడు మూతలు, బైరన్‌కు ఆమెపట్ల ప్రేమను 'ఎక్కువ' చేస్తాయి. 'ఆడవాళ్ళు దూరంగా వున్నపుడు ఎక్కువగా ఆకర్షిస్తారు' అంటాడు.

ఎప్పుడూ ప్రక్కనే వుంటే భార్యలాగానే వుంటుంది కదా!

జులై 1, బైరన్ తెరాజా కోసం Montenero వస్తాడు. గంబా కుటుంబంతో గడపటానికి – అప్పుడు 'లీ హంట్' వస్తున్నట్లు వార్త!

షెల్లీ సూచించిన ప్రణాళిక ప్రకారం 'హంటు', బైరన్‌కు ఒక పత్రిక నడిపి అతని రచనలు ప్రచురించాలి.

1815 హంటు కష్టాల్లో వున్నపుడు, రాచరికానికి వ్యతిరేకంగా రాసి జైలుపాలయినపుడు, బైరన్ రక్షిస్తాడు.

ఈ ప్రయాణం హంటు కుటుంబానికి చాలా శ్రమతో కూడింది. ఆరుగురు సంతానం. మాట వినని భార్య! 'మేరియాని'!

వారు లెగ్‌హార్న్‌లో దిగగానే, ట్రిలానీ వెంటనే బైరన్ దగ్గరకు తీసుకువెళ్తాడు. అక్కడ పెద్ద డ్రామా జరుగుతుంటుంది.

బైరన్ సేవకులు గంబా సేవకులు కొట్లాడుకుంటున్నారు. ఆ మధ్యలో 'Pietro Gamba' కల్పించుకుని కత్తిపోట్ల పాలవుతాడు. తెరాజా భయం సిగ్గుతో లోపలికి వెళ్లిపోతుంది. బైరన్ ఈ 'యాక్షన్ డ్రామాను' ఇలా ఇష్టంగా చూస్తుంటాడు. ఆ సమయంలో పోలీసులు వస్తారు. ఇలా అయితే, 'మీ అందర్ని 'టస్కానీ' జిల్లాలోనే వుండనీయము' అని బెదిరిస్తారు.

హంటు ఇదంతా చూసి 'ఇదేమిటి వచ్చిన రోజునే వెళ్లిపోవాలా' అనుకుంటాడు.

అందరూ ట్రిలానీకి హుకుంలు జారీ చేస్తుంటారు. బైరన్ చిన్న నౌక (బోలివార్)ను జెనీవా సరస్సులోకి తీసుకుపోవాలని, అక్కడ్నించి ఫ్రాన్స్‌లోకి, అక్కడ నుంచి అమెరికా ఇలా కంగారు పెడతారు.

ఆ సాయంత్రం షెల్లీ వచ్చి – ఎలా వస్తాడు? అతని ఏరియల్ పడవలో కాసా మాగ్ని (Casa Magni) నుంచి 'ఆర్నో' సముద్రపాయ దాటి వస్తాడు. ఇది అతని జీవన సమరం లాంటిదే. ప్రయాణం – ఏరియల్ బోటులో ఆర్నో సముద్ర పాయను దాటడం తన సిద్ధాంతాలతో మానవ జాతితో పోరాటంలాంటిదే.

షెల్లి వచ్చి, బైరన్ ఇటలీలోనే వుండాలి. హంటు, పత్రిక నడపాలి. అందులో బైరన్ కవితలు ప్రచురించాలి. ఇలా అన్ని సర్దుబాటు చేస్తాడు ఎంతో కష్టపడి.

షెల్లీ, అన్నీ తన భుజాల మీద వేసుకుని, బైరన్ మనసు మార్చుకోవటానికి సమయం ఇవ్వకుండానే, రాతకోతలు పూర్తిచేయించాడు.

అంతే హంటు కుటుంబాన్ని లాఫ్రాంచికి పంపి, వారు సర్దుబాటు అయ్యేవరకు జాగ్రత్త పడతాడు. బైరన్ ఇచ్చిన సొమ్ముతోనే వారికి సామాను కొనిపెడతాడు.

గుడ్డి నమ్మకాలతో నిర్మించబడిన మతంకంటే దాతృత్వంలో మనుగడ సాగించే సమాజం మేలుకదా! అని హంటు రాసుకుంటాడు!

షెల్లీ లెగ్‌హార్న్‌లో వుండి నోటరీతో అన్ని పనులు పూర్తి చేయిస్తాడు. ఆ తరువాత కాసా మాగ్నికి వెళ్లాలి విలియమ్సుతో కలిసి ఏరియల్ పడవలో.

మూడు రోజుల తరవాత, రాత్రి రెండు గంటల సమయంలో, లాఫ్రాంచి పాలెస్ తలుపులు తడతారు. 'ఎవ్వరు' అంటుంది తెరాజా సేవకురాలు.

ఆమె మేరీ, జేనీ విలియమ్స్‌తో వస్తుంది. హంటు నిద్రపోతుంటాడు.

బైరన్ దగ్గరకు వీరిద్దర్ని తీసుకు వెళ్లారు. ఎంతో కష్టంగా మెట్లెక్కుతారు.

వారికి తెరాజా ఎదురవుతోంది. "ఎక్కడ? షెల్లీ ఎక్కడ?" అంటుంది మేరీ!

కానీ బైరన్‌కు, తెరాజాకు ఏమి జరిగిందో తెలియదు.

షెల్లీ, ఆదివారం పీజా నుంచి బయలుదేరాడు. సోమవారం పడవ ఎక్కాడు – తర్వాతి తుఫాను వచ్చింది.

షెల్లీ మరణంతో పీజా పరివారం తమ ఆత్మను కోల్పోయిన భావనతో విడిపోయారు.

ట్రిలానీ, మెడ్విన్ దూరంగా వెళ్లిపోయారు. బైరన్ పరిధిలో మిగిలినవారు మేరీ షెల్లీ – ఆమెకు వెంటనే ఇటలీ వదిలి పోవాలని ధైర్యం చాలలేదు. హంటు పరివారం!

పాపం హంటుకు షెల్లీ మరణం తీరని విచారం కల్గించింది. తన రాక ఒక పీడకలగా మారిపోయింది.

లండన్ బూడిద రంగు ఆకాశం క్రింద నుంచి ఇటలీ ప్రకాశవంతమైన వెలుగులోకి ప్రయాణం అతన్ని ఊపిరాడకుండా చేసింది. దేవునిలాంటి తన స్నేహితుడు కన్పించకుండాపోయాడు. తర్వాత ఆ అద్భుతమైన శరీరాన్ని చేపలు సగం పైగా తినటం చూసాడు. ఆ తరువాత ఆ మిగిలిన అవశేషాలను చితిమంటలు దహించటం చూశాడు. ఉద్వేగంలో బైరన్ మొండిమొలతో అప్పుడే సముద్రంలోకి దూకి ఈదుకుంటూ పోవటం చూశాడు!

ఆ తరువాత బైరన్‌తో గుర్రపు బగ్గీలో ఆ రాత్రి అడవిలో గట్టిగా బిగ్గరగా అరుచుకుంటూ ప్రయాణం చేశాడు.

ఈ పీడకలకు అంతం వున్నట్లు లేదు! ఈ దుర్మార్గపు రాత్రి తెల్లవారేట్లు లేదు!!

షెల్లీ లేకపోవటం జీర్ణించుకోలేకపోతున్నాడు. ఇకముందు షెల్లీ కీచు గొంతు వినపడదు.

గద్దలకు, పిచ్చుకలకు సంధి జేయగల, ఓర్పుగల మధురమైన కంఠస్వరం ఇక ధ్వనించదు.

ఈ దూరతీరంలో, దేశం కాని దేశంలో తన ఒంటరితనం, రోగిష్టి భార్య, ఆరుగురు సంతానం!

ఒక అగాధపు టంచున నిలబడ్డాడు. తన మాట నిలబెట్టుకోవటానికి ఎలాంటి స్థితి!

కొన్ని వారాలు అలా రోజులు గడిచిపోయాయి. బైరన్, షెల్లీ స్మృతికి అంకితమయి వున్నాడు.

అతని మరణం తనని కుదిపివేసినా తను దుఃఖించాడని చెప్పలేము.

జార్జి గోర్డాన్ కూ విధికీ జరుగుతున్న ఈ ఘర్షణలో ఈ విధ్వంసంలో ఎందరిని పోగొట్టుకున్నాడు. తనకు దగ్గరగా వచ్చినవారు అంతమైపోవల్సిందే!

షెల్లీ నీటిలో మునిగిపోయాడు. మాథ్యూస్ నదిలో చిక్కుపడిపోయాడు. లాంగ్ చనిపోయాడు. ఇవన్నీ ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న ప్రతీకారం! అలెగ్రా మరణం!

మళ్లీ తను సాధారణ జీవితాన్ని తప్పనిసరిగా సాగించాలి. ఏదో ఒక రోజు, ఆ అదృశ్య హస్తం తన తలపై పడకుండా వుండదు. ఈ తిరుగుబాటు అతని విచారాన్ని అణగద్రొక్కి దాచివేస్తుంది. కాని కాని, షెల్లీ జ్ఞాపకాలను ఎలా దూరం చేసుకోగలడు? "...అలాంటి నిస్వార్థపరుడు. ఎక్కడుంటాడు..." అంటాడు. ఈ ఒక్క గౌరవంతో బైరన్, హంట్ పరివారాన్ని లాఫ్రాంచి పాలెస్‌లో వుండనిస్తాడు.

బైరన్‌కు తమ రాబోయే పత్రిక 'Liberal' పై చాలా నమ్మకం వుంది. అతని స్నేహితులు హాబ్, మూర్ ఎంతగా నిరుత్సాహపరిచినా!,

'Rimimi - Pimini' రచయిత లీ హంటుతో బైరన్ కలవటం వారికి ఆశ్చర్యంగా వుంది. బైరన్‌కు తన పేరు వుంటే చాలు. అది విజయం సాధిస్తుందని విశ్వాసం! ఆ నమ్మకంతోనే, హంట్‌ను ప్రోత్సహిస్తాడు. ప్రతి వుదయం, రాత్రి తను రాసిన పద్య పాదాలు చూపించేవాడు.

హంట్ ఇప్పటికే ఈ 'అవసరమైన' పోషకునితో అలసిపోయాడు! వారిరువురి అభిప్రాయాలు సరిపడవు. హంట్ తార్కికుడు. బైరన్ మేధావి.

హంట్, ఈ పత్రిక ద్వారా ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఆశిస్తాడు.

బైరన్ తన రాతలన్నీ ఈ పత్రికలో ప్రచురించాలని ఆశిస్తాడు.

బైరన్ ఉదయం నిద్ర లేచి, స్నానం చేసి, 'రోసిని' పాటలు పాడుతూ (స్వరంలో కాదు) అయిన తర్వాత కిటికీలో నుంచి ఓ (Leoutius) 'లీ హంట్' అని గ్రీకులో (ఇది షెల్లీ అల్లిన పదం) పిలిచేవాడు.

హంట్ ఒక నిట్టూర్పుతో లేచి 'శుభోదయం' చెప్పేవాడు. వెనుక తోటలో కలిసేవారు. ఉంటే గూసిలీ రాణి కూడా వచ్చేది. అల్లిక జడలు వేసుకుని, వారిద్దరి వాదనలు వింటూ హంట్ చిరాకు పడేవాడు.

ఇప్పటికీ ఈ ప్రేమికులిద్దరూ ఒకరికొకరు బాగా పరిచయమయ్యారు.

ఒకరిమీద మరొకరి భ్రమలు తొలగిపోతున్నాయి. ఆమెను ఎంత ప్రేమించినా ఉంపుడుగత్తెగానే చూసేవాడు. మరో రకంగా చూస్తే ప్రేమించలేదు. ఆమె

నమ్మకస్తురాలు, ప్రేమికురాలు, కాని ఆడవారికి వుండే అసూయపరురాలు – అంతేకాదు చాలా భావుకురాలు!

ఎలా వీళ్లతో? అంతేకాదు. గూసిలీ రాణి ఎప్పుడూ హంట్ భార్యను పలకరించి ఎరుగదు. బైరన్ అంటే మేరియాని (హంట్ భార్య)కి ఏమీ గౌరవ భావం లేదు!

ఈ విషయం బైరన్‌కు తెలుసుకూడా. అతన్ని ఆశ్చర్య పరచిన విషయం, తన ఇంట్లో నివసిస్తున్న 'ఒక స్త్రీ' తనంటే ఇంత చులకన భావనా? అతనికి ఇది మింగుడు పడని విషయం!

'ఈ హంట్ గుంపును భరించలేకపోతున్నా. ముఖ్యంగా ఆరుగురు పిల్లలు – వాళ్లు ఎంత మురికిగా వుంటారంటే ఏది ముట్టుకున్నా మాసిపోతుంది."

వాళ్లు మెట్లెక్కకుండా బుల్‌డాగ్‌ను కాపలాపెట్టాడు. ఆ చిల్లర గుంపును ఇటు రానివ్వకు అని తన విశ్వాపాత్రమైన జీవికి చెప్తాడు.

మొదటి అంతస్తు క్రింది అంతస్తు! ఇది అంతస్తుల పోరులా అయిపోతోంది.

బైరన్ కవి కాదు అంటాడు హంట్!

పరిస్థితులు ఇలా వుండగా మళ్లీ బైరన్ మూడోసారి గంబాల కోసం లాఫ్రాంచ్ వదిలి వెళ్లిపోవలసి వస్తుంది.

గంబాలను టస్కాన్ ప్రాంతం నుంచి పంపించాలని అధికారులు నిర్ణయిస్తారు. వాళ్లతోపాటు బైరన్, అతనితో పాటు హంట్ పరివారం!

హంట్‌ను పీజాలో వదిలిపోయేంత కఠిన హృదయం బైరన్‌కు లేదు.

సామానులన్నీ వెళ్లిపోతుంటే ఒక మూల కూర్చొని డాన్ వాన్ పాదాలు రాస్తున్నాడు.

చివరికి అతను రాసే బల్లను కూడా సామాను మోసేవాళ్లు తీసుకుపోతారు.



తుఫానులో

XXXIII

వ్యామోహంతో

(1822–1823)

మానవుడు ఆందోళన, గందరగోళంలో ఉడికిపోతూ వుండాలి,
లేదా బద్ధకపు స్తబ్ధతతో మగ్గిపోవాలి!!

–వోల్టేర్

మళ్లీ ప్రయాణం! మళ్లీ నీటిమీద ప్రయాణం!

చైల్డ్ హెరాల్డ్ మూడో యాత్ర! ఒంటరి జీవితం ఇష్టపడే 'ఏకాంత జీవి' ఇప్పుడు తన చుట్టు తప్పనిసరిగా చేరిన గుంపుతో వారిని వదిలించుకునే ధైర్యం లేక నౌకల బారులో బయలుదేరాడు!

ఈ ప్రయాణం లెరిసి నుంచి జెనో వరకు. లార్డ్ బైరన్, తెరాజా, గంబా పరివారం బోలివార్ నౌకలో.

లీ హంటు, మేరియాని హంటు, ఆరుగురు సంతానం, మరొక నౌకలో – ఈ పరివారపు అవసరాలు, అవసరమైన పత్రాలు అన్ని ట్రిలానీ – అడ్మిరల్ ట్రిలాన్ చాలా ఉత్సాహంగా మరో పడవలో...

ఈ విధంగా నౌకలబారు బయలుదేరుతుంది. జంతువులు, పక్షులు, సామాను అన్ని తెడ్లతో నడిపే పడవల్లో ఎక్కిస్తారు!

"....ఈ దృశ్యం చాలా రమణీయంగా వుంది. ఈ నీలి సముద్రపు నీళ్లలో తెల్లని తెరచాపల పడవలు వరుసగా రాళ్ల మధ్యలో నుంచి వెళ్తుంటే చూడటానికి రమణీయంగా వుంది...." అంటాడు హంట్.

కాని ఇవన్ని ఏర్పాట్లు చేయటానికి సేవకులను, నౌకలను ఇంకా ఎన్నో అవసరాలు గడపాలంటే బైరన్‌కు ఈ దృశ్యం చిరాకు కలిగిస్తుంది!

మేరీ షెల్లీ ఆల్బరో (Albaro) దగ్గర్లో చిన్న కొండమీద, సముద్రం అల్లంత దూరంలో కనపడుతూనే వుంది. అక్కడ వరుస గదుల ఇళ్లు తీసుకుంది.

అందులో తనకూ హంటు పరివారానికి వసతి ఏర్పాట్లు చేస్తుంది. దాదాపు 40 గదులు!

బైరన్ కోసం ఒక గులాబి రంగు జమీందారీ భవంతిని Casa Salazzo - కాసాసలాజో కుదురుతుంది. ఆ భవంతికి ప్రక్కనే వున్న సైప్రెస్ చెట్ల నీడల్లో బైరన్ చదువుకుంటాడు. అక్కడ నుంచి చూస్తే సముద్రం గంభీరంగా కనిపిస్తుంది!

ఫ్లెచర్ – బైరన్ గదిలో 'అడా' బొమ్మతోపాటు బైరన్ బొమ్మ (చిత్రం) వేలాడదీస్తాడు.

ఆ పై అంతస్తులో 'గూసిలీ రాణి' నివాసం. ఆమె కుటుంబం మొత్తం అక్కడే విడిది చేస్తారు.

బైరన్‌కు ఈ భవంతికూడా అంతగా కలిసి రాలేదు. ఇక్కడికి వచ్చిన దగ్గర్నుంచి అతని కోరిక ఈ జెనోవా సముద్ర పాయను ఈదాలని! అప్పటికే ఎండ మండిపోతుంది. ఈ సాహసం అతనికి కీడే చేసింది. చర్మం చిట్లిపోతుంది. చాలా ఇబ్బంది పెట్టింది. 'లిబరల్' మొదటి సంచిక పెద్ద సంచలనమే రేపింది. ఇంగ్లండులో దాని ప్రభావం గురించి అతని మిత్రులు హెచ్చరిక లేఖలు రాశారు! దీనివల్ల ప్రచారం బాగా జరిగిందని చెప్పవచ్చు. తన మిత్రులంతా ఉదారవాదులే. కాని లౌకిక ప్రపంచంతో తెగతెంపులు చేసుకోలేదుకదా. అందుకని బైరన్, హంట్ జతకట్టటం చూసి వారు ఎలాంటి ఉత్సాహం చూపలేదు.

బైరన్ వారికి సంజాయిషీ ఇచ్చుకోవలసి వచ్చింది. షెల్లీకి ఇచ్చిన మాటకోసం హంట్ పట్ల ఈ 'దాన' క్రియను చేస్తున్నట్లు – ఈ మాట ఆ నోట ఈ నోట హంటు, లేడీ షెల్లీ చెవిన పడింది. అంతే బైరన్ నెత్తిన పిడుగుపడింది!

హంట్ పేదరికాన్ని ఎగతాళి చేస్తారా – ఇదేనా దాతృత్వం అంటే, ఈ పత్రిక ప్రయోజనం మీకేమీ లేదా? అని వారు నిలదీస్తారు.

బైరన్‌కు పేదరికం తెలియదా? అతను పేదరికంలో నుంచి వచ్చినవాడే. దానిని గౌరవించడం కూడా తెలుసు.

'నేను హంటును ఎప్పుడూ చిన్న చూపు చూడలేదు. కాని ఆదుకోవటానికి వెనకాడలేదు' అంటాడు.

ఈ సంఘటన బైరన్, హంటుల మధ్య దూరం పెంచుతుంది. చివరికి ఒకచోటే వుండి ఉత్తరాలు రాసుకునే స్థితికి వస్తుంది. సంబోధనలు కూడా మారిపోతాయి.

ఇప్పుడు బైరన్ భృతి మీదే ఆధారపడి హంటు పని చేస్తున్నాడు.

ఈ పరిణామాలతో బైరన్ విసిగిపోయాడు. ఇక్కడ జెనోవాలో జీవితం ఇరుకైపోతుంది. ఏమాత్రం ఉత్సాహం లేకుండా పోయింది. సాహసం లేని జీవితం స్తబ్దుగా వుంటుంది. సాహస జీవితంలో ప్రమాదంతోపాటు, ఉత్సాహం ఉంటుంది.

రావెనాలో తెరాజాను కలవటంలో ప్రమాదం పొంచి వుండేది. 'మాంటినీరో'లో పూర్తిగా ఆమె చేతిలోకి వెళ్లిపోతాడు. ఇప్పుడు పీజా తర్వాత జెనోవాలో ఆమె ఒక్కసారిగా వయసుమీరినట్లు కనపడుతోంది. ఆమె స్వచ్ఛమైన ప్రేమ ఏదో మబ్బులు కమ్మినట్లు ఆమె ముఖారవిందాన్ని విచారపు నీడలు కప్పింది. అప్పటికీ బైరన్ ఆమె చేతిలోనే వున్నాడు. కాని ఈ కాలావధిలో బాగా అలసిపోయాడు.

ఇప్పటి అస్తిత్వం తను ఒంటరిగా న్యూస్టెడ్‌లో వున్నప్పటి కంటే మరింత విచారకరమై పోయినట్లు అనుభూతి పొందాడు. న్యూస్టెడ్ ఒంటరి తనంలో, అక్కడ నుంచి హాన్సన్, డల్లాస్ ఇద్దరూ అతని జీవితంలో, తర్వాత లండన్‌లో సింహంలా తిరిగాడు తన కవి హోదాలో. 'నెపోలియన్ – బైరన్' అని అనుకునేవారు.

ఆ మాయ తెర త్వరగానే వెలిసిపోయింది. మళ్లీ ఒంటరిగా నిలబడిపోయాడు. ఏకాంతంలో నుంచి ఒంటరితనం అక్కడ నుంచి మళ్లీ ఏకాంత జీవితం పూర్తిగా వర్తులమైపోయింది.

ఇప్పుడు వెనకకు తిరిగి చూస్తే తన జీవితం ఏమిటి?

మార్చి 1823 పదకొండు గంటల పదినిమిషాలు ఒక అనామక పట్నంలో గులాబి రంగు భవనం, నాలుగేండ్లు పాతబడిన ప్రియురాలు – ఆమె ముసలి తండ్రి – కొన్ని కుక్కలు – తన సేవకుడు ఫ్లెచర్!

ఇంక ఈ ప్రపంచంలో ఏముంది తనకు? అవును. తన యౌవనారంభపు రోజులకంటే ఈ జీవితం మరీ డొల్లగా అనిపిస్తోంది.

దీనికోసమేనా తన సంఘర్షణ? తను బాధలు పడింది? అయినా అతనిలో ఒక శక్తి మిగిలివుంది. అతని ఆలోచనలు ఇంగ్లాండు వైపు మళ్లాయి. ఇంగ్లాండు రాజకీయాలలో తను ఎందుకు పాల్గొనకూడదు?

ఒకప్పుడు ఈ తూర్పు తీరాల కోసం ఆరాటపడ్డాడు. ఇప్పుడు ఉత్తర దిక్కుగా చూస్తున్నాడు. ఇంగ్లీషు బూడిద రంగు ఆకాశం కలలోకి వచ్చింది. నల్లటి మబ్బులు, గాలులలో ప్రయాణం చేయటం చూశాడు. తన 'డాన్ వాన్'ని ఇంగ్లాండు పంపాడు. అతను డోవర్ దగ్గర కొండ కొన చూసి.



అల్బేనియా బజార్

అవిగో తెల్లని గోడలా కన్పడుతున్నాయి!

నీలి సముద్రపుటంచులో - డాన్ వాన్ చూస్తున్నాడు.

ఆల్బియన్ సున్నపు కొండల చారలు

చిన్నారి యాత్రికులు చూసినా గర్వంగా

ఉంటుంది - వారిమధ్యలో వుండాలని-

అక్కడి దుకాణదారుల బేరాలు-

వారి సామాను - ఇదంతా ఒక వ్యసనం!

తప్పనిసరిగా కట్టవలసిన సుంకం!

ఇప్పుడు డాన్ వాన్ కాంటర్ బరీకి వెళ్తున్నాడు-

ఎర్రని ఇటుకలు పొగ నౌకలు!

అంతా దుమ్ము - చీకటి కనుచూపు మేరకు

తెరచాపలు కనపడుతున్నాయి

తర్వాత అడవి - సన్నటి చెట్లు తొంగి చూస్తూ-

బొగ్గు - నిల్వలు - పెద్ద గిడ్డంగి - గోపురం!

అదే లండన్ - మూర్ఖుని కిరీటంలా కనపడుతోంది!

అతని ఊహానాయకుణ్ణి చూసి బైరన్‌కు అసూయగా వుంటుంది. ఈ ప్రయాణం తను చేయలేదు కదా. ఎప్పటికయినా ఇది నిజమవుతుందా? అంతా అనబెల్లా మీద ఆధారపడివుంది. ఇప్పటి తన కాందిశీకుని జీవితానికి కారణం ఆమేకదా! తను ఒక తండ్రి - భర్త హోదాలో లండన్ తిరిగి వెళ్ళగలిగితే - జరిగినదంతా మరచిపోవచ్చు.



గెయిన్స్ బరో

తన భార్య వ్యక్తిత్వం – రూపం అతని మదిలో మెదిలినపుడు అతని ఆలోచనలు మారిపోతున్నాయి. ఆమెలోని ఖచ్చితత్వాన్ని గొప్ప గుణాలను ఆధ్యాత్మికతను దేవునిపట్ల నమ్మకాన్ని – ఇవన్నీ గుర్తించాడు! ఇన్ని సద్గుణాలున్న భార్య తనను క్షమించదా?

ఆ సమయంలో జెనోవా మీదుగా ప్రయాణిస్తున్న కలోనెల్ మాంట్‌గోమెరీని అర్థిస్తాడు, అనబెల్లా చిత్రాన్ని తెప్పించమని! తన దగ్గర ఆమె గుర్తులేమీ లేవు. ఒక చిన్న లెక్కలు రాసే పుస్తకంలో ఆమె చేతిరాత – 'ఇంటి ఖర్చుల కోసం' అని రెండుసార్లు వుంది. అదే భద్రంగా దాచుకున్నాడు.

అతను పీజాలో వున్నపుడు తన కూతురు 'అదా' వెంట్రుకలు పంపింది. అతనిలో ఆశ చిగురించి ఉత్తరం రాస్తాడు.

"అడా జుత్తు పంపినందుకు – అందాయి అని చెప్పటానికి ఈ ఉత్తరం! నా జుత్తులాగానే నల్లగా వుంది. అయితే ఉంగరాలు తిరిగి లేదు. బహుశా పొడవుగా పెరిగి వుంటుంది. పేరు – తారీకు రాసినందుకు ధన్యవాదాలు! ఈ రెండు పదాలే నీ చేతిరాత! అంతకు ముందు నా దగ్గర ఖర్చుల పుస్తకంలో 'ఇంటి ఖర్చుల కోసం' అని రాశావు – అదీ వుంది..."

కాని ఈ వుత్తరం ఆమెకు పంపలేదు, ఆమె ఏ విధంగా స్పందిస్తుందో తెలియక – కాని ఏ విధంగా తన స్థానాన్ని ఈ ప్రపంచంలో సుస్థిర పరచుకోగలడు అనబెల్లా సహాయం లేకుండా? ఇది అతనిలో గాఢంగా తొలుస్తున్న భావన!

ఈ ఆలోచనలన్నీ 1823లో జెనొవా వచ్చిన ఆంగ్ల స్నేహితులు – అప్పటికే పేరుప్రఖ్యాతులున్న లేడీ బ్లెస్సింగ్‌టన్‌తో పంచుకుంటాడు.

ఈమె రచయిత్రి. 1812లో బైరన్‌తో పరిచయమున్న వ్యక్తి. ఆ తరవాత లార్డ్ బ్లెస్సింగ్‌టన్‌ను పెళ్లి చేసుకుని రచయిత్రిగా పేరు గడించింది. మూర్‌కు ఆమె రచనలంటే చాలా గౌరవం.



ఆల్‌ఫ్రెడ్ వేసిన బొమ్మ

ఏప్రిల్ ఒకటవ తేదీ - 1823 బైరన్‌ను చూడటానికి వచ్చి కబురుపెడతారు. లార్డ్ బ్లెస్సింగ్‌టన్ - ఆల్‌ఫ్రెడ్ డి ఓర్సే! వారిని చూసి బైరన్ ఎంతో ఆనందిస్తాడు. "మిమ్మల్ని కలవటానికి లేడీ బ్లెసింగ్‌టన్ బగ్గీలో వున్నారు" అని చెప్పగానే హడావుడిగా, కుంటికాలితో మెట్లు దిగి, ఆగి ఆమెను ఆహ్వానించి భవంతిలోకి తీసుకువస్తాడు.

బైరన్‌ను కలవటానికి ఆమె కొద్దిరోజులుగా వేచి వుంది. ఆమెకు లోపల తను నిరాశకు గురికావలసి వస్తుందని అనుమానం కూడా వుంది. అదే నిజమవుతుంది.

బైరన్‌ను చూసి ఆమె చాలా నిరాశ చెందింది. ఏమిటి ఏమయింది? ఒక ఆజానుబాహుణ్ణి, అందగాణ్ణి కలుస్తానని ఆశించింది. కాని తన ఎదురుగా వంగి, క్రుంగిన శరీరంతో, కాని చెక్కినట్లున్న ముఖకవళికలు తీక్షణమైన కళ్లు - కాని బక్కగా వడిలిపోయిన శరీరం, ఇవీ ఆమెకు కనిపించింది!

అతని కదలికల్లో ఏదో విస్మృతం వుంది. అది అతని మానసిక డోలాయమాన స్థితికి ప్రతిస్పందన.

ఆ తరువాత వారి సమాగమాలు దాదాపు మూడునెలలు జెనోవాలో జరిగాయి. బైరన్ గురించి, లేడీ బ్లెస్సింగ్‌టన్ రాసిన వివరాలు బహుశా అంత సజీవంగా అంత నిజాయితీగా మరెవ్వరూ ఇవ్వలేదు.

ఆమె అతన్ని చాలా బాగా అర్థం చేసుకుంది. అతనిలోని దాతృత్వం – అనారోగ్యకరమైన 'నిర్ణయ జ్ఞానం', ఇవి యుక్తవయసులో మంచి వ్యక్తిత్వానికి ఉపయోగపడేది – కాని, అతని అపరిపక్వమైన వక్రబుద్ధి – అలాంటి వ్యక్తిత్వాన్ని విత్తులోనే ప్రాణం పోసుకోనివ్వలేదు. కాని పూర్తిగా చంపనూలేదు.

బైరన్ ఎన్నోసార్లు అన్నట్లు అతను 'Fallen Angel' అవును పతనమైన గంధర్వుడు.

అతనిలో గంధర్వ లక్షణాలన్నీ వున్నాయి. కాని ప్రపంచంలోని, కుళ్లుని – కాపట్యాన్ని చూసిన తరువాత, మనుషుల తీపిఅబద్ధాలు విని తన ధోరణి మార్చుకున్నాడు.

ఆమెతో బైరన్ మనసు విప్పి మాట్లాడాడు. తన గురించి ఇతరుల గురించి విపులంగా వివరించేవాడు. అంతటా స్వార్థం, కపట నాటకాలే – ప్రపంచం అంతా అనేవాడు.

ప్రేమ వ్యవహారాల గురించి ఎగతాళిగా నవ్వుతూ చెప్పేవాడు. తన వరకు వచ్చేసరికి అతని కళ్ళల్లో నీళ్లు నిలిచేవి! తనను ప్రక్షాళన చేసుకోవటానికే ఇతరులను, హాస్యమో ఎగతాళో చేస్తున్నాడని ఆమె గ్రహించింది.

విషాద గీతాలు చదివే సమయంలో, హాస్యమూ ఎగతాళి కలిపి వ్యక్తపరిచేవాడు.

తనలోని గొప్ప గుణాలను గుర్తించటానికి ఇష్టపడేవాడు కాదు. తన వైఫల్యాలను ఎక్కువ చేసి చెప్పేవాడు.

ఇక మతపరమైన విషయాలను – నాస్తికుడు కాదు, కాని అనుమానాస్పదుడు – ఏమయిన ఆస్తికునిగానే పరిగణించాలి.

"ప్రకృతిలోని – వసంతం, వెన్నెల, ఎన్నో అందమైన దృశ్యాలు, ఇవన్నీ ఆధ్యాత్మిక ఆలోచనలను రేకెత్తిస్తాయి."

మతనమ్మకాలకంటే, మూఢనమ్మకాలు ఎక్కువ నమ్ముతాడు. ఇది ఎలా సాధ్యం అని అంటే అతనికి కోపం వస్తుంది.

మీకు తెలుసా "షెల్లీ – ఈ ప్రాంతంలో ఆత్మ రూపంలో ఒక స్త్రీకి కనిపించాడు" అంటాడు.

శుక్రవారం అంటే భయం – గ్లాసు పగిలితే భయం, ఉప్పుగల్లు చిందితే భయం!

అతని లౌకిక జ్ఞానం గొప్పది. గుంపులు, సమూహాలు గిట్టని బైరన్‌కు, అంతటి లోక జ్ఞానం ఎలా అబ్బిందో ఆశ్చర్యమే.

వివాహం పట్ల అతనికి ఎనలేని నమ్మకం. వివాహేతర సంబంధాల్లో ఆనందం లేదంటాడు. 'వివాహ బంధమే సంతోషాన్నిస్తుంది. దానిలోని మతానికి, నైతికతకూ సంబంధాన్ని ప్రక్కన పెడదాం. కాని వాటి మూలంగా కష్టాలే ఎక్కువవుతాయి. ప్రేమ వ్యవహారాలు, వివాహేతర ప్రేమలు ఏమాత్రం ఆనందాన్ని ఇవ్వలేవు. ఆ పరిస్థితుల్లో స్త్రీ ఆలోచన – భావావేశం సక్రమంగా వుండవు – పైగా అసూయతో తమ రమణీయ సౌందర్యాన్ని మలినం చేసుకుంటారు. గౌరవం తగ్గి అసూయ పెరిగినపుడు అన్నీ చిన్నబోతాయి. పెళ్లి మూలంగా ఎలాంటి బంధాలుంటాయని భయపడతామో వాటిని మించిన శృంఖలాలు తగులుకుంటాయి. వివాహ గౌరవం లేకుండా!!

ఇదంతా ఎవరి గురించి చెప్తున్నాడు? తన అనుభవం – ఇప్పుడు తెరాజాతో తన నాలుగేళ్ల ప్రేమ వ్యవహరమా?

ఇప్పుడు బైరన్, లేడీ బ్లెస్సింగ్‌టన్‌ను కలవటం కూడా భరించలేకపోతోంది – తెరాజా!

దీనివల్ల బైరన్ తన ఆత్మశోధనకు ఎక్కువ అవకాశం వచ్చింది.

"....నా చిన్ననాటి విషయాలు – అప్పటి నా ఆలోచనలన్ని గుర్తున్నాయి. వాటి గాఢత – ముద్రింపబడిపోయింది. చెరగని ముద్రలు వేశాయి. నా తల్లి, పాపం ఎన్ని కష్టాలు పడింది – నా సహవిద్యార్థులు, నా కుంటితనం, నా దురదృష్టం. ఇవన్నీ నేను సాధించలేని విజయాలు.

మనలోని అల్ప విషయాలు – బలహీనతలు వాటి మూలంగా కలిగిన చేదు అనుభూతులు ప్రపంచంపట్ల మన దృక్పథాన్ని మరింత చేదుగా మారుస్తుంది."

బైరన్ తన చిన్ననాటి యౌవనంలోని భావనలలో నుంచి ఎప్పటికీ బైటపడలేదు. వయసు మీద పడినపుడు చిన్ననాటి భ్రమలన్నీ, రూపం మార్చుకుంటాయి. అయినా నేను ముసలివానిగా ఎదగను – నా యౌవనం నాకివ్వండి – అదే హేతుబద్ధంగా వుంటుంది. వయసు చల్లబడిపోతుంది. పక్షపాతంతో!

నా యౌవనపు రోజులు గుర్తున్నాయి. ఎవరైనా నా పట్ల ప్రేమగా వుంటే నా హృదయం పరవళ్లు తొక్కేది, ఆవేశంతో! ఇప్పుడు నాకు ముప్పయి ఆరు. ఇది మరీ ఎక్కువ కాదు.

కాని నా గుండెల్లోని ప్రేమను, అదే చివరి దశలో వున్న చలిమంటలాంటిదే – ఇప్పుడు ఏ విధంగా చిదుగులు ఎగదోయగలను?

ఆరిపోతున్న ప్రేమ జ్వాలను ఎవరు రగిలిస్తారు?

లేడీ బ్లెస్సింగటన్‌కు ఈ ముప్పయ్యారేళ్ల స్కూలు పిల్లవాడు ఎంత వింతగా ఆశ్చర్యంగా ఇష్టంగా కనిపించాడు! అతనిలో భావుకుడు, తన వైఫల్యాలకు విచారించే నిరాశాపరుడు, "పాపం బైరన్" అనుకుంది – ఇది ఎక్కడో విన్నట్లు లేదూ? అవును – అనబెల్లాతో బైరన్ ఇలాగే అనేవాడు...

"పాపం బైరన్...." అని! ఆమెను ఆటపట్టిస్తూ చిన్న పిల్లవాని మాదిరిగా! ఇప్పుడు అదే మాట లేడీ బ్లెస్సింగ్‌టన్ తన వంతుగా అంటుంది!

"...పాపం బైరన్! బలహీనుడు, ధనవంతుడు, బహిష్కృతుడు/తోసివేయబడ్డాడు, అంతస్తున్నవాడు, మేధావి – అయినా పాపం బైరన్, ఎంత పేదవాడు?"

--0--

ఈ రెండు నెలలు – ఏప్రిల్–మే 1823 – బైరన్ తన సంబంధాన్ని లేడీ బ్లెస్సింగ్‌టన్‌తో మానసికంగా దగ్గరవుతాడు, అనుబంధంగా చేసుకోగలిగాడు!

ఈ సమయంలోనే 'కౌంటు డీ ఆర్ఫ్రేడ్' బైరన్ చిత్రాన్ని గీస్తాడు. అలాగే పీట్రో గాంబాది కూడా.

లేడీ బ్లెస్సింగ్‌టన్‌తో సంభాషించటం బైరన్‌కు ఉత్సాహం కలిగిస్తుంది. తన ప్రియురాలి – పనికిరాని వాగుడు నుంచి అతనికి కాస్త ఊరట కూడా లభించింది.

ఈ మిత్రులు వెళ్లిపోతుంటే బైరన్ విచారంలో మునిగిపోయాడు. చివరిసారిగా వారిని కలిసినపుడు ముగ్గురికీ జ్ఞాపికలు తెచ్చిస్తాడు. అప్పుడు అతను కళ్లు నీళ్లతో నిండిపోయాయి. “అరే ఇదేమిటి పిచ్చితనం....” అని వాటిని తుడిచివేస్తాడు! డాబుసరిగా.

ఈ సమయంలోనే ‘డాన్ వాన్’ గొప్పగా పది అధ్యాయాలు రాస్తాడు. పీజాలో జెనోవాలో తన మానసిక ఏకాంతం దానికి గొప్ప వాతావరణం సృష్టించింది. దానిలోని మార్మిక, ధార్మిక పదబంధాలు అద్భుతంగా అమరాయి.

ఈ కావ్యం పరిధి బాగా పెరిగిపోయింది కూడా.

వాన్ అతనే కథానాయకుడు. అతని సాహసాలు కవితా వస్తువుకు ఒక సాకు మాత్రమే. ‘గలీవర్ ప్రయాణం’లాగా – అది ప్రస్తుతం ఇంగ్లాండును పరిపాలిస్తున్న వర్గానికి వ్యతిరేకంగా ఎగతాళి, అధిక్షేపం!

వాళ్లంటే బైరన్‌కు ఎప్పుడూ అయిష్టమే. మొదటి నుంచి ప్రతిపక్షంలోనే పెరిగాడు. హౌస్ ఆఫ్ లార్డ్స్‌లోకి వీరిని విమర్శించటానికీ ప్రవేశించాడు.

తన సమకాలీన, సమాజంలో అతను అపరిచితునిగానే మిగిలిపోయాడు. ఈ ఘర్షణలో అతను నలిగిపోయాడు. కాని అందుకు ఏమీ ఆశ్చర్యపోలేదు.

ఇక్కడ నుంచి ఇంతకాలం తర్వాత ఆంగ్ల సమాజాన్ని చూడటంలో అతనికి ఒక వెసులుబాటు వుంది. వారి సిద్ధాంతాలన్నీ రక్తసిక్తమై కూలిపోయాయి – తనను, మానవీయ విలువలకు వత్తాసు పలికిన తనను వెక్కిరిస్తారా?

హారి దేవుడా! వీరి అకృత్యాలకు అంతులేదా–

డాంటే కంటే ఎక్కువ చెప్పలేను–

సాలమన్ – సెర్వాంటిస్ – స్విఫ్ట్

Byron

మాచివల్, రోచిషోకాల్డ్, ఫెనిలాన్

లూథర్, ప్లాటా, టిల్లోట్సన్, వెస్లీ

రూసో, వీరందరికంటే ఎక్కువ చెప్పలేను

ఎవరికి తెలుసు – ఈ జీవితం విలువ ఒక దుంప కూడా కాదని!


ప్రకృతిని పరిశీలించినా, మన ఆలోచనలను విచారించినా, ఒక్కటే అర్థమవుతుంది – ఒక వ్యవస్థ మరోదానిని మింగేస్తుంది–

సైతాను తన సంతానాన్ని మింగినట్లు!

"......నాకు తెలిసింది ఏముంది – ఏదీ కాదనలేను – అంగీకరించలేను – నిరాకరించను – ద్వేషించను – ఏమితెలుసు – కేవలం మనం చనిపోవటానికే పుట్టామని!

ఈ రెంటిలో కూడా సత్యం లేకపోవచ్చుని!!...."

ఇది – ఈ విషయం బైరన్ మొదటి నుంచీ చెప్తూనే వున్నాడు! చైల్డ్ హెరాల్డ్ రూపంలో – అప్పటి రోజుల్లో మతసంస్థల అకృత్యాలు – వ్యవస్థల దుష్కృత్యాలు – అతన్ని 'మానవ ప్రయత్నాలన్నీ నిష్ఫలాలే' నని సంశయించాడు. అప్పుడు గ్రీసు తుర్కుల చేతుల్లో బందీ అయిన గ్రీసు భవితవ్యాన్ని గురించే మాట్లాడాడు. కాని ఇప్పుడు ఇటలీనిని దగ్గరగా చూసి తన సాహసాల వేటలో ఈ అన్యాయం ప్రపంచ వ్యాప్తంగా జరుగుతోందని


శిథిల సామ్రాజ్యం

ఇది రాజకీయంగా నమ్మ దగిందని అనుకున్నాడు.



తన మెట్ట వేదాంతం – చావు పుట్టుకల గురించి రాజకీయంగా దర్శించవలసిన అవసరం లేదనుకున్నాడు.

దానికి భిన్నంగా మానవజాతి మొత్తం పరస్పర వ్యతిరేక, నిరర్థక సాహసంతో నాశనమయిపోవాలా? ఒకరికొకరు సహాయం చేసుకోలేమా?

షెల్లీ చెప్పినట్లు, గోతే అన్నట్లు, ఈ విశ్వాంతరాళంలో మన చిన్న ప్రపంచాన్ని నిర్మించుకోలేమా? వోల్టేర్ – నిరాశతో, బాధితుడయిన కాలస్ (Calas) కోసం పోరాటం సలిపాడు–

ఇప్పుడు బైరన్ స్వాతంత్ర్యం కోసం పోరాడలేడా?
నేను యుద్ధం చేస్తాను – కనీసం మాటల్తో–
వీలయితే ప్రత్యక్షంగా ఆలోచనలకు వ్యతిరేకంగా,
మేధోవర్గపు శత్రువులతో – వీరే నిరంకుశులు,
కాకా రాయుళ్ళు, విజయం ఎవరిదో చెప్పలేను–
నిరంకుశులను ప్రపంచవ్యాప్తంగా
అన్ని దేశాలలోని నిరంకుశులు నాశనం చేయాలి!

“...... నేను కోరేది – మానవజాతిని విడుదల చేయాలి
రాజుల నుంచి – జనసమూహాల నుంచి,
మీ నుంచి – నా నుంచి....”





తన కావ్యంలో తన కథానాయకుణ్ణి

రూసో – టర్కీష్ ప్రచారానికి పంపుతాడు–

ఆ విధంగా మనిషి జీవితాన్ని ఎంత చౌకబారుగా

ఈ నాయకులు పరిగణిస్తారో – యుద్ధం పేరుతో

మారణకాండ ఎలా చేస్తున్నారో – దానినే సైనిక

విజయాలని – ఆ పేరుతో తమ సైనిక దుస్తులకు

రిబ్బన్లు, మెడల్సు తగిలించుకుంటున్నారోనని

ఎండగట్టాడు. ఆ విధంగా ఒక 'బంగారు బిళ్ల' కోసం

జీవితాలను పణంగా పెట్టడం ఎంత తెలివితక్కువ సాహసం?

అరె – కేవలం బుల్లెటిన్‌లో పేరు

పడాలంటే – శరీరంలో బుల్లెట్ దిగాలా?

ఇలా అడగటంలో తప్పేముంది?

ఒక కన్నీటి బిందువు ఆరిపోవటంకంటే కీర్తి, గౌరవం, పేరుతో ఉప్పొంగే సముద్రాలు ఎండిపోవటం మేలు కదా!



తన కవిత్వం 'ఆధునికం' – ఇది సైనికుల గుండెల్లో మార్మోగాలి. తమ నాయకుల అహంకారానికి బాధలపాలయిన సామాన్యుల స్థితిగతులను విప్పిచెప్పాలి!

నేను గులకరాళ్లకు కూడా బోధిస్తాను
ఈ నేల మీది నిరంకుశులకు వ్యతిరేకంగా నిలబడమని–
మళ్లీ రాళ్లలాగా మారి – సింహాసనాలనకు పీఠంలా మారవద్దని–
ఈ ప్రపంచానికి స్వాతంత్ర్యం రాక పూర్వం
ఎలా వుండేదో, ఎలా వుందో మన తర్వాతి తరాలకు చూపాలి!

వయస్సు మనకు ఎన్ని నేర్పుతుంది – అనుమానాలను – వ్యతిరేక భావాలను రెచ్చగొడుతుంది. వైఫల్యాల భయాన్ని ముందు పెడుతుంది.

కథానాయకులందరూ ఒంటరిగాళ్లే–
గాయాలకు కట్టుకట్టుకుంటూ–
తప్పుడు గుంపును వ్యతిరేకిస్తూ–
ఆడవాళ్లకు సహాయం చేస్తూ–
బలవంతుల గుంపులతో ఒంటరిగా పోరాడుతూ–
విదేశీ శృంఖలాలనుంచి తన వాళ్లను విడిపించాలని
ఆరాటపడుతూ – కథానాయకుడు అలసిపోతున్నాడు–
సోక్రటీస్ – డాన్ కిక్సోట్ ఏమయ్యారు?



ఆ విధంగా బైరన్, తన పెరట్లో సైప్రస్ చెట్ల నీడల్లో నడుస్తూ ఆలోచిస్తున్నాడు. తన ఆలోచనలకు ఆవేశాలకు బందీ – ఎప్పుడూ నిరంతరం ఉత్సాహంతో ఉరకలు వేసే ఆవేశం!

స్వాతంత్ర్యం – స్వేచ్ఛ – సాహసం – శూరత్వం – కీర్తి.

ఇవీ అతని ఆలోచనలనిండా.

ఈ ప్రపంచానికి ఈ దయనీయ ప్రపంచానికి తన ఉనికిని తన శూరత్వాన్ని చూపవద్దూ? తనేమి కావాలి – హామ్లెటా? డాన్ కిక్సోటా? న్యాయం కోసం పోరాడి ఓడిపోయిన హామ్లెట్టా!

కేవలం కలల ప్రపంచంలో ఆలోచనతో – కార్యరూపం కాని సాహసికుడు?

ఏమో, తన గురించి తనకు తెలుసా, తనకు మార్పు సహజమే.

తన చిన్ననాటి భ్రమలన్నీ – జ్ఞానంతో తేటతెల్లంగా పటాపంచలయి పోలేదా? అసలు జ్ఞానమే ఒక భ్రమ కాదా?

ఇంకోసారి ఈ విశ్వాన్ని మార్చివేద్దాం అనుకుంటాడు. మరోసారి నిరాశగా నక్షత్రాలవంక చూస్తాడు.

"....రెండు ప్రపంచాల మధ్య నక్షత్రంలా ఊగుతూ
రాత్రి పగలు నడుమ దిగంతానికి చివర వేలాడుతూ
'మనకేమి తెలుసు? మన అస్తిత్వం ఏమిటి?'
అనంతంగా కాలం గడిచిపోతుంది – అలలాగా దొర్లిపోతుంది–
మనం – నీటి బుడగల మాదిరి కొట్టుకుపోతాం–
పగిలిపోతూ – కొత్తవి పుడుతూ
అనంతం నుంచి వచ్చి పడుతూ–
సామ్రాజ్యాల సమాధులు కేవలం
దొర్లిపోతున్న అలలు కాదా..."

XXXIV

సైనికుడు – కథానాయకుడు!

(1823)

మనం అంతగా పట్టించుకోని విషయాలే మన జీవితాలలో గొప్ప సంఘటనకు దారితీస్తాయి. మన మాటలలో పనుల్లో ఎంతగా లీనమై పోతామంటే ఎంతో సున్నితమైన చిక్కుల్లోపడి చివరికి, ఒక దారి, బైటపడడానికి ఒకే ఒక ద్వారం తెరచి వుంటుంది. ఇక తప్పని సరిగా మన సిద్ధాంతాల కోసం మన జీవితాలను పణంగా పెట్టాల్సి వస్తుంది.

గొప్పవాళ్లంతా ఇలాంటి దారిలోనే నడవవలసి వచ్చింది. ఆత్మ బలిదానానికి శారీరకంగా సిద్ధపడటమే శూరత్వమంటే!

గత రెండేళ్లుగా బైరన్, గ్రీకుల తిరుగుబాటు పోరాటాలను గమనిస్తున్నాడు. మావ్రొకార్డొటో యువరాజు పీజా నుంచి ఈ తిరుగుబాటు దారులకు నాయకత్వం వహించటానికి వెళ్లినపుడు, బైరన్ తన వాళ్లందరికీ తను కూడా ఆయన వెంట వెళ్లటానికి ఉత్సాహపడుతున్నట్లు చెప్పాడు.

అదే విషయం మూర్‌కు రాస్తాడు – గంబా కుటుంబంతో కూడా ఒకటికి పదిసార్లు అంటాడు – మెడ్విన్ ఈ విషయం తన పుస్తకాలలో రాశాడు కూడా – "నేను గ్రీసు వెళ్తాను – బహుశా అక్కడే చనిపోవచ్చు....." అని! ఎన్ని చెప్పినా ట్రిలానీ మాత్రం నమ్మలేదు. నిజానికి పీజాలో ఎవ్వరూ కూడా – బైరన్ ప్రణాళికలను అంతగా పట్టించుకోరు. ఎన్నోసార్లు వెనిజులా, అమెరికా ఇంగ్లాండు చివరికి గ్రీసు వెళ్తానని అంటూనే ఉంటాడు. ఇంతలో ఏ అందగత్తో లేదా ఏదైనా కొత్త

కవిత్వపు ఆలోచన రాగానే ఈ ప్రయాణాలన్నీ పక్కన పెడతాడు. అంతేనా ఏదేనా 'శకునం' కూడా అతన్ని ఆపివేయగలదు!

అతని స్నేహితుల దృష్టిలో అతను మెత్తనివాడు – సున్నితుడు! బలహీనుడు – ఆవేశపరుడు – ప్రతి విషయంలో కూడా కార్యరూపానికి దూరంగా వుంటాడు!

ఏది ఏమయినా ఈ 'గ్రీకు' వ్యవహారం అతన్ని వదలలేదు. అంటే అతనికి తుర్కులంటే ద్వేషం వుండి కాదు. నిజానికి క్రితం సారి అతని ప్రయాణంలో వారు చూపిన ఆతిథ్యం అతనికింకా గుర్తు వుంది. ఆ రోజుల్లోనే గ్రీసు పరాధీనమయి వుండటం విచారించాడు. కాని అప్పుడు ఆ దాస్య శృంఖలాల నుంచి గ్రీసును విముక్తి చేయటం అసంభవమనుకున్నాడు.

కాని, ఇప్పటి పరిస్థితులు మారాయి. అన్నిచోట్లా తిరుగుబాటు జెండాలు లేస్తున్నాయి. తుర్కులు తమ అధికారాన్ని ప్రభుత్వ రూపంలో అన్ని ప్రాంతాల్లో స్థాపించలేకపోయారు. అది కేవలం గుడారం మాదిరిగా తాత్కాలికంగా వుండి గట్టిగా గాలి వీస్తే లేచిపోయేట్లుంది! ఈ గుడారం ఐరోపా గుమ్మంలో వుండటం, ఇది అందరికీ తలనొప్పిగానే వుంది.

18 వ శతాబ్దంలో గ్రీకులు ఎందుకు ఎదురు తిరగలేకపోయారు? దీనికి సరైన కారణమే వుంది – మానవ జాతి శక్తులందరిలోకి, ఆధ్యాత్మికవాదులే సామర్థ్యం కలవారు! తిరుగుబాటు చేయాలంటే ముందు ఎవరు పోరాటాన్ని నమ్మాలి – 'ఫ్రెంచి రివల్యూషన్' తర్వాతనే – 'స్వతంత్రం' 'పౌరహక్కుల' గురించిన 'పదాలు' వాడుకలోకి వచ్చాయి. చైల్డ్ హెరాల్డ్ పద్యపాదాలలో బైరన్ యూరోప్ గురించి గ్రీకులకు తెలియచెప్పాడు. అప్పటి వరకు తమ బానిసత్వం తమకు సహజమనే భావనలోనే వుండిపోయారు! అంటే బానిసలమనే విషయమే మరుగున పడిపోయింది.

ఈ తిరుగుబాటు ముందు రహస్యంగా, రహస్య సంఘాలు చేపట్టాయి. అందుకు వీరు రష్యా సహాయం కోసం ఎదురు చూశారు. కాని 'జారు' Tsar చక్రవర్తులకు దీనిలో విప్లవం కనిపించింది!

అలాగే ఇంగ్లాండు, ఆస్ట్రియాలో కూడా సానుభూతి అంతగా లేదు.

బ్రిటిష్ విదేశాంగ విధానం ఏమాత్రం సానుకూలంగా లేదు. ఫ్రాన్సు ఏదో అత్తెసరుగా సహాయం అందిస్తోంది, ఇచ్ఛాపూర్వకంగా పోరాడే సైనికులను పంపించి!

చివరికి గ్రీకులు తమ మీద తామే ఆధారపడవలసిన పరిస్థితి దాపురించింది.

1823లో చాలా స్వతంత్ర్య జ్యోతులు వెలిగాయి. గ్రీకు ద్వీపాలలో – పట్రాస్ ఆర్చి బిషప్ జర్మనోస్, కొండ దారులు పట్టి ప్రట్రాస్ పట్టణాన్ని విడిపించారు. అదేరోజున కొలుకోట్రానిక్స్ – మోరియా ప్రాంతాన్ని విముక్తి పరిచాడు. ఒడిసీయస్ తూర్పు గ్రీసు బంధాన్ని తెంచాడు. పడమర గ్రీసు మావ్రొకార్టోటో యువరాజు అధీనంలో వుంది.

ఈ యువరాజుకు మిగతా కొండ వీరులకు ఖచ్చితమైన తేడా వుంది. ఈ విభేధాలే తుర్కులకు అనుకూలంగా మారుతున్నాయి! కాని మిగతా ఐరోపాలో ఈ గ్రీకువీరుల విజయాలు కొత్త ఆశల్ని రేకెత్తించాయి. అంతేకాదు ప్రతి దేశంలోని ఉదారవాదులకు ఇది కొత్త సందేశాన్నిచ్చింది.

నెపోలియన్ సైన్యంలో పనిచేసిన అధికారులు 'జేనా' విద్యార్థులు, స్విట్జర్లాండు సైనికులు, ఇప్పుడు గ్రీసు తరఫున పోరాడటానికి తరలి వస్తున్నారు!

ఇంగ్లాండులో ప్రభుత్వం దీనికి వ్యతిరేకంగా వున్నా, గ్రీసు నుంచి ఒక అధికారి Andreas Lurottis జనవరి 1823లో బ్రిటీష్ ప్రభుత్వంతో సంప్రదింపులకు, సహాయం అడగటానికి వస్తాడు. దీనితో కొందరు 'విగ్గు' పార్టీ పార్లమెంటు సభ్యులు – ప్రభుత్వం మీద వత్తిడి తెచ్చి "గ్రీకు కమిటీ" వేయించగలుగుతారు. అయితే అన్ని కమిటీల లాగానే ఇది కూడా పనికి రాని పత్రాలు ప్రచురించి ఖరీదయిన విందులు ఇచ్చి అసలు పని మాత్రం ఏమీ చేయకుండా వుండిపోతుంది. ఆ కమిటీలో జరెమీ బెంతామ్ (Jeremy Benthan) వున్నారు. ఈయన 'ఇంటర్నేషనల్' 'కోడిఫై' (Codify) అనే పదాలను సృష్టించిన వ్యక్తి!

విశ్వవిద్యాలయాలు, జైళ్లు – హేతువాద చట్టాలు మొదలయిన సంస్కరణలను తెచ్చిన వారిలో సర్ ఫ్రాన్సిస్ బుర్డెట్, హాబ్‌హౌస్ లాంటి రాడికల్ సభ్యులు,

కిన్నార్డ్ లాంటి బాంకు అధిపతులు, వున్నారు. సెక్రటరీగా జాన్ బేరింగ్ వ్యవహరిస్తున్నారు!

ఈ కమిటీ, గ్రీసుకు ఎడ్వర్డు బ్లేకేర్‌ను పంపి, అక్కడ జరుగుతున్నదేమిటో తెలుసుకుని వివరాలు పంపాలని కోరతారు. ఈ ఎడ్వర్డు బ్లాకేరు, ట్రిలానీకి పరిచయమున్న వ్యక్తి. ట్రిలానీ ఆయనతో బైరన్ తరచుగా గ్రీసుకు వెళ్లే ఆలోచనలో వున్నారని, కిన్నార్డ్‌కు, హాబ్‌కు కూడా ఈ విషయం చెప్పినపుడు, ఆయన 'కమాండర్' కాదుకదా అంటారు! కాని 'బైరన్' పేరు ఉపయోగపడవచ్చుగదా! ఆ విధంగా బ్లాకేర్ గ్రీసు చేరే ముందుగా 'జెనోవా' వచ్చి, బైరన్‌ను కలవటానికి ఏర్పాట్లు జరుగుతాయి. దీని పర్యవసానం బైరన్ 'action' అంటూ వేగంగా తిరుగుతున్న తిరుగుబాటు పళ్ల చక్రాల్లో ఇరుక్కుంటాడు.

ఏప్రిల్‌లో, బ్లేకర్, లూరియాటిస్ – బైరన్‌ను కలవటానికి కొండ ఎక్కి కాసా సలూజో (Casa Saluzzo) భవంతికి వచ్చినప్పుడు తాను లీవాంట్ వెళ్లటానికి సిద్ధమేనని, అదీ "గ్రీకు కమిటీ" తనవల్ల, ఏమయినా ఉపయోగం వుందని భావిస్తే – అంటాడు.

ఎందుకు వెళ్లకూడదు? ఇక్కడ జెనోవా జీవితం మరీ స్తబ్దుగా తయారయ్యింది. తను కేవలం కవిత్వం రాసే సామాన్యునిగా కట్టడి చేసింది. ఇంతకంటే ఇంకా ఏమయినా కార్యశూరత్వం వెలగబెట్టాలని తహతహలాడిపోతున్నాడు.

"నేనే మొదటి వ్యక్తి కావాలి – నిరంకుశునిగా కాదు. మేధోపరంగా, సత్యానికి దగ్గరగా, దైవత్వానికి తరువాతగా" ఇవి బైరన్ మాటలే. వాటిని అతను విశ్వసిస్తాడు కూడా.

తను ఎప్పుడూ ఒక నమ్మకంతో వున్నాడు – ఎవ్వరు చేయని లేదా కొద్దిమంది మాత్రమే చేయగల కార్యశూరునిగా నిరూపించుకోవాలని!

ఇంగ్లాండు – ఫ్రాన్స్‌లో ఉదారవాదుల వైఫల్యంతో, తన కవిత్వానికి తగ్గిన ఆదరణతో, అతను మళ్లీ జనాదరణ పొందటానికి ఆరాటపడుతున్నాడు. అతనిలోని

కవి అతన్ని తృప్తి పరచలేకపోతున్నాడు. ఈ విషయంలో ఇంగ్లాండు సరిగానే ఊహించింది! అతనికీ తన అసలైన జీవితం 'రణరంగం'లోనే వుందని నమ్ముతున్నాడు!

తనలో ఒక సైనికుడు – ఒక నాయకుడు వున్నాడని అతని పూర్తి విశ్వాసం. ఈ విధంగా నమ్మటానికి అతని అవిటి కాలు కూడా ఒక బలమైన సాకు! ఇప్పుడు పూర్తిగా రాజకీయాలకు మర్యాద మన్ననలకు ధీటుగా! నిలబడాలి!!

ఇంకో పదేళ్ళు బ్రతికివుంటే నా తడాఖా చూపిస్తాను. అది సాహిత్యంలో కాదు. అది కొరగానిది – ఈ విధంగా మాట్లాడితే వింతగా వుండవచ్చు. కాని సాహిత్యం నా వ్యాపకం కాదు!

కాని నేను ఏదో సాధించగలను – కాలం కలిసి వస్తే పరిస్థితులు అనుకూలిస్తే రాబోయే కాలంలో తత్వవేత్తలు ఆశ్చర్యపోయే విధంగా నేను సాధించేది చిరస్థాయిగా వుంటుంది!!

నిజంగా అతను ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచాలనుకుంటున్నా ఈ వ్యవహారం అంతా తనలోని బైరన్‌ను రక్షించి విముక్తపరచాలనే అతని తపన!

ఈ ఆలోచనలన్నీ 'మాన్‌ఫ్రెడ్'లో చెప్పాడు. అతనికి 'నరకం' మానసిక సంఘర్షణే. తన తొలి యౌవనం నుంచి తనలో చెలరేగుతున్న సంఘర్షణ ఇప్పటి బైరన్‌కు తాను కావాలనుకున్న 'బైరన్'కు మధ్యనే! ఈ ఇప్పటి తన కార్యశూరత్వంతో ఒకప్పటి విద్యార్థి బైరన్‌ను గొప్ప కథానాయకునిగా ఆవిష్కరించడానికే–

అదే కాగితం తీసుకుని మొదలుపెట్టి రాస్తాడు–

"......చనిపోయినవాళ్లు లేస్తున్నారు – నేను నిద్రపోనా?
నిరంకుశుల్తో ప్రపంచం యుద్ధం చేస్తోంది – నేను దాక్కోనా?
పంట పండి సిద్ధంగా వుంది, ఆగి కోసుకోనా?
నిద్రపోను – నా ప్రక్కలో ముల్లుంది–
ప్రతిరోజు – నా చెవిలో భేరి మోగుతోంది–
అది నా గుండెల్లో మార్మోగుతుంది...."

Byron

ఈ అధ్యాయం ఎప్పటికీ పూర్తి చేయలేదు.

'పోషీ' (Poshie) అంటాడు ఎగతాళిగా, కవిత్వంలో చెప్పేది, నిజ జీవితానికి ఎంత 'తేడా' వుందో అతని లౌకిక జ్ఞానానికి తెలియదా?

కాని అతనిలోని స్వేచ్ఛాప్రయత్నం – అందుకోసం అతని కార్యశూరత్వం – ఇవన్నీ అతనికి బాగా తెలుసు!

ఇప్పటివరకు అతని జీవితంలో ఎదురైన అడ్డంకులన్నీ అతన్ని భయపెడుతున్నాయి. ఇప్పటికీ అవి తొలగిపోలేదు.

ఆడవాళ్లంటే అతని బలహీనత. అదే నిరర్ధకమైన స్త్రీజాతి! 'అర్థం లేని ఆడది!' ఎలా వదిలించుకోవాలి?

"ఇప్పుడు గుస్సోలి రాణి తనని వదలదే. అయితే నాలుగేళ్ల క్రితం వున్నంత ఆకర్షణ ఇప్పుడు వుండదు కదా – గ్రీసు వెళ్లకుండా నన్ను ఆపలేదు" అంటాడు.

అసలు ఇంతకీ, లండన్‌లోని 'గ్రీకు కమిటీ' తనను, ఈ విషయంలో జోక్యం, అదే గ్రీసు వెళ్లే విషయంలో తన సహకారం ఆశిస్తున్నదా?

మన ఊహలకు అనుకోని కనిపించని శత్రువులు ఎక్కువమంది వుంటారు కదా. అతనికి ఇంగ్లీషు సమాజం ముఖ్యం. అధికార పక్షం మీద నమ్మకం లేదు. హబ్‌హౌస్‌కు తను రాసిన వుత్తరం బాగా పనిచేసింది. ఇలా ఆలస్యంగా కమిటీ సభ్యునిగా చేర్చారు. తన దాతృత్వం కూడా బాగా పనిచేసింది. అన్ని ఖర్చులు, తనకు సంబంధించినవి, అతనే భరిస్తానని అంటాడు. తపాకి మందు 'ఔషధాలు' పంపటం కూడా ప్రారంభించాడు సైనికులకు!

ఈ సందర్భంలో మిస్టర్ బ్రౌనింగ్, బైరన్‌కు ఒక వుత్తరం రాశాడు. అందులో ఉండాల్సిన ఊకదంపుడు అంతా వుంది. "...........అంతటి విశిష్టమైన స్వతంత్ర

భూమి, కళలకు పుట్టిల్లు, మేధావులకు మెరక వీధి – దేవతలకు దేవాలయం – కవులకు స్వర్గం – ఆహా, ఇలాంటి ఔన్నత్యం గల మరెన్నో విషయాలకు ఆలవాలమైన గ్రీకు దేశం...” ఇదీ సారాంశం! ఇలాంటి వచనం బైరన్‌కు అసహ్యం! ఆహా ఎలాంటి ఉత్సాహం! అంటూ అప్పటికి గ్రీకులోవున్న యదార్థ పరిస్థితులను పచ్చిగా ఏకరవు పెట్టాడు.

గ్రీకులకు కావలిసింది – తేలికపాటి సైనిక పటాలం – ఫిరంగులు తుపాకి మందు – కొండలెక్కటానికి తేలికపాటి బండ్లు – ఇంకా గాయాలకు మందులు – అంతేకాదు, ఏ విధంగా ఎలాంటివి పంపితే వుపయోగమో వివరంగా చిట్టా రాసి పంపుతాడు! ఎవరిని ఎక్కడ కలవాలో కూడా.

ఇది న్యూస్టెడ్ కిట్టీ గోర్డాన్ లక్షణం కదా!

ఇది కమిటీ తీరుకు వ్యతిరేకమే అయినా కాదనలేకపోయారు.

అయితే అతని స్నేహితులు అనుకున్నట్లుకాక, బైరన్ కార్యశూరుడా? ఇది అంత తేలికగా తేల్చగల విషయం కాదు.

అతనికి కార్యశూరునిగా వ్యవహరించగల లక్షణాలన్నీ వున్నా, స్పష్టమైన ఆలోచనలు కార్యోన్ముఖత ఎన్ని వున్నా, అతని సంశయాత్మక నిర్ణయాలు అతనికి అన్నిరకాల అభివ్యక్తీకరణాలు ఒకేసారి కావాలి. స్వేచ్ఛా ప్రజలకు మద్దతు. గొప్ప సంస్కారి – డాన్ వాన్ – వోల్టేరియిన్, స్వచ్ఛమైన పవిత్ర జీవితం అన్ని ఒకేసారి సాధ్యమా?

ఆంగ్ల సమాజంతో పోరాటం సలిపాడు. వారితో ప్రేమించబడాలని ఆశించాడు. అటు టోరీ కాదు, ఇటు హేతువాదీ కాదు. ఆంగ్ల రాజకీయాలలో దురదృష్టవంతుడు. ఎందుకంటే ఏమాత్రం ఐకమత్యం లేని విగ్గులతో వున్నాడు!

ఏకీకృతమైన స్థిరచిత్తుడు కాదు. వ్యక్తిత్వం కలవాడు కాదు. గొప్ప సాధకులకు అవసరమైనవే అవికదా!

ఈ గ్రీకు సాహసంతో అన్నీ విధిగా సూటిగా వుండాలి. ఒక విదేశీ జాతిని దాస్యశృంఖలాల నుంచి విముక్తులను చేయటానికి అతని ఆశలకు తన వంశోన్నతి

అడ్డుపడలేదు. అందుకు విరుద్ధంగా ఈ కార్యాన్ని సరిగా నెరవేరిస్తే తన వంశానికి ఎనలేని కీర్తి కట్టబెట్టవచ్చని ఆశిస్తాడు. అందుకు ఆంగ్లసమాజం నీరాజనం పట్టగలదని అనుకుంటాడు. ఆ విధంగా అతని చైతన్యం పూర్తిగా మేల్కొని, అతన్ని ఒక నాయకునిగా నిలబెడుతుంది. అందుకు ఈ సాహసానికి అన్నివిధాలా సిద్ధపడి బైరన్ ఏర్పాట్లు చేసుకుంటాడు.

వేసవితోపాటు, బైరన్ శత్రువైన 'విధి' కూడా అతన్ని దయదలచినట్లు లేదు!

గంబా కుటుంబం రావెనా రావటానికి ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. కాని గూసిలీ రాణి, తన భర్తతో కలిసి వుండాలని పోప్ షరతు. అందరూ కలిసి సమావేశం ఏర్పాటు చేసి, రాణిని ఒప్పించటానికి ప్రయత్నిస్తారు. బైరన్ కూడా తన గ్రీకు ప్రణాళిక చెప్పి, ఆమెను గంబా పరివారంతో రావెనాలో వుండమంటాడు.

భర్త, తండ్రి, సోదరుడు, ప్రియుడు – అందరూ ఆమెను వత్తిడిచేసి ఒప్పించటానికి ప్రయత్నిస్తారు.

"మీరు గ్రీకు కావాలంటే వెళ్ళండి. కాని నేనూ మీతో వస్తాను" అని తెగేసి చెప్పింది.

"నిన్నెలా రక్షించాలి, అది యుద్ధం కదా" అంటాడు.

ఆమె అంగీకరించకపోతే బైరన్ వెళ్ళలేదు.

లేడీ కారోలైన్, లేడీ బైరన్, గూసిలీ, అయ్యో, ఇదెలా సాధ్యం – ఒకరి తర్వాత ఒకరు తనకు బంధాలయి కదలనీయరే?

తన జీవితమంతా ఆడవాళ్లకు ధారపోసి ఎలాంటి కీర్తి మూటగట్టుకున్నాడు – వారిని హింసించాడనేగా! ఇది న్యాయంగా వుందా? నేను చేయవలసింది చేస్తాను. నా ఆశలకు గండి పడకుండా – మగవాడు తన కార్యాన్ని నెరవేర్చాలి. ఆడవాళ్లను త్యాగం చేసి అయినా సరే – ఈ ఆడవాళ్ళందరూ స్వార్థపరులే – అంటాడు.

జూన్ మొదటివారం. అన్నీ సర్దుబాటు జరిగాయి. ఏడుపులు – కన్నీళ్లు – గుస్సోలి రాణిని, తండ్రి, సోదరుడు తీసుకెళ్ళిపోయారు. లీహంటు పరివారం ఫ్లారిన్స్ వెళ్ళి ఉండటానికి ఏర్పాటు చేసి తన రచనలను ప్రచురణ హక్కు కూడా అతనికే ఇస్తాడు. గ్రీసు నుంచి బ్లేకర్, బైరన్ కోసం కబురు పెడుతున్నాడు. ఇక ప్రయాణం ప్రారంభం కావాలి. నౌక కోసం యువ గంబా, పీట్రోకు బాధ్యత అప్పగిస్తారు. ఈ పీట్రో చాలా ఉత్సాహవంతుడు. అన్ని విషయాలు పక్కాగా తన జర్నల్‌లో రాస్తాడు – *"Mas Occhio"* అంటారు ఇటాలియన్‌లు. అతను అంత పక్కాగా రాసిన వివరాలు చివరిగా తప్పుదారి పడతాయి.

అతను మాట్లాడిన నౌక పేరు 'హెర్క్యులెస్'. ఇది సముద్రం మీదకు పనికి రాదు. ఒక తొట్టిలాంటి నౌక! ఒక వైద్యుని తోడు తీసుకు రమ్మంటే, తనకు తెలిసిన బ్రూనో అనే కుర్రవాణ్ణి పడవ ఎక్కిస్తాడు. మంచి వుద్దేశ్యంతోనే. కాని అనుభవ రాహిత్యం – అంతేనా – బైరన్ అంటే భయం కూడా.

ఆ తరువాత ఈ పీట్రో చెప్పటం – తను ఒకవేళ ఏమాత్రం తప్పుచేసినా బైరన్ తన కుక్కలతో ముక్కలక్రింద చేస్తాడని భయపడినట్లు చెప్తాడు. ఈ విషయం డా॥ బ్రూనోకు బాగా నాటుకుంటుంది.

చివరకు నౌక బయలుదేరుతుండగా డా॥ బ్రూనో కళ్ళనీళ్ళ పర్యంతం అవుతాడు.

బైరన్‌కు, ట్రిలానీని తీసుకు వెళ్ళాలని వుంటుంది. అందుకోసం అతన్ని ఫ్లోరెన్సు నుంచి రప్పిస్తాడు. ట్రిలానీకి, బైరన్ అంటే ప్రేమ ఏమీ లేదు – ఈ వంకతో గ్రీసులో ప్రవేశించాలని అతని ప్రణాళిక!

బైరన్ – తనకోసం, ట్రిలానీ కోసం రెండు శిరస్త్రాణలు చేయిస్తాడు. వాటిమీద "Creed Byron" అని రాయిస్తాడు. కాని ట్రిలానీ ధరించటానికి ఇష్టపడడు. వాటిని జెనోవాలో వదిలి వెళ్ళిపోతారు.

ఎన్నో అపనమ్మకాల మధ్య శుక్రవారం, 13 తేదీ – 1823 సంవత్సరం. నౌక బయలుదేరుతుంది. బైరన్‌కు శుక్రవారం అపశకునం – 13 వ తేదీ అపశకునం కాని నౌక బయలుదేరటానికి అంగీకరిస్తాడు.

ట్రిలానీతోపాటు బ్రూనో, గంబా ఎనిమిది మంది నౌకర్లు ఫ్లెచర్, టీటా అయిదు గుర్రాలు – తుపాకులు, గుళ్లు – పేలుడు మందు – రెండు చిన్ని ఫిరంగులు – యాభైవేల స్పెయిన్ డాలర్లు వీటితో నౌక బయలుదేరింది.

ఎండ బాగా కాస్తోంది. అస్సలు గాలి లేదు. కనీసం తెరచాపలు లేపటానికీ అవకాశం లేదు. జెనోవా పట్నం – అర్ధచంద్రాకారంలో – సముద్రపు తీరాన్ని తాకివుంది. తీరానికి దగ్గర్లోనే వుండిపోతారు. బైరన్ ఒక చెట్టుక్రింద భోజనం కానిస్తాడు. అర్ధరాత్రికి గాలి తిరిగింది. తెరచాపలు లేస్తాయి. 'హెర్క్యులెస్' ఆ గాలికి వంకరగా నిలబడింది.

గుర్రాలు కంగారుపడిపోయి చెక్కల్ని పగలతన్నాయి. చివరికి ఈ నౌక మళ్లీ రేవుకు చేరాల్సి వచ్చింది.

ఆ రాత్రంతా బైరన్ గుర్రాలతోనే గడిపాడు. ఈ దుశ్శకునాలు, మంచి ప్రయాణానికి శుభశకునాలు అంటాడు. అస్సలు ప్రయాణం మానుకుందాం అనుకుంటాడు.

తన మిత్రులు ఎగతాళి చేస్తారని భయపడతాడు!

ఆ రాత్రి కాసాసలూజో భవంతికి వెళ్తాడు– తనకు ఎదురైన గంబాతో "సంవత్సరంలో మనం ఎక్కడుంటాం?" అంటాడు. 'నన్ను ఒంటరిగా వుండనీయండి' అంటూ–

ఖాళీ గదిల్లోకి వెళ్లి ధ్యానంలో నిమగ్నుడవుతాడు.

అతని ఆలోచనలు గందరగోళంగా వున్నాయి.

ఈ కాసా సలూజో వదిలి వెళ్లిపోవాలని ఎప్పటినుంచో కోరుకుంటున్నాడు. అందులో ఎప్పుడూ సంతోషంగా లేదు. దాన్ని గురించి విచారిస్తున్నాడు కూడా. ఇక్కడ అంతమవుతున్న క్షణాలలోని విషాదాన్ని చూసి భయపడుతున్నాడు. గ్రీసులో విజయం సాధిస్తే, తన జీవితంలో అది అద్భుత ఘట్టం అవుతుందని ఆశించాడు. తన గతానికి, అదే దీటయిన సమాధానమనుకుంటాడు. కాని, కాని అతని

ఆలోచనలు ఎక్కువగా తన జాతకాన్ని చదివి భవిష్యత్తును చెప్పిన మహిళ విలియమ్స్ – భవిషద్వాక్యాలు అతని ఆలోచనలోకి చొచ్చుకొని వస్తున్నాయి.

తను మరణం వైపు ప్రయాణం చేస్తున్నట్లు గట్టిగా నమ్మటానికి సిద్ధపడతాడు!!

నిజానికి తన ఆలోచనలు, అనుమానాలను తీవ్రంగా పరిగణించివుంటే, తనకు రాబోయే మరణం వీరోచితమని నమ్మితే, ఆ నమ్మకమే అతన్ని నడిపించి వుండేది. కాని అనుమానస్పదమైన అతని విశ్వాసం ఇది హాస్యంగా తనని వెక్కిరిస్తోంది....

ఆ రాత్రికి పట్నంలోకి దిగాడు – వేడినీళ్లు స్నానం చేశాడు. మళ్లీ 'హెర్క్యులెస్' నావ ఎక్కాడు. అప్పటికి అనుకూల పవనాలు వీస్తున్నాయి. నావ బయలుదేరి లెగ్‌హర్న్ దగ్గర ఆగుతుంది. నౌకలో బైరన్ అందరితో స్నేహంగా వుంటాడు. ట్రిలానీతో బాక్సింగ్ చేస్తాడు. గంబాతో కత్తి యుద్ధం కూడా – రాత్రి ఒంటరిగా చీజ్, దోసకాయ ఊరగాయ పచ్చడితో భోజనం చేస్తాడు. పైన ఎగురుతున్న సీగల్సును తుపాకితో గురిపెడతాడు. తన కుక్కలతో ఆడుకుంటాడు. తన నౌక కేప్టెన్‌తో కలిసి అతను చక్రం తిప్పుతాడు. అప్పటికే కెప్టెన్ తాగివుంటాడు!

కెప్టెన్ పేరు స్కాట్! ఫ్లెచర్‌తో మాటలు కలుపుతాడు. ఒకనాటి సాయంత్రం ఈ హీరోలిద్దరూ బ్రాందీ తాగుతూ డెక్‌మీద మాట్లాడుకుంటున్నారు.

"అరె, మీ యజమాని ఎందుకు అలాంటి రాళ్ళు రప్పలు దొంగలు దోపిడీదారులున్న దేశానికి ప్రయాణమయ్యాడు?" అని ఫ్లెచర్‌ని కెప్టెన్ అడుగుతాడు.

ఫ్లెచర్‌కు కూడా ఈ ప్రయాణం వుద్దేశ్యం తెలియదు – కాని దానిలో ప్రమాదం మాత్రం, పసికగట్టాడు.

"అవును. అక్కడంతా కొండలు, గుట్టలు – దారి దోపిడీ దొంగలు – వాళ్లంతా గుహల్లో – కొండ బొరియల్లో కనపడకుండా నివసిస్తున్నారు. నక్కల్లాగా మీదపడతారు. పొడవాటి తుపాకులుంటాయి. కత్తులు – కటారులు కూడా! "....మనకు సైనికుల కాపలా చాలా అవసరమనిపిస్తోంది...." ఫ్లెచర్!

ఒకరకంగా ఫ్లెచర్‌కు తుర్కులంటేనే ఇష్టం! "ఆ దేశంలో తుర్కులే గౌరవనీయులు. వాళ్ళు వెళ్ళిపోతే, గ్రీసు, కుక్కలు చింపిన విస్తరయిపోతుంది. అక్కడ దోమలు, ఈగలు, నల్లులు, దొంగలే. మా లార్డ్ అక్కడికి ఎందుకు వెళ్తున్నారో, ఆ లార్డ్‌కే తెలియాలి!..." ఈ సంభాషణ బైరన్ వింటున్నాడు – అది ఫ్లెచర్ గమనిస్తాడు. "నా అభిప్రాయం నా యజమాని కూడా కాదనలేరు" అని కలుపుతాడు.

అప్పుడు బైరన్ "....కాదులే – పందికళ్ళతో చూసేవాడికి ఇంకేమీ కనిపించదు..." అంటాడు.

గ్రీసులో జరుగుతున్న విభిన్నమైన కక్షలు, తిరుగుబాట్లు, వీరిని ఎటుపోవాలో నిర్దుష్టమైన మార్గం సూచించలేకపోతాయి. ఎటూ తేల్చుకోలేక కొంత కాలం ఎక్కడైనా ఆగాలని నిర్ణయించి చివరికి అయోనియన్ (Ionian) దీవులలో ఆగి తదుపరి సమాచారం కోసం వేచి చూద్దామనుకుంటారు.

'ఏడు దీవుల రిపబ్లిక్' ఆంగ్లేయుల సంరక్షణలో వున్నాయి. ఆ కారణంగా అక్కడ ఏ తిరుగుబాట్లు, చొరబాటు లేకుండా తటస్థంగా పరిస్థితి నెలకొన్నది!

ఇది బైరన్‌కు చాలా అనుకూలమైనది కూడా.

ముందుగా 'జాంటే' (Zante)లో ఆగుదాం అనుకుంటారు. కాని ఒక ఆంగ్లేయుని సలహా మేరకు, 'సెఫలోనియా' అయితే అక్కడ కలోనెల్ నేపియర్ సహాయకారిగా వుంటాడని కూడా చెప్తాడు.

ఆగస్టు ఒకటవ తేదీని 'హెర్క్యులెస్' నౌక 'అర్గోస్టోలి' రేవులో లంగరు వేసింది. అది 'సెఫలోనియా' దీవికి ముఖ్య రేవుపట్టణం! ఇక్కడ కూడా బైరన్‌కు నిరాశే ఎదురయ్యింది. అప్పటికే 'బ్లేకరీ', ఇంగ్లాండు వెళ్లిపోయాడు. వీరికి ఎటువంటి సూచనలు – సమాచారం ఇవ్వకుండా! ఇంగ్లాండులో "గ్రీకు కమిటీ" చాలా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోంది. ఈ కమిటీ మూలంగానే, తను ఇంటిని వదిలి, తన పనిని వదిలి, తన ప్రియురాలిని వదిలి, సముద్రం మీదకు వచ్చాడు. ఈ దిక్కులేని దీవిలో ఏ సమాచారం లేకుండా వుండిపోవలసి వచ్చింది! దిక్కుతోచని స్థితిలో – ఏ ప్రయోజనం లేకుండా కూడా ఆగిపోవలసి వచ్చింది!

ఆ విధంగా మూడువారాలు 'అర్గోస్టోలి' రేవులో, ఇంగ్లీషు అధికారులకు కబురు పెట్టడానికి మొహమాటపడ్డాడు. వారి ఆలోచనలెలా వున్నాయో అని ఆందోళన పడతాడు. ఇప్పటివరకూ తనను ఒక కవిగానే పరిగణించిన ఆంగ్ల సమాజం – తన బలహీనతలనే ఎక్కువచేసి చూపింది. దానిప్రభావం ఇక్కడవరకూ రాదా?

కాని అక్కడి పదాతి దళపు అధికారి బైరన్‌ను విందుకు ఆహ్వానిస్తే ఆశ్చర్యపోతాడు. వారు చూపిన గౌరవానికి మరింతగా ఆనందపడతాడు.

ఈ దీవిలోని గ్రీకు కాందిశీకులు – బైరన్‌ను చుట్టుముడతారు. తమను కాపాడటానికి వచ్చిన రక్షకుడని – అంతేనా? అతను లార్డ్ – ధనికుడు – కీర్తిగలవాడు! 'సూలియోటి'లు మరింతగా అతని వెంటబడతారు (వీరు కూలి సైనికులు) హెర్క్యులెస్ నౌకమీద గుంపులుగా చేరతారు. తన పూర్వ యాత్రలో ఈ సులియోటీల నాయకుణ్ణి కలిశాడు కదా – ఆ గౌరవంతో నలభైమందిని 'తన సైన్యం'లో చేరమంటాడు. 'గంబా' వీరిని జాగ్రత్తగా గమనించి ఎందుకూ పనికిరానివారిగా నిర్ణయిస్తాడు. వారిని వదిలించుకోవటానికి రెండు నెలలు జీతం ఇచ్చి పంపవలసివస్తుంది!

ఈ 'సెఫలోనియా' దీవిలో వున్నంతకాలం బైరన్ దాతృత్వం హద్దులు దాటిపోతోంది. ఈ సమయంలోనే 'రోష్‌డేల్' అమ్మగా ముప్పయి నాలుగు వేల పౌండ్లు అతనికి జమపడతాయి. ఈ సొమ్ము మొత్తం గ్రీసు స్వాతంత్ర్య యుద్ధానికి ఖర్చు పెడతానంటాడు!

'నాకు వ్యక్తిగతంగా ఏమి అవసరాలున్నాయి? నా ఆదాయం మరే దేశ (అమెరికా అధ్యక్షుని కంటే) అధ్యక్షుని కంటే ఎక్కువేకదా.

ఎంతగా గ్రీసును దాస్యవిముక్తం చేయాలనుకున్నా, అది అతని ఒక్కని వలన కాదని తెలుసు.

ట్రిలానీ అడుగుతాడు – ఏమిటి, ఇంకా మీరు గ్రీసుకు బయలుదేరలేదు? అని.

"ఏ గ్రీసు?" మోరియా?, బోట్‌జారీస్? సులియోటి? మిస్సిలోంగి? ఎక్కడికి? ఏ గ్రీసు?" అంటాడు బైరన్!

ప్రతి బందిపోటు, ఇరవై మందిని వెంటబెట్టుకొని, నాయకుడిగా బైరన్‌కు కబురు పెడుతున్నాడు!!

ఇంతవరకు బ్లెకిరీ నుంచి 'గ్రీకు కమిటీ' నుంచి ఎటువంటి కబురు లేదు.

ఈ పరిస్థితుల్లో గ్రీసులో ప్రవేశించటం కష్టమే. ఒకవేళ గ్రీసు దీవుల్లో ప్రవేశిస్తే అందులోనుంచి బైటపడటం ఇంకా కష్టం కదా.

చివరికి బ్లెకిరీ లండన్ నుంచి కబురు పంపుతాడు. జాగ్రత్తగా వుండమని! వెంటనే గ్రీసులో ప్రవేశించవద్దని.

యూరోపియన్ రెజిమెంట్లు కనీసం రెండు లేకుండా కదలవద్దంటాడు. తుర్కుల బలం ఎంతో ఎక్కువమందితో వుంది – పైగా వీరు సముద్రపు దారులన్నీ అడ్డుగా నావలు పెట్టి వుంచారు. అదీ పరిస్థితి!

కెప్టెన్ స్కాట్ ఈ పరిస్థితుల్లో తన నౌకను ఇరుకున పెట్టలేనంటాడు. ఒకవేళ బైరన్‌ను తుర్కులు బంధిస్తే? అంతకంటే మూర్ఖమైన పరిస్థితి ఏముంటుంది?

ఇక కదిలే పరిస్థితి లేక – ఆ రేవు దగ్గర్లో సెఫాలోనియ దీవిలో మెటక్సాటా ప్రాంతంలో వూళ్లో ఇల్లు తీసుకుని నౌక దిగి అందులో వుంటాడు!!

ఈ మార్పు బైరన్‌కు అనుకోని సంతోషాన్ని అందించింది. తన జీవితం ఇంత దారుణంగా ఎప్పుడూ లేదు. ఇక్కడ ఒక సైనికునిలా దినచర్య గడపాలని అనుకుంటాడు. మౌని జీవితం అతనికెప్పుడూ ఆరోగ్యం, సంతృప్తి కలిగిస్తుంది. ఇలా అతనికి గంబా, డా॥ బ్రూనో ఇద్దరే స్నేహితులు. ఈ ప్రాంతంలో అతనికి మరో పిల్ల జమీందారు డెల్లాడిసిమి కలుస్తాడు. గ్రీకు యువకుడు 'లోకాస్' కూడా అతని సహాయకారిగా చేరతాడు.

బైరన్ వుదయం తన రాతపని చేసేవాడు. ఒక కప్పు టీ తాగేవాడు. గుర్రపు స్వారీకి వెళ్లేవాడు. రాత్రి చీజ్, పళ్లు తీసుకునేవాడు. చదువుకునేవాడు.

'మెమోరియల్ ఆఫ్ St. హెలీనా' – ఇది అగస్టా అతనికి పంపిన పుస్తకం.

అతని కోసం గ్రీకు సంఘాలు వేచివుండేవి. కాందిశీకులు సహాయం అడిగేవారు. అతను తప్పనిసరిగా సహాయం అందించేవాడు!

రాత్రిళ్లు ఆకాశం నిర్మలంగా వుండేది. వెన్నెల విరగకాసేది. చుట్టు దీవులను చూస్తూ గడిపేవాడు. కొండలు – సముద్రం – దూరదూరంగా గ్రీసుదేశపు కఠినంగా కనిపించే రాళ్ల తీరం – అతని దృష్టిలోకి వచ్చేది!

సంతోషమా? అవును. ఇదే సంతోషమంటే. అతన్ని ఆకర్షించే శక్తులేమీ ఇక్కడ లేవు. అతన్ని గుచ్చిగుచ్చి చూసే వేగులూ లేరు. అయినా తనను విమర్శించటానికి ఏముంది?

ఇక్కడకు శూరుడుగా వచ్చాడు – గౌరవంతో అన్ని వివరాలతో అగస్టాకు వుత్తరం రాస్తూ – చివర "......నీవు ఒకవేళ వీటిలో ఏవైనా లేడీ బైరన్‌కు తెలియజేయాలనుకుంటే నాకు అభ్యంతరం లేదు" అని రాస్తాడు.

బహుశా ఆమె ఇప్పుడైనా తనని తన మూర్ఖత్వాన్ని వదలి బైరన్ సాహసాన్ని గుర్తించగలదని ఆశిస్తాడు!

ఒక్కసారి మాత్రం ఇతాకా వెళ్లి వస్తాడు.

ఆ యాత్ర కూడా చెడుగానే మారింది. బైరన్‌కు అకస్మాత్తుగా సన్నిపాతం వస్తుంది.

ఈ సమయంలోనే ఆ దీవిలో డా॥ కెన్నెడీ అనే మతప్రచారకుడు గ్రీకు దీవులలో బైబిల్ ప్రచారం చేస్తుంటాడు. ఆయన దైవభక్తి గల స్కాట్ పౌరుడు. ఆయనకు బైరన్‌తో పరిచయమవుతుంది.

ఈ సమావేశాల్లో బైరన్ తన అభిప్రాయాలను తెలియజేస్తాడు.

నేను మత నమ్మకాల వాతావరణంలో పెరిగాను. మతపు విశ్వాసాలు నన్ను ఎంతగానో కదిలించాయి. ఎన్ని గ్రంథాలూ చదివాను! కాని నాకు మతగ్రంథాల సారం అర్థంకాలేదు. నిజాయితీగా మతాన్ని, దైవాన్ని నమ్మిన వ్యక్తులంటే నాకు

ఎంతో గౌరవం. కాని నేను కలిసిన మతాచార్యులు చాలామంది వారు ప్రచారం చేసే సిద్ధాంతాలకు కట్టుబడి జీవించడంలేదు. ఇవీ బైరన్ వెలిబుచ్చిన అభిప్రాయాలు!

అసలు ఈ ప్రపంచంలో దుర్మార్గం ఎందుకుంది? సృష్టికర్త దయామయుడు అయితే అతని సృష్టి ఇంత హింసాత్మకంగా ఎందుకుంది?

కుంటివాళ్లు – గుడ్డివాళ్లు – కుష్టురోగులు వీరంతా ఎందుకు మగ్గిపోతున్నారు, దుఃఖంలో. అదీ, పుట్టినప్పటినుంచి కష్టాల్లో కన్నీళ్లలో మిగిలిపోతున్నారు? వారికి 'సువార్త' ఎందుకు చేరటంలేదు? వారి ప్రపంచంలో ఎందుకున్నారు? ఈ పేదరికం ఏమిటి? వారికి శారీరక మానసిక క్షోభ ఎవరు కలిగిస్తున్నారు – అజ్ఞానానికి కారణం ఏమిటి? మూఢాచారాలు ఎలా ప్రచారం పొందుతున్నాయి. వారికి 'బైబిల్' ఇచ్చినా ప్రయోజనం ఏమిటి?

ఇవీ బైరన్ దృఢమైన అభిప్రాయాలు.

డా॥ కెన్నెడీకి, బైరన్ చెప్పిన బైబిల్ విషయాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. మీరే ఎక్కువగా బైబిల్ చదివారు – *బైబిల్‌ను సాహిత్యంగా నేనెప్పుడూ అనుకోలేదు అంటాడు.*

అప్పుడు బైరన్ – సైతాను ఎన్‌డోర్ 'విచ్' గురించి బైబిల్‌లో చదివాను. నేను చదివిన గ్రంథాలన్నింటిలోనూ ఇంత గొప్పగా దెయ్యాల గురించి రాసిన సందర్భం లేదు. ఎన్నో రచనలు దెయ్యాల గురించి చర్చించినా బైబిల్‌లో వున్నంత సున్నితంగా ఊహాత్మకంగా ఇంకెక్కడా లేదు. ఇది విని డా॥ కెన్నెడీ ఆశ్చర్యపోతాడు.

"ఇప్పుడు చెప్పండి, నన్నేమి చేయమంటారో?" అంటాడు బైరన్.

"దేవుని ప్రార్థించండి – మీ పాపాలను మన్నించమని" అంటాడు.

"అదీ మరీ అత్యాశ, డాక్టరు గారూ"

అని బైరన్ విచారంగా నవ్వుతాడు!

ఇప్పుడు గ్రీకు నుంచి వచ్చిన వార్తలు – వారికి విజయాలు లభిస్తున్నాయి కాని ఐకమత్యం లేక ఇబ్బంది పడుతున్నారు.

లండన్ కమిటీ ఒక నౌకలో ప్రేలుడు పదార్థాలు పంపుతున్నట్లు కబురు వస్తుంది.

అందులో 'కాంగ్రెవ్ ఫ్యూజ్' అనే కొత్తరకం పరికరం వుందని అది చాలా గొప్పగా వుపయోగపడుతుందని! అయితే చివరికి వచ్చింది కాగితాలు – బూరలు! ఈ సైనికులకు వీటితో ఏమాత్రం వుపయోగం వుండదు కదా.

కలొనెల్ నేపియర్‌కు అవగాహన వుంది. బైరన్‌తో కలిసి పనిచేయటానికి అవకాశం వుంది. కాని ఆయన తుర్కులు, యూరోపు భూభాగంలో వున్నంతకాలం, గ్రీకులకు రాజ్యాంగం గురించి ఆలోచన అవకాశం లేదంటాడు.

దీని పర్యవసానం గ్రీకు కమిటీ లండన్ నుంచి మరో కలొనెల్ స్టాక్‌హోప్‌ను పంపింది. ఈయనతో బైరన్‌కు అంతగా సఖ్యత కుదరలేదు.

నేపియర్ సాయంతో బైరన్, యువరాజు మావ్రొ కార్డాటో తో కలిసి తిరుగుబాటు యుద్ధం చేయమంటాడు. 'మావ్రో' చాలా పరిణితిగల రాజకీయ నాయకుడు. ఈ తిరుగుబాటు విప్లవకారులకు ముందుండి నడిపే వీరుడు.

అప్పటికే ఆయన హైడ్రా దీవిలో వుంటాడు. బైరన్‌కు కబురుపెట్టి "అన్ని ఏర్పాట్లు జరిగాయి. గ్రీకు నౌకల దండును సిద్ధం చేశాను. లండన్ నుంచి ఆర్థిక సాయంకోసం చూస్తున్నాను. మీరు నాలుగు వేల పౌండ్లు ప్రస్తుతం సర్దితే, ఈ 'ఆపరేషన్' మొదలుపెట్టవచ్చు" అదీ సారాంశం!

అది చాలా ఎక్కువ మొత్తమే. కాని బైరన్ 'మావ్రో'కు సాయం చేస్తాడు. దానిలో అతనికి ఎంతో ఆనందం వుంది. కేవలం ఒక పౌరునిగా వుండి, ఒక సైన్యాన్ని నౌకల దండును తయారు చేయగలగటం, అప్పటి పత్రిక 'మెమోరియల్'లో తన గురించి వచ్చిన వార్తలు చదవటంలోని తృప్తి ఇప్పటికే గ్రీసు కోసం తను వెచ్చించిన మొత్తం, నెపోలియన్ బొనపార్టీ – తన 'ఇటాలియన్ కాంపెయిన్' కోసం ఖర్చుపెట్టినదానికంటే ఎక్కువ అని పత్రికలు రాస్తాయి!

మిస్సిలోంగి సైనికులు, బైరన్‌ను, తమను నెల జీతం మీద తీసుకోమని వత్తిడి చేస్తున్నారు. "మాకు నాయకుడు మీరే" అంటారు. బైరన్ ఈ మాయలోపడి వీరు నిజమైన వీరులు – నా ఆదేశాలు వీరు పాటిస్తారు అనుకుంటాడు. గ్రీసుకు స్వతంత్రం లభిస్తే అందులో తన పాత్ర సామాన్యమైనది కాదు. అతనికి అప్పటికే ప్రపంచంలోని బానిసత్వాన్ని పోగొట్టగల వీరునిగా తనను తాను దర్శించగలుగుతాడు.

సంవత్సరాంతానికి గ్రీకు నౌకాదళం పూర్తిగా సిద్ధమవుతుంది. బైరన్ ఆర్థిక సాయంతోనే.

ముందు 'మావ్రో' తర్వాత స్టాన్‌హోప్ 'మిస్సిలోంగి'కి చేరగలుగుతారు.

అప్పుడు బైరన్‌ను వచ్చి వారితో కలవమని కబురు పెడతారు!

"మీరు వెంటనే రండి. మీ ఆదేశాలు మాకు శిరోధార్యం..."

".......మిమ్మల్ని చూడాలని అందరూ ఉత్సాహపడుతున్నారు. యువరాజు చాలా ఆందోళనలో వున్నారు. ఈ రోజు వీధుల్లో వెళ్తుంటే అందరూ 'లార్డ్ బైరన్ ఎక్కడ!' అని అరుస్తున్నారు..."

బైరన్‌కు ఇది ఆకర్షణీయంగా వున్నా, వెళ్లడం తొందరపాటేనేమోనన్న అనుమానం వుంది. కాని లండన్‌లో అందరూ తనని ఇన్నాళ్లు ఈ దీవిలో వుండిపోవటం ఎగతాళికి కారణమవుతుందని గ్రహిస్తాడు.

మూర్ కూడా "మీరు సాహసక్రియలు చేయకుండా దీవిలో ఠీవిగా గడుపుతున్నారా?" అని రాస్తాడు. దీనిలో నిజం లేదుకదా. 'డాన్ వాన్' లాగా అని కలిపాడు! అరె ఇంతవరకూ కవిత్వమే రాయలేదు. డాన్ వాన్ ముట్టుకోలేదు.

"....కవిత్వం బద్ధకస్తులకు సరిపోతుంది. ఇప్పటి తీవ్రమైన పరిస్థితుల్లో దాన్ని గురించి ఆలోచనే హాస్యాస్పదం.." అంటాడు గంబాతో.

అతనికి ఈ సాహసంలో వున్న ప్రమాదం తెలుసు. "నా జాగ్రత్తలో నేనుంటాను..." అంటాడు.

డిశంబరు 27, మూర్‌కి కబురు పెట్టాడు. "24 గంటల్లో 'మిస్సిలోంగి' వెళ్తున్నాను – మావ్రో యువరాజును కలవటానికి – ఇప్పటివరకూ నన్ను ఇక్కడే వుండమన్నారు – కాని ఇప్పుడు రమ్మని ఆహ్వానిస్తున్నారు. వారందరికీ అవసరమైన సొమ్ము నేనివ్వాలి – సులోటీ సైనికులు నా ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు".

"పట్రాస్ కాని, మరో ప్రదేశం కాని గ్రీకులకు ఏది అనుకూలంగా వుంటే, సులోటీలు నా ఆదేశాల మేరకు, ఆ కార్యాన్ని సాహసాన్ని చేయటానికి సిద్ధంగా వున్నారు. నేను వారితోనే కదం తొక్కుతాను. నాకు ఈ స్వాతంత్ర్య యుద్ధంలో నమ్మకం – ఆశ వుంది. ఏది ఏమయినా గౌరవానికి భంగం లేకుండా నడుచుకోవాలి. అప్పటివరకూ కేవలం పాలతోనే సరిపుచ్చుకోవాలి. నేను అందుకు సిద్ధమే."

ఇదీ మూర్‌కు – లండన్‌కు పంపిన వర్తమానం!

అల్బేనియం సైనిక దుస్తుల్లో బైరన్





సైనికుడు - కథానాయకుడు

XXXV

చివరి రోజులు

(1823-1824)

సమృద్ధి మార్గం - జ్ఞాన ప్రాసాదం చేరుతుంది!

-విలియం బ్లేక్

మావ్రో కార్డాటో, స్టాన్‌హోప్ నమ్మకంతో బైరన్‌కు ప్రమాణం చేస్తారు. మిమ్మల్ని సురక్షితంగా 'మిస్సొలొంగి' చేర్చటానికి నౌకలు కాపలా పంపిస్తామని - కాని బైరన్, అతని పరివారం ప్రయాణం చేస్తున్న నౌకలు - చివరికి తుర్కుల నౌకల కంటపడతాయి. గంబా వున్న పడవను తుర్కులు పట్టుకుని 'పట్రాస్' తీసుకుపోతారు. కాని బైరన్ ఎలాగో తప్పించుకుని తుర్కులు వెంటపడగా చాలా ప్రమాదం నుంచి తన నౌకను 'డ్రాగో మేస్త్రి' దీవి రాళ్లచాటున చేరుస్తారు!

అతనితోపాటు తుర్కులతో పోరాడగల వ్యక్తులు నలుగురే వున్నారు.

అక్కడ నుంచి స్టాన్‌హోప్‌కు ఎలాగో కబురుపెట్టి తమకు రక్షణగా సైనికులను పంపమంటాడు.

"....నా భయం నా గురించి కాదు. నాతోపాటు వున్న ఈ గ్రీకు కుర్రవాడు - లోకాస్ - ఏమయిపోతాడు? తుర్కుల చేతిలో చిక్కితే? అతన్ని ముక్కలు చేసి - నన్ను నేను చంపుకోవాలి - ఆ ఆటవికుల చేతిలో బలికావటంకంటే ఇది మేలుకదా" అని సందేశం పంపుతాడు.

ఈ 'డ్రాగో మేస్త్రి' దీవిలో మూడు రోజులుండిపోతాడు.

ఫ్లెచర్‌కు బాగా జలుబు, జ్వరం వస్తుంది. నావలో వున్న ఒక్క పరుపు, రగ్గు అతనికే ఇస్తాడు.

"నా లార్డ్ వింత మనిషే కావచ్చు.

కాని చాలా దయగలవాడు" అని అంటాడు ఫ్లెచర్

ఈ దిక్కులేని దీవిలోనే జనవరి 2 అతని పెళ్లిరోజు గడిచిపోతోంది. ఆ జ్ఞాపకాలు అతన్ని కలతపెడతాయి!

చివరికి 4వ తేది మావ్రొ కార్డాటో వీరిని రక్షణతో మిస్సిలోంగి తీసుకువెళ్తారు.

మిస్సిలోంగిపట్నం, సముద్రతీరం; అదీ లోతు తక్కువ మడుగు అంచున వుంది. చిన్నచిన్న దీవులు దానికి రక్షణగా వుంటాయి. అక్కడికి చేరాలంటే లోతు తక్కువ నీళ్లలో చిన్న పడవలే ఆధారం!

జనవరి 5న బైరన్ మెరిసిపోయే ఎర్రని సైనిక దుస్తులు ధరించి, చిన్న పడవలో లగూన్ దాటి మిస్సిలోంగి పట్నానికి చేరతాడు.

అక్కడ అతన్ని తుపాకులు పేల్చి స్వాగతం చెబుతారు. పెద్దగా బూరలు వూది డోళ్లు వాయించి సందడి చేస్తారు. సైనికులు – పట్నంవాసులు అక్కడి కూడలిలో చేరి కలొనెల్ స్టాన్‌హోప్ యువరాజు మావ్రో ఆహ్వానం పలుకుతుండగా తనకోసం ముస్తాబు చేసిన భవనంలోకి ప్రవేశిస్తాడు! అప్పటికే గంబా తుర్కుల నుంచి తప్పించుకుని ఇక్కడకు చేరాడు.

అతనికి, బైరన్‌కు లభించిన ఈ స్వాగతానికి కళ్ళనీళ్లు తిరుగుతాయి.

మిస్సిలోంగి చిన్న చేపల రేవు పట్నం. సముద్ర మట్టానికి వుంటుంది. అలలు వీధుల్లోకి వస్తుంటాయి. అక్కడ మురుగు బైటకు పోయే అవకాశం లేదు.

కాని ఈ పట్నానికి ఒక వింత వాతావరణం మానవ సంబంధి కానిదేదో వుంది. అమానుషమైన అందం!

అక్కడ వున్న గొర్రెల కాపరులు – చిన్నచిన్న ఇళ్ళల్లో గొర్రె తోలు కప్పుకుని నివసిస్తుంటారు! చుట్టూ కొండలు ఎర్రగా వుంటాయి. అంతా కుళ్లు, ఉప్పు, చేపల బురద.

లార్డ్ బైరన్ బసచేసిన 'ఇల్లు' కాస్త ఎత్తులో వుంటుంది. అక్కడే కలోనెల్ స్టాన్‌హోప్ వుంటున్నాడు. అక్కడ నుంచి సముద్ర తీరం, దీవుల బారులు, తళతళ మెరిసే 'లగూన్', చెక్క ఇళ్లు అన్ని కనపడుతుంటాయి.

మబ్బులు లేకపోతే సెఫలోనియా దీవి కనపడుతుంది కూడా. ఇప్పటివరకు బైరన్ సంతోషంగా గడిపిన ప్రదేశం అదేకదా.

లార్డ్ బైరన్ నివాసాన్ని వీలయినంత నివాస యోగ్యంగా మార్చటానికి ఫ్లెచర్, టిటా, లేగా అందరూ ఎంతగానో ప్రయత్నించారు.

కొన్ని పుస్తకాలు తుపాకులు కత్తులు అన్ని సర్దుకుంటారు. క్రింద హాల్లో ఒక సులోటీని కాపలా పెడతారు. మిస్సిలోంగి బజారుల్లో కాందిశీకులు, సైనికులు తమ యూనిఫారాల్లో తిరుగుతుంటారు.

ఇది 'లియోనిడాస్' ఏలిన గ్రీసుకు చాలా భిన్నంగా వుంది!

ఇక్కడ పరిస్థితులు అంచనావేస్తే బైరన్‌కు తేలింది, మావ్రో నిజాయితీపరుడు. కాని తన పటాలం మీద అజమాయిషీ లేదు. సైనికులకు సులోటీలకు జీతాలు సరిగా ఇవ్వటంలేదు. వారు ఎప్పుడైనా తిరుగుబాటు చేయవచ్చు. ఇది తుర్కులకంటే ప్రమాదం!

గ్రీసు స్వాతంత్ర్య యుద్ధం – సులోటీలకు వీరు కూలీసైనికులు – వీరికి సంబంధించినది కాదు.

'సులీ' అని పేరు వినపడితే ఉత్తరం దిక్కువైపు చూస్తారు. మబ్బుల్లో తమ పర్వతాలు కనపడతాయని వారి ఆశ!

మాఁవ్రో భయంతో వీరందర్నీ బైరన్ అజమాయిషీలోకి తీసుకోమంటాడు. అంటే వారి జీతభత్యాలు కూడా!

ఇంతవరకు ఇంగ్లండు నుంచి గ్రీకు కమిటీ పంపిన 'ఆర్గో' ఎక్కడుందో తెలియదు. ఆ నౌకలోనే మందుగుండు సామాను, తుపాకీ మందు, తర్ఫీదు పొందిన మెకానిక్కులు, ఫిరంగులు, బాగు చేయకలిగిన జర్మను ఇంజనీర్లు రావాలి.

అప్పటి వరకు తమకు పనిచేయటానికి తుపాకులు బాగుచేయటానికి బైరన్ కొంతమంది జర్మను, స్వీడ్‌లను జీతాలిచ్చి పోషిస్తాడు. బైరన్ కూడా చాలా ఖచ్చితంగా వివరాలు దగ్గరుంచుకుని రోజూ సైనికుల కవాతుకు వెళ్ళేవాడు.

"ఇక్కడ ఏదీ అనుకూలంగా లేదు. కేవలం ఓర్పుతో నెట్టుకురావాలి. విజయం లభిస్తున్న ఆశ కూడా కనిపించటంలేదు. కానీ ఏదో ఒకటి చేయాలి. వీరిని పని లేకుండా వుంచకూడదు" అంటాడు.

బైరన్‌ను బాగా ఆకర్షించింది. 'లీ పాంటో'ను ఆక్రమించి స్వాధీనం చేసుకోవటం! దీనివల్ల చాలా వుపయోగాలున్నాయి. అక్కడ తుర్కులను తరిమివేస్తే, ఇది యూరోప్ అంతటా వార్తగా వ్యాపించి, లండన్ నుంచి వెంటనే సాయం అందుతుంది.

బైరన్ తన వేగులు ఇద్దర్ని ఒకరు జర్మన్, ఒకరు ఇంగ్లీషు – 'లీ పాంటో'లో పరిస్థితి అంచనా వేయమంటాడు. వారు వెళ్లి రహస్యంగా సమాచారం సేకరిస్తారు. తుర్కులు అక్కడి సైనికులకు 16 నెలలుగా సరిగా జీతాలు ఇవ్వటం లేదు. వారు కూడా వేగులతో తమ జీతాల భరోసా ఇస్తే బైరన్‌కు లొంగిపోతామని మాట ఇస్తారు.

ఇది చాలా అనుకూలమైన పరిస్థితి!

అయితే వాతావరణం చాలా దారుణంగా వుంది. వర్షం కుండపోతగా కురుస్తూనే వుంది. బజారుల్లో గుర్రం మీద వెళ్లటం కష్టమే. బైరన్‌కు అనుమానాలున్నాయి. తన సైనికుల సామర్థ్యం మీద. అందుకని తానే వారిని ఉత్సాహపరచి ముందుకు నడుపుతానంటాడు. "అసలు వాళ్ళకి, ఆటవికులు కదా, నీ మీద అనుమానం



మిసిలోంగిలో స్వాగతం

రాకూడదు" అంటాడు. యువరాజు మావ్రో - మీకు "కమాండర్ - ఇన్ - చీఫ్" పదవి ఇస్తున్నాను అంటాడు. ఇది బైరన్‌కు నవ్వు తెప్పిస్తుంది.

బైరన్ కలొనెల్ స్టాన్‌హోప్‌తో 'పత్రికాస్వేచ్ఛ' మీద వాదన జరుగుతుంది.

లండన్‌లో పత్రికాస్వేచ్ఛకు అభ్యంతరం వుండదు. అక్కడ పత్రికలు - ఒకదానికి మరొకటి ధీటుగా సమాధానం చెప్పుకుంటాయి. కాని ఇక్కడ కేవలం ఒక్క పత్రిక వున్నచోట పత్రికాస్వేచ్ఛకు అర్థం ఏమిటి?

కవి బైరన్ - సైనికుడు బైరన్ ఎదురుబదురు నిలబడతారు?!

ఈ సమయంలో బైరన్‌తో వున్నవారు అతని వ్యక్తిత్వంలోని ఔన్నత్యాన్ని తప్పక అంగీకరిస్తారు.

అతను నిజాయితీగల, ముక్కు సూటిగా మాట్లాడే చిన్న పిల్లవాడు! శ్రద్ధగా వింటాడు కూడా.

తన వనరులన్నీ దానం చేయగల ధీరుడు. ఈ బురద, చెత్తలో తనకు విజయం లేదని తెలిసికూడా– "నేను సాహసాలు చేయటానికి రాలేదు - కాని ఈ గ్రీకు



మిసిలోంగిలో సైనికులు

దేశాన్ని పునరుజ్జీవన పరచటానికి, అది అణగారి వున్న స్థితి నుంచి గౌరవాన్ని పొందటానికి, ఒక స్నేహితుడుగా వచ్చాను" అంటాడు.

దీనికి ఉదాహరణగా తనుకూడా సైనికులకు ఇచ్చే రేషన్ తీసుకుంటాడు.

అతనికి 'మిస్సిలోంగి'లో చాలా ఉదారుడని కీర్తి వస్తుంది. ఎంతో ఓర్పు ప్రదర్శించాడు. ఒకసారి అతని గదిలోకి గ్రీకు సైనికులు వచ్చి, హడావుడి చేస్తారు. ఒక తుర్కు ఖైదీని అప్పగించమని – కాని బైరన్ నిరాకరిస్తాడు. వారు వెళ్లకపోతే తన పిస్తోలు తీసి వారిని తీవ్రంగా చూస్తాడు – అంతే వారు వెళ్ళిపోతారు.

ఆ విధంగా తమకు దొరికిన ఖైదీలను పట్రాస్ పంపి రక్షించేవాడు.

ఎలాంటి కార్యంలోనైనా ప్రమాదకరమైన స్థానాన్ని తీసుకునేవాడు.

నా వ్యక్తిగత భద్రత!? "మనిషికి ఎక్కడైనా భద్రత వుంటుందా?

ఎక్కడైనా ప్రమాదమే వుంటుంది" అంటాడు. 'తుపాకి గుండుతో చనిపోవటం మేలు గదా – చెక్కముక్కతో కంటే' అంటాడు.

ఒక్కోసారి ఇదంతా ఎందుకు? అని బాధపడేవాడు. హాబ్ నుంచి వుత్తరం వస్తుంది. 'సెఫలోనియా' వదలి వెళ్లవద్దని. "అరె, చాలా ఆలస్యంగా వచ్చింది –

ఇది ఎలా వుందంటే – పెళ్లి జరిగిపోయిన తరువాత భార్యతో జాగ్రత్త సుమా! అన్నట్లు!" అంటాడు.

త్వరలోనే ధైర్యం తెచ్చుకుంటాడు.

మిస్సిలోంగిలో వుండటం మేలుకదా, లండన్‌లో అర్ధరాత్రి వరకూ తాగి నిద్రపోవటం కంటే–

పేదరికం – దారుణమయినది – కాని హృదయం లేని సైనికుల క్రీడలకంటే అదే మేలు!


నా జీవితంలో మళ్లీ అటువంటి స్థితిలోకి అడుగుపెట్టను.

కవి, సైనికుడు విజయం సాధిస్తాడు, తనలోని లౌకిక, వ్యసనపరుని మీద! తన శేషజీవితం ఇలాగే సాగిపోతుందా? మళ్ళీ ఆకర్షణ వలలో పడిపోతాడా– మళ్లీ సిల్కు – తళుకుల ప్రపంచం పిలుపు వినపడితే? 'మిస్సిలోంగి' వాతావరణం అందుకు అనుకూలంగా లేదు.

తన పుట్టిన రోజు జనవరి 22, 1824. గంబా, స్టాన్ హోప్, మరికొంతమంది స్నేహితులు కూర్చొని వున్న గదిలోకి వచ్చి, మీరు నా మీద అభాండం వేశారు. ఈ మధ్య కవితలు రాయలేదని – ఇవిగో వినండి – ఇప్పటివరకు రాసిన అన్నింటికంటే ఇది వుత్తమం అనుకుంటాను – అని చదువుతాడు.

ఇంక నా హృదయాన్ని కదిలించకండి–
అవును అది స్పందించటం – ఆగిపోయింది!
నన్నెవరూ ప్రేమించక పోయినా
నన్ను ప్రేమించనివ్వండి!!

ఇప్పుడు నా రోజులు పసుపు పచ్చగా మారాయి.



హెల్మెట్‌తో బైరన్

ప్రేమ ఫలాలు అవి గతం!
పురుగులు – కుళ్ళు – వేదన
ఇవే నాకు మిగిలాయి.

నా గుండెల్లో మండే మంట
అగ్నిపర్వతపు దీవి మీద దీపం!
దానితో దేనిని వెలిగించలేను.
అది కేవలం చితిమంట! పేర్చిన చితి!

ఆశ, భయం, అసూయ–
బాధలోని గొప్ప భాగం
ప్రేమలోని శక్తి, నేనెలా పంచుకోను?
కాని శృంఖలాలు నా మెడలోనే!

ఇది అలా కాదు – ఇది ఇక్కడ కాదు–
ఆ ఆలోచనలు – నన్ను కదిలించినా – ఇప్పుడు కాదు–
కీర్తి ఎక్కడ వుంది? కథానాయకుని పాడె మీద!

జెండా, కత్తి రణరంగం
కీర్తి, గ్రీసు అన్ని నా చుట్టూ–
స్పార్టన్ – డాలు మీదే–
అతనికి విడుదల ఏది?

నిద్రలే! గ్రీసు కాదు – ఆమె మేల్కొనే వుంది
నీ రక్తం – తన జన్మస్థానానికి పారాలి
నిద్రలే – నా చేతనమా – ఎవరి ద్వారా రాగలవో–
ఇక ఇంటిదారి చూడు–

ఆరిపోయిన ఆవేశాల వెంట నడువు–
ఈ మర్త్య జీవితం విలువ లేనిది – నీకు–
నిర్లక్ష్యంగా – నవ్వినా – కోపగించినా
ఏదైనా అందమయినదే–

నీ యౌవనపు రోజులను రోసి - ఇంకా బ్రతుకెందుకు?
నీవెక్కడ గౌరవప్రదంగా మరణించగలవు?
ఇక్కడే - ఈ ప్రదేశంలోనే - నీ శ్వాస వదిలేయి!

వెదుకు - వెదికేది దొరకదు-
నీ కోసం ఒక సైనికుని సమాధి - అదే మేలు-
అయితే పరికించి చూడు - నీ చోటు ఎంచుకో-
ఇక విశ్రాంతి తీసుకో....

ఈరోజు నాకు ముప్పయి ఆరు ఏళ్లు నిండాయి.

ఈ రోజు ముప్పై ఏడు వస్తున్నాయి. తనకు జాతకం చెప్పినావిడ ఇది ప్రమాదకరమైన సమయం అని చెప్పింది.

టిటాని అడుగుతాడు, నువ్వు ఇటలీ వెళ్ళిపోతావా? అని, "అవునయ్యా మీతో బాటే" అంటాడు. "అరె టిటా- నేను గ్రీసు వదిలి వెళ్లలేను. తుర్కులు, లేదా గ్రీకులు లేదా ఈ వాతావరణం నన్ను వెళ్ళనీయవు."

అతని ప్రణాళికలు ఆశాజనకంగా కన్పిస్తాయి - విలియం పారీ (William Parry) అనే ప్రేలుడు పదార్థాల ప్రత్యేక అధికారి - నిపుణుడు - లండన్ కమిటీ పంపగా వస్తాడు. అతనితోపాటు ఫిరంగులు - ఇంగ్లీషు ఇంజనీర్లు కూడా వస్తారు. ఈ పరిణామంతో లీ పాంటో పట్టుకోవటం తథ్యమని బైరన్ ఆశిస్తాడు.

కాని, పారీ కానీ, మిగతా ఇంజనీర్లు కానీ అంతగా వుపయోగపడే సరుకు కాదని త్వరలోనే గ్రహిస్తాడు. పారీకి ఈ లండన్ కమిటీ మీద ఎలాంటి గౌరవం లేదు. "వాళ్లు వట్టి హాస్యగాళ్లు - సిద్ధాంత కర్తలు - ఎందుకూ పనికిరారు" అంటాడు. అప్పటికీ బైరన్‌కు పారీని వుపయోగించి 'లీ పాంటో' పట్టుకోవచ్చని అతనికి ఇక్కడ పరిస్థితులు వివరిస్తాడు.

పారీ తర్వాత అంటాడు – 'ఇది అంత తెలివైన సాహసం కాదని బైరన్‌కు తెలుసు. కాని, అతనిలో ఓర్పు తగ్గిపోయింది. విసుగుదల ఎక్కువైంది. భ్రుకుటి ముడిపడుతోంది. ముఖంలో నీరసం, అలసట కనపడుతోంది' అని!

పారీ పరివారం తుపాకులు – ఫిరంగులు బిగించటానికి ఒక చిన్న భవనం ఏర్పాటు చేస్తారు. అది చెత్త చెదారంతో నిండివుంటుంది. దానిని శుభ్రపరచటమే గగనమైపోతుంది.

చివరికి లండన్ నుంచి వచ్చిన యుద్ధసామగ్రి దించి, బిగించటానికి బైరన్ వారిని ప్రోత్సహిస్తాడు. ఇంగ్లీషు వాళ్లు – మిస్సిలోంగి బురద – చెత్త – మురుగు పోకపోవటం వీటితో సతమతమయిపోతుంటారు.

అప్పటి వరకు బైరన్ పోషించిన జర్మన్ మెకానిక్కులు పారీ ఆధ్వర్యంలో పనిచేయటానికి విసుక్కుంటారు.

బైరన్, పరిస్థితి అంచనా వేస్తాడు. తను నమ్మదగినవారు గంబా, స్టాన్ హోప్ – మావ్రో కార్డోటీ – కాని ముగ్గురూ మూడు దారులు.

ముందు ప్రణాళిక ప్రకారం దాడి చేయటానికి అన్నీ అడ్డంకులే.

బైరన్ కేవలం, ఈ స్వాతంత్ర్య పోరాటాన్ని ఒక పరిశీలకునిగా వచ్చాడు. ఇప్పుడు దానికే తను 'కమాండర్ – ఇన్ – చీఫ్'గా పిలువబడుతున్నాడు.

"ఎవరికి నాయకత్వం వహించాలి? సులోటీలకా, జర్మన్‌లకా? ఇంగ్లీషు మెకానిక్కులకా? ఒక జెండా క్రింద, వీళ్లలో వీరు పోట్లాడుకుంటున్నారు?" అంటాడు విచారంగా?

ఫిబ్రవరి వరకూ ధైర్యంగానే పరిస్థితి చక్కదిద్దుతూ వస్తాడు. ఇక్కడ వీధుల్లో బురద, కనీసం గుర్రపు స్వారీ కూడా చేయలేదు. కొంత దూరం పడవలో వెళ్లి అక్కడ నుంచి ఆలివ్ తోటల్లో గుర్రపు స్వారీ చేసి మళ్లీ పడవలో ఇంటికి చేరేవాడు.

ఇక్కడ సూర్యాస్తమయాలు అద్భుతంగా వుండేవి! గంబాతో, తన గతం గురించి ఎంతో వివరంగా చెప్పేవాడు. అతనికి, ఈ గతాన్ని విప్పటంలో గొప్ప ఊరట లభించేది. గంబా, పారీకి ఈ వివరాలు వింటుంటే, 'ఈ చిన్నపిల్లవాని మనసు ఎంత నిర్మలంగా వుంది' అనుకునేవారు.

అతని ఇంటి ముందు, మిస్సిలోంగిలో, ఒక తుర్కుల ఇంటికి దండలు వేలాడుతుండేవి. అటుగా వచ్చినపుడు తన పిస్తోలుతో వాటిని గురిచూసి కొట్టేవాడు. ఆ శబ్దానికి ఇంటిలో నుంచి ఆడవాళ్లు బైటకు వచ్చి, అతన్ని అర్థంకాని భాషలో కేకలు వేసేవాళ్లు. అతను గట్టిగా నవ్వుకునేవాడు.

ఇంటికి వచ్చి, తన కుక్క లయన్‌తో ఆడుకుంటూ, 'నీవు ఈ మనుషులకంటే చాలా నయం'. అది తోక వూపుతూ అతని వంక చూసేది.

బైట సైనికులు, సులోటీలు అందరూ అతని డబ్బుకోసం కొట్టుకోవటం బైరన్‌కు తెలియదా?

చివరికి 'లీ పాంటో' మీద దాడికి తేదీ దగ్గరవుతుంది. గంబా వివరాలన్ని సేకరిస్తుంటాడు. సులోటీల పేర్లన్ని మోసపూరితంగా వుంటాయి. ఇది మామూలే. వాళ్లు, లేనివారిని వున్నట్లు చూపి, జీతాలు తీసుకుంటారు. వారికి దేశభక్తి స్వామి భక్తి, అనే మాటలు తెలియవు.

ఇదిలావుండగా, 'కోలో కాట్రానిక్స్' వీరి ప్రణాళికలు తెలిసి, సులోటీలను కొనటానికి ఏజంట్లను పంపుతారు. అంతేకాదు – మావ్రో మీద బైరన్ మీద పుకార్లు లేపుతారు.

సులోటీలు ఎదురు తిరిగి, తమను అధికారులుగా చేసి జీతాలెక్కువ ఇస్తే వుంటాము, లేదా వెళ్లిపోతాం అని బెదిరిస్తారు. మూడువందల మందిలో నూటయాభైమంది ఆఫీసర్ల జీతాలడుగుతారు.

బైరన్‌కు ఇక ఓర్పు నశించి, వాళ్లను వెళ్లిపొమ్మంటాడు. కాని ఇది అతన్ని చాలా కుంగదీస్తుంది. తన ప్రణాళికలన్నీ, గత శీతాకాలం నుంచి గడిపిన కాలం అంతా, ఇలా నీటిపాలయిపోతుందని బాధపడతాడు.



ఆ మధ్యాహ్నం కలొనెల్ స్టాన్ హోప్‌తో ఏదో హాస్యంగా మాట్లాడుతూ, నాకు దాహంగా వుంది అంటాడు. పళ్ళరసం తెచ్చి ఇస్తారు. కొద్దిగా తాగి నిలబడతాడు. తూలి స్టాన్‌హోప్ చేతుల్లో పడిపోతాడు.

అతని చేతులు వంకర్లుపోతాయి. నోరు పక్కకు తిరిగింది. నిలువెల్లా వణికిపోతున్నాడు. కొంతసేపటికి తేరుకుని 'ఇది ఆదివారం కాదూ?' అంటాడు. అవునంటారు. "కాకపోతే ఆశ్చర్యపోయేవాణ్ణి" అంటాడు. ప్రతి ఆదివారం అతనికి దురదృష్టమే!

డా॥ బ్రూనో, జలగతో చెడు రక్తం తీసివేయాలంటే, బైరన్ ఒక్కసారిగా ఉలిక్కిపడతాడు. తన రక్తం తీయటమా? అని తెలియని భయంతో కేవలం ఆదిమవాసి భయపడినట్లు వణికిపోతాడు. కాని బ్రూనో వదిలిపెట్టడు. బైరన్ కణతలకు రెండు జలగలు పట్టించి వూరుకుంటాడు. తర్వాత చాలా రక్తస్రావం జరిగింది. ఎలా అరికట్టాలో అనుభవంలేని బ్రూనోకు అర్థం కాలేదు.

ఫ్లెచర్ భయపడి, టిటా దగ్గర్లో వున్న డాక్టర్ జూలియస్ మిల్లింగ్‌జన్‌ను వెంటబెట్టుకు వస్తారు. అతను ఒక జర్మన్, గ్రీకు ప్రభుత్వంలో పనిచేస్తున్నాడు. అతను ఎంతో కష్టపడి, బైరన్‌కు ఎంతో బాధ కలిగించి, రక్తస్రావం ఆపగలుగుతాడు. అప్పటికే బైరన్ ఎంతో గందరగోళంలోనే వున్నాడు.

"ఈ ప్రపంచంలో అంతా బాధే" అంటాడు.

σε αυτόν τον κόσμο δεν υπάρχει τίποτα, αλλά ο πόνος…

"ప్రపంచంలో బాధ తప్ప మరేంలేదు".

అతని చుట్టూ గంబా, ఫ్లెచర్, టిటా, బ్రూనో, అందరూ దిక్కుతోచని స్థితిలో వుండిపోయారు. ఏమిటది? మూర్ఛా? పక్షవాతమా? చివరికి డాక్టర్లు మూర్ఛ లాంటిదేనని అంటారు. కాని సాయంత్రం వరకూ అతనికి సరిగా స్పృహ లేదు.

ఆ రాత్రి సులోటీలు తిరుగుబాటు చేసినట్లు, తమ ఆయుధాగారాన్ని

ముట్టడించటానికి వెళ్తున్నట్లు తెలుస్తుంది. గంబా, పాలీ, స్టాన్‌హోప్ చీకట్లో పరుగులు పెడతారు. తమ పదాతిదళాన్ని సిద్ధంగా వుండమంటారు.

ఈలోపు ఇద్దరు తాగిన సైనికులు బైరన్ గదిలోకి చొరబడతారు. బలహీనంగా స్పృహ పూర్తిగా లేని బైరన్ గదిలోకి వస్తారు. వాళ్ళేమి చెప్తున్నారో అతనికి అర్థం కాలేదు. నిస్సహాయుడు ఒంటరిగా వున్నాడు. అంతలో బ్రూనో కేకలు వినపడతాయి. అతను అప్పటికే కన్నీళ్లు కారుస్తూ అరుస్తున్నాడు. బైట వర్షం కుండపోతగా పడుతోంది.

మసక వెలుతురు. తెలిసీ తెలియని మత్తు. నిస్సహాయత ఒంటరితనం అన్నీ బైరన్‌ను భయభ్రాంతుణ్ణి చేశాయి. ఇంటిమీద, మురుగు కాలువలో వర్షపు ధారలు జోరునపడుతున్నాయి.

ఆ తరవాత ఒక వారం రోజులు అంతా విచారమయమే. బైరన్‌కు ఎప్పుడైతే తన చెవిలో 'మూర్ఛ' అని వినపడిందో, దాని గురించి భయం పట్టుకుంది. తల తిరగటం, తెలివి తప్పిపోవటం, బాధాకరమైన నరాల వత్తిడి "అరె! భయం అంటే ఇదేనా" అంటాడు! భయపడవలసిన అవసరం లేదని తెలిసి కూడా. "నేను జీవించగలను అనుకుంటున్నారా?" అంటాడు డా॥ మిల్లింగ్‌జన్‌తో.

"ఈ జీవితం అంటే విరక్తి పుట్టింది. వెళ్లిపోవటానికి మనస్ఫూర్తిగా సిద్ధమవుతున్నాను. ఎందుకు బాధపడాలి? ఇది నాకు సంతోషాన్నిస్తుందా? నా అంత వేగంగా ఎవరూ జీవించరా? నిజం చెప్తున్నా – వృద్ధుణ్ణయిపోయిన యువకుణ్ణి!

"......ఇంకా ప్రౌఢ వయస్సే రాలేదు. అంతులేని కీర్తి వచ్చింది. మానవుడన్నవాడికి సంతోషం ఎన్ని విధాలుగా వుంటుందో, దాని అంతు చూశాను. ఎంతో ప్రయాణం చేశాను. నా అన్వేషణ, తపన చల్లార్చుకున్నాను. ఇక భ్రమలేవీ లేవు. కాని రెండు విషయాలు భయపెడుతున్నాయి.

"రోగంతో కృంగి కృశించిపోవాలా? లేక నా రోజుల్ని అంతం చేయాలా? చేతితో కత్తి తీసుకుని పోరాడుతూ వీరమరణం పొందాలా?"

ఇది జరిగిన కొద్దిరోజులకే లేడీ బైరన్ దగ్గర్నుంచి వివరాలతో, అగస్టా పంపిన వుత్తరం చేరింది.

అది నిజంగా అతన్ని ఎంతో ఆనందపరిచింది!

'అదా' గురించి అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం పంపింది.

'ఒంటరిగా వుంటోందా – అందరితో కలుస్తుందా? మితభాషా, లేక గలగలా మాట్లాడుతుందా? చదవటం ఇష్టమా, ప్రేమగా వుంటుందా? 'దేవతలు ఆమెను కవిగాకాక ఎలా వుంచినా నాకు అభ్యంతరం లేదు, అలాంటి మూర్ఖుడు – కుటుంబంలో ఒక్కడు చాలు.'

అన్నింటి సమాధానాలు బాగానే వచ్చాయి. 'అదా' పొడగరి, గడసరి, వచనమే రాస్తుంది. లెక్కలన్నా యంత్రాలన్నా చాలా ఇష్టం. చిన్నచిన్న పడవలు తయారుచేస్తుంది.

తనెప్పుడైనా ఈ ముగ్గుర్ని చూడగలడా? అడా, అనబెల్లా, అగస్టా? అగస్టాకు రాస్తాడు. "అదా గురించి విన్నవన్ని నన్ను ఎంతో ఆనందపెట్టాయి. అదీ అనారోగ్యంలో" అని రాస్తాడు.

నాలుగు రోజుల తర్వాత, పారీతో వచ్చిన స్వీడిష్ అధికారి లెఫ్టినెంట్ సాస్‌ను, సులోటీలు హత్య చేస్తారు! వాళ్ళు తుపాకులకోసం వెళ్తుంటే అతను అడ్డగిస్తాడు. ఇది ఒకరి భాష ఒకరికి తెలియక జరిగిన హత్య – ఏది ఏమైనా రక్తం చిందింది!

ఈ హత్యోదంతం ఇంగ్లీషువారిని చాలా భయపెట్టింది. ఇప్పటికే వారు ఇక్కడ మురుగు, పరిసరాల కుళ్లుతో విసిగిపోయి వున్నారు. "మమ్మల్ని ఇంగ్లాండు పంపివేయండి" అని గొడవ చేస్తారు.

బైరన్ సర్ది చెప్పటానికి ప్రయత్నిస్తాడు. కాని స్టాన్ హోప్ – "వారి ప్రాణాలకు ఇక్కడ భద్రత కలిగించలేను" అంటాడు. దానికి బైరన్ "భద్రత? ఎక్కడ వుంటుంది? మనిషికి భద్రత ఎక్కడా వుండదు" అంటాడు.

ఆ సమయంలో ఒక మతప్రచారకుడు బైరన్‌కు కొన్ని బైబిల్ గ్రంథాలిచ్చి పంచిపెట్టమంటాడు.

"నా బాధ్యతలు ఒక్కొక్కటి తీరిపోతున్నాయి. సైనికపరంగా, రాజకీయపరంగా, మతపరంగా, ఈ అవసాన దశలో" అంటాడు.

మిస్సిలోంగి నగరవాసులు సాస్ హత్యతో ఇక్కడ నుంచి సులోటీలను పంపించి వేయమంటారు. వారు చాలా హింసాత్మకంగా వున్నారని.

వాళ్లను పంపాలంటే వారికి మూడువేల స్పానిష్ డాలర్లు ఇచ్చి వదిలించుకోవాలి. ఇదీ బైరన్ భరించాల్సి వస్తుంది!

మూడు నెలల కాలంలో 59 వేల డాలర్లు ఖర్చయిపోయాయి. "యుద్ధసామగ్రికి కాపలా ఎవరూ లేరు. ఆయుధాలను తయారు చేసేవారు లేరు. యుద్ధం చేయటానికి ఎవరూ లేరు" అనుకుంటారు!

ఒకరోజు గంబాతో నడుస్తూ "ఇప్పటివరకూ ఏమిజరిగింది? కాలం, డబ్బు, ఆరోగ్యం, అన్ని ఖర్చయిపోయాయి. దీనికి సిద్ధపడే వచ్చాను. ఇది పూలబాట కాదనీ తెలుసు. కాని మోసానికి, కృతఘ్నుతకు సిద్ధపడలేను" అంటాడు.

స్టాన్‌హోప్, లండన్ కమిటీకి బైరన్ త్యాగాన్ని తెలియపరుస్తాడు.

అక్కడ హాబ్, ".స్టాన్‌హోప్ రాసింది సత్యమే. బైరన్ ఎప్పుడూ ధైర్యంగా నిలబడతాడు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో" అని కమిటీకి చెప్పగలిగాడు.

ఇంత బాధలో కూడా బైరన్ తన హాస్య ప్రియత్వాన్ని మరచిపోలేదు.

పారీకి భూకంపం అంటే భయమని తెలుసుకుని, ఒకసారి అతను వున్న ఇంటిని యాభయిమంది సైనికులతో దడదడలాడించాడు! అప్పుడు పారీ పరుగులు పెడుతుంటే బైరన్ నోరారా నవ్వుతాడు.

ఎంత హాస్యప్రియుడైనా లోలోపల అతనికి దిగులుగానే వుంది.

తన జీవితం ఎప్పుడూ ఒకే లయతో నడుస్తోంది. ఈ ప్రపంచాన్ని ఎదిరించి బ్రతకటం.

ఎదురుదెబ్బలు తగిలినపుడు నిరుత్సాహపడటం పరస్పరం ద్వేషించుకునే మనుష్యులతో కలిసి ఎలా పని చేయగలడు?

ఇప్పుడు మిస్సిలోంగీలో పరిస్థితి దారుణంగా వుంది.

ఇప్పుడు ఈ మడుగులాంటి రేవుపై తుర్కులు దాడిచేస్తే కాపాడుకోవటం ఏ విధంగా? ఆయుధాలన్ని సరైన రీతిలో సిద్ధించేయాలి. రేవులోకి వచ్చే దారికి కాపలా పెట్టుకోవాలి.

ఈ ప్రమాదాలు బైరన్‌కు, పారీకి తెలుసు కాని మావ్రోకార్డో ప్రతి కార్యానికి తన సైనికులను సిద్ధించేయలేకపోతాడు. ఒకరోజు డబ్బుకొరత, మరొకరోజు సెయింట్ రోజు, మరొకరోజు నాయకులలో ఐకమత్యం ఉండదు!

అప్పుడప్పుడు గ్రీకులు మాకు రాజు కావాలని అనేవారు. బైరన్‌కు ఇది కొంతవరకు నిజమే అనిపించేది.

కాని స్టాన్‌హోప్ మాత్రం వీరికి స్విస్ రాజ్యాంగం ఇవ్వాల్సిందే అంటాడు.

చివరికి కలొనెల్ స్టాన్‌హోప్ ఏథెన్స్ బయలుదేరుతాడు. అక్కడ అతను 'గ్రీక్ టెలిగ్రాఫ్' అనే పత్రిక మూడు భాషల్లో తీసుకువస్తాడు. అతనికి ట్రిలానీ కలుస్తాడు. ట్రిలానీ 'ఒడిసియస్'తో పనిచేస్తున్నాడు. వీరంతా గ్రీకు దేశానికి ప్రజాస్వామ్యం తీసుకురావాలని పట్టుబట్టి రాస్తుంటారు.

వారి ప్రయత్నం 'ఒడిసియస్' యువరాజు మావ్రో కార్డోని కలపాలని. తర్వాత బైరన్ గ్రీసుకు 'గవర్నర్ – జనరల్' చేయాలి.

ఈ విషయాలన్ని బైరన్‌కు తెలియజేస్తారు.

బైరన్‌కు ఇది ఆకర్షణీయంగా తోచింది!

కాని మావ్రో యువరాజుకు అన్ని అనుమానాలే! తనని ఏథెన్సులో ఒంటరివాణ్ణి చేసి, బైరన్ నుంచి దూరం చేస్తారని అనుకుంటాడు. దీనిలో కూడా నిజం లేకపోలేదు.

ట్రిలానీ ప్రణాళిక, బైరన్‌ను 'ఆక్రోపోలిస్'పై ప్రతిష్ఠించాలని. అప్పుడు ప్రచారానికి అనువుగా వుంటుందని. ఒకరకంగా యువరాజు నుంచి బైరన్‌ను దూరం చేయటమే!

బైరన్ ఈ సమావేశానికి వెళ్లాలని ఉత్సాహపడతాడు. ముందుగా మిస్సిలోంగి నుంచి బైటపడాలి!

ఇక్కడ వీరి ఆగడాలకు అంతులేదు. డబ్బు మొత్తం బైరన్ సమకూర్చాలి. ఇప్పటి వరకూ నెట్టుకువచ్చాడు.

ఇంకా వుంటే ప్లేగు కూడా రావచ్చు. అప్పటికే చుట్టుపక్కల దీవుల్లో వచ్చింది కూడా.

ఇప్పటివరకు, పళ్ల బిగువున లాక్కొచ్చాడు 'ఇక నా వల్ల కాదు' అనుకుంటాడు.

ఏప్రిల్ 9. అతనికి ఇంగ్లాండు నుంచి సమాచారం వస్తుంది. 'గ్రీకు రుణం' ఇస్తున్నట్లు. దాదాపు 2 1/2 మిలియన్ల పౌండ్లు!

ఇప్పుడు కొత్త సైన్యాన్ని, ఆయుధాలను సమకూర్చుకోవచ్చు. రెండువేల మంది సైనికులను రప్పించవచ్చు.

ఈ వార్త మిస్సిలోంగి వారందరికి ఆనందకరమైనదే.

ఆ రోజు వర్షం వచ్చే సూచనలున్నా గుర్రపు స్వారీకి పడవ ఎక్కి వెళ్తాడు. మూడు మైళ్లు దూరాన గుర్రం మీద వుండగానే వర్షంలో తడిసిపోతాడు.

తిరిగి వస్తూ గుర్రాలు దిగి, పడవ ఎక్కబోతుంటే తడిసిన బట్టల్తో, పడవలో కూర్చోవటం ప్రమాదం అంటాడు గంబా "గుర్రం మీద వెళ్దాం".

ఈ మాత్రానికేనా – అయితే సైనికుణ్ణిలా అవుతాను అని పడవలోనే తడిసిన బట్టల్లోనే ఇంటికి తిరిగి వస్తాడు.

రెండు గంటల తర్వాత చలితో వణికిపోతుంటాడు. జ్వరం కూడా వచ్చింది. కీళ్ళ నొప్పులు విపరీతంగా వున్నాయి.

సాయంత్రం వరకూ అలాగే పడివున్నాడు. గంబాతో "చాలా బాధగా వుంది" అంటాడు. "చావంటే భయంలేదు. కానీ ఈ బాధ పడలేను".

మర్నాడు పారీతో లండన్ 'రుణం' సంగతి చెప్తాడు.

ఇద్దరూ కలసి వేసవికి ప్రణాళిక సిద్ధం చేస్తారు. ముందుగా ఆయుధాలకు, సైనికులకు తన సొమ్ము ఇస్తానంటాడు. రెండు నౌకలు కూడా సిద్ధం చేయమంటాడు. కొండలెక్కటానికి తేలికపాటి ఫిరంగులు కూడా.

ఆ రాత్రి చాలా సంతోషంగా, జ్వరం వున్నా డాక్టరు మిల్లింగ్‌జెన్‌తో మాట్లాడతాడు.

అప్పుడు తన జాతకం చెప్పిన విలియమ్స్ మాటలు గుర్తుకువచ్చి "ఈ ప్రపంచంలో నమ్మదగింది ఏది? నమ్మకూడనిది ఏది? తెలియదు కదా?" అంటాడు.

ఆ రాత్రి బ్రూనోకి కబురుచేసి చలి బాగా వుందంటాడు. ఇద్దరు డాక్టరు రక్తం తీయాలంటారు. కాని బైరన్ అంగీకరించడు.

"రక్తం పీల్చటంకంటే మరో దారి లేదా?" "కత్తితో కంటే చాకుతోనే ఎక్కువమంది చనిపోతారే?" "నరాల జబ్బుకు, వాపులకు తేడా వుంది" డాక్టరంటాడు.

"నాకంటే నరాల బలహీనత, మరెవ్వరికుంది? నరాల బలహీనత వున్న రోగి నుంచి రక్తం లాగటం అంటే వయొలిన్‌కు తీగలు వదులు చేయటమే. బిగువుగా లేకపోతే శబ్దాలు రావుకదా.

మీకు తెలుసు. నేను ఎంతగా బలహీనంగా, చిరాకుగా వున్నాను జ్వరం రాకముందు? ఇప్పుడు రక్తం తీస్తే నేను చావటం ఖాయం" అంటాడు.

అప్పటికే మిస్సిలొంగినీ భయంకరమైన తుఫాను, తీవ్రమైన గాలి, వర్షంలో ముంచింది. వర్షం ఎడతెగకుండా పడుతోంది.



మరణశయ్య

పారీ, బైరన్ పరిస్థితి చూసి జాంటీకి పంపాలని అనుకుంటాడు. కాని ఆ పరిస్థితుల్లో సముద్రంలోకి ఎలాంటి నావ వెళ్ళలేదు.

కొన్ని రోజులు ఈ జ్వరం తాత్కాలికమే, ప్రమాదం లేదు అంటారు డాక్టర్లు.

కాని ఫ్లెచర్ మరోరకంగా ఆలోచిస్తున్నాడు. ఇంతవరకూ లార్డ్‌కి ఇంత తీవ్రంగా జలుబు జ్వరం రాలేదు – "అవును. రాలేదు" అంటాడు బైరన్!

15 ఏప్రిల్ పారీతో చాలాసేపు మాట్లాడతాడు. "చాలా వింత ఆలోచనలు వస్తున్నాయి. కాని ఇప్పుడు కాస్త మెరుగ్గా వుంది. విచారకరమైన ఆలోచనలు లేవు. తప్పనిసరిగా కోలుకుంటాను. చాలా తేలికగా వుంది. ఒక్కోసారి విచారం కమ్ముకొస్తుంది". "....నిజంగా సంసార జీవితం ఆనందమైనది. పవిత్రమైన స్త్రీని నాకంటే ఎవరు ఎక్కువగా గౌరవిస్తారు?

ఇంగ్లాండులో, నా భార్య, నా కూతురు 'అదా'తో కలిసి జీవించాలనుకుంటున్నాను. ఆ ఆలోచనే నాకెంతో ఆనందాన్నిస్తోంది! ఇక నేను విశ్రాంతి తీసుకోవాలి. ఇప్పటివరకూ నా జీవితం తుఫానులో సముద్రంలా అల్లకల్లోలంగా వుంది.

తర్వాత టిటాతో మాట్లాడతాడు. అతను రోజులతరబడి ఆ గదిలోనే అతనితోనే వుండిపోయాడు.

తర్వాత బ్రూనో గురించి కూడా చాలా వుత్సాహవంతుడు అంటాడు. తర్వాత మతం గురించి.

"నా ఆలోచనలు – జ్వరంతో వున్నపుడు ఎలా వుంటాయో మీకు ఎలా తెలుస్తుంది–

ఒక్కసారి 'జ్యూ' అనుకుంటూ, ఒక్కోసారి ముస్లిమ్, మరోసారి క్రిస్టియన్ అనుకుంటాను.

నా ముందు అనంత వ్యోమం వుంది, విశ్వం వుంది! ఈ విషయంలో నాకు ప్రశాంతత కూడా వుంది."

ఆ రాత్రి జ్వరం ఎక్కువైపోయింది. సంధి ప్రేలాపన కూడా.

"మీకు రక్తస్రావం చేయకపోతే మెదడు పాడయిపోతుంది" అంటారు డాక్టర్లు. తన అంగీకారాన్ని తన వాలుచూపుతోనే చైల్డ్ హెరాల్డ్‌లాగా తెలియజేస్తాడు!

ఆ వాలు చూపులేగా లండన్‌లో స్త్రీలకు వణుకుపుట్టించాయి.

"మీరు నాకు కసాయివాళ్లలాగా కనపడుతున్నారు, రండి, ఎంత రక్తం కావాలో తీసుకోండి."

17 ఏప్రిల్‌న రెండుసార్లు రక్తస్రావం చేస్తారు. "దయచేసి ఇక ఆపండి" అని బ్రతిమాలుతాడు. నుదుటి మీద చల్లని గుడ్డలు పెట్టారు.

అతని సంధి ప్రలాపాలకు దడిసి టిటా పిస్తోలు, కత్తులు, బాకులు బైరన్ దగ్గర్నుంచి తీసివేస్తాడు.

అంతకు ముందు రోజు రాలేని గంబా వచ్చి బైరన్ దారుణమైన పరిస్థితి చూసి భోరున ఏడుస్తాడు. అతన్ని కష్టం మీద అక్కడ నుంచి తీసుకెళ్లారు.

బ్రూనో – టిటా ఇటాలియన్ మాట్లాడగలరు.

ఫ్లెచర్ – పారీ ఇంగ్లీషు మాట్లాడగలరు.

అక్కడ వున్న సేవకులు గ్రీకులో మాట్లాడుతారు, ఎవ్వరికీ ఏదీ అర్థంకాదు.

బైరన్ అప్పుడప్పుడు లేచి టిటా, ఫ్లెచర్ సాయంతో నిమ్మరసం తాగేవాడు. నిద్ర లేక రాక బాధపడేవాడు.

"నిద్ర పోలేకపోతే చనిపోతాం. లేదా పిచ్చెక్కుతుంది" అంటాడు.

"......త్వరలోనే వెయ్యిసార్లు చనిపోతాను, నాకు చావంటే భయంలేదు. చావటానికి సిద్ధంగా వున్నాను – మీకు తెలియదు."

18వ తేదీ – నలుగురు డాక్టరు మిల్లింగ్ జెన్, బ్రూనో, ట్రీబర్, లుక్కా వయా – వీరిద్దరు యువరాజు మావ్రో డాక్టర్లు – అతని స్థితి అంచనా వేస్తారు.

ఆ రోజు ఆదివారం – ఈస్టర్ రోజు.

పట్నం లోని వారందరికీ శబ్దాలు చేయవద్దని కబురు చేస్తారు.

మిస్సెలోంగి ప్రజలు "లార్డ్ బైరన్ ఎలా వున్నారు?" అని అడుగుతున్నారు. (మామూలుగా "క్రీస్తు లేచారు" అని అభినందించుకోవాలి).

మామూలుగా అయితే ఈస్టర్ రోజు టపాకాయలు పేలుస్తారు.

పారీ దూరంగా వెళ్లి అక్కడ తుపాకులు కాల్పిస్తాడు. పౌరుల్ని టపాకాయలు కాల్చకుండా చేయటానికి–

బైరన్ వున్న ఇంటి చుట్టు ప్రక్కలు ఏ శబ్దం రాకుండా పహారా కాయిస్తారు.

ఇద్దరు డాక్టర్లు – ఇది టైఫాయిడ్ అని అంటారు. ఇద్దరు రక్తస్రావం చేయాలి అంటారు.

"మీ ప్రయత్నాలు ఏమీ పనిచేయవు. నేను చనిపోతున్నాను. నాకు తెలుస్తోంది. గ్రీసుకు వచ్చింది. నా అలసిపోయిన జీవితాన్ని అంతం చేయటానికే. నా ధనం, నా వనరులు గ్రీసుకోసమే వెచ్చించాను. ఇప్పుడు నా ప్రాణాలు కూడా ఆమెకోసమే."

ఈస్టర్ రోజున కూడా కొన్ని వుత్తరాలు చదివాడు. గ్రీకులో వచ్చిన వుత్తరాన్ని అనువాదం కూడా చేశాడు.

ఆ మధ్యాహ్నం అతని చుట్టు వున్నవారికి అర్థమయిపోయింది. మరణ ఛాయలు కమ్మినాయని – ఫ్లెచర్, గంబా తట్టుకోలేక బైటకు వెళ్లిపోయారు.

టిటా వుండిపోయాడు, బైరన్ అతని చేతిని గట్టిగా పట్టుకున్నాడు. కాని టిటా కన్నీళ్ళు దాచుకోవటానికి ముఖం తిప్పుకున్నాడు.

అతనితో చిన్న నవ్వు నవ్వి ఇటాలియన్‌లో 'Oh questa e' una bella scena' – ఈ దృశ్యం ఎంత బావుంది అంటాడు.

తర్వాత ఇక సంధి ప్రేలాపనలోకి వెళ్ళిపోయాడు. ఒక్కోసారి ఇంగ్లీషులో ఒక్కోసారి ఇటాలియన్‌లో గట్టిగా కేకలు వేస్తున్నాడు. దండయాత్రకు వెళ్తున్నట్లు "పదండి. ధైర్యంగా నాతో రండి. భయపడకండి."

తర్వాత తెలివి వచ్చినప్పుడు ఫ్లెచర్‌తో, "ఇంక పూర్తయిపోయింది. నీకు అన్ని విషయాలు చెప్పాలి, సమయం మించిపోక ముందే."

"లార్డ్ పెన్ను కాగితం తేనా?" అంటాడు. అరె, అంత సమయం లేదు. విను–

"నీకు అన్ని సమకూరుస్తాను" – "అయ్యా, ఇది ఇప్పుడు అవసరమా?"

"నా బిడ్డ అడా, ఆమెను చూడలేకపోయాను.

నా ఆశీర్వాదం ఆమెకు అందచెయ్యి. నా సోదరి అగస్టాను, ఆమె సంతానాన్ని చూడమని నీవు లేడీ బైరన్ దగ్గరకు వెళ్లు, అన్నీ చెప్పు' – నీవే ఆమెకు స్నేహితుడివి"

తర్వాత అతని మాటలు స్పష్టంగా లేవు. అక్కడో మాట – ఇక్కడో మాట వినపడుతోంది.

చివరికి "నేను చెప్పినవన్ని చేయకపోతే నిన్ను వదిలిపెట్టను".

బైరన్‌కు తెలుసు – ఫ్లెచర్‌కు దెయ్యాలంటే భయమని! అది బైరన్‌లోని హాస్యపు చివరి రేఖ!

"మీరు చెప్పింది ఏమీ అర్థం కాలేదు. మై లార్డ్ మళ్లీ చెప్పండి"

'ఎలా చెప్పను – అంతా అయిపోయింది'

'కాదు – మై లార్డ్ – దేవుడు చేశాడు–'

'అయినా ప్రయత్నిస్తా'–

మాట్లాడటానికి ఎంతో శ్రమ పడతాడు. "నా భార్య – నా బిడ్డ – నా సోదరి – నీకందరూ తెలుసు. నా మనసు తెలుసు. అన్ని చెప్పాలి – నేను చెప్పినవన్ని."

తర్వాత ఇక ఏమీ అర్థం కావటం లేదు.

ఏవో పేర్లు – ఏవో అంకెలు – ఇంగ్లీషులో – ఇటాలియన్‌లు "అయ్యో పాపం గ్రీసు, పాపం పట్నం – పాపం సేవకులు" ఇది ముందుగా ఎందుకు తెలియదు నాకు? అదిగో నా సమయం వచ్చేసింది – నాకు చావంటే లెక్కలేదు. అరె – ముందుగా ఇంటికి పోలేకపోయాను? "Lo Lascio qualche cosa di caro nel mundo" *ఈ ప్రపంచంలో ప్రియమైనదేదో వదిలి వెళ్లిపోతున్నాను"*

ఏమాత్రం శక్తి లేక కనీసం చేతి వేలు కూడా కదపలేకపోయాడు. అతని గొంతు గరగరలాడటం, శ్వాస కష్టమైపోవటం ఫ్లెచర్ గమనించాడు. అతని తల పైకి ఎత్తి, రెండు మూడు సార్లు చూశారు. కాని బైరన్‌కు స్పర్శ తెలియటంలేదు. డాక్టర్లు జలగలు పట్టించారు.

ఏప్రిల్ 19 – సాయం సంధ్య – ఒక్కసారి – ఒక్క క్షణం ఫ్లెచర్ వంక చూసి లార్డ్ బైరన్ తన వాలు కళ్లు వాల్చేశాడు.

సాయంత్రం 6 గంటలు – "నేను నిద్రపోవాలి" అంటాడు. అటు తిరిగి నిద్రపోతాడు. ఇక మళ్లీ లేవలేదు. అది దీర్ఘ నిద్ర.

ఆ విధంగా 24 గంటలు పడివున్నాడు.

ఫ్లెచర్ కాపలా కాస్తున్నాడు.

ఒక్కసారి ఫ్లెచర్ వంక చూసి కళ్లు మూసుకున్నాడు. "అయ్యో – లార్డ్ వెళ్లిపోయారు" అని బావురుమన్నాడు.

అక్కడే వున్న డాక్టర్లు – నాడి చూసి

"అవును – అయిపోయింది" అంటారు.

అంతకు కొద్దిసేపటికి పూర్వం భయంకరమైన తుఫాన్ మిస్సిలోంగి మీద పడింది. చీకటి మూసుకొచ్చింది. మెరుపులు – ఉరుములు చీకటిని చీలుస్తూ విరుచుకుపడ్డాయి.

దూరంగా వున్న దీవులు మెరుపుల వెలుతురులో చీకటి ముద్దల్లా పడి వున్నాయి.

ఇంటి అద్దాల్ని వర్షం బాదుతోంది.

కింద ఇళ్ళల్లో తలదాచుకున్న గొర్రెల కాపరులు – సైనికులు ఎప్పుడు సముద్రం ఉప్పెనగా మీద పడబోతుందోనన్న భయంతో బిక్కుబిక్కుమంటున్నారు.

పురాణ పురుషుని మరణం, ప్రకృతి శక్తుల్ని నిద్ర లేపుతుందని, వారి పూర్వీకుల్లాగానే మిస్సిలోంగి వాసులు నమ్ముతారు. ఈ మెరుపులు ఉరుములు పిడుగులకు కారణం "బైరన్ చనిపోయారు" అని వారిలో వారు గొణుక్కుంటున్నారు!!



మిస్సిలోంగి విషాదం



నా మరణం తరువాత కూడా....
కష్టాలకీ, కాలానికీ, తట్టుకునీ...
నేను శ్వాసిస్తూనే ఉంటాను...





భరతవాక్యం

బైరన్ చివరి క్షణాలకు కొన్ని గంటల ముందు, ఇంగ్లండు నుండి ఉత్తరాల కట్ట వచ్చింది.

స్టాన్‌హోప్ బైరన్ సాహసాన్ని గొప్పగా చెప్పటం – గ్రీకు అధికారులు – అప్పటికి లండన్ చేరినవారు – బైరన్, గ్రీకుల స్వాతంత్ర్యం కోసం విరివిగా ఖర్చు చేయటం, సైన్యాన్ని సమాయత్తం చేయటం గురించి గ్రీకు కమిటీకి వివరించటం – ఇవన్నీ చివరికి హాబ్‌హౌస్‌ని నమ్మించగలిగాయి – దాని పర్యవసానం – అక్కడి విషయాన్ని తీవ్రంగా తీసుకుని గ్రీకు ఋణం ఇవ్వడానికి అంగీకరించారు – గ్రీకులైతే బైరన్‌ను ఆ దైవమే పంపాడని గట్టిగా చెప్పారు.

హాబ్, తన స్నేహితునికి "ప్రియమైన మిత్రమా – నీ కీర్తి సాటివారందరికంటే చిరస్థాయిగా నిలిచిపోతుంది" అంటూ రాశాడు. "ఇంతవరకూ మరే మానవుడూ తలకెత్తుకోని మహాత్కార్యాన్ని నీవు ప్రారంభించావని చెప్పటంలో నాతో అందరూ ఏకీభవిస్తారు" అని, "రాత్రి కాంప్‌బెల్ నాతో – 'ఈ విషయంలో ఈ సాహసంలో నీకెవ్వరూ సాటిరార'ని అన్నార"ని అంటాడు.

ఆ విధంగా ఇంగ్లాండు బైరన్‌ను క్షమించింది! కాని అప్పటికే సమయం మించిపోయింది – ఫ్లెచర్ చేతుల్లో, మృత్యుదేవత చలికౌగిలిలో విలవిలలాడుతున్న బైరన్ – ఈ ఉత్తరాలు చూడనేలేదు–

ఆ సాయంత్రం – గ్రీకు యువరాజు మావ్రోకార్డోటో – ఒక ప్రకటన చేశారు – మర్నాడుదయం బైరన్ గౌరవార్థం ముప్పయ్యేడు తుపాకులు పేల్చాలని! అది ఆ మహాసాహసికి నివాళిగా, అతని వయసుకు – చిహ్నంగా!

గ్రీకులు ఎంతో గౌరవంగా బైరన్‌కు పార్థినాన్ (Parthenon)లోగాని, తేసియస్ (Theseus)లోగాని గొప్ప సమాధి నిర్మించేవారు. డాక్టరు మిల్లిన్‌జెన్, బైరన్ తన అస్థికలు గ్రీసు పవిత్ర భూమిలో భద్రపరచమని చెప్పినట్లు అంటాడు–

కాని చివరికి ఫ్లెచర్, పారీ – వీరిద్దరే బైరన్‌కు అతి సన్నిహితులు – వారికి – బైరన్ పార్థివ దేహాన్ని ఇంగ్లండు తీసుకు వెళ్ళాలని స్పష్టమైన ఆదేశాలున్నట్లు గట్టిగా చెప్పారు. ముందుగా శరీరం పాడవకుండా జాగ్రత్త చేయాలి కదా – అక్కడవున్న మందకొడి, చేతగాని డాక్టర్ల బృందం – బైరన్ మరణశయ్యా చుట్టూ చేరారు.

శవపరీక్ష చేసేముందు – దీర్ఘనిద్రలో వున్న బైరన్ అద్భుతమైన సౌందర్యాన్ని చూసి ఆశ్చర్యపోయారు.

అప్పుడే నెరుస్తున్న ఉంగరాల జుత్తు, మరగకాసిన పాలలాంటి అతని మోముచాయను మరింతగా మెరిపిస్తున్నవి....

ఆ గది గవాక్షం నుంచి వీస్తున్న తుఫాను గాలులు ఆ ఉంగరాల ముంగురులను చిందరవందర చేస్తూ అతను ఇంకా ప్రాణంతో ఉన్నాడనే భ్రమ కలిగిస్తున్నాయి....

ఎందరో సుందరీమణులను అతని పాదాక్రాంతం చేసిన అతని పొడవాటి కనురెప్పలు నీలిబూడిద కళ్ళను అరమోడ్పుగా కప్పి ఉంచాయి, ఇంకా ఈ ప్రపంచపు దుర్మార్గాన్ని చూడాలేమోనని అనుమానంతో...

ప్రేమికుల, సున్నితమైన ఎన్నోఎన్నో అరచేతులు నిమిరిన అతని బుగ్గలు కందిపోయినట్లున్నాయి....

విల్లులాంటి అతని పైమోవి సంధించిన మన్మథబాణాలు ఒక్కటీ వృథాపోలేదని ఒక కొంటె అరనవ్వులా పెదవి చివరలు వంపు తిరిగి వున్నాయి – ప్రపంచాన్ని ఎగతాళి చేస్తూ...

మగువుల మోవి తేనెల త్రాగిన మత్తులో – మధువును పెదవి చివరే వుంచిన – ఎర్రని మెరుపు మెరుస్తూనే ఉంది...

'ప్రపంచానికి ప్రియమైనదేదో వదిలి వెళ్తున్నా'నన్న తృప్తి వదనంలోని ప్రశాంతత కనపడుతోంది....

పుట్టుక నుంచీ అతనిని వెన్నాడుతూ చిన్నబుచ్చిన అవిటికాలు వక్రంగా వెక్కిరిస్తోంది!

తన ఆలోచనలను, అంతస్సంఘర్షణలను – అనుభూతుల సుఖదుఃఖాలను, స్వేచ్ఛాప్రియత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన అసాధారణ కవితా ధారను రాసిరాసి అలసిపోయి అతని పొడవాటి కుడిచేతి అంగుళీయాలు – విశ్రాంత హృదయంమీద సేదతీరుతున్నాయి.

''కాలానికి కష్టానికి తట్టుకుని – 'నా శ్వాస' ఆడుతూనే వుంటుంద''ని అతని బలమైన నమ్మకం – మరణాన్ని వమ్ము చేసినట్లు అక్కడి వాతావరణం వెలుగుతోంది....



వారు అతని కపాలాన్ని తెరిచి చూశారు – మెదడు వంద సంవత్సరాల వయస్సు వున్నట్లుగా ఉంది. మొత్తం మెదడు కపాలం అంతా ఆక్రమించింది. మెదడంతా రక్తంతో తడిసిపోయివుంది. (ఇప్పటివరకూ ఏ మానవునికి అంత బరువైన మెదడు లేదని ఆ తరువాత ఇంగ్లాండులో తేల్చారు.)

మర్నాడు మెస్సిలోంగి ఊరంతా నిశ్శబ్దం – స్మశాన ప్రశాంతత ఆవరించింది.

ఎడతెగని వర్షం కూడా మౌనంగా రోదిస్తున్నట్లు కురుస్తూనే వుంది. దారులన్నీ ఏరులై పారుతున్నాయి. శవక్రతువులు – కర్మకాండలు – ఆ మర్నాటికి వాయిదా వేశారు.

ఏప్రిల్ 22 వ తేదీన అతి సామాన్యమైన చెక్కపెట్టెలో – ఈ వీరసైనికుని శరీరాన్ని పడుకోపెట్టారు. సైనిక లాంఛనాలతో అక్కడ చర్చికి సైనికులే మోసుకుని వచ్చారు.

చర్చిలో ఆ శవపేటికమీద నల్లని 'పోర్వ' కప్పి – ఒక ఖడ్గాన్ని, పూలగుత్తిని వుంచారు.

"అరె – ఎంతటి దరిద్రం – ఎంత భయానకం! క్రూరంగా కనిపిస్తున్న సైనికులతో చర్చి నిండిపోయింది.

"ఇంతటి విచారం – పేదగా – పేలవంగా ఒక గొప్ప వ్యక్తి శవపేటిక చుట్టూ వున్న వాతావరణం మరింత విషాదంగా కనిపించింది" – అంటాడు గంబా!

జూలై ఒకటోతేదీన బైరన్ 'పార్థివదేహంతో' వస్తున్న నౌక 'ఫ్లోరిడా' గ్రీసు నుంచి ఇంగ్లాండు చేరిందని వార్త హాబ్‌కు చేరింది.

అతను వెంటనే నౌకలోకి వెళ్ళగానే ఫ్లెచర్, బ్రూనో, స్టాన్‌హోప్ – అందరూ భోరున విలపిస్తారు. వారి బాధ వర్ణనాతీతం. యజమాని మూడు కుక్కలు పేటిక చుట్టూ పడుకుని వున్నాయి.

ఒక్కసారిగా హాబ్‌కు గుర్తువస్తుంది. డెక్ మీద నిలబడి బైరన్ తనకు వీడ్కోలు చెప్పటం – డోవర్ రేవులో!

ఫ్లెచర్ – స్టాన్‌హోప్ – మిస్సిలోంగి విషాదాన్ని పూసగుచ్చినట్లు చెప్తారు – వర్షం తుఫాను – సైనికుని ఆగడాలు – అన్ని.

నౌక థీమ్స్ నదిలో ప్రయాణించి – లండన్ రేవులో లంగరు వేసింది.

బైరన్ మరణవార్త – ఇంగ్లండును, ఫ్రాన్సును కుదిపివేసింది.

'అప్పుడే – ఆ సమయంలోనే – ఇంగ్లండు షెల్లీకి, వర్డ్స్‌వర్త్‌కు నీరాజనాలు పడుతున్నారు.

బైరన్ మరణవార్తతో వారి సానుభూతి అంతా వరదలా బైరన్ – బైరన్ – అంటూ మార్మోగిపోయింది.

'అతనితోపాటు మేము ఎందరమో చనిపోయాం – ఇది నిజం కాదు –

నెపోలియన్ – బైరన్ అంతటి గొప్ప వ్యక్తులు ఒక్కసారే మాయమైపోయారు' అని విలపిస్తారు అభిమానులు.

ఫ్రాన్స్‌లో – బైరన్ చిత్రపటానికి నివాళులర్పించారు – పూలతో శ్రద్ధాంజలి ఘటించారు–

చైల్డ్‌హెరాల్డ్ – మాన్‌ఫ్రెడ్ మళ్ళీ మళ్ళీ చదివి ఆనందించి – దుఃఖించారు.

బైరన్ మరణవార్త – అగస్టాను అనాథను చేసింది. ఆమె నిశ్చేష్టురాలై నిలబడిపోయింది – గంబా, ఫ్లెచర్ తెచ్చిన ఉత్తరాల కట్టలు ఆమె ముందున్నాయి. ఏడవ బైరన్ కాప్టెన్ ఆన్సన్ బైరన్ కోసం కూడా ఉత్తరాలున్నాయి. హాబ్, అగస్టా దగ్గరకు వచ్చి – అన్ని విషయాలు చర్చించాడు.

ఉత్తరాలలోని విషయాలు ఎవ్వరికీ తెలీనీకూడదని బైరన్ మిత్రబృందం – అగస్టా కలిసి నిర్ణయిస్తారు – ముఖ్యంగా అతను ప్రతి వివరం వ్రాసిన 'జ్ఞాపకాలు' (జర్నల్) బైటకు రాకూడదని – ఫ్లెచర్ చెబుతున్న బైరన్ చివరి దినాల్లో 'బైబిల్' దగ్గరే పెట్టుకున్నాడని – దైవభావనతో మాట్లాడాడని నమ్మటానికి హాబ్ సిద్ధంగా లేడు. "ఇటువంటి అధివాస్తవిక – మూఢనమ్మకాలకు బైరన్ ఎప్పుడూలోనుకాడు" అంటాడు.

అగస్టా "ఆ బైబిల్ తను ఇచ్చిందే – బైరన్ రివరెండ్ ఫ్రాన్సిస్‌తో ఎన్నోసార్లు బైబిల్ విషయాలు చర్చించాడు. అతనిలో విశ్వాసం పాదుకుంది" అంటుంది.

బైరన్‌కు ఇరవయిమూడేళ్ళు సేవచేసిన ఫ్లెచర్ "లార్డ్ హాడ్జిసన్‌తో బైబిల్ గురించి మాట్లాడారు – లార్డ్ శత్రువులు ఈ విషయాన్ని తమకు అనుకూలంగా మలుచుకున్నారు. బైరన్ తన మతపరమైన బాధ్యతలను నెరవేర్చారా? ఎవరేమనుకున్నా లార్డ్ పట్టించుకోలేదు – ఆయన విశ్వాసంలోకి వెళ్ళారని అనుకోవటం మనకు తృప్తి"–

చూశారా – బ్రతికి వున్నవాళ్ళు – తమ ఇష్టాయిష్టాలను, విశ్వాసాలను – చనిపోయినవారికి ఎలా ఆపాదిస్తారో!!

బైరన్ వీలునామాలో తన ఆస్తులన్నీ అగస్టాకు, ఆమె సంతానానికే ఇచ్చాడు. లక్షపౌండ్ల పైమాటే! లేడీ బైరన్‌కు ఆమె కట్నం 60 వేల పౌండ్లు ఆమెకే వదిలివేశాడు.

బైరన్ శవపేటికను నౌక నుండి దింపగానే జనం బాగా మూగారు. జనరల్ లఫాయెట్ బైరన్‌ను చూడాలని ఆశించాడుకాని – ఆ అవకాశం రాలేదు.

అగస్టా – హాన్సన్, కిన్నార్డ్ అందరూ వరసగా నిలబడ్డారు – హాబ్ మాత్రం నిలువెల్లా కంపించిపోయాడు. తన ప్రియమిత్రుడు – నిజాయితీపరుడు, కరుణామయుడు – ప్రేమమూర్తి – మేధావి – కవి – ప్రపంచాన్ని ధిక్కరించిన ధైర్యశాలి – స్వేచ్ఛాప్రియుడు – ఒకే ఒక బైరన్ ఇక లేడంటే అతని మనసంగీకరించటంలేదు. దుఃఖంతో నిండిపోయింది – మొద్దుబారిపోయి స్థాణువులా నిలబడిపోయాడు.

రాజ కుటుంబాలు విశ్రాంతి తీసుకునే 'వెస్ట్ మినిస్టర్ అబ్బే'లో సమాధి చేయాలని హాబ్ ఆశిస్తాడు. కాని అందుకు అనుమతి రాలేదు – చివరికి లార్డ్ బైరన్ వంశావళి భూస్థాపితమైన 'హాక్‌నెల్ తోర్కార్డ్' చర్చిలో ఖననం చేయటానికి నాటింగ్‌హాం పయనమవుతారు.

ఈ శవయాత్ర లండన్ పొలిమేరల్లోకి వచ్చినపుడు – ఒక కిటికీలోంచి క్లేర్ క్లెయిర్‌మాంట్, మేరీ షెల్లీ చూస్తారు.

ఇంకా ముందుకు వెళ్ళిన తర్వాత ఒక పార్క్‌గేటు దాటుతున్నప్పుడు – అక్కడ ఆగిన ఒక బగ్గీలోకాళ్ళు చచ్చుబడిన ఒక స్త్రీ, ఆమె భర్త ప్రక్కన వున్నాడు– "ఎవరూ ఆ శవపేటికలో – ఎవరిది ఈ శవయాత్ర? ఎక్కడికి" అంటాడు.

అతనికి అందిన సమాచారాన్ని తన భార్యకు తెలియనివ్వడు – ఆమె లేడీ కారోలీన్!

నాటింగ్‌హామ్‌లో మేయరు, కౌన్సిలర్లు శవయాత్రలో పాల్గొన్నారు – అతని చిన్ననాటి మిత్రుడు హాడ్జిసన్, వైల్డ్‌మాన్ వచ్చి చేరారు – ఊరిజనం కూడా! న్యూస్టెడ్ దాటి – అక్కడి పొలాలు దాటి – అతను చిన్నప్పుడు ఆటలాడిన పచ్చిక మైదానాలు దాటి అతని పార్థివ దేహం కదిలిపోయింది – గంబాకు హఠాత్తుగా గుర్తుకు వస్తుంది. మిస్సిలోంగి వెళ్ళేముందు బైరన్ అడుగుతాడు.

"మిత్రమా సంవత్సరం తర్వాత మనం ఎక్కడుంటాం?" అని – గంబాకు దుఃఖం ఆగలేదు!

'ఇదిగో ఇక్కడకు చేరాం' అనుకుంటాడు.

డయెడెమ్ కొండచరియ దగ్గర్లోకి వచ్చేసరికి హాబ్‌కు గుర్తుకు వస్తుంది – తను, కొత్తగా పెళ్ళయిన బైరన్ – మేరీ ఆన్‌లతో కలసి ఆ రాత్రి భోజనం చేయటం – అతని కళ్ళు వర్షించాయి.

అన్ని విషయాలు ఫ్లెచర్ లేడీ బైరన్‌కు పూసగుచ్చినట్లు చెప్తుతాడు – ఆమె మళ్ళీమళ్ళీ చెప్పమని – ముఖ్యంగా లార్డ్ చివరి మాటలు – అడిగి మరీ చెప్పించుకుంటుంది.

"అదే నా నమ్మకం – ఆ మనిషిలో – ఒక మహాపురుషుడు దాగివున్నాడు – ఎంతో ఉన్నతుడు – గొప్ప హృదయంగల కరుణామయుడు – నాకు మొదటనుంచీ విశ్వాసం అదే" అంటుంది.

అగస్టా పట్టుబట్టి – బైరన్ మిత్రమండలిని ఒప్పిస్తుంది. బైరన్ జర్నల్ మొత్తం తగలబెట్టమని. అవి అప్పటికే 'మూర్' రెండు వేల పౌండ్లకు కొంటాడు – కాని బైరన్ గౌరవం కాపాడటానికి ఇచ్చివేయటానికి అంగీకరిస్తాడు.

తగలబెట్టేముందు ఒకసారి చదవాలని అనుకుంటారు. కాని అగస్టా అందుకు కూడా అంగీకరించదు. ఆ విధంగా ప్రపంచానికి లార్డ్ బైరన్ జ్ఞాపకాలు

అందకుండా పోయాయి. అప్పటి పత్రికలు ఈ పని లేడీ బైరన్ చేయించిందని గోలపెట్టాయి – కాని లేడీ బైరన్‌కు ఈ విషయం అసలు తెలియదు పాపం! ఆమెను ఈ విషయంలో ఎవరూ సంప్రదించలేదుకూడా!

(బైరన్ – అనాబెల్లా పుత్రిక అడా తరువాతి కాలంలో ఇప్పటి కంప్యూటర్ భాష అయిన బైనరీ సిస్టమ్ ను అభివృద్ధి పరచటంలో ప్రముఖపాత్ర వహించింది.)

బైరన్ తన చివరి రోజుల్లో తన సాహసం, త్యాగం వృథాగా పోతున్నాయని బాధపడేవాడు. చివరికి తన మరణం కూడా వృథా అయిపోతుందా అని! గ్రీసుకు స్వతంత్రం రాదా? అనుకునేవాడు. కాని ఇంగ్లండులో బైరన్ మరణంతో గ్రీకు అవసరాలు వెలుగులోకి వచ్చాయి. బైరన్ త్యాగం – సాహసంలో ఒక విశిష్టత వుంది – ఒక జాతిని మేలుకొలపటానికి, ఒక దేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించటానికి అతని తపన – బ్రిటన్ను నిద్రలేపింది!

1827లో బ్రిటీష్‌వారి ఆధ్వర్యంలో, రష్యా, ఫ్రాన్స్ – గ్రీసుకు స్వాతంత్ర్యాన్ని సంపాదించిపెట్టటంలో ప్రముఖపాత్ర వహించారు.

గ్రీకు ప్రజలకోసం, తన ధన ప్రాణాలర్పించిన బైరన్‌కోసం – గ్రీకు ప్రజలు 'గార్డెన్ ఆఫ్ హీరోస్'లో అతనికోసం ఒక స్మృతి స్తంభాన్ని నిలబెట్టారు.

మిస్సిలోంగి వాసులైన మత్స్యకారులకు బైరన్ పేరు బాగా తెలుసు. వారికి అతను ఒక కవి అని తెలియదు. అక్కడ ఎవరినైనా అడగండి –

"చాలా ధైర్యవంతుడు – గ్రీసుకోసం ప్రాణాలర్పించిన వీరుడు...... స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ప్రియుడు..." అని అంటారు.

అంకితమే కృతజ్ఞత

దాదాపు మూడు కిలోల బరువున్న పుస్తకాన్ని మేరీ లాండ్ నుంచి మోసుకు రావడం – అంతర్జాతీయ ప్రయాణాలలో ప్రతి గ్రాము లెక్కవేసే 'విమాన యాన' యాతనగానే అనుకోవాలి – కానీ దేవినేని మధుసూధనరావు గారు నా విన్నపాన్ని మన్నించి ఆంద్రీమార్వా రచించిన 'బైరన్' గ్రంథాన్ని – అది 1930 సంవత్సరం లైబ్రరీ ప్రతి జాగ్రత్తగా వుంచి విక్రయించిన మహానుభావుని పేరు తెలియదు – భద్రంగా తెచ్చి యిచ్చారు. అందుకు సొమ్ము కూడా నేను ఇవ్వలేదు. ఇప్పుడు కృతజ్ఞతలు చెప్పాల్సిన సమయం వచ్చింది. అదెలా తెలియజేయాలి?

పెర్సీ బీ. షెల్లీ 'స్వప్న విషాదాన్ని' పాఠకులకు పంచింపించిన ఘనత ముక్తవరం పార్థసారథి గారిదే. అంతటితో ఆగితే నాకీ 'మేథోశ్రమ' తప్పేది. ఇప్పుడు అదే 'మార్వా' పరిశోధించి రచించిన 'బైరన్' క్లాసిక్‌ను కూడా "తెలుగు చేయండి" అని "నా దగ్గర పుస్తకం లేదు" – అని కూడా ముక్తాయించారు – మరి ఆయనకు కృతజ్ఞతలు ఎలా తెలియజేయాలి?

సరే! ఆకుపచ్చ బైండులో వున్న ఆరువందల పుటల పుస్తకాన్ని, ప్రమోద్ కుమార్ గారు బహుమతిగా పంపిన టేబుల్ మేటు మీద పెట్టి రోజూ 'మిసిమి' కార్యాలానికి వెళ్తూ ఒకసారి, తిరిగి సాయంత్రం ఇంటికి వస్తూ ఒకసారి చూస్తూ కొన్నాళ్ళు గడిపాను.

అలా ఎన్నాళ్ళు? ఏదో ఒకరోజు చదవటం మొదలుపెట్టి పూర్తిచేశాను. రెండు మూడు నెలలు బైరన్ జీవితంలో నుంచి బైటపడలేకపోయాను. బైటపడాలంటే తెలుగులో రాయటం ఒక్కటే దారి అని నిర్ణయానికి వచ్చి మళ్ళీ చదివాను. పెన్సిల్‌తో గుర్తులుపెట్టి – పెన్నుతో నోట్సు రాసుకుని – ముహూర్తం చూడకుండానే మొదలుపెట్టాను – మొదటి భాగం పూర్తి చేసి కాండ్రేగుల నాగేశ్వరరావు గారికి ఇచ్చి చదవండి అన్నాను. ఆయన చదివి 'బాగుంది – కథనం చందమామ సాహసవీరుని కథలా…' అని మతాబులాంటి కితాబు ఇచ్చారు. ఆయనకు ఎలా

కృతజ్ఞత చెప్పాలి?

'బైరన్' ప్రస్థానాన్ని పూర్తిచేసి అయిదు డైరీలు రాణీకి డి.టి.పి. చేయాలని 24 గంటల్లో ఏయే సమయంలో ఏది రాశానో నిమిషాలతో సహా వేసి ఇచ్చాను – ఆయా సమయాలనుబట్టి రాత తీరు మారుతుందని చెప్పటానికే – రాణి అంత ఓపికగా డి.టి.పి. లాంటిది చేసి ఇచ్చింది. ఇప్పటికి నాలుగయిదుమార్లు చదవటం, దిద్దటం – గుడిపూడి సుబ్బారావు గారు తప్పొప్పులు చూసిపెట్టారు, ఆయనకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలి? అచ్చుతప్పులు చూడమని అడిగితే సమీక్ష రాసిన నీలకంఠం నరసరాజు గారికి కూడా ఏమి చెప్పాలి...

ఇంకా రాణిని విసిగిస్తూనే వున్నాను బొమ్మలు, పుటలు, అలంకరణ, పదాల మార్పులు చేస్తూనే వున్నాను – మరి రాణికి ఏమిచెప్పను?

ఇంతా అయిన తర్వాత ఈ అయిదువందల పుటల పుస్తకాన్ని వెలుగులోకి తెస్తున్న కళాజ్యోతి యాజమాన్యానికి ఏ విధంగా కృతజ్ఞతలు తెలియజేయాలి?


చివరిదైనా ముఖ్యమైనది – ఈ గ్రంథానికి 'ముఖచిత్రమనేది' ఎంతో ఓపికగా రంగు, రుచి, వాసన కూడా కలిగి వున్నట్లనిపించే అలంకరణ చేసిన కుద్రముద్దీన్ జీ షాన్ కు ఏమి చెప్పాలి?

ప్రియ మిత్రులందరికీ – ఈ 'బైరన్ ప్రస్థానా'న్ని తెలుగు పాఠకులకు అందించే కార్యంలో నాకు సహాయ సహకారాలు అందించినందులకు కృతజ్ఞతలు చెప్పటం చాలదేమో అనిపిస్తోంది –

వీరందరికీ – ఈ గ్రంథానికి మనఃపూర్వకంగా 'అంకితం' ఇస్తే కాస్త బరువు తగ్గుతుంది నా మనసుకు... ఇంతకీ అంకితమంటే ఏమిటి?

ఈ విషయంలో నా శ్రీమతిని కలపకపోవటం – ఇచ్ఛాపూర్వకమే – ఎందుకంటే – అర్ధరాత్రి–అపరాత్రి నా శ్రమ చూడలేక రాయవద్దనే పోరుపెట్టేది. అందుకని!

15-08-2015
హైదరాబాద్.





ఏథీనా ఒడిలో బైరన్


వద్దు-
వృద్ధాప్యం వరకూ బ్రతకాలా?
నాకు యౌవనం కావాలి -
అందులోనే తార్కిక పథం వుంటుంది -
వయసు మళ్ళితే - అంతా సర్దుకోవటమే -
వయసులో - నన్ను ఇష్టపడినవాళ్ళను ఎంతగా ప్రేమించాను !
ఇప్పుడు?
36 ఏళ్ళకే - ఇది పెద్ద వయసా -
ఆరిపోతున్న కోర్కెల నిప్పులను ఎగతోయటానికి -
మళ్లీ హృదయంలో మంటను రగిలించలేను !



"... మేధోవర్గపు శత్రువులు - నిరంకుశులు
కాకారాయుళ్ళు - వీరితోనే పోరాటం,
మానవజాతిని విడుదల చేయాలి
రాజుల నుంచి - జనసమూహాల్నుంచి
మీ నుంచి - నా నుంచి !
యుద్ధం పేరుతో మారణకాండ
సైనిక విజయాలని - రిబ్బన్లు, మెడల్సు!
ఒక బంగారు బిళ్లకోసం - బతుకును బలిచేయటం
కేవలం బులెటిన్‌లో పేరు పడాలంటే
శరీరంలో బులెట్ దిగాలా?
ఒక్క కన్నీటి బిందువు ఆరిపోవటం కంటే
కీర్తి, గౌరవం పేరుతో ఉప్పొంగే సముద్రాలు
ఎండిపోవటం మేలుకదా?..."

తన కవిత్వం 'ఆధునికం' అంటాడు బైరన్. సైనికుల గుండెల్లో మారుమ్రోగాలి - నాయకుల అహంకారానికి, బాధల పాలైన సామాన్యుల స్థితిగతులను విప్పి చెప్పాలి.

"... గులకరాళ్ళకు కూడా బోధిస్తాను -
నేల మీద నిరంకుశులకు వ్యతిరేకంగా నిలబడమని!
మళ్ళీ రాళ్ళలాగా మారి - సింహాసనాలకు పీఠంలా మారవద్దని!
ప్రపంచానికి స్వాతంత్ర్యం రాకపూర్వం - ఎలా ఉండేదో
- ఎలా ఉందో మన తర్వాతి తరాలకు చూపాలి! -
కథానాయకులందరూ ఒంటరి గాళ్లే
తప్పుడు గుంపులను వ్యతిరేకిస్తూ ..."



వల్లభనేని అశ్వినీకుమార్

ISBN
978-81-927170-6-7